నారాయణ భట్టతిరి ప్రణీత

# నారాయణీయము

వ్యాఖ్యాత: కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులు



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2003

మేల్పుత్తూరు నారాయణభట్టతిరి ప్రణీత

# నారాయణీయము

(శ్రీమద్భాగవత పురాణ సంగ్రహము)

పద్యానువాద - భావ - విశేష వివరణములు

విద్వాన్ కల్లూరి వేంకటసుబ్రహ్మణ్యదీక్షితులు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2003

NĀRĀYANĪYAMU
(Srimad Bhagavata Purana Sangrahamu)

*by*

**MELPUTTURU NARAYANA BHATTATHIRI**

*Translated by*

**Vidwan Kalluri Venkata Subrahmanya Dikshitulu**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. : 247

T.T.D. First Edition : 2003
Copies : 2000

*Published by*

Ajeya Kallam, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

*D.T.P. Typesetting*

Sriharsha Graphics
Tirupati - 517 501
Phone: 2242048

*Printed at*

S. VISWANATHAN (Printers & Publishers) PVT., LTD.,
6 (Old No. 38), McNichols Road, Chetput, Chennai - 600 031

# ముందుమాట

శ్రీమన్నారాయణుని మహిమలను, లీలలను వివరిస్తున్న అత్యద్భుత మైన భక్తిమయ కావ్యమే నారాయణీయం. ఈ సంస్కృత కావ్యాన్ని క్రీ.శ 16వ శతాబ్దంలో కేరళప్రాంతీయుడైన మహాకవి నారాయణ భట్టతిరి రచించాడు. ఈయన గురువాయూరు క్షేత్రంలో నెలకొనివున్న శ్రీకృష్ణుని పరమభక్తుడు.

మహర్షి వేదవ్యాసుడు రచించిన శ్రీమద్భాగవత మహాపురాణానికి సమగ్రమైన సంక్షిప్తమైన రచనగా నారాయణీయం ప్రశస్తి వహించింది. భాగవతం పంద్రెండు స్కంధాలుగా 18 వేల శ్లోకాలతో విస్తరించి ఉన్న పౌరాణిక కావ్యం. ఇందలి విషయమే నూరు దశకాలుగా 1036 శ్లోకాల పరిమితి గల మహనీయ స్తుతికావ్యంగా నారాయణీయం అవతరించింది.

మహాకవి నారాయణభట్టతిరి ఒకానొక సమయంలో తన ఆరోగ్యాన్ని గురుదక్షిణగా సమర్పించి, ఆ గురువుగారి వాతరోగాన్ని తాను స్వీకరించాడు. ఆ సందర్భంలో గురువాయూరు శ్రీ కృష్ణస్వామివారి సన్నిధికి వెళ్లి, నారాయణభట్టతిరి దుర్భరమైన తన బాధను నివృత్తి చేయవలసిందిగా ఆర్తితో ప్రార్థిస్తూ ప్రతిదశకాన్ని ఒకవిశిష్టమైన రీతిలో విన్నవించుకొన్నాడు. ఈ రచనకు అధిపతి, ప్రథమ శ్రోత అయిన ఆస్వామివారి అనుగ్రహం వలన తిరిగి సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొంది దీర్ఘాయుష్మంతుడై వరలినాడు. అందువల్లనే గురువాయూరు శ్రీకృష్ణుని సంబోధిస్తూ రచింపబడిన ఈ నారాయణీయ మహాకావ్యం మహామహిమోపేతమైన నిత్యపారాయణ గ్రంథంగా, భక్తుల పాలిటి కల్పవృక్షంగా ప్రసిద్ధి గాంచింది.

సుప్రసిద్ధ విద్వత్కవిపుంగవులు శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు నారాయణీయాన్ని మనోజ్ఞశైలిగల పద్యాలలో తెనిగించటంతో పాటు, వాటికి సరళమైనవచనంలో భావవివరణంచేసి ఆంధ్రావనికి మహోపకృతి కావించారు.

పైరీతిగా కల్లూరివారు సంతరించిన నారాయణీయ ప్రబంధం యొక్క వైశిష్ట్యాన్ని గుర్తించి, తిరుమల తిరుపతి దేవస్థానం తమ ప్రచురణగా ముద్రించి భక్తలోకానికి కానుకగా సమర్పిస్తున్నది.

గురువాయూరు శ్రీ కృష్ణభగవానుడు అక్షరాత్మకంగా సుప్రతిష్ఠితుడైవున్న మధురమంజులమైన ఈ నారాయణీయ మహాకావ్యాన్ని ఆంధ్రావళి భక్తిప్రపత్తులతో పారాయణం కావిస్తూ ఐహికాముష్మికాలను ఇతోఽధికంగా అందుకోగలదని ఆశిస్తున్నాం.

తిరుపతి<br>తేది :23-2-02

కార్యనిర్వహణాధికారి,<br>తిరుమల తిరుపతి దేవస్థానములు.

# విషయానుక్రమణిక


విషయము — పుట

ముందుమాట

కమనీయ కవితాతపస్వి

శ్రీదీక్షితకవివర్యులు — 6

**భూమిక** — 13

*బ్రహ్మశ్రీ కవితా భూషణ*

*వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి*

**పరిచయము** — 37

*బ్రహ్మశ్రీ దువ్వూరి*

*వెంకటరమణశాస్త్రి*

**సమీక్ష ౧** — 38

*బ్రహ్మశ్రీ చివుకుల సుబ్బరామ శాస్త్రి*

**సమీక్ష ౨** — 40

*శ్రీ కల్లూరి నారాయణరావు*

ప్రస్తావన - *క. వెం.సు. దీక్షితులు* — 43

మంగళాచరణాదికము — 48

**సమర్పణము** — 57

దశకము

## ప్రథమ స్కంధము

1. భగవత్తత్త్వము — 1
2. భగవత్సౌందర్యము — 11
3. భక్తస్వరూపము — 16

## ద్వితీయ స్కంధము

4. యోగానుసంధానము — 21
5. విరాట్పురుషావిర్భావము — 29
6. విరాణ్మూర్తి — 36
7. సృష్టిక్రమము — 40

దశకము — పుట

## తృతీయ స్కంధము

8. ప్రళయము - సృష్టి — 46
9. సృష్టి విలాసము — 51
10. సృష్టి క్రమము — 57
11. హిరణ్యకశిపు హిరణ్యాక్షులు — 63
12. వరాహావతారము — 67
13. హిరణ్యాక్ష వధ — 71
14. కపిలావతారము — 76
15. కపిలోపదేశము — 81

## చతుర్థ స్కంధము

16. నరనారాయణావతారము — 87
17. ధ్రువోపాఖ్యానము — 92
18. పృథూపాఖ్యానము — 97
19. దక్షజననము — 102

## పంచమ స్కంధము

20. వృషభయోగీశ్వరచరిత్ర — 106
21. జంబూద్వీపాదులందు భగవత్స్వరూపము — 110

## షష్ఠ స్కంధము

22. అజామిలోపాఖ్యానము — 116
23. దక్షచరిత్ర చిత్రకేతూపాఖ్యానము, వృత్రాసురవధ, సప్తమరుదుత్పత్తి — 121

## సప్తమ స్కంధము

24. ప్రహ్లాద చరిత్ర — 127
25. నృసింహావతారము — 132

| దశకము | పుట |
|---|---|
| **అష్టమ స్కంధము** | |
| 26. గజేంద్రమోక్షము | 137 |
| 27. అమృతమథనము, కూర్మావతారము | 142 |
| 28. లక్ష్మీ స్వయంవరము, అమృతోదయము | 148 |
| 29. మోహినీవేషము | 152 |
| 30. వామనావతారము | 157 |
| 31. బలి నిగ్రహము | 162 |
| 32. మత్స్యావతారము | 167 |
| **నవమ స్కంధము** | |
| 33. అంబరీషోపాఖ్యానము | 171 |
| 34. శ్రీరామ చరిత్ర | 175 |
| 35. శ్రీరామ చరిత్ర | 181 |
| 36. పరశురామావతారము | 186 |
| **దశమ స్కంధము** | |
| 37. కృష్ణావతార ప్రసంగము | 193 |
| 38. శ్రీకృష్ణావతారము | 198 |
| 39. యోగమాయానయనాదికము | 203 |
| 40. పూతనానుగ్రహము | 208 |
| 41. గోపీ గోపాల లాలనము | 212 |
| 42. శకటాసురభంజనము | 216 |
| 43. తృణావర్త వధ | 220 |
| 44. నామకరణోత్సవము | 225 |
| 45. బలరామ కృష్ణ లీలలు | 229 |
| 46. విశ్వరూప సందర్శనము | 235 |
| 47. ఉలూఖల బంధనము | 239 |
| 48. యమలార్జున భంజనము | 243 |
| 49. బృందావన గమనము | 247 |
| 50. వత్సాసుర బకాసుర సంహారము | 251 |
| 51. అఘాసుర సంహారము | 256 |

| దశకము | పుట |
|---|---|
| 52. గోవత్సాపహరణము | 260 |
| 53. ధేనుకాసుర సంహారము | 265 |
| 54. గో గోపోజ్జీవనము | 269 |
| 55. కాళియ మర్దనము | 273 |
| 56. కాళియానుగ్రహము | 277 |
| 57. ప్రలంబాసుర వధ | 281 |
| 58. దవాగ్ని మోక్షణాదికము | 285 |
| 59. వేణుగానము | 290 |
| 60. గోపికావస్త్రాపహరణము | 294 |
| 61. మునిపత్నీ మహానుగ్రహము | 298 |
| 62. ఇంద్రయాగ భంగము | 303 |
| 63. గోవర్ధనోద్ధరణము | 308 |
| 64. గోవింద పట్టాభిషేకము | 313 |
| 65. గోపికల బృందావనా గమనము | 317 |
| 66. ధర్మోపదేశము | 322 |
| 67. తిరోధానము - అన్వేషణము | 326 |
| 68. గోపీ సాంత్వనము | 330 |
| 69. రాసక్రీడ | 335 |
| 70. సుదర్శన శాపమోక్షము | 343 |
| 71. కేశి మథనము | 347 |
| 72. అక్రూర భాగ్యము | 352 |
| 73. మధురా యాత్ర - అక్రూరునికి భగవత్సాక్షాత్కారము | 357 |
| 74. మధురాపురీ విహారము | 362 |
| 75. కువలయాపీడ - చాణూర ముష్టిక కంస వధలు | 367 |
| 76. ఉద్ధవ దౌత్యము | 372 |
| 77. కుబ్జానుగ్రహము - జరాసంధ నిగ్రహము - ముచుకుందానుగ్రహము | 378 |
| 78. రుక్మిణీ కల్యాణయాత్ర | 385 |
| 79. రుక్మిణీ కల్యాణము | 388 |

| దశకము | పుట |
|---|---|
| 80. స్యమంతకోపాఖ్యానము | 396 |
| 81. సుభద్రా వివాహము - కాళింద్యాది కల్యాణము - నరకాసుర వధ | 402 |
| 82. ఉషాపరిణయము - బాణాసురయుద్ధము - నృగ శాపమోక్షము | 407 |
| 83. పౌండ్రక వధ - కాశీపురీ దహనము-వివిధ వధ- లక్షణా స్వయంవరము | 412 |
| 84. సూర్యగ్రహణ యాత్ర | 417 |
| 85. జరాసంధ వధ - రాజసూయము | 422 |
| 86. సాల్వాదివధ - మహాభారత యుద్ధము | 428 |
| 87. కుచేలానుగ్రహము | 434 |
| 88. అర్జునానుగ్రహము (సంతాన గోపాలము) | 438 |
| 89. వృకాసుర వధ - విష్ణుపారమ్యము | 445 |
| 90. ఆగమాది పరమతాత్పర్యము | 450 |
| **ఏకాదశ స్కంధము** | |
| 91. భక్తి వైభవము | 455 |
| 92. కర్మమిశ్ర భక్తి స్వరూపము | 461 |
| 93. బహుగురు లాభము | 468 |
| 94. తత్త్వజ్ఞానోదయము | 474 |
| 95. భగవద్ధ్యాన విధానము | 481 |
| 96 భగవద్విభూతి | 487 |
| 97. ఉత్తమభక్తిప్రార్థన - మార్కండేయోపాఖ్యానము పరమేశ్వర ప్రసాదము | 493 |
| **ద్వాదశ స్కంధము** | |
| 98. నిష్కల బ్రహ్మోపాసనము | 499 |
| 99. భగవన్మహిమ | 506 |
| 100. భగవత్సాక్షాత్కారము | 511 |

శ్రీశివాయ గురవే నమః

# కమనీయ కవితాతపస్వి

## శ్రీదీక్షిత కవివర్యులు

వాల్మీకి వ్యాస కాళిదాస ప్రభృతులగు (తాత్త్విక)రససిద్ధులైన తాపసకవివరేణ్యుల యడుగుజాడలలో బ్రహ్మశ్రీ వేదమూర్తులు జగద్గురు కృపాతరంగితాంతరంగులునగు శ్రీకల్లూరి వేంకటసుబ్రహ్మణ్యదీక్షిత కవివరేణ్యులు కవితాతపస్విగా అర్ధశతాబ్దము నుండి సంస్కృతాంధ్ర కవితారససిద్ధులై గద్యపద్యరచనా వ్యాసంగమున సరస్వతీ సమర్చనముతో సహృదయసమారాధన మొనర్చుచున్నారు.

వీరు కౌండిన్యసగోత్రులు శ్రీ భోగేశ్వరసోమయాజులు శ్రీమతి రామలక్ష్మమ్మ అను దంపతులకు పుత్రరత్నముగా జన్మించి తమ పూర్వపుణ్యమునకు సఫలతను సంపాదించుకొనిరి. కీలక సంవత్సరము క్రీ.శ. 1908 లో దత్తాత్రేయ జయంతి వీరి జనన సమయము. పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు తాలూకా భద్రకాళీ వీరభద్ర క్షేత్రమైన పట్టిసమువద్ద తాళ్ళపూడి వీరి జన్మస్థలము. శాండిల్యసగోత్రులైన కంభంపాటివారికి వీరు దౌహిత్రులు. గౌతమస గోత్రులైన ఈమనివారి పట్టిని జేపట్టి వీరు గృహస్థులైరి.

### విద్యావ్యాసంగము

వీరికి పండ్రెండవ యేటనే పితృవియోగము జరిగినందున ముఖ్యముగా తమ మాతృచరణారాధనమున సంస్కృతాంధ్రసాహితీమకరందమాధురిని గ్రోల నారంభించిరి. పోలవరమున నెన్మిదవ తరగతి వరకు నాంగ్లవిద్య నభ్యసించి 1922 లో ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ప్రభావమున పాఠశాల విద్యకు స్వస్తిచెప్పిరి. 'మాకొద్దీ తెల్లదొరతన'మను గేయమును గానము చేసిరి. ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠ విద్యార్థిగా కొద్దికాలము పరీక్షా వ్యాసంగముతో 1932 లో మదరాసు విశ్వకళాపరిషత్తువారి విద్వాన్ పరీక్షలో ప్రథమశ్రేణియందు సర్వప్రథములైన పట్టభద్రులుగా విజయము నొందిరి.

## సాహిత్యాచార్యులు

దక్షారామమునొద్ద గల కోటిఫలి క్షేత్రవాసులైన గాయత్రీ మంత్రసిద్ధులు బ్రహ్మశ్రీ దర్భా బైరాగిశాస్త్రి మహోదయుల పాదారవింద సన్నిధిని శ్రీదీక్షితులుగా రొనర్చిన కావ్యనాటకాలంకారాది సాహిత్యాధ్యయనము గురుకృపచే వీరికి కోటి గుణితముగా ఫలించినది.

## విద్యాగురువులు

విజయవాడలోని ఆయుర్వేద కళాశాలలో ప్రధానాధ్యాపకులైన వైద్యవల్లభ సర్వతంత్రస్వతంత్ర శ్రీరాణీ వేంకటాచలపతి ప్రసాదచయనులు మహాగ్నిచి ద్యజ్వ పూజ్యచరణ చరణకమల భృంగాయమానులై (వీరు తురీయాశ్రమమున ప్రకృతము శ్రీశ్రీశ్రీ పరిపూర్ణ ప్రకాశానంద భారతీ మహాస్వాములుగా స్వాత్మారాములై యున్నారు.) పరదేవతానుగ్రహము నొంది విద్యాదీక్షితులై తమ దీక్షితనామసార్థకతను సంపాదించుకొనిరి.

## జగద్గురువులు - గురుజగత్తు

శ్రీ కాంచీ కామకోటి పీఠాధీశ్వరులైన ప.ప. శ్రీమచ్చంద్ర శేఖరేంద్ర సరస్వతీ సంయమీంద్రులను- వారి కాశీయాత్రలో ఆంధ్రదేశమున గుంటూరులో చాతుర్మాస్యవ్రతములో నున్నప్పుడు దర్శనము చేసికొనిరి. ఆనాటి ప్రథమదర్శనమున శ్రీవారి కృపాకటాక్షామృతాభిషేచనానుభూతితో శ్రీదీక్షితులుగారికి జగత్తు గురుకృపామయముగ దివ్యదర్శన మయ్యెను. అదియే వారి నవనవోన్మేషమైన బుద్ధిలో నిత్య నూతన యౌవనోన్మీలనము నొందుచు ప్రత్యక్షరరసాస్పదమగు వారి కవితావిపంచిలో సరస్వతీపాదమంజీర మధురనాదముగ మనకు ప్రస్ఫుటమగుచుండును. "సిద్ధఃకవీనాం కవితైవ యోగః" అని ఆనాడు వారు పొందిన శ్రీవారి ఆశీస్సే నాటి నుండి నేటికి వారి కవితాతపస్సునకు జీవనాడిగా నున్నది.

## ఉద్యోగము

వీరు తమ 18వ ఏటనుండి మూడు సంవత్సరములు స్వగ్రామమున కరణీకము చేసిరి. నాల్గేండ్లు పోలవరంలోను, 1935 నుండి 1966 వరకు విజయవాడ మునిసిపల్ హైస్కూలులోను పండితులుగా పనిచేసిరి. 1967లో కొత్తగూడెములోను, 1968 దాక భీమవరంలో సంస్కృత కళాశాలలో

అధ్యాపకులుగను, 68నుండి 74వరకు కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠ సంస్కృత కళాశాలలో ఆచార్య పదవిని నిర్వహించి ప్రకృతము వృత్తిచే విశ్రాన్తులుగా నున్నారు.

## గ్రంథరచన

ఇరువదవ సంవత్సర మీడులో మాళవదేశాధిపతి మంత్రియైన దేవేశ్వర మహాకవి కృతమైన ''కవి కల్పలత'' అను గ్రంథము నాంధ్రీకరించి ప్రచురించిరి. 1936లో భాగవత మాహాత్మ్యమును పద్యకావ్యముగా రచించి వేంకట్రామ అండ్ కో వారిచే ప్రచురింపఁజేసిరి.

1936 నుండి 1941 మధ్యలో వీరు ''వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం'' అనిన సూక్తికి ఆలంబమైన వ్యాస భగవానుని అష్టాదశ పురాణ మహాసముద్ర మథనము జేసి అందు పదకొండు మహాపురాణములను తెలుగున గద్యగ్రంథములుగా నిర్మించి కవులకు నికషోపలమైన గద్యరచనమున సిద్ధహస్తులుగా ఖ్యాతి నార్జించిరి. ఈ పురాణములను వేంకట్రామ అండ్ కో వారు ప్రచురించిరి. వేటపాలెము సారస్వత నికేతనమునకు స్వర్ణోత్సవము జరిగిన సందర్భములో ''మంజీరము'' అను నొక చిన్న మృదుమధుర స్వతంత్ర ఖండకావ్యమును రచించి సరస్వతికి కాన్కవెట్టిరి. సహజ పండితుడైన పోతనామాత్యుని శ్రీమదాంధ్ర మహాభాగవతమును పరిష్కరించి వేంకట్రామా అండ్ కో వారి ముద్రణమున కందించిరి. 1968లో స్కాందపురాణము నాంధ్రీకరించిరి. వ్యాస మహా పురాణములను కేవలము తెనిఁగించుటయే కాదు లోతునకు దిగి అవి వేద తాత్పర్యము నుపబృంహణము చేయుచున్న తీరు ఆధిభౌతిక ఆధిదైవిక - ఆధ్యాత్మిక దృక్పథములతో నవి లోకము యొక్క నిత్యజీవితమునందు అనగా ధర్మార్థ కామ పురుషార్థ సంపాదనమందు, కడపటి లక్ష్యమైన మోక్ష పురుషార్థమునందును ఎట్లు పర్యవసించుచున్నవియు తెలుపుచు వీరు సుమారు నలుబది సంవత్సరములు అగాథ పరిశోధనలు చేసిరి. అవి వెలుగులోకి రావలసియున్నవి. 68లోనే 'నవనీత'మను పేర శ్రీకంచి కామకోటి జగద్గురువుల దివ్యబోధనలను తేటతెనుగున తేటగీతములుగా రచించిరి. దూర్వాస సుకృతి కృతియైన 'ఆర్యాద్విశతి' ని ఆంధ్రీకరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి బ్రహ్మశ్రీ గొల్లపూడి వేంకట్రామశాస్త్రిగారి ఆలంబనమున దానిని ప్రచురించిరి. ''భద్రాద్రి రామప్రభూ!'' వంటి పెక్కు శతకములు, ప్రజ్ఞానిధులు కళానిధులు వంటి చిన్న గద్య గ్రంథములును

రచించిరి. వీరు రచించిన శ్రీ కాంచీకామకోటి జగద్గురు దివ్య చరిత్రము 'ఆంధ్రప్రభ' లో ప్రతి ఆదివారము ధారావాహికముగ ప్రచురించబడినది. ఆంధ్రప్రభలో గ్రంథసమీక్షకులుగా వివిధములగు ఉత్తమ గ్రంథములపై వీరు చేసిన ఉత్తేజకరములగు విమర్శలు ప్రసిద్ధి నొందినవి.

మూకకవి రచించిన 'మూకపంచశతి' అను కాంచీ కామాక్షీదేవీస్తుతి కావ్యమును వీరాంధ్రీకరణ పద్యములతో తాత్పర్యమును గూడ వ్రాసి ప్రచురించిరి.

## గురుకృపాలహరి

ఈ పేరుతో వీరు 306 శ్లోకములుగల సంస్కృత స్వతంత్ర కావ్యమును సతాత్పర్యముగ రచించి ప్రచురించిరి. ఇది వీరి కృతిరత్నహారమున నాయకమణిగా వెలుగొందుచున్నది. ఇది జగద్గురువులైన శ్రీకంచికామకోటి పీఠాధీశ్వరులు శ్రీమచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ సంయమీంద్రుల స్తుతి రూపకావ్యము. ఇందు గురు కృపారసము కావ్యామృతమైనది. జగత్తునంతను గురుకృపాతరంగితము గావించి, సర్వశ్రేష్ఠమైన ప్రకృతి శక్తియాధారమున సర్వోత్కృష్టము బ్రహ్మానందాభేదమగు గురుకృపా దివ్యదర్శన మీ కావ్యము సాక్షాత్కరింపజేయును. ఇది శ్రీవారి పీఠాధిరోహణ స్వర్ణోత్సవ సందర్భమున శ్రీచరణసరోజ నివేదితమై జిజ్ఞాసూపకారకముగా లోకమునకు ప్రసాదింపబడినది. ఇది ఉన్నత శ్రేణికి చెందిన ఉత్తమోత్తమ సంస్కృత పద్యకావ్యము.

## నారాయణీయము

కేరళ రాష్ట్రమున గురు-(బృహస్పతి)-వాయుదేవులచే ప్రతిష్ఠింపబడిన 'గురువాయూరప్పన్' అని ప్రసిద్ధినొందిన శ్రీకృష్ణభగవానుని దివ్యలీలలను వర్ణించుచు భాగవతసారముగా నూరు దశకములతో సహస్రశ్లోక పరిమితమైన సంస్కృతకావ్యమును రచించి కేరళ కవి శ్రీ నారాయణభట్టు తన పక్షవాతరోగమును నిర్మూలించు కొనెను. దానిని శ్రీ దీక్షితులుగారు పద్యకావ్యముగా నాంధ్రీకరించి సమూలముగ సాంధ్రతాత్పర్యముగా ప్రచురించిరి. నాటి కేరళ గవర్నరు శ్రీ బూరుగుల రామకృష్ణరావుగారి అలంబనమున నా కృష్ణ భగవానునికే దాని నర్పించి 'వాసుదేవస్సర్వ' మను సిద్ధస్థితిని సంపాదించుకొనిరి. వీరి యాంధ్రీకరణము కవిసమ్రాట్ శ్రీవిశ్వనాథ

సత్యనారాయణ, శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, శ్రీ కుప్పా లక్ష్మావధాని ప్రభృతి కవి పండిత ప్రకాండుల స్తుతికి పాత్రమైనది.

## అముద్రిత రచనలు

తెనాలి రామకృష్ణకవికృత 'పాండురంగ మాహాత్మ్య వ్యాఖ్య', శ్రీమచ్ఛంకర భగవత్పాద విరచితమైన 'ప్రబోధసుధాకర' మనెడి కృష్ణభక్తి ప్రధానమైన గ్రంథమున కాంధ్ర పద్యానువాదము-మున్నగునవి అముద్రితములు గలవు. 'శ్రీనాథీయ' మను శ్రీనాథమహాకవి చరిత్ర మితివృత్తముగా గల స్వతంత్ర పద్యప్రబంధ మొకటి గలదు. ఇది స్వర్గీయ కవిసార్వభౌమ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి కంకిత మీయబడినది. ఇట్లింకను వీ రపుడపుడు రచించిన వివిధ గద్య పద్య సంకలనాత్మకములైన గ్రంథములును నముద్రితములుగా నున్నవి. వీరి అముద్రిత రచనలలో "జగద్గురు చంద్రదర్శన సాహస్రి" అను సంస్కృత పద్యకావ్యము శ్రీ జగద్గురువుల చరిత్రాత్మకముగ రచింపబడినది. అయ్యది స్వయంప్రకాశమైన ఇతివృత్త మహిత మగుటచే ముద్రణ ప్రకటనలకు సులభసాధ్యమగుట లేదు.

## సభలు - సమ్మానములు

శ్రీదీక్షితులుగారి కంఠస్వరము మధురమైనది. వారు పద్యమును చదువు తీరు విలక్షణముగా నుండును. ఒకటి రెండు రాగచ్ఛాయలలో మాత్రమే అది నడుచును. ఐనను ఆ మాధుర్యము సభను విశేషముగా రంజింపజేయును. వీరికి సన్మానములందు ప్రీతి లేదు. యావదాంధ్రముననేగాక దక్షిణ రాష్ట్రములలో శ్రీ కామకోటి జగద్గురువులు విజయంచేసియున్నప్పుడును వీ రనేక పండిత సభలలో పాల్గొని తమ సంస్కృతాంధ్ర కవితోపాయనములచే పండిత పామరుల నుఱ్ఱూత లూగించిన ఘట్టము లసంఖ్యాకములు. అనేక సందర్భములలో జరిగిన సన్మానములు విశేషముగనున్నవి. బిరుదము లన్నను వీరికి వైముఖ్యము మెండు. ఐనను వీరి కవి యెవ్వియు తృప్తిని గాని, ఆనందమునుగాని గలిగింపవు. అజరామరమగు తమ కవితామృత మనుపానముగా జేసికొని వీరు నిరంతరము నాస్వాదించు జగద్గురు భక్తిరసాయనమే వీరి నిత్యనూతనోత్తేజమునకు, నానందమునకు మూలకందము.

రాష్ట్రీయోపాధ్యాయ పండిత పరిషత్తు నిర్వాహకులుగా ఉపాధ్యాయ పండితుల యోగ క్షేమములకై వీరు కృషి చేసిరి. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిషత్కార్యదర్శిగా దక్షతతో నా పదవిని నిర్వహించిరి.

కవితావ్యాసంగము లేని క్షణమైనను వీరి జీవితమున మనము దర్శింపలేము. వీరితో సంభాషణము నిత్యనూతనమై ఆనందసంధాయక మగుచుండును. వీరి ఉత్సాహశక్తి ఎదుటివారిని మంత్రముగ్ధుల నొనర్చుచుండును. ఈయన కవితావనిత రసజ్ఞులదృష్టి కొక విశ్వసమ్మోహనాస్త్రమై విరాజిల్లుచుండును. వీరి చాటుపద్యరచన లసంఖ్యాకములు గలవు. అందు మచ్చునకు - ఆంధ్ర కేసరి శ్రీటంగుటూరి ప్రకాశంపంతులుగారిని నాటి మదరాసురాష్ట్ర ముఖ్యమంత్రి పదవినుండి దింపినపుడు వీరు ఆంధ్రపత్రికలో వ్రాసిన పద్య మిది:

"అది ప్రకాశంబు, తెలుఁగువాఁ డవ్వెలుంగు
వలనఁ గనువిప్పె; 'నవ్వేఁడి వెలుఁగు నోర్వ
లేము వ'ద్దని యేడ్చెదరేల? దాన
వాన కురియదు, పంటలు పండవిఁక."

చక్కని కావ్య మర్యాదాశోభితమైన ఈ కవితాఖండిక ఎంతగ సహృదయ హృదయాహ్లాదియై నాటునో స్పష్టమగుచున్నది గదా! అట్లే, మదరాసు రాజ్యాంగ తేజోమండల మనుపేర నాటి రాజగోపాలాచారి మంత్రివర్గమును నవగ్రహమండలముగా పోల్చి వ్రాసిన పద్యములు మున్నగునవి నాటి దినపత్రికలలో ప్రముఖ స్థానము నాక్రమించినవి. ప్రతిరాజకీయ పరిణామమునందును వీరి పద్యము లుత్తేజము చేయని సందర్భము లేదనియే చెప్పవచ్చును.

## కుటుంబము

విద్వత్పౌరాణికులుగ, పండిత ప్రకాండులుగను ఆంధ్రదేశమున మదరాసు ప్రాంతమునను విశేష యశస్సు నార్జించిన బ్రహ్మశ్రీ వీరభద్రశాస్త్రిగారు, రిటైర్డు తహసీల్దారు బ్రహ్మశ్రీ సూర్యనారాయణగారును శ్రీ దీక్షితులుగారికి తమ్ములు. ఆరుగురు కుమారులును నల్గురు కుమార్తెలును మనుమలు మనుమరాండ్రతో తామరతంపరయైన వీరికుటుంబము సర్వజగద్రక్షకమైన జగద్గుర్వనుగ్రహమును సర్వదా పొందుచు వృద్ధి నొందుచున్నది.

## స్వభావము

శ్రీ దీక్షితులుగారు స్వతంత్ర స్వభావులు. వారి మనసు మిక్కిలి మెత్తనైనది. 'హితం మనోహారి చ దుర్లభం వచః' అనినట్లు వీ రెల్లపుడు దుర్లభవాక్కులకై

వెదకికొనుచు లోకహితమును సంపాదించుకొనుటకై శ్రమపడరు. కొంచెము పెళుసుగా నున్నను సత్యమును పల్కుటకు వెనుదీయరు. అన్యాయమునకు అసత్యమునకు లొంగి తాత్కాలికముగ ఎదుటివారిని మెప్పించుటకైనను ఓటమికి సిద్ధపడరు. ఒకప్పుడు వీరి విజృంభణము వేడిగాడ్పువలె నున్నను అది సహస్రకిరణకాంతి సంకాశమే గాని అగ్నితప్తముగామాత్ర మెన్నటికిని గాదు. అన్నిటికంటెను వీరిలో రాకాసుధాకరశరచ్చంద్రికల వెదజల్లెడి దివ్యానుభూతి గల సన్నివేశము ఒకటి గల్గుచుండును. అది శ్రీకాంచీకామకోటి జగద్గురు శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీ సంయమీంద్రుల పాదారవింద సంస్మరణము, అపుడు వీరి శిరస్సు అవనతమగును. కన్నులనుండి బాష్పబిందువులు రాలును. మేను చెమర్చును. మనస్సు ద్రవించును. కంఠధ్వని రుద్ధమగును. క్రమముగా ముఖమున మందస్మిత మంకురించును. ఇది దీక్షితులుగారి స్వభావము - వీ రాకృతిగొన్న గురుభక్తి.

వీరి కవితాగుణగణ ప్రశస్తికిగాని వాని సుదీర్ఘ పరిశీలనకుగాని ప్రస్తుతాంశమున తావు లేనందున తత్సుధాసేచనానుభూతితో రసజ్ఞు లట్టి ప్రయత్నమొనర్తురని విశ్వసించుచు విరమించుచున్నాను.

శ్రీ దీక్షితులుగారి అకారణకరుణకు, అవ్యాజములైన యాదరాభిమానములకు అమోఘములైన యాశీస్సులకు పాత్రమైన నేను స్థాలీపులాక, న్యాయమున వ్రాసిన ఈ నాల్గుమాటలలోని గుణములను గ్రహింప విజ్ఞుల వేడికొందును.

అస్మద్గోత్రం వర్ధతా మభివర్ధతామ్!

స్వస్తిశ్రీః

విజయవాడ - 2 నుదురుమాటి వేంకటరమణ శర్మ
15-2-1977 పండితుడు
C.V.R.G.M.H. School, Vijayawada - 2

# భూమిక

"నారాయణీయము" అను గ్రంథనామ మాంధ్రదేశమున కపరిచితము. ఆంధ్రమునకే కాదు. కేరళేతర దేశములకే యట్టి దనుకొనవచ్చును, ఉత్తమ జాతి యిక్కావ్యమును మహాపండితకవి యగు నారాయణభట్టపాదుడను నంబూద్రి బ్రాహ్మణవంశజుడు మూడు శతాబ్దులనాడు సంస్కృతమున రచింపగా - నీ నాటికి మా మిత్రుడగు కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షిత కవివర్యుని తపః ఫలముగా నాంధ్రమున గోచరించినది. సహజ ధారాళ మృదు మధుర శయ్యలో ననువదింపనేర్చిన మా మిత్రుని కంటి కది ముందుగ గనబడుట యాంధ్రుల భాగధేయము.

మా మిత్రుడు శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతులగు శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ భగవత్పాదులవారి పరిపూర్ణానుగ్రహ భాజనుడగుటచే మధుమయ వచోలాభము నొందిన ధన్యజీవి. 'సారకరుణాసార స్మిత జ్యోత్స్నకాచ్ఛవి సంతర్గత గాఢమోహతమమున్ జక్కాడి యాలోచనోత్సవముం జేసిన' మహనీయులు శ్రీస్వాములవారు-అని పలికిన దీక్షిత కవివరుని సూక్తియే నే నన్నదానికి సాక్షి. ప్రత్యక్ష దైవతములగు నట్టి గురుమూర్తుల కరుణామృత రసప్లుతాశీర్వచన మొందు భాగ్య మెంతవారికి లభించును? దీక్షిత కవి కావ్యమున కింతటి మధురిమము, ఇంత యఖండ వైభవము గలుగుటకు నా భగవత్పాదుల పాదారవింద మరందాస్వాదమే హేతువని నా యభిప్రాయము.

మధురభక్తికి గృష్ణుడును, అతని ప్రియురాండ్రును ఆలంబన విభావము లగుటచే నారాయణీయమున ప్రతిపదమును ప్రతికథయును మధురభక్తి మయమై మధురాతిమధుర మనకతప్పదు. ''ఆ కృతి యస్మదీయమధురాంధ్రవచః శ్రుతి మేళవించి'' అని వ్రాసికొనగల్గిన దీక్షితకవి వచస్సు మధురమని వాచ్యమగుచుండ వివరణ మక్కరలేదు గదా! మధురమగునది యాంధ్రభాష కావచ్చును. దీక్షితకవి తెలుగు పలుకు మధురము కావచ్చును. మీది సమాస మందలి చమత్కృతి సహృదయుల హృదయములను స్పృశింపకపోవదు. ఈ విధముగా నితివృత్తమును, మూలగ్రంథమును, ఆంధ్రభాషయు, అందు దీక్షితకవివరుని వాక్కును మధురము, మధురతరము, మధురతమమును.

కేరళ(మలయాళ) దేశమున సంస్కృతవాణీ వల్లకీనిక్వాణ సోదరమై నారాయణీయము మూడు శతాబ్దులనాడు పుట్టినదట! నేటికి గోదావరీ తీరస్థిత

వీరభద్రపురాగ్రహారమున వెలసిన కల్లూరినామక యాయజూక వైదిక బ్రాహ్మణాన్వయమున నుదయించిన వేంకట సుబ్రహ్మణ్యదీక్షిత కవిమౌళి హస్తమున కందినదట! ఎచ్చటి కేరళము! ఎచ్చటి యాంధ్రము! ఏమి చిత్ర ఘటనము!

"ఏగతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా!" యని సరసకవితా ధురంధరుడగు చేమకూర వెంకన్న యనిన మాట ముప్పాతిక మువ్వీసము సత్యము. ఆ మెచ్చనివారు సమకాలము వారందఱును గాకమానె. 'కవి' అని పేరు పెట్టికొనిన సమకాలపు నరమాత్రు డెల్ల మెచ్చుకొనలేక పోవుట సహజము. కావుననే భవభూతి "ఉత్పత్స్యతే హి మమ కోఽపి సమానధర్మా" అని భవిష్యత్తులో నా కష్టసుఖము లెఱింగినవాడు పుట్టగలడని పాపము ! తనలో దా నూరడిల్లెను. అట్టియెడ, నాకంటె వయసున జిన్నవాడై, నా కన్నుల యెదుట వ్యాకరణ యుక్తముగా సంస్కృతాంధ్ర భాషల సాహితి నలవరించుకొన్నవాడై, అష్టాదశ పురాణముల నరసి యాంధ్రమున గద్యమయముగ దత్సారము ప్రకటించిన మా సుబ్రహ్మణ్య దీక్షితు లింత యుద్గ్రంథ మింతటి రసవత్తర పాకమున "అస్మదీయ మధురాంధ్రవచః శ్రుతి" యనుచు నిర్భయముగ జెప్పికొనగల సాహసముతో గవిత్వము సాగించెనన్ని వినగానే నాకును హృదయమున మెఱమెఱ కల్గెను. కాని యామూల మాచూడము గ్రంథము నవలోకింప గ్రమముగా నామదిలో నే ననుకొనకుండనే యొక మార్పు గలిగి, యా కవితాధారలో మునిగి, నే నొందిన యవ్యక్తానందము నిందు వ్యక్తమొనరింపమానజాలకున్నాను.

ఆంధ్రీకరణమే కదా యీ కావ్యము! ఇందు మూలకారుని ప్రతిభయేకాని యాంధ్రీకర్త దేముండును? అని స్థూలముగ ననూదిత గ్రంథములను గాంచినంతనే, చప్పరించి పెదవి విఱుచుట లోకసామాన్య విషయము. కాని యనువాదక్లేశ మనుభవైక వేద్యమగుటచే నట్టి సాహసికుల నెవ్వడు-సమాధాన పఱుపగలడు? సంస్కృతకవి ముందువాడు గాన నాతడు చమత్కృతిజనకములగు పదప్రయోగముతోను, అర్థ సంయోగముతోను, దన యిచ్చ వచ్చిన చొప్పున జెప్పుకొనుచు బోవును, ఆంధ్రకర్తయో అట్టి పదముల నాంధ్రమున బ్రయోగింపవచ్చునో లేదో పరిశీలించుకొని, వీలులేనినా డంత సొగసుగల తెలుగు జాతీయమును బుద్ధికి దెచ్చుకొని, యదుకు కనబడకుండ, నర్థము చెడకుండ, ముందుగానే తెలుగున బుట్టినట్లు ధారాళమగు శయ్యలో జెప్పవలెను. అప్పు డెవ్వరి ప్రతిభ గొప్పదో యెవ్వరి శ్రమము పెద్దదో యూహించుకోదగును.

నారాయణీయాంధ్రీకరణమున బైని జూపిన క్లేశము మాత్రమేకాక, దురవగాహమగు భాగవత విషయముగూడ నిగూఢముగ నుండుట మఱియు క్లేశము. "భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు, శూలికైన దమ్మిచూలికైన" అని పోతనవంటి దైవానుగ్రహపాత్రుడే భక్తిజ్ఞాన వైరాగ్య నిధానమైన భాగవతములోని విషయమును సమగ్రముగ దెలిసికొని పలుక గడగడలాడెను. అట్టి భాగవతవిషయము చెదరకుండవలెను. ఉపమోత్ప్రేక్షాద్యర్థాలంకారముల తోడను, యమకానుప్రాసాది శబ్దాలంంకారములతోడను, వ్యాకరణ రహః ప్రయోగములతోడను ఛందోవైచిత్రితోడను నసన్యస్పృశ్యమగు ఫక్కిలో రచింపబడిన నారాయణీయము నాంధ్రభాషాముకురమున బ్రతిబింబింపజేయుట క్లేశాతిక్లేశమని వేఱ చెప్పవలెనా? అట్టియెడ మన దీక్షితకవిమౌళి యే రీతి జరితార్థుడయ్యెనో స్థాలీపులాకముగా గొన్ని ఘట్టములు పరిశీలింతము:-

ఏవం దుర్లభ్యవస్తున్యపి సులభతయా హస్తలబ్ధే యదన్య
త్తన్వా వాచా ధియావా భజతి బత జనః క్షుద్రతైవ స్ఫుటేయమ్,
ఏతే తావ ద్వయంతు స్థిరతర మనసా విశ్వపీడాపహత్యై
నిశ్శేషాత్మాన మేనం గురుపవనపురాధీశ మేవాశ్రయామః.

అను శ్లోకమునకు-

**అందని వస్తువిట్లు తన యంతన యందినఁ జేత వాతఁగా**
**కెందునొ దేవులాడు జన - మెక్కుడి నైచ్యమొ, కాని మా మన**
**మ్మిందె లయింప విశ్వరుజ లీఁగఁగ నీ పరిపూర్ణతత్త్వ మా**
**కందము నాశ్రయించెద మఖండదయారస మూలకందమున్.**

అని ముద్దులొలుకు నాంధ్రీకరణము. 'సులభతయా హస్తలబ్ధే' యనునది 'తన యంతన నందిన'యని తెలుగు నుడికారముగా గరగించి పోయుట. 'అన్యత్తన్వా వాచా ధియా వా భజతి జనః' అను దళమును 'చేఁతవాఁతగా, కెందునొ దేవులాడు జనము' అని తెలుగు జాతీయమున ప్రతిఫలింపజేయుట, మిక్కిలి యక్కజము అనిపింపక మానదు. 'నిశ్శేషాత్మాన మేనం' అను రెండు పదములను 'పరిపూర్ణతత్త్వమాకందము' అని తియ్యమామిడిపండుగా నిరూపించుటయే కాదు. ఆ మాకందమునకు అఖండ దయారసము మూలకందమని మూలమున లేకున్నను ఉపరంజక విశేషణము గూర్చుట కెంత నైపుణి యుండవలెను! అంత్యానుప్రాసమువలన పదమున కొక 'కాంతి' గూడ చేకూరినది. అట్టి స్వాతంత్ర్యము శ్రీనాథుని యాంధ్రీకరణము నందు

గనబడును. కావుననే యవి స్వతంత్ర కావ్యములవలె నుండును. విరహిణియగు దమయంతి చంద్రు నుపాలంభించు ఘట్టమున-

"అసిత మేక సురాశిత మప్యభూ, న్నపున రేష విధు ర్విశదం విషం
అపి నిపీయ సురై ర్జనితక్షయం స్వయ ముదేతి పునర్నవ మార్ణవం"

అను శ్లోకమున కాంధ్రీకరణమున -

"హాల్వాహలద్వయంబు కలశాంబుధిఁ బుట్టె వినీలపాండుర
జ్వాలలతోడ, నందొక విషంబొక వేలుపు మ్రింగె; నెందఱో
వేలుపు లోలిమై ననుభవించిన రెండవ యీ విషంబు ని
ర్మూలము గాక యున్నయది! ముద్దియ! పాంథుల పాప మెట్టిదో"!

అని మూలమునందలి తాత్పర్యము చెడకుండ పరిచితమగు సంస్కృత పదములతో బూరించి, మూలమున లేకున్నను 'ముద్దియ పాంథులపాపమెట్టిదో' అను వాక్యముచే వెనుకటి యర్థమున కంతకును అనిర్వచనీయశోభ చేకూర్చెను. అట్లే యిందును 'అఖండ దయారస మూలకందమున్' అను విశేషణముచే గురుపవనపుర దేవుడు ధ్వనించుట రమ్యము. వీరి యనువాదపద్ధతి యట్లే నడచినదని తెలియదగును.

సనకాదులు వైకుంఠమున జయవిజయులను శపించిరి, క్షమించిరి. తన గృహద్వారమున జరుగుచున్న యా యలజడికి హరి లక్ష్మితో వెలుపలికి వచ్చు సందర్భమున-

"తదేత దాజ్ఞాయ భవా నవాప్తః సహైవ లక్ష్మ్యా బహి రంబుజాక్ష!
ఖగేశ్వరాంసార్పితచారుబాహు రానందయం స్తానభిరామమూర్త్యా!"

అను మూలమున "ఆ సంగతి తెలిసి నీవు లక్ష్మితో వెడలి, చక్కని రూపముచే మునుల నలరించుచు గరుడుని మూపున సుందరహస్తమును మోపి వెలుపలికి వచ్చితివి" అని యుండగా -

"ఏలినవారి కల్లరి యదెల్ల వినంబడఁ బోలు, లచ్చితో
మూలదివాణముం గదలి మోసల నిల్చి ఖగేంద్రు మూపుపైఁ
గేలిడి వాలుగా నిలిచి కిమ్మనకుండనె విశ్వమోహనా
లోల కటాక్ష వీక్షణములోనన లోఁగొనినావు వారలన్."

అని భక్తిరసము తొనంకునట్లు తెలిగించుట మెచ్చదగినది. పూజ్యార్థకమగు భవచ్ఛబ్దమునకు 'ఏలినవారు' అని ప్రయోగించుట, 'మీరు, తమరు' అను పదముల కంటెను పరమ విధేయతను సూచించుచున్నది. 'అవాప్తః సహైవ లక్ష్మ్యా బహి రంబుజాక్ష' అనుదానికి 'లచ్చితో మూలదివాణమున్ గదలి మోసల నిల్చి' అని తెనిగించుటలో మూలమున లేని 'మూలదివాణముం గదలి' యని భగవంతుని ప్రాభవము వెల్లడించుచు 'బహిరవాప్తః' (వెలుపలికి వచ్చితివి) అను దానిలోని బహిఃపదమునకు బదులుగా మోసల యని తెనిగించి, విష్ణుని కోటయొక్క స్వరూపమును ధ్వనింపజేసెను. 'ముఖశాలా' పదమునకు 'మొగసాల, మోసాల, మోసల' యను పదములు తద్భవము లగుటచే ముఖశాలతోగూడిన కోటకోటలోపలి సౌధపంక్తి, అందు శుద్ధాంతసౌధము-మదికి స్ఫురించి యొక యద్భుతదృశ్యము గోచరింపకమానదు. ఇట్టి వ్యంగ్యమే 'అభిరామ మూర్త్యా' అను సమాసమునకు జేసిన తెనుగులోను స్ఫురించుచున్నది. సుకుమార పద రచనముతో, గంభీరము మనోహరమునగు భావముతో వెలువడిన యీ తెలుగు పద్యము కమ్మచ్చున దీసిన బంగరుతీగ వలె మెఱిసిపోవుచున్నది. ధేనుకాసుర వధ ఘట్టమున 'కడచి బాల్యమ్ము మిసిమిపౌగండమూని, చిన్ని తువ్వాయులన్ గాచు చిన్నిపనికి, జొరక గోలోకముంగాచు చొరవబూనినావు భువనైక పరిపాలనావినోద!' అను పద్యమునందు 'ఉపేత్య పౌగండవయో మనోజ్ఞమ్' అను మూలమునందలి మనోజ్ఞ శబ్దమునకు బదులు 'మిసిమి' అను చిన్న తెలుగు పదము బ్రయోగింపబడియు, 'ఉపేక్ష్య వత్సావనమ్' అనుదళము'చిన్నితువ్వాయులన్‌గాచు చిన్నిపనికి జొరక' అని మృదు మధురముగ దెలిగింప బడియు గావ్యమున కొక యపూర్వశోభ గూర్చబడినది. 'తువ్వ' 'తువ్వాయి' పదములు లేఁబ్రాయపు బిడ్డల పలుకుబడిలోనివి. అది యిచ్చట బ్రయుక్తమగుట యెంతయు రమణీయమై 'బొజ్జ తిరిగిరాదయ్యో జగజ్జాలములున్నట్టి బొజ్జగట్టన్ వశమే' అను పోతనార్యుని వత్సలరస ద్యోతకమగు బొజ్జ పదమును జ్ఞప్తి కెలయించుచున్నది.

'పవనపురనాథ! నీదు ప్రవర్తన మ్ముపక్రమమునకు సమనురూపముగ నడచెఁ బూని గోత్రాపరిత్రాణమునకు నవతరించితివికాదె యదె యుద్య మించితీవు' అను నీ పద్యము పై పద్యమువలెగాక యథామూల మనువదింప బడినది. 'గోత్రా పరిత్రాణకృతేవతీర్ణ స్తదేవ దేవారభథాస్తదా యత్' అను మూలమందలి గోత్రాశబ్దము యథాతథముగా బ్రయోగింపకున్న (గవ్యా గోత్రాగవాం అను) గోసముదాయార్థమును, (గోత్రా కుః పృథివీ పృథ్వీ అను) భూమ్యర్థమును శ్లిష్ట మొనర్చుట కష్టమగుటయే కాదు, భ్రష్టమును గూడ

అగును గాదా? గో(త్రాపరి(త్రాణమునకు అనగా- భూలోకరక్షకై కదా అవతరించితివి కాన గో(త్రాపరి(త్రాణము అనగా గోసముదాయ రక్షణ మాచరించితివి. అను చమత్కృతిని దెలుపుటకే యీ పద్యము సొగసు చెడకుండ స్వయంభువము వలె దెలిగింపబడినది. కాళియానుగ్రహసందర్భమున-

'కుండల మండనమ్ము తళుకుల్ గులుకన్ గులికించి పన్నగా
ఖండలుమీఁదఁ దాండవ మఖండగతిన్ బొనరింప నింగియం
దుండి నిలింపకాంతలు నహో మఱి పాడిరి యాడి దేవతా
మండలి దుందుభిధ్వనిసమంచిత మంగళ ఘోష మీనఁగన్'.

అను పద్యమును బరిశీలింతము. దీనికి మూలము-

'రుచిరకంపిత కుండలమండలః సుచిర మీశ ననర్తిథ పన్నగే,
అమరతాడిత దుందుభి సుందరం వియతి గాయతి దైవతయౌవతే'

అని దీని మూడుపాదములందు మూడువిధములగు ననుప్రాసములు గలవు. అందుల కనువుగ దెలుగు పద్యమున గూడ నప్రయత్నసిద్ధములగు శబ్దాలంకారములు పడి, యెంతయు సహజములట్లు విలసిల్లుచున్నవి. మూలమున కృష్ణునకు గల కర్తృత్వము అనువాదమున నిలింపకాంతలకు గూర్పబడినది. ఇందు మూలమందలి భావ మిసుమంతయు బీఱువోకుండ జూపంబడెను. ఇది యసామాన్యవిషయము. మొత్తముమీద నీ యనువాదము మూలమునకు బ్రతిబింబమై సంస్కృతభాషా పరిచయములేని యాంధ్రుల కందఱకు నారాయణ భట్టపాదుని ప్రతిభావ్యుత్పత్తులను గరతలామలక మొనర్పజాలియున్నది. మూలముతో సరిచూచుచు నిట్లు పరిశీలింప నానందముకలుగవచ్చును గాని గ్రంథ విస్తరము కాకతప్పదని యీ పరిశీలన మింతతో విడిచి, కథాంశములు, రీతి రసగుణాదుల గూర్చి యారసి యానందింతము.

ఇందలికథలన్నియు వరుసగా భాగవతమందలివేయని మొదట జెప్పితిని. ఆ కథ లిందు రేఖామాత్రముగా నుండునేకాని, భాగవతమందువలె విస్తృతములు కావు. అట్లని యందలి యే కథయు స్పృశింపక విడువబడలేదు. కావుననే యీ గ్రంథమును భాగవతసారమనియు పెద్దలందురు. కర్దముడు దేవహూతిని బెండ్లాడుట మొదలుకొని కపిలుడు పుట్టి, తల్లియగు దేవహూతికి భక్తిజ్ఞానయోగములు బోధించుటదాక గల కథాంశము ఆంధ్ర భాగవతమున

సుమారు మూడువందల పద్యములలో జెప్పబడగా - ఇందు కపిలావతార మొక పద్యదశకమునను, కపిలోపదేశ మింకొక దశకమునను జెప్పబడినది. అట్లని ప్రధానాంశములు విడువబడక సూత్రప్రాయముగ జెప్పబడినవే కాని, వర్ణనములవలె విడువబడినవి లేవనియే యనవచ్చును. అందీ యుపదేశఘట్టమున బ్రతిపద్యము నాల్గవపాదము నేకాకారముగా నుండుటచే నపూర్వ రామణీయకము కలిగినది. విషయము సాంఖ్యయోగమైనను సంగ్రహముగా సొగసుగా నిట్లుచెప్పుట కా మహాకవి కా శాస్త్రమున నెంత యనుభవముండవలెను! దానిని తెలుగు భాషలో స్వయంభువమువలె ననువదించుట కెంత శక్తి యుండవలెను! దీక్షిత కవిమౌళి వశ్యవాక్కున కిది నికషోపలము-

'ప్రకృతి మహత్త హంకృతి సభః ప్రముఖమ్ములు భూతపంచక
మ్మొక పది యింద్రియమ్ములు నహో విషయమ్ములునున్ మనస్సు పా
యక పురుషుండు నిర్వదియు నైదవ తత్త్వముగా నెఱింగినన్
బ్రకృతిఁ దరింపవచ్చునని పల్కితి వాదట దేవహూతికిన్,'

అని సాంఖ్యమతమున దెలుపబడిన యిరువదినాలుగు తత్త్వముల దెలిపి, యిరువదియైదవది పురుషుడని అరటిపండొలిచి చేతికిచ్చినట్లు చెప్పుట మెచ్చదగినది.

పిదప నా ప్రకృతిని (సత్త్వ రజ స్తమోగుణాత్మకమగు మాయను) నిరూపించి దానిని దాటు నుపాయ మిట్లుపదేశింపబడును.

**'ప్రకృతిగతమ్ములైన గుణవర్గములోఁ బురుషుండు చిక్కఁడ**
**ట్లొకతఱిఁ జిక్కెనేని యవి యూరక చిక్కులు వెట్టుచుండు; మా**
**నక ననుఁ గొల్చి తత్త్వమనన మ్మొనరించిన దాఁటవచ్చు నీ**
**ప్రకృతి నటంటి వో కపిల బాలక! అమ్మకు దేవహూతికిన్.**

ఇందు పురుషుడు మాయాగతములగు సత్త్వరజస్తమస్సులకు లోబడడనియు అనగా స్వతంత్రుడనియు, అట్లయ్యును ఎన్నడైన లోబడెనా ఆ మాయ (ప్రకృతి) పెక్కుచిక్కుల బెట్టుననియు - ఆ ప్రకృతిని గెల్చుటకై భగవంతుని సేవించి తత్త్వ మెఱుంగుటయే యుపాయమనియు దేటతెల్లము సేయబడెను.

పిదప, భగవంతుని సేవించి సాక్షాత్కారము గావించుకొనుటకై యమ నియమాసనాదులగు అష్టాంగములతో గూడిన యోగవిద్య నతిసూక్ష్మముగ దెల్ల మొనరించుట యరయ దగినది-

'స్థిరమగు నాసనమ్మున మదిం గల యెల్ల కళంక మీగఁగన్
గరుడ ఖగాధిరూఢుని వికస్వర దివ్య విభూషణాయుధో
త్కరునిఁ దమాలనీలతనుఁ గాంచి సమాధి నిరూఢి నందుమం
చరసి వచించినావు కపిలార్భక! యమ్మకు దేవహూతికిన్.

భాగవతమున వివరింపబడిన యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులనెడి యోగాంగములు దీనియందు సూచింపబడినవి. ఇందు 'స్థిరమగు నాసనమున' అను నుపక్రమణముచే యమ నియమాభ్యాస పూర్వకమగు నాసనమని తెలిసికొనదగును. పిదప, భగవద్రూపధ్యానము చెప్పుటచే ధ్యానమున కవ్యవహిత పూర్వములగు ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణములును గృహీతములైనట్లే తెలియదగును. అట్టి ధారణయోగమువలన దుదకు గలుగు సమాధియోగము నొందుమని యుపదేశము. ధ్యాతృధ్యానములు తొలఁగగా క్రమమున ధ్యేయ మొక్కటియే గోచరించు స్థితిసమాధి, అనగా 'అఖండ సచ్చిదానంద స్వరూప మగుట అను పెద్ద' విషయ మిటుల సంగ్రహించి సులభముగా జెప్పగలిగిన యిట్టి కావ్యమే కదా కావ్యము! పిదప భక్తియోగము నుపదేశించును. అదియును భాగవతమున నొక ప్రకరణము. దానిలోని నిగ్గంతయు నొక పద్యమున మాత్రమే క్లుప్తమైనది-

'గుణగణముల్ మదీయము లకుంఠితలీలలు వించుఁ బాడుచున్
క్షణ మెడఁబాటులేని మది చారు సుపర్వ సరిత్ప్రవాహ ధో
రణి యగు భక్తి పుట్టును; కరమ్మది మృత్యుభయమ్ము నెట్టఁగా
రణమని తెల్పినావు గదరా! కపిలాకృతి దేవహూతికిన్.

ఈ ప్రకరణమంతయు చారుసుపర్వసరిత్ప్రవాహధోరణినే నడచినది, భక్తి స్వరూపనిరూపణ మెంతయు హృదయంగమము. అనంతరము పిండోత్పత్తి మొదలు, జనించిన జీవుడు మరల దేహత్యాగముచేయు పర్యంతము నిరువదియైదు పద్యములకు మించి భాగవతమున వర్ణింప బడినభాగ మిందు రెండు పద్యములందు దెల్పబడినది. 'కపిలతనురితి త్వం దేవహూత్యై న్యగాదీ' అని మూలమున నేకాకారముగా నెనిమిది పద్యముల తుదనున్న మకుటమున కనుకూలముగా అనువాదమున 'అమ్మకు దేవహూతికిన్' అనియు 'కపిలాకృతి

దేవహూతికిన్' అనియు అనువాద మట్లుగాక సహజసంభూతమట్లు రచించుట స్తుత్యము. ఈ ఘట్టమున ననువాదపద్ధతి తెలియుటకై మూలముతోగూడ అనూదితపద్యము చూపుటయు సముచితము గాదా!

'యువతి జఠరఖిన్నో జాతబోధో௨ ప్యకాండే
ప్రసవగళితబోధః పీడయోల్లంఘ్య బాల్యమ్,
పునరపి బత! ముహ్యా త్యేవ తారుణ్యకాలే
కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః' అని మూలము.

'కలికి యసహ్యా గర్భనరకమ్మున గాసిలి, యందు బుద్ధియుం
గలిగియు - నేలమీద ఁబడఁగా, నదిపోయిన శైశవా ద్యవ
స్థలఁ బడి యంతలో మరల దారుణ యౌవనమోహమందు మూ
ర్ఛిలుఁ నరుఁ డంచుఁ దెల్పితివి శ్రీకపిలాకృతి దేవహూతికిన్'.

అని అనువాదము. ఈ రెంటిని సరిచూచినయెడ నేది మాతృకయో ఏది పుత్రికయో తెలియరాని భ్రమ కలుగుచున్నదే! పిదప, కాలవశుడగు జీవుడు చను దక్షిణోత్తర యానములు వివరించుటయు దర్శనీయమును, మాననీయమును. ఈ కపిలావతార దశకము శాస్త్రీయవిషయ నిబిడము. అట్టియెడ విషయకాఠిన్య మించుకంతయు దెలియకుండ లలితాతిలలితపదబంధమున నింత మనోహరముగా రచన సాగించుట యసాధారణము.

ఇక నృసింహావిర్భావఘట్టమున రౌద్రరసమున కనుకూలముగా నోజోగుణ స్ఫూర్తితో వరుపాక్షరయుక్త దీర్ఘసమాసముతోడి గౌడీరీతిని కవితను నడిపించుట యెంతయు శ్లాఘ్యము-

'తప్తస్వర్ణసవర్ణఘూర్ణ చటులోదగ్రాక్ష ముద్యత్సటా
వ్యాప్త్యోత్కంపి నికుంభితాంబరము ఖడ్గాగ్రోగ్ర జిహ్వాగ్ర సం
దీప్తప్రోద్ధత దంష్ట్రికాయుగ మహో దిగ్గాద్రిరాడ్గహ్వరో
ద్వ్యాప్తాస్యమ్మయి మా యుపాస్య మిరవొందెన్ శ్రీనృపంచాస్యమై.

అని యీ యొక పద్యముతో దనియక-

'వలిభంగస్ఫుటగండమై పృథుల హ్రస్వగ్రీవమై దోశ్శతా
కలితోద్యన్నఖపుంఖపుంఖిత రుచి క్రాంత్యుల్బణమ్మై నభో

వలయోల్లంఘి ఘనాఘన ప్రతిఘన ప్రధ్వాన నిర్ధావితా
ఖిల ఘోరాసురమౌ నృసింహమునకున్ గేల్మోడ్తు నీ మూర్తికిన్'.

అని నృసింహ సింహనాదమున కనువాదముగా ననువాద మొనర్చిన యీ భాగము మనోజ్ఞమని యే సహృదయు డనడు?

ఇచట ఓజోగుణయుక్తముగా నిట్లు చెప్పియు అజామిళోపాఖ్యానమున విష్ణుదూతల పల్కులు మిగుల ప్రసాదగుణభరితముగా జెప్పి హరిప్రసాదమును గన్నులకు గట్టినట్లు రచించుట నుత్యము.

'పలుతీరుల్ శ్రుతులందు నాస్మృతులలో భాసించు నా యా వ్రతా
దులు పాపోపశమంబుసేయు - మొదలున్ ద్రుంపంగలే - వాత్మలో
పలి మాలిన్యము జిడ్డు తోముటకుఁ ద్వత్పాదాంబుజ శ్రీ సప
ర్యల మించంగల దింక లేదనిరి దేవా! త్వత్పదారాధకుల్'.

ఆహా! భావ మెంత లలితముగా నున్నదో రచనయు నంత లలితమై వెలయుట భాగ్యము. శ్రుతి స్మృతి ప్రోక్త వ్రతాదులు పాపమును శమింపజేయునే కాని, దాని వాసనను నిర్మూలింపలేవట. భగవత్పాదసేవ పాపము నణచుటయే కాదట, దాని వలని జిడ్డు- అనగా వాసనను గూడ నశింపజేయునని యెంతయో గంభీరమగు నర్థ మిందు తేటతెల్ల మొనరింపబడినది.

మఱియు నీ క్రిందిపద్యమున గల 'ప్రాణములున్ హరీయనన్' అను జాతీయమువలన నీ దీక్షితకవివర్యులకు అనువాదమున గల స్వాతంత్ర్యము వ్యక్తమగుచున్నది.

'ఎన్నియొ పుట్టువుల్ గడచి యెన్నియొ పాపము లాచరించినాఁ
డిన్నిటికిన్ బ్రతిక్రియగ నిప్పుడు 'ప్రాణములున్ హరీ యనన్'
మున్న హరీ! యటంచుఁ దన ముద్దుల బిడ్డనిగూర్చి యేని వాఁ
డన్నది చాలదా యని రయారె! భవచ్చరణాబ్జసేవకుల్.'

ఇందు కవివాణి ప్రసన్న శరన్నదీవేణియై జాలువాఱుచున్నది. గజేంద్రమోక్షమున పోతనార్యునివలె గాక మూలానుసారము గరుడారూఢుడయియే హరి వచ్చి, గజేంద్రుని రక్షించినట్లు స్పష్టముగ నిందు జూడగలము-

"విని యా కేవల నిర్గుణ స్తవము 'నాపి ల్బిందులో లేదు నా
పని కా దీ స్తుతి నన్నుఁగా' దనుచు నా బ్రహ్మేంద్ర రుద్రాదులా
తని కడ్డంపడ రార యొక్కరు; గరుత్మద్వాహనారూఢుఁడై
యనఘా! శ్రీహరి! నీవ వచ్చితివి సార్వాత్మ్యంబు దీపింపగన్."

'ఛందోమయేన గరుడేన స ఉహ్యమాన, శ్చక్రాయుధోఽభ్యగమ దాశు యతో గజేంద్రః' అను భాగవత శ్లోకము ననుసరించియే నారాయణ పండితులును 'సర్వాత్మా త్వం భూరి కారుణ్య వేగా త్తార్క్ష్యారూఢః ప్రేక్షితోఽభూః పురస్తాత్' అని గరుడారూఢునిగానే వర్ణించినారు. కాని 'అభ్రగపతిం బన్నింపక' పాదచారమున పరమేశ్వరుడు పరువెత్తినట్లు చెప్పలేదు. కావున తదనుసారమే యీ యనువాదమును నడచినదని సహృదయులు గ్రహింతురుగాక!

క్షీరసాగరమున లక్ష్మి యుదయింపగనే యామె రూపమును గాంచి యందఱును మురిసిపోయిరట, ఆ సందర్భమున మూలగ్రంథమందు -

**'జగదీశ! భవత్పురా తదానీం కమనీయా కమలా బభూవ దేవీ**

**అమలా మవలోక్య యాం విలోల స్సకలోఽపి స్పృహయాంబభూవ లోకః.**

'లోకులెల్లరు నామెను జూచి యాసించిరి' అని యుండ-

**'కలకలలాడుచున్ గలిమికన్నియ వన్నెలమిన్న నీపయిన్**

**వలపులఁగుల్కు కల్కి యెలనవ్వులతో నటఁ దోఁచినంత న**

**క్కులుకుమిటారి తళ్కుబెళుకుల్ గని యొండొక చూపులేని చూ**

**పుల వెలఁబోసి లోఁగొని రపూర్వ తదీయవిలాస మెల్లరున్'.**

అని యనువదింపబడినది. మూలముతో దులదూచినచో రాసిక్యమున ననువాదమువంక ముల్లువ్రాలక మాన దనిపించుచున్నది. 'కమల - కమనీయ' అని మూలము. ఆకామనీయక మనువాదమున 'కలకలలాడుచున్ వన్నెలమిన్నగా' వివృతమైనది. 'భవత్పురా' అను మూలము 'నీపయిన్ వలపులఁగుల్కు కల్కిగా' బెంపబడినది. 'అమలామవలోక్య తాం' అను మూలమును గొని యా యమలత్వము 'అక్కులుకుమిటారి తళ్కుబెళుకులుగా' పెంపొందింపబడుటయే కాదు. 'తామవలోక్య సకలోపి లోకో విలోలః స్పృహయాం బభూవ' అనుదానిని 'ఒండొక చూపులేని చూపుల వెలబోసి

తదీయవిలాస మెల్లరున్ లోగొనిరి' అని యనువదించుటలో 'ఒండొక చూపులేని చూపుల' =నిశ్చలదృష్టులతో అనుట 'ఆ సిగ్గుకు సిగ్గులేదు' అనిన చేమకూర చమత్కారమునకు స్ఫోరకమై రాసిక్యమును జాటుచున్నది. అచ్చటి వ్యంగ్య చమత్కారము సహృదయైకవేద్యము, ననిర్వచనీయము నగుటచే నీ ప్రసంగ మింతతో ముగించి మఱొక ఘట్టము నరయుదము. విష్ణుని మోహినీ వేషము నరసిన రక్కసుల కామ వికారమును వర్ణించుసందర్భమున-

'హంగగు మేనికాంతి వయసందున 'శ్యామ' వనంగనొప్పి యు
త్తుంగ కుచద్వయిన్ నడుము తూఁగ నటింపఁగఁజూచి, దప్పి పెం
పుంగొని సోలిప్రాలుచు నపూర్వ భవత్కుచకుంభ విభ్రమ
మ్మ్ముం గొననెంచి - కాదనిరి పూర్వసుధారసపూర్ణకుంభమున్'.

మేనికాంతిచే 'శ్యామ' అనగా నల్లనిది, వయసునందును 'శ్యామ' అనగా యౌవన మధ్యస్థ, అని (శ్యామా యౌవనమధ్యస్థా)శ్లేషాలంకార చమత్కారమును, మోహినియొక్క 'యపూర్వ కుచకుంభవిభ్రమముపై' నాసగొని, పూర్వ సుధాపూర్ణకుంభము కాదని రనుటలోని యర్థచమత్కారమును, పఠితల హృదయవేగము నాపి రవంత యాలోచనలో బెట్టక విడువనివి. ద్రాక్షాపాకమువలె మధురముగా గానవచ్చినను నారికేళపాకమునకు సచ్ఛాయమై యలరారుచుండుట నంస్తవనీయము.

దీని తరువాతిపద్యములో సంస్కృతపదములతో నిమిత్తము లేకుండనే యచ్చ తెలుగు జాతీయములో నెంత వ్యంగ్య మిముడ్చబడినదో యరయకుండు టెటు? -

'ఓహరిణాక్షి! నీవెవతవో యమృత మ్మిది పంచుమంచు వ్యా
మోహము సెంది మైమఱచి పొందిక డగ్గరివేడు వారి స
న్నాహముఁ జూచి 'వాడవదినన్' నను నమ్మిన నవ్వుబాటు సం
దేహము లేదు - అటంచునె పదింబది నమ్మికపుచ్చి తందఱన్.'

'కులటా ఒస్మి' అను మూలమునందలి కులట=ఱంకులాడి యను పదమునందలి నైచ్యము వాచ్యముగాక వ్యంగ్యమగునట్లు 'వాడవదినన్' అని ప్రయోగించుట రమ్యతరము నగుచున్నది. 'వెఱ్ఱివానియాలు వాడవదినె' అను సామెతప్రకారము వాడలోని వారి కందఱకు వదినెవావి దగుననికదా ప్రసిద్ధి! మఱియు -

'పాయని పొంగుతో నమృతపాత్రము వారటు తెచ్చి చేతి కం
దీయఁగఁ జేతఁగాదు అబల నే-నెమి సేయఁగఁబోయి యేమిగాఁ

జేయుదునో యటంచు' అను పల్కులలో ఏమిచేయబోయి యేమి చేయుదునో యనుమాత్రమేకాక అమృతము పంచుటలో ఏమి కాజేయుదునో అనగా మీకందనట్లు అంతయు నపహరింతునేమో- యను ధ్వనికూడ గలదు. వారిని నమ్మించినదని మాత్రమె మూలమున నుండగా ఆ నమ్మించుట యెట్లో యనువాదమున వివరింపబడినది. 'చేతకాని యబలను మీపని సక్రమముగా జేయగలనో లేదో' అని ముందుగా జెప్పియుండుటచేతనే అమృతపానమునకై యెంత యుత్కంఠితులైనను దేవతలకు బూర్తియగుదాక నసురు లోర్చి యుండగల్గి రన్నమాట. కొన్ని యెడల మూలమున కిట్లే వ్యాఖ్యానప్రాయమై ఈ యనువాదము వన్నెమీఱుచున్నది.

'బలినిగ్రహ' ఘట్టమున వామనుని గని బలి 'నీకేమి కావలె' నని యడుగుచున్న పద్యమందలి యనుప్రాసమే కాదు. అర్థమును నెంత సహజమగు ధోరణిలో నడచినదో! కవిత్వధార యెంత ధారాళముగా నవతరించినదో! పరిశీలించి, యానందింపక తప్పనిది.

'కని దైత్యేంద్రుఁ డు త్వత్తనుద్యుతుల కాకంపించి కైవంచి యి
ట్లనియెన్ 'నాయెడ నేమికోరెదవు కుబ్జా! షడ్రసోపేత భో
జనమా! కాంచనమా! మణీభవనమా! సర్వంసహారాజ్య రం
జనమా! స్త్రీజనమా! యెదే నడుగుమా! సందేహమా? నీకిటన్'.

గొగ్గిపద మొక్కటియు లేక కమ్మచ్చున దీసినట్లు సాగిన యీ పద్యము వంటి వీ గ్రంథమున షరశ్శతము లున్నను ఇయ్యది శ్రవణమాత్రముననే మృదంగవాద్యానుకారమగుట యొక విశేషము. ఇందలి యంత్యానుప్రాస మయత్నసిద్ధము కావుననే కాంచనమా, మణీభవనమా అను రెండు పదములును జకారము విడిచియు బ్రయుక్తములైనవి, కావుననే రమణీయార్థదము లైనవి. అంతియకాని, భోజనమా, రంజనమా, స్త్రీజనమా, అనువానిలోని ఛేకమున కనువుగ బై రెండు పదములలోగూడ నెట్లో పిసికి, పిండిచేసి, శ్రమించి జకార సంపాదనముచేసి ముడివెట్టినచో ననుప్రాసము కుదరవచ్చును. అర్థ మస్తవ్యస్తము కావచ్చును.

పిదప 'రక్షోనాథువంశమ్ము వర్ణనముంజేసి పదత్రయం మ్మొసగుమన్నా!

చాలు'నన్నావు. అని - 'కాదని సర్వమ్ము నీవయై యడుగ వహ్వా నవ్వరే యెవ్వరున్'- అని యర్థాంతరన్యాసమున చక్కగా సమర్థించుట యెంతయు హృదయంగమముగా నున్నది. మఱియు త్రివిక్రమస్వరూపము చెప్పుపట్టున 'ఆ బ్రహ్మాండ భాండమ్ముగా, నమరెన్ నీదగు దివ్యరూపమది యింతితం తౌచు నంతంతయై' అను దానియందలి వ్యంగ్యము జీవనాడియై కావ్యమునకు శోభ గూర్చుచున్నది.

దేవకీ వసుదేవులను వివాహానంతరము రథ మెక్కించి సాగనంపుచున్న కంసుడు అశరీర వాక్కువలన మృత్యుభయము కలిగి, చెల్లెలిని జంపబూను ఘట్టమున నొక చిత్రము.

'అంతట నూత్న దంపతుల నంపుచు సారథియై రథాన 'ని
క్కాంతకుఁ గల్గు నెన్మిదవ గర్భము నిన్ ఖలు జంపు' నంచు బ
ల్వింతగ నీదు పల్కె వినువీధి వినం బడఁ గంసుఁ డన్న సం
భ్రాంత మనస్కుఁడై కొనెఁ గృపాణముఁ జెల్లెలి సంహరింపఁ గన్.'

అని మూలానుసార మనువదింపబడియు-

'గృహ్ణన శ్చికురేషు తాం ఖలమతి శ్శౌరే శ్చిరం సాంత్వనై
ర్నో ముంచన్ పునరాత్మజార్పణ గిరా ప్రీతో౽ థ యాతో గృహాన్
ఆద్యం త్వత్సహజం తథార్థితమపి స్నేహేన నాహన్నసౌ
దుష్టానామపి దేవ పుష్ట కరుణా దృష్టా హి ధీ రేకదా.'

అను మూల శ్లోకములోని- దేవకి కొప్పు పట్టుకొని కంసుడు కత్తి నెత్తె- నను నంశము వదలినను, 'వసుదేవుని సాంత్వన వాక్కులచే జెల్లెలి కొప్పు విడువడాయె'నను దానిలోని సాంత్వన వాక్కులు వివరముగా దెల్పబడినవి.

'అయ్యయొ పెండ్లికూతురు గదయ్య సహోదరి బ్రోవుమన్న వాడియ్యకొనండు' అని మార్పుచేయబడినదే కాని 'పునరాత్మజార్పణగిరా ప్రీతో౽థ యాతో గృహాన్' అను వాక్యము 'పుట్టగనె యెల్ల కుమారుల దెచ్చి యిత్తునా, నియ్యకొనెన్' అని యనువదింపబడి మూడవ పాదమునందలి యర్థము సమగ్రముగా స్ఫురించునట్లు సూత్రప్రాయముగా 'యదూద్వహుఁడు నిచ్చెను దొల్తటి బిడ్డఁజంపరాఁడయ్యెను వాఁడు' అని తెలుపబడినది. నాల్గవ పాదమునగల యర్థాంతరన్యాసము - అనువాదమున వీలులేకుండ 'ఱాకటికియై సుతిమెత్తన చిత్తమొక్కెడన్' అని రేఖామాత్రముగా మధురమగు తెనుగులో

నెంతయు మెత్తగా దెల్పబడి యాంధ్రహృదయముల హత్తుకొని పోవుచున్నది. ఖాతివలె గఠినమైనదైనను జిత్తమొకప్పుడు సుతిమెత్తన యగుచుండునని దానిభావము- అనువాదమున నీపాటి స్వాతంత్ర్యముకూడ లేకున్నయెడ సొగసు రానే రాదు.

కృష్ణుడు జననమైనాడు కేయూర కిరీట కంకణాది భూషణములతో. చతుర్భుజుడై పురుటిల్లు మెఱసిపోవ వెలుగుచున్న యా దేవుని రూపము నారయుచున్న వసుదేవుడు-

'ధీరోదాత్తము యోగిబృందము సమాధిం బట్టుకోలేని యా
కార మ్మెట్టెదురై కనుల్ చెమరుపంగా మై గగుర్పాటు పొం
గారన్ గందొవ దేనెతేటయయి డాయన్ నిండు సౌందర్యభాం
డారమ్మున్ గని హర్షగద్గదికతోడన్ శౌరి నిన్నిట్లనున్'.

యోగులకు సమాధియందుగూడ బట్టువడనిదట శ్రీ కృష్ణభగవానుని రూపము! అట్టి యాకార మెట్టయెదుట వసుదేవుడు గాంచినంతటనే యతని కన్నులు చెమర్చినవట, మేనంతయు రోమాంచిత కంచుకితమయ్యెనట. కంఠమున గాద్గద్యము గలిగెనట. కారణము? నిండు సౌందర్య భాండారమ్మగు పరమాత్మదర్శనము కలుగుటయే. ఈ పద్యము చదువుకొనుచుండ, వసుదేవునకు భక్తివలన కలిగిన సాత్త్వికభావములు రక్తివలన నే పాఠకులకు గలుగకుండును? ఎంత మనోహరమగు భావము!

పూతన వ్రేపల్లెకు వచ్చినది. 'వ్రజకాంతలెల్ల నెవరే యీనాతి?' యనునంతలో 'జేసేతన్ నిన్నెత్తికొని హసించుచున్నిలిచె'నట. అంత 'అది నట్టింటను గూరుచుండి నిను మాయాడింభకున్ ఱొమ్మునన్, గదియంజేయుచు నల్లనయ్య! కడు నాకొన్నావు, పాల్ద్రావు మం చది చూపించెడునట్టి వత్సలరస, మ్మా హావభావమ్ములన్, ముదితల్ తత్తఱమొంది కాదనక యేమో చూచి రాశ్చర్యమై' యట, ఏమో చూచిరి- అను ప్రయోగము ప్రౌఢము. ఇందలి స్వభావోక్తి సుందరము. ఆ మాటలలోని వత్సల రసము ప్రత్యక్షము. శకటాసుర భంజనగాథయందు -

'అఁటకటఁ జిక్కి పాలకని యాకులుఁడై తన చిన్నిపాదమే
మో కదలించినాఁ డితఁడు; నొయ్యన నయ్యది తాఁకి, వ్రయ్యలై

యీకడఁ గూలె బండి, తిలకించితి నే నిది నే నటంచుఁ దా
మేకముఖమ్ముగాఁ బలికి రెల్లరు గోపక బాలకుల్ ప్రభూ!'

అని - శకటమును బసివాడు కాలదన్ని ముక్కలు చేసినాడు చూచితిమని-గోపబాలురు చెప్పిరట. అంత పెద్ద లా మాటలు విని-

'అననుగతంబు, సుంత నిజమంటకుఁ గాదిది - ముక్కుపచ్చలా
ఱని నిసువుల్ వచింతురు వెఱంగొని యంతియకాని వేఱు కా
దని రటఁ గొంద ఱందుఁగల యయ్యలు; కొందఱు పూతనాగతిన్
గని యగునేమొ కాదనుట గాదని సందియ మంది రచ్యుతా!'

ఇందలి సంశయములు, వికల్పములు, స్వభావసిద్ధములై మనోహరములై దీపించుచున్నవి. 'పూతనాగతిన్ గని' అనుదానిలో "కని" యను క్త్వార్థకము ఇట హేత్వర్థమున నుపయుక్తమై వ్యాకరణ మార్మికత వెల్లడించుచున్నది. "వాన కురిసి, త్రోవయంతయు బురదయయ్యేను" అను వాక్యమందు త్రోవ రొంపి యగుటకు హేతువు వానకురియుట. ఆ యర్థము నా వాక్యమునందలి "కురిసి" అను క్త్వార్థకము తెలిపినట్లే - పూతనాగతిన్ గని అనగా - పూతనయొక్క నడతను, 'కని- చూచినకారణమున' అని యర్థము దెలియ దగును. మచ్చున కిది వివరింపబడినదే కాని, యిట్టి వ్యాకరణ చిత్రములు దీక్షితకవివరుని వైదుషీ విలసిత భాషితములం దసంఖ్యాకములు.

కవితాగుణములలో ముఖ్యమనిపించుకొన్న సౌకుమార్యము మూర్తమై నట్లున్న యీ రెండు పద్యముల నిందుదాహరింప విడువ మనసొప్పకున్నది,

**"ఇది పపడంబు డంబు హరియించు పద మ్మిటు గంటువోయె నొ**
**ప్పిదము దొఱంగి, కందినవి బిడ్డని చేతులు తమ్మిపూవులం**
**చదిర! కృపాతరంగిత హృదంతరలై మదిరాక్షులెల్ల ని**
**న్నెదఁ గదియించి మే న్పులకరింపుల ముద్దులు వెట్టి రంతటన్."**

**'అమ్మకచెల్ల! చిన్నిశిశు వప్పరమేశు కృపాతరంగ పా**
**తమ్మిటు నెట్టినంతటఁ గదా యొక యొద్దును బట్టి దక్కినాఁ**
**'డిమ్మిటుతె' మ్మటంచు నిను నెత్తి కవుంగిటఁ జేర్చి నందుఁడ**
**బ్రమ్మగు హర్షముం బడసె రక్తిమెయిన్ మెయి పుల్కరింపగన్.'**

మల్లెపూలు మాలికగా గ్రుచ్చినట్లు సుకుమారములగు నలతిపదములతో నిగుంఫితము లగు నీ పద్యద్వయము సుందరమే కాదు, సురభిళముగూడను.

'స్తనకుంభమ్ములఁ బాలుచేపఁగ యశోదాదేవి నా తండ్రి! ర
మ్మనుచున్ నిన్నొడిఁ జేర్చి పాలొసఁగుచో నంతంత లేనవ్వు లిం
పెనయన్ వచ్చియు రాని పల్వరుస నెంతేనిన్ నిగారింపు చిం
దిన నీమో మటు చూచి గోపి మురియున్ నీతోడిదే లోకమై'

ఇందు ప్రతిపదమును వత్సలరసము జిల్లున జల్లుచున్నది. ప్రసాదసౌకుమార్యములు పెనవేసికొని మెఱయుచున్నవి. ఈ రీతిగా ప్రసాద, సౌకుమార్య, మాధుర్య, కాంత్యాది సకల కవితాగుణములతో గాంగఝురీ సదృశముగా నడచిన శ్రీ సుబ్రహ్మణ్యదీక్షిత కవివరుని యిమ్మహాకావ్య రత్నాకరమున నెన్ని యని రత్నముల నెత్తి చూపగలము? గుణగ్రహణ ధురీణులగు సహృదయు లామూలాగ్రము చదివి యానందవైవశ్య మొందవలసినదే. కాని సికతాకూప ఖననమునకు దిగి యతృప్తి నొందుట యుచితము కాదని యొకటి రెండు ఘట్టములు మాత్రము చూపింపక మానజాలకున్నాను.

గోపికా వస్త్రాపహరణఘట్ట మొకటి ముఖ్యమే కదా! అందు కాత్యాయనీ వ్రతము నాచరించుచున్నవారు గోపకన్యలేకాని ప్రౌఢలగు గోపికలు కారు. 'దారికా శ్శీతవేపితాః' అను భాగవతశ్లోక వ్యాఖ్యానమున శ్రీధరపండితులు "దారికాః, అక్షతయోనీ రిత్యర్థః" అని సెలవిచ్చిరి. వారు కన్యలు కుమారికలు అనుమాట మఱువరానిది. కృష్ణుని తమకు భర్తను చేయుమని కాత్యాయనీ దేవిని ప్రార్థించుచున్నారు. వారు ప్రౌఢలు కాగూడదా?- యందు మనిన, వారు దిగంబరలైన యవస్థలో చీరలు దొంగిలుటగాని, వారిని నీటినుండి బయటికి రమ్మనుటగాని యౌచిత్యమునకు దూరమగును. బాలలు గావున పరిహాసార్థము హరించినట్లు చీరలను హరించుట మార్దవమును దాటని కృత్యము. భగవంతుడిట్టి యల్పతకు బాల్పడ వచ్చునా? అని సంశయము కలుగక మానదు. కాని తనయెడ ననురక్తలైన, భక్తలైన గోప కుమారికలయెడ భగవానునకు పరిపూర్ణ కరుణ కలిగినది. అయినను వివస్త్రలై యమునానదీ స్నానమొనర్చు నధర్మమున గలిగిన పాపము తొలగనిదే తాను స్వీకరింపడు గాన, కృష్ణపరమాత్మ వారిని గాఢమగు చలిలో జలన్యాస రూప ప్రాయశ్చిత్తమున పరిశుద్ధలను గావించి, దేహాభిమానము గూడ దొలగింప జేతులెత్తి మ్రొక్కుడని

మ్రొక్కించుకొని, తన హృదయాంతరమున వారికి స్థానమిచ్చి మన్నించినాడు.

**'హేమంతే ప్రథమే మాసి నందవ్రజ కుమారికాః,**
**చేరు ర్హవిష్యం భుంజానా మాసం కాత్యాయనీవ్రతం.**
**తతో జలాశయా త్సర్వా దారికా శ్శీతవేపితాః.'**

ఇత్యాది భాగవత విషయము చూచిన సర్వ మవగతమగును. శాఖా చంక్రమమగునని, యది విడిచి నారాయణీయము నరయుదముగాక.

'చారు విలోకనల్ నదికిఁ జాగి యుషఃప్రభ వెంబడింప శృం
గారము లొల్కు నీ కతలు గానము సేయుచు గౌరిఁగొల్చి యొ
య్యారము భక్తిఁగొల్పి యుపహారశతమ్ములు నిల్పి యంబికన్
గోరిరి నందసూనుఁ దమకుం బతిసేయు మటంచుఁ బొందికన్.'

'ఈవిధి నొక్క మాస మొనరించిన నోము' - అది. 'కన్నియ లా వ్రతమ్ము తుద గట్టిన చీరలు విప్పి గట్టునన్, గ్రన్నన బ్రోవువెట్టి యమునా సలిలమ్ముల నోలలాడుచున్' ఉన్నారు. అట్లు వివస్త్రలై నదిలో స్నానమాడుట ధర్మోల్లంఘనము. వా రెఱుగక యుత్సాహమున జేసిన యా యకార్యజనిత పాపము తొలగింప దయాళువై నీవు రాగా,

'ము న్నినుగాంచి సిగ్గుపడి మోములు వంచినవేళ చీర లీ

వన్ని హరించి పొన్నతరు వక్కొనకొమ్మకు నెక్కి' 'ఇచ్చటి కీరు వచ్చి కొను డెవ్వరి చీర యదేదొ యెంచికొం డిచ్చెదఁ జారులోచన లివే యనుచున్' పరిహాసముచేయ కన్య లెల్ల. . . . వారి దొఱంగి గట్టునకు వచ్చి కరమ్ములు దోయిలించి . . . .వల్వలిమ్మనన్, వారు పవిత్రలౌట గని వస్త్రములెల్ల ననుగ్రహించి నాడవట! -

గోపకుమారికలు పవిత్రులగు దాక వారిని క్లేశపెట్టి ప్రాయశ్చిత్తపూర్తి కాగానే వస్త్రము లిచ్చి యాదరించినాడు శ్రీ కృష్ణపరమాత్మ. ఈ ధర్మసూత్రము నిందు వాచ్యము చేయకుండుట కావ్యత్వమును వెల్లడించుచున్నది. భాగవతమున కన్యకలు చేసిన తప్పు వాచ్యముగా నిట్లున్నది.

"యూయం వివస్త్రా యదపో ధృతవ్రతా వ్యగాహ తైతత్తదు దేవహేళనమ్ బద్ధ్వాంజలిం మూర్ధ్న్యపనుత్తయే௨ంహసః కృత్వా నమో వో వసనం ప్రగృహ్యతామ్

(వ్యాగాహత-ఏతత్-తత్ + ఉ.)

'మీరు ధృతవ్రతలయ్యును వివస్త్రలై నదీజలములందు స్నానము చేయుట దేవుని హేళన మొనర్చుట యగును. ఆ దేవహేళనజనిత పాపము తొలగుటకై శిరస్సున అంజలిపట్టి నమస్కరించి మీ బట్టలను తీసికొనుడు' అని. అట్లే వారు చేసి, పవిత్రలై చీరలను దీసికొనిరని యిందు ధ్వనితమని యెఱుగదగును.

కృష్ణపరమాత్మ భక్తపరాధీనుడు. కావున 'వ్రతపూర్తిన్మును గోపికా మణులకున్ వాగ్దానమున్జేసి (యచ్యుత) కందర్ప మహోత్సవము' - అది చెల్లింపవలదా? అనునట్లు వేణుగానమున శరద్రాత్రియం దాకర్షించి వారి ననంగకేళీ ప్రపంచమున రంజించుచు-

'వలువలు హరించినప్పుడు, వలువలు హరియింతు ననిన వాగ్దాన మ్మి

వ్వలనన్ రసవివశస్వాం, తల కింతుల కప్పగించి' తనియించినాడు సరస మగు కల్పన! ఇంతకంటెను ఆంధ్రీకరింపనలవిగాని యీ క్రింది పద్యమువలన దీక్షితకవి రచనానైపుణి యుచ్చైఃకోటి కెక్కినది.

'విరహే ష్వంగారమయః శృంగారమయశ్చ సంగమే త్వమ్
నితరా మంగారమయ స్తత్ర పున స్సంగమేపి చిత్ర మిదమ్!,

విరహకాలమున అంగారమయుడవు (అగ్నికణములవంటి వాడవు) అయిన అనగా - తాపకారివైనవను, సంయోగమున శృంగారమయుండవౌచు ఆనాటి సంయోగమునందును (అంగారమయ) అంగారమయు డవగుట చిత్రము అని విరోధము, దానికి అంగ + ఆరమయః. అంగ = (ఓయి కృష్ణ !) ఆరమయః (ఆనంద పెట్టితివి) - అని విరోధపరిహారము. ఇట విరహమున గోపికలకు తాపకారివైనను సంయోగమున శృంగారస్వరూపుడవై ఓయీ వారిని బరిపూర్ణముగా ఆనందింప జేసితివని భావము. ఈ భావము సభంగశ్లేషయుక్తమగు విరోధాభాసాలంకారమున నున్నది. అట్టిదానిని విడువ విలుగాదు, గ్రహింప నసాధ్యము. ఈవిరోధము పరిహరించుటకు దీక్షిత కవివరుడు 'సంగేప్యంగార మయస్తత్ర' యనంగా అని యనుకరణమున నావాక్యము నిబంధించుట మిగుల ప్రౌఢమనక తీఱదు. "అనుకృతేఽ స్తి వాక్యంతు" అనికదా శాస్త్రము- ఇది కవితాశక్తికి నికషము. అదియటుండనిచ్చి మఱియొకగాథ నరయుదము. రాసక్రీడ - ఈ ఘట్టమున శృంగారరస భంగిమలే కాక, నాట్యభంగిమల కనువగు లయానుకూల చ్ఛందోభంగిమను స్వీకరించుట యెంతయు

నౌచిత్యాధాయకముగా నున్నది, మూలమున నున్న వృత్తమే యనువాదము నను(గహించుట యెంతయు సముచితముగా నున్నది.

మొదటి పద్యమున శ్రీకృష్ణపరమాత్మ యొక్క మధురశృంగార స్వరూపము వర్ణింపబడినది. కేశాదిపాదాంత వర్ణనము అది వేనలిన్ నెమిలిపించియము, వీనుల మకరకుండలములు, (హృదయమున) సరసీజహారములు, అంగరాగమున గల్గు సర్వాంగసౌరభము, (మొలను) కనకకాంచికాంచిత వికంపి పీతవసనము, పాదముల మణి మంజు నూపురములు వెలుగ కమలాలయా(ప్రాణవల్లభుడు దర్శన మిచ్చుచున్నాడు. తరువాతి పద్యమున-

'మండితోరుపరిమండలాన c గుచమండలాకలిత కంచుళిన్
గండలోలమణి క (మకుండలిని c గామినీ కలిత మండలిన్
దండి నొక్కొకతె దండ నొక్క cడయి దాను మారమణ! నిండి రే
యెండ c గాయ జరియించి నీవు నటియించినా వచట రాసమున్.'

అని కుచమండలమున గంచుళిమా(త్రమును దాల్చి, గండభాగముల మణి కుండలములు నటింప ముండలాకారముగా నిల్చిన గోపకన్యల నడుమ నొక్కొకతె కొక్కొకడుగా గృష్ణభగవానుడు విశ్వవ్యాపన విలాసము మెఱయించుచు 'నాట్యమున బయ్యెద లేకుండ కంచుళి (కంచెల) మా(త్రమే నటి దాల్చు'నను సం(ప్రదాయము చక్కగా నిముడ్చుట రుచిరము. తరువాతి పద్యమున ఆకాశమున నిల్చి దేవత లరయుట మనోహరముగా వర్ణింపబడినది. అనంతరపద్యమున 'ఇత్థమాకల్పితే మండలే మధ్యగః సంజగౌ వేణునా దేవకీనందనః యనినట్లు మండల మధ్యమున నిలిచి పరమాత్మ వేణువు నూదుచుండ 'పిల్లన(గోవి వినిపించు తానసమవేతద గాన కలరాగ లీలోల్లసద్గతుల కనువుగా 'ఉచ్చలత్పదపయోజతాళలయ భంగిమ'లచే మణికంకణాళి ఘల్లుమనుచుండ, నొండొరుల మూపులందు కరకంజము లానుకొని (శోణిచలదంబరలగుచు గోపాంగనలు ఝణంఝణఝణలను నెఱపి రనిన వర్ణనము ఎంత మనోహరము! ఎంత స్వాభావికము!

అనంతర పద్యమున - తారస్వరమున వెలువడు గానమున కనువగు తాళముతోడి గోపికాకృష్ణుల లాస్యతాండవముల గాంచి ముగ్ధులై దేవతలు పూలవానలు నించిరి. సచ్చిదానందమయుడగు భగవంతునితో లీనమైపోయి మూర్ఛిల్లిరి- అని వర్ణింపబడెను. మనస్సుచే నూహించుటకేని యలవికాని యా జగన్మోహన దృశ్యమును గాంచి దేవతలే కాదు - ఏ (ప్రాణి యానందరసాప్లావితమై మూర్ఛపోవదు?

ఈ క్రింది పద్యమున నొక విచ్ఛిత్తి విశేషము రసప్లుతమై కనబడును. ఒక తీవబోణి మెయితీగను గ్రొంజెమట వొడమ శ్రమచే సోలుచు, కనులు మూతవడగా కృష్ణుని కేలూని నిల్చియుండగా - ప్రక్కనున్న యొక గోపిక యా యవకాశము కనిపెట్టి, కృష్ణుని పటీర రస నిస్స్రుతితో గూడిన భుజము నల్లన జేరి యాతని మోవి ముద్దుగొని పులకితగాత్రి యయ్యెనని వర్ణింపబడెను. ఈ ఘట్టమున కంతకు నిది రత్నదీపమనిన నతిశయోక్తి కానేరదు. భగవానుని యెడగల గోపికల ప్రేమ మెంత మధురమో! ఎంత నిరవధికమో కదా! క్రమముగా రాసము హ్రాసము నొందుట అనంతర పద్యద్వయమున వర్ణింపబడెను. ఒక కాంత కర్ణాభరణములు సెదరిపోయిన తన చెక్కును కృష్ణుని చెక్కున నాని తదాస్య పూగ రస చర్వితము నాస్వాదించెనట. ఎంత పుణ్యాత్మురాలో కదా! అంతలో 'ఆగె గానము, వాద్యము నాగె' - ఆ యంగనలు బ్రహ్మానంద రసానుభూతిలో మైమఱచి నాట్యముచేసిరే కాని, ఎడలు నీవినిగాని, విరియు వేణిని గాని, ప్రిదులు రైకను గాని యావేగమునం దెఱుగనే యెఱుగరట, ఇంతకంటెను చిత్రము. సకలదిశల నలమిన వెలుగును నాగిపోయెనట! ఇట్లు మదనోన్మాదలగు నా సుందరుల పురాకృతసుకృతమున నందఱ కన్ని రూపుల దాల్చి వారిని మాన్మథోత్సవమున దేల్చెనట, ఆ కేళీస్వరూపము తరువాతి పద్యమున నిట్లు వర్ణింపబడెను.

'వింతకేళి మురిపించి ముచ్చటలు వించి లాలసము వెంచి నీ
వంత యామున వనాంతకేళుల లతాంతసౌరభ నితాంత శ
య్యాంతపాళుల ననంతలీలల సుహాసినీశత విమోహన
మ్మెంతొ సేసితి వొకించుకై విసరి యించు చల్లనగు తెమ్మెరన్.'

ఆహా! ఇందు భావమెంత మృదువో రచన మంతకంటె మృదుతరమే కాదు; మధురతరమును-కవిత్వమున కింతకంటె సాఫల్యమేమి కలదు?

ఈ ఘట్టమున శృంగారము పిక్కటిల్లియున్నట్లు లౌకికదృష్టికి గనబడును గాని, పరమార్థ మారయ నారయ - భగవదనుగ్రహముమాత్రమే యని విశదమగును. భగవంతునకు జగత్తంతయు శరీరమనియు, నందేకదేశములగు నాయువతుల యాలింగనాదికము స్వాంగాలింగనమే యనియు, అందు కామప్రసక్తి లేదనియు పురాణాంతరమున జెప్పిన

'స్వాంగాలింగే రతి ర్న స్యా దంగనాలింగనే రతిః
యస్యాంగం జగదీశస్య తస్య రాగాదయః కుతః.

అను సూక్తికి స్ఫోరకముగా 'సకలదిశల నలముకొనిన వెలుగు' అను వాక్యమును జక్క రచించిన యీ రచయిత సంస్తుత్యుడు. త్రికరణశుద్ధిగా దన్ను భజించువారిని దనయందు జేర్చుకొనువాడు భగవంతు డనుటకు నీ ఘట్టము ముఖ్యోదాహరణము. పరంజ్యోతిస్స్వరూపుడగు శ్రీకృష్ణపరమాత్మ యా కన్యల కంతర్బహిర్వర్తియై యానందక్రీడన మొనరించినవాడను నర్థము కాంతాసమ్మితముగా దెలుపబడినదని కావ్యమర్మజ్ఞులు గ్రహింపకపోరు.

ఇక నీ స్తోత్రకావ్యమున తుట్టతుదిని శ్రీనారాయణభట్టపాదుడు బ్రహ్మానంద సాగరమున నోలలాడుచు దన కఠిన తపో నియమయుక్త ధ్యానమునకు వశంవదుడై ముకుందుడు తనమ్రోల సాక్షాత్కరించినట్లు 'అగ్రేపశ్యామి' 'కనుచున్నా నదిగో' అని యా నారాయణుని దివ్యరూపమును కేశాది ఖావధిగా వర్ణించిన వర్ణన మపూర్వము. అందు భక్తిచేతను, రచనారామణీయకము చేతను నా వర్ణనము పరకోటి కెక్కినది. త్రిలోక సమ్మోహనమగు నాపరమేశ్వరుని మంగళరూపమును చక్షుస్సుచే (అనిన నేటివారు నమ్మరేమో) జ్ఞానచక్షుస్సుచేతను వీక్షింపకున్న ననితర సాధ్యమగు నట్టి ఫక్కిలో భట్టపాదుడు రచింపగలడా? 'తత్సర్వం తపసా సాధ్య' మ్మనియు, 'తపసా దుష్కరం నాస్తి' యనియు బల్కిన యార్ష వాక్యము లసత్యము లగునా? అసత్యములని ధార్ష్ట్యమున బలికినచో నంతకంటె ఘోరము మఱి యుండునా?

ఆతడొనర్చిన కవిత్వతపస్సు తుట్టతుదకు పండిన దన్నమాట. అట్టిపరిపక్వ తపశ్శక్తికి భగవంతుడు పాదసేవకుడయి తీరవలసినదే. తనకు బ్రత్యక్షము గాలేదు కనుక నమ్మమనువారి కొక నమస్కృతిసేసి భగవత్స్వరూపవర్ణన ఘట్టము పరిశీలింతము-

'కనుచున్నా నదిగో కలాయ సుమరేఖా కోమలమ్మైన వె
ల్గును పీయూషరసాప్లుతుండనయి యాలో దివ్యకైశోర మూ
ర్తిని శ్రీనారదముఖ్యు లయ్యుపనిషచ్ఛ్రీసుందరీ బృందముల్
వినుత బ్రహ్మసుఖానుభూతి ఁ బులకల్ నిండారు నెమ్మేనులన్
దనచుట్టున్ గొలువన్ జెలంగు నుదయత్తారుణ్యలావణ్యునిన్.'

అదిగో కలాయమువలె కోమలము నీలము నగు తేజఃపుంజమును దానిలోపల నారదాది పరమర్షులును, ఉపనిషత్కాంతలును బ్రహ్మానుసంధాన జనితానందానుభవముచే గగుర్పాటొందిన శరీరములతో దన్నుజుట్టుకొని సేవింప దీపించు నంకుర త్తారుణ్య లావణ్యమగు దివ్యకిశోర విగ్రహమును (బాలకృష్ణుని)

కనుచున్నాను- అని భావమున పొంగిపోవుచున్నాడు. ఆ లేబ్రాయపు వెలుగును నిదానించిచూడగా-

'ఘననీలప్రభ నుంగరాల్ దిరిగి, చక్కన్ జిక్కువో దువ్వి నిం
చిన యక్కొండె సిగన్ గనన్నవమణీ శ్రీమత్కిరీటమ్ము సం
తనగాఁ జెర్విన నెమ్మిపించియము మందారస్రగాబద్ధమై
యనువౌ నీ కబరీభరమ్ము మఱి నీదౌ ఫాలబాలేందు వీ
థిని దర్శించుచు నుంటి శ్వేతతర తత్స్నిగ్ధోర్ధ్వపుండ్రద్యుతిన్."

అందూర్ధ్వభాగమున చిక్కువోవ జక్కగా దువ్విన - యుంగరాలు దిరిగి - నీలవర్ణమున నిగనిగలాడు కురుల కొండెసిగ, నవరత్నఖచిత కిరీటము, చక్కగా జెక్కిన నెమలిపింఛము, మందారమాలలు చుట్టిన జుట్టుముడి, బాలచంద్రునివంటి ఫాలము, అందు ధవళము స్నిగ్ధమునగు నిలువునామము ఆహా! ఏమి నీ సొగసు! నా తండ్రీ కృష్ణా! కరుణాసాగరతరంగమువంటి కన్బొమలతో, సుందరములై నీలములగు పక్ష్మములతో నలంకృతములై చిఱునగవుచే మొగవిరిసిన చల్లని నీ కృపారసము జల్లు చూపుల నియ్యనాథునిమీద నొలయింపుము.'

ఆహా! ఎంత సమ్మోహనమగు స్వరూపమో కదా యనిపింప వర్ణించును. క్రమముగా నాసికను, శ్రవణములను, అరుణాధరమును, కౌస్తుభాలంకృత కంఠమ్మును శ్రీవత్సమును, వనమాలను వర్ణించి, వర్ణించి, పీతాంబర, రశనాకింకిణుల గణించి, యూరు జాను జంఘలను చిత్రముగా నుత్ప్రేక్షించి పరమప్రార్థ్యములును ప్రాప్యములును నగు పాదాంబుజములను విభాగములతో నిట్లు స్తుతించును-

'గురుమంజుశ్రుతులన్ బదా గ్రభజనన్ గొండాడు మంజీరమున్
బరమభ్రాంతి నిమజ్జ దానత జనప్రవ్యక్త ధీమందరో
ద్ధరణ ప్రౌఢము కూర్మమూర్తి ప్రపద మ్మాతామ్రరోచిర్నఖ
స్ఫురితేందుప్రభ నాశ్రితార్తితమమున్ బోకార్చుకళ్యాణసం
భరిత మ్మాకలిత మ్మొనర్తును భవత్పాదాంగుళీ సంతతిన్.'

పరమేశ్వరపాదసేవ యుత్తమోత్తమమని మనోహరములగు ధ్వనులచే స్తుతించు నట్టివట మంజీరములు, భ్రమలో మునిగిపోయిన భక్త జనుల

బుద్ధియను మందర గిరి నెత్తునట్టి కూర్మములే యట యాయన మిగాళ్లు. ఇక కాలియంగుళులలో ఎఱ్ఱని కాంతి గలిగిన నఖము లనెడు చంద్రులయొక్క వెన్నెలలచే భక్తుల యార్తియను చీకటులను బోకార్చి శుభము లొసగునవియట. ఎంతటి భావన! ఎంతటి భక్తి! ఏమి మధురమగు భావము! ఎంత సొగసైన కల్పన!

ఈ రీతిగా నానంద బాష్పములతో, రోమాంచ కంచుకితాంగములతో డగ్గుత్తికతో భగవంతుని దివ్యసుందరాకారమును గానముచేసి చేసి యవశుడై నారాయణభట్టపాదుడు తుట్టతుది కోర్కెగా -

మ. 'నిరతిన్ యోగులకున్ ద్వదంగతతి నెంతేఁ దియ్యనై, ముక్తిమం
దిరమై భక్తుల కోర్కులన్ గురియుచో నీపాదమూలమ్ము స్వ
స్తరుపాళిన్ జిగురొచు గృష్ణ! వెతయంతన్ బాపి నాభావమం
దరుణజ్యోతి స్ఫురించి కూరుచుత బ్రహ్మానందరాజ్యేందిరన్.'

అని యోగులకు నీ సకలాంగములకంటెను మధురముగా దోచునదియు, ముముక్షువులకు మందిరమగునదియు, భక్తులకు గోర్కులను గురియు కల్ప వృక్షపు జిగురాకుగ వెలయునదియు నగు నీ పాదమూలము కృష్ణా! నా చిత్తమున నిత్యముగా నుండి, సకల తాపములను హరించి బ్రహ్మానందము నొసంగునుగాక! యని ముముక్షువునకు పరమప్రార్థ్యమగు పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మానందమును మాత్రము కోరి, నిష్కామ కర్మస్వరూపము భాసిల్లజేసి - 'అరయన్నేరక నీ మహత్త్వ మెది యే నన్నానొ విశ్వేశ! య ప్పురుషమ్మున్ క్షమియింపు-' అని, తన పొరబాటెందేని గలిగెనేమో దానిని క్షమింపుమనుచు - నా సూక్తి నీ దయకు పాత్రమగుగాక - యని తా నుచ్చరించిన స్తోత్రరూపవాణి కంగరక్ష గోరుచు మంగళముతో గ్రంథము ముగించెను - జన్మమును ధన్య మొనరించుకొనెను. జగత్తును ధన్య మొనరించుకొనెను, వాక్కును ధన్యమొనర్చెను. ఇక, నా మిత్రము సుబ్రహ్మణ్యదీక్షిత కవిరత్నము అక్షరాక్షరముగ నారాయణీయము మూలమునంతయు జదివి తనలో దానే మురియుచు నూరకుండక యాద్యంతము నాంధ్రీకరించి యాంధ్రుల స్థిరకృతజ్ఞతకు బాత్రుడగుటవలన ధన్యజీవనుడయ్యె.

గురువాయూరు పురాధినేతయగు శ్రీమన్నారాయణస్వామిదేవుని యవ్యాజ కరుణాకటాక్ష చంద్రికాప్రసారమున బ్రసాదగుణభరితమై, మాధురీధురీణమై యాంధ్ర వాఙ్మయమున కొక నూతనాలంకారముగా నవతరించిన ఈ

నారాయణీయము జగద్వ్యాప్తినొందుటయేకాదు, కేరళదేశమున సంస్కృతనారాయణీయమువలె నాంధ్రదేశమున నింటింట నాబాలగోపాలమునకు నిత్యపారాయణగ్రంథమై, సకలతాప నిర్వాపణమై, కల్లూరు బూర్గుల పావనవంశ ద్వయీ యశఃపతాకయై యాచంద్రతారార్కము మిన్నుముట్టి విలసిల్లుగాక! స్వస్త్యస్తు, సెలవు.

ఇట్లు
విద్వద్విధేయుడు
*కవితాభూషణ, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.*

# పరిచయము

బ్రహ్మశ్రీ విద్వాన్ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు

*ఆంధ్రవిశ్వకళాపరిషత్తు. (రిటైర్డ్)*

భాగవతసారమనదగిన యీ గ్రంథమును కమ్మని తెలుగులో ననువదించి నారాయణభట్టమహోదయుని భావనాలాలిత్యమును ఆంధ్రుల కందించు భాగ్యము మా సుబ్రహ్మణ్యదీక్షితులకు లభించుట ఆతనికి ధన్యతాపాదకము. మాదృశులకు ఆనందదాయకము.

శ్రీ దీక్షితులు అనేక రచనలద్వారమున ఆంధ్రులకు సుపరిచితులు సంస్కృతాంధ్ర కవితాపాటవముతోపాటు నైష్ఠికజీవితము నలవఱచుకొన్న ధన్యజీవి ఆయన యధ్యాపకమార్గము నవలంబించి చాలినంత తీఱిక లేకున్నను సహజసిద్ధమయిన కవితాసాధనతో ఆంధ్రశారద నారాధించుచు బుద్ధిని, వాక్కును, జీవితమును పవిత్రమొనరించుకొనుచున్న సహృదయుడు. ఇందుల కీ నారాయణీయానువాదమే ప్రబల నిదర్శనము.

ఈ యనువాదము కడుంగడు కౌశలముతో నిర్వహింపబడినది. కంఠోక్తిగా జెప్పినగాని యియ్యది యనువాదమని తెలియనంతటి సహజ సుందరము. సలక్షణమగు పదప్రయోగము, సరళమగు సమాసప్రక్రియ, సరసమగు వాక్యరచనయు గలిగి ప్రసన్న గంభీరమగు శైలిలో నడచిన యీ రచనను ఆమూలచూడముగ ముదమార చవులూర బరికించి, అమితానందము నొందితిని.

ఆంధ్రుల జిహ్వారంగముల నునుపదము నాట్యమాడు తెనుగు నుడికారపు సొంపులు, శ్రీనాథుని సీసపాదముల యొయ్యారపు నడకలు, పెద్దనార్యుని

యల్లిక జిగిబిగులు, ముక్కు తిమ్మనార్యుని ముద్దుపల్కుల సొబగులు, సూరనార్యుని చమత్కృతి సోయగములును నీయన రచనలో నడుగడుగున బొడసూపుచుండును. అట్టి పట్టులు కొన్నిటిని నేను జూపి చెప్పుటకన్న రసికు లన్నిటిని బరికించి యానందించుట సరసమార్గము.

మా దీక్షితు లిట్టి రసవద్గ్రంథము లనేకములు రచించి సరసులగు నభిజ్ఞుల సత్కృతి గౌరవములందుగాక - అని యాశింతును.

"సమానానా ముత్తమశ్లోకో ఽస్తు" అని యాశాసింతును.

# సమీక్ష ౧

*బ్రహ్మశ్రీ చివుకుల సుబ్బరామశాస్త్రిగారు*

*"విద్యాప్రవీణ - ఉభయభాషా ప్రవీణులు"*

కవి గ్రహించిన యితివృత్తమహత్త్వమున కావ్యము చిరస్థాయి యగును. భాగవతమున వైదిక భక్తిస్వరూపము భూమికాభేదమున నిరూపింపబడినది. జ్ఞేయ బ్రహ్మము ప్రాప్యమగు తత్త్వము. ఇందు వర్ణింపబడిన భగవల్లీలావిశేషములకు ఇచ్ఛామాత్రమైన చిద్రూపిణియగు ప్రకృతి ఉపాధి కావుననే శ్రీకృష్ణదర్శన స్పర్శనాది మాత్రముననే భక్తులు కృతార్థులైరి. ఈ గాథ లీ కావ్యమునకు ఇతివృత్తము. నిత్యమగు నితివృత్తముతో కావ్యము స్థాయినందు ననిన ప్రామాణికోక్తి పాటించి తలచిన శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు నారాయణీయమును తెలుగున కనువదించిరి. కర్మోపాసనాది విశేషముల బవిత్రమైన వంశమునజన్మించిన శ్రీ దీక్షితుల సహజ భక్తిభావనాభావితమైన చిత్తమున కీ గ్రంథము హత్తినది. పలువురు కవులు సంస్కృత కావ్యముల నాంధ్రీకరించియు నీ గ్రంథము నంటకుండుట శ్రీ దీక్షితుల పుణ్యవిశేషము. శ్రీ పోతన సహజపాండితీమహిమచే తన జన్మము సార్థక మొనరించిన విధమున వీ రీ కృతిచే తనకబ్బిన కవిత్వాది సంపదల జన్మ సాఫల్యము నందిరి. ఈ రచనచే చిద్విషయభావితమైన చిత్తము శ్రీ కృపావిశేషపాత్రమై ఉత్తరభూమిక నందికొనినది. తత్ఫలముగ 'గురుకృపాలహరి' అను సంస్కృత స్తోత్రము వీరి ముఖమున నవతరించినది.

కవికి స్వతంత్రరచనకంటె అనువాదము శ్రమసాధ్యము. మూలాను సరణమున ధారావాహికమగు శైలి కుంటుపడుచుండును. ఈ యనువాదము స్వతంత్ర రచనగా సాగినది. శ్లోకమునకు సరియగు పద్యమును వ్రాసినను భావమును భావించి తెలుగు దనము నూహించి పదశక్తిని పరిశీలించి

ప్రసాద మాధుర్యాది గుణముల పాటించి గ్రంథమునందు స్వత్వమును సంపాదించుకొనెను.

నామరూపాత్మకమైన ప్రపంచమున ముందు శబ్దమును పిదప అర్థమును గ్రహించుట జీవి స్వభావము, శబ్దార్థముల అవినాభావస్థితిని ప్రకృతి పురుషుల సామ్యస్థితిగ గుర్తించుట సమ్యగ్దర్శనము. రెండు నొకటియని తెలియుట జ్ఞానము. భాగవతమున శ్రీకృష్ణుడు చిత్ప్రకృతియగు పరదేవతయనియు, పురుషుడనియు శ్రీ వ్యాసభగవానులు వర్ణించిరి. ఈ యలౌకిక జ్ఞానమునకు వ్యక్త నామ రూపములు ప్రథమ సాధనములు, నామరూపముల సూక్ష్మదశయగు నాదవృత్తుల యద్వైతస్థితిని చూరగొనిన సిద్ధుల వాక్కును వెన్నంటి అర్థము పరుగిడును. వారు బోధింప దలచిన అర్థము స్వభావ మధురము. దానికి తోడై శబ్దమాధుర్యము స్ఫురించుచుండును. ఈ శబ్దార్థ ప్రతిపత్తినే కవికుల తిలకుడగు కాళిదాసు 'వాగర్థావివ సంపృక్తౌ' అనుచు, నాకాంక్షించెను. శ్రీ జయదేవ, లీలాశుక, నారాయణతీర్థ, శంకర భగవత్పాదాదుల కవితయం దీ లక్షణము సమగ్రముగ నున్నది. వారు కవులుగ కీర్తి నందలేదు. ఆచార్యులు, భక్తులు నగువారు అన్నిట ప్రమాణభూతులై వెలసిరి. పోతన యీ శ్రేణికి జెందిన తెలుగుకవి. 'మందార మకరంద మాధుర్యమునఁదేలు' పోతన పద్యమును విని ఆనందింపనివాడు పండిత పామరులలో నేడి? అందలి శబ్దము అర్థము రెండును బ్రహ్మ ప్రతీకములై ఆనందానుభవమును లేశమాత్రముగనైన అనుభవమున గోచరింపజేయును. ఈ శబ్దవైచిత్రిని ఆలంకారికుల శబ్దాలంకార లక్షణములతో పోల్చుకొని శబ్దాలంకార ప్రచురమయిన చోట దీని నధమకావ్యముగ నెన్న నను వు గాదు. స్వర భావములకు పాత్రమైన భగవద్భావ మధురమైన అర్థమును స్ఫురింపజేయుట యిందుగల అసాధారణగుణము, భక్తి రసప్లావితమైన భాగవతమును భగవన్మహిమానుభవ సిద్ధుడగు పోతన తెలుగున నందించుట తెలుగువారి అదృష్టము.

ఆంధ్రీకృతమగు నారాయణీయము విషయమునను శబ్దార్థ సామ్యమునను ఆంధ్ర భాగవతమునకు క్లుప్తరూపమనదగియున్నది. నిరంతరము శ్రీమద్రామాయణ పారాయణాదులచే రామతత్త్వము భావించిన యిక్కవి శ్రీ రామకృష్ణరాయకవితో సౌభ్రాత్రము నందుకొనెను. వీరిరువురు శ్రీకృష్ణ ప్రతిరూపమగు శ్రీగురువాయూరు దేవుని కంకితముగ నీ గ్రంథమును సమర్పించుట బంగారునకు తావి యబ్బినట్లైనది.

ఈ కృతిసమర్పణ సమయమున సర్వజ్ఞపీఠాధీశులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సంయమీంద్రులు నారాయణ స్మరణపూర్వమైన తమయాశీస్సులను బ్రహ్మశ్రీ వేదమూర్తులు-ఉత్రవడియం కృష్ణశాస్త్రి వర్యులముఖమున నందజేసిరి.

శ్రీ శాస్త్రిగారి సంస్కృతకవనము శబ్దార్థ మధురమైనది. వారి 'యదునందన వందన శతకము'న శబ్దమాధుర్యము పోతనను మఱపించినది. శ్రీ గురువాయూరు దేవుని దర్శించి వెనువెంటనే పారవశ్యమున నుదయించిన యా శతకము వారి భక్తికి నిదానము.

శ్రీ శ్రీ శ్రీ

# సమీక్ష ౨

*'కవిత్వవేది' బ్రహ్మశ్రీ కల్లూరి వెంకటనారాయణరావు, ఎం.ఏ.*

నిర్భరగురుభక్త్యావిర్భూతానంద సందర్భులగు, కవిరాజు శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు నిరాఘాటధాటీసమాటోపముతో నిస్తుల కమనీయ, నియమితమధుర పదసమన్వయ, నిరర్గళవిన్యాసముతో, తెలుగువారి పుణ్యామా యనునట్లు నారాయణీయమును తేటతెల్లముగ తెనిగించిరి. అచుంబితయగు కుముద కోరకకన్య కనులువిచ్చి యలరునప్పుడే యుదయించు కిరణము లమృత ప్రకాశము నంకించిన తెఱగున నాంధ్రీకృత నారాయణీయమునకు నాదికవికి దేవుడగు గురువాయూరు నారాయణుడే కృతి నంకిత మొనర్చుకున్నాడు. ఈ భాగ్య మదృష్ట వంతులకుగాక నొరులకెట్లు ప్రాప్తమగును!

శ్రీ దీక్షితులు మొదటిసమావేశముననే తానేదో సభలో నవసరముగ రచించిన యొక వృత్తమాలను వినిపించినాడు. ఆ శబ్దధార మా యవ్యాజ స్నేహమువలెనే యచర్చనీయావ్యక్త వ్యక్త మాధుర్యమై, నా శ్రుతికి హాయి నొదవించినది. అప్పుడే నేనంటిని కదా, మీ రేదేని మహాకావ్యమును బల్కు డది రసవత్తరముగ భాసిల్లునని! నా యభిలాష ఫలోన్ముఖమై, యీ నారాయణీయ ఫలము వారి స్వీయ సారస్వతోద్యాన రసాలమునుండి విగళితమై యాంధ్రుల దోసిట బడినది. నే నెట్టి వాఙ్మాధుర్య మీ కవిరాజు వాక్కులలో నుల్లసించునని యనుకొంటినో యంతయు నించుమించుగా నారాయణీయమున నంతర్లీనమై ప్రవించుచున్నది.

శ్రీ కృష్ణకర్ణామృతములో, భర్తృహరి సుభాషితాంధ్రీకరణములో, భద్రాద్రి గోపన్నగారి దాశరథిశతకములో, ముఖ్యముగా, పోతనభాగవతములో ప్రతిబింబించిన తెలుగు నుడికారపు (గీర్వాణ వాణీ సమ్మేళనకాలపు) నిసర్గ మాధురి యిందును లీనమై, కృతి కొక వైశిష్ట్యమును ప్రతిపాదించుచున్నది. కృతియో ప్రసిద్ధమైనది. కవికి దానిని సవరించు నధికారమా లేదు! కాని,

యుదాహృత విషయమును ఆది గ్రంథములో వలెనే విశదముగ మధురముగ, హృదయంగమముగ పాడుటయందే విశేష మీ కృతిలో స్ఫుటమై పాఠకులకు విందొనరించుచు, ఆంధ్రీకరణ ప్రయోజన పారమ్యమును నిస్సందేహముగ సాధించినది. కావుననే నారాయణీయ మాంధ్రలోకమునకు సమ్మాన్య మగుచున్నది.

అందు ఆశ్చర్యమేమియు లేదు! కవియే చెప్పుకొన్నాడు కదా! 'మధురాంధ్ర వచఃశ్రుతి మేళవించి, వాణీ కరకంకణక్వణన నిస్సృత తాళలయానుకూల తంత్రీకుల నిస్సరత్ స్వరధునీమయ తానవితాన మూర్ఛనా ప్రాకట రాగ భావమయ భక్తి విపంచి వహించి మీటితి' నని! ఔనౌను! 'తత్త్వమాకందము దయారస మూలకంద మైనది! భావుకులు సుగ్రహమైన విగ్రహమునందే తన్మయులు! సుదాంభస్సింధు పూరమ్ములు! చిద్రసార్ద్ర మధురమ్ములు! కందొవకు నందియు నందనివి!'అందును భూమియందు జలమందున వెల్గిన గాలి నాకసమ్మందు మహత్తునం బ్రకృతియంద'నుచో భాగవత సప్తమస్కంధము మనస్సును దాకుచున్నది! జలదశ్యామ కలాయ కోమల కలాచక్రములను, తామరతంపరగాగ జీవ దేహములను, నాసీమాంతవిశ్వమ్మును చూచుచున్నాము. "అభంగభంగరుఘషనక్ర క్రాంతి భ్రామ్యత్తిమింగిల కల్లోలితమైన జలముల' లో నిల్చి వరాహమూర్తి 'వందిబృందముల కచ్ఛపువెన్నెల లారబోసి' నాడు "అత్యుచ్చైః పాతితముష్టిఘాతములు.' కర్ణతాడితము, బగుచునే యున్నవి. కూటకిటి దేవవిద్విషత్కీటముల గీటునేఁ బుచ్చిన' తర్వాత 'బంధమగున్ మనమ్ము గుణ బంధమునన్ బడెనేని' యన్నాడు కపిలుడు. పద్యాంతర సవరణ మనవసర మనుకొందును. ఏలయన భక్తియోగ మీ బంధము ద్రెంచు నన్నది స్పష్టముగనేయున్నది. 'కంతు డనంత లీలలన్ రంతులు సేసియున్' ముని మొల్కనవ్వులచే నూర్వశిని పుట్టించినాడు. ధ్రువ ఋషభాదుల చరిత్రలు మనోహరములుగా కథితములైనవి. 'నభోవలయోల్లంఘి ఘనాఘన ప్రతిఘన ప్రధ్వాన నిర్ధావితాఖిల ఘోరాసురమౌ' నృసింహలీలయు, గరుత్మద్వాహనారూఢుడై శ్రీహరి సార్వాత్మ్యముతో దీపించుటయు, గుభులు గుభుల్లటంచు దుగ్ధపయోధిని ద్రచ్చుటయు, మోహినీ వామన పరశురామ రామావతారములును ముగిసిపోయినవి. 36వ దశకమున నారంభమైన శ్రీ కృష్ణ కథామృతము, 90వ దశకము వరకు నేకనిర్ఝరిణిగా ప్రవహించినది. అయిదు వందల యేబది పద్యము లమోఘవాక్పటిమతో జాలువారినవి. 'చిప్పిలుకొంచు, వలనొప్పన్, పచ్చని పచ్చికల్, చారువిలోకనల్, ఓయి చిరాయువై మనఁ గదోయి, నీ దరికేగుదెంచు, అదుగో గోచరమయ్యె' మున్నగు

పద్యములలో తెలుగుదన మాస్వాద్యమే కాని, యీరక చెప్పిన తనివితీరు టెట్లు? 69వ దశకము రాసక్రీడలలోని పద్యములన్నియు భావానుగుణములై, రసోన్మాదముతో, శబ్దార్థ సమైక్యతలో సమసించినవి. మన మనస్సులుకూడా 'కుతుకాకులమ్ము' లగుచున్నవి. ఆ పిదప తత్త్వబోధనలో కూడ కవి తన చేయి నవలీలగా నెత్తి, కథా విపంచిలో శ్రుతిని గల్పినాడు; 'ఏమేమబ్బిన నీక యర్పితము తండ్రీ!' యనుటలో శరణాగతి పరాకాష్ఠను వర్ణించినాడు. ఆ శ్రీకృష్ణుని 'కృపాకల్లోలస్మితము'నకు ముగ్ధుడై, నారాయణభట్టుతో తాదాత్మ్యమొంది యతడనని మంత్రరహస్యమును బయలు పెట్టుచు, 'ఆలీన శ్రీరశనాలలన్మణిగణ క్లీం కింకిణీ నిక్వణుం' డగు భగవానుని కని ధ్యానించినాడు. గ్రంథము మంగళాష్టకముతో శాంతించినది. శ్రీ గురుకృప కవి కృతి కొక సోయగము సంపాదించి పెట్టినది.

సహృదయులగు పాఠకులకు నతులితానంద సంధాయకంబు, శబ్దబ్రహ్మ కళోపాసనాధామము నగు నారాయణీయాంధ్రీకృతి సార్థకము, రసోల్లసితము, మధుర భావ బంధురము, దివ్యధారా శృంగార సముజ్జ్వలమునై యలరారుచున్నదనుట నిస్సంశయము. మనమును కవితోపా టిట్లందము గాక!

"కురుతా మాయు రనామయం కృతిరియం వో బ్రహ్మవిద్యాం శ్రియమ్".

స్వకపోల కల్పిత కథారచయితలకు సుప్రయోజ్య శబ్దస్ఫూర్తి, రమణీయార్థ నిస్సృతి, వివిధభావావిష్కరణానుగుణ రససంపూర్తి యావశ్యకములు. ఒక్క భావములు తప్ప తక్కినవన్నియు సదనువాదులకు గూడ నావశ్యకములే కదా! భావములు మార్చుట కనువాదులకు నాంధ్రీకరణ కర్తలకు నభిలషణీయము కాదు. కాని యాద్యగ్రంథములోని యున్నతిని, మధురిమను, నూతనభాషలోనికి వడపోయుట సామాన్యకార్యము కాదు. వాల్మీకి రామాయణము నేటికిని సమగ్ర రామణీయకతతో తెలిగింప లేదన్న నసత్యోక్తి కాదు. కాన సరియైన తెలిగింపు -(తొలి కావ్యములోని వలపులు మలి కావ్యమున నుండునట్లు సేత)- సులభసాధ్యము కాదు. అయినను దుర్ఘటమగు నీ యత్న మీ యాంధ్ర నారాయణీయ కర్త కవిఘ్నముగ నెఱవేఱినది. కావ్యము మనోహరముగా సాగిపోయి, కవిరాజు సిద్ధహస్తమును జయమాల యలంకరించినది.

ఓం స్వస్తి.

శ్రీ గురుభ్యోనమః

# ప్రస్తావన

## శ్రీ కృప

గురురూపమై ప్రత్యక్షమైనతర్వాత నా జాతకమొక క్రొత్తమలుపు దిఱిగినది. జన్మాంతర పుణ్యావాసన లుద్బుద్ధము లైనవి. వాల్మీకి వ్యాసాద్యార్ష భారతీ ప్రకాశరూపమున నూతన రూపకల్పనము జరిగినది. అంతట -

జన్మ గోదావరీతీరే శర్మ కృష్ణాసరిత్తటే,
ద్వితీయం జన్మ కావేర్యా మహో! భాగ్యం మమాద్భుతమ్.

పుట్టువు గోదావరిగట్టున, జీవనము కృష్ణవేణమ్మ యొడిలో. ద్వితీయ జన్మము (జ్ఞానోదయము) కావేరీ తీరమున - నని యిట్లు ముగ్గురు తల్లుల ముద్దుబిడ్డడనైనా ననిపించినది.

అక్షరాభ్యాసము లౌకికవిద్య బ్రహ్మోపదేశాదులు వృత్తి నిర్వహణముగా నడిచిన ఆ యా యోగదశలలో నడుమ గల్గిన యొడిదుడుకులలో నతృప్తి యొక వంక, వ్యాసపురాణానువాద పరిశీలనలో సంతృప్తి యొకవంకగ నన్నుఱ్ఱూతలూపగ-

నిస్తరంగ నిరాకుల నీరధినయి
జడుఁడనై యుండఁగోరెద జన్మశతము -

అని సగముసగము చెఱుపుమఱుపుకంటె జడత్వమే మే లనుకొను వేదనకు గురియైతిని. అది నిజముగ మతిభ్రంశము కాదగిన ఘట్టము. కాని, రామాయణమునకు నాందిగ క్రౌంచమిథున నిమిత్తమున వాల్మీకులకు గల్గిన ఆవేదనకు, గీతోపదేశమునకు మున్ను అర్జునునికి గల్గిన విషాదమునకు, శ్రీమద్భాగవతావతరణమునకు మంగళాచరణముగ పరీక్షిత్తునకు గల్గిన వేదనకు, నాకు గల్గిన యీ నిర్వేదమునకు, నంతర మెంతో లేదు. కావున నంతలో నంతకు మున్ను మనసు నలముకొన్న వాసనలు బయల జిమ్ముకొనివచ్చి బాధగురువులను ముళ్ళకంచెలనుండి తప్పించి ఆ నాడు వారిని నారద-శ్రీకృష్ణ-శ్రీశుకాచార్యుల సన్నిధికట్లు నన్ను బోధగురువుల చరణారవిందముల

దరికి విసరినవి. తన్నిన బూర్లగంపమీదబడె నన్నట్లు జగద్గురువుల యొడిలో శిశువు నైనాడను. అప్పుడు నేను గోరిన నిస్తరంగ నిరాకులనీరధి వట్టి నీరధియే కాదు గురుకృపామృతవారిధి యైనది. ఆ లహరిలో నిప్పు డోలలాడుచు నిట్లు పాడుకొనుచున్నాను:

'మహాయోగాస్సర్వే గ్రహగతి సమాయోగవశగాః
క్షయం భోగాద్యాంతి క్షణికసుఖమాత్రాః పునరయమ్,
గురోర్యోగో భోగాదుపచితి మహో యా త్యవిరతం
సుఖంసూతే సచ్చిన్మయ మనుగతో ఉనుగ్రహబలాత్.'

గ్రహగతిచే యోగించు మహాయోగములు క్షణిక సుఖలేశ మాత్రములు భోగానుభవమైనకొలది క్షీణించునవి; కేవలము అనుగ్రహగతిచే యోగించు గురుమహారాజ యోగమో నిత్యసత్యసుఖ ప్రసవము. కేవలాత్మానందరూపము కావున భోగానుభవమైన కొలది పెరుగును- అని. ఈ స్ఫురణలో నా వేదన యణగినది కాని, దాని చోటులో మఱియొక వింత వేదన యిరవుకొన్నది. గురు కృపామృతము ధారాపాతముగ కుంభవృష్టిగ మీదబడుచున్నది. కాని, దాని నాస్వాదింపగల పాటవము నా యింద్రియములకు లేదే యని-అవి చిన్న సొట్ట చెంబులని, అందులకు మీరా మీరా యని యెరవు చెంబుల కూరిమీద బడవలసి వచ్చినది. దాని పరిణామమే ఆంధ్రప్రభలో జగద్గురుచరిత్ర ప్రకాశము, నారాయణీయము తెనిగింపు, గురు కృపాలహరియను సంస్కృత స్వతంత్రకావ్యరచన మున్నగునవి.

ఈ ఉత్కటానందదశలో ప్రకృతము పేర్కొనవలసిన మిత్రులు మదరాసుహైకోర్టు న్యాయమూర్తి కీ.శే. చింతగుంటరాఘవరావుగారు, ఆయన పక్షపాతము వాతబడి తైలధారాచికిత్సకై కేరళ మేగుట; చిరంజీవి మా తమ్ముని వీరభద్రశాస్త్రిని వెంటగొని యాదేశమందు ప్రసిద్ధమైన నారాయణీయమును పారాయణ సేయించుటయే కాక నా కవితపై మక్కువతో పారితోషికముతో దానిని దెనింగింపుడని నాకంపుట- యిది నా ఆనందరససనిధిలో లేచిన ఒక చిన్న అల. అందూగి యూగి నా పాడిన పాటయే యీ నారాయణీయాంధ్రీకరణము. ఇది రాఘవరావుగారిని వ్యాధివిముక్తులను గావించి తిరిగి న్యాయాధీశస్థానమున గూర్చుండజేసినది.

## మేల్పుత్తూరు నారాయణభట్టాత్రిః

ఈయన కేరళదేశములో దక్షిణమలబారులో నీలానది(భారత పూజానది) ఉత్తరతీరమున తిరునావాయి అనుగ్రామమందు మేల్పుత్తూరు అను (ఉపరినవ) అనుగ్రామముపేరు ఇంటిపేరుగా గల నంబూద్రి బ్రాహ్మణ కుటుంబమందు క్రీ.శ.1559-60లో జన్మించెను. ఈయన తండ్రి మాతృదత్తుడు. న్యాయవేదాంత మీమాంసాపండితుడు. భట్టాత్రి ఆయనకు జ్యేష్ఠుడు. రెండవ కుమారుడు మాతృదత్తుడు కూడ పండితుడు కవియు. నారాయణభట్టు మాధవాచార్యులవలన వేదములు, అచ్యుతార్యునివలన వ్యాకరణము, దామోదరునివలన న్యాయము, తండ్రివలన మీమాంసయు, పఠించెను. వ్యాకరణ గురువు అచ్యుతపిషారిటీ త్రికంటియార్ గ్రామవాసి. జ్యోతిశ్శాస్త్ర మందును పండితుడు. నారాయణభట్టు పండితవంశ్యుడైకూడ బాల్యములో చదువునందు శ్రద్ధ లేకుండెను. కాని, వయస్సు వచ్చినకొలది యాతనిసంస్కారములు శుభవాసనలును ఉద్బుద్ధములు కాజొచ్చెను. అతడు చంపకేశ్వరి (అంపలపూజ) అను గ్రామమునకు బ్రాహ్మణ జమీందారైన దేవనారాయణుని ప్రోత్సాహముచే 'ప్రక్రియా సర్వస్వము' అను వ్యాకరణశాస్త్ర గ్రంథము రచించెను. ఇది భట్టోజీదీక్షితుల సిద్ధాంతకౌముదివంటిది. (ముద్రితమయి యున్నది). దీక్షితులు కేరళమున నారాయణభట్టాత్రిని జూడ ప్రయాణమై చని, త్రోవలో పరమపదించిరని వినికిడి.

నారాయణీయము- ఇది శ్రీమద్భాగవత సంగ్రహము.

ఇది యీయనను పక్షవాత వ్యాధివిముక్తుని ముక్తుని గూడ చేసిన మహాగ్రంథము. దీని మూలముననే యీయన యశస్సు దిగంత విశ్రాంతమైనది. కేరళమందలి రాజులందరి గౌరవమునకు పాత్రమొనరించినది. ఈయనభక్తి కిది నికషోపలము. వివరము లిందు నా పద్యరూపరచనయందు జూడగోరెదను.

అపాణినీయ ప్రామాణ్యసాధన - ఈయన పాణినిని కేవలము గ్రుడ్డిగ ననుసరింపక స్వతంత్రప్రస్థానముగా నీ గ్రంథము రచించెను. దీనివలన నానాటి వైయాకరణులతో వివాదపడెను గూడ. అయినను బాణినీయము సాధింపలేని కొన్ని ప్రయోగములను ఈయన సాధించెను. ఇది వ్యాకరణమం దితనికి విశిష్టస్థానమును జేకూర్చెను.

ఈయన తన యిరువదియేడవ సంవత్సరము వయస్సులో అనగా క్రీ.శ. 1587లో నారాయణీయ రచన ముగించినట్లు ఆ సంఖ్య నారాయణీయము

చివరి మంగళాశాసనమున - 'ఆయు రారోగ్య సౌఖ్యమ్' అను పదముచే మనకు తెలియును. నారాయణీయము ముగించి స్వామి ముఖమంటపమున భజన సేయుచుండ భగవంతుని యనుగ్రహముచే పక్షవాతవ్యాధి విముక్తుడైనపుడు సాక్షాత్ శ్రీకృష్ణ దర్శనభాగ్యమంది- యామూర్తిని దాను చూచిన దానిని చూచినట్లు చేసిన వర్ణనము అగ్రేపశ్యామి అను చివరి 100 వ దశకము - అంతకుమున్ను యత్త్రైలోక్య మహీయసోపి మహితమ్- కాళియమర్దనము-అన్నిటికంటె పరమాద్భుత రసస్థానము, రాసక్రీడా ఘట్టము మన కాయన భక్తి యొక్క పరమోన్నతస్థాయిని వ్యక్తము చేయుచున్నవి. రాసక్రీడ పదిశ్లోకములు స్వర లయానుకూలముగ కథాకళి యను నృత్యవిశేషమందు మలబారులో నే దభినయింపబడుచున్నవి. ఆ యందముచూచి తెలియవలసినదే. కేరళ మందీ గ్రంథ మాబాలగోపాల మింటింట పారాయణ చేయబడి అభీష్ట సిద్ధి నిచ్చుచున్నది. ఈ మధ్యనే సెంబై వైద్యనాథయ్యరు అను మహా సంగీతవిద్వాంసులు కంఠము పూడిపోగా స్వామిపాదముల బడి యీ గ్రంథము పారాయణచేసి ఒక వారములో మధుర స్వరలాభమంది తాను జేయు సంగీతకచేరీకి నిర్ణయించుకొన్న మొత్తములో సగము స్వామికి పంపి మిగత సగము మాత్రమే తా ననుభవించెనని- ఇత్యాదిగ స్వామివారి ప్రభావవిశేషములెన్నో కథలు వినిపించుచున్నవి. నమ్మి చెడినవారు లేరు. విశ్వాసాయ నమ స్తుభ్యం! నారాయణభట్టు సంపూర్ణారోగ్య భాగ్యములతో 88 సంవత్సరములు సుఖముగా జీవించెను. ఆయన గ్రంథములు: 1.కవితాసారస్వతము-నారాయణీయము, 2.శ్రీపాదసప్తతి, 3.గురువాయూరుపురేశ స్తోత్రము, 4.చంపూప్రబంధములు, 5.నానారాజ ప్రశస్తులు.

*శాస్త్రరచనలు:* 1.మానమేయోదయము-మానపరిచ్ఛేదము-ఇది న్యాయ మీమాంసా శాస్త్రవిషయము, 2. ప్రక్రియాసర్వస్వమ్ (క్రీ.శ.1617), 3.ధాతుకావ్యమ్, 4. అపాణినీయప్రామాణ్యసాధన, 5. తంత్రవార్తిక నిబంధనమ్. *చంపూప్రబంధములు* ; కేరళమందు పురాణ ప్రవచనము (కుట్టు) వృత్తిగాగల పౌరాణికులు (చాక్యారులు) దేవాలయములందు నిత్యపారాయణలో బెట్టిన వీతని విరువది ప్రబంధము లున్నవి. అందు మహాభారతకథలు - 1.రాజసూయము, 2. దూత వాక్యము, 3. పాంచాలీస్వయంవరము, 4. నాలాయనీ చరితమ్, 5. సుందోపసుందోపాఖ్యానము, 6. సుభద్రార్జునము, 7.కౌంతేయ-శతకము, 8.కిరాతము 9.కైలాసవర్ణము. భాగవతకథలు :

1.మత్స్యావతారము, 2.నృగమోక్షము. రామాయణకథలు : 1.రాక్షసోత్పత్తి, 2.అహల్యా మోక్షము, 3.బాలకాండము, 4.నిరనునాశిక ప్రబంధము. శివస్తోత్రములు : 1. దక్షయజ్ఞము, 2. త్రిపుర దహనము. ఇతర చంపువులు: 1. అష్టమిచంపు, 2. స్వాహాసుధాకరము, 3.కోటివిరహము, నానారాజప్రశస్తులు: 1. మాటమహేశ ప్రశస్తి (కొచ్చిన్ ప్రభువు వీరకేరళవర్మస్తుతి), 2.బింబాలిశప్రశస్తి (వట్టక్కుమార్తేడు గోదావర్మస్తుతి). 3.దేవనారాయణ ప్రశస్తి, 4.మానవిక్రమప్రశస్తి (కేలికట్టు జమీందారు మానవిక్రముని స్తుతి).

## వినతి

ఈ నాగ్రంథముపై భూమికాసమీక్షలను అనుగ్రహించిన మహాపండితులకు నా ప్రణామములు. నన్నుగూర్చిన సత్యమును పేర్కొనియు, నందు శ్రీ జగద్గురుచరణారవిందభక్తి మాధుర్యమును నాతో బాలుపంచికొని వివశులై తమసహజ మృదుమధురసారస్వత రీతిచే స్వభావోక్తి సతిశయోక్త్యలంకార మునిపించిన సగోత్రులు చిరంజీవులు శ్రీనుదురుమాటివేంకటరమణశర్మగారి కితోధిక గురుభక్తిభరిత సకల సంపత్సమృద్ధులు గలుగుగాక యను నా దీవన సఫలముచేయ శ్రీవారికి వినతిసేయుచున్నాను.

"మంగళంరుక్మిణీ మాధుర్య ధుర్యాయ
మంగళం గోపాలమణివరాయ
మంగళం శ్రీపద్మమాలికా కౌస్తుభా
భరణాయ రాధికావల్లభాయ
మంగళం మానినీమదనాయ శార్ఙిణే
మంగళం గోపికా సంగతాయ.
మంగళం గురువాయుమన్దిరావాసాయ
మంగళంభక్తహృన్మందిరాయ
మంగళం భవ్యగుణమణి మణికుటుంబ
రక్షణ విచక్షణదయార్ద్ర వీక్షణాయ
మంగళం దీక్షిత స్తుతిమంగళాయ
మంగళం సర్వమంగళమంగళాయ"

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

శ్రీత్రిపురసుందరీ చంద్రమౌళీశ్వరాత్మక

శ్రీజగద్గురు గురువాయూరు శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

# నారాయణీయము

## మఙ్గళాచరణము

శ్రీసంపన్మయి వాఙ్మయిన్ శివమయిన్ సేవింతు మశ్రాంతమున్
శ్రీసూక్తార్థ నిధానయై సుకవితా శ్రేయఃపదాధానయై
వ్యాసప్రోక్త పురాణభాగవత లక్ష్యాద్వైత సంధానయై
హాసోల్లాస కటాక్షదృష్టి నణిమాద్యైశ్వర్యముల్ గూర్పఁగన్. 1

వెలుఁగుల్ దొంగిలి వేడివేలు పలుకన్ వే మూషికాకారుఁడై
బిలముం జొచ్చె; నతండు వాహనముగా విచ్చేసె నయ్యెల్ల వె
ల్గులకున్ వెల్గగు నాత్మయే గణపతిస్ఫూర్తిన్ "గణానా" మనం
గల మంత్రార్థము యజ్ఞవిఘ్న మడఁపన్, గైమోడ్తు నమ్మూర్తికిన్ 2

ప్రణవమ్మై శ్రుతియై స్వరప్రచురమై రాగమ్ములై తానమూ
ర్ఛనలై భావము వ్యక్తి పల్లవియునై రంజిల్లి సంకీర్తన
మ్మన నౌచున్ లయమంది యాప్రణవమం దానందసాంద్రైక చి
ద్ఘనమౌ వాణివిపంచి వాగ్భవకళన్ ధ్యానింతు నిష్టార్థినై. 3

చిననా డెప్పుడొ స్వప్నజాగృతుల కించిత్సంధిలో ముందుఁ దోఁ
చెను లేనవ్వుల వెన్నెలల్ గురియుచున్ శ్రీనాసికా మౌక్తిక
మ్మొనయంగా నరుణాధరస్ఫురణతో నేమేని నన్ బల్కరిం
చినజాడన్ విలసించె; వాణియగు నా సీమంతినిన్ మ్రొక్కెదన్. 4

తెలుఁగాబాల్యము తీర్చి సంస్కృతములోఁ దియ్యందనమ్మెల్ల నా
కలమం దుంచి స్వకీర్తనాభ్యుదయ సంస్కారమ్ముఁ బండించి న

న్నలరించెన్ గురు సత్కృపాలహరి నోలాడించి యే యమ్మ జ
న్మలయ మ్మిచ్చిన దిందుచూడ యగు శ్రీమాతన్, గురున్ గొల్చెదన్. 5

కవితారీతి సరస్వతీచరణముల్ గైసేసి కైసేయు నీ
భవమం చానతియిచ్చి సారకరుణాపార స్మితజ్యోత్స్నికా
చ్ఛవి నంతర్గత గాఢమోహతమముం జక్కాడి యాలోచనో
త్సవముం జేసిన చంద్రశేఖరయతీంద్రస్వాములన్ మ్రొక్కెదన్. 6

ఎన్నేభాషలఁ దీర్చిదిద్దిననుగా, దెన్నేని జన్మమ్ములం
దన్నా పాడినఁ దీర దాకృపకు లేదప్పా మఱే సామ్యమున్
సున్నై జన్మములెల్ల దుఃఖజలధుల్ శుష్కింపఁగాఁజేయు నా
పన్నానీకశరణ్యమైన గురుదైవజ్యోతికిన్ మ్రొక్కెదన్. 7

నా కవితాలతావనమునం దొలుదొల్త వసంతమయ్యె మా
ఱాకు దొడంగె మొగ్గ విరియై విరిసెన్ నును పచ్చితేనె విం
దై కొసరించె వేలుపుల నట్టి శుభాగమ మంత్రవాదమౌ
కోకిల నెంచెదన్ జిలుకకుం బ్రణతుల్ పచరించెదన్ మదిన్. 8

గీర్వాణాంధ్ర సనాతనాద్యతన సూక్తిబ్రహ్మలన్ నిచ్చలున్
బౌర్వాపర్య మెఱింగి మ్రొక్కెదను మత్ప్రారీప్సిత గ్రంథ గాం
ధర్వమ్మందు శ్రుతిస్వరూపమున నంతర్లీనమై తద్వచ
స్సర్వాంగీణ రసప్రసార మమృతాస్వాదమ్ముఁ జేకూర్పఁగన్. 9

నలువకు నాల్గు నాల్కలట నర్తనమాడెడు నీ తనుప్రభల్
తల కొకదారి వింతగతులన్ మెరయించిన మోసపోయి వా
దులుగొని మచ్చరింతురు బుధుల్ తదుదగ్ర రుషాతమమ్ముపై
వెలువడు నీదు చిర్నగవు వెన్నెలపండువు మాకు భారతీ! 10

అల భద్రాచలరామదాసు మఱి యా త్యాగయ్యఁబోతన్న వ్యా
సుల వాల్మీకుల శ్రీశుకుం దెలిపి లోఁజొక్కించె లీలాశుకో
క్తులఁ గర్ణామృతముం బొనర్చినది మాకుం జిన్ననా డమ్మ ;యా
కళ యేకొంచెమునేని నా కవితలోఁ గన్పించెనా ధన్యుడన్. 11

మునుల జీర్ణకుటీరముల ముంగిళులు విశ్వ
విద్యాలయమ్ములై వెలయునాడు
ఋషిశేఖరోదార హృదయసీమలు జ్ఞాన
భాండారములనంగ వరలునాడు
తపసు లాత్మీయచైతన్య విద్యుద్దీప
కళ జోపి తమమెల్ల గడపునాడు
మునిముఖాబ్జముల జాల్కొను బ్రహ్మకళ కళా
వ్యాఖ్యాన పఙ్క్తులు వ్రాయునాడు
కపటమెఱుఁగక పొరపాటు గనక జ్ఞప్తి
నూను శుకపఙ్క్తి సహపాఠి యైననాడు
నంటినది యొక్క యక్షర మది దలంతు
భారతీయార్ష భారతీవ్యక్తికొఱకు. 12

## స్వీయ వృత్తము

శ్రీశైలమ్ము సమీపసీమ వరలున్ శ్రీమీరు కల్లూరు స
ర్వాశా విశ్రుతి మచ్ఛ్రుతి ప్రవిహిత వ్యాపారు లద్వైత ని
ష్ఠాశీలుల్ హరిభక్తి తత్పరులు శిష్య జ్ఞానవిజ్ఞాన దీ
క్షా శిక్షా నిపుణుల్ చరింతు రట సాక్షాత్పద్మజుల్ సద్విజుల్. 13

శివదీక్షా పరులైన రెడ్డి నృపతుల్ శ్రీ వీరభద్రేశ్వరో
త్సవ సన్నాహముల్ శ్రుతుల్ వినుచు వాంఛన్ జేసి సర్వాగ్ర హా
రవసుశ్రేణుల గాన్కలన్ గొలిపి కోరన్ గౌతమీతీర సీ
మ వసింపంజని రగ్నిహోత్రములతో మా పూర్వు లేనాటనో. 14

రాజులు పిల్వనంపిరని రారు ధనాశకుఁ జిక్కి, బ్రహ్మతే
జోజితచండభానులని చూడ నుపాయనపాణులై మహా
రాజులు నగ్నిహోత్ర గృహరాజి బడిన్ బడిగాపులైరి; యా
రాజులు యాజులున్ గడచిరా రిఁక నెన్నియుగాలు దొర్లినన్. 15

వేంగీరాజ్య రమావినోదలహరీ విశ్వోదయాంతఃపురో
త్సంగాగ్రమ్ములఁ జెంగలించు ద్విజ విద్వద్బాలికాబాల సా
రంగీబాలకురంగముల్ మసలు మా రంగమ్ము యజ్ఞాంగణా
సంగ మ్మద్యతనాంధ్రలక్ష్మికిఁ బ్రతిష్ఠాపీఠమై రంజిలెన్. 16

శిష్టులు తాత తండ్రులు, వశిష్ఠముఖుల్ ఋషు లౌర! పుత్రకా
మేష్టిఫలమ్ము మా జనకుఁ డిందనుకన్ శ్రుతిచోదితక్రియా
దృష్టికి లోటు లేదు; మఱి దీక్షితనామము దక్కె భక్తి సం
శ్లిష్టునిఁ జేయునో పరమశిష్టుని జేయునొ యజ్ఞదీక్షలన్. 17

ఏనుఁ బురాణముల్ పదియు నెన్మిది సేసి తెనుంగు నందనో
ద్యానము సేసితిన్; పలికినంతట మత్కవితాప్రసక్తి యౌ
నౌ ననిపించుకొన్నది; మదర్చన శారద కెన్ని పుట్టులం
దైనదొ సుప్రసన్న యిపుడైనది శ్రీగురుమూర్తి రూపమై 18

ఆడినమాట కచ్చితము; అట్టిటుగా మొగ మిచ్చకమ్ము న
న్నాడఁ గనీదు శారద కదా! కడుపియ్యది చేతఁ బెట్టి న
న్నాడకు నీడ కంపదు; నిరాదర నీరస మూర్ఖగోష్ఠులన్
మేడలక్రింద నన్ నిలువ నీదు; నిజానకు భాగ్యవంతుఁడన్. 19

తమ్ముల్ దక్షిణ వామబాహువులు నా ధైర్యానకుం గోట ల
ర్థమ్ముల్ ధర్మము మోక్షమందు రొకటే తాత్పర్యమై యీ కవి
త్వమ్మంచున్ గురువంచు దైవమనుచు దర్శించి సంసారబం
ధ మ్మొక్కించుక తప్పికోఁ దిరుగఁ దద్భక్తిక్షమల్ హేతువుల్. 20

బెల్లమువండు ప్రొయ్యియయి బిందువు బిందువు చిందు నేడు న
ల్లల్లన ధర్మసార మది యంతట నింతట మా కుటుంబమం
దిల్లలుకంగఁ బండువగునే గురువాయుపురాధినాథ! నీ
చల్లని చూపులం దమృతసారము ధారల విందు వెట్టవే! 21

కులుకుచు నొక్కగుప్పెడటుకుల్ దిని నెచ్చెలి యా కుచేలుని
ల్లలుకఁగ లచ్చిఁ బంపితి; వయారె కవుల్ భవదీయభక్తుల
క్కులుకున నుప్పుగల్ పసిడికొండగ నెంచి వచస్సుధా ప్రవం
తుల మలఁగింతు రాప్తులకు, దోసమె హద్దులులేవు ప్రేమకున్. 22

## గ్రంథ ప్రసక్తి

గంగాతుంగతరంగ భంగిమములోఁ గాశీపురాధీశ్వరా
పాంగస్మేరకిరీటకోటిరుచిలో నా కామకోటీకటీ
సాంగోపాంగ పదక్రమశ్రుతిరణత్స్వర్ణ కాంచీమణీ
సంగీతమ్ముల నోలలాడితిమి నిష్ఠఁదమ్ముడుఁనేనునుఁ. 23

పంచక్రోశపురీ విహారముల నావఁ వ్యాసకాశీపురో
దంచత్తీరము సేరులోన నిటు వ్యాసానుగ్రహస్ఫోరక
మ్మెంచెన్ శ్రీగురుదేవతాకరుణ చేయించెఁ గృతి ప్రార్థనఁ
నిచెఁ శ్రీగురువాయుదైవతకృపానీరంధ్ర దృక్చంద్రికల్. 24

ఏ యెడఁ జూచినఁ హృదయమిచ్చి హరించు ముకుందుమీఁద నా
రాయణభట్టు సెప్పిన మహాకృతి వ్యాకరణప్రయోగ చి
త్రాయితమౌచు సంస్కృతమునం, దది తేటతెనుంగు సేయు భా
గ్యాయతి కేనుఁ బాత్రమగునట్టు లనుగ్రహ మీయవే గురూ! 25

ఏతన్మాత్ర విలాసమౌ ప్రకృతిపైనే మోహ మెవ్వారి కా
రీతిఁ సాహసమంది కొందరు పదక్రీడఁ వినోదింత్రు, నా
కా తీరొప్పదు; చిత్స్వరూపమది నీ వన్నారుకాఁబట్టి, నా
థా! తోచన్వలె మత్కవిత్వబహిరంతర్వ్యాప్తి నీవై గురూ! 26

వాగర్థమ్ములు పార్వతీశ్వరులుగా వర్ణించు సర్వాగమ
శ్రీగాంభీర్యము నాకు బోధపడఁ దండ్రీ! యీ కవిత్వైక దీ

క్షా గమ్యమ్మగు యోగ మూనితి నహంకారాన నిందందు నూ
రేగఁ గాదు సుమీ! కృతార్థునిగ నీవే చేయుమా శ్రీ గురూ! 27

కవి నేనంచు నొకప్పుడేనియు నహంకారమ్ము రానీకు, నా
కవితావైభవ మెల్లఁ జూచితిని జక్కఁ నీదు లేనవ్వులో,
కవి వీవై రవివోలె నామనసునన్ గాలుష్యముంబాపి యం
దవగాహింతువు మత్కవిత్వరుచి యంతా నీవే కాదా ప్రభూ! 28

నాకుఁ గొత్తగుచే "న కశ్చి దకవిర్నా" మన్న వాక్యమ్ము సు
శ్లోకుల్ వ్యాసులు పల్కి రిక్కలిని, నాలోపమ్ము నాకర్థమౌ;
నీకాలానఁ గవుల్ కవిత్వమన నేమే వట్టి హాస్యమ్ము లి
స్సీ! కైవల్యగురుండ వేలవలె నా చేఁదోడువాదోడునై. 29

## కవి ప్రశంస

ముని సుతపఃప్రజాపతియు ముద్దియ పృశ్నియుఁ బద్మనాభ మూ
ర్తిని గొలువన్ వరమ్మొసఁగె శ్రీహరి 'మీకిఁ క మూఁ డు జన్మముల్
దనయుఁ డ నౌదు'నంచుఁ ; దొలిదాన జనించెను బృశ్నిగర్భుఁ డై,
కనె మలి జన్మమం దదితి కశ్యపులం దటు వామనాకృతిన్. 30

వసుధపై దేవకీ వసుదేవులైన వారలకుఁ గృష్ణావతారమునఁ బుట్టి
కంస సంహారమ్ముఁ గావించి ద్వారకానగర నిర్మాణ మంతటన చేసి
మహిఁబద్మవిగ్రహరూపమగు తనదివ్యమూర్తికి సుప్రతిష్ఠ సేసి
యాదవ వంశక్షయమ్మైన వేళ నా ద్వారక తనయంత నీరు చేసి

తాను నేఁ గుచు భక్తజనానుకూల్య
పరత నుద్ధవుచే బృహస్పతికిఁ గబురు
సేసె యాదవ వంశ నిశ్శేష విలయ
రుద్రుఁ డయ్యును దన మూర్తిఁ బ్రోచికొనఁ గ. 31

అమరాచార్యుఁడు శిష్యుఁడౌ పవనుతో నాద్వారకన్ నీటిమ
ధ్యమునన్ దేలఁగఁజూచి యున్నతవిభంగాంతస్సముత్పాత భం
గములం జెందెడు విగ్రహమ్మదియు సాక్షాత్పద్మనాభమ్మ నెం
చి మదిన్ గౌఁగిలి లోనికిం బొదివి యుంచెన్ శిష్యుమూర్ధమ్మునన్.

చనిచని శంకరాజ్ఞఁగొని సాగి క్రమమ్మున నర్మదాతరం
గిణిఁ గని గౌతమిం గొలిచి కృష్ణకు మ్రొక్కి పినాకినీనదిన్
గనుచుఁ గవేరకన్య నటు గాంచి తరించెను దక్షిణాపథ
మ్మునఁ గల పుణ్యతీర్థముల మున్ గురుఁ డెల్ల నదీనదమ్ములన్. 33

ఆనర్తమ్ముఁ దరించి యాంధ్ర మవలై యా చోళ చేరమ్ము లా
పైనిన్ దాటి గురుండు నైఋతివిదిక్పర్యాప్తిఁ బూర్ణానదీ
వ్యానృత్య త్సలిలౌఘ నిర్దళిత తాపాఘౌఘ మా కేరళ
మ్మానందమ్మునఁ జేరె శ్రీపరశురామాస్త్రోద్ధృతాకారమున్ 34

గురుఁడున్ వాయు వటన్ బ్రతిష్ఠ సలుపన్ గొల్వై యనారోగ్య సం
హరణక్రీడనమై నిజాప్తకుల భూమైశ్వర్య సంధాన సుం
దరమౌ విగ్రహమై యటఁ వెలసె నా నారాయణస్వామియే
గురువాయూరన ద్వాపరమ్మున, నెసంగున్ క్షేత్ర మీనాటికిన్. 35

అపుడు జనమేజయుఁ డు సర్పయాగ కలుష
మైన కుష్ఠమ్ము నాత్రేయమౌని బోధ
వలన నిమ్మూర్తి నర్చించి పాచికొనియె
నని పురాణమ్ము లీ స్వామి నభినుతించు. 36

సిరి నిండుకొలువైన యురమునన్ శ్రీవత్స
కౌస్తుభమణిమాలికలు చెలంగ
కృపనిండ విహరించు క్రేఁగంటి తళుకుతో
మకరకుండలకాంతి మైత్రిసేయ

శృంగార మొలికించు చిఱునవ్వు దులకించు
పెదవిపై నమృతమ్ము విందులిడఁగ
జిగి నించు నెమ్మేని మొగిలులో మెఱుపట్లు
కనకాంబరప్రభల్ గ్రందుకొనఁగ

గదయు నభయమ్ము శంఖ చక్రములు నాల్గు
కరములం బూని చుట్టునున్ బరమయోగి
బృందము నుపనిషత్సుందరీ జనమ్ము
దనరు గురువాయుపుర దైవతమును గొలుతు. 37

మును పాంధ్రద్విజరాజపుంగవులలో ముఖ్యుండు శ్రీ శాతవా
హన వంశ్యుండు మయూరశర్మ మళయాళాఖ్యమ్ము నా దేశమే
లె; నటన్ బ్రాహ్మణవంశ మొక్కటియునున్ లేకున్కిఁ గొంపోయి ని
ల్పెను గోదావరితీరవాసులగు సద్విప్రాన్వయశ్రేణులన్. 38

నంబూద్రీలను వారిలో శివగురుం డాఁ దండ్రిగాఁ గాంచి యా
ర్యాంబా గర్భమునన్ జగద్గురువు దానై శంకరాచార్య తే
జం బందుద్భవమొంది సర్వ జగదజ్ఞానాంధకారావభే
దంబుం జేసి యనుగ్రహించినది యద్వైత ప్రతిష్ఠావిధిఁ. 39

తాదృగ్బ్రాహ్మణులందు నాలుగు శతాబ్దాల్ ముందుగా నేటికిం
బ్రాదుర్భావము నొంది యీ కవికిశోర మ్మొక్కటా! యౌవన
ప్రాదుర్భూతి పిషారటీకుల వధూబంధమ్మునన్ జిక్కి వి
ద్యాదూరుండయి; మీఁద నచ్యుత పిషారాఖ్యుండు ప్రేరేపఁగఁ. 40

సలిపెన్ సంస్కృత సాహితీఫలరసాస్వాదమ్ము, శాస్త్రమ్ములన్
నిలిపెన్ బుద్ధిని, బాణినీయమును బానీయమ్ముగాఁ గ్రోలె; న
వ్వలఁ గాణాదము గౌతమ మ్మరసెఁ; గావ్యస్ఫూర్తికిన్ బ్రహ్మయై
వలికెన్ సంస్కృతభాష భక్తిరసవద్భవ్యప్రబంధమ్ములన్. 41

అల నారాయణభట్ట నంబుదిరిపాదాఖ్యాన్ మహాఖ్యాతి న
వ్వల నష్టాదశసంఖ్యసంస్కృతమహాభాషామణీ భూషణ
మ్ములుగాఁ జెప్పెఁ బ్రబంధముల్ హరిపదాంభోజాగ్రజాగ్రద్రసో
జ్జ్వలధారావరివస్యఁ బండిన కవిత్వశ్రీ వధారలన్. 42

భక్తిరసవ త్తదీయ ప్రబంధ సముద
యమ్ము నారాయణప్రభునాజ్ఞచే మ
నోజ్ఞనేపథ్యవిధి నభినేయములుగ
నలరె నాటకరంగమం దనుపమముగ. 43

అక్కట! విప్రబాలకుఁడ వధ్యయనమ్ము విధిప్రయుక్త మి
వెక్కడనేని వేదముల నింకఁ బఠింపుమనం గురుండు "నా
దిక్కనుకొంటి వేర గురుదేవత లే, దటు కాదయేని నా
కిక్కడికింతె దక్కె; చదువెక్కడి కం చెదఁ దృప్తి నందెదన్. 44

ఎన్నోజన్మలకేని నమ్మెదను నిన్నేకో గురు దైవత'
మ్మన, వాత్సల్యము పొంగి జన్మవిధి నా కధ్యాపనప్రాప్తి లే
దని పొమ్మంటి, నిఁ కెందుఁ బోవలదు రమ్మంచుఁ బడిఁ గ్రంథమున్
దన ముందుంచుక సంత సెప్పె నటు వేదమ్మెల్ల సాంగమ్ముగఁ. 45

అధికానందము సెంది శిష్యవినయ మ్మా భక్తి కా జన్మమం
దధికారానకు మించినట్టి పని తానై చేసి మోహాన దు
ర్విధిచేతఁ గనెఁ బక్షవాత మదియుఁ వేధించె నా సత్కృపా
నిధి, ధర్మ మ్మతి కర్కశమ్ము విధియుఁ నిష్పక్షపాత మ్మిలఁ.

గురుఁడట్లుగ్ర రుజార్తుఁ డౌటకుఁ గడుఁ క్షోభించి యా బాధకుం
గుఱి తన్నుంబొనరింప వేడి గురు ముక్తుంజేయ నర్థించి యీ
శ్వరు నర్చించి రుజల్ హరించుకొన నాపైఁ జెప్పె నీ గ్రంథముఁ
గురువాయూరు పురాధిదైవత శిరఃకోటీర రత్నప్రభఁ. 46

మాధవు నాలయమ్ము ముఖమంటపమందు ముకుందనామ సం
బోధనసేసి భాగవత పుణ్యకథల్ దిన మొక్క ఘట్టముఁ
వ్యాధి హరింపుమంచును సహస్రముఖమ్మగు శ్లోకసంఖ్య నా
రాధనసేసి తా భవపరంపర దాటె తొలంగి రోగముఁ. 47

దినముఁ ఘట్ట మొకొక్క టొక్కదశకాప్తిఁ భక్తి వైరాగ్య నం
దనమౌ కృష్ణపదారవింద మెదుటఁ నర్తింప నమ్ముగ్ధమో
హనహాసోల్లసితాధరామృతమయావ్యక్తోక్తి మాధుర్య మొం
దను నారాయణుఁడూదె వేణు విదియుఁ నారాయణీయమ్మునాఁ.

పశ్చిమాబ్ధితరంగపఙ్క్తి నుయ్యేలలూఁగిమలయచందనవనావళుల సాగి
ఏలాలవంగలతాలోలసుమనో వనీవాటి పరిమళశ్రీ వరించి
కాలటీ నామ శంకర జగద్గురు జన్మగేహ వీథుల యాత్ర లాహరించి
రమణీయ కేరళ రమణీమణీ చారుధమ్మిల్ల కుసుమ గంధమ్ము లాని

మలసి గురువాయుపుర రమా మంగళాధి
దేవతా విపులోరఃస్థలీ విరాజ
మాన సుమమాలికా పరిమళ సమీర
చారు కైశోర మాకృతిఁ సంతరించె. 49

ఆ కృతి యస్మదీయ మధురాంధ్ర వచఃశ్రుతి మేళవించి వా
ణీ కరకంకణ క్వణన నిస్సృత తాళలయానుకూల తం
త్రీకుల నిస్సర త్స్వర ధునీమయ తాన వితాన మూర్ఛనా
ప్రాకట రాగ భావమయ భక్తివిపంచి వహించి మీటితిఁ. 50

## సమర్పణము

గురువాయూరు పురీ సుం
దరునకు నారాయణునకు నారాయణ భ

ట్టరచిత సంస్కృత కృత్యం
తర వరనారాయణీయ నందనవనికి౯. 51

శ్రీలలనా ముఖకమల న
వైలా కర్పూరఘుమఘుమమావాసిత తాం
బూలస్వాదు రసాస్వా
దాలక్షిత రాగరంజితాధరమణికి౯. 52

కేరళలక్ష్మీకృత క
స్తూరీపరిమళిత తిలకశోభి లలాట
శ్రీరుచిరున కురుకరుణా
పూరస్మిత మధురమధుర ముఖకమలునకు౯ 53

దీక్షితకృతికన్యా సం
రక్షా స్వీకరణ పరమరస కేరళరా
జ్యక్షేమైక సమర్థా
ధ్యక్షాయిత గురుమరుత్పురామరమణికిన్. 54

వ. నీకు సమర్పణమ్ముగా నంకిత మొనరించుచున్న నా ఆంధ్రీకృత 'నారాయణీయ' ప్రబంధ మ్మిదె దేవా! అవధరింపుము.

శ్రీ

# నారాయణీయము

## ప్రథమ దశకము

## భగవత్తత్త్వము

సాంద్రానందావబోధాత్మక మనుపమితం దేశకాలావధిభ్యాం
నిర్ముక్తం నిత్యముక్తం నిగమశతసహస్రేణ నిర్భాస్యమానమ్,
అస్పష్టం దృష్టమాత్రే పున రురుపురుషార్థాత్మకం బ్రహ్మతత్త్వం
తత్తావద్భాతి సాక్షా ద్గురుపవనపురే హంత భాగ్యం జనానామ్. 1

తెలుగు అనువాదము

**అందఱి భాగ్యమై శతసహస్ర పర శ్రుతిభాస్యమై చిదా**
**నందఘనమ్ము బ్రహ్మము ననందగు తత్త్వము కన్నమాత్రలో,**
**నందని మోక్ష మెట్టయెదురైన దహో!గురువాయు మందిర**
**మ్మం దిదె దేశకాలతులనాది విముక్తము నిత్యముక్తమై.**

భావము

ఆనందఘనము జ్ఞానఘనము నిరుపమానము దేశ కాల పరిమితులకు అతీతము(పరిపూర్ణము), నిత్యముక్తము, వందలువేలునైన ఉపనిషత్తులచే భాసించునది, చూచినంతమాత్రముచే నందని యందము కేవల మోక్ష, పురుషార్థమునైన బ్రహ్మపదార్థము అందఱికును-అనగా సామాన్యులకు సాకారముగను, యోగులకు నిరాకారముగను గురువాయూరు పురమందు అనేక జన్మ పుణ్యపరిపాక రూపమయి భాగ్యదేవతయై ప్రత్యక్ష మగుచున్నది.

## విశేషవివరణము

శ్రీమద్భాగవతము మోక్షగ్రంథము. వేదవ్యాసభగవానులు బ్రహ్మసూత్రములు, అష్టాదశ పురాణములు, భారతేతిహాసమును లోకానుగ్రహమునకై రచించియు చిత్తశాంతి పడయనేరక, నారదోపదేశముచే శ్రీ భగవద్గుణానువర్ణనప్రధానముగ భాగవతశాస్త్రమును పదునెన్మిదివేల శ్లోకములందు రచించిరి. ఆ గ్రంథ ప్రారంభ మంగళ శ్లోకమునందు భగవంతునియొక్క స్వరూప తటస్థలక్షణములు, గాయత్రీమంత్రార్థము ధ్వనింపజేయబడినవి. కేరళ దేశీయుడగు నారాయణభట్టాత్రి మహాకవి పక్షవాతవ్యాధికి గురియై శ్రీమద్భాగవత ప్రధాన ఘట్టము లన్నిటిని ప్రతిదినము పదేసి శ్లోకములవంతున గురువాయూరు కృష్ణ విగ్రహము నెదుట గూర్చుండి నూరు దినములలో వేయి శ్లోకములుగ 'నారాయణీయము' అను ప్రబంధమును రచించి భగవత్సాక్షాత్కారమంది రోగముక్తిని ముక్తిని గూడ బడసెనందురు. ఆ గ్రంథ ప్రథమ మంగళశ్లోక మిది. ఇందులోగూడ శ్రీమద్భాగవత మంగళశ్లోక తాత్పర్యమగు భగవత్తత్త్వము చక్కగా నిరూపింపబడినది. ఇందు ప్రతి పాద్యము నారాయణాత్మక పరబ్రహ్మము. ప్రయోజనము బ్రహ్మప్రాప్తి. అధికారులు భాగ్యవంతులు, భక్తుల పాలి భాగ్యదేవతయై గురువాయూరుపురమందు భాసించుచున్న శ్రీకృష్ణమూర్తి అనేకజన్మ పుణ్య పరిపాకముగ సర్వజనులకు సాకారమును, విశుద్ధచిత్తులైన యోగులకు నిరాకారమునై దర్శన మిచ్చుచున్నది. అది చిదానంద ఘనము - అనగా జ్ఞానఘనము, ఆనందఘనమును. వైషయికమయిన తెలివిగాని ఆనందముగాని విషయము లెడమయినపు డుండవు. ఖండఖండము లగును. విషయనిరపేక్షముగ అనుస్యూతమైన జ్ఞానము, ఆనందము మాత్రమే యెడము లేక అఖండమై స్ఫురించును. అది కేవలము నిరాకారము నిష్కలమునైనను ఏ రంగులేని నీరు చలువకు గడ్డకట్టి మంచు అయినట్లు, భక్తుని హృదయ మందలి పరమప్రేమరూపమైన చలువకు ఘనీభవించి కృష్ణరూపమున సాక్షాత్కరించినది, అందుచేతనే అది దేశకాలావధులకు అతీతము, నిత్యముక్తము నైయున్నది. అనగా ఆకాశమట్లు అమూర్తము, కూటస్థమునై యున్న చైతన్య మన్నమాట. కావున నది అనుపమితమును 'చిదానందఘనము' అనుటలో స్వరూప లక్షణము. దేశ కాల తులనాది విముక్తము అనుటలో తటస్థ లక్షణమును బేర్కొనబడినవి. ఇట్టి లక్షణములు కలది యిది-అనుటకు ప్రమాణమేమి? అను ప్రశ్నకు సమాధానము 'నిగమశత సహస్రేణ నిర్భాస్యమానమ్'- శత సహస్ర పరశ్రుతి భాస్యము అన్నారు. 'పరశ్రుతి' అను అనువాదముచే ఉపనిషత్తు అను భావము వచ్చును.

కన్నమాత్రలో సందనిది - మోక్షపురుషార్థరూపము అనుటలో స్వానుభూత్యేకమానము కేవల సుఖము అని చెప్పబడినది. కేవల జ్ఞానగమ్యమయిన ఆ వస్తువు ఉత్తమాధికారులకు మాత్రమే అందునది. దానితో మా కేమి పని? అన్నచో అట్లుగాదు. అది 'తత్తావద్భాతి సాక్షాత్' ఎట్ట ఎదురై యున్నది ఎక్కడ? గురుపవనపురే = గురువాయూరు పట్టణమ్మందు - అన్నారు. అట్లయిన నది దేశ కాలముల కతీత మెట్లగును? అను శంక రాగా, గురుపవన పురము-అనగా జగద్గురువైన పరమాత్మయొక్క నివాసమైన ద్వారకయే. పవనములు ప్రాణాది వాయువులు, అవి యుండు పురము నవద్వారపురము శరీరము. అందుండు భగవత్తత్త్వము ద్వారకావాసియైన కేవల కృష్ణపరబ్రహ్మమే యన్నమాట. ఈ మూర్తిని ప్రత్యక్షముగ దర్శించి శ్రవణ మనన కీర్తనాది నవవిధ లక్షణమైన భక్తిచే భజించువారికి చిత్తము శుద్ధమై శమదమాది సాధన సంపత్తి, ఫలభోగ విరాగము, ముముక్షుత్వము (మోక్షాభిలాష) అను సాధన చతుష్టయ సంపత్తి యేర్పడును ఆ వెంటనే జగద్గురువైన శ్రీహరి యనుగ్రహము - దానిచే 'అహం బ్రహ్మాస్మి' అను స్ఫురణము కలుగును. అది అజ్ఞానకార్యమైన యీ శరీరాదిప్రపంచమును దానియం దంటియున్న చిత్తవృత్తిని (అంతఃకరణమును) హరించు మనోనాశ మగునన్నమాట. అదే అమనస్క స్థితి. అపుడు ఎదుటనున్న అద్దమును దీసివేయగా అందలి ప్రతిబింబము పరావృత్తమై బింబమం దైక్యమయినట్లు జీవాత్మ పరమాత్మరూప భేదభావము నశించి ప్రత్యగభిన్న సచ్చిదానందము స్వప్రకాశ సంవిద్రూపమై శేషించును. ఇదే పరమపురుషార్థము మోక్షము. ఇది అనేక జన్మ సుకృత పరిపాకఫలము అను విషయము. 'హంతభాగ్యం జనానామ్' అనుటలో పేర్కొనబడినది. కృష్ణరూపమున పరమార్థసత్యమైన వస్తు వక్కడ నున్న దనుటలో, అక్కడ ఒక నిధి (గని) యున్నది-అన్నపుడు దానికై ప్రయత్నము చేయుమన్న భావము స్ఫురించునట్లు, అట్టి వస్తువును సేవించి భావించి కృతార్థులు గావలయునని చెప్పుటయే ఇచట పరమ తాత్పర్యము. కావున భాగవతమంగళ శ్లోకమందలి 'సత్యం పరం ధీమహి' అను గాయత్రీ మంత్రార్థము గూడ చివర కిందు సంగృహీతమైనది.

**ఏవం దుర్లభ్య వస్తున్యపి సులభతయా హస్తలభ్యే యదన్య**
**త్తన్వా వాచా ధియా వా భజతి బత జనః క్షుద్రతైవ స్ఫుటైవమ్,**
**ఏతే తావద్వయం తు స్థిరతర మనసా విశ్వపీడాపహత్యై**
**నిశ్శేషాత్మాన మేనం గురుపవనపురాధీశమే వాశ్రయామః.** 2

**అందనివస్తు విట్లు తన యంతన నందిన చేఁత వాఁతగా**
**కెందునొ దేవులాడు జన; మెక్కడి నైచ్యము, కాని మా మన,**
**మ్మందె లయింప విశ్వరుజ లీఁగఁగ నీ పరిపూర్ణతత్త్వ మా**
**కందము నాశ్రయించెద మఖండ దయారస మూలకందమున్.**

అందరాని వస్తువు ఏ శ్రమ లేకుండ అంది పుచ్చుకొన్నట్లు ఇట్లు సాక్షాత్కార మగుచుండగా త్రికరణశుద్ధిగ నీ దైవమును భజింపక ఇతర దేవతల భజించుట వట్టి నిస్సారమైన పని యని స్పష్టమగుచున్నది. మేము మాత్రము సుస్థిరమైన మనసుతో విశ్వపీడానివారణకు, అనగా ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక తాపత్రయశాంతికి 'తాపత్రయోన్మూలనం' అని భాగవతమన్నట్లు చరాచర సృష్టికెల్ల ఆత్మయైయున్న, లేక అశేష ప్రపంచము తన స్వరూపమైయున్న, లేదా బ్రహ్మ విష్ణు శివాది దేవత లందరి స్వరూపమైయున్న శ్రీ గురువాయూరు పురాధీశ్వరుని శ్రీకృష్ణమూర్తినే ఆశ్రయించుచున్నారము.

తెలుగులో 'పరిపూర్ణ తత్త్వ మాకందము' అని మూలాధికమైన విశేషణము వేయబడినది. 'పూర్ణ బ్రహ్మతత్త్వమును తీయమామిడిపండు' గా రూపించుట-రోగనివారణకు-తాపశాంతికి మామిడి పండు రసము మంచిదను ఆయుర్వేద విషయమును గమనించి. అదిగాక ఆ తత్త్వము 'రసో వైసః' అను శ్రుతి నిరూపిత కేవల బ్రహ్మానందము నిష్కలమనియు, అఖండ దయారస మూలకందమనియు అవ్యాజ కరుణా వరుణాలయముగ సకలమునై యున్నదని జ్ఞాపకము చేయుటకు. అందని వస్తువు: ఆత్మసాధనచతుష్టయ సంపత్తి గురూపసర్పణముచే శ్రవణ మననాదులును ఉన్నపుడే కాని యెఱుకపడని దన్నమాట.

ఎందునొ దేవులాడు జనము :- నిష్కామముగ భగవంతుని భజించువారు ఉత్తమాధికారులు. ఫలము గోరి సేవించువారు మధ్యములు. భేదదృష్టితో అన్య దేవతలను కోరికలకై భజించువారు అధములు-అని దీనిచే సూచింపబడినది. 'దేవులాడును' అన్నయెడ దేవశబ్దము అన్యదేవతాభజనమును ధ్వనింప జేయుచున్నది. చేఁతన్-కాయికకర్మచేత, వాఁతఁ- వాక్కుచేత మా మనంబిందె లయింపన్ - మనస్సుచేతను (త్రికరణశుద్ధిగా) భజింతుము. 'తన్వా వాచా ధియా' అని మూలము. వందన అర్చనము కీర్తనము, శ్రవణ, స్మరణ, రమణ, దాస్య, సఖ్యాత్మ నివేదనములు - అను నవవిధ భక్తిభేదములచే నీ కృష్ణతత్త్వమును ఆశ్రయింతు మనుట. దీనిలో

సద్యోహృద్యవరుధ్యతే-కింవాపరైః-ఈశ్వరుడు వెంటనే హృదయమందు పట్టువడును అనియు, అందని వస్తువనుటలో నిది నిగమ కల్పతరుఫలమనియు ఇతరదైవతము లెందులకు?- అను భాగవత ద్వితీయ శ్లోక భావము వ్యక్తమైనది. తనయంతన నందినఁ అనుటలో శుకముఖమున అమృత ద్రవ సంయుతమై అవనిపై పడినది - పిబత భాగవతం రసం - రసపానము చేయుడని మా మనం బిందెలయింప - ఆశ్రయించెదము అనుటలో - రసికులు భువిలో భావుకులు అను భాగవత తృతీయశ్లోక తాత్పర్యముగూడ ఇందు గర్భితమైనవి.

**సత్త్వం యత్తత్ పరాభ్యా మపరికలనతో నిర్మలం తేన తావత్**
**భూతై ర్భూతేంద్రియై స్తే వపురితి బహుశః శ్రూయతే వ్యాసవాక్యమ్,**
**తత్ స్వచ్ఛత్వా ద్యదచ్ఛాదిత పరసుఖ చిద్గర్భ నిర్భాసరూపం**
**తస్మిన్ ధన్యా రమంతే శ్రుతిమతిమధురే సుగ్రహే విగ్రహే తే. 3**

శ్రుతి విన్నన్ మతి నెన్ననున్ మధురమై శోభిల్లు సత్త్వైక సం
భృత మచ్ఛమ్మది సచ్చిదాత్మక సుఖశ్రీభూత భూతేంద్రియా,
కృతక మ్మౌనని వ్యాస వాణి విననౌ నీ సుగ్రహమ్మైన యా
కృతి సానుగ్రహమైన విగ్రహమునఁ గ్రీడింత్రు ధన్యాత్మకుల్.

రజోగుణ, తమోగుణస్పర్శ లేని అచ్ఛమైన సత్త్వగుణముచేత పుట్టిన పంచభూతములు, ఏకాదశేంద్రియములచే నీ లీలాశరీర మవతరించెనని వ్యాసులన్నారు. 'మునీనామప్యహం వ్యాసః'. మునులలో వ్యాసుడను నేనే అను గీతననుసరించి. 'వ్యాసస్తు భగవాఁ విష్ణుః-వ్యాసోనారాయణోహరిః' అను అనేక ఋషివచనానుసారము వ్యాసవాక్యము ప్రమాణ మన్నమాట. వారి వాక్యములో 'జగృహే పౌరుషం రూపం - విశుద్ధం సత్త్వమూర్జితం'- సత్త్వం విశుద్ధం క్షేమాయ నారాయణకలాత్మకమ్, శ్రేయాంసి తత్ర ఖలు 'సత్త్వతనో ర్నృణాం స్యుః ఇత్యాదిగ ననేకములుగలవు. ఈమూర్తి వీనులకు బుద్ధికిని మధురమై శోభిల్లును. స్ఫటికమట్లు నిర్మలము, నిరావరణ సచ్చిత్సుఖగర్భమునై యుండుటయే అందులకు కారణము. కావున ఆ నీ మూర్తియందు ధన్యులు, కేవల భక్తిమార్గసంచారులు, తదితర మార్గ సాధనయందలి పరిశ్రమకు గురికాని పుణ్యులు క్రీడింతురు. ప్రేమలక్షణమైన భక్తిని జేయుదురు. నీ మూర్తి చిదానందైక రసఘనమగుటచే జడత్వమునుబాసి

కేవలచిన్మయము ఆనందమయము నయినందున శ్రవణస్మరణాదికముచే నది సర్వేంద్రియాహ్లాదకమగును. అందుచేతనే అది సుఖముగా గ్రహింప వలనుపడుననియు భావము. అందుచేత నీ మూర్తి సాకారమైన నీ యను గ్రహరూపమే యని తెలుగులో మఱొక విశేషణము వేయబడినది.

శ్రుతివిన్నన్ = ఉపనిషద్వాక్యములచే విన్నను మతిఁ- జ్ఞానముచే, ఎన్ననుఁ = ఉపాసించినను నీ రూపు మధురాతిమధురమనియు - విశేషము.

నిష్కంపే నిత్యపూర్ణే నిరవధిపరమానంద పీయూషరూపే
నిర్లీనానేక ముక్తావలి సుభగతమే నిర్మలబ్రహ్మసింధౌ,
కల్లోలోల్లాసతుల్యం ఖలు విమలతరం సత్త్వ మాహు స్తదాత్మా
కస్మాన్నో నిష్కల స్త్వం సకల ఇతి వచ స్త్వత్కలాస్వేవ భూమన్. 4

**ఆలో నిండి తొణంక కంతుదరిలేే కాలీనముక్తావలీ**
**వ్యాలక్ష్యమ్మగు బ్రహ్మసింధువున నిత్యానందపీయూష క**
**ల్లోలోల్లాసము సత్త్వమందు రది చెల్లుఁ నీవుగా, నిష్కలుం**
**డా లీలఁ బరిపూర్ణుఁడీవు; సకలుం డంశావతారమ్ములన్.**

బ్రహ్మవస్తువు అనంతము కావున నపారమగు సముద్రముగా రూపింపబడినది. ఈ శ్లోకమందలి విశేషణము లటు బ్రహ్మపరముగను - ఇటు సముద్రపరముగను శ్లేషచే నన్వయింపబడును-

1.నిష్కంపము = వికార రహితము, అక్షోభ్యము (తొణకనిది) 2.నిత్యపూర్ణము = అఖండము, ఎప్పుడు నిండుగ నుండునది. దేశకాలావధులు లేని బ్రహ్మానందమను అమృతము స్వరూపముగాగలది. 3. అంతులేని పరమ సంతోషము నిచ్చు అమృతముయొక్క ఆవిర్భావము (ఉత్పత్తి అయినచోటు, పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మాత్మ భావము నందిన ముక్తుల సమూహముచే నతి మనోహరము 4. లోన నున్న అనేక ముక్తావలి = ముత్యాల రాసులచే మిగుల శోభించునదియునగు నిర్మలమయిన బ్రహ్మానంద సుధాసాగరమందలి తరంగముల ఉల్లాసమే సత్త్వగుణము. అదియే నీవు. అని ఆచార్యు లన్నారు. అట్టి సత్త్వమే రూపమై యున్న నీవు నిష్కలుడవుగా కేమగుదువు? మఱి నీవు సకలుండవనియనుట అది నీ అంశావతారముల విషయము ! ఇది హేభూమన్ = ఓ పరిపూర్ణ నిష్కల బ్రహ్మమా అను సంబోధనలోని భావము.

నిర్వ్యాపారో౽పి నిష్కారణ మజ! భజసే యత్క్రియా మీక్షణాఖ్యాం
తేనైవోదేతి లీనా ప్రకృతి రసతికల్పా౽పి కల్పాది కాలే,
తస్యా స్సంశుద్ధ మంశం కమపి తమతిరోధాయకం సత్త్వరూపం
స త్వం ధృత్వా దధాసి స్వమహిమవిభవాకుంఠ! వైకుంఠ! రూపమ్. 5

ఏ పని లేక నిష్క్రియుఁడ వీక్షణముం బొనరింతు; వంత మున్
రూపరి యున్న మాయ యొక రూ పెనయున్ మఱికల్ప మాదిలో
నాపె విశుద్ధసత్త్వకళ నంది నిరావరణమ్ము పూనె దీ
వా పయి నో వికుంఠ సదనా! అజ! రూప మకుంఠ వైభవా!

ఓ అజా! నీవు నిష్క్రియుడవయ్యును మాయాశక్తిని ప్రేరేపించు ఈక్షణరూప క్రియను అంగీకరించుచుందువు. అయస్కాంతమణిదాపున నున్న యినుమునకు చలన మేర్పడినట్లు చైతన్యమూర్తివైన నీ సన్నిధాన మాత్రమున ప్రకృతియందు ఒక ప్రేరణ జరుగు నన్నమాట. దానిచే మున్ను కల్పాంతమందు లీనమై అనిర్వచనీయ యనబడు నా మాయ కల్పాదియందు మరల నభివ్యక్తమగును. ఆ మాయయొక్క విశుద్ధము చైతన్యస్ఫోరకమునైన సత్త్వగుణము నీవు ధరించి లీలావిగ్రహముం ధరింతువు. ఓ వైకుంఠనిలయ! ఆ ధరించుట అకుంఠ స్వీయమహిమా విలాసముచేతనే కాని, దానికి మఱియొక కారణము లేనే లేదు. ఉన్నను నది మాబోంట్లకు తెలియబడునదియు గాదు. ఈ నీ మూర్తి కేవల చిన్మయము ఆనందమయము. ద్రాక్షవలె బహిరంతః స్ఫురద్రస మన్నమాట.

తత్తే ప్రత్యగ్రధారాధర లలిత కలాయావలీ కేలికారం
లావణ్య స్యైకసారం సుకృతిజనదృశాం పూర్ణ పుణ్యావతారమ్,
లక్ష్మీ నిశ్శంక లీలానిలయన మమృతస్యంద సందోహ మంతః
సించత్ సంచింతకానాం వపు రనుకలయే మారుతాగారనాథ! 6

తొలకరిమబ్బులోఁ దళుకు దొంగిలి కమ్ర కలాయ కోమలో
జ్జ్వలమయి, లచ్చికిఁ విడిదిపట్టయి, యచ్చపు జగ్గునిగ్గులన్,
జెలువయి, యోగులం దమృతసేచనమై, సుజనమ్ముచూపులన్
దలిరుచు పూర్ణపుణ్య మవతారము నందకిశోర మెన్నెదన్.

ఓ గురువాయూరు స్వామి! తొలకరి మేఘమట్లు, నవకలాయకుసుమమట్లు (ఇరుగుడుపూవట్లు) శ్యామలమై, లావణ్యైకనిధియై, నిష్కామకర్మానుష్ఠానము సేయు పుణ్యుల కన్నులకు నిశ్శేషపుణ్యస్వరూపమై, లక్ష్మీదేవికి స్వేచ్ఛావిహార సదనమై, ఉపాసకుల హృదయకమలమును బ్రహ్మానందామృతరసాప్లావితము నొనర్చు నీశుద్ధ సత్త్వమయమైన మూర్తిని మనసునం దనుసంధానింతును.

**కష్టా తే సృష్టిచేష్టా బహుతర భవఖేదావహా జీవభాజా**
**మిత్యేవం పూర్వ మాలోచిత మజితఅ మయా నైవమద్యాభిజానే!,**
**నోచే జ్జీవాః కథం వా మధురతర మిదం త్వద్వపు శ్చిద్రసార్ద్రం**
**నేత్రైః శ్రోత్రైశ్చ పీత్వా పరమరస సుధాంభోధిపూరే రమేరన్. 7**

**హరి! నీ జీవుల సృష్టి ఘోరమని నే నన్నాఁడ మున్ జీవు దు**
**ర్భరసంసారముఁజూచి, నే డటు తలంపన్, జీవుఁడే లేనిచో,**
**నరుడౌ నీదగు చిద్రసార్ద్ర మధుర మ్మాకారముం గ్రోలి యె**
**వ్వరు క్రీడింతురు బ్రహ్మనామక సుధాంభ స్సింధుపూరమ్ములన్.**

ఓ అజిత = మాయకు వశము కానివాడా! జీవులు లింగశరీర ధారులు. వారికి జనన మరణాది దుఃఖముల దెచ్చిపెట్టు నీ సృష్టికార్యక్రమము మిక్కిలి ఘోరము. ఇది నీ వెందులకు జేయవలెనని యింతకుమున్నను కొంటిని గాని యిప్పు డట్లను కొనను. ఈ జీవులను నీవు సృజింపవేని, చిదానందామృత మధురమైన యీ నీ మూర్తిని కనులార చెవులార గ్రోలి పరమ సుఖ సుధాపారావార పూరమున మున్కలిడుచు, దేలుచు నోలలాడువారు మఱి యెవ్వ రుందురు? నీ మాధుర్య మనుభవించుటే మానవజన్మకు ఫల మన్నమాట.

**నమ్రాణాం సన్నిధత్తే సతతమపి పుర స్తైర నభ్యర్థితాన**
**ప్యర్థాన్ కామా నజస్రం వితరతి పరమానంద సాంద్రాం గతించ,**
**ఇత్థం నిశ్శేషలభ్యో నిరవధికఫలః పారిజాతో హరే! త్వం**
**క్షుద్రం తం శక్రవాటీద్రుమ మభిలషతి వ్యర్థ మర్థివ్రజో ఽయమ్. 8**

**పరమానందరసమ్ము పంచెదవు నీ పాదాలపై వ్రాలినన్**
**సరి! నిన్గోరని పంట పండెద, వశేషప్రాప్య ముద్యత్ఫల,**

**స్ఫురణ మ్మొ వొక పారిజాతమవు; నీ పొల్పెంచుకో లేక ని**
**న్నొరయన్ నేరని యాచకాధములు దేవోద్యానపాళీవిటుల్.**

హరీ! నీవు పారిజాత స్వరూపుడవు. నీ యెడ వినతులైనవారికి సమీపముగనే అందివచ్చి వా రడుగని పురుషార్థము లన్నిటి నిత్తువు. నిష్కామముగ సేవించువారికి పరమానందరూప మోక్షమునుగూడ అనుగ్రహింతువు. స్వర్గమందలి పారిజాతమో మెడయెత్తి చేయిచాచి యందుకొనువారికే ఫల మందించును. అదికూడ పుణ్యముచేసి స్వర్గమున తనదగ్గరకు వచ్చినవారికే. అది అడుగని కోర్కెల నీయదు. అది యెల్లయెడల యెల్లకోరికల నొసంగదు. కోరనివారి కది మోక్ష మసలే యీయలేదు. నీవో నిరవధిక ఫలదాతవై అందర కందుబాటులో నుండు ఒక అద్భుతపారిజాతమవు. అక్కటా! నీ సొగసెఱుంగక, నిన్ను దరియక, ఇంద్రోద్యానమందలి యా పారిజాతము గావలెనని కొందఱు అభిలషింతురు. అంతకంటె వ్యర్థమైన పనిలేదు.

తెలుగు అనువాదములో - నిన్నొరయన్నేరని యాచకులు - అధము లనుటయే కాదు. వారు దేవోద్యానపంక్తులలో రంభాదులవెంట నభిసరించు విటగాండ్రు - కేవలము కర్మఠులు, అంతేకాదు శుద్ధ చైతన్యస్ఫూర్తియైన మూర్తిని నిన్ను గాదని దేవతోద్యానములందు బరుగిడువారు అనన్యభక్తులు గారు - అనువిశేషభావము మూలాధిక సుందరము.

**కారుణ్యాత్ కామ మన్యం దదతి ఖలు పరే స్వాత్మదస్త్వం విశేషా**
**దైశ్వర్యా దీశతేఽన్యేజగతి పరజనే స్వాత్మనో పీశ్వర స్త్వమ్,**
**త్వయ్యుచ్చై రారమంతి ప్రతిపదమధురే చేతనాః స్ఫీతభాగ్యా**
**స్త్వం చాత్మారామ ఏవే త్యతుల గుణగణాధార! శౌరే! నమస్తే.** **9**

**ఏవో కోర్కెలు కొంద రిచ్చెదరు తండ్రీ! నిన్నె నీ విచ్చి కొం,**
**దీ విశ్వమ్మున కీశ్వరుల్ గలరు, నీకే యీశ్వరుం డీవు; నీ,**
**పై వాల్లభ్యము భాగ్యశాలురకు; నీపై నీకె వాల్లభ్య; మ**
**య్యా! విశ్వాతిశయప్రభావగుణధుర్యా! నా నమోవాకముల్.**

ఇతరులు బ్రహ్మాదిదేవతలు జాలిగొనిరేని మోక్షముదప్ప వేఱు కోరికల నిత్తురు. నీవో వారిని మించిన దయతో స్వకీయమైన ఆత్మనే ఇత్తువు.

స్వరూపమైన మోక్ష మనుగ్రహింతువన్నమాట. వారు ఐశ్వర్యముచే స్వేతర జనమందు చరాచర ప్రపంచమందు నిగ్రహానుగ్రహ రూపమైన యధికారము చలాయింతురు. నీవో స్వరూపమైన యాత్మయం దధికారివి. జీవరూపమున సంసారమున బడవేసి నిగ్రహించుటకును ఆత్మానందాను భవమును అనుగ్రహించుటకును నీవే ప్రభుడవు. ప్రతిక్షణ మధురమైన కృష్ణపరబ్రహ్మమగు నీయందు నిండు భాగ్యముగల జీవులు అనేకజన్మార్జిత సుకృత పరిపాకముచే భక్తి జ్ఞాన మార్గములందు ఆరూఢులైనవారు మిక్కిలి మోదింతురు. నీవు ఆత్మారాముడవు గావున నీయందు నీవే ఆనందింతువు. కావున అతుల్య కల్యాణ గుణనిధివైన శ్రీకృష్ణా! నీకు నమస్కారము.

**ఐశ్వర్యం శంకరాదీశ్వర వినియమనం విశ్వతేజోహరాణాం**
**తేజస్సంహారి వీర్యం విమలమపి యశో నిస్పృహై శ్చోపగీతమ్!**
**అంగాసంగా సదా శ్రీ రఖిలవిదసి న క్వాపి తే సంగవార్తా**
**తద్ వాతాగారవాసిన్! మురహర! భగవ చ్ఛబ్ద ముఖ్యాశ్రయోఽసి.** 10

**సాక్షాచ్ఛంకరముఖ్యులన్ నిలుపు నైశ్వర్యమ్ము, విశ్వప్రభా**
**వక్షేపమ్మగు వెల్గు, నిస్పృహసుధీవాగ్గేయమౌ కీర్తియున్,**
**వక్షస్సంగతి లక్ష్మి గల్గి, మఱి యే సంగమ్ము లే, కెల్లెడన్**
**సాక్షిత్వమ్మున వెల్గు దీవు భగవచ్ఛబ్దైక వాచ్యా! హరీ.**

ఓ గురువాయూరు దివ్యమందిరవాసీ! మురాంతకా! నీ ఐశ్వర్య మీశ్వరులైన శంకరాదులను నియమించునది. అనగా వారివారి అధికారములందు నిలుపునది. నీ వీర్యము అశేష తేజోహరులైన శంకరాదుల తేజోహ్రాసము చేయగలది. నీకీర్తి పాపశోధకము. ముక్తులచే గానము సేయబడునది. లక్ష్మి నిన్నెడబాయక వక్షఃస్థల మాశ్రయించి యున్నది. నీవు సర్వజ్ఞుడవు, నిన్ను నీ వెఱుగుదువు. నీ మాయను, తత్కార్యమునుగూడ యెఱుగుదువు. నీ కెందును సక్తియన్న మాటయే లేదు. భగవచ్ఛబ్దమునకు నీవు ముఖ్యార్థమవు. ఇతరదేవతలందు అది ఉపచార మాత్రము.

# 2వ దశకము
# భగవత్సౌందర్యము

సూర్యస్పర్ధి కిరీట మూర్ధ్వ తిలకప్రోద్భాసి ఫాలాంతరం
కారుణ్యాకులనేత్ర మార్ద్ర హసితోల్లాసం సునాసాపుటమ్,
గండోద్యన్మకరాభకుండలయుగం కంఠోజ్జ్వల త్కౌస్తుభం
త్వద్రూపం వనమాల్య హారపటల శ్రీవత్స దీప్రం భజే. 1

ఇనబింబ ప్రతిబింబమైన మకుట, మ్మింపౌ లలాటమ్మునం
దున రంజిల్లెడు నిల్వు నామమును, గందోయిన్ దయావృష్టులున్,
బిన నవ్వొప్పగు నాస, కుండల రుచిఁ జెల్వొందు లేఁజెక్కు లిం
చిన నీ యందము పద్మహార మధుర శ్రీవత్సముం గొల్చెదఁ.

సూర్యప్రభవోలె వెలుగు కిరీటము, నిలువు నామముచే మిగుల భాసించు ఫాలము, కరుణ గురియు అమృతము ద్రవించు చిఱునగవు సొగసు, చక్కని ముక్కు, చెక్కుల జిగిమించు మకరకుండలములు, కంఠమందు మెఱయు కౌస్తుభము, వనమాలయు, రతనాల హారములు, శ్రీవత్సచిహ్నమును, చెలువు నించు నీ యందమును సేవించెదను.

కేయూరాంగద కంకణోత్తమ మహా రత్నాంగుళీయాంకిత
శ్రీమద్బాహు చతుష్కసంగత గదా శంఖారి పంకేరుహామ్,
కాంచి త్కాంచన కాంచి లాంఛిత లస త్పీతాంబరాలంబినీ
మాలంబే విమలాంబుజ ద్యుతిపదాం మూర్తిం త వార్తిచ్ఛిదమ్. 2

కేయూరాంగద రత్నకంకణ మహఃకిర్మీర దివ్యాంగుళీ
యాయామోన్నత హస్తసంగత గదోద్యచ్ఛంఖచక్రాంబుజ,
మ్మై యాముక్త సువర్ణ కాంచి వలయ వ్యాసక్త పీతాంబర
మ్మై యబ్జోపమపాద వంద్యమగు నీ యంద మ్ముపాసించెదన్.

కేయూరములు (భుజకీర్తులు), అంగదములు, బాజుబందులు దండికడియములు (మోచేతి మీదుగ ధరించునవి) ముంజేత కంకణములు అంగుళులం దనర్ఘ నవరత్న ఘటితములగు నుంగరములును నాల్గుచేతులందును గద శంఖము చక్రము పద్మమును, బంగారుమొలనూలు నంటియున్న పీతాంబరమ్మును అచ్చమైన అబ్జకాంతి (దులకించు పాదములును గల్గి మా బాధలనెల్ల (దెంచు నీ దివ్యమూర్తి నాశ్రయించెదను. ఊర్ధ్వముఖమై వికసించిన హృదయకమలకర్ణికయందు న్యాసము చేసి ఉపాసించెదనని భావము.

**యత్ త్రైలోక్య మహీయసోఽపి మహితం సమ్మోహనం మోహనాత్**
**కాంతం కాంతినిధానతోఽపి మధురం మాధుర్యధుర్యాదపి,**
**సౌందర్యోత్తరతోఽపి సుందరతరం త్వద్రూప మాశ్చర్యతోఽ**
**ప్యాశ్చర్యం భువనే న కస్య కుతుకం పుష్ణాతి విష్ణో! విభో! 3**

**ముద్దులకెల్ల ముద్దు, మఱి ముచ్చట లన్నిటికంటె ముచ్చటై**
**నిద్దపు నీటులందు నెఱనీటయి వింతలకెల్ల వింతలన్,**
**దిద్దెడు నీ త్రిలోక కమనీయ మహోమహనీయమైన నీ**
**యొద్దిక చూడఁజూడఁ జవులూరవె యూరక యెట్టివారికిన్?**

ముల్లోకములందు పూజనీయములకెల్ల బూజనీయము, మోహనము లన్నిటికంటె సమ్మోహనము, కాంతినిధికెల్ల కాంతము, మధురపదార్థముల కెల్ల మధురము, చక్కదనములకెల్ల చక్కదనము, వింతలకెల్ల వింతయు నైన నీ రూప మెవ్వరికి వేడుకల నింపదు! సంసారబద్ధులు ముముక్షువులు ముక్తులుగూడ శ్రవణమననాదులచే నిన్నె భావింప నుబలాటపడుచుందురని భావము.

**తత్తాదృఙ్మధురాత్మకం తవ వపు స్సంప్రాప్య సంపన్మయీ**
**సా దేవీ పరమోత్సుకా చిరతరం నాఽస్తే స్వభక్తేష్వపి,**
**తేనాస్యా బత కష్ట మచ్యుత విభో త్వద్రూపమానోజ్ఞక**
**ప్రేమస్థైర్యమయా దచాపలబలా చ్చాపల్యవార్తోదభూత్. 4.**

**ఇందిర నీదు నంద మిదియే కనుచుం దనివొందలేమిఁదా**
**నెందును భక్తులన్ నిలువ దించుక సే, పది కారణమ్ముగా,**

నందెను లక్ష్మి చంచల యటన్న యపప్రథ, మూల మీవుగా
కిందులకుం గతమ్ము మఱియెవ్వరు తెల్పుము మా మనోహరా,

ఆ రీతి మిగుల మధురమైన నీ మూర్తిని జూచి మిగుల వేడుకగొని సర్వైశ్వర్య స్వరూపిణియగు లక్ష్మీదేవి తనభక్తులయెడగూడ నెక్కువసేపు నిలబడదు. అక్కట! నీ రాజ్ఞియైన యీమెకు నీ రూపసౌభాగ్యమందు ఏర్పడిన సుస్థిర ప్రేమబలముచేతనే లక్ష్మి చంచలయను నపకీర్తి వచ్చినది. గుణమే దోషకారణమైనదని మా విచారము. అంతియకాదు నీ సౌభాగ్యాతిశయముచే నీ యిల్లాలికి గలిగిన యీ అపవాదు నిన్నుగూడ తాకునేమో యని నాఖేదము.

లక్ష్మి స్తావక రామణీయక హృతై వేయం పరేష్వస్థిరే-
త్యస్మి న్నన్యదపి ప్రమాణ మధునా వక్ష్యామి లక్ష్మీపతే,
యే త్వ ద్ధ్యాన గుణానుకీర్తన రసాసక్తా హి భక్తా జనా-
స్తే ష్వేషా వసతి స్థిరైవ దయిత ప్రస్తావ దత్తాదరా. 5

ఇంతకుఁ గారణమ్ము వచియింతు మఱొక్కటి, లక్ష్మి శ్రీమనః
కాంతుని నిన్ దలంచి నిను గానము సేయు మహానుభావులన్,
సంతత మంటి వెంటఁబడి చారు ని జేశ కథా రసైక సం
క్రాంత మనస్కయై, యొకటఁగాల్నిలుపన్ వశమేది యుండెడున్.

ఈ విషయములో కారణము మఱొక్కటి తోచుచున్నది. నీ యందముచే హృదయమాకర్షింపబడి యీ లచ్చి, నీ సొగసును నీలీలలను నిత్యము గానము చేయు భక్తుల నెల్లపుడు వెంబడించుచు నచ్చటనే స్థిరనివాస మేర్పరచు కొనుటచే, వేఱొకచోట నిలుకడ గొనదు. అందుచే నామెకు 'చంచల' అనుమాట వచ్చి యుండును.

ఏవంభూత మనోజ్ఞతా నవసుధా నిష్యంద సందోహనం
త్వద్రూపం పరచిద్రసాయనమయం చేతోహరం శృణ్వతామ్,
సద్యః ప్రేరయతే మతిం మదయతే రోమాంచయ త్యంగకం
వ్యాసించ త్యపి శీతబాష్పవిసరై రానందమూర్ఛోద్భవైః. 6

నీ రూపమ్మిటు చారుతా నవసుధా నిష్యంద సందోహధా
రా రమ్యమ్మయి చిద్రసాయనమునై రంజిల్లి డెందమ్ము నిం,

**దై రక్తిం బులకింపజేసి కనులం దానంద బాష్పాంబువుల్**
**దోరంబుల్ గురియించి చిత్తమున కేదో మత్తు మందయ్యెడున్.**

ఇట్లు పరమసౌభాగ్య నిధానమైన నీ రూపము నవ్యసౌందర్యామృత ధారావాహినియై పరబ్రహ్మానందమయమై మఱిమఱితలచికొనువారిని మురిపింపజేసి తనువు పులకింపజేసి కన్నులం దానంద బాష్పములు గురియించి వారి చిత్తమును మత్తుమం దిచ్చినట్లు మఱపింపజేయును.

**ఏవం భూతతయా హి భక్త్యభిహితో యోగః స యోగద్వయాత్**
**కర్మజ్ఞానమయాద్ భృశోత్తమతరో యోగీశ్వరై ర్గీయతే,**
**సౌందర్యైక రసాత్మకే త్వయి ఖలు ప్రేమ ప్రకర్షాత్మికా**
**భక్తి ర్నిశ్శ్రమమేవ విశ్వపురుషై ర్లభ్యా రమావల్లభ! 7**

**పరమశ్రేష్ఠము భక్తియోగ మిది యప్పా! జ్ఞాన కర్మాఖ్యముల్**
**గురుయోగమ్ములు రెంటికంటె నని యోగుల్ దెల్పియున్నారు; ని,**
**ర్భర సౌందర్య రసాత్మకుండవగు నీపై నిండు ప్రేమాత్మక**
**మ్మరయన్ భక్తియె యెల్లవారల కనాయాసైక లభ్యమ్మునున్.**

ప్రహ్లాద నారదాదు లంగీకరించిన భక్తియోగము జ్ఞానయోగ కర్మయోగ ములకంటె అత్యుత్తమ మన్నారు యోగీశ్వరులు. యోగీశ్వరులలో ప్రథముడు కృష్ణుడును. ఓ రమావల్లభ! నీయందు ప్రేమాతిశయ రూపమైన యా భక్తి సర్వసాధారణముగ నందఱకు సులభము. నీవు సౌందర్యైక రసస్వరూపుడవు కావున.

**నిష్కామం నియత స్వధర్మచరణం యత్ కర్మయోగాభిధం**
**తద్ దూరేత్యఫలం యదౌపనిషదజ్ఞానోపలభ్యం పునః,**
**తత్ త్వవ్యక్తతయా సుదుర్గమతరం చిత్తస్య తస్మాద్ విభో!**
**త్వత్ప్రేమాత్మకభక్తి రేవ సతతం స్వాదీయసీ శ్రేయసీ. 8**

**అది నిష్కామ మగున్ స్వధర్మచరణ మ్మా కర్మయోగమ్ము; అ**
**య్యది దూరాన ఫలించు; ఔపనిషద మ్మధ్యాత్మబోధంబు, అ,**
**య్యది చిత్తానకుఁ జిక్క దత్తుకొన దవ్యక్తంబుగాఁబట్టి, స్వా**
**ర్తిద మీ నీ యెడఁ బ్రేమ భక్తియనగన్ శ్రేయస్కర మ్మన్నిఁటన్.**

నిష్కామకర్మయోగానుష్ఠానము అనగా స్వధర్మాచరణము ఎప్పుడో కాని ఫలింపదు. ఉపనిషత్తులు చెప్పిన బ్రహ్మజ్ఞాన లభ్యమైన మోక్షము అవ్యక్తము ఇంద్రియగోచరము గాదు కావున చిత్తమున కందదు. నిరీషణులు నిరస్తకర్ములయినవారే దాని కధికారులు. అందువలన నీయందలి ప్రేమరూపమయిన భక్తియొక్కటే పుట్టిన ఉత్తరక్షణమందును ఫలానుభవమందుంగూడ మధుర మగుటచే నన్నిటికంటె నదియే ప్రశస్తము.

**అత్యాయాసకరాణి కర్మపటలా న్యాచర్య నిర్యన్మలా**
**బోధే భక్తి పథేఽథవా ప్యుచితతా మాయాన్తి కిం తావతా,**
**క్లిష్టాః తర్కపథే పరం తవ వపు ర్బ్రహ్మాఖ్య మన్యే పున**
**శ్చిత్తార్ద్రత్వ మృతే విచింత్య బహుభిః సిద్ధ్యంతి జన్మాంతరైః. 9**

**ఆయాసంపడి కర్మతంత్రములలో నంటెల్లనున్ బాసి, యె**
**ట్లో యాభక్తికి జ్ఞానమార్గమున కర్హుల్గొంద రౌచుందు; ర,**
**న్నా, యన్యుల్ మది తర్కచర్చఁదడి యింకఁబ్రహ్మనామమ్ము నీ**
**యీ యాకారము నెంచి జన్మశతమం దీడేరుచుం డ్రీశ్వరా.**

మిక్కిలి శ్రమించి కర్మము లాచరించి రాగద్వేషాది మలములం బాసిన వా రేకొందఱో భక్తి జ్ఞాన మార్గముల కధికారు లయ్యెదరు. చిత్తశుద్ధి వడయుట మూలమున పూర్తిగ విరక్తులయినచో జ్ఞానయోగమునకును ఇంచుక విరక్తులయినచో భక్తియోగమునకు నర్హులగుదురు. ఎక్కువ విరక్తి ఎక్కువ రక్తి లేనివారికి భక్తియోగము సిద్ధించును. మఱికొందఱు చిత్తమందు ద్రవీభావము, విరాగమును లేనివారై తర్కములు చేసి చేసి వేదాంతార్థ నిశ్చయ మెప్పటికో పడసి పెక్కుతీరుల నుపాసించి ఎన్ని జన్మములకో యీడేరుదురు.

**త్వద్భక్తిస్తు కథారసామృతఝరీ నిర్మజ్జనేన స్వయం**
**సిద్ధ్యంతీ విమల ప్రబోధపదవీ మక్లేశత స్తన్వతీ,**
**సద్యఃసిద్ధికరీ జయ త్యయి విభో! సై వాస్తు మే త్వత్పద**
**ప్రేమప్రౌఢిరసార్ద్రతా ద్రుతతరం వాతాలయాధీశ్వర! 10**

**నీపై భక్తి భవత్కథా రసఝరీ నిర్మజ్జనన్ సిద్ధమై**
**యాపూర్ణామల దివ్యబోధపద సద్యస్సిద్ధిఁ జేకూర్చు; నా,**

**ప్రాపేఁ గావుతఁ ద్వత్పదాబ్జ పరమార్ద్ర ప్రౌఢ సౌహార్ద ని**
**ష్ఠాపూర్ణమ్మది శ్రీమరుత్పురనివాసా! శ్రీనివాసా! హరి!**

నీ యెడల నొదవిన భక్తియోగమో అట్లు గాదు. నీ కథలందలి శృంగారాది రసామృత ప్రవాహమున మునుకలు పెట్టగా తనంత సిద్ధించి, క్లేశము లేకుండ నిర్మల జ్ఞానపదవి నందించి 'అమృత ఇహ భవతి' అన్నట్లు సద్యోముక్తి చేకూర్చును. అట్టి నీ చరణారవిందభక్తిరసాత్మక చిత్తద్రవీభావము అచిరకాలమున నాకు లభించుగాక! నా సేవలో లోపముగాని, అలసత్వముగాని యున్నను గణింపక నా యెడ ననన్యశరణాగతి చేసినవాడు వీడని దయగొని నా కా పరమభక్తినే యనుగ్రహింపుము.

# 3వ దశకము

# భక్త స్వరూపము

**పఠంతో నామాని ప్రమదభరసింధౌ నిపతితాః**
**స్మరంతో రూపం తే వరద! కథయంతో గుణకథాః,**
**చరంతో యే భక్తా స్త్వయి ఖలు రమంతే పర మమూ**
**నహం ధన్యాన్ మన్యే సమధిగత సర్వాభిలషితాన్. 1**

**ఏ యెడ నీదు సోయగము నెంచుచు హర్ష సుధాబ్ధిఁదేలి నా**
**రాయణ నామకీర్తన పరాయణులై హరి లీలలెల్లఁ బా**
**రాయణసేయుచున్ హృదయ మప్పనసేసి యవాప్తకాములై**
**నీ యెడఁ జొక్కుమాన్యులు మనీషులు ధన్యులటంచు నెంచెదన్.**

నీ నామసంకీర్తనముచే హృదయముం జొచ్చిన నీ యందమునే స్మరించుచు నానందామృత సముద్రమందు మునింగి కన్నుల నశ్రువులు, మేన పులకరింపు మొదలైన లక్షణములు గలవారై నీపరమాద్భుతలీలలను జెప్పికొనుచు నీకే హృదయ మర్పించి సకలపురుషార్థములు నీ పాదారవిందములే యని సర్వాభీష్ట సిద్ధి వడయు మహానుభావులు ధన్యులని నే నెంచెదను.

గదక్లిష్టం కష్టం తవ చరణ సేవారస భరే ఽ
ప్యనాసక్తం చిత్తం భవతి తవ విష్ణో! కురు దయామ్,
భవత్పాదాంభోజ స్మరణ రసికో నామనివహా
నహం గాయం గాయం కుహచన నివత్స్యామి విజనే. 2

మది వ్యాధి వ్యథఁగ్రాగి చిట్లి పెలుసై మౌధ్యాన నీయందుఁ బొం
దరు; నన్నుం గరుణించు దైవమ! భవ త్పాదాంబుజధ్యానసం
పదనోఁ దేనియ లాని నీదగు యశో నామావలిన్ నేఁ బదిం
బదిగోఁ బాడుచుఁ జొక్కి దసొగసి యే మార్మూలనో నక్కెదన్

శారీరకములయిన వాతపిత్త శ్లేష్మాదులు మానసికములైన రాగద్వేషాదులు నను రోగములచే క్లేశపడు నా మనస్సు నీ చరణ ధ్యాన సేవారూప సుఖాతిశయమ దాసక్తి పొందదు. పొందింతమన్నను లొంగదు. అయ్యో! నా పాలి దైవమ! నీ చరణారవింద ధ్యాన మకరందాస్వాద రసికుం గావింతువేని నే నారోగ్యవంతుడ నయ్యెదను గావున, నన్ను గరుణింపుము. నే నరోగి నగుదునేని నీ యశోగాన మొనరించుచు మైమఱచి యెక్కడనో యేకాంతమందు హాయిగ నుందును.

కృపా తే జాతా చేత్ కిమివ నహి లభ్యం తనుభృతాం
మదీయ క్లేశౌఘ ప్రశమనదశా నామ కియతీ,
న కే కే లోకేఽస్మి న్ననిశ మయి! శోకాభిరహితా
భవద్భక్తా ముక్తా స్సుఖగతి మసక్తా విదధతే. 3

నీ దయ యందెనేని యవనిన్ గల జీవుల కందరాని దిం
కేది? మదీయ బాధలు శమించుటనంగ నదెంత పాటి? ఇం
దే దరి నీదు భక్తు లెవ రేరు తరించి యశేష శోకమున్
గాదని ముక్తి నందరు సుఖస్థిరమార్గముఁబట్టి యేగరున్

శరీరధారులకు నీ దయ కలిగెనేని మఱి గలుగని భాగ్యమేమి? మోక్షము గూడ సులభమే. అట్టియెడ నా ఆధి వ్యాధు లుపశమించు టనునది యెంత? ఈ లోకమందు నీకు భక్తులై విషయవిరక్తులై యెందఱెందఱో శోకము తరించి జీవన్ముక్తులై నిరతిశయ సుఖ స్వరూప మోక్షపథ విహారము సేసినో వారున్నారు. నా యందు నట్టి దయా ప్రసారము సేయుమని భావము.

మునిప్రౌఢా రూఢా జగతి ఖలు గూఢాత్మగతయో
భవత్పాదాంభోజ స్మరణ విరుజో నారదముఖాః,
చరంతీశ! స్వైరం సతత పరినిర్భాత పరచిత్ -
సదానందాద్వైత ప్రసర పరిమగ్నాః కిమపరమ్. 4

మునులఁ బ్రౌఢులు నారదాదులు యశఃపూర్ణుల్ నిగూఢాత్మవ
ర్తను లౌచున్ భవదీయ పాద జలజ ధ్యానాత్త సుస్వస్థతన్
గని యశ్రాంత పరిస్ఫుర త్పరచిదానందాత్మ కాద్వైతవా
హిని స్వేచ్ఛాగతి నోలలాడుదురు; మేలీమీఁద నొండున్నదే?

మునులలో మిక్కిలి యున్నత భక్తిస్థాయి నందుకొన్న నారదాదులు నీ పాదారవిందములను నిరంతర ధ్యానము సేసి విషయ వేగమున బడక కేవల బ్రహ్మానంద రస పారావార పూరమున దేలి ఈదులాడుచుందురుగదా! మఱి కావలసిన భాగ్యమేమున్నది?

భవద్భక్తిః స్ఫీతా భవతు మమ సైవ ప్రశమయే-
దశేష క్లేశౌఘం న ఖలు హృది సందేహ కణికా,
న చేద్ వ్యాసస్యోక్తి స్తవ చ వచనం నైగమవచో
భవే న్మిథ్యారథ్యా పురుషవచన ప్రాయ మఖిలమ్. 5

నీపై నిండగు భక్తి నాకొదవుతన్ విశ్లేషజాడ్యౌఘమున్
బాపుం గావుత; లేదు సందియమిటఁ గాదేని వ్యాసోక్తులున్
నీ పల్కుల్ మఱి నైగమోక్తులు నిలన్ నిక్కంబు గాకుండఁబో
నేపోవుం గదవే బజారుజన మే మే నాడు నూసుంబలెన్.

నీయందు నిండైన భక్తి పరమ ప్రేమరూపము నాకు గలుగుగాక! అది నా అశేష జాడ్యమును హరింపగలదు. ఇందు సందియ మించుకయు లేదు. అట్లుగాదేని సాక్షాద్విష్ణువైన వ్యాసుని పలుకులును, కేవల మీశ్వర నిశ్శ్వాసరూపములయిన వేదములును బజారులో దిరుగుచు నుబుసుపోక కాడుకొనుమాటలట్లు గాలికి బోవునే కాని, యుగయుగాలు నిలువనేరవు.

భవద్భక్తి స్తావత్ ప్రముఖ మధురా త్వద్గుణరసాత్
కిమ ప్యారూఢా చే దఖిల పరితాప ప్రశమనీ,

**పున శ్చాంతే స్వాంతే విమల పరిబోధోదయమిల -**
**న్మహానందాద్వైతం దిశతి కి మతః ప్రార్థ్య మపరమ్.** 6

నీపై భక్తి మొదల్ సుధా మధురమై నీ సద్గుణాలంబనన్
బ్రాపై పెంపొనరింపగన్ బెరిగి తాపానీకముం బాపి యా
హా! పూర్ణామల బోధసిద్ధమగు బ్రహ్మానంద మద్వైత ని
ష్ఠా పారమ్యముఁగూర్చు; నంతకుఁబయిన్ సంప్రార్థ్య మొందున్నదే.

నీపై ప్రేమ యుదయించిన వెంటనే అమృత ప్రాశనము సేసినట్లగును. ఆ మీద నీ అనంత కల్యాణ గుణము లాలించినకొలది యా భక్తి యుప్పొంగి తాపత్రయ నివారణము సేయును. అప్పు డంతఃకరణము పరిశుద్ధమయి యందు బ్రహ్మాకార వృత్తి స్ఫురించి పోను పోనది నిర్వృతికమయి కేవల స్వరూపనిష్ఠ గుదురుకొనును. ఆ మీద మఱి కోరవలసిన దేదియు నుండదు.

**విధూయ క్లేశాన్ మే కురు చరణయుగ్మం ధృతరసం**
**భవత్క్షేత్రప్రాప్తౌ కరమపి చ తే పూజనవిధౌ,**
**భవన్మూర్త్యాలోకే నయన మథ తే పాద తులసీ**
**పరిఘ్రాణే ఘ్రాణం శ్రవణమపి తే చారుచరితే.** 7

మానం జేసి మదీయతాపములఁ బ్రేమన్ నీదు క్షేత్రమ్ములం
దూనంజేయుము నాదుపాదముల, నీ యొయ్యారమే చూచు న
ట్లే నేత్రమ్ము లొనర్చు, చేతులు విరుల్నింపన్, జెవుల్ త్వత్కథా
గానమ్మానగ నిల్పు, పాదతులసీ గంధంబులన్ నాసికన్.

నా క్లేశములను హరించి నీ క్షేత్రములందు చరించు భాగ్యము నా చరణములకు, నీ సోయగమే తిలకించు నదృష్టము నా నేత్రములకు, నీ మీదనే పువ్వులు రువ్వు సుకృతము నాహస్తములకు, నీ మధుర కథా శ్రవణముపై నభిరుచి వడయు పుణ్యము నా వీనులకు, నీ చరణ నిర్మాల్య రూప తులసీ కుసుమ పరిమళాఘ్రాణము సేయు వేడుక నా నాసికేంద్రియమునకును అనుగ్రహింపుము.

**ప్రభూతాధి వ్యాధి ప్రసభ చలితే మామక హృది**
**త్వదీయం తద్రూపం పరమ రసచిద్రూప ముదియాత్,**

ఉదంచ ద్రోమాంచో గలిత బహు హర్షాశ్రు నివహో
యథా విస్మర్యాసం దురుపశమ పీడా పరిభవాన్. 8

అధివ్యాధి విరోధి విగ్రహ గృహవ్యాపార ఝంఝానిల
వ్యాధూత మ్మెద నీదు మూర్తియను బ్రహ్మానంద చిద్బింబ ము
ద్బోధమ్మై మెయి పుల్కరింపఁ గనులందున్ హర్షబాష్పామృతో
త్సేధమ్మై హరియించుఁగావుత రుజా దీర్ఘ వ్యథా వేదనన్.

మానసిక శారీరకవ్యాధులకు గురియై బెదరి చెదరిపోవుచున్న నా హృదయమందు కేవల చిద్రసాత్మకమయిన నీ రూపము ఉదయించుగాక! దానిచే మేను పులకరింప కనుల నానందబాష్పములు గురియగా మైమఱచి యీ అసాధ్య వ్యాధివలని వేదనను మఱచిపోయెదనుగాక!

మరుద్గేహాధీశ త్వయి ఖలు పరాంచోఽపి సుఖినో
భవత్ స్నేహీ సోఽహం సుబహు పరితప్యే చ కి మిదమ్,
అకీర్తి స్తే మా భూ ద్వరద! గదభారం ప్రశమయన్
భవద్భక్తోత్తంసం ఝటితి కురు మాం కంసదమన! 9

నీ యెడ మార్మొగమ్మయిన నీచులునున్ సుఖముండఁగర్మమే
మో! యిది నీదుపై వలపు నూని వెతల్పడు చుంటి; వద్దు నీ
కీ యపకీర్తి, ఓ వరద! యెల్ల రుజల్ హరియించి నన్ను నా
రాయణ! చేసికోఁగదె నిజాప్తశిరోమణిగన్ సురాగ్రణీ!

ఓ గురువాయు పురాధినాయక! నీ యెడ విముఖులైన వారు సుఖముగా నున్నట్లు కనిపించుచున్నారు. నీ యందు ప్రీతిగొనిన నేనో మిక్కిలి పరితాపములకు గురి యగుచుంటిని. ఇదేమి విరుద్ధము! ఓ వరదా! నీ కీ అపకీర్తి వలదు. నా రోగము నుపశమింపజేసి, ధర్మసాధనమైన చక్కని శరీరము నిచ్చి, నన్ను నీ భక్త శిరోమణిం గావింపుము.

కి ముక్తై ర్భూయోభి స్తవ హి కరుణా యావ దుదియా
దహం తావ ద్దేవ! ప్రహిత వివిధార్త ప్రలపితః,
పురః క్లుప్తే పాదే వరద! తవ నే ష్యామి దివసాన్
యథాశక్తి వ్యక్తం నతినుతినిషేవా విరచయన్. 10

పలుమాటల్ పనియేమి నీ కరుణ నాపై వచ్చునందాక లో
కుల మాటల్ విడనాడి నీ పయి విరుల్ గుప్పించి నీ కీర్తి మం
గళ గానమ్ము లొనర్చి నీసొగసులోఁదోగాడి నీపాదము
ద్రల బాటల్ నడయాడి యాడి బ్రతుకున్ ధన్యంబు గావించెదన్.

వేయి మాట లెందులకు? నీ కృప నాపై వచ్చుదాక లోకవార్తలు గట్టిపెట్టి నాచేత నైనంతకు నీ పాదములపై వ్రాలి పువ్వులు గుప్పించుచు నీ ముందు బడియుండి దినముల వెళ్ళించెదను అట్టి అవకాశ మనుగ్రహింపుము.

# 4వ దశకము

# యోగానుసంధానము

కల్యతాం మమ కురుష్వ తావతీం, కల్యతే భవదుపాసనం యయా,
స్పష్ట మష్టవిధ యోగచర్యయా పుష్టయాశు తవ తుష్టి మాప్నుయామ్. 1

భవదుపాసన కారోగ్య భాగ్య మీయ
వయ్య ! అష్టాంగ యోగ నిష్ఠానుభూతి
నొప్పు గడియించు నాపూర్ణ యోగమందు
భవదనుగ్రహతృప్తిలాభంబుఁ గాంతు.

నారాయణభట్టు భాగవత ద్వితీయ స్కంధ కథ ననుసరించి భగవంతుని మూర్తిభేదములను, వానియుపాసన విధానమును, అందువలన గలుగు ఫలమును వివరింపబోవుచు, మున్ముందు తనకు ఆ అధికారము సిద్ధించుటకు ఆరోగ్యమిమ్మని ప్రార్థించుచున్నాడు. స్వామీ! నీ యుపాసనకు - అనగా యమనియమాద్యష్టాంగ యోగనిష్ట కనుకూలమైన ఆరోగ్య భాగ్యమును బ్రసాదింపుము. దానిచే నీ యనుగ్రహము పడయగలను.

బ్రహ్మచర్య దృఢతాదిభి ర్యమై రాప్లవాది నియమైశ్చ పావితాః,
కుర్మహే దృఢ మమీ సుఖాసనం పంకజాద్యమపి వా భవత్పరాః. 2

**బ్రహ్మచర్యపాటవమ్మాది యమముల,**
**స్నాన మాది నియమ సరణి మలము**
**లెడలి, నిన్నె నిలిపి యెడఁదఁ బద్మాదిక**
**మ్మలవరించెదము సుఖాసనముల.**

బ్రహ్మచర్యము, అహింస, అస్తేయము మొదలయిన యమములను, స్నానసంధ్యాది నియమములను ఆచరించి పరిశుద్ధులమై నీ యందు భక్తిగొని పద్మ స్వస్తి కాద్యాసనములలో నేది సుఖకరమో అందు దృఢముగ స్థూలశరీరమును నిలువరింతుము.

**తారమంత రనుచింత్య సంతతం ప్రాణవాయు మభియమ్య నిర్మలాః,**
**ఇంద్రియాణి విషయాదథాపహృ త్యాస్మహే భవదుపాసనోన్ముఖాః. 3**

**తారము నంతరంగము సుతారము తాకగఁ బ్రాణ వాయు సం**
**చారము నాపి దుర్విషయ సంగతి నంటెడఁజోపి యింద్రియా**
**హార మొనర్చి నీదగు నుపాసన నంతకు నంత కున్నత**
**మ్మై రహి నించు భూమికల నందుకొనన్ సుఖముందు ముందునన్.**

ఆ మీద సూక్ష్మ శరీరమైన మనస్సు నిలుకడకు తారము - అనగా ప్రణవమును (ఓం కారము) హృదయమందు తైలధారవలె నెడతెగకుండ ధ్యానించుచు 'ప్రాణాయామై ర్దహే ద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషాన్' (భాగవత-3 స్కం. 28 అ. 11 శ్లో.) అన్నట్లు పూరక రేచక కుంభక రూపమయిన ప్రాణాయామములచే వాయు జయమును బడయుట ద్వారా రాగద్వేషాదిమలములను వాయుధారణచే పాపములను దహించి, యింద్రియములను వాని వాని విషయములనుండి మరలించి (ప్రత్యాహారము సేసి) నీ యుపాసనయందు ధారణాదులగు పైపైమెట్టు లందు అభ్యాసము చేయుచు నీ దయ కెదురు చూచుచుందుము.

**అస్ఫుటే వపుషి తే ప్రయత్నతో ధారయేమ ధిషణాం ముహుర్ముహుః,**
**తేన భక్తిరస మంతరార్ద్రతా ముద్వహేమ భవదంఘ్రి చింతకాః . 4**

**అందియు నందకున్న యొకయందము నీయెడ మాటి మాటికిఁ**
**డెందము నిల్వరించుచుఁ గడింది బలమ్మున నీ పదాబ్జ మా**

**త్మం దలపోయు చందమునఁ దన్మయులౌచు నమంద భక్తిని**
**ష్యంద మరంద ధారల సుఖాప్లుతి నుందుముగాక నిచ్చలున్.**

ధ్యానమందు లీలగా మాత్రము గోచరించు నీ రూపమందు మాటిమాటికి బుద్ధిని ధారణ చేయుదుము. అనగా బుద్ధిగతమైన నిద్రా దోషము పోవుటకు ప్రయత్నింతు మన్నమాట. అప్పుడు బుద్ధి అన్య విషయముల యెడ ప్రాలినపుడు దానిని మాటిమాటికి మరలించి నీ చరణారవిందములందు మరగించుట యను భక్తిరస పానముచే మైమఱచి అంతరంగమం దార్ద్ర భావము వడసి పరమ భాగవతుల మయ్యెదము.

విస్ఫుటావయవ భేద సుందరం త్వద్వపు స్సుచిర శీలనావశాత్,
అశ్రమం మనసి చింతయామహే ధ్యానయోగనిరతా స్త్వదాశ్రయాః. 5

**వినుత పరిస్ఫుటావయవ భేద మనోజ్ఞము నీదు మూర్తినే**
**యనిశము ధ్యానయోగ నిరతాత్ములమై చిరశీలనావశ**
**మ్మున శ్రమ మింత లేక తలపోయుచు నుందుము; నిన్నె దిక్కుగా**
**గని, భవదీయ దివ్యపదకంజము నీడను విశ్రమించుచున్.**

'మానవా మౌలితో వర్ణ్యా దేవా శ్చరణతః పునః' అన్నట్లు విస్పష్టమైన నీ సౌందర్యమును పాదము మొదలు కేశము దనుక నిరంతర ధ్యానయోగమున ననుసంధానము సేయుచు చిరకాల ధ్యాన ధారణాభ్యాసమున శ్రమ లేకుండుటకు నీ దివ్య చరణకమలముల నీడలో, విశ్రమించురూపమున సమాధిసిద్ధి నందెదము.

ధ్యాయతాం సకల మూర్తి మీదృశీ మున్మిష న్మధురతా హృతాత్మనామ్,
సాంద్రమోదరసరూప మాంతరం బ్రహ్మ రూపమయి! తేఽవభాసతే. 6

**నీ పరిపూర్ణరూప మిది నిచ్చలు ధ్యానముసేయు వేళ నీ**
**లోపల పొంగు క్రొందళుకులోన మనమ్ము విలీనమైన ని**
**ష్ఠాపరులైన యోగులకు సాంద్రసుఖైక రసానుభూతి నీ**
**రూపము బ్రహ్మరూప మనిరోధముగా నవభాస మౌ నెదన్.**

ఇట్లు నీ పరిపూర్ణ మూర్తి ధ్యానాభ్యాసము సేయుటవలన అభివ్యక్తమైన మాధుర్యమునందు మరులుకొన్న మనస్సుగల మహాయోగులకు సాంద్రానందైక రస స్వరూపము నీ రూపమైన బ్రహ్మరూపము కేవల మంతరింద్రియ గ్రాహ్యమయిన ఒకానొక సొగసు జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయరూప త్రిపుటిభేదముగా గాని అభేదముగా గాని భాసించును. ఇదే సవికల్పక సమాధి. 'మట్టితో జేసిన యేనుగు ఏనుగుగా కనిపించుచున్నను దానితోపాటు మట్టిగూడ కనిపించినట్లు ద్వైత మందుగూడ అద్వితీయబ్రహ్మ వస్తుస్ఫురణ కలుగును' అని ఆచార్యులన్నారు.

**తత్సమాస్వదన రూపిణీం స్థితిం త్వత్సమాధి మయి విశ్వనాయక**
**అశ్రితాః పునరతః పరిచ్యుతా వారభేమహి చ ధారణాదికమ్.** 7

**ఆ నీదైన సమాధి భక్తిరస పూర్ణాస్వాద మోదావధిన్**
**బూనం గల్గియు విశ్వనాయక! లయమ్మున్ మున్నుగా విఘ్నముల్**
**గానన్ వచ్చి యొకింత జారినను జక్కన్ ధారణాదిక్రియన్**
**బౌనఃపున్య మొనర్చి పూనెద మహో! బ్రహ్మాత్మభావస్థితిన్,**

ఓ విశ్వనాథ! బ్రహ్మరసాస్వాద సంపూర్ణానుభవ రూపమైన నీ నిర్వికల్ప సమాధి నధిగమించియు నప్పుడప్పు డందుండి జారినను వ్యుత్థానదశ నందినను తిరిగి ధారణాది సాధనలను విసుగులేక ఆరంభించుచునే యుందుము. జ్ఞాత=తెలియువాడు జ్ఞేయము=తెలియదగినది-అను భేదము పోయి కేవల జ్ఞాన రూపమున నుండుటయే భగవత్సమాధి, నీటిలో కరిగిన ఉప్పు ఉప్పుగా గానరాక నీరుగా భాసించినట్లు అద్వితీయ వస్తు మాత్రము భాసించుటయే నిర్వికల్ప సమాధి. దానికి లయ - విక్షేప - కషాయ - రసాస్వాదము లను నాల్గు విఘ్నములు కలుగు నవకాశ మున్నది. లయము = నిద్ర, విక్షేపము=అన్యవస్తువు యొక్క ఆలంబము, కషాయము = విషయవాసనలవలన గల్గు స్తబ్ధత, రసాస్వాదము = సవికల్పకానందాస్వాదనము. ఈ దోషములవలన సమాధి నుండి జారిపోయినపుడు మరల మరల ధారణాద్యభ్యాసము దృఢము సేయుచుండవలెను. అప్పుడు మనస్సు ఈ దోషములను బాసి కదలక బ్రహ్మాకారమై నిల్చును. అట్టి నిర్వికల్ప సమాధి 'యథా దీపో నివాతస్థో నేంగతే సోపమాస్మృతా' గాలిలేనిచోట కదలక వెల్గు దీపము వంటిది' అని గీతయందు దెలుపబడినది.

**ఇత్థ మభ్యసన నిర్భరోల్లసత్త్వత్పరాత్మ సుఖకల్పితోత్సవాః,**
**ముక్తభక్తకుల మౌలితాం గతాః సంచరేమ శుకనారదాదివత్.**

**త్వరితాభ్యాస వినిశ్చయాధిగత దీవ్య త్త్వత్పరానంద ని**
**ర్భర సచ్చిత్సుఖ కల్పితోత్సవులమై భక్తాళి ముక్తావళిన్**
**దొరలై శ్రీశుక నారదాది మునిసందోహమ్ముఁబోలెం బరా**
**వర విశ్వాత్మక భావ మూని విహరింప న్నేర్తు మే మంతటన్.**

ఇట్టి నిరంతరాభ్యాసముచే బట్టువడిన నీ స్వరూప బ్రహ్మానుభవముచే నేర్పడిన వేడుకను గొని ముక్తులలో భక్తులలో నాయకులమై శ్రీశుకులు నారదాదులవలె సంచరింతుము. బ్రహ్మానుభవము కల్గినపుడు అజ్ఞానము, తత్కార్యములయిన పూర్వ సంచితకర్మములు సంశయ విపర్యయములు నశించి సకలబంధముక్తిరూప పరమనిష్ఠ గల్గును. కల్గినను ప్రారబ్ధకర్మము శేషించి యున్నంతవరకు పూర్వవాసనచే చేయబడు కర్మములు తత్ఫలానుభవము తప్పదు. ఇది యింద్రజాలమని తెలిసినవారు దానిని జూచుచున్నను పరమార్థముగ నదిచూడరు, ఈ ముక్తులుగూడ లోకవ్యవహార మెల్ల బ్రహ్మజ్ఞానబాధితముగావున నది అపరమార్థముగా చూచుచున్నను పరమార్థముగ చూడనివారే యై ప్రారబ్ధశేష మున్నంతవరకు మేదినిపై సంచరింతురు. అదే జీవన్ముక్తావస. ఆ స్థాయిలో నున్నవారు శ్రీ శుక నారదాది మహానుభావులు. మేముకూడ నీకృపాపాత్రుల మైతిమేని వారివలె స్వేచ్ఛావిహార మొనరింతుము.

**త్వత్సమాధివిజయే తు యః పున ర్మంక్షు మోక్షరసికః క్రమేణ వా**
**యోగవశ్య మనిలం షడాశ్రయై రున్నయ త్యజ సుషుమ్నయా శనైః. 9**

**నీదు సమాధిసిద్ధి గని నేరుగ మోక్షరసజ్ఞుఁడయ్యెడిన్**
**గాదొ, క్రమాప్తి ముక్తి గనగల్గు, నతండు నితండునున్ సమా**
**సాదిత యోగశక్తి నటు షట్కమలమ్ముల వెంట మీఁదికిన్**
**మీఁదికినిన్ సుషుమ్న మెలమెల్లనఁ దా నడిపించు వాయువున్.**

ఈశ్వరుడవైన నీయందు గాలిలేనిచోట దీపమట్లు బుద్ధి నిలుకడగాంచి సమాధి జయము సాధించిన యతడు వెంటనే సద్యోముక్తి నందును. అట్లుగాక క్రమముక్తిని బడయ నెంచెనేని యోగవశమైన ప్రాణవాయువును సుషుమ్నానాడి మార్గమున మూలాధార, నాభి, హృదయ, ఉరస్, తాలుమూల, భ్రూమధ్యరూప షట్చ క్రములద్వారా మెలమెల్లన నూర్ధ్వముఖముగ నడిపింపగలడు.

**లింగదేహమపి సంత్యజ న్నథో లీయతే త్వయి పరే నిరాగ్రహః,**
**ఊ ర్ధ్వలోక కుతుకీతు మూర్ధత స్సార్ధమేవ కరణై ర్నిరీయతే. 10**

**అతఁడు నిరాగ్రహుండయి స్వయ మ్మొడలించుక లిఙ్గదేహ మ**
**చ్యుతుఁడగు నీదులోన లయ మొందును బ్రహ్మకపాలమోక్షమై**
**అతఁడటు లూర్ధ్వలోక గతి నందెడు వేడుక గూరె నేని యీ**
**డితమతి బ్రహ్మరంధ్రముబడిం జను నింద్రియపాళి తోడుగాన్**

నిరాగ్రహుడు అనగా క్రమముక్తి పడయు సంకల్పములేనివాడు [సద్యోముక్తి కోరువాడు] ప్రాణవాయువును భ్రూమధ్యస్థానమందు నిల్పి కొలదిసేపుండి లిఙ్గదేహమును స్థూలసూక్ష్మ శరీరములను పునరావృత్తి లేకుండ దొలగించుకొని బ్రహ్మాత్మకుడవైన నీయందు లీనుడగును. అనగా బ్రహ్మరంధ్రము భేదించుకొని, వెలుగు వెలుగులో గలిసినట్లు నీలో సాయుజ్య మందును. బ్రహ్మాదిలోక సుఖానుభవముపై వేడుక కలిగెనేని మూర్ధము భేదించుకొని అందుండి ఇంద్రియములతో గూడ పంచప్రాణ-మనో-బుద్ధి-ద శేంద్రియ సముదాయమైన లింగ శరీరముతో గూడి వెడలిపోవును. అనగా బ్రహ్మరంధ్రములో నున్న సుషుమ్ణ నాడికి సూర్యకిరణములకు నిత్యసంబంధ ముండుటంబట్టి జీవుడు బ్రహ్మరంధ్రమువరకు వచ్చివెడలు సూర్యకిరణములతో గూడ వెలుపలికి వెడలిపోవును.

**అగ్నివాసరవళర్షపక్షగై రుత్తరాయణజుషాచ దైవతైః,**
**ప్రాపితో రవిపదం భవత్పరో మోదవాన్ ధ్రువపదాంత మీయతే. 11**

**అనలము శుక్లపక్షము నహ మ్మటుమీఁదట నుత్తరాయణ**
**మ్మునఁగల దేవతానికరముల్ దన నా రవిమండలమ్ముదాఁ**
**కను గొనిపోవ నీచరణకంజముల న్నెఱనమ్మ భక్తుఁడే**
**గును ధ్రువమండలావధులకుం బరమోద రసోదయమ్మునన్.**

అగ్ని, శుక్లపక్షము, పవలు, అను వాని అభిమాని దేవతలచే ఉత్తరాయణాభిమాని దేవతద్వారా సూర్యలోకమునకు (జ్యోతిశ్చక్రమునకు) గొనిపోబడినవాడై నీభక్తుడు ఆ యా దేవతలతో సమానమైన భోగానుభవమంది అనేక విధానందములను బొంది ధ్రువమండలమునకు బోవును.

విశేషవివరణము : - అగ్న్యాద్యభిమాని దేవతలు జీవుని అరచేత బొమ్మనువలె యెత్తికొని బ్రహ్మలోకమును బొందింతురు. అందు మొట్టమొదట

అగ్నిదేవత స్వేచ్ఛగా శరీరమును విడిచి సూర్యరశ్మి ద్వారమున వెడలు జీవుని అగ్నిలోకమార్గమున గొనిపోయి వాసరాభిమాని దేవతచేతి కందించును - ఆ దేవత ఉత్తరాయణషణ్మాసాభిమానిదేవత హస్తమం దుంచును. ఆ దేవత సంవత్సరాభిమాని దేవత కందించును. అది దేవలోక మార్గమున గొంపోయి వాయుదేవత హస్తమం దుంచును. వాయుదేవత స్వీయలోకమార్గమువెంట దీసికొనిపోయి ఆదిత్యదేవతావశ మొనర్చును. ఆదిత్యదేవత స్వకీయమండలము ద్వారమున నేగు జీవుని గొని చంద్రదేవతా హస్తమందుంచును. ఆ దేవత సర్వలోకమార్గమున విద్యుల్లోక మందించును. అచటినుండి జీవుడు ధ్రువలోకావధి కేగును.

**ఆస్థితో ఒథ మహరాలయే యదా శేషవక్త్రదహనోష్మణార్ద్యతే,**
**ఈయతే భవదుపాశ్రయ స్తదా వేధసః పద మతః పురైవ వా. 12**

**ఇద్ధత నమ్మహర్భువన మేగియు శేషసమీరభు జ్ముఖ**
**ప్రోద్ధత దుర్విషహ్యా హుతభుక్ఛిఖలన్ మఱి క్రాగి క్రాగి య**
**త్యుద్ధతి మాగిపోక భవ దూర్జిత దివ్యసమాశ్రయాన స**
**ద్బుద్ధి గడించి బ్రహ్మపదముం గను, నంతకు మున్న యే న్గనున్.**

ధ్రువమండలము దాటి బ్రహ్మకల్పాయుష్కులగు భృగ్వాది మునుల నివాసమైన మహర్లోకమందు సుఖముగా వసించి, ఆదిశేషుని ముఖాగ్నివేడిమికి త్రైలోక్యము దహింపబడుట చూచి ఆ ఉడుకునకు ఉడికిపోయి నిన్ను శరణొంది బ్రహ్మనివాసమైన సత్యలోకమున కేగును, అటనుండి భృగ్వాది మహామునులతో జనోలోక తపోలోకములు దాటి బ్రహ్మసభం బ్రవేశించును. ఈ క్రమముననే కాక శేషాగ్నిదాహమునకు ముందుగూడ యథేచ్ఛగా బ్రహ్మలోకమునకేగుటకుగూడ శక్యమగును.

వి.వి:- ఈ జీవుడు త్వరగా నీ స్థానముం జేరవలె ననుకొనెనేని విద్యుల్లోకముదాక పోయిన వీనిని బ్రహ్మయాజ్ఞచే నొకానొక దివ్యశరీరి పురుషుడు వచ్చి విద్యుల్లోకమార్గమున ఇంద్ర - ప్రజాపతిలోకములవెంట గొనిపోయి విరజానదిం దాటించి బ్రహ్మలోకమునం జేర్చును. అపు డీ జీవుడు దివ్యశరీరి యగును.

**తత్ర వా తవ పదే ఒథవా వసన్ ప్రాకృత ప్రళయ ఏతి ముక్తతామ్,**
**స్వేచ్ఛయా ఖలు పురా ఒపి ముచ్యతే సంవిభిద్య జగదండ మోజసా. 13**

**అచ్చటఁగాని నీదు పదమందునఁగాని వసించుచుఁ, భవ**
**మ్మచ్చట నెట్టి ప్రాకృతలయమ్మున ముక్తతఁగాంచు; లేక బ**
**ల్మచ్చట నిచ్చమై సకలముం దనుదానయి యింతమున్నె వాఁ**
**డచ్చపు ముక్తి నందు జగదండము బీటలువార పోవుచుఁ.**

బ్రహ్మలోకముం జేరిన జీవుడు అక్కడ గాని నీదగు విష్ణు లోకమందు గాని వసించుచు ప్రాకృతవిలయ మైనపుడు బ్రహ్మతో గూడ ముక్తి గాంచును. లేదా బ్రహ్మాది లోకభోగములందు విరక్తుడయ్యేనేని మహాప్రలయమునకు ముందే స్వయోగబలముచే బ్రహ్మాండమును భేదించుకొని పోయి ముక్తుడగును.

వి.వి. సత్యలోకమ దంతర్భాగములుగా బ్రహ్మ విష్ణు శివ లోకములు మూడున్నవి. బ్రహ్మ విష్ణు శివ రూప త్రిమూర్తుల నుపాసించువారు వారి వారి లోకముల కేగి వారితో సమాన భోగము లనుభవింతురు. ఇది క్రమముక్తి విషయము.

**తస్యచ క్షితిపయో మహో౽నిల ద్యో మహ త్ప్రకృతిసప్తకావృతీః,**
**తత్తదాత్మకతయా విశఁ సుఖీ యాతి తే పద మనావృతం విభో. 14**

**అందును భూమియందు జలమందున వెల్గున గాలి నాకస**
**మ్మందు మహత్తునం బ్రకృతియం దటు లావరణమ్ము లేడిఁటఁ**
**ముందును ముందు నైక్యమయిపోయి నిరావరణైక సచ్చిదా**
**నందఘనమ్ము నీ పదమునం దిరుగొందక యైక్యముంగనున్.**

ఆ బ్రహ్మాండమునకు ఏడు ఆవరణము లున్నవి. అవి భూమి జలము తేజస్సు వాయువు ఆకాశము అను పంచ భూతములు. మహత్తత్త్వము ప్రకృతి (మాయ) అనునవి. ఇచట మహచ్ఛబ్దము అహం తత్త్వమునకు గూడ సూచకము. అందువలన పంచభూతములు మహదహంకారములు గలిసి యేడావరణలు అష్టమావరణము ప్రకృతి. అది వ్యాపకము. ఈ ఆవరణములందు జీవుడు ఆయా ఆవరణ స్వరూపుడై సూక్ష్మశరీరముతో బ్రవేశించి నిరతిశయ సుఖ మనుభవించుచు నీ నిరావరణమైన బ్రహ్మ పదమందును. ఇట్లావరణలు గడచి ప్రాణమును ఇంద్రియములను స్వ స్వ కారణమునందు ప్రవిలాపముసేసి (అనులోమముగ లయింపజేసి) ఆవరణ విలయము గూడ అయినందున కేవలము నిరావరణమైన బ్రహ్మ మాత్రభావమును అందును. బ్రహ్మీభూతు డగునన్నమాట.

**అర్చిరాదిగతి మీదృశీం వ్రజ౯ విచ్యుతిం న్న భజతే జగత్పతే,**
**సచ్చిదాత్మక భవద్గుణోదయా నుచ్చరంత మనిలేశ పాహి మామ్. 15**

**ఈ విధి నర్చిరాదిగతి నేగి మఱెన్నటికేని విచ్యుతిం**
**బోవఁడు సచ్చిదాత్మకవిభూ భవదీయ గుణానువాద సం**
**భావనఁగీర్తన౯ వివశభావుఁడనైన ననుం గటాక్ష వీ**
**క్షావధి రక్షసేయఁ దగవా గురువాయుపురీ రమాధవా!**

ఇట్లు ముక్తుడైన వాడు ఎన్నటికిని చ్యుతిని పునరావృత్తి నందడు. ఓ సచ్చిదాత్మక స్వరూపా! అనిలాధీశ! శ్రీ గురువాయూరు పురనాథ జగత్పతీ! నీ గుణోదయానువాదము సేసి యథాశక్తి స్తుతించు న న్నాధివ్యాధి సంకటముల నుండి రక్షింపుము.

## 5వ దశకము

# విరాట్పురుషావిర్భావము

**వ్యక్తావ్యక్త మిదం నకించి దభవ త్ప్రాక్ప్రాకృతప్రక్షయే**
**మాయాయాం గుణసామ్య రుద్ధవికృతౌ త్వయ్యాగతాయాం లయమ్,**
**నో మృత్యుశ్చ తదామృతంచ సమభూ న్నాహ్నో న రాత్రేః స్థితిః**
**తత్రైక స్త్వ మశిష్యథాః కిల పరానంద ప్రకాశాత్మనా. 1**

**గుణసామ్యస్థితిలో వికార మడఁగ౯ గుప్పించి నీయందు మా**
**య విలీనమ్మయి ప్రాకృతప్రలయమౌ; నవ్యక్తమో వ్యక్తమో**
**కనరా దక్కడ; మృత్యువో యమృతమో కా దందు; రాత్రిం దివ**
**మ్మని లే దచ్చట; సచ్చిదాత్మకత నీకు న్నీవు శేషింతువున్.**

సత్త్వాదిగుణములు మూడును సామ్యావస్థను జెందినపుడు - అనగా హెచ్చు తగ్గులు లేక సమమయిన పాళ్ళలో నున్నపుడు కారణమైన సూక్ష్మప్రకృతి బ్రహ్మమందు లీనమగును. అందుచే తత్కార్యమైన స్థూలప్రపంచము

స్తంభించిపోవును. దానినే ప్రాకృత ప్రళయ మందురు. అప్పుడు మృత్యువు (సంసారము) అమృతము (మోక్షము) గూడ లేవు. రాత్రి పవలు అను కాల విభాగమును లేదు. నీ వొక్కడవు కేవల బ్రహ్మమై శేషించి యుందువు. లీలా విగ్రహస్వీకారము నీ(అవతారము)కూడ చేయవన్నమాట. ఆ దశలో నేమియు నుండదు. నీవు మాత్రముందువు అని గుర్తించుటకు, గుర్తించిన మాట చెప్పుటకు మాత్ర మెవ్వ రున్నారు? అను శంకరాగా నీ మాటయైన వేదాంతమే ఆ మాట చెప్పినది - అను సమాధాన మిక్కడ కిల = అట అనుపదముచే స్ఫురింపజేయబడినది.

**కాలః కర్మగుణాశ్చ జీవనివహో విశ్వం చ కార్యం విభో**
**చిల్లీలా రతిమేయుషి త్వయి తదా నిర్లీనతా మాయయుః,**
**తేషాం నైవ వదం త్యసత్త్వ మయి భో శక్త్యాత్మనా తిష్ఠతాం**
**నోచేత్ కిం గగనప్రసూనసదృశాం భూయో భవే త్సంభవః.** 2

**ఆ విధిఁ జిద్విలాసరతి నందిన నీయెడ లీనమై చనున్**
**జీవులు కాలకర్మము లశేషగుణమ్ములు కార్యవిశ్వమున్,**
**లేవని వాని నెవ్వ రన లే; రవి యున్నవి శక్తి రూపమై;**
**యావల నెట్లు పుట్టునవి యన్ని నభఃకుసుమమ్ము లైనచో.**

ఆ ప్రాకృత ప్రళయమందు నీలో నీవు స్వరూప జ్ఞాన విలాసములో వేడుక గొని మురియుచుందువు. అదే యోగనిద్ర. అపుడు కాలము జీవుల అదృష్టరూప కర్మము జీవసముదాయమంతయు నీలో లీన మగును. అంతమాత్రమున నవి శూన్యమనరాదు. శక్తిరూపమున నీయం దవి యుండనే యున్నవి. అవి కేవలము గగనకుసుమములే అయినచో నవి మరల సృష్టిలో పుట్టుట యెట్లు సంభవించును. అందుచేత వేదాంతము లవి సుతరాము లేవని చెప్పవు. 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అన్నపుడు మిథ్యయనగా జగత్తు సర్వాత్మనా శూన్యమని యర్థము గాదు. అధిష్ఠానరూపముగ నది యున్నది అని మిథ్యా శబ్దమున కర్థము. సర్వాత్మనా శూన్యమనుట బౌద్ధము.

**ఏవంచ ద్విపరార్థకాలవిగతా వీక్షాం సిసృక్షాత్మికాం**
**బిభ్రాణే త్వయి చుక్షుభే త్రిభువనీభావాయ మాయా స్వయమ్,**
**మాయాతః ఖలు కాలశక్తి రఖిలా దృష్టం స్వభావో ఽపిచ**
**ప్రాదుర్భూయ గుణా న్వికాస్య విదధు స్తస్యా స్సహాయక్రియామ్.** 3

**ఇటు ద్విపరార్ధకాలము క్రమింపగ నీవొక చూపు చూడగాఁ**
**దటుకున మాయ క్షోభపడ, దానఁ ద్రిలోకము లుప్పతిల్లె; న**
**ప్పట నురుకాలశక్తియు స్వభావ మదృష్టమునై గుణత్రయ**
**స్ఫుట మొనరించి మాయ కవి మూఁడు నొనర్చె సహాయకక్రియన్.**

చతుర్ముఖ బ్రహ్మయొక్క ఆయుర్దాయము ద్విపరార్ధకాలము. అది జరిగిన తరువాత కేవల బ్రహ్మావశేషముగ ప్రళయ మేర్పడును. దాని పరిమితి కూడ ద్విపరార్ధకాలమే. దాని చివర నీవు మరల సృష్టి చేయవలెనని చూచెదవు. అనగా మాయాప్రేరణ రూపమైన ఈక్షణక్రియను అంగీకరింతువు. ఆ చూపులో మాయ తనంత క్షోభించును. అనగా నీలో లీనమైన మాయ నీకు వేరుగా వ్యక్తదశ నందును. అట్లు క్షోభించిన మాయనుండి అనంతశక్తి సంపన్నుడైన యీశ్వరునియొక్క కాలశక్తి ఆవిర్భవించును. అదియును వెనుకటి కల్పమందలి అఖిల జీవుల పుణ్యాపాపరూపమైన అదృష్టము. స్వభావ మనబడునది సత్త్వ రజ స్తమో గుణములను వికసింపజేయును. ఇంతకుమున్ను ప్రకృతిలో సామ్యావస్థయం దున్న వానిని సృష్టి కార్యోన్ముఖముల నొనరించి త్రిభువనావిర్భావమందు (జగద్వివర్తమందు) మాయకు సహాయపడును.

**మాయా సన్నిహితే ప్రవిష్టవపుషా సాక్షీతి గీతో భవాన్**
**భేదై స్తాం ప్రతిబింబితో వివిశివాన్ జీవోఽపి నైవాపరః,**
**కాలాది ప్రతిబోధితాథ భవతా సంచోదితా చ స్వయం**
**మాయా సా ఖలు బుద్ధితత్త్వమ సృజ ద్యోఽసౌ మహా నుచ్యతే.** 4

**చేరువ యయ్యు మాయ కటు సేరక సాక్షిగ నామరూపతన్**
**వేరయి మాయయందె ప్రతిబింబితుఁడైతివి; నిన్నె జీవుఁడ**
**న్నారలు మాయ కాలకలనంబున మేల్కొని నీదు ప్రేరణన్**
**దా రచియించె బుద్ధిమయతత్త్వ మదే మహదాఖ్య నొప్పెడిన్.**

నీవు మాయకు దగ్గరయ్యు, మాయాసంబంధములేని స్వరూపముతో గోచరించుచు సాక్షి యనుపేర గీర్తింపబడుచు మాయను మాయాకల్పితో పాధులను వేఱువేఱ సృష్టించి యందు బ్రవేశించితివి. అనగా ప్రతిబింబ రూపమున వానియందు ప్రతిఫలించితివి. అదే జీవుడు. సర్వశరీరములందు నేను నే ననుకొనున దదియే. జీవేశ్వర భేదమున నిట్లు రెండు తెఱగులయిన

తత్త్వముయొక్క సంబంధముచే కాల-కర్మ-స్వభావములచే మేల్కొల్పబడిన మాయ నీచే కార్యోన్ముఖిగా ప్రేరేపింపబడినదై తొలుత బుద్ధిని సృజించెను. అదే మహత్తత్త్వము.

**తత్రాసౌ త్రిగుణాత్మకోఽపిచ మహాన్ సత్త్వప్రధానం స్వయమ్**
**జీవేఽస్మిన్ ఖలు నిర్వికల్ప మహమి త్యుద్బోధ నిష్పాదకః**
**చక్రేఽస్మిన్ సవికల్పబోధక మహం తత్త్వమ్ మహాన్ ఖల్వసౌ**
**సంపుష్టం త్రిగుణై స్తమోఽతి బహులం విష్ణో భవత్ప్రేరణాత్. 5**

**అందు మహత్తు తాను ద్రిగుణాత్మక మయ్యును సత్త్వముఖ్యతం**
**జెంది వికల్ప శూన్యముగఁ జేయు నహంస్ఫురణమ్ము జీవునం**
**దంది గుణత్రయ ప్రచురమై తమ ముబ్బగ నేను నేననం**
**గందగఁ జేయుచుండు సవికల్పక బోధము నీదు ప్రేరణన్.**

మాయాకార్యములందు ఒకటైన యీ మహత్తత్త్వము త్రిగుణాత్మకమే యైనను సత్త్వగుణ ప్రధాన మగుటవలన చెట్లన్నియుం జేరి వన మనిపించుకొన్నట్లు జీవులందరుం గలిసిన సమష్టిజీవుడై మహత్తత్త్వ మనిపించుకొనును. ఈ జీవుని యందు మనుష్యత్వాది విశేష వివక్ష లేకుండ నేను నేను అను జ్ఞానమును మాత్రము గల్గింపగా కారణమయిన యీ మహత్తత్త్వము నీ ప్రేరణచే అహం తత్త్వమును జనింపజేయును. అహంకారతత్త్వ మదియే. అది త్రిగుణాత్మకమే అయినను తమోగుణ ప్రచురము. అది నీ ప్రేరణచేత ఈ జీవునియందు - నేను మనుష్యుడను. నేను బాలుడను నేను వృద్ధుడను - అను వ్యష్ట్యాత్మక సవికల్ప జ్ఞానమును గల్గించుచుండును.

**సోఽహంచ త్రిగుణక్రమాత్ త్రివిధతా మాసాద్య వైకారికో**
**భూయ స్తైజసతా మసావితి భవ న్నాద్యేన సత్త్వాత్మనా,**
**దేవా నింద్రియమానినోఽకృత దిశా వాతార్క పాశ్యశ్వినో**
**వహ్నీంద్రాచ్యుత మిత్రకాన్ విధువిధి శ్రీరుద్రశారీరకాన్. 6**

**ఆ నేనన్నది త్రైగుణస్ఫురణ మూఁడై పొల్చి వైకారిక**
**మ్మౌ నా సాత్త్విక తామసమ్ములనగా నర్కానిలేంద్రానల**

**శ్రీనాథాజ శివాశ్వి చంద్రుల దిశాశ్రేణిఁ సమస్తేంద్రియ**
**స్థానాధిష్ఠత దేవతాళిఁ జలిపెఁ సత్త్వాంశయుక్తిం బ్రభూ!**

మహత్తునుండి ఈ అహంకారము పుట్టి సత్త్వగుణముచే వైకారికము, రజో గుణముచే తైజసము, తమోగుణముచే తామసమునుగ త్రివిధమైనది. అది సత్త్వ ప్రధానమైన వైకారి కాహంకారముచే ఇంద్రియాభిమాని దేవతలను దిక్కు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినులు ననువారిని ఒనరించెను. వారు వరుసగా శ్రోత్ర-త్వక్-చక్షుస్-జిహ్వా-ఘ్రాణము లనెడి జ్ఞానేంద్రియము లైదింటికి అధిష్ఠానదేవతలు. ఈ జీవుడు కర్ణద్వారాదులం దున్న శ్రోత్రాదీంద్రి యాధిష్ఠాన దేవతలచే ప్రేరేపింపబడి శ్రోత్రాదులద్వారా వెలువడు అంతః కరణవృత్తులచే శబ్దాది విషయము లనుభవించును. ఇట్లే అగ్ని-ఇంద్ర-ఉపేంద్ర-మిత్ర-ప్రజాపతు లనెడి వాక్-పాణి-పాద-పాయు-ఉపస్థలనెడి యింద్రియముల అధిష్ఠాన దేవతలచే ప్రేరితుడై, వచన=మాటలాడుట, ఆదాన తీసికొనుట, గమన=నడచుట, విసర్గ-విడుచుట, ఆనందానుభవ ఆనందమనుభవించుట యను నైదుపనులు సేయును. ఇదేవిధముగ చంద్ర=చతుర్ముఖ - శ్రీరుద్ర - క్షేత్రజ్ఞులు వరుసగా మనస్ -బుద్ధి - అహంకార - చిత్తము లనెడి అంతఃకరణ చతుష్టయమున కధిదేవతలు. వారి ప్రేరణముచే జీవుడు సంకల్ప-నిశ్చయ - శరీరాభిమాన-ధారణలను బడయును.

**భూమ న్మానస బుద్ధ్యహంకృతి మిలచ్చిత్తాఖ్య వృత్త్యన్వితం**
**తచ్చాంతఃకరణం విభో తవబలాత్ సత్త్వాంశఏవాసృజత్,**
**జాత స్తైజసతో దశేంద్రియగణా స్తత్తామసాంశా త్పున**
**స్తన్మాత్రం నభసో మరుత్పురపతే శబ్దోఽజని త్వద్బలాత్.** 7

**అదె సత్త్వాంశమునందు బుద్ధియు మనోఽహంకారముల్ చిత్తమ**
**న్నది యంతఃకరణాత్మక మ్మగుచు నంతం దోఁచె; నాతైజస**
**మ్మొదవించెఁ మఱి యింద్రియమ్ములను; రూపొందించెఁబో తామస**
**మ్మది యాకాశగుణమ్ము శబ్దమును దేవా! నీ బలోదగ్రతఁ.**

ప్రభూ! నీ బలముచే (ప్రేరణచే) సత్త్వాంశము అయిన సాత్త్వికాహంకారము మనోబుద్ధి అహంకారములతో గూడిన చిత్తమనెడి వృత్తితో గూడినదై సత్త్వప్రధానమైన అంతఃకరణమును సృజించెను. తైజసమయిన

రాజసాహంకారమువలన జ్ఞానేంద్రియ కర్మేంద్రియగణము పుట్టించెను. తామసాహంకారమువలన ఆకాశతన్మాత్రము అపంచీకృత సూక్ష్మాంశము అయిన శబ్దము పుట్టెను.

**శబ్దా ద్వ్యోమ తత స్ససర్జిథ విభో స్పర్శం తతో మారుతం**
**తస్మాద్రూప మతో మహో ఒథచ రసం తోయంచ గంధం మహీమ్,**
**ఏవం మాధవ! పూర్వపూర్వకలనా దాద్యాద్య ధర్మాన్వితం**
**భూతగ్రామ మిమం త్వమేవ భగవన్ ప్రాకాశయ స్తామసాత్. 8**

**హరి ! శబ్దమ్మున నాకస, మ్మచట స్పర్శాఖ్యమ్మునన్ వాయు, వా**
**వరుసన్ రూపము తేజ, మందు రసముం బానీయ, మా గంధమున్**
**ధరణిన్ దానను, నుత్తరోత్తర గుణోత్కర్షమ్ముగాఁ దామస**
**స్ఫురణన్ భూతవిలాస మీవ వెలికిం జూపించినా వీశ్వరా!**

స్వామీ! నీవు శబ్దమునుండి ఆకాశమును పుట్టించితివి. దానినుండి వాయుగుణమైన స్పర్శను దానినుండి అగ్నిని, అందుండి తేజోగుణమైన రూపమును దానినుండి తేజస్సును, తేజస్సునుండి నీటి గుణమైన రసమును, దానినుండి నీరును, నీటి నుండి పృథివీ గుణమైన గంధమును, గంధమునుండి పృథివిని సృజించితివి. ఇట్లు పూర్వ పూర్వవస్తు సమ్మేళమున, పూర్వ పూర్వ ధర్మములు గలవై అనగా, ఆకాశము శబ్ద గుణము, వాయువు శబ్ద స్పర్శ గుణము, తేజస్సు శబ్ద స్పర్శ రూపగుణకము, జలము శబ్దస్పర్శరూపరస గుణము, పృథివి శబ్ద స్పర్శరూపరస గంధ గుణములు గలవై యున్నవి. తామసాహంకారమునుండి నీవే యిది ప్రకాశింపజేసితివి.

**ఏతే భూతగణా స్తథేంద్రియగణా దేవాశ్చ జాతాః పృథక్**
**నో శేకు ర్భువనాండ నిర్మితివిధౌ దేవై రమీభి స్తదా,**
**త్వం నానావిధసూక్తిభి ర్నుతగుణ స్తత్త్వాన్యమూ న్యావిశం**
**శ్చేష్టాశక్తి ముదీర్య తాని ఘటయన్ హైరణ్యమండం వ్యధాః. 9**

**భూతగణమ్ము లింద్రియ సమూహగుణమ్ములు దేవబృందముల్**
**చేతయు వాఁతఁగాక వగఁజెంద, నినుఁ శ్రుతిగీతలన్ సుర**

**వ్రాతము సంస్తుతింప, నటుపై నటఁ దత్త్వములందుఁజొచ్చి నీ**
**చేతనశక్తి వాని నిడి చేసితి వీవు హిరణ్మయాండమున్.**

ఈ భూతగణము ఇంద్రియగణము తదధిష్ఠాన దేవతలు ఇవన్నియు జనించినను విడివిడిగా నున్నందున బ్రహ్మాండమును నిర్మింపజాలవయ్యెను. అపుడు వీని అధిష్ఠాన దేవతలు పదునల్గురు పలు తెఱఁగులయిన శ్రుతిసూక్తులచే నిన్ను స్తుతించిరి. వారి యభ్యర్థనచే నీ వీ తత్త్వములందు బ్రవేశించి, వానికి కదలిక శక్తిని గల్గించి క్రియాసామర్థ్య మొదవించి వాని నొండొంటితో గలుపుచు హిరణ్మయమైన అండమును ప్రకాశ బహుళమగుటచే బంగారమట్లు మెఱయు బ్రహ్మాండము అనెడి స్వశరీరమును నిర్మించితివి

**అండం తత్ఖలు పూర్వసృష్టసలిలే తిష్ఠ త్సహస్రం సమాః**
**నిర్భింద న్నకృథా శ్చతుర్దశ జగద్రూపం విరాడాహ్వయమ్,**
**సాహస్రైః కరపాదమూర్ధనివహై ర్నిశ్శేషజీవాత్మకో**
**నిర్భాతోఽసి మరుత్పురాధిప! స మాం త్రాయస్వ సర్వామయాత్. 10**

**ఆదిం బుట్టిన నీట నుండెను సువర్ణాండమ్ము వేయేండ్లు; త**
**ద్భేద మ్మొనరించినంతట విరాడ్విఖ్యాతిచే నొప్పి వేల్**
**పాదమ్ముల్ కరముల్ శిరమ్ములుగ విశ్వప్రాణిరూపమ్ము నీ**
**వై దీపించితివో మరుత్పుర సుపర్వాధీశ! నన్ బ్రోవరా!**

ఆ అండము అచేతనము. తొలి సృష్టియైన ఆవరణజలమందు వేయి యేండ్లట్లే యుండెను. ఆవల స్వాంశముచే నీవే యందు బ్రవేశించి వివిధముగా విభజించి చదుర్దశ భువనాత్మకమయిన విరాడ్రూపమును ఒనరించితివి. అవ్వల సహస్ర కర చరణ మూర్ధాద్యవయవ సమూహములతో సర్వజీవాత్మకుడవై భాసించితివి. ఓ మరుత్పురపతీ ! న న్నెల్ల రోగములనుండి రక్షింపుము.

# 6వ దశకము

## విరాణ్మూర్తి

**ఏవం చతుర్దశ జగన్మయతాం గతస్య**
**పాతాళ మీశ తవ పాదతలం వదంతి,**
**పాదోర్ధ్వదేశమపి దేవ! రసాతలం తే**
**గుల్ఫద్వయం ఖలు మహాతల మద్భుతాత్మన్. 1**

పదునాల్గున్ భువనమ్ము లీవగు తఱిన్ పాదమ్ము పాతాళమై
నది; మీఁగాలు రసాతల మ్మనఁబడున్ త్వద్గుల్ఫయుగ్మమ్ము సు
మ్మది విశ్వేశ! మహాతలమ్ము పరమేశా! జంఘలున్ రెండునొ
ప్పిదముం గాంచుఁ దలాతలమ్ములనగఁ వింతైన నీ మూర్తిలోన్.

ఈశ్వర! పదునాల్గు లోకములు నీవయినపుడు పాతాళము నీ పాదము రసాతలము మీఁగాలు, మహాతలము చీలమండలు, మహాతల తలాతలములు రెండుపిక్కలు నైనవి.

**జంఘే తలాతల మథో సుతలంచ జానూ కించోరుభాగయుగళం వితలాతలే ద్వే,**
**క్షోణీతలం జఘన మంబర మంగనాభి ర్వక్షశ్చ శక్రనిలయ స్తవ చక్రపాణే. 2**

**గ్రీవా మహస్తవ ముఖంచ జనస్తపస్తు ఫాలం శిర స్తవ సమస్తమయస్య సత్యమ్,**
**ఏవం జగన్మయతనో! జగదాశ్రితైర ప్యన్యై ర్నిబద్ధవపుషే భగవన్! నమస్తే. 3**

**త్వద్బ్రహ్మరంధ్రపద మీశ్వర విశ్వకంద! చ్ఛందాంసి కేశవ! ఘనా స్తవ కేశపాశాః,**
**ఉల్లాసి చిల్లియుగళం ద్రుహిణస్య గేహం పక్ష్మాణి రాత్రిదివసౌ సవితాచ నేత్రే. 4**

**నిశ్శేషవిశ్వరచనా చ కటాక్షమోక్షః కర్ణౌ దిశో౽శ్వియుగళం తవ నాసికే ద్వే**
**లోభత్రపేచ భగవ న్నధరో త్తరోష్ఠౌ తారాగణాశ్చ దశనా శ్శమనశ్చ దంష్ట్రా. 5**

**మాయావిలాసహసితం శ్వసితం సమీరో జిహ్వా జలం వచన మీశ శకుంతపం క్తిః.**
**సిద్ధాదయ స్స్వరగణా ముఖరంధ్ర మగ్ని ర్దేవా భుజాః స్తనయుగం తవ ధర్మదేవః.**

సుతలము జాను వూరువులు సొంపెనయుఁ వితలాతలమ్ములు
న్నతజఘనమ్ము భూమి గగనంబన నాభి యురమ్ము స్వర్గముఁ
గుతిక మహమ్ము నాఁజను జనో భువనమ్ము ముఖమ్ము, ఫాలమూ
ర్థితము తపమ్ము నీ శిరము చెల్వొనయుంగ దె సత్యలోకమై.

జగదాధారకులఁ జగమ్ముల కధిష్ఠానమ్మవై యున్న నిఁ
భగవంతు వినయాన మ్రొక్కెదను దేవా! బ్రహ్మరంధ్రమ్ము నీ
దగు ఛందస్సులు విశ్వ కందిమది ; జుట్టం బోధముల్ భ్రూయుగం
బగు నాబ్రహ్మ పదమ్ము ఱెప్పలు నిశాహస్సుల్ కనుల్ సూర్యుఁడే.

వరద! భవత్కటాక్షము ప్రపంచ విలాసము, ఘ్రాణ మశ్వినుల్
సరిగఁజెవుల్ దిశల్, వలపు లజ్జయు నీ యధరోత్తరాధర
స్ఫురణము, నీదు పల్వరుస చుక్కలు ; లోకములఁ గ్రసించు భీ
కర శమన స్వరూపము జగన్మయ! నీ పెను వాడికోరలున్

అరుదగు మాయ నీదు దరహాస విలాసము వాయు వూర్పుల
బ్బురము రసమ్ము నాల్కఖగముల్ పలుకుల్ వర సిద్ధ సాధ్యకి
న్నర ముఖులున్ స్వరాళి వదన మ్మనలంబు సురాళి బాహువుల్
నరహరి! ధర్మదేవత యనం దగు నీ స్తనయుగ్మ మీశ్వరా

మోకాలు సుతలము, తొడలు వితల - అతలములు పిరుదు, భూమి నాభి, ఆకాశము వక్షము, స్వర్గము మెడ, మహర్లోకము ముఖము, ఇనోలోకము నుదురు, తపోలోకము శిరస్సు, సత్యలోకము జగమ్ములు, జగత్పతులు స్వకీయ శరీరమైయున్న భగవానునకు నీకు నమస్కారము.

ఓ విశ్వమూలమా! నీ బ్రహ్మరంధ్రము ఛందస్సులు. జుట్టుముడి మేఘములు. తీరైన కనుబొమలు బ్రహ్మపదము. కనుఱెప్పలు రాత్రిపవలును. కన్ను సూర్యుడు. అశేష ప్రపంచ రచనా విలాసము నీకటాక్ష విలాసము. నాసాపుటము లశ్వినీ దేవతలు. చెవులు దిక్కులు, లోభము, సిగ్గు క్రింది మీది పెదవులు. నక్షత్రములు నీ పలువరస. కోర యముడు. చిఱునగవు సొగసు మాయ. నిట్టూర్పు వాయువు. నాలుక జలము. పలుకులు పక్షిపంక్తి. స్వరగణము సిద్ధగణము. ముఖరంధ్ర మగ్ని. భుజములు దేవతలు. స్తనయుగము ధర్మదేవుడు.

పృష్ఠంత్వధర్మ ఇహదేవమనస్సుధాంశురవ్యక్తమేవహృదయాంబుజమంబుజాక్ష
కుక్షి స్సముద్రనివహోవసనంతు సంధ్యే శేఫః ప్రజాపతి రసౌ వృషణౌచమిత్రః.7

శ్రోణీస్థలం మృగగణాఃపదయో ర్నఖా స్తేహస్త్యుష్ట్రసైంధవముఖాగమనంతు కాలః
విప్రాదివర్ణభవనం వదనాబ్జబాహు చారూరుయుగ్మచరణం 'కరుణాంబుధే తే. 8

సంసారచక్రమయి చక్రధర క్రియాస్తే వీర్యం మహాసురగణోస్థికులాని శైలాః
నాడ్య స్సరిత్సముదయ స్తరవశ్చ రోమ జీయా దిదం వపు రనిర్వచనీయ మీశ. 9

నీవె న్నధర్మమ్ము నీ మనస్సో చంద్రుఁ
డవ్యక్త మది హృదయాంబుజమ్ము
ఉదర మయ్యుదధులు; ఉభయ సంధ్యలు వస్త్ర
మల ప్రజాపతి లింగ మగును దేవ!
మిత్రుండు వృషణముల్ మృగచయ మ్మెల్లను
శ్రోణి భారమ్ముగా శోభగాంచు
పద నఖమ్ములు నీకు మదవ ద్విపోష్ట్రసైం
ధవములు కాలమ్ము నడకనీకు

వదన బాహూరు పదములు బ్రాహ్మణాది
వర్ణభవనమ్ము లగుఁ గృపాభవన! నీకు
చక్రధర! సర్వ సంసార చక్ర వక్ర
చంక్రమణమెల్ల నీ క్రియా సంక్రమణము

అసుర వర్యులు నీదు వీర్యమ్మ అస్థి
భార మఖిలమ్ము శైల సంభార మెల్ల
నదులు నాడులు రోమమ్ము లదిర తరువు
లఖిల విశ్వస్వరూప! జయమ్ము నీకు.

వెన్ను అధర్మము. మనస్సు చంద్రుడు. హృదయపుండరీకము అవ్యక్తము. సత్త్వాదిగుణసామ్యరూపమైన ప్రధానమన్నమాట. కడుపు సముద్రములు. వస్త్రము సంధ్య. లింగము ప్రజాపతి. వృషణములు మిత్రుడు. పిరుదులు

జంతుగణము. కాలిగోళ్ళు ఏనుగులు. ఒంటెలు, గుఱ్ఱములు మొదలయినవి. నడక కాలము. ముఖాబ్జము బాహువులు, తొడలు, అడుగులును కరుణాసాగర! బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులకు స్థానములు. ఓ చక్రధర ! క్రియాతంత్ర మెల్ల జననమరణాదిదుఃఖము సంసార చక్రము, అసురగణ మస్థిభారము శైలములు. నాడులు నదులు. చెట్లు రోమములు. ఈనీ విశ్వరూప మనిర్వచనీయము. సర్వోత్కర్షముగ నావిర్భవించుగాక!

**ఈదృ గ్జగన్మయవపు స్తవ కర్మభాజాం కర్మావసాన సమయే స్మరణీయ మాహుః**
**తస్యాంతరాత్మవపుషే విమలాత్మనే తే వాతాలయాధిప! నమోస్తు నిరుంధి రోగాన్.**

**ఈనీ విశ్వమయైక మంగళ మహో! హేరాళ సౌందర్యమున్**
**ధ్యానార్థ మ్మనివారు కర్మఠులకుఁ దత్తత్క్రియాశోభన**
**స్థానీయమ్మగు నీదు రూపము తదంతశ్శుద్ధ బుద్ధ స్వరూ**
**పానన్ వెల్గెడు నీకు మ్రొక్కెద ననుం బాలింపు వాతాలయా.**

ఇట్టి నీ విరాడ్రూపము కర్మనిష్ఠులకు కర్మసమాప్తియందు స్మరణీయ మందురు. ఇట్లంతర్యామివై శుద్ధమయమూర్తివైయున్న నీకు నమస్కారము. ఓ వాతాలయాధీశ! ఉపాసనా సామర్థ్యము కొఱకు నా రోగములను హరింపుము.

కర్మసమాప్తియందు :- కర్మములు శ్రవణస్మరణాదులు సాధనభక్తి కంగములు. షోడశోపచారపూజాదులు. అందు విష్ణురూపము స్మరింప శక్యమగును. నిష్కలోపాసన శరీరాభిమానము గలంతవరకు అశక్యము. భగవంతుడర్జునునికి విశ్వరూపముం జూపి 'మయ్యేవమన ఆధత్స్వ' నాయందే మనసు నిలుపుము. 'అవ్యక్తాహి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే' అవ్యక్త బ్రహ్మోపాసన దేహము గలవారికి అనగా దేహాభిమానులకు దుర్లభము అన్నారు. త్రిగుణాత్మక విశ్వరూపోపాసకుడు క్రమముగ శుద్ధ సత్త్వమయమూర్తి నుపాసించుట కధికారియగును. అను భావముతో నీ దశకము ముగించనెంచి యారోగ్య భాగ్యమును కవి యర్థించెను.

# 7వ దశకము

# సృష్టి క్రమము

ఏవం దేవ చతుర్దశాత్మకజగద్రూపేణ జాతః పున
స్తస్యోర్ధ్వం ఖలు సత్యలోకనిలయే జాతో౽సి ధాతా స్వయమ్,
యం శంసంతి హిరణ్యగర్భ మఖిలత్రైలోక్యజీవాత్మకం
యో౽భూత్ స్ఫీతరజోవికార వికస న్నానాసిసృక్షారసః. 1

ఈ పదునాల్గులోకములు నీవయి యావల సత్యలోకమం
దా పరమేష్టివై పొడమి యందు రజోవికృతిప్రయుక్తనా
నా పుట భేద చిత్రరచనా రసికుండయి సర్వ జీవలో
కోపహిత స్వరూపుఁడయి యుంటివి నీవు హిరణ్యగర్భుఁడై

దేవా! నీ విట్లు పదానాల్గు లోకముల రూపమునంది వానికి మీదనున్న సత్యలోకమందు బ్రహ్మరూపమున నుంటివి. అట్టి నిన్ను హిరణ్యగర్భుడందురు. ఆయన భువనత్రయరూప విరాడ్విగ్రహమునకు జీవరూపుడు. పంచప్రాణమనో బుద్ధి దశేంద్రియాత్మక లింగ శరీర సమష్ట్యభిమాని ప్రవృద్ధములైన రజో గుణ వికారములచేత నేర్పడిన నానావిధ శరీరములను వాని కవసరమైన భోగ్య వస్తువులను సృష్టింపవలెనను వేడుకగలవాడు.

వి.వి : సాధకుడు మొదట త్రిగుణాత్మకమైన భగవద్రూపమందు మనస్సును స్థిర పరచుకొనును. ఆ మీద కేవల సత్త్వగుణప్రధానమైన మూర్తి యందు, అటుపై నిర్గుణము సూక్ష్మమునైన బ్రహ్మమునందు, ప్రవేశింపజేసి నిరతిశయానందలాభము పడసి కృతార్థుడగును. ఈ విధముగ మానవుల బుద్ధులు స్థూల సూక్ష్మక్రమమున విషయావగాహనము చేయుచుండును ఈశ్లోకమందు భగవత్తత్త్వము యొక్క ఆయా భూమికలు వివరింపబడి చివరకు సమష్ట్యభిమాని జీవుడైన హిరణ్యగర్భుని స్వరూపము స్పష్టము చేయబడినది. విశ్వకర్మశాస్త్రమం దాబ్రహ్మయొక్క ధ్యానరూప మిట్లు పేర్కొనబడినది.

శ్లో హంసారూఢా చతుర్వక్త్రా తప్తకాంచనసన్నిభా
శుక్ల వస్త్రా లంబకర్ణ కూర్చసౌమ్యా చతుర్భుజా
తుందిలా సోత్తరీయోపవీతా యోగ పదాసనా
జటామకుట శోభాఢ్యా పింగలాక్షీ వరప్రదా
కమండ ల్వక్షసూత్రస్రు క్స్రువ పుస్తక ధారిణీ
ప్రసన్నా బ్రహ్మణో మూర్తి శ్చింతనీయా సురైరపి.

సో యం విశ్వవిసర్గద త్తహృదయ స్సంపశ్యమాన స్స్వయం
బోధం ఖ ల్వనవాప్య విశ్వవిషయం చింతాకులస్త స్థివాన్
తాప త్త్వం జగతాంపతే తపతపే త్యేవంహి వైహాయసీం
వాణీ మేన మశిశ్రవః శ్రుతిసుఖాం కుర్వం స్తపః ప్రేరణామ్. 2

అపుడతఁడీ జగత్సృజనమందుఁదలంపిడి తెల్వి యందమిన్
విపుల విచారుఁడైన వినిపించితి వీవ జగత్ప్రభుండుగా
'తప తప' యన్న వాణి గగనమ్మున వీనుల విందుగాగ మున్
దపమొనరింపఁ బ్రేరణమొనర్పఁదలంచి విరించి కయ్యెడన్

ఆ బ్రహ్మ చరాచరసృష్టి చేయవలెనను కుతూహలముతో పరికించి చూచి తెలియనేరక తికమకపడుచుండగా జగన్నాథుడవైన నీవు అతనిని తపస్సుచేయుమని ప్రేరణచేయుచు తపతపయను ఆకాశవాణిని వినిపించితివి.

సృష్టి అనగా సత్వాది త్రిగుణముల పాళ్ళు హెచ్చుతగ్గులుగా నుండుటయే. ఆ యా పాళ్ళయొక్క విభాగము మొదట బ్రహ్మకవగాహన కాలేదన్నమాట. అందులకు తపస్సే సాధనము.

శ్లో సౌ మా మవద త్ప్వమా నితి జలాపూర్ణే జగన్మండలే
దిక్షూద్వీక్ష్య కిమప్యనీక్షితవతా వాక్యార్థ ముత్పశ్యతా
దివ్యం వర్ష సహస్ర మాత్తతపసా తేన త్వ మారాధిత
స్తస్మై దర్శితవా నసి స్వనిలయం వైకుంఠ మేకాద్భుతమ్. 3

అవ్విధి లోకముల్ జలమయమ్ములు గాగ నెవండొ పల్కనీ
సవ్వడి కర్థమేమని దెసల్ పరికించి యొకింత గాన రా

కవ్వల దివ్యవత్సర సహస్రము నిన్ దపమూని కొల్వదా
దవ్వల నవ్వికుంఠ పరధామము చూపితి వాత్మధామమున్

జగత్త్రంతయు అపోమయమై యున్న యీ సమయములో నెవ్వడు నాకీమాట చెప్పెను. దీనియర్థమేమి యని ఆలోచించి యేమియుం గానక బ్రహ్మ వేయిదివ్య సంవత్సరములు తపస్సుచేసి నిన్ను ఆరాధింపగా నతనికి పరమాద్భుతమైన నీనివాసము వైకుంఠముం జూపితివి.

మాయా యత్ర కదాపి నో వికురుతే భాతే జగద్భ్యోబహి
శ్శోకక్రోధవిమోహసాధ్వసముఖా భావాస్తు దూరంగతాః
సాంద్రానందఝురీచ యత్ర పరమజ్యోతిః ప్రకాశాత్మకే
తత్తే ధామ విభావితం విజయతే వైకుంఠరూపం విభో. 4

ఎచటన్ మాయ వికారముల్ నెఱపదో యేలోకముల్ దోఁపవో
యెచటన్ భీతియు కోపమోహములు లేనేలేవొ జ్యోతిర్మయ
మ్మెచటన్ బూర్ణ సుఖావబోధసుధ జాలెత్తున్ ఝరీ వేగ సు
ప్రచురమ్మై యది నీ నివాస మలరున్ వైకుంఠధామమ్మునాన్

ఆ వైకుంఠలోకము సృష్టి ప్రళయములందుగూడ యెట్టి వికృతినందదు. జగములన్నిటి కతీతమై భాసించును. శోక క్రోధ మోహ మరణభయము లక్కడ లేవు. అచట సాంద్రానంద ప్రవాహము జాలెత్తుచుండును. అది స్వయంజ్యోతిస్స్వరూపము. సూర్యాది జ్యోతిస్సులకు వెలుగు నిచ్చునది కూడ. ప్రభూ! ఆ నీ వైకుంఠధామము సర్వోన్నతమై ప్రకాశించుచున్నది.

యస్మిన్ నామ చతుర్భుజా హరిమణి శ్యామావదాత త్విషో
నానాభూషణరత్న దీపితదిశో రాజ ద్విమానాలయాః
భక్తి ప్రాప్త తథావిధోన్నతపదా దీవ్యంతి దివ్యాజనా
స్తత్తే ధామ నిరస్త సర్వశమలం వైకుంఠరూపం జయేత్. 5

ఎందు విమాన మందుఁ జరియింత్రు చతుర్భుజు లింద్రనీలకాం
తిం దులకించు మేనులను దివ్యవిభూషణ రత్నపుంజ మె
ల్లం దెసలం దళత్తళ వెలార్చగ భక్తి గడింపనైన నీ
మందిర మా వికుంఠ మసమానము భక్త నిధాన మింపగున్

ఇందుండు దివ్యపురుషులు శుద్ధసత్త్వమయమూర్తులు నీ భక్తులై నీ సారూప్యమందినవారు చతుర్భుజులు. ఇంద్రనీలమణికాంతి విగ్రహులు మకరకుండలాది సువర్ణ భూషణ మణికాంతులచే దెసలెల్ల మెఱపించువారు కిణికిణిత మణికింకిణీ మంజుల విమానములెక్కి దిరుగువారు అట్టి నీ పరంధామము పరమోన్నతమై రాణించుగాక!

నానాదివ్య వధూజనై రభివృతా విద్యుల్లతాతుల్యయా
విశ్వోన్మాదనహృద్యగాత్రలతయా విద్యోతి తాశాంతరా
త్వత్పాదాంబుజ సౌరభైక కుతుకా లక్ష్మీః స్వయం లక్ష్యతే
యస్మిన్ విస్మయనీయ దివ్యవిభవం తత్తే పదం దేహి మే. 6

సురనారీ పరివారయై సకల విశ్వోన్మాద కృద్గాత్ర వ
ల్లరి విద్యుల్లతికావిలాసము దెసల్ భాసింపఁజేయన్ భవ
చ్చరణాంభోజ సహాసనాభిరతి సాక్షాదిందిరా దేవి ని
ర్భర మానందమునన్ వసించు పద మవ్వైకుంఠ మీవే దయన్.

అందు జగజ్జనని మంగళదేవత మహాలక్ష్మి అనేకదివ్యసుందరీజన పరివారముతో విశ్వోన్మాదము గూర్చు మెఱపుదీవవోలె మెఱయు మెయిదీగచే, దిశలెల్ల మెఱయించుచు ఆశ్చర్యపడదగిన దివ్యవైభవముతో నీ చరణారవింద పరిమళము లానెడి వేడుకగొని విడువక యెల్లవేళల మసలును. నీ ఆ దివ్యధామమును తండ్రీ! నా కనుగ్రహింపుము

తత్రైవం ప్రతిదర్శితే నిజపదే రత్నాసనాధ్యాసితమ్
భాస్వత్కోటి లసత్కిరీటకటకా ద్యాకల్పదీప్రాకృతి
శ్రీవత్సాంకిత మాత్తకౌస్తుభమణి చ్ఛాయారుణం కారణం
విశ్వేషాం తవ రూప మైక్షత విధి స్తత్తే విభో భాతు మే. 7

కని యాలోనన భానుకోటి విలస త్కోటీర హారాది భూ
షణదీ ప్రాకృతి యాత్త కౌస్తుభమణిచ్ఛాయారుణ మ్మంతఁజూ
చెను వాణీశుఁడు విశ్వకారణము నీ శ్రీవత్సవక్షమ్ము పా
వనరూప మ్మపురూప మయ్యది సదా భాసించుతన్ నాయెదన్

అనుగ్రహముచే నీవు చూపిన ఆ లోకమందు బ్రహ్మ, రత్నాసనాసీనుని కోటి భానుప్రభాభాసి కిరీట హార కంకణాలంకృతుని శ్రీవత్స చిహ్నుని కౌస్తుభమణి కాంతిచే నరుణ మూర్తియైన జగత్కారణుని నిన్ను దర్శించెను. ప్రభూ! నాకా రూపము భాసించుగాక!

కాలాంభోదకలాయ కోమలరుచీ చక్రేణ చక్రం దిశా
మావృణ్వాన ముదార మందహసిత స్యంద ప్రసన్నాననమ్
రాజ త్కంబు గదారి పంకజధర శ్రీమద్భుజామండలం
స్రష్టు స్తుష్టికరం వపు స్తవ విభో మద్రోగముద్వాసయేత్. 8

జలదానీల కలాయ కోమలతను చ్ఛాయాచ్ఛటాంబ చ్ఛటా
కలితా క్రాంత దిగంతరాళము గదా కంజాబ్జ చక్రా యుధో
జ్జ్వల బాహు ద్వితయ ద్వయ స్ఫురణమున్ స్వచ్ఛస్మితాస్యమ్మునై
యలరించెన్ విధి నే విలాస మది నా యాయాసముం బాపుతన్

తొలకరిమేఘమట్లు - ఇఱుగుడుపువ్వువలె కోమలము నీలమునైన నీ మేని కాంతిమండలముచే దిఙ్మండలము నావరింపజేయుచు అచ్చపు చిరునవ్వులు వెల్లువలుగొన భాసించు ప్రసన్నముఖముతో శంఖ చక్ర గదా పద్మములు దాల్చిన నాల్గుభుజములతో నలువకు దర్శనమిచ్చి తృప్తి నిచ్చిన నీ మూర్తిని నా మనసునందు భాసింపజేయుము. అది నా రోగమును హరింపగలదు.

దృష్ట్వా సంభృతసంభ్రమః కమలభూ స్త్వత్పాదపాథోరుహే
హర్షావేశ వశంవదో నిపతితః ప్రీత్యా కృతార్థీభవన్
జానాస్యేవ మనీషితం మమ విభో జ్ఞానం తదాపాదయ
ద్వైతాద్వైత భవత్స్వరూపపర మిత్యాచష్ట తం త్వాం భజే. 9

కని నిన్ సంభ్రమమంది హర్షవశుడై కంజాతగర్భుండు వ్రా
లెను ధన్యుండయి నీ పదాబ్జములఁ; బల్కెన్ స్వామి! తెల్లంబ నా
మన, సద్వైతము ద్వైతమైనది భవన్మాధుర్యముం దెల్పు, చ
క్కని జ్ఞాన మ్మది యిమ్ము నిన్గొలిచెద కైమోడ్చిన్ యర్థించెదన్.

ఇట్లు నినుగని హర్షవివశుడై తొట్రువడి కమలయోని నీ పాదకమలముపై బడి ధన్యుడై 'స్వామి! నా కోరిక నీ వెఱింగియే యున్నావు ద్వైతము అద్వైతమునైన నీ నిక్కమైన జ్ఞానము నాకు ప్రసాదముగ ప్రసరింపజేయుము. అని వేడుకొనెను. అట్టి ని న్నేను భజించెద.

వి.వి:- ద్వైతము - అద్వైతమునైన జ్ఞానమనగా; పరబ్రహ్మానుభము నిష్కలము, అపరబ్రహ్మానుభము సకలము (సగుణము సాకారము) అను ఉభయ విధజ్ఞానము. అది ప్రసాదింపుమని బ్రహ్మయొక్క ప్రార్థన.

**ఆతామ్రే చరణ వినమ్ర మథ తం హస్తేన హస్తే స్పృశన్**
**బోధ స్తే భవితా న సర్గవిధిభి ర్బంధోపి సంజాయతే**
**ఇత్యాభాష్య గిరం ప్రతోష్య నితరాం తచ్చి త్తరూఢః స్వయం**
**సృష్టౌ తం సముదీరయ స్స భగవా నుల్లాస యోల్లాఘతామ్. 10**

**ఆ తామ్ర స్ఫురణమ్ము నీ చరణమం దానమ్రుఁ డైనంతఁ జే**
**సేతన్ బూని, లభించు జ్ఞానమది సృష్టిన్ సల్పు; మీ చేఁత యే**
**రీతిన్ బంధముగాదు లెమ్మని గడుం బ్రీతిన్ బ్రసంగించి నా**
**వే తత్ సృష్టికిఁ జోదనం జలిపి తండ్రీ! నా యఘమ్మార్పవే.**

అరుణములయిన తన చరణములందు వ్రాలిన యా సరసిజగర్భునిచేయి తనచేత తాకుచు 'నీకు జ్ఞానము గల్గును. సృష్టి కార్యము నీకు బంధముగాదు అని పలికి సంతోషముగూర్చి లెమ్మని లేవదీసి అతని చిత్తమునంద మఱుగై (అంతర్యామి రూపముననుండి) యతనిని సృష్టి కార్యమున లెస్సగ ప్రేరేపించితివి అట్టి నీవు నా కారోగ్యము చేకూర్చుము.

# 8వ దశకము

# ప్రళయము - సృష్టి

**ఏవంతావత్ ప్రాకృతప్రక్షయాంతే బ్రాహ్మేకల్పే హ్యాదిమే లబ్ధజన్మా**
**బ్రహ్మా భూయ స్త్వత్త ఏవాప్య వేదాన్ సృష్టిం చక్రే పూర్వకల్పోపమానామ్**

**ఈవిధిఁ బ్రాకృత ప్రళయ మేగిన యంతట బ్రహ్మకల్పమం**
**దావిధి వెండియుం జననమంది త్వదీయకృపావిశేష సం**
**ప్లావిత వేదరాశి గొని భవ్యగతిన్ జగమున్ సృజించె సం**
**భావిత పూర్వకల్ప సమభావముగాఁ గమలామనః ప్రియా!**

ఇట్లు ప్రాకృత ప్రలయానంతరము మొదటదగు బ్రహ్మకల్పమందు జనించి బ్రహ్మ తిరిగి నీ వలననే వేదములను బడసి పూర్వకల్పముం బోలిన సృష్టిని గావించెను. ఋతువులందు ఆయా ఋతు చిహ్నము లేక రూపమున నున్నట్లు ప్రతికల్పమును సృష్టికూడ పూర్వకల్పమువలెనే యుండును.

**సోఽయం చతుర్యుగసహస్రమితా న్యహాని**
**తావన్మితాశ్చ రజనీ ర్బహుశో నినాయ**
**నిద్రాత్యసౌ త్వయి నిలాయ సమంస్వసృష్టై**
**ర్నైమిత్తిక ప్రళయమాహురతోస్యరాత్రిమ్.**

**అతఁడటు మున్ జతుర్యుగసహస్రముగాఁ బగటిం గ్రమించి త**
**న్మితముగ రేలునుం గడిపి నిద్దురవోఁజని యాత్మసృష్టితో**
**జతగ లయించె నీయెడన శాస్త్రవిదుల్ మఱి దానినే నిరా**
**హతి సనిమిత్తమైన ప్రళయమ్మని రయ్యది రాత్రి బ్రహ్మకున్.**

ఈ బ్రహ్మ చతుర్యుగ సహస్ర పరిమితములైన పవళ్లు అనగా కల్పములను అదే పరిమితములైన రాత్రులను బెక్కుమారులు గడపును. అవల తాను సృజించిన చరాచర సృష్టితోబాటు నారాయణుడగు నీయందు లీనుడై నిద్రవోవును. అదే బ్రహ్మకు రాత్రి నైమిత్తిక ప్రళయమని దానినే యందురు. బ్రహ్మయొక్క పగటి ప్రమాణ మెంతో దాని ప్రమాణమును అంతే.

**అస్మాదృశాం పున రహర్ముఖకృత్యతుల్యాం**
**సృష్టింకరోత్యనుదినం స భవత్ప్రసాదాత్,**
**ప్రాగ్బ్రహ్మకల్పజనుషాం చ పరాయుషాంతు**
**సుప్తప్రబోధనసమాస్తి తదాపి సృష్టిః.**

**ప్రాతఃకృత్యమునట్టు లాతఁడు జగత్ప్రారంభముంజేయఁ బ్రా**
**భాత శ్రీరుచి నీ కృపా విలసన ప్రారంభమైనంత వి**
**ఖ్యాత ప్రాక్తనకల్ప జీవులగు మార్కండేయముఖ్యర్షి సం**
**ఘాతమ్మంతకు నిద్రమేల్కనుటయుంగా సృష్టిభాసించెడిన్.**

ఆ బ్రహ్మ మనము చేయు స్నానసంధ్యాది నిత్యకృత్యమువలెనే దిన దినము సృష్టి కార్యము నీయనుగ్రహముచే నిర్వహించును పూర్వకల్పమందు బుట్టి బహుకల్పాయుష్కులైయుండు మార్కండేయాదులకు అది నిద్రవోయిలేచి నట్లుండును సృష్టి యనిపించుకొనదు

వి వి: ఏలయనిపించుకొనదు బ్రహ్మకువలె వారికిని నిద్రా ప్రబోధము లున్నవని యన్నారుగదా! అన్న-అదిగాదు వారు బ్రహ్మయందు లీనులై తిరిగి యాయనచే సృష్టింపబడుచుండుటలేదు వారు లీనమైన బ్రహ్మకును తిరిగి బ్రహ్మ సృష్టిలేదు కావున వారికిది నిద్ర - మెళకువ మాత్రమేకాని వేరుగాదు; మనబోంట్లకువలె వారికిని సృష్టియే అగుగాక నిద్రాప్రబోదము లెందులకు అన్న వెనుకటి కల్ప విషయమైన స్మృతి వారికిపోదు మనకది పోవును కావున మనది సృష్టి, వారిది మెళకువ యనుట యుక్తమే

**పంచాశదబ్ధ మధునా స్వవయో౾ర్ధరూప**
**మేకం పరార్ధ మతివృత్య హి వర్తతే,**
**సౌ తత్రాంత్యరాత్రిజనితాన్ కథయామి భూమన్**
**పశ్చాద్దినావతరణే చ భవద్విలాసాన్.** **4**

**ఒక పరార్ధమ్ము బ్రహ్మవయో౾ర్ధమేగె**
**నిప్పటికి నేఁబదేండ్లయి, యింతమున్ను**
**రేయి, యవ్వలి పగటిలో నీయశేష**
**విలసన విశేష మదియేమొ విన్నవింతు.**

బ్రహ్మ కిప్పు డేబదియేండ్ల వయస్సు. ఒక పరార్థము గడచినది. ప్రస్తుతము వరాహకల్పము ద్వితీయ పరార్థమునకు మొదలు. బ్రహ్మకల్పముల యందు మొదటిది బ్రాహ్మకల్పము. దాని వెనుకటి రాత్రి - అనగా ప్రథమ పరార్థము యొక్క చివరి రాత్రివేళ జరిగినట్టియును, తరువాత పగలు నందు కల్పారంభమందు జరిగినట్టియు నీ విలాసములను స్తుతింప నారంభించు చున్నాను.

**దినావసానే౽థ సరోజయోనిః సుషుప్తికామ స్త్వయి సంనిలిల్యే**
**జగంతి చ త్వజ్జఠరం సమీయుస్తదేద మేకార్ణవ మాస విశ్వమ్ 5**

పగటితుదఁ బద్మగర్భుండు పండుకొనఁద
లంచి నీలోన దాను లయింప నీదు
గర్భగోళమ్ము సొచ్చె జగమ్ములెల్ల
అఖిల విశ్వమ్మునయ్యె నేకార్ణవమ్ము

పద్మ గర్భుడు పగటి చివర వెనుకటి కల్పము తుద శ్రీ నారాయణుడవగు నీయందు లీనుడయ్యె. అనగా నిద్రవోయెనన్నమాట. లోకములు గూడ ఆయనతో నీ గర్భ గోళముం జొచ్చినవి: అపుడు ఈ ప్రపంచము ఏకార్ణవమై రాజిల్లెను.

**తవైవ వేషే ఫణిరాజశేషే జలైక శేషే భువనే స్మశేషే**
**ఆనంద సాంద్రానుభవ స్వరూపః స్వయోగనిద్రా పరిముద్రితాత్మా. 6**

శేషునిపై భవత్తను విశేషునిపై భువనైకశేషని
శ్శేషము లౌనెడన్ భువనసీమలు కన్నులుమోడ్చి యెట్టియు
న్మేషములేక యోగ సుఖ నిద్ర నిరంతర నిర్విశేషసం
తోషరసానుభూతిగొని తూగితి వాపయి నీదుశయ్యపై.

ఇట్లు జగత్తు ఆపోమాత్రముగ శేషింపగ నీవు నీ వేషాంతరమయిన ఫణిరాజగు శేషుని యందు (అనంతునియందు) సాంద్రానందానుభవ స్వరూపుడవై స్వస్వరూపాను సంధానరూప యోగనిద్రా ముద్రితుడవై శయనించితివి.

**కాలాఖ్యశక్తిం ప్రళయావసానే ప్రబోధయే త్యాది శతాకిలాదౌ**
**త్వయా ప్రసుప్తం పరిసు ప్త శక్తిప్రజేన తత్రాఖిల జీవధామ్నా. 7**

**నీలోనన్ నిజశక్తి బృందము మొదల్ నిద్రింప జీవప్రతా**
**నాలంబమ్మవు నిద్రవోయితివి నీవాత్మీయకాలాఖ్యశ**
**క్త్యాలింగ మ్మొనరించి గాఢముగ నీయాదేశ మందించి ము**
**న్నీలీలన్ బ్రళయావసానమున నన్ మేల్కొల్పుమంచామెతోన్**

అఖిల జీవులకు విశ్రాంతిస్థానమైన నీవు ప్రళయముముందు "ఈ ప్రళయము చివర నీవు నన్ను లేపు మని కాలమనెడి శక్తి కాజ్ఞ యిచ్చి మూలప్రకృతి మహత్తత్త్వము, అహంకారము మొదలయిన శక్తి సమూహముతో సుఖ నిద్రవోయితివి

వి.వి : బహుపత్నీకుడైన నాయకుడు అందఱు నిద్రవోగా అత్యంత వల్లభయైన యామెతో కొంత సేపుండి మంచిమెళకువగల యామెతో నీవు తెల్లవారగానే నన్ను లేపుమని చెప్పి ఆమెను గాఢముగ గౌగలించుకొని నిద్రించినట్లు నారాయణుడు శేషతల్పశాయియై కాలాఖ్యశక్తితో నంతర్ముఖుడై యుండునని భావము

**చతుర్యుగాణాం చ సహస్రమేవం త్వయి ప్రసుప్తే పున రద్వితీయే**
**కాలాఖ్యశక్తిః ప్రథమప్రబుద్ధా ప్రాబోధయత్ త్వాం కిల విశ్వనాథ.**
**విబుధ్యచ త్వం జలగర్భశాయిన్ విలోక్య లోకా నఖిలాన్ ప్రలీనాన్**
**తేష్వేవ సూక్ష్మాత్మతయా నిజాంతః స్థితేషు విశ్వేషు దదాథ సృష్టిమ్. 8**

**అటు సనియెన్ జతుర్యుగ సహస్రము లద్వయుఁడీవు నిద్రవోఁ**
**దటుకున మెళ్కువంది నిను దా నటు లేపెను గాలశక్తి యం**
**తట జలగర్భశాయి! కని దాగిన లోకము నీవు నీదులో**
**గిట నవి సూక్ష్మతన్ నిలఁ నిగిడ్చితి వాయెడ నీదు నీక్షణన్**

రెండవదియన్నదిలేకుండ నీవిట్లు నాల్గు యుగసహస్రములు నిదురింపగా కాలశక్తి ముందు మేల్కొని ఓ విశ్వనాథ! నిన్ను మేల్కొల్పినదట. 'అట' అనుట ఇది కేవల పురాణప్రసిద్ధమని తెలుపుటకు.

**తతస్త్వదీయా దయి! నాభిరంధ్రా దుదంచితం కించన దివ్యపద్మం**
**నిలీన నిశ్శేష పదార్థమాలా సంక్షేపరూపం ముకులాయమానం.**
**తదేతదంభోరుహ మంజులం తే కళేబరా త్తోయపథే ప్రరూఢం**
**బహిర్నిరీతం పరితః స్ఫురద్భిః స్వధామభి ర్ధ్వాంతమలం న్యకృంతత్. 9**

**అంతట నీదు నాభివివరాంతరమం దుదయించె సత్వసం**
**క్రాంత ముదంచిత మ్మగు నొకానొకతామరమొగ్గ చక్కనై**
**స్వాంతర లీనలీన సకలార్థ సమగ్ర సమిష్టి సృష్టి యం**
**తంత జలమ్ములం దెగసి యచ్చపుఁ గాంతి హరించె జీఁకటిన్**

ఓ జలశాయి! నీవు మేల్కొని నీ యందు లోకములన్నియు లీనమయిన వని చూచి సూక్ష్మముగ కారణ రూపమున నీలోనున్న లోకములందు దృష్టిని బ్రసరింప జేసితివి.

ఓ భగవంతుడా! నీ చూచిన తరువాత నీ నాభి రంధ్రమునుండి దివ్యము, ప్రకాశ సమృద్ధము, సత్త్వమయము, నీలో లీనమయిన అశేష వస్తు సమూహము యొక్క సంగ్రహరూపము బీజరూపము మొగ్గగానున్న (ముకులావస్థనున్న) పద్మము మొలచెను.

**సంపుల్లపత్రే నితరాం విచిత్రే తస్మి న్భవద్వీర్య ధృతే సరోజే**
**స పద్మజన్మా విధి రావిరాశీత్ స్వయం ప్రబుద్ధాఖిల వేదరాశిః**
**అస్మిన్ పరాత్మ న్నను పాద్మకల్పే త్వమిత్థ ముత్థాపిత పద్మయోనిః**
**అనంతభూమా మమ రోగరాశిం నిరుంధి వాతాలయవాస! విష్ణో. 10**

**విరిసినరేకులన్ మివుల వింతలు గొల్పుచు నీదు వీర్యసం**
**భరితమునైన యాకమలమందిరమందు స్వయం ప్రబుద్ధసుం**
**దరతర వేదరాశి యఘనాశి స్ఫురించెను బద్మకల్పమం**
**దిరవుగఁ బద్మయోని బొడమించిన తండ్రివి నన్ను బ్రోవవే**

ఈ తామర మొగ్గ నీ మేనినుండి జలమందు మొలచి వెలికి వెడలెను. మఱియు నెల్లెడల గ్రమ్ము తన కాంతులచే నెల్లచీకటులను హరించెను.

రేకులువిరిసి మిక్కిలివింతయై నీ వీర్యముచే, యోగబలముచే, ధరింపబడిన యా తామరపువ్వునందు సర్వవేదవేదార్థము తనంత స్ఫురింప సర్వజ్ఞమూర్తివై పద్మగర్భుడుగ నీవె యావిర్భవించితివి.

ఓ పరమాత్మ! ఈ విధమైన పద్మకల్పమందు పద్మయోనిని సృజించిన అనంతశక్తి సంపన్నుడవు నారోగరాశిని నివారింపుము.

# 9వ దశకము

# సృష్టివిలాసము

స్థితస్స కమలోద్భవస్తవ హి నాభిపంకేరుహే
కుతస్స్విదిద మంబుధా వుదితమి త్యనాలోకయన్
తదీక్షణకుతూహలాత్ ప్రతిదిశం వివృత్తానన
శ్చతుర్వదనతామగా ద్వికసదష్టదృష్ట్యంబుజాం. 1

నలినభవుండు నీదు నతనాభిసరోజమునన్ వసించి యీ
జలధి నిదెట్లు పూచె జలజమ్మను వేడుకఁ జూచి యేమియున్
దెలియక నల్దెసల్ మొగము ద్రిప్పి కనుంగొన నాల్గుమోములున్
నలిన నిభమ్ములైన నయనమ్ములు నెన్మిది గల్గె వానికిన్

బ్రహ్మ నీ నాభికమలమందుండి యీ పువ్వు సముద్రమందెట్లుపూచినదని పరికించి తెలియనేరక తెలిసికొను వేడుకతో నలుదిశలకు మొగము ద్రిప్పి కనుంగొనగా నాల్గు ముఖములు ఎనిమిదికన్నులు నేర్పడెను. దాన చతురుఖ్ముడను పేరొందెను.

మహార్ణవవిఘూర్ణితం కమలమేవ తత్కేవలం
విలోక్య తదుపాశ్రయం తవ తనుం తు నాలోకయన్
కఏష కమలోదరే మహతి నిస్సహాయో హ్యహం
కుతస్స్విదిద మంబుజం సమజనీతి చింతామగాత్. 2

**జలధితరంగడోలికను సారెకు నూఁగుచు నూఁగుచున్నయా**
**జలజముతోడఁ జిత్తజలజమ్మును నూఁగగ, దాని కండగా**
**నిలిచిన నీదురూపు గననేరక యాకమలోదరమ్మునన్**
**బొలిచెద నే నెవండ? యెటుపూచిన దీశతపత్ర మంచునున్**

సముద్రమందూగుచున్న యాపద్మముతో బాటు తానును మనస్సును ఊగిపోగా దానియధిష్ఠానమైయున్న నీరూపు గానక యాపువ్వుపై నొక్కడనై యున్న నేనెవ్వడను? ఈ పుష్ప మెట్లు పూచినది? అను నాలోచనలోబడెను

**ఆముష్యహి సరోరుహః కిమపి కారణం సంభవే**
**దితిస్మ కృతనిశ్చయ స్స ఖలు నాలరంధ్రాధ్వనా**
**స్వయోగబలవిద్యయా సమవరూఢవాన్ ప్రౌఢధీ**
**స్త్వదీయ మతిమోహనం న తు కళేబరం దృష్టవాన్. 3**

**దీనికి మూలముండకయ తీర దటం చణిమాఖ్య యోగ వి**
**జ్ఞాన బలాన సూక్ష్మ తనుసంగతి నంబుజనాళరంధ్ర మా**
**ర్గానను గ్రిందికిందిగి జగత్త్రయమోహను బుద్ధిశాలి నిన్**
**గానఁగ బోయిపోయి నినుగానకపోయె నిదాన మయ్యెడన్**

ఈ పద్మమున కేదేనియాధారముండి తీరునని బుద్ధిశాలియై నిశ్చయించి అణిమ యను యోగసిద్ధిచే సూక్ష్మశరీరియై తూడువెంట నడుగునకు బోయి వెదకి వెదకి నీ జగన్మోహనాకారము గానలేడయ్యెను

**తత స్సకలనాళికా వివరమార్గగో మార్గయన్**
**ప్రయస్య శతవత్సరం కిమపి నైవ సందృష్టవాన్**
**నివృత్య కమలోదరే సుఖనిషణ్ణ ఏకాగ్రధీః**
**సమాధిబల మాదధే భవదనుగ్రహైకాగ్రహీ. 4**

**అంతటఁ దూడులోని యర లన్నియుఁ జూచి ప్రయాసమంది యె**
**క్కింతయుఁ జూడనేర కటులేగగ వర్షశతమ్ము, వెన్క కం**
**తంతన వచ్చి నీదు దయ నంది సమాధిబలాన నిశ్చల**
**స్వాంతుడు వొల్చె నయ్యెడ సుఖాసనమై వికచాబ్జకర్ణికన్.**

పద్మనాళరంధ్రముల దారులందు చరించి నూరేండ్లు వెదకి యాయాసపడి విసివివేసారి వెనుదిరిగివచ్చి కమలము దుద్దుపై సుఖాసనమును దీర్చి నీ యనుగ్రహమాసించి సమాధినిష్ఠలో నుండెను.

శతేన పరివత్సరై ర్దృఢసమాధి బంధోల్లసత్
ప్రబోధ విశదీకృత స్సఖలు పద్మినీసంభవః
అదృష్టచర మద్భుతం తవహి రూప మంతర్దృశా
వ్యచష్ట పరితుష్టధీ ర్భుజగభోగభాగాశ్రయమ్. 5

తనరి సమగ్ర వత్సరశత మ్మటు తీవ్రసమాధి నిష్ఠ సొం
పున నుదయించు నీదయఁ బ్రబోధము నంది యొకప్పుడేని లో
నెనయని చూపుతోన భుజగేంద్రఫణామణి మండపాగ్ర న
ర్తనము భవత్ప్రవర్తన మెదన్ ముద మింపొదవం గనుంగొనెన్.

అట్లు నూరేండ్లు తపస్సుచేసి నీకృపచే నొక తెలివి యుదయింప దివ్య దృష్టి వడసి అనంతభోగి భోగ రత్నమండపమునందున్న నీ మూర్తిని దర్శించి ముదితహృదయు డయ్యెను.

కిరీటమకుటోల్లస త్కటక హారకేయూరయు
ఙ్మణిస్ఫురితమేఖలం సుపరివీత పీతాంబరం
కలాయ కుసుమప్రభం గలతలోల్లస త్కౌస్తుభం
వపుస్తదయి భావయే కమలజన్మనే దర్శితమ్. 6

మణికిరీటముకాంతి తొణికి యాత్మీయ హృ
త్పుండరీకమున నీ రెండ గాయ
కటిసూత్ర కింకిణీగణ ఝణత్కారంబు
నోంకార నాదమ్ము నుంకువ గొన
కాలాయ కుసుమ లీలా లాలితమ్మైన
తనుకాంతి హంస కుద్ధతి ఘటింప
తరుణ విద్యుద్ద్యుతి స్ఫురణమ్మై పీతాంబ
రమ్ము సంధ్యారాగరక్తినింప

**సరళ కౌస్తుభమణిహార తరళకాంతి**
**పూర మాశాంత శృంగార పూరమై వి**
**రించికిన్ గోచరించిన శ్రీ విలాస**
**మధుర మది వొల్చు నామనః పథమునందు.**

బ్రహ్మకు నీవు చూపిన ఆమూర్తి యీరీతిగ నాహృదయమందు భాసించుగాక! అది కిరీటమణికాంతులు తొణికి బ్రహ్మహృదయమను తెల్లతామరపూవుపై ఉదయభాను ప్రభలం బ్రసరింపజేయుచుండెను. ఆకాంతుల కాతని హృదయమానంద భరితమై పుండరీకమట్లు వికాసము చెందెనన్నమాట. చిఱుగాలికి తఱగ లూగుచుండ స్వామి మొలనూలి రత్నాల చిఱుగంటల నాదము ప్రణవనాదమై వినిపించుచుండెను. ఇఱుగుడు పువ్వుయొక్క నల్లనిఛాయను బోలి ప్రభువు నీలదేహచ్ఛాయ హంసకు అనగా బ్రహ్మయొక్క ప్రాణవృత్తికి ఉల్లాసము గల్పించుచుండెను.

వి.వి : మేఘముం జూచి హంస మానస సరోవరమున కూర్ధ్వముగా పోవుట ప్రసిద్ధముగావున ప్రాణాయామరూప దృఢ సమాధిలో బ్రహ్మయొక్క ప్రాణమయమైన వృత్తి మూలాధారమునుండి లేచి ఊర్ధ్వముఖమై సహస్రారముం దాకెనని భావము. పెద్దలు రాగానే యువకుల ప్రాణములు మీదికి లేచుననియు, ప్రత్యుత్థాన-అభివాదములచే వారు వానిని తిరిగి పొందుదురు అనగా స్వస్థులగుదురని మనుస్మృతి చెప్పినట్లు బ్రహ్మ జగద్గురుమూర్తి యగు శ్రీహరి మూర్తిని చూడగానే ప్రాణరూపహంస కుండలినీ శక్తి గురుచరణ స్థానమైన సహస్రారమున కొక గంతువేసెనని, అదే సహస్రారకమల మకరంద నిష్యంద రసానుభవరూప పరమబ్రహ్మానందస్థాయి చతుర్ముఖున కనుగ్రహించిన వాడవు నీవు. అట్టి శ్రీవిలాసమధురమూర్తి నామనః పథమున స్ఫురించుగాక! యని కవి ప్రార్థనము. మెఱపుతీవ వోలె మెఱసి పీతాంబరము సంధ్యారాగ రక్తిమను నించుచుండెను.

**వి.వి: "విద్యుల్లే ఖేవ భాస్వరా! నీవార శూక వ**
**త్తన్వీ పీతా భాస్వత్యణూపమా"**

అని మంత్రపుష్పము నెవరిముల్లు వోలె సూక్ష్మమై పచ్చనై మెఱపు దీగవలె మెఱయునని వర్ణించినది కుండలినీ శక్తి విలాసమే యిచట

పీతాంబరము శోభయై సంధ్యారాగము యొక్క సొంపునింపుచుండెను. అనగా బ్రహ్మయొక్క ప్రాణవృత్తి కేవల నిష్కల బ్రహ్మానుసంధాన సమాధిలో నుండెననియు, నప్పుడు కుండలినీ ప్రబోధమయి ఆశక్తి సహస్రారమంటి శక్తిపాతమయ్యెనను యోగరహస్య మిచట సంగృహీతము. కౌస్తుభరత్న హారకాంతులు దశదిశలకు వింత శోభనము గూర్చుచుండెను. ఆ మూర్తికేవలము లక్ష్మీ వినోదమధుర మగుటలో నాశ్చర్యము లేదు.

**శ్రుతిప్రకర దర్శిత ప్రచుర వైభవ శ్రీపతే**
**హరే! జయజయ ప్రభో పద ముపైషి దిష్ట్యా దృశోః**
**కురుష్వ ధియ మాశు మే భువననిర్మితౌ కర్మఠా**
**మితి ద్రుహిణవర్ణిత స్వగుణబృంహిమా పాహి మాం** 7

> **శ్రుతులు నుతించు నీ సొగసు శోభనమౌత! రమాపతీ! జగ**
> **త్పతి! జయమౌ! జయమ్మగుత! భాగ్యము పండెను నాకు గోచరిం**
> **చితివి జగత్ప్రబంధము రచించు మతిం దయసేయుమంచు బ**
> **ల్పితముల నెంచు నర్భకు గవిం బొనరించిన తండ్రి! ప్రోవవే**

ఉపనిషద్వాక్యములు నీ సొగసును వర్ణించును. జగత్కారణమీవని నీ మహిమను శ్రుతులు వినిపించినవి. అట్టినీవు నాభాగ్యమువలన నాకన్నులకు గోచరించుచున్నావు. ఇప్పుడు జగన్నిర్మాణమునకు గావలసిన తెలివి ప్రసాదింపుము. అని నుతించెడి బ్రహ్మకుగూడ తండ్రివి. అట్టి కల్యాణగుణ నిలయుడవు నీవు నన్ను గృతార్థుని జేయుము.

వి వి : ఆచేయుట తెలుగు అనువాదములో; సృష్టి ఒక కావ్యము. దానిని రచించువాడు కవయతీతికవిః - కల్పనచేయువాడు, కవి అను పరిష్కారముం బట్టి కవియనుపేరు బ్రహ్మకు సార్థకము. నీపై నీ కావ్యసృష్టి కల్పనచేయు నీ శిశువును నన్నును అట్టి కవిని గావింపుము అని స్వారస్యము.

**లభస్వ భువనత్రయీ రచనదక్షతా మక్షతాం**
**గృహాణ మదనుగ్రహం కురు తపశ్చ భూయో విధే**
**భవ త్వఖిలసాధనీ మయి చ భక్తి రత్యుత్కటే**
**త్యుదీర్య గిర మాదధా ముదితచేతసం వేధసమ్.** 8

**ఇచ్చెద సృష్టిశిల్పమున కిమ్మగునేర్పు గ్రహింపుమోయి! ని**
**న్మెచ్చితి నాయనుగ్రహము నీ విటుగాంచి తపమ్ము సేయు మీ**
**యచ్చపుభక్తి నాయెడల నౌ సకలార్థద మంచుఁ జేసి నా**
**వ చ్చతురోక్తులన్ వికసితాననుగాఁ జతురాననున్ హరీ!**

అట్లు నుతించు బ్రహ్మనుగని నీకు భువన నిర్మాణమున కవసరమైన నేర్పు నిచ్చెదను. అందుకొమ్ము. వెంటనే నీ యెడల బ్రసన్నుడనైతిని. తపస్సు మానకుము. నాపై నీకుగల భక్తి సర్వార్థసాధనము. అని నిపుణమైన నీమాటలచే చతుర్ముఖుని మోము వికసింపజేసితివి.

**శతం కృతతపాస్తత స్స ఖలు దివ్యసంవత్సరా**
**నవాప్యచ తపోబలం మతిబలంచ పూర్వాధికమ్**
**ఉదీక్ష్యకిల కంపితం పయసి పంకజం వాయునా**
**భవద్బలవిజృంభితః పవనపాథసీ పీతవాన్.** 9

**ధాత యొనర్చి వత్సరశతమ్ము సతమ్ము తపమ్ము సృష్టిసం**
**ధాత యనంగఁ బేర్వడసి త్వద్బల సంపదఁ జేసి శక్తి సం**
**పాతమునంది గాలి కటు మాటికి పద్మము కంపమొంద నీ**
**యూతను ద్రావివైచె ననిలోదకముల్ బలజృంభణమ్మునన్**

నూరేండ్లెడతెగని తపస్సుచేసి ధాత విధాతయను కీర్తివడసి విచిత్రశక్తి వడసి తాగూర్చున్న తామరపువ్వు గాలికూగిపోగా గని నీ విచ్చిన మహిమచే నా గాలిని ఆవరణోదకము గూడ ఒకేసారి త్రావివైచెను.

**తవైవ కృపయా పున స్సరసిజేన తేనై వ స**
**ప్రకల్ప్య భువనత్రయీం ప్రవవృతే ప్రజానిర్మితౌ,**
**తథావిధకృపాభరో గురుమరుత్పురాధీశ్వర**
**త్వ మాశు పరిపాహి మాం గురుదయోక్షితై రీక్షితైః.** 10

**నీ కరుణా విశేషమున నీరజగర్భుఁడు పద్మమందు ము**
**ల్లోకము లేర్పరించి మొదలుం గొనియెన్ బ్రజసృష్టి సేయ న**

**ప్రాకృతమూర్తి! నీ గురు కృపా మధురార్ద్ర కటాక్ష చంద్రికా**
**సేకము సేసి కావు నను శ్రీ గురువాయుపురాధినాయకా!**

గురువాయూరు దేవాలయము విలాసమందిరముగాగల ఓ నారాయణా! నీ దయచే బ్రహ్మ తానున్న పద్మమును విభాగముచేసి త్రిభువనములు రచించెను. అట్టి దయ నాపై జూపుము. మఱియు గురుకటాక్షము వంటి గొప్పవగు కటాక్ష రూపమైన అమృతధారా విలాసములచే, గురువులు జగద్గురువగు నీప్రత్యక్ష స్వరూపము గావున వారి కటాక్ష సుధావిలాసములచే గూడ మా వ్యాధుల హరింపుము.

# 10వ దశకము

# సృష్టి క్రమము

**వైకుంఠ! వర్ధితబలో౽థ భవత్ప్రసాదా**
**దంభోజయోని రసృజత్ కిల జీవదేహాన్,**
**స్థాస్నూని భూరుహమయాని తథా తిరశ్చాం**
**జాతీ ర్మనుష్య నివహా నపి దేవభేదాన్** **1**

**ఆవిధి నీదయన్ బలమునంది సృజించెను జీవదేహముల్**
**స్థావరముల్ కుజౌషధిలతా ప్రముఖంబుల జంగమమ్ములన్**
**దేవ మనుష్య జాతులను ధేను హయాది పశువ్రజమ్ము దా**
**నీవిధి కాక కంక బక గృధ్రముఖాఖిల పక్షిజాలమున్**

నీ ప్రసాదముచే బ్రహ్మ జ్ఞానయోగ తపో రూపకర్మయోగములవలన బలము వడసి స్థావరములైన చెట్లు ఓషధులు మొదలగువానిని జంగమములైన గోవులు మొదలగు పశువులను కాకులు గ్రద్దలు మొదలగు పక్షిజాతులను దేవతలను మనుష్యులను సృజించెను.

**మిథ్యాగ్ర హాస్మిమతి రాగ వికోప భీతి**
**మజ్ఞాన వృత్తి మితి పంచవిధాం స సృష్ట్వా,**

**ఉద్దామ తామస పదార్థ విధాన దూన**
**స్తేనే త్వదీయ చరణ స్మరణం విశుద్ధ్యై. 2**

కన మిథ్యాగ్రహ మస్మితామతియు రాగక్రోధముల్ భీతినాఁ
జను నజ్ఞానము వృత్తు లైదు నివి యాశ్చర్యమ్ము నే తామస
మ్మున సృష్టించితినంచు చిత్తమున మున్ను న్నారటమ్మంది చే
సిన పాపమ్మదివోవ నీ చరణరాజీవమ్ము నెంచె న్మదిన్

మిథ్యాగ్రహము = ప్రపంచము ఆత్మకంటె వేరు అనుప్రతీతి, అస్మితామతి = శరీరాదులు నేను నావి యనుకొనుట, రాగము = ధనాదులందు భోగవాంఛ క్రోధము = ఆయాధనాదులను అపహరించిన వానియందు కోపము. భీతి = భోగ్య పదార్థములయిపోవునో నశించునోయని యూహించుట వలని భయము. ఈ యైదు విధములయిన అజ్ఞాన కార్యములను సృష్టించి అయ్యో! తమోగుణముచే నివియేల సృష్టించితినని పరితపించి ఆ పాపశుద్ధికి, అజ్ఞాననివృత్తికి బ్రహ్మ నీ చరణ స్మరణమొనరించెను.

**తావత్ ససర్జ మనసా సనకం సనందం**
**భూయ స్సనాతన మృషించ సనత్కుమారమ్,**
**తే సృష్టి కర్మణి తు తేన నియుజ్యమానా -**
**స్త్వత్పాదభక్తి రసికా జగృహు ర్న వాణీమ్. 3**

మనసున నవ్వలన్ పరమ మంగళమూర్తుల సృష్టిసేసె మున్
సనకు సనందనున్ మఱి సనాతను నంత సనత్కుమారులన్
మునులను, సృష్టి సేయ విధి మున్ బురికొల్పినఁ జేయరైరి వా
రనఘులు నీదు దివ్యచరణాంబుజ భక్తిరసజ్ఞలౌటచేన్.

నీ చరణధ్యానముచే శుద్ధమైనంతటనాతడు మనస్సున సనక సనందన సనాతన సనత్కుమారులను కుమారుల నల్వురం గనియెను. వారు సృష్టిచేయుడని బ్రహ్మ యెంత పురికొల్పినను నీచరణారవిందభక్తిరసికులై యాయన పలుకంగీకరింపరైరి.

**తాప త్రపకోప ముదితం ప్రతిరుంధతో ఽస్య**
**భ్రూమధ్యతో ఽజని మృడో భవదేకదేశః**

**నామాని మే కురు పదానిమే చ విరించే -**
**త్యాదౌ రురోద కిల తేన స రుద్రనామా. 4**

**ఆయన కన్బొమల్ ముడిచె నాగ్రహమై యది యాపికొంటచేన్**
**నీయొకభాగమై యట జనించె మృడుం డెటనుందు నేను బే**
**రేయది నాకటంచు నెగయించి యెలుం గతఁడేడ్వ, రోదనన్**
**జేయుట వాని రుద్రుఁడని నీరజగర్భుఁడు పేర్కొనెన్ హరీ!**

తన యాజ్ఞ పాటింపరని కోపముచే కనుబొమలు ముడిచియు బ్రహ్మ యా కోపము నాపికొనగా నాయన కనుబొమలనుండి నీయంశమైన మృడుఁడు జనించెను. అతడు నేనుండుటకు చోటేది? నా పేరేమి? యని బిగ్గరగ నేడ్చెను. అంత బ్రహ్మ రోదనము సేయుటచే నతనికి రుద్రుడను నామకరణము సేసెను.

**ఏకాదశాహ్వయతయా చ విభిన్న రూపం**
**రుద్రం విధాయ దయితా వనితాశ్చ దత్వా,**
**తావ న్త్యదత్త చ పదాని భవత్ప్రణున్నః**
**ప్రాహ ప్రజా విరచనాయ చ సాదరం తమ్. 5**

**పదునొకండు పేర్లు పలురూపముల రుద్రుఁ**
**జేసి వాని కనుఁగు చేడియలను**
**జేసి యన్ని యుండ్లు సేసి నీ ప్రేరణం**
**బ్రజల గనుమటంచు బ్రహ్మ పనిచె**

నీ ప్రేరణచే బ్రహ్మపరమార్థముగ నేకరూపుడైన యా రుద్రునకు పదునొకండు పేర్లను అంతమంది ప్రియరాండ్రను అన్ని యిండ్లను నొసంగి సంతానముం గనుమని యాజ్ఞాపించెను.

వి.వి : ఏకాదశరుద్రుల పేర్లు మనువు, మన్యువు, మహాదేవుడు, మహాంతుడు, శివుడు, ఋతుధ్వజుడు, ఉరురేతసుడు, భవుడు, కాలుడు, వామదేవుడు, ధృతవ్రతుడు అని రుద్రభార్యలు ధీవృత్తి, అశన, ఉమ, నియుత్తు, సర్పిస్సు, ఇడ, అంబిక, ఇరావతి, సుధ, దీక్ష, రుద్ర నివాసస్థానములు: హృదయము, ఇంద్రియములు, అసువు, వ్యోమము, వాయువు, అగ్ని, జలము, భూమి,

సూర్యుడు, చంద్రుడు, తపస్సు అనునవి. భాగవతము స్కం 3 అ 12 శ్లో||
12, 13.

**రుద్రాభి సృష్ట భయదాకృతి రుద్ర సంఘ**
**సంపూర్యమాణ భువనత్రయ భీతచేతాః**
**మామా ప్రజాః సృజ తపశ్చర మంగళాయే-**
**త్యాచష్ట తం కమలభూ ర్భవ దీరితాత్మా.** 6

**అంతట రుద్రసృష్టిమయమై భువనత్రయ మెల్లనిండె దు**
**ర్దాంతత వారి రౌద్రమున ధాత భయంపడి యార్చె వద్దు వ**
**ద్దింతట సృష్టినాపి తపమే యొనరింపుఁడు మంగళమ్మయౌ**
**నింతన నంచు రుద్రువచియించె నజాండు భవత్ప్రచోదనన్**

రుద్రుడు సృజించిన రుద్రునిచే స్త్రీలయందు కల్గిన సృష్టి వృషభవాహన-భస్మాంగరాగ-ఖట్వాంగ (మంచపుకోడు) పరశు హరిణ (లేడి)కపాల-చర్మాంబర సర్పరాజభూషణ-అగ్ని నయనాదులతోగూడిన రుద్ర సంఘముచే ముల్లోకములు నిండగా బ్రహ్మ భయపడి నిన్ను స్మరించి నీ ప్రేరణచే ఈలాటి భయంకర సంతానమును సృజింపకుము లోకమంగళముగ తపస్సే చేయు మనెను.

**తస్యాథ సర్గరసికస్య మరీచి రత్రిః తత్రాంగిరాః క్రతుమునిః పులహః పులస్త్యః,**
**అంగా దజాయత భృగుశ్చ వసిష్ఠదక్షౌ శ్రీనారదశ్చ భగవన్ భవదంఘ్రిదాసః.**

**అతనికి సృష్టి కార్య రసికాగ్రణి కత్రి మరీచు లంగిరః**
**క్రతు పులహు ల్పులస్త్యుఁడును గల్గిరి బ్రహ్మశరీరమంద యం**
**చితగతి దక్షుఁడున్ భృగు వశిష్ఠులు నీ చరణాబ్జసేవ ని**
**ష్ఠితు లుదయించినారు శుభశీలురు నారదమౌనివర్యులున్**

తపసు చేయుటకు తండ్రియాజ్ఞగొని రుద్రుడు తపోవనము ప్రవేశించిన తరువాత సృష్టికార్యరసజ్ఞుడై ఏ విధముగా సృష్టి కావింతునని తలంచుచున్న యాతని శరీరమునుండి మరీచ్యాదులు పదిమంది పుట్టిరి. మరీచిమనసునుండి, అత్రి నేత్రమునుండి, అంగిరసుడు ముఖమునుండి క్రతువు, హస్తమునుండి పులహుడు, నాభినుండి పులస్త్యుడు, చెవినుండి భృగువు, చర్మము నుండి

వశిష్ఠుడు, ప్రాణమునుండి దక్షుడు, బొటనవ్రేలి నుండి నారద భగవానుడు, మీ చరణదాసుడు ఒడినుండియుం జన్మించిరి.

**ధర్మాదికా నభిసృజ న్నథ కర్దమంచ వాణీం విధాయ విధి రంగజసంకులోఽభూత్**
**త్వద్బోధితై స్సనకదక్షముఖై స్తనూజై రుద్బోధితశ్చ విరరామ తమో విముంచన్.**

**ఆవల ధర్మముఖ్యులను నాతఁడు కర్దము నంతమీద వా**
**గ్దేవి సృజించి కామవికృతింబడె; నేలినవారు తెల్పగా**
**నావిధి దక్షుఁడున్ సనకుఁడాదిగ నందఱు బోధసేయ స**
**ద్భావము నందె నంత యెద బమ్మిన చీకటి యెల్ల మాయగన్**

బ్రహ్మయొక్క కుడిరొమ్మున ధర్ముడు శ్రీ నారాయణుడు జనించిరి. ఆ ధర్ముడు మృత్యువును పృష్ఠమునుండి, కాముడు హృదయమునుండి, క్రోధము కనుబొమలనుండి లోభము పెదవినుండి యిట్లాయాయంగములనుండి ఆయా వ్యక్తులు పుట్టిరి. ఛాయనుండి కర్దముని గనెను. అటుపై సరస్వతిని సృష్టించి యామెయెడ నతడే కామవశుడయ్యెను. అప్పుడు సర్వబుద్ధిసాక్షివగు నీచేత తెలియజెప్పబడిన సనకాదులు దక్షాదులచే తనతనువునం బుట్టిన కొడుకులచే ప్రబోధితుడై అజ్ఞానమువాసి అంతటితో విరమించెను.

**వేదాన్ పురాణనివహానపి సర్వవిద్యాః**
**కుర్వన్ నిజాననగణా చ్చతురాననోఽసౌ,**
**పుత్రేషు తేషు వినిధాయ స సర్గవృద్ధి**
**మప్రాప్నువం స్తవ పదాంబుజ మాశ్రితోఽభూత్.** **9**

**ఆ చతురాననుండు చతురాననుఁడయ్యె న శేషసృష్టి వి**
**ద్యా చతురత్వమంది సకలాగమ పుణ్య పురాణ సంహితా**
**వాచనముం బొనర్చి తన వారల కిచ్చి జగత్ప్రవృద్ధి దు**
**ర్గోచరమౌట నీపద సరోరుహముల్ శరణందె నంతటన్**

బ్రహ్మ తననాల్గుముఖములనుండి సర్వవిద్యలను ఋ గ్యజు స్సామాధర్వణము లనెడి నాల్గువేదములను సంగ్రహరూపమున పురాణములను (వేదాంగము లారింటిని మీమాంస మొదలయిన ఉపాంగములను

ఆయుర్వేదాద్యుప వేదములను నాల్గింటిని మొత్తము పదునాల్గు విద్యలను) ఏర్పరచి తనయుల కిచ్చి ఎంతసేసినను సృష్టి పెరుగకున్నంత పురుష ప్రయత్నమునకు దైవము తోడ్పాటు అవసరమని తెలుపుచు నీపాదాబ్జము లాశ్రయించెను.

వి.వి : ఇక్కడ సర్వవిద్యలు ననిచెప్పి ప్రత్యేకముగ పురాణములను పేర్కొనుట వానికి గల ప్రాధాన్యము ననుసరించి. నాల్గువేదములు చదివినవాడయిన పురాణమర్థ సహితముగా తెలియకున్న నాతనిం జూచి వేదము 'ఇతడు నన్ను తప్పర్థములు సెప్పి మోసపుచ్చును' అని భయపడును అని యున్నది గావునను మఱియు నిది పంచమవేదముగా బ్రహ్మ యొక్క అన్ని ముఖములనుండి వెడలినది గాన పురాణమునకు ప్రత్యేక ప్రాధాన్యము ఋషిసమ్మతము.

జాన న్నుపాయ మథ దేహ మజో విభజ్య
స్త్రీపుంసభావ మభజన్మను తద్వధూభ్యామ్,
తాభ్యాంచ మానుషకులాని వివర్ధయం స్త్వం
గోవింద మారుతపురేశ నిరుంధి రోగాన్. 10

తెలియ న్నేర్చి యుపాయ, మాత్మతనువున్ స్త్రీపుంస రూపమ్ముగా
నలరించెన్ విధి; వారలే మనువు నిల్లాలైరి, యాద్వంద్వమం
దిల నానావిధ మానవాకృతుల నీవే పెంచినా వట్టి మ
మ్ముల గోవింద! మరుత్పురేశ రుజలన్ బోనాడి పెంపంగదే

ఉపాయము తెలిసి తన శరీరమునే స్త్రీ పురుష లిద్దరుగా గావించెను. వారే మనువు అయన భార్యయునైరి వారివలన నానామానవ సృష్టియయ్యెను. దానిని బెంచిన మహానుభావుడవు మా రోగములంద్రుంచి మమ్మును బెంచుము.

# 11వ దశకము

# హిరణ్యకశిపు - హిరణ్యాక్షులు

క్రమేణ సర్గే పరివర్ధమానే కదాపి దివ్యా స్సనకాదయ స్తే
భవద్విలోకాయ వికుంఠలోకం ప్రపేదిరే మారుతమందిరేశ. 1

వరుసన్ సృష్టి విధాన మావిధమునన్ వర్ధిల్లు చున్నంత ని
ర్జరమౌనుల్ సనకాదు లొక్కతఱి నీ సందర్శనార్థంబు శ్రీ
వర! వైకుంఠ పురీ మనోహర బహిర్ద్వారమ్మునన్ జేరి ని
ల్చిరి శ్రీమద్ గురువాయుమందిర విలాసీ! చిద్విలాసీ! హరీ!

సృష్టిక్రమ మిట్లు సాగుచుండగా దివ్యమునులు సనకాదులు నిను దర్శించుటకు వైకుంఠ ద్వారమునవచ్చి నిలిచిరి

మనోజ్ఞ నైశ్శ్రేయస కాననాద్యైః అనేక వాపీ మణిమందిరైశ్చ,
అనోపమం తం భవతో నికేతం మునీశ్వరాః ప్రాపు రతీత్య కక్ష్యాః. 2

విను కైవల్య వనీ సుమోపవనవాపీ రత్న సౌధాలయా
ధ్యనఘమ్మైన భవ న్ని వాసభవన మ్మాయా హజారమ్ములా
రు నిరాఘాటమ్ముగ దాటి చేరిరి మునీంద్రుల్ సప్తమమ్మైన క
క్ష్యను నానాసుమపుంజ మంజుల లతాంతాంచ న్నికుంజాంతమున్

సర్వోబుతు శోభతోగూడి కైవల్యానందము మూర్తీభవించెనో అన్నట్లున్న పుష్పోద్యాన వాపీ మణీ సౌధ సుందరములైన వాకిళులెన్నో నిరభ్యంతరముగ దాటి వివిధములగు పూల పొదరిండ్లచే నందమగు నీ మందిరముం జేరిరి

భవద్దిదృక్షూన్ భవనం వివిక్షూన్ ద్వాస్థౌ జయస్తాన్ విజయో ప్యరుంధాం
తేషాంచ చిత్తే పద మాప కోపః సర్వం భవత్ప్రేరణయైవ భూమన్ 3

వలదనువాఁడులేఁడు తుదివాకిలి కావలి వార లిద్దరం
దెలమి జయుండునున్ విజయుఁడేమన దేవరవారి లోనివా

**కిలికద కాయువారు జళిపించుచు బెత్తము లాపినారు; వా**
**రల మది ఁగిన్క చేటుకొనెరా! యటఁ బ్రేరణ నీదె యన్నిటన్**

సమాధిం గననైన నిన్ను కన్నులం జూడ నరుగు వారిని జయుడు విడయుడునను ద్వార పాలకులు లోనికి పోనీక యాపిరి; ఇదంతయు ఈ అపుట దానిచే మునుల మనసులో కోపమేర్పడుటయు నీ ప్రేరణచే జరిగినవే.

**వైకుంఠలోకానుచిత ప్రచేష్టౌ కష్టౌ యువాం దైత్యగతిం భజేతం**
**ఇతి ప్రశప్తౌ భవదాశ్రయౌ తౌ హరిస్మృతి ర్నోఽస్త్వితి నేమతు స్తౌన్. 4**

**క్రూరుల్ మీ ర్వెగరెక్కి మీపనులు వైకుంఠార్హముల్ గావు పో**
**పోరా! పొం దసురాధమత్వగతికిన్ బొందన్న శాపాన నీ**
**వారల్ వోయిరి, పోవుచుం బడిరి నీ పాదాలపై నిన్ నమ**
**స్కారాల్ సేసి త్వదీయసంస్మరణముం గాంక్షించి రాపోడకన్.**

రాజసతామసవికారములకు తావులేని యీ తావున మీచర్య యుచితము గాదు. మీరిచట నుండదగరు. రాక్షసజన్మమునకుం బొందు అని మునుల శాపమునకు వారు గురియైరి. అగుచు వారి పాదములమీదబడి ఉత్తరజన్మము లందు నీ స్మరణముండుగాక యని మ్రొక్కిరి.

**తదేత దాజ్ఞాయ భవా నవాప్తః సహైవ లక్ష్మ్యా బహి రంబుజాక్ష**
**ఖగేశ్వ రాంసార్పిత చారుబాహుః ఆనందయం స్తా నభిరామమూర్త్యా. 5**

**ఏలినవారి కల్లరి యదెల్ల వినంబడఁబోలు లచ్చితో**
**మూలదివాణముం గదలి మోసల నిల్చి ఖగేంద్రుమూపుపై**
**కేలిడి వాలుగా నిలిచి కిమ్మనకుండనె విశ్వమోహనా**
**లోల కటాక్షవీక్షణములోనన లోఁగొనినావు వారలన్.**

నీవది యెఱింగి లక్ష్మితోగూడి వెలికివచ్చి గరుడుని మూపున చేయి నానించి ఒయ్యారముగ నిలిచి నీ చక్కని రూపుచే వీరి నానందపరచితివి.

**ప్రసాద్య గీర్భిః స్తువతో మునీంద్రాన్ అనన్యనాథా వథపార్షదౌ తౌ**
**సంరంభయోగేన భవైస్త్రిభి ర్మా ముపేత మిత్యాత్తకృపం న్యగాదీః. 6**

నేర్చిన మంచిమాటలను నిన్నినుతించెడువారి వారలన్
దేర్చి, స్వకీయ పార్షదుల, దిక్కు మరొక్కటిలేని వారి నూ
రార్చి, పగన్ నను౦ గొలిచి యల్లన నొక్కటిరెండు జన్మముల్
దీర్చి మదంతిక మ్మరుగుదెం డనినా వటుపై కృపానిధీ!

శిరస్సులు వంచి మ్రొక్కి నిన్ను నుతించు నమ్మునులను మధురభాషలచే నలరించి, నీకంటె మఱిదిక్కులేని నీ ద్వారపాలకులను జయవిజయులను గని జాలిగొని "మూడు జన్మములు నాయెడ పగచే నిరంతర సమాధివడసి నా చెంతకు రండు" అని పల్కితివి.

త్వదీయ భృత్యావథ కాశ్యపా త్తౌ సురారివీరా వుదితౌ దితౌ ద్వౌ,
సంధ్యా సముత్పాదన కష్టచేష్టౌ యమౌ చ లోకస్య యమా వివాన్యౌ. 7

దితికిన్ వా రుదితుల్ త్వదీయభృతి కెంతే నర్హులున్ గాశ్యప
క్షితిదేవాత్మజు లిద్దఱుం గవలు నాసీమాంత విశ్వమ్ము ను
ద్ధతి మీరం గబళింప నేగి; రురు సంధ్యాకాల జన్మోత్సవా
క్షతులై రేగిరి వారలిద్దరు యముల్ సాక్షాద్యముల్ భూమికిన్.

నీ సేవకులాయిద్దరు కాశ్యపునికి దితియందు రాక్షసవీరులై జన్మించిరి. సంధ్యాకాలసంగమముచే జనించుటవలన క్రూరచేష్టులై యా యములు (కవలలు) లోకములపాలిటికి యములే యైరి.

హిరణ్యపూర్వః కశిపుః కిలైకః పరో హిరణ్యాక్ష ఇతి ప్రతీతః,
ఉభౌ భవన్నాథ మశేషలోకం రుషా న్యరుంధాం నిజవాసనాంధౌ. 8

అందొక్కండు హిరణ్యపూర్వకశిపుం, డాపై హిరణ్యాక్షు డం
చుం దీపించె; భవత్సనాథము జగ మ్మోగించినా రిద్దఱున్
గ్రిందున్ మీఁదొనరించి లోకముల నుద్రేకించి క్రీడించిబల్
జిందావందరగా స్వకీయపదధూళీ వాసనాంధుల్ హరీ

వారిలో పెద్దవాడు హిరణ్యకశిపుడు. తరువాతివాడు హిరణ్యాక్షుడు. నీవే దిక్కైయున్న యెల్లలోకములను తమ అసుర జన్మ వాసనచే గన్నుగానక యెల్ల విధముల రోషముచే బాధించిరి.

**తయోఒర్హి రణ్యాక్ష మహాసురేంద్రో రణాయ ధావ న్ననవాప్తవైరీ,**
**భవత్ప్రియాం క్ష్మాం సలిలే నిమజ్య చచార గర్వా ద్వినదన్ గదావాన్. 9**

**అం దత్యుద్ధతి నిద్ధతేజుఁడు హిరణ్యాక్షుండు యుద్ధార్థియౌ**
**చుం దిక్కుల్ బరుగెత్తి సాటి పగ నెచ్చోఁగాని తాఁగాన కే**
**మందుం నీ ప్రియఁ గేవల క్షమ నయో! క్ష్మాదేవి మున్నీటిలో**
**నం దాముంచి గదాయుధుండు దిరిగెన్ గర్వాన బిట్టార్చుచున్**

వారిలో హిరణ్యాక్షుడు యుద్ధమున్కై ముల్లోకములు దిరిగి తనకు జాలిన శత్రువు గానిపింపక నీ ప్రియురాలు క్షమను = భూమిని ప్రళయవార్థిలో ముంచి తన కర్ణాభరణమొనరించుకొని యానీటిలో దానును భుజముపై గదనుంచు కొని గర్వముతో నార్చుచుం దిరిగెను.

**తతో జలేశా త్సదృశం భవ న్తం నిశమ్య బభ్రామ గవేషయంస్త్వాం**
**భక్తైకదృశ్య స్స కృపానిధి స్త్వం నిరుంధి రోగాన్ మరుదాలయేశ. 10**

**అడలి తదుగ్రతన్ 'వరుణుఁడద్దిర! నీ సరితూగు శత్రు వొ**
**క్కడ హరి యున్నవాఁ'డనగఁ గంధి నెగాదిగ జూచి విష్ణు నె**
**క్కడఁ గనుగొందు నంచతడు గాసిలకం దిరుగాడె జాలికిన్**
**గడలివి భక్తగమ్యుఁడవు కావర! నన్ మరుదాలయేశ్వరా**

అవ్వల తనకు సముద్రము మోకాలిబంటి కాగా నందు క్రీడించుచు వరుణపురమగు విభావరికేగి, వరుణుని యుద్ధమునకు రమ్మనగా నతడు 'నీకు సరియైన శత్రువు శ్రీ నారాయణుడు' అని చెప్పగా; ఓ కృపానిధీ నీకై వెదకులాడెను. నీవు భక్తులకు మాత్రమే కనబడువాడవు గదా! ఓ మరుత్పుర ప్రభూ! నా రోగముల వాపుము.

# 12వ దశకము

# వరాహావతారము

స్వాయంభువో మను రథో జనసర్గశీలో
దృష్ట్వా మహీ మసమయే సలిలే నిమగ్నాం,
స్రష్టారమాప శరణం భవదంఘ్రిసేవా
తుష్టాశయం మునిజనైః స్సహ సత్యలోకే. 1

సంభవమౌను గాదు ననజాల కకాలమునన్ జలాన వి
శ్వంభర మున్గగాఁ గని భవత్పదసేవఁ దనర్చు పద్మినీ
డింభకు సత్యలోకమున తీవిమెయిన్ వసియించువాని స్వా
యంభువుఁడేగి తా శరణమందె మునీంద్రజనమ్ము వెంటరాఁ.

అవల సృష్టి సేయు స్వాయంభువమనువు అకాలమున భూమి సముద్రమున మునుగగా జూచి నీచరణ సేవచే సంతృప్తిగన్న బ్రహ్మను మునులతో సత్యలోక మునకేగి శరణందెను.

కష్టం ప్రజా స్సృజతి మయ్యవని ర్నిమగ్నా
స్థానం సరోజభవకల్పయ త త్ప్రజానాం
ఇత్యేవ మేష కథితో మనునా స్వయంభూః
అంభోరుహాక్ష తవ పాదయుగం వ్యచింతీత్. 2

బిడ్డలఁగాంచువేళ పృథివీతల మొడ్డిగిలెన్ బ్రజాళి నే
యొడ్డునఁజేర్చుటో తెలియకున్నది నన్నెటుదేర్తువో కరం
బొడ్డుమనంగ బ్రహ్మ శరణొందె భవచ్చరణమ్ము లింతలో
నొడ్డిదె కూలిపడ్డ దెటులోకద పుట్టిమునింగె నంచునుఁ.

అక్కట! నేను ప్రజల సృజించుచున్నతఱి భూమి మునిగిపోయినది. ప్రజలకు నిలువనీడ గల్పింపుము, అని మనువనగా బ్రహ్మ నీ పాదములను ధ్యానించెను.

హా హా విభో జల మహం న్యపిబం పురస్తాత్
అద్యాపి మజ్జతి మహీ కిమహం కరోమి
ఇత్థం త్వదం ఘ్రియుగలం శరణం గతో ఽస్య
నాసాపుటా త్సమభవ శ్శిశుకోలరూపీ. 3

ఎక్కడికష్ట మీజలము నెల్లను ద్రావితి చుక్కకూడ లే
దక్కట! ఎట్టులూరెనొకదా! మఱి, నీ చరణాబ్జ మొక్కటే
దిక్కన, వానిముక్కునన దివ్యవరాహకిశోరమూర్తివై
యక్కడి కక్కడే యుదయమందితి వీవవతారమూర్తివై.

ఎంతకష్టము! సృష్టిచేయుట కనువుగ ముందే సముద్రమంతయు ద్రాగితిని అయినను భూమి మునిగిపోవుచున్నది ఏమి చేయుదును. నీ పాదములే దిక్కు అని నిన్ను శరణందిన ఆ బ్రహ్మయొక్క నాసారంధ్రమునుండి చిన్న వరాహమూర్తివై అవతరించితివి.

అంగుష్ఠమాత్రవపు రుత్పతితః పుర స్తా
ద్భూయో ఽథ కుంభిసదృశ స్సమజృంభథా స్త్వం,
అభ్రే తథావిధ ముదీక్ష్య భవ న్త ముచ్చై
ర్విస్మేరతాం విధి రగా త్సహసూనుభి స్స్వైః. 4

బొట్టన వ్రేలిమాత్ర తనువుం గొని పిమ్మట నేన్గువోలెనీ
వట్టె విజృంభమాణ తనువైతి వహో! గగనంబుదాక నీ
పట్టి యజాండు ము న్నతనిపాలను బుట్టిన వారు జూచి తా
మట్టె వెఱంగుపాటు గని రట్టితెఱం గొకనా డెఱుంగమిః.

మొదట బొటనవ్రేలంతయై యవల మదపుటేనుగంతై విజృంభించి ఆకసమందుకొంటివి. అపుడు పైకి చూచి నిన్గాంచి కొడుకులతో బ్రహ్మ ఆశ్చర్యపడెను.

కోసా వచింత్యమహిమా కిటి రుత్థితో మే
నాసాపుటాత్ కిము భవే దజితస్య మాయా,
ఇత్థం విచింతయతి ధాతరి శైలమాత్రః
సద్యో భవాన్కిల జగర్జిథ ఘోర ఘోరమ్. 5

ఎవ్వరు వీ రచింత్య మహిమేధ్యులు బాలవరాహమూర్తులై
యివ్విధి నాసికాపుటము నిట్టె తలంగుక వచ్చినారు మా
యవ్వ ముకుందుమాయ యగునా! యనుచుండనె కొండయంతయై
కెవ్వన ఘుర్ఘురించుచు నొగిన్ బొనరించితి ఘోరగర్జనన్

ఊహింపరానిమహిమగల యీయన యెవ్వరు? బాలవరాహమై నా నాసిక నుండి వచ్చిరి. ఇది విష్ణుమాయకాదుగదా అనుకొనునంతలో నీవు కొండంతయై భయంకరముగ గర్జించితివి.

**తం తే నినాద ముపకర్ణ్య జన స్తపస్థాః**
**సత్యస్థితాశ్చ మునయో నునువు ర్భవంతం,**
**తత్స్తోత్రహర్షులమనాః పరిణద్య భూయః**
**తోయాశయం విపులమూర్తి రవాతర స్త్వమ్.** 6

అ గర్జారవ మాలకించి జనమం దాలో తపస్సత్యలో
కాగారంబుల నున్న మౌనినివహ మ్మయ్యా! స్తుతుల్సేసినా
రా గంభీర నుతు ల్నతుల్ గొని బెడంగై హర్షులుండై జగ
మ్మాగన్ దూకితి ఘుర్ఘుర ధ్వని జలమ్ముల్వెత్తుగా మీటుచున్

ఆ గర్జనము విని జనోలోక తపోలోక సత్యలోకములందున్న మునులు నిన్ను స్తుతించిరి. దానికి హర్షించి యింకను పెరిగి వారి ననుగ్రహింప గర్జించుచు ప్రలయాబ్ధిలో దిగితివి.

**ఊర్ధ్వప్రసారి పరిధూమ్ర విధూతరోమా**
**ప్రోక్షి ప్తవారిధి రవాబ్ముఖ ఘోర ఘోణః,**
**తూర్ణప్రదీర్ణ జలదః పరిఘూర్ణదక్ష్ణా**
**స్తోతౄన్ మునీన్ శిశిరయ న్నవతేరిథ త్వమ్.** 7

నిక్కొడుబిఱ్ఱు వెంట్రుకల నిట్టనిడి న్విదలించి తోకనున్
నిక్కగఁజేయుచున్ దిగిచి నీ పెనుముక్కును ఘోరమై చనం
బ్రక్కకు మబ్బుఁజిమ్మి నయనమ్ములు ఘూర్ణిల గోచరించినా
వక్కడ వంది బృందముల కచ్చపు వెన్నెల లారఁబోయుచున్.

మేని గరుసు వెంద్రుకలు నిక్కగా తోక నిక్కించి ఘోరమైన ముక్కు రంధ్రములను క్రిందికి నిగిడించి మబ్బులం జీల్చుకొని కనులు ఘూర్ణిల్ల నిను గొనియాడు మునులపై చలువనించుచు నీ వావారిధిలో దిగినాడవు.

**అంతర్జలం తదను సంకుల నక్రచక్రం**
**భ్రామ్యత్తిమింగిలకులంకలుషోర్మిమాలమ్,**
**ఆవిశ్య భీషణరవేణ రసాతలస్థాన్**
**ఆకంపయన్ వసుమతీ మగవేషయ స్త్వమ్. 8**

**కలగం బారి యభంగభంగ ఝష వక్రక్రాంతి భ్రామ్యత్తిమిం**
**గిల కల్లోలితమైన యాజలమునం గ్రీడించుచున్ వే రసా**
**తల మల్లాడగ నుద్ధత ధ్వని వడిఁ ధాత్రీమహాదేవి జా**
**డలు తీయం జనినావు మా బ్రతుకుజాడల్ తీయలేవే ప్రభూ!**

అపుడు నీవు మొసళ్ళు కలగబడ, తిమింగిలములు కలగుండువడ, కెరటములు కలతవడ, నా నీటిలో క్రీడలాడుచు పాతాళమల్లాడ ఘోరగర్జనతో నీ ప్రియురాలు మేదిని జాడ తెలియనేగితివి. అట్టి ప్రభువు నీవు మాబ్రతుకు తెఱవు కల్పింపలేవా!

**దృష్ట్వాథ దైత్యహతకేన రసాతలాంతే**
**సంవేశితాం ఝటితి కూటకిటి ర్విభో త్వమ్,**
**ఆపాతుకా నవిగణయ్య సురారిఖేటాన్**
**దంష్ట్రాంకురేణ వసుధా మదధా స్సలీలమ్. 9**

**కూటకిటీ! రసాతల నికుంజ కుటిన్ ధరమీాటి వట్టి క**
**ర్కోటకుఁడైన దైత్యహతకున్ మఱి పై బడు దేవవిద్విష**
**త్కోట వరాటఖేటముల గీటునఁబుచ్చి త్వదుగ్ర దంష్ట్రికా**
**కూటమునన్ ధరఁ నిలుపుకొంటివిగా యవలీలగా హరీ!**

అంత రాక్షసాధముడగు హిరణ్యాక్షునిచే పాతాళమునందుంచబడిన వసుధకై నిన్నెదిరింప పైబడు అసురకీటములను లెక్కసేయక భూమిని కోరకొన నిల్పికొని యవలీలగా నుద్ధరించితివి.

అభ్యుద్ధర న్నథ ధరాం ధశనాగ్రలగ్న
ముస్తాంకురాంకిత ఇవాధికపీవరాత్మా,
ఉద్ధూతఘోరసలిలా జ్జలధే రుదంచన్
క్రీడావరాహవపు రీశ్వర పాహి రోగాత్. 10

ధారుణినెత్తి కోరకొనఁదాల్చిన నయ్యది తుంగముస్త యా
కారము దాల్చె నీపృథుల కాయమునం; దలఘు ప్రచండ వాః
పూరము లా నభం బెగసిపోవగ వారిధి నీఁది నావు క్రీ
డారస దోహలా! రుజ లడంపర యజ్ఞవరాహకందలా!

అట్లు ధరణినెత్తి కోరలపై దాల్చగా నది నీ పెనుశరీరమందొక తుంగముస్తయంతగా గనిపించెను. అపుడు సముద్రజలపూర మాకసంబెగయు నట్లు వార్ధియందీదినావు. ఓ క్రీడావరాహమూర్తి! మా రోగము వాపుము.

తెలుగులో యజ్ఞవరాహముయొక్క కందలము = మొలక అనగా శిశురూప వరాహమా! అనుట ఆయన క్రీడారసదోహలత్వమునకు దోహదము. శిశువులు ఆటలు మఱుగుట స్వభావము కాన.

# 13వ దశకము

# హిరణ్యాక్షవధ

హిరణ్యాక్షం తావ ద్వరద భవదన్వేషణపరం
చరన్తం సాంవర్తే పయసి నిజజంఘా పరిమితే,
భవద్భక్తో గత్వా కపటపటుధీ ర్నారదమునిః
శనై రూచే నందన్ దనుజ మపి నిందం స్తవ బలమ్. 1

మున్నిరాప్రళయమ్ము వేళఁ దనకుఁ మోకాలు లోతైన ని
న్నన్నిటన్ వెదుకం జరించెడు హిరణ్యాక్షున్ సమీపించి నీ

**వన్నం భక్తి గలాఁడు నారదుఁడు మాయా వృత్తియై మెల్లనన్**
**నిన్నుం దిట్టుచు వాని నిట్టు లభినందించెన్ బలప్రౌఢిమన్.**

ప్రళయ సముద్రము హిరణ్యాక్షునకు మోకాలిదగ్గరకు వచ్చెను. అప్పుడు నీ భక్తుడు నారదస్వామి కపటముగొని యిట్లు వానిం గొనియాడి నీ శక్తిని నిందించెను.

స మాయావీ విష్ణు ర్హరతి భవదీయాం వసుమతీం
ప్రభో! కష్టం కష్టం కిమిదమితి తేనాభిగదితః
సదన్ క్వాసౌ క్వాసా వితి స మునినా దర్శితపథో,
భవన్తం సంప్రాప ద్ధరణీధర ముద్యన్త ముదకాత్. 2

**హరి మాయావి హరించె నీదు పొలమున్ హా కష్ట మిాచేత వి**
**డ్డుర మంచున్ ముని దారిచూప ప్రబలాటోపమ్మునన్ బోయి ము**
**ష్కరుఁడారక్కసుఁడెక్కడెక్కడని గర్జా ఘోషముంజేయుచున్**
**దరిసె న్నిను జలాంతరోద్గతు ధరాధౌరేయు నుద్యత్ప్రభున్.**

మాయావి హరి నీ భూమిని హరించెను. ఏమిది. ఎంతకష్టము అని దేవముని యనగా వాడు హరి యేడి యెక్కడున్నాడనుచు గర్జించుచు నారదునిచే దారి చూపబడి భూమిని ధరించి యన్నీరు వెడలివచ్చు నిన్నుం జూచెను.

**అహో! అరణ్యోయం మృగఇతి హసన్తం బహుతరైః**
**దురుక్తై ర్విధ్యంతం దితిసుత మవజ్ఞాయ భగవన్,**
**మహీం దృష్ట్వా దంష్ట్రాశిరసి చకితాం స్వేన మహసా**
**పయోధా వాధాయ ప్రసభ ముదయుఙ్థా మృధవిధౌ.** 3

**అడవిమృగమ్మ యంచు పరియాచక మాడుచుఁబోటుమాటలన్**
**దొడరిన దైత్యునిం దెగడిపోయుచు నీవును దంష్ట్రికాగ్రమం**
**దడలుచునున్న భూమిని లయాంబుధి దింపి స్వకీయశక్తి ను**
**క్కడరగ వానితోడఁ గలియంబడ దూకితి వబ్ధి నుద్ధతిన్,**

అడవి జంతువిది యని పరిహసించి దుర్వాక్యములచే నెత్తి పొడుచు రాక్షసుం గని కోరకొన బెదరిపోవుచున్న మేదినిని సముద్రమునసుంచి యుద్ధ సన్నద్ధుడవైతివి.

గదాపాణౌ దైత్యే త్వమపిహి గృహీతోన్నతగదో
నియుద్ధేన క్రీడన్ ఘటఘటరవోద్ఘుష్ట వియతా,
రణాలోకౌత్సుక్యా న్మిలతి సురసంఘే ద్రుత మముం
నిరుంధ్యా స్సంధ్యాతః ప్రథమ మితి ధాత్రా జగదిషే. 4

గదసారించెను రాక్షసాధముఁడు వీకన్ నీవుఁ గౌమోదకిం
గద సారించితి వంత ఛట్పట రవా క్రాంతోరు దిగ్దంత్యరుం
తుద మయ్యెన్ గదకయ్యముం గన సురల్ దోతెంచి రీమ్రుక్కడిన్
వదలం బో కని పద్మజుం డసుర సంధ్యావేళ నార్చెన్ హరీ!

అయ్యధముడు గద గొని యెత్తిరాగా నీవును తలచినమాత్ర చేతికివచ్చిన కౌమోదకీ గదాయుదముతో గలియబడితివి ఇద్దరు గదాయుద్దము గావించితిరి బ్రహ్మాండకటాహము చట్పట ధ్వనిచే బ్రతిధ్వనించెను దేవత లా వింతచూడ వచ్చిరి సంధ్యాసమయమిదె వానికి బలము హెచ్చు కాలము కావున నది రాకుండనే వీని మట్టుపెట్టుమని బ్రహ్మ మోషించెను

గదోన్మర్దే తస్మిన్ తవ ఖలు గదాయాం దితిభువో
గదాఘాతా ద్భూమౌ ఝటితి పతితాయా మహహ భోః,
మృదుస్మేరాస్య స్త్వం దనుజకులనిర్మూలనచణం
మహాచక్రం స్మృత్వా కరభువి దధానో రురుచిషే. 5

కదన మ్ముత్కటమై తదుద్ధతగదాఘాతమ్మునన్ జారి నీ
గద క్రిందం బడ నప్పుడే నగుచు సంకల్పించి రప్పించి కే
ల్గదియం జేసితి వద్భుత మ్మఖిల రక్ష శ్చక్ర నిర్వక్ర దు
ర్మదనిర్మూలన కర్మఠ మ్మతి కఠోరమ్మైన చక్రమ్మునున్

అటు వాని గదాప్రహారముచే నీగద చేయిజారిపడగా వెంటనే సంకల్ప మాత్రమున నవ్వుచు సర్వరాక్షసకుల నిర్మూలన దక్షమైన నీచక్రమును రప్పించి చేతం ధరించితివి జాజ్వల్యమానమైన చక్రాయుధ తేజస్సుచే వైష్ణవతేజస్సుచే నీరూపము సకలజన నయన గోచరమయ్యెను

వి.వి : నీ చేతి గదజారిపడుట, నను పగచే సాధింతుననియున్న నాదాసునికి వీనికి సమాధి ఎడతెగకుండ డేయవలెనను నీ సంకల్పము చేతనేకావి నీ చేతగాక గాదని కవిహృదయము.

**తతః శూలం కాలప్రతిమరుషి దైత్యే విసృజతి**
**త్వయి చ్ఛిందం త్యేనత్కరకలితచక్ర ప్రహరణాత్,**
**సమారుష్టో ముష్ట్యా సఖలు వితుదం స్త్వాం సమతనోత్**
**గలన్మాయే మాయా స్త్వయికిల జగన్మోహనకరీః. 6**

**కాలుఁడు వోలె మండిపడి కట్టిడిదైత్యుఁడు శూలమేసినన్**
**లీలగఁ బూని చక్రమున నీవది త్రుంపగ, రోసమెత్తినిన్**
**జాల నలంచె గ్రుద్దులను జాలక మాయల కందరాని నీ**
**మ్రోలను జూపె సర్వజన మోహనముల్ పలుమాయ లద్దిరా!**

యమునివోలెవాడు శూలమేయగా నీవది చక్రముచే ద్రుంచితివి. వాడు రోసమెత్తి నిన్ను గ్రుద్దులచే నలయించెను. మాయాతీతుడవైన నీపైని వాడు పలుమాయలను బ్రయోగించెను.

**భవచ్చక్రజ్యోతి ష్కణ లవనిపాతేన విధుతే**
**తతో మాయాచక్రే వితత ఘనరోషాంధ మనసమ్,**
**గరిష్ఠాభి ర్ముష్టిప్రహృతిభి రభిఘ్నంత మసురం**
**కరాగ్రేణ స్వేన శ్రవణపదమూలే నిరవధీః. 7**

**త్వచ్చక్ర ద్యుతి విస్ఫులింగలవమాత్రస్ఫూర్తిచే నత్తఱిన్**
**విచ్చెన్ వాఁడొనరించుమాయ లటుపై వెఱ్ఱెత్తి రోషానవాఁ**
**డుచ్చైః పాతిత ముష్టిఘాతముల నిన్ దోరింప న మ్మూర్ధనీ**
**వచ్చోఁ గూల్చితి చెంపపెట్టునన యత్యాశ్చర్యచర్యన్ బ్రభూ!**

నీ చక్ర కాంతి లేశముచే వాని మాయాచక్రము విరిసిపోగా రోషమెక్కి ముష్టి ఘాతములచే నిన్నలయించు వానిని చెవి మూలమున గొట్టి కూల్చితివి.

**మహాకాయ స్సోఽయం తవ చరణపాత ప్రమథితో**
**గలద్రక్తో వక్త్రాత్ అపత దృషిభిః శ్లాఘిత హతిః,**

**తదా త్వా ముద్దామ ప్రమదభర విద్యోతిహృదయాః**
**మునీంద్రా స్సాంద్రాభిః స్తుతి భి రనువ న్నధ్వరతనుమ్. 8**

**అక్కడ నీకరాబ్జ హతుఁడై పడిపోయెను నోటరక్తముం**
**గ్రక్కుచుఁగొండవోలె, మునిరాజి నుతించిరి వాని చావు, నిన్**
**మిక్కుటమైన హర్ష మెద మీరగ యజ్ఞవరాహమూర్తిన**
**ల్దిక్కులు పిక్కటిల్ల వినుతించిరి వైదికసూక్త సంగతిన్**

హిరణ్యాక్షుడు నీ లెంపకాయతిని రక్తముగ్రక్కుకొని కొండవలె గూలిపోయెను ఆనందభరితులై మునులు ఎల్లదిశల చెవులు దిబ్బడవడ యజ్ఞ వరాహావతారుని నిన్ను వైదిక సూక్తములచే వినుతించిరి

**త్వచి చ్ఛందో రోమస్వపి కుశగణా శ్చక్షుషి ఘృతం**
**చతు ర్హోతారోంఘ్రౌ స్రుగపి వదనే చోదర ఇడా,**
**గ్రహా జిహ్వాయాన్తే పరపురుష! కర్ణేచ చమసా**
**విభో! సోమో వీర్యం వరద గలదేశేఽ ప్యుపసదః 9**

**నీదు త్వచమ్ము ఛందములు, నీమెయిరోమములే కుశమ్ములున్,**
**నీదుకనుల్ ఘృతమ్ము, మఱి నీముఖ జిహ్వలు స్రుక్స్రువమ్ములుఁ**
**గాదటె; కర్ణముల్ చమస గర్భమిడాఖ్యము హోతృకోటి త్వ**
**త్పాదములౌ, గళ మ్ముపసదమ్మును వీర్యము సోమ మీశ్వరా!**

గాయత్రి మొదలయిన ఛందస్సు నీ శరీర చర్మము, రోమములు దర్భలు, కనులు నెయ్యి, మొగము స్రుక్కు, నాలుక స్రువము, (జుహువు) చెవులు భక్షణ సాధన ద్రవ్యములనుంచు పాత్ర విశేషమైన చమస, కడుపు ఇడపురోడాశ ద్రవ్యనిక్షేపము చేయు పాత్ర విశేషము అధ్వర్యుడు, బ్రహ్మ, హూత, ఉద్గాత యను నల్వురు నాల్గుపాదములు వీర్యము సోమము (సోమలతారసమన్న మాట) ఉపసదము ప్రవర్గ్యతరువాత చేయు ఇష్టులు నీ గళమునై నీవు యజ్ఞమూర్తి వైతివి. (ప్రాయణీయ-ఉదయనీయ ఇష్టులు రెండు నీ కోరలు అనియు చేర్చి కోవలెను.)

మునీంద్రై రిత్యాది స్తవన ముఖరై ర్మోదితమనా
మహీయస్యా మూర్త్యా విమలతర కీర్త్యాచ విలసన్,
స్వధిష్ణ్యం సంప్రాప్త స్సుఖరసనిహారీ మధురిపో
నిరుంధ్యా రోగం మే సకలమపి వాతాలయపతే. 10

ఎలమిన్ దివ్యమునీంద్ర సంస్తుతులచే నీ రీతి నానందదో
హల చిత్తమ్మున నిర్మలమ్మగు యశోవ్యాప్తిన్ మహామూర్తిఁదా
జెలువొప్పం గని లో నఖండరస నిస్సీమాబ్ధి నోలాడి నీ
నిలయమ్మైన వికుంఠధామమునకున్ వేంచేసినా వేలుమా!

మునివరులు చేయు స్తోత్రములచే ప్రసన్నుడై పూజనీయమగు నీ మూర్తితో విమల కీర్తితోను విలసిల్లి ఆనందరసవారిధి నోలలాడి నీ నివాసము వైకుంఠము నలంకరించితివి. అట్టి నీవు నారోగము వాపి ఆనందమం దోలలాడింపుము.

## 14వ దశకము

# కపిలావతారము

సమనుస్మృత తావకాంఘ్రియుగ్మః సమనుః పంకజసంభవాంగజన్మా,
నిజ మంతర మంతరాయహీనం చరితం తే కథయన్ సుఖం నినాయ. 1

అబ్జభవసంభవుండు స్వాయంభువుండు
మనువు నీ పాదపద్మ సంస్మరణ సేసి-
కొనుచు నీ దివ్యకథ లాడుకొనుచుఁదన త
రమ్ము నడిపించె నంతరాయమ్ము లేక.

వరాహావతారముచే జగత్ప్రతిష్ఠ జరిగిన తరువాత స్వాయంభువ మనువు నీ పాదసరోజధ్యాననిరతుడై నీ చరిత్రలు సెప్పికొనుచు సుఖముగా తన యంతరము నడిపించెను.

సమయే ఖలు తత్ర కర్దమాఖ్యః ద్రుహిణచ్ఛాయభవ స్తదీయవాచా,
ధ్రుతసర్గరసో విసర్గరమ్యం భగవన్! త్వా మయుతం సమాస్సిషేవే. 2

ఆయెడం గర్దముఁడు బ్రహ్మచాయఁగలిగి
యెలమి నాతని మాటగాసృష్టిసేయు
సరణి రుచిగొని సహజసుందరుని నిన్ను
గొలిచె పదివేలయేండ్లు నిశ్చల సమాధి.

ఆసమయమందు కర్దముఁడను ముని బ్రహ్మయొక్క ఛాయనుండి పుట్టిన వాడు ఆయన యానచే సృష్టిసేయు వేడుకగొని పదివేలేండ్లు నిన్ను సేవించెను.

గరుడోపరి కాలమేఘ క్రమం విలస త్కేలిసరోజ పాణి పద్మం,
హసితోల్లసితాననం విభో! త్వం వపు రావిష్కురుషేస్మ కర్దమాయ. 3

తనమ్రోలఁదొలకరించిననాటి నెఱిమబ్బు
తళుకునించెడు మేని కులుకుతోడ
తన కన్నులందు నించిన శరద్రాత్రి వె
న్నెల కాయు తెలినవ్వు మొలకతోడ
తనడెందమున హత్తుకొనులీల లీలార
విందు మల్లననూచు వింతతోడ
తనదాక గరుడవాహన మెక్కి చనుదెంచు
నొరపు సూపెడి కృపాభరముతోడ

తన పురాకృత సుకృత సంతానఫలమ
యనగ నాతనిమ్రోలఁ బ్రత్యక్షమైతి
వనుపమమ్మైన నీదు నందమునఁజొక్కి
కర్దముడు భక్తిభావ సమ్మర్దమంద.

కేవల మూలానుసరణ పాఠము.

గరుడారూఢుఁడవై వినీల జలదాకారుండవై మోమునన్
దరహాసప్రభ లుల్లసిల్లగ వినోదమ్మంది కెంగేలియం
దరవింద మ్మిరవొంద నూచుచును నొయ్యారంబు మీఱంగఁద
త్వరతన్ ద్వత్పరుఁడైన కర్దమునకుం బ్రత్యక్షమైనా వటన్.

గరుడవాహనారూఢుడవై తొలకరిమేఘంబు చాయ గులుకు నెమ్మేనితో కేలుదామరం దామరపూవు పూని మందహాసమధురాననముతో నీవు కర్దమునికి బ్రత్యక్షమైతివి.

స్తువతే పులకావృతాయ తస్మై మనుపుత్రీ దయితా నవాపి పుత్రీః,
కపిలం చ సుతం స్వమేవ పశ్చాత్ స్వగతిం చాప్యనుగృహ్యా నిర్గతోఽభూః.4

అయినన్ మేన్ పులకించి నిన్వినుతిసేయన్ వాని కిల్లాలుగా
దయతో నా మనుపుత్రి నిచ్చి యట సంతానమ్ము తొమ్మండ్రు నా
పయి కూతుండ్ర నొసంగి నేనె కొడుకై వర్తింతు మీకంచు న
వ్యయ మోదమ్మొనరించి యేగితివి నీ యానంద ధామానకున్.

నీ దర్శనముకాగా మేను పులకరింప నిన్ను గీర్తించు కర్దమునికి మనుపుత్రియైన దేవహూతింబత్నిగా నొసగి - తొమ్మండ్రు కూతుల నిచ్చి నీవే కుమారుడయ్యెదనని యనుగ్రహించి నీ వైకుంఠమున కేగితివి.

స మను శ్శతరూపయా మహిష్యా గుణవత్యా సుతయాచ దేవహూత్యా,
భవదీరిత నారదోపదిష్టః సమగా త్కర్దమ మాగతి ప్రతీక్షమ్. 5

మనువు శతరూప యను తన మహిషితోడ
నుత్త మోత్తమ సుత దేవహూతి తోడ
నరిగె నీ యాన నారదుఁడంప తనదు
రాక కొఱ కెదురు సూచు కర్దముని దరికి.

మనువు తన పత్నిశతరూపతో, కూతురు దేవహూతితో, నీ ప్రేరణచే నారదుని మాటచే తనకై యెదురుచూచుచున్న కర్దముని దగ్గరకు వెళ్ళెను.

**మనునోపహృతాం చ దేవహూతిం తరుణీరత్న మవాప్య కర్దమోఽసౌ**
**భవదర్చన నిర్వృతోఽపి తస్యాం దృఢశుశ్రూషణయా దధౌ ప్రసాదమ్. 6**

**మనువు తోడ్కొని మనువిచ్చి తనయఁ దన కొ**
**సంగఁ గర్దముఁ డెంత నిస్సంగియైన**
**నామె యొనరించు శుశ్రూష కలరి దేవ**
**హూతియెడ సుప్రసన్నుఁడై యుండె నంత**

మనువు కన్యారత్నముం దోడ్కొని వచ్చి యరణమిచ్చి తన కీయగా కర్దముడు ఆ బాలిక సేయు శుశ్రూష కానందించి యామె యెడ బ్రసన్నుడయ్యె.

**స పున స్త్వదుపాసన ప్రభావాత్ దయితా కామకృతే కృతే విమానే,**
**వనితాకులసంకులో నవాత్మా వ్యహర ద్దేవపదేషు దేవహూత్యా. 7**

**నిను సేవించి గడించికొన్న మహిమన్ నీరేజపత్రేక్షణల్**
**దను సేవింపగ దేవహూతిఁగొని తద్వాంఛాను కూలమ్ముమో**
**హన సౌందర్యము పూని కర్దముఁడు నానానేక బృందార కా**
**ధ్వని కేతమ్ముల సంచరింపఁదొడగెన్ భ్రాజ ద్విమానమ్మునన్**

కర్దముడు తన యింతి కోరగా నిను సేవించి గడించికొన్న యోగవిభూతిచే పరిచారక విద్యాధర సుందరీ సహస్ర పరివృతమైన విమానముల నూతనమైన పదునారేండ్ల ప్రాయముగల సోయగముతో నానా దేవమార్గములందు, నందన పుష్పభద్ర చైత్రరథాతి దేవోద్యానములందు దేవమందిరములందు విహార క్రీడ లొనరించెను.

**శతవర్ష మథ వ్యతీత్య సోఽయం నవకన్యా స్సమవాప్య ధన్యరూపాః,**
**వన యాన సముద్యతోఽపి కాన్తా హితకృ త్త్వజ్జననోత్సుకో న్యవాత్సీత్. 8**

**అతఁడు నూరేండ్లు విహరించి యామెయందు**
**ధన్యరూపలు తొమ్మండ్రు కన్యకలను**
**గాంచి, నినుగాంచి ధన్యతం గాంచ నెంచి**
**పడతి హిత మెంచి వనికి బోవకయ నిలిచె.**

కర్దముడు దేవహూతితో నూరేండ్లు విహరించి తొమ్మండుగురు కూతురులను గని నిన్ను గుమారునిగా బడయుకుతూహలముతో వానప్రస్థ ధర్మమున వనమున కేగక యుండెను.

నిజభర్తృగిరా భవన్ని షేవా నిరతాయా మథ దేవ దేవహూత్యామ్,
కపిలస్త్వ మజాయథా జనానాం ప్రథయిష్యన్ పరమాత్మ తత్త్వవిద్యామ్. 9

తనప్రియుమాట సుంత జవదాటక త్వచ్చరణారవింద సే
వనమున దేవహూతి యనువర్తనముం బొనరింప విశ్వమో
హనుఁడవు నీవు లోకముల కాత్మనుగూరిచి జ్ఞానబోధసే
యను కపిలుండనంగ మదయ మ్మయినాఁడవు దేవహూతికిన్.

దేవహూతి భర్తయాన యతిక్రమింపక ఆయన చెప్పినట్లు వ్రతోపవాసాదులు చేయగా నీవు జగత్తునకు చతుర్వింశతి తత్త్వ విషయమైన సాంఖ్యమును (జ్ఞానమును) బోధించుటకు ఆమెయందు కపిలావతార మెత్తితివి.

వన మేయుషి కర్దమే ప్రసన్నే మతసర్వస్వ ముపాదిశ న్జనన్యై,
కపిలాత్మక వాయుమందిరేశ! త్వరితం త్వం పరిపాహి మాం గదౌఘాత్. 10

మునియగు కర్దముం డటఁ దపోవని కేగె బ్రసన్నమూర్తి మీ
జననికి నాత్మతత్త్వమును సర్వము నీ వుపదేశ మిచ్చినా
వనఘ! మరుత్పురేశ! కపిలాత్మక! మాభవరోగబాధలె
ల్లను హరియించి యేలుమ! కలామయ! నిత్యకలాప! చిన్మయా!

అవ్వల కర్దమముని తపోవనమున కేగెను. నీవు మీ జననికి ఆత్మతత్త్వోపదేశమును సులభరీతిని అనుగ్రహించితివి. అట్టి నీవు మమ్ము గాపాడుము.

# 15వ దశకము

# కపిలోపదేశము

మతిరిహ గుణసక్తా బంధకృ త్తేష్వసక్తా
త్వమృతకృ దుపరుంధే భక్తియోగస్తు సక్తిమ్,
మహదనుగమ లభ్యా భక్తిరేవాత్ర సాధ్యా
కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 1

బందమగున్ మనంబు గుణబంధమునం బడెనేని వానియం
దొందక నిల్చెనేని యమృతోదయమే యగు; భక్తియోగ మీ
బందముఁ ద్రెంచు; భక్తియును భక్తసమాశ్రయలభ్యమంచు నీ
యందము నమ్మకుం దెలిపి తద్ధిర శ్రీకపిలాకృతిన్ హరీ!

మూడులోకములందును మనస్సు విషయములు అనగా స్రక్చందన వనితాది భోగములం దగుల్కొనెనేని బంధకారణ మగును. వానియందు సక్తముగాక దృఢముగ నిలుచునేని మోక్షరూపమైన అమృతముం గూర్చును. భక్తియోగము సక్తిని వదలించును ఆ భక్తి భక్తజనసంగము వలననే కల్గును. అని కపిలావతారమెత్తి మీ యమ్మ దేవహూతికి ఉపదేశించితివి.

ప్రకృతిమహదహంకారాశ్చ మాత్రాశ్చ భూతా-
న్యపి హృదపి దశాక్షీ పూరుషః పంచవింశః,
ఇతి విదిత విభాగో ముచ్యతేఽసౌ ప్రకృత్యా
కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 2

ప్రకృతి మహత్తహంకృతి నభః ప్రముఖమ్ములు భూతపంచక
మ్మొకపది యింద్రియమ్ములు నహో విషయమ్ములునున్ మనస్సు పా
యక పురుషుండు నిర్వదియు నైదవతత్త్వముగా నెఱింగినన్
ప్రకృతిఁ దరింపవచ్చునని పల్కితి గాదటె దేవహూతికిన్!

మూలప్రకృతి మహత్తు అహంకారములు ఆకాశాదిపంచభూతములు పది యింద్రియములు తన్మాత్రలు శబ్ద స్పర్శరూపరసగంధములు హృదయము

పురుషుడు. నను నిరువదియైదు తత్త్వముల విభాగ మెఱిగినవాడు ప్రకృతిని తరించునని తెలిపితివి. అనగా మాయచే తత్కార్యములయిన శరీరాదులచే బద్ధుండుగా డంటివి.

వి.వి : ప్రకృతి-సర్వకారణము. ప్రధానము అవ్యక్తము అవిద్య మాయయని దానినే పిలుతురు. మహత్తు మహత్తత్త్వము. మూలప్రకృతి యొక్క కార్యము. అహంకారములు మహత్తత్త్వమునుండు పుట్టినవి. సాత్త్విక-రాజస-తామసములు మాత్రలు-తామసాహంకారకార్యములు అపంచీకృత పంచభూతము లన్నమాట. శబ్దస్పర్శ రూప రస గంధములని వానినే యందురు. భూతము లైదు. పృథివి నీరు తేజస్సు వాయువు ఆకాశము. హృదయము=మనసు దశాక్షీ=దశానాం అక్ష్ణాణాం సమాహారః అనగా ముక్కు నాలుక కన్ను చెవి-చర్మము వాక్కు చేయి పాదము పాయువు (గుదము) ఉపస్థ (గుహ్యేంద్రియము) వీని సంఘాతము. ఇవి 24 తత్త్వములు. 25 వ తత్త్వము పురుషుడు-జీవుడు ఈశ్వరుడు అని యిది రెండు విధములు.

**ప్రకృతిగత గుణౌఘైః నార్హ్యతే పూరుషో௨యం**
**యదితు సజతి తస్యాం తద్గుణా స్తం భజేరన్,**
**మదనుభజన తత్త్వాలోచనైః సాప్యపేయాత్**
**కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 3**

**ప్రకృతిగతమ్ములైన గుణవర్గములోఁ బురుషుండు చిక్కఁ; డ**
**ట్లొకతఱిఁ జిక్కనేని యవి యూరక చిక్కులు వెట్టుచుండు, మా**
**నక ననుగొల్చి తత్త్వ మనన మ్మొనరించిన దాఁటవచ్చు నీ**
**ప్రకృతి నటంటి వో కపిలబాలక! అమ్మకు దేవహూతికిన్.**

ప్రకృతియొక్క గుణజాలముచే పురుషుడు లిప్తుడుగాడు. ఒకవేళ లిప్తుడయ్యెనా అనగా అహంకార మమకారములు గలిగియుండెనా ఆ గుణములు వానిని యిడుమల పాల్జేయును. అనగా జనన మరణ ప్రవాహరూప సంసారములో ముంచును. కలిగియుండెనా? అనివాపక్షముగా జెప్పుటచే ప్రకృతిసంబంధము అపరమార్థము (నిజముగాదని) సూచించపబడినది.

నా అనుభజనము ఈశ్వర ప్రణిధానముచే తత్త్వమననముచే అనగా బ్రహ్మ జ్ఞానముచే మాయను తరింప వచ్చును. ఆమాటే "తీవ్రేణాత్మసమాధినా-

ప్రకృతిః పురుష స్యేహ దహ్యమానాత్వహర్నిశమ్! తిరోభవిత్రీ" - అని భాగవతము స్కం 3 అధ్యాయం 27, శ్లో|| 22, 23 లో చెప్పబడినది.

విమలమతి రుపా త్తైర్వాసనాద్యైర్మ దంగం
గరుడ సమధిరూఢందివ్యభూషాయుధాంకమ్,
రుచి తులిత తమాలం శీలయే తానువేలం
కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 4

స్థిరమగు నాసనమ్మున మదింగల యెల్ల కలంక మీఁగినన్
గరుడఖగాధిరూఢుని వికస్వర దివ్యవిభూషణాయుధో
త్కరుని దమాలనీలతనుఁ గాంచి సమాధి నిరూఢి నందు మం
చరసి వచించినావు కపిలార్భక యమ్మకు దేవహూతికిన్.

స్థిరాసనమున నిలిచి యమనియమాది అష్టాంగయోగ సమాధి నభ్యసించి ఈశ్వరుడైన నా రూపమును గరుడవాహనారూఢునిగ దివ్యభూషణాయుధధారిగ ఇఱుగుడుమ్రానివలె నీలశరీరునిగ ధ్యానింపుము. అని మీ అమ్మకు దెల్పితివి.

మమ గుణగణ లీలాకర్ణనై కీర్తనాద్యైః
మయి సురసరిదోఘప్రఖ్య చిత్తానువృత్తిః,
భవతి పరమభక్తి స్సాహి మృత్యోర్విజేత్రీ
కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 5

గుణగణముల్ మదీయము లకుంఠిత లీలలు వించుఁ బాడుచున్
క్షణ మెడబాటులేని మది చారు సుపర్వసరిత్ప్రవాహ ధో
రణియగు భక్తి పుట్టును; కర మ్మది మృత్యుభయమ్ము నెట్టఁగా
రణమని తెల్పినావుగదరా కపిలాకృతి దేవహూతికిన్

మఱియు నా కల్యాణ గుణములను భక్తవాత్సల్యాది శుభలక్షణములను నా అవతారలీలలను బాడుచు నాడుచు నాలించుచు నవవిధలక్షణమైన సాధన భక్తిచే బరమభక్తి (సాధ్యభక్తి) యుదయించును.

**అహహ! బహులహింసా సంచితార్థైః కుటుంబం**
**ప్రతిదిన మనుపుష్ణన్ మయ్య స్త్రీజితో బాలలాలీ,**
**విశతిహి గృహసక్తో యాతనాం మయ్యభక్తః**
**కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః.** **6**

**ఘోరములన్ని సేసి యొడగూర్చుధనానఁ గుటుంబపోషణన్**
**దీరిచి స్త్రీవశంబగు మతిన్ సుత పోషణ లాలనాదులన్**
**బారు గృహైక సక్తుఁడు నభక్తుఁడు యాతనఁజిక్కునంచు నీ**
**వా రహిఁ బల్కినాడవు గదా కపిలాకృతి దేవహూతికిన్**

పరహింసచేసి చౌర్యాదులు చేసి కూర్చినధనముచే కుటుంబపోషణము సేయుచు స్త్రీవశుడై సుతాదిపోషణలాలనముల పరువులెత్తి గృహసక్తుడైన అభక్తుడు *పెక్కుయాతనల పాలగును. అని మీ అమ్మకు కపిలమూర్తివై దెల్పితివి.

**యువతిజఠరఖిన్నో జాతబోధో ఽ ప్యకాండే**
**ప్రసవగలితబోధః పీడయోల్లంఘ్య బాల్యమ్,**
**పునరపి బత ముహ్యత్యేవ తారుణ్యకాలే**
**కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః** **7**

**కలికి యసహ్య గర్భనరకమ్మున గాసిలి పూర్వసంస్మృతిం**
**జొలిచి, ప్రసూతివేళ నదిపోయినఁ బొక్కుచు శైశవా ద్యవ**
**స్థల నెటొదాటియున్ మరల దారుణ యౌవనమోహమందు మూ**
**ర్ఛిలు నరుఁడంచుఁ దెల్పితివి శ్రీకపిలాకృతి దేవహూతికిన్**

తల్లి గర్భము విణ్మూత్ర గర్తము. అందు తల్లి తినెడి పులుపు కారము చేదు వేడిమియుంగల పదార్థములచేతను క్రిములచేతను బాధపడుచు

---

యాతనలు :-

* నరకము లిర్వదెన్మిది యనంజను కోట్లఁ దృణాదిజన్మముల్
గిరికొనులక్షసంఖ్య క్రిమికీటకముల్ పదకొండు, తొమ్మిద
ద్దిర జలజంతవుల్, పదిగదే ఖగముల్, పశు వేడుకోట్లు ఈ
సరణిని నాల్గులక్షలగు జన్మములన్ నరు లెత్తుచుండ్రిలన్.

అదుఃఖ నివారణకు దారిలేక, బుద్ధివచ్చి వెనుకటి జన్మస్మృతి (7వ మాసమున) కలిగినను జేయునదిలేక, ప్రసూతివాయువులచే వెలికినెట్టబడి యోనియంత్ర మందు పీడనొంది అనేక జన్మసంచితమైన కర్మ విషయమైన తెలివితో బుట్టియు భూమిపై పడగానే యది పోయి శైశవాద్యవస్థలు వడి తిరిగి యౌవనము రాగా స్త్రీ వ్యామోహమందు మూర్ఛిలి నరుడు కామ్యనిషిద్ధ కర్మము లాచరించుచుండును. అని దేవహూతికి దెల్పితివి.

**పితృసురగణయాజీ ధార్మికో యో గృహస్థః**
**సచ విపతతి కాలే దక్షిణాధ్వోపగామీ,**
**మయి విహిత మకామం కర్మతూదక్పథార్థం**
**కపిలతను రితి త్వం దేవహూత్యై న్యగాదీః. 8**

**సురపితృకోటిఁ గొల్చెడు విశుద్ధులు దక్షిణయాన మందుచుం**
**దురు; ఫలకాంక్ష సేయక ననున్ గుఱిసేసి సమస్త కర్మముల్**
**నెరపిన పుణ్యు లేగుదురు నిర్మల ముత్తర యానమంచు నీ**
**వరసి వచించినావు గదవే! కపిలార్భక! దేవహూతికిన్.**

భగవద్ధర్మ విముఖుడై ఇతరదేవతలను పితృదేవతలను ఫలకాంక్షచే గొలిచినవాడు స్వధర్మాచరణపరు డన్నమాట. దక్షిణయానమున ధూమాది మార్గమునఁబోవును. నాయందే స్వధర్మ కర్మ సమర్పణముచేసిన పుణ్యుడు ఉత్తరయానమున (ఉత్తరాయణమార్గమున) అర్చిరాది మార్గమున బోవును. అని మీతల్లి కానతిచ్చితివి.

వి.వి : కేవల కామ్యకర్మతుడగు జీవుడు ప్రారబ్ధభోగమయిన తర్వాత లింగ శరీరముతో చక్షురాదీంద్రియముల ద్వారా వెడలిపోవును. వానిని ధూమాభిమానిదేవత రాత్ర్యభిమానిదేవత చేతికందించును. ఆ దేవత కృష్ణ పక్షాభిమానిదేవతకు, ఆమె దక్షిణాయనషణ్మాసాభిమాని దేవతకు, ఆమె పితృలోకమార్గమున ఆకాశమందు చంద్రునింజేర్చును. అక్కడ పుణ్యఫలముగ స్వర్గసుఖము ననుభవించి, తిరిగి భూమిపై ఆకాశమార్గమున వాయు-ధూమ-మేఘ-వర్షక్రమమున ఓషధులందు బడును. ఓషధులనుండి అన్నము అన్నము నుండి రేతస్సునై స్త్రీయోనిం జెంది శరీరధారియగును. పుణ్యపాపశేషముచే పుణ్యపాపయోనులలం జన్మించును.

**ఇతి సువిదితవేద్యాం దేవ హే దేవహూతిం**
**కృతనుతి మనుగృహ్యత్వం గతో యోగిసంఘైః,**
**విమలమతి రథాసౌ భక్తియోగేన ముక్తా**
**త్వమపి జనహితార్థం వర్తసే ప్రాగుదీచ్యామ్.** **9**

**విని యిటు లానతిచ్చినది వేడ్కగ్రహించి నినున్ నుతించు న**
**మ్మను దయఁజూచి యోగిజనమండలితో దయచేసినావు, మా**
**జననియు భక్తి యోగ సరసమ్మగు భావముతోడ ముక్తి సే**
**కొనె; మముబోంట్ల నేల నెలకొంటివి నీవును బ్రాగుదీచిగన్**

నీ చేసిన యుపదేశము గ్రహించి అనగా బ్రహ్మవస్తు తత్త్వమును తత్ప్రాప్తి సాధన మెఱింగి మా అమ్మ నీవు యోగిమండలితో నేగిన తరువాత భక్తియోగ పరిష్కృత భావనాసంపత్తితో ముక్తినందెను. లోకానుగ్రహమునకై నీవు ఈశాన్యదిశ నున్నావు.

**పరమ! కిము బహూక్త్యా త్వత్పదాంభోజ భక్తిం**
**సకల భయవినేత్రీం సర్వ కామోపనేత్రీమ్,**
**వదసి ఖలు దృఢం త్వం త ద్విధూయామయాన్ మే**
**గురు పవన పురేశ! త్వయ్యుపాధత్స్వ భక్తిమ్.** **10**

**పలుకులు వేయునేటికి భవత్పదపంకజభక్తి మా భయ**
**మ్ములఁ దొలఁగించి సర్వఫలముల్ రుచి నించు నటంచు గట్టిగాఁ**
**బలికితి వీవ మా సకలబాధలు చించి నినుం గుఱించి ని**
**ర్మలమగు భక్తి నించఁగదరా! గురువాయుపురీ మనోహరా!**

ఓ గురువాయుపురీ సుందరా! నారాయణా! వేయి మాటలెందులకు నీపాదభక్తి సకల భయహర్త్రి సర్వవాంఛాసవిత్రి యని నీవు గట్టిగా దెల్పితివి. కావున నా రోగములు వాపి నీ యందు భక్తిని గుదురుకొనజేయుము:

# 16వ దశకము

# నరనారాయణావతారము

దక్షో విరించతనయోఽథ మనోస్తనూజాం
లబ్ధ్వా ప్రసూతి మిహ షోడశచాపకన్యాః,
ధర్మే త్రయోదశ దదౌ పితృషు స్వధాంచ
స్వాహాం హవిర్భుజి సతీం గిరిశేత్వదంశే. 1

**అజాకొడుకైన దక్షు డపుడా మనుపుత్రి ప్రసూతియందు నా**
**త్మజల బదార్గురం బడసి ధర్మునికిం బదుమువ్వురన్, హవి**
**ర్భుజునకు స్వాహ, నెల్ల పితృమూర్తులకున్ స్వధ, నీదు నంశమై**
**విజయము సేయు నీశునకు వేడుక నిచ్చె సతీ సతీమణిన్**

బ్రహ్మతనయుడు దక్షుడు స్వాయంభువ మనువు కూతురగు ప్రసూతియందు పదునారుగురు కూతులనుగని, అందు బదుముగ్గురను మైత్రి మొదలయిన వారిని ధర్మునికిచ్చెను స్వాహాదేవిని అగ్నికిని, పితృదేవతలందఱకు స్వదను, ఇచ్చెను నీ స్వరూపమైన శివునకు సతీదేవి నొసంగెను

**మూర్తిర్హి ధర్మగృహిణీ సుషువే భవంతం**
**నారాయణం నరసఖం మహితానుభావమ్,**
**య జ్జన్మని ప్రముదితాః కృతతూర్య ఘోషాః**
**పుష్పోత్కరాన్ ప్రవవృషుః నునువు స్సురౌఘాః.** 2

**ఆయెడ ధర్ము ధర్మసతియైనది మూర్తి మహానుభావు నా**
**రాయణునిన్ నినున్ నర సహాయుని గర్భమునందు గన్న దో**
**హో! యని యా త్వదీయ జననోత్సవమందు సురల్ నుతించి పు**
**ష్పాయతవృష్టి నించిరి శుభాయత మంగళతూర్యఘోషలన్**

అప్పుడు ధర్ముని ధర్మపత్నియగు మూర్తి యనునామె మహానుభావుని నర సఖుడైన నారాయణుని నిన్ను గనెను నీ జన్మోత్సవమందు దేవతలు

నిన్ను గొనియాడి మంగళతూర్యములు మ్రోయించుచు నీపై కల్పవృక్షకుసుమ వర్షము గురిపించిరి.

దైత్యం సహస్రకవచం కవచైః పరీతం
సాహస్రవత్సర తప స్సమరాభిలవ్యైః,
పర్యాయనిర్మితతప స్సమరౌ భవన్తౌ
శిష్టైకకంటక మముం న్యహతాం సలీలమ్. 3

**వేయిసమల్ తపమ్ము మఱి వేయిసమల్ సమరమ్ము సేసినన్**
**బోయెడు వేయియౌ కవచముల్గల దైత్యునితోడఁ దాకి ప**
**ర్యాయమునన్ దపమ్ము సమరమ్ము నొనర్చి కిరీటమాత్రతే**
**జోయుతు నా సహస్ర కవచున్ వధియించితి రీర లిద్దరున్.**

ఆవల సహస్రకవచుడను రక్కసుని వేయేండ్లు దాకి మీరిద్దరును ఒకరు తపస్సు చేయుచుండగా ఒకరు యుద్ధము చేయుటగా పర్యాయముగా ఒక్క కవచము శేషించుదాక పోరి తుదకు వానిని మీరిద్దరు సంహరించితిరి.

అన్వాచర స్నుపదిశన్నపి మోక్షధర్మం
త్వం భ్రాతృమాన్ బదరికాశ్రమ మధ్యవాత్సీః,
శక్రోఽథ తే శమ తపోబల నిస్సహాత్మా
దివ్యాంగనా పరివృతం ప్రజిఘాయ మారమ్ 4

**అచొటువాసి యాబదరికాశ్రమవీథుల భ్రాతతోడ మో**
**క్షాచరణ ప్రచారములకై వసియింపగ మీతప శ్శమ**
**శ్రీచరితమ్ము నోర్వమిఁ బొరింబొరి పూవిలుకాని బంపె నా**
**నా చకితేక్షణా విలసనమ్ములు తోడుగ నింద్రు డయ్యెడన్.**

మీరు ఆ చోటువిడిచి లోకసంగ్రహార్థము మోక్షధర్మము లాచరించుచు, నుపదేశించుచు బదరికాశ్రమమందు జరించుచుండ నింద్రుడు మీ తపస్సును శమాది సంపత్తిని జూచి యోర్వలేక స్వస్థానము హరింతురని భయపడి దివ్యసుందరీ పరివారముతోడిచ్చి మన్మథుని బంపెను.

**కామో వసంత మలయానిల బంధుశాలీ**
**కాంతాకటాక్షవిశిఖైః వికసద్విలాసైః,**
**విధ్య న్ముహుర్ముహు రకంప ముదీక్ష్య చ త్వాం**
**భీత స్త్వయాథ జగదే మృదుహాస భాజా. 5**

**అంత వసంత కాంత మలయానిల బాంధవ మొంది యప్సరః**
**కాంతకటాక్ష పాత విశిఖమ్ములఁ గంతుఁ డనంతలీలలన్**
**రంతులు సేసియుం దన తరమ్ము రవంతయుఁ గామిచే భయ**
**భ్రాంతుఁడునైన వాని గని పల్కితి నచ్చపు మొల్క నవ్వులన్.**

మన్మథుడు వసంత మలయానిలు లిద్దరం దోడుసేసికొని, అప్సరసల వాల్గంటి చూపులు తూపులుగాగైకొని యేయంతయు చలింపని నిన్నుజూచి జడిసిపోయెను. నీవు అల్లన నవ్వుచు వాని కిట్లంటివి.

**భీత్యాల మంగజ వసంత సురాంగనా వో**
**మన్మానసం త్విహ జుషధ్వ మితి బ్రువాణమ్,**
**త్వం విస్మయేన పరితః స్తుపతా మథైషాం**
**ప్రాదర్శయః స్వపరిచారక కాతరాక్షీః. 6**

**"అసమశరా భయంపడకుమా మఱి మాధవ! పేరునిల్పుకో**
**వసమయినాఁడ మీకు సుర వారవిలాసవతీ దృగంతరో**
**ల్లసనమునం" దటంచు నవలః నుతులందుచు వారి కద్భుత**
**మ్మెస ఁగ ఁగ జూపినావుగదవే పరిచారకసుందరీ తతిన్.**

ఓ విషమబాణ! ఓ మాధవ (వసంతుడాయనుట) ఓ సురాంగనలార! జడియవలదు. వచ్చి నాచిత్తముం బడయుడు. లేదా నా సంకల్పించిన సత్కార మందుకొనుడు. లేదా స్వర్గమునగాని లభింపని నేనిచ్చు స్త్రీరత్నములం గైకొనుడు. అని వారి పొగడ్తల నవధరించి వారికి నీ పరిచర్య చేయుచు సౌందర్యనిధులైన విలాసినులను సృజించి చూపించితివి.

**సమ్మోహనాయ మిళితా మదనాదయ స్తే**
**త్వద్దాసికాపరిమళైః కిల మోహ మాపుః,**

**దత్తాం త్వయాచ జగృహుః త్రపయైవ సర్వ**
**స్స్వర్వాసి గర్వశమనీం పున రూర్వశీం తామ్.** 7

**నిను మోహమ్మున ముంపవచ్చు జనముఁన్ నీ దివ్యదాసీ విలా**
**సినులర్ నించు సువాసనల్ ముసరి ముంచెన్ మోహజాలాన పా**
**వన! స్వర్వారవిలాసినీ నికరగర్వమ్మార్చు నియ్యూర్వశిం**
**గొని పొందంటివి, వారు చేకొనిరి సిగ్గుల్ కొంత తూగింపగన్.**

నిన్ను మోహింప జేయవచ్చిన యచ్చరలు మదనుండును నీ దాసీ జన విలాసములకు వారి మేనుల న్నించి ముంచెత్తు సువాసనలకు మూర్ఛవడిరి. యోగశక్తిచే నీ సృజించిన దివ్యాంగనలలో నున్న యొక యూర్వశిం జూపి దీనిం గొని పొండని నీవన స్వర్వాసినుల గర్వము హరించు నయ్యూర్వశిని లోలోన సిగ్గుపడుచునే గొంపోయిరి.

**దృష్ట్వోర్వశీం తవ కథాం చ నిశమ్య శక్రః**
**పర్యాకులో௨జని భవన్మహిమావిమర్శాత్**
**ఏవం ప్రశాంతరమణీయతరావతారాత్**
**త్వత్తో௨ధికో వరద కృష్ణతను స్త్వమేవ.** 8

**వచ్చిన యూర్వశింగని భవచ్చరితమ్మును నీప్రభావమున్**
**ద్రచ్చి కడుం జలించె నమర ప్రభు; వింత ప్రశాంత సుందర**
**మ్మచ్చము విశ్వమోహన మహామహిమ మ్మవతార; మింతకున్**
**ముచ్చట కృష్ణరూప మతిముగ్ధవిమోహన మొక్కటేకదా.**

వచ్చిన యా యూర్వశింగని నీ వింతవృత్తాంతము విని యింద్రుడు తఱచి యాలోచించి వ్యాకులుండయ్యె ప్రభూ! ఈ నీ నారాయణావతారము కంటెను ఎంతో ప్రశాంత రమణీయము కృష్ణావతార మొకటియే.

**దక్షస్తు ధాతు రతిలాలనయా రజో௨న్ధో**
**నాత్యాదృత స్త్వయిచ కష్ట మశాంతి రాసీత్,**
**యేన వ్యరుంధ స భవత్తనుమేవ శర్వం**
**యజ్ఞే చ వైరపిశునే స్వసుతాం వ్యమానీత్.** 9

**హెచ్చుగఁ దమ్మిచూలి యొనయించిన కూరిమిచే రజోఽధుఁడై**
**మెచ్చఁడు నిన్ను దక్షుఁ; డటమీఁద నశాంతి జనించె; వాఁడు నీ**
**యచ్చపు రూపమైన శివు యజ్ఞమునం బిలువంగఁబోక పె**
**న్మచ్చర మూని కూతు నవమానశిఖిం బడఁద్రోచె నంతటన్.**

దక్షుడు బ్రహ్మ తనయెడ చేయు గారామునకు రాజసమెక్కి కన్నుగానక నీ యెడ నిరాదరుడై యశాంతుడయ్యెను. అందుచే నీ మూర్తియే యైన శివుని తన కూతురును సతీదేవిం గూడ పగగొని యజ్ఞమం దవమానము సేసెను.

**కృద్ధేశమర్దితమఖ స్సతు కృత్తశీర్షో**
**దేవప్రసాదితహరా దథ లబ్ధజీవః**
**త్వత్పూరితక్రతువరః పున రాప శాన్తిం**
**సత్వం ప్రశాంతికర పాహి మరుత్పురేశ.** 10

**తా నుగ్రుండు మహోగ్రుఁడై మఖము నస్తధ్వస్తముం జేసి, యా**
**లోనన్ మామ శిరస్సుఁద్రెంచి దివిషల్లోకమ్ము కీర్తింప సం**
**ధానించెఁ మఱి వాని జీవితము; నంతన్ యజ్ఞ సంపూర్తి నీ**
**చే నై దక్షుఁడు శాంతినొందె నిటు నిఁ సేవింతు రక్షింపుమా!**

తన ప్రియురాలి నవమానించెనని ఉగ్రుండు నిజముగ నుగ్రుడై దక్ష యజ్ఞము నాశనముసేసి, మామగారి తలద్రుంచి, దేవతలు ప్రార్థింప మరల నట మేకతల యతికించి ప్రాణముపోసితివి. అట్టివాడవునీవు మాకును బ్రాణము వోయుము.

# 17వ దశకము

## ధ్రువోపాఖ్యానము

**ఉత్తానపాదనృపతే ర్మనునందనస్య**
**జాయా బభూవ సురుచి ర్నితరా మభీష్టా,**
**అన్యా సునీతిరితి భర్తు రనాదృతా సా**
**త్వామేవ నిత్య మగతి శ్శరణంగతాఽభూత్.** 1

మనున కుత్తానపాదు డన్ తనయు డొదవె
వానికిఁ సురుచి రుచియించె గాని యా సు
నీతి యభిమత గాదయ్యె; నిన్ భజించె
నామె నీకంటె శరణు లే దన్య మనుచు

స్వాయంభువుని కొడుకు ఉత్తాన పాదుడు, (ప్రియవ్రతుని తమ్ముడు) వానికి సురుచియను భార్యయం దెక్కువ మక్కువ. సునీతి యను నామె యిష్టురాలు గాదయ్యె. అందుచే నామె నిన్నే శరణని సేవించెను.

**అంకేపితు స్సురుచిపుత్రక ముత్తమం తం**
**దృష్ట్వా ధ్రువః కిల సునీతిసుతోఽధిరోక్ష్యన్**
**ఆచిక్షిపే కిల శిశు స్సుతరాం సురుచ్యా**
**దుస్సంత్యజా ఖలు భవద్విముఖైరసూయా.** 2

సురుచి కుమారుడుత్తముడు సొంపుగఁ దండ్రితొడన్ వసింప స
త్వరమున నా సునీతి పసి వాఁడు ధ్రువుం డట నెక్కఁ బోయినన్
సురుచి కఠోరముల్ పలుకుచుం దిగఁద్రోచెను భర్త చూడగన్
హరి విముఖుల్ దురాగ్రహు లయారె యసూయ దలంగ నేర్తురే!

తండ్రి తొడపై నున్న యుత్తముంజూచి సునీతి కుమారుడు ధ్రువుడు తాను కూడ నట కెక్కబోయెను. సురుచి వారించి తండ్రిముందీసడించి పలికెను. నీ భక్తులు గాని దురాగ్రహులు అసూయ తొలంగ జాలరు.

త్వన్మోహితే పితరి పశ్యతి దారవశ్యే
దూరం దురుక్తినిహత స్స గతో నిజాంబామ్,
సాపి స్వకర్మగతిసంతరణాయ పుంసాం
త్వత్పాదమేవ శరణం శిశవే శశంస. 3

నీ మాయంబడి తండ్రి యాలివశుఁడై నీవాని జూడండు; వాఁ
డామీదన్ పినతల్లి మాట యెద శల్యమ్మై చనన్, దల్లి తం
డ్రీ! మేలయ్యెడుఁగాక కర్మగతి యెందే దాటరా దేరికిన్
స్వామి శ్రీచరణమ్ములే శరణముల్ భావింపు మీవం చనెన్

నీ మాయలోబడి తండ్రి తరుణికి వశుడై నీవాడైన ధ్రువు నాదరింపడయ్యె. అంత సవతి తల్లి మాటలు ములుకులై యా పసివాడు తల్లికడకేగ ఆమె నాయనా! నీకు శుభంబగుగాక! కర్మగతి నెవ్వరుం దప్పింపలేరు. శ్రీహరి చరణంబు శరణంబని కొడుకును అనునయించెను.

ఆకర్ణ్య సోఽపి భవదర్చన నిశ్చితాత్మా
మానీ నిరేత్య నగరాత్ కిల పంచవర్షః
సందృష్ట నారద నివేదితమంత్రమార్గః
త్వామారరాధ తపసా మధుకాననాంతే. 4

విని యైదేండ్ల వయస్సువాఁడు నిను సేవింపన్ బుర మ్మొగి చ
య్యన నేగెన్ వనసీమకున్; సదయుఁడై యచ్చోట దేవర్షి ద
ర్శన మిచ్చెన్, మఱి యిచ్చె నొక్క మనురాజ మ్మమ్మహామంత్ర సా
ధన నిన్గొల్చెఁ దపమ్మునన్ మధువనిన్ శ్రీజాని నేకాగ్రతన్

తల్లి మాటవిని యైదేండ్ల బాలుడు ధ్రువుడు వనమేగి నారదుని దర్శనము వడసి యాయన కృపతో నిచ్చిన మంత్రముచే మధువనమందు నిన్నేకాగ్రతతో నారాధించెను.

తాతే విషణ్ణహృదయే నగరీంగతేన
శ్రీనారదేన పరిసా న్త్వితచిత్తవృత్తౌ,
బాల స్త్వదర్పితమనాః క్రమవర్ధితేన
నిన్యే కఠోరతపసా కిల పంచమాసాన్. 5

**తనయు దలంచి తండ్రి పరితాపపడన్ జని నారదుండు సాం**
**త్వనములు వల్కె; నక్కడ భవచ్చరణార్పిత చిత్తు డై ధ్రువుం**
**డును గ్రమవృద్ధి నందగ గఠోరతప మ్మొనరించె దొల్త పం**
**డ్లను దిని యాకులున్ జలములుం దినియుం దినకైదు మాసముల్,**

ఉత్తానపాదుడు కుమారునికై పరితపించుచుండగా నారదమహర్షి యాతనిం జల్లనిమాటలం దేర్చి శాంతి చేకూర్చెను. ధ్రువుడు క్రమముగ ఫల పర్ణ జలమాత్రప్రాశన చేసి తుదకు వాయుభక్షణముచే నిరాహారుడై యైదు నెలలు నీ యందు మనసర్పించి తీవ్రతపము గావించెను.

**తావ త్తపోబల నిరుచ్ఛ్వసితే దిగంతే**
**దేవార్థిత స్త్వ ముదయ త్కరుణార్ద్రచేతాః,**
**త్వద్రూపచిద్రస నిలీనమతేః పురస్తా**
**దావిర్బభూవిథ విభో! గరుడాధిరూఢః. 6**

**అతనితపోబలమ్మున దిగంతము లూపిరియాడకున్న, దే**
**వతలును నిన్ను వేడికొన వాలితి వాగరుడాధిరూడు డై**
**వితత కృపారసార్ద్రమతి విందయి చిన్మయమైన నీదు నా**
**కృతి నెఱసొంపునన్ మతిలయించిన యాపసిబాలు ముందటన్.**

బాలుని తపోబలముచే దిక్కులందు ఉచ్ఛ్వాస నిశ్వాసములు కట్టువడ దేవతలు ప్రార్థింప దయార్ద్ర హృదయుడవై గరుడ వాహనమెక్కి నీరూపమైన కేవల సచ్చిదానందమందు మనసు లీనమైయున్న యా బాలుని ముందు సాక్షాత్కరించితివి.

**త్వద్దర్శన ప్రమదభార తరంగితం తం**
**దృగ్భ్యాం నిమగ్నమివ రూపరసాయనే తే,**
**తుష్టూషమాణ మవగమ్య కపోలదేశే**
**సంస్పృష్టవానసి దరేణ తథాదరేణ. 7**

**ఆదట నీదు దర్శనము నంది కడింది సుఖమ్ము నొంది యా**
**హ్లాద తరంగితుండయి త్వదద్భుత రూపరసాయనమ్ము నం**

దీది యెటో స్తుతించుటని యెంచుట నెంచి కపోలమొత్తినా
వాదరముం దరమ్ము గొని యల్లన ( జల్లగ ( జూచి పిల్లనిన్.

నీ దర్శన భాగ్యమంది ఆనందరస తరంగముల నోలలాడి నీ యద్భుతమైన సౌందర్యామృతమున నీదులాడి నిన్నెట్లు నుతింతునా యని తలంచుచున్న యాపాపని జల్లని చూపులంజూచి ఆదరముగొని నీ దరమ్ము (శంఖమును) గొని, యాతని పాలబుగ్గల నొత్తినావు.

తావద్విబోధవిమలం ప్రణువంత మేనం
అభాషథా స్త్వ మవగమ్యతదీయభావమ్,
రాజ్యం చిరం సమనుభూయ భజస్వభూయః
సర్వోత్తరం ధ్రువపదం వినివృత్తిహీనమ్. 8

ఆవల జాలువారి కడు నచ్చపు (దెల్వి యపూర్వవాఙ్మయ
శ్రీ వినుతించు బాలు హృదయమ్ము గ్రహించి జగమ్మునేలి యా
పై వెనుకంజ వేయని ధ్రువస్థితి నందగ వత్సగాని లె
మ్మావల దానికిన్ గలుగ దావలయంచు దయారసావధీ!

నీ శంఖ మొత్తిన ప్రభావముచే పరిశుద్ధ జ్ఞానము, అద్భుతసారస్వత సంపదయు జాల్కొనగా నిన్ను నుతించు నాతని హృదయము గ్రహించి పునరావృత్తి రహితమైన ధ్రువస్థానము (ప్రలయమందును చలింపని లోకమన్నమాట) అంది కొనగా వత్సవుగాని యిక తపమునుండి లెమ్మని యంటివి.

ఇత్యూచిషి త్వయిగతే నృపనందనోఽ సౌ
ఆనందితాఖిలజనో నగరీ ముపేతః,
రేమే చిరం భవదనుగ్రహపూర్ణకామః
తాతే గతేచ వన మాదృతరాజ్యభారః. 9

అనిపిన యంత నీవు మఱి యా నృపనందను (డేగుదెంచి ప
త్తనమునకున్ జనమ్ములు సదా యనురంజన మొంద (ద్వత్ప్రసా
దన పరిపూర్ణ కాము(డయి, తండ్రి వనమ్మునకుం దపమ్ము సే
యను జన, రాజ్యభారవహనాదరు(డయ్యె ధ్రువుండు నంతటన్

నీవు వరప్రసాదమిచ్చి యంపగా రాజనందనుడు తన పురమునకు వచ్చి నీ దయచే పరిపూర్ణకాముడయి జనానురంజనముగ రాజ్యమేలెను. అతని తండ్రి తపస్సు చేయుటకు వనమునకు బ్రస్థానము సేసెను.

**యక్షేణ దేవ! నిహతే పునరుత్తమేఽస్మిన్**
**యక్షైస్స యుద్ధనిరతోవిరతో మనుర్త్వా,**
**శాంత్యాప్రసన్న హృదయాద్ధనదాదుపేతాత్**
**త్వద్భక్తిమేవ సుదృఢామవృణోన్మహాత్మా. 10**

**యక్షునిచే హతుండగుట యారసి యుత్తము, నీరసమ్మునన్**
**యక్షులతోడ బోరి మను నానతి నా పగవాసినం, దదీ**
**యాక్షయశాంతి మెచ్చి తనయంతన వచ్చిన యక్షరాట్కృపా**
**వీక్షణచే వరమ్ముగనె విశ్రుతి ద్వత్పదభక్తి విస్తృతిన్.**

ఉత్తముడు వేటకేగి యక్షునిచే యుద్ధమందు హతుడుకాగా కోపముగొని యక్షులతో బోరి, మనువు నాజ్ఞచే శాంతింపగ గని యక్షరాజగు కుబేరుడేగుదెంచి వరమడుగుమన ధ్రువుడు నీ భక్తినే కోరుకొనెను.

**అంతే భవత్పురుషనీత విమానయాతః**
**మాత్రాసమం ధ్రువపదే ముదితోఽయ మాస్తే,**
**ఏవంస్వభృత్యజనపాలనలోలధీ స్త్వం**
**వాతాలయాధిప నిరుంధి మమామయౌఘాన్. 11**

**అత డాలోన భవజ్జనమ్ముగొనిరా నాలో విమానమ్ములో**
**నతి మోదమ్మున దల్లితో ధ్రువపదమ్మం దేగియున్నా డు దీ**
**క్షితులౌ భక్తుల బ్రోచు దీక్ష యొకటే చెల్వొందు నీయందు, నా**
**గతి నీవంటి మరుత్పురాలయ! రుజల్ ఖండింపవే మ్రొక్కెదన్.**

అవల ధ్రువుడు ఇరువది యారువేలేండ్లు రాజ్యమేలి నీ యనుచరులు సునంద నందులు గొని వచ్చిన విమానమునం దల్లి సునీతితోగూడనేగి ధ్రువస్థాన మధిష్ఠించి ఆనందభరితుడై (నక్షత్రరూపమున) ఇప్పుడు నున్నాడు. ఈ విధముగా నిజ భృత్యభక్తపాలనమున లోలుడవుగావున నీవు నా వ్యాధులు హరింపుము.

# 18వ దశకము

# పృథూపాఖ్యానము

**జాతస్య ధ్రువకుల ఏవ తుంగకీర్తేః అంగస్య వ్యజని సుతః స వేననామా
తద్దోషవ్యథితమతిః స రాజవర్యః త్వత్పాదే విహితమనా వనంగ తోఽభూత్. 1**

**అంగుఁ డభంగ తుంగయశుఁడై ధ్రువువంగడమందుఁ బుట్టెఁ న
య్యంగునికిన్ జనించె దురితాత్ముఁడు వేనుఁడు; వాని దుష్క్రియా
సంగతిఁ గ్రుంగిక్రుంగి భవసంగము రోసి భవత్పదాబ్జ సా
రంగమతిన్ వనమ్మరిగె రాజశిఖామణి నిన్ భజింపఁగన్**

ధ్రువుని వంశమందు జన్మించిన ఉత్తుంగ కీర్తి యగు నందునికి దుష్టుడు వేనుడు జనించెను. వాని దుష్కార్యముల కెంతేని గ్రుంగిపోయి సంసార సంగము వాసి నీ చరణారవింద భక్తి మకరంద పానమున భృంగమై యంగుడు నిన్ను సేవింప వానప్రస్థాశ్రమము స్వీకరించెను.

**పాపోఽపి క్షితితలపాలనాయ వేనః పౌరాద్యై రుపవిహితః కఠోరవీర్యః,
సర్వేభ్యో నిజబలమేవ సంప్రశంసన్ భూచక్రే తవ యజనా న్యయం న్యరౌత్సీత్.2**

**పాపియైనను వేనునిన్ బాలనమున
బ్రజలు నియమించి; రంతఁ గర్కశుఁడు వాఁడు
తన బలమ్మును దా మెచ్చికొనుచు నవని
యాగముల కంతరాయమ్ము లాచరించె.**

పాపియైనను వేనుని ప్రజలు రాజుం గావించిరి. కాని క్రూరుడగువాడు తనను దామెచ్చుకొనుచు నవనిపై నిన్ను గూర్చి చేయు యజ్ఞాదులను జేయకుండ నరికట్టెను.

**సంప్రాప్తే హితకథనాయ తాపసౌఘే మత్తోఽన్యో భువనపతి ర్న కశ్చనేతి
త్వన్నిందావచనపరో మునీశ్వరై సైః శాపాగ్నౌ శలభదశా మనాయి వేనః. 3**

**తనకు హితబోధసేయ వచ్చిన మునీంద్ర**
**కోటిఁగని నన్నుమించిన మేటి ప్రభువు**
**గలఁడె మీ కంచు హరినింద సలిపి పరమ**
**మునుల శాపాగ్ని శలభమై పోయెవాఁడు**

మును లతనికి హితవు సెప్పరాగా నాకంటె మీకు మఱిప్రభువులేడని నిన్ను నిందించుచు మునీశ్వరు లిచ్చిన శాపాగ్నియందు వాడు మిడుత యయ్యెను. అనగా నశించెను.

**తన్నాశాత్ ఖలజనభీరుకైః మునీంద్రైః**
**తన్మాత్రా చిరపరిరక్షితే తదంగే,**
**త్యక్తాఘే పరిమథితా దథోరుదండాత్**
**దోర్దండే పరిమథితే త్వ మావిరాసీః. 4**

**రాజటు పోయినంతట నరాజకమైచన మౌనిలోక ము**
**ద్వేజనమంది తల్లికడబెట్టిన వేనుని మేనియూరువున్**
**యోజనమై మథించి కలుషోగ్రత యెల్లనుబాపి; రంత నీ**
**వే జనియించినావు మథియించిన తద్ఘన బాహుపీఠికన్.**

వాడుపోవుటచే నరాజకమై అవని దుష్టులపాలగునను భయముచే మునీశ్వరులు, తల్లి రక్షించి యుంచిన వేనుని శరీరమున తొడను మథింపగా నిషాదుడు (బోయవాడు) పుట్టెను. అట్లు పాపము పోగా మథించిన వాని బాహువు మథించినంతట నీవే పృథుండవై యవతరించితివి.

వి.వి : నిషాదుడు వేనుని పాప స్వరూపుడగుటచే నల్లగ నుండెను. వాని వంశము వాండ్రు నైషాదులను పేరున అడవికొండజాతులైరి.

విఖ్యాతః పృథురితి తాపసోపదిష్టైః
సూతాద్యైః పరిణుత భావిభూరివీర్యః,
వేనార్త్యా కబలితసంపదం ధరిత్రీం
ఆక్రాంతాం నిజధనుషా సమా మకార్షీః. 5

**నీవు పృథుండవై యశము నిల్పితి మౌనుల ప్రేరణమ్మునన్**
**భావి భవత్ప్రభావ విభవమ్ము నుతింపఁగ వందిమాగధుల్**

**వే విలుపూని వేన కబళీకృత సౌరభసార మైన యీ**
**భూవలయమ్ము గ్రొచ్చి సమముం బొనరించితి వెచ్చుతగ్గులౕ**

మునులు, పృథువు సాక్షాద్విష్ణు నంశమని తెల్పి చేసిన ప్రబోధమున వందిమాగధులచే నీ భావి పరాక్రమ చరిత్ర గానము చేయబడగా వేనునిపీడచే సిరిగోల్పోయి దుష్టాక్రాంతమైన భూమిని విల్లుపూని మెట్ట పల్లములు సరిచేసితివి.

**భూయస్తాం నిజకులముఖ్యవత్సయుక్తైః**
**దేవాద్యై స్సముచితచారుభాజనేషు,**
**అన్నాదీ న్యభిలషితాని యాని తాని**
**స్వచ్ఛందం సురభితనూ మదూదుహ స్త్వమ్.** **6**

**కులవృద్ధుల్ మఱి లేగలై కుడువగా గోరూప యౌ ధారుణిం**
**గల యన్నాదు లభీష్టసారముల నానా దేవ గంధర్వము**
**ఖ్యుల చేతం బితికించినాఁడ వట స్వస్వోపాత్తపాత్రమ్ములం**
**దలఘుప్రాభవ వైభవాద్భుత పృథువ్యక్తాత్మలీలా! హరీ!**

ఆ మీద దేవతలు మొదలగువారిలో కులవృద్ధులు దూడలుగా గుడుచు కొనగా నీ భూమిని గోవుగా నొనరించి వారివారి కుచితములయిన పాత్రలందు అన్నాదులను వారి వారి కనువైన యాహారములను ఆమె చేపగా ఛందోమయమయిన క్షీరములు ఋషులు పిదికిరి.

వి.వి: ఇంద్రుని దూడనొనరించి దేవతలు బంగారు పాత్రలో సోమమును బిదికిరి. ప్రహ్లాదుని వత్సమొనరించి అసురులు అయోమయపాత్రలో సురను (మద్యము) బిదికిరి. గంధర్వులు తేనెను-పితరులు రజతమయ పాత్రలో (వెండి గిన్నెలో) కవ్యమును ఇట్లాయా జాతుల కనువుగ నాయా పాత్రవిశేషములందు వారివారి కనువైన అన్నమును క్షీరరూపమున బిదికి రన్నమాట.

**ఆత్మానం యజతి మఖైస్త్వయి త్రిధామన్**
**ఆరబ్ధే శతతమ వాజిమేధయాగే,**
**స్పర్ధాలుః శతమఖ ఏత్యనీచవేషః**
**హృత్వాశ్వం తవ తనయాత్ పరాజితో௨భూత్.** **7**

నిను నీవే యజనమ్మునన్ గొలుచుచో నీమీఁద స్పర్ధాలువై
చని నీ నూఱవ యశ్వమేధమున నశ్వమ్మున్ హరించెన్ హరీ!
జనఘోషన్‌బడి దొంగవేసమున దుశ్చారిత్రుఁడై యింద్రుఁడే
చిన నీ పుత్రునిచేఁ బరాజయము గాంచెన్ విశ్వరక్షామణీ!

పృథుచక్రవర్తి రూపున నీవే నిన్ను నూరశ్వమేధములచే నారాధించుచుండగా చివరియాగ మారంభమందు ఇంద్రుడు "లోకమందేనొక్కడనే శతక్రతుడను నూఱు యజ్ఞములు పూర్తిచేసినవాడను" అని యభిమానించి యొక నీచవేషముదాల్చి అనగా పాషండ రూపము (నాస్తిక రూపము) దాల్చి వచ్చి యజ్ఞాశ్వమును హరించెను. పృథుకుమారునిచే నా గుఱ్ఱము గెలిచికొని రాబడినది. అందుచేతనే అతడు విజితాశ్వుడను పేరొందెను.

దేవేంద్రం ముహురితి వాజినం హరన్తం
వహ్నౌ తం మునివరమండలే జుహూషౌ,
రుంధానే కమలభవే క్రతో స్సమాప్తౌ
సాక్షాత్త్వం మధురిపు మైక్షథా స్వయం స్వమ్. 8

పలుమా రిట్లు భవన్మఖాశ్వము హరింపన్; మౌను లయ్యింద్రుఁ గ
ట్టలుకన్ హోమముసేయఁబూని రనలమ్మందంత హాహారవ
మ్ములు పుట్టెన్;విధి వచ్చి యడ్డుపడియెన్! బూర్తిం గనెన్ యజ్ఞ మా
తల సాక్షాన్మధువైరి నీవ నిను సందర్శించినా రీశ్వరా!

ఇట్లెన్నో మారులు గుఱ్ఱమును హరించిన యింద్రుని తుదకు ఋషిమండలి అగ్నియందు (దక్షిణాగ్నియందు) వేల్వవలెనని కోరగా బ్రహ్మయడ్డుపడి "తొంబది తొమ్మిది యజ్ఞములేచాలును. శతక్రతువును సంప్రీతుడుగాగలడు ఇక క్రతువులు వద్దు" అని తెలుపగా పృథుచక్రవర్తి విష్ణువును తననే తానుగా దర్శించెను.

తద్దత్తం వర ముపలభ్య భక్తి మేకాం
గంగాంతే విహితపదః కదాపి దేవ,
సత్రస్థం మునినివహం హితాని శంసన్
నైక్షిష్ఠా స్సనకముఖాన్ మునీన్ పురస్తాత్. 9

**హరి! హరిభక్తి యొక్క వరమంది, భగీరథకన్యకాతటాం**
**తర రుచిరాశ్రమమ్మున సదావసియించుచు సత్రయాగముల్**
**జరుపి మునీంద్రకోటులకుఁ జక్కని భక్తి యుపన్యసించుచున్**
**సరసనె చూచినావు ఋషి సాధువులన్ సనకాదులన్ ప్రభూ!**

ఆ విష్ణువు వలన నిరంతర విష్ణుభక్తిని వరముగా బడసి గంగాయమునా సంగమమందు వసించి సత్రయాగమున కేతెంచిన దేవర్షి బ్రహ్మర్షి రాజర్షులకు ప్రవృత్తి నివృత్తి లక్షణమైన ధర్మములు రెండును ఉపదేశించుచు చివరకు సనకాది దివ్యముని చతుష్టయమును దర్శించితివి.

**విజ్ఞానం సనకముఖోదితం దధానః**
**స్వాత్మానం స్వయ మగమో వనాన్త సేవీ,**
**తత్తాదృ క్పృథువపు రీశ! సత్వరం మే**
**రోగౌఘం ప్రశమయ వాతగేహవాసిన్.** **10**

**సనకాదుల్ దయచేసినట్టి ఘనవిజ్ఞానమ్ముచే నవ్వన**
**మ్మున స్వేచ్ఛామధురాత్ముఁడై మసలుచున్ బూర్ణాత్మ నీలోన ని**
**న్ననుసంధానము సేసికొంటివి; మదీయార్తిం దొలగింపు పా**
**వన! తత్పావన మందిరాధిప! కృపాపారీణ! శ్రీమత్పృథూ!**

సనకాదులుపదేశించిన విజ్ఞానమును (బ్రహ్మజ్ఞానమును జక్కగనవధరించి జగదనుగ్రహార్థము అంగీకరించిన అవతారము గల నీవు అవ్వనమున వసించి ఆత్మాను సంధానము సేయుచు నిన్ను నీవందితివి. 'బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి' అనురీతిని పరబ్రహ్మాత్మ భావమున నుంటివి. అట్టి గురువాయూరు మందిర నివాసి ఓ సుందరమూర్తీ! నా అధి వ్యాధులను హరింప జేయుము.

# 19వ దశకము

# దక్షజననము

**పృథోస్తు నప్తా పృథుధర్మకర్మఠః ప్రాచీనబర్హి ర్యువతౌ శతద్రుతౌ,**
**ప్రచేతసోనామ సుచేతస స్సుతాన్ అజీజన త్త్వత్కరుణాంకురానివ. 1**

**పృథునికిఁ బ్రపౌత్రుఁడై యొప్పెఁ బృథులధర్మ**
**పరుఁడు ప్రాచీనబర్హి యవ్వానిభార్య**
**యును శతద్రుతి, వారికిన్ జనన మైరి**
**త్వత్కృపాంకురములు ప్రచేతసు లనంగ.**

పృథుచక్రవర్తి మునిమనుమడు ప్రాచీనబర్హి. అతడు పృథుడట్లు ధర్మశూరుడు కర్మశూరుడు గూడ. వానికి శతద్రుతి యను భార్యయందు నీ కృపయొక్క మొలకలే యన ప్రచేతసులను పదుగురు కుమారులుదయించిరి.

వి.వి : పృథుచక్రవర్తి కొడుకు విజితాశ్వుడు వాని కుమారుడు హవిర్ధానుడు అతని తనయుడు ప్రాచీన బర్హి. ఈ భూమండలమునంతను ప్రాచీనాగ్రము లయిన బర్హిస్సుచే (కుశలచే) గప్పినవాడు అనగా నిరంతర యజ్ఞ దీక్షితుడు అగుటచే వచ్చిన పౌరుషనామమిది.

**పితు స్సిసృక్షా నిరతస్య శాసనాత్ భవత్తపస్యాభిరతా దశాపి తే,**
**పయోనిధిం పశ్చిమ మేత్య తత్తటే సరోవరం సందదృశు ర్మనోహరమ్. 2**

**సృష్టి వాంఛించి తండ్రి శాసించినంత**
**వారు పదిమంది నినుగూర్చి పరమతపము**
**సలుపఁ బశ్చిమవార్ధికిం జని తదీయ**
**పారమున నందమగు సరోవరము గనిరి.**

ప్రజల సృజింపుడని తండ్రి యానతీయ వారు పదిమంది నిన్ను గూర్చి తపము సేయ పశ్చిమసముద్రతీరమునకేగి యచట చక్కని సరోవరముంజూచిరి.

**తదా భవత్తీర్థ మిదం సమాగతో భవో భవత్సేవకదర్శనాదృతః,**
**ప్రకాశ మాసాద్య పురః ప్రచేతసా ముపాదిశ ద్భక్తతమ స్తవ స్తవమ్. 3**

నీతీర్థ మ్మట కేగుదెంచెను భవానీభర్త నీభక్తసం
ఘాతమ్ముం దరిసించు వేడ్క; నటు సాక్షాత్కారమై ముందుఁ బ్రా
చేత స్సంతతి కింపుమీర నుపదేశించెన్ భవత్కీర్తనో
ద్గీతానందసుధాధుని ప్రణయిసంగీత మ్మమోఘమ్ముగన్.

అది నీ తీర్థము (విష్ణు తీర్థమన్నమాట) అటకు నిను సేవింప భవానీ ప్రియుడు నీ పరమభక్తుడు నీ భక్త సందర్శనమునకై వచ్చినవాడు ఆప్రచేతసులముందు సాక్షాత్కరించి నిన్నుగూర్చిన స్తుతి యొకటి యుపదేశించెను.

**స్తవం జపంతః త మమీ జలాంతరే భవ స్త మాసేవిష తాయుతం సమాః,**
**భవత్సుఖాస్వాదరసా దమీష్వియాన్ బభూవ కాలో ధ్రువవ న్నశీఘ్రతా. 4**

ఆస్తవ మాస్థమై జలములందు జపించుచు నీ సమర్చనా
విస్తరులైనయంతఁ బదివేలగు వర్షము లేఁగె వారికిన్:
శస్త భవ త్సుఖామృతరస మ్మది గ్రోలుచునుండగాఁ దప
స్స్వస్తికమౌచుఁ గాలము ధ్రువక్రియ సాగెను మెల్ల మెల్లనన్.

వారు నీట నిలిచి యాస్తవముం జపించుచుండగా పదివేలేండ్లు జరిగెను. భవత్స్వరూపానంద రసాస్వాదాదరముం గొన్న వారికి కాలము ధ్రువమయి (స్థిరమై) క్షయింపనిదయ్యెను.

**తపోభి రేషా మతిమాత్రవర్ధిభిః స యజ్ఞహింసానిరతో ऽపి పావితః,**
**పితాపి తేషాం గృహయాత నారద ప్రదర్శితాత్మా భవదాత్మతాం యయౌ. 5**

వారి తపోవిశేషమున వారలతండ్రి యనేక యజ్ఞ హిం
సారతి నందినట్టి కలుషమ్ములు వాసి పవిత్రు డయ్యెఁ; న
న్నారదుఁ డేఁగుదెంచి సదనమ్మునకుం దను డానచూచు బ
ల్నేరుపు చూపఁ దండ్రియు విలీనత నొందె భవత్స్వరూపమై.

వారి ప్రవృద్ధ తపోమహిమచే వారల ముత్తాత యజ్ఞ ధ్వంసముచేసిన పాపివేనుడు గూడ పవిత్రుడై నరకముం దరించెను. వారి తండ్రి ప్రాచీన బర్హి యింటి కేతెంచిన నారదుని వలన ఆత్మసాక్షాత్కారమును (శ్రీహరి దర్శనమును) బొంది నీ సాయుజ్య సిద్ధి నందెను.

వి.వి : ఆత్మ శ్రీహరియే. శ్రీహరిదర్శనము ఆత్మదర్శనమే యనుటకు ప్రమాణము. 'ఆప్తత్వాచ్చ ప్రమాతృత్వా దాత్మాహి పరమో హరిః'.

**కృపాబలేనైవ పురః ప్రచేతసాం ప్రకాశ మాగాః పతగేంద్రవాహనః,**
**విరాజి చక్రాదివరాయుధాంశుభిః భుజాభి రష్టాభి రుదంచితద్యుతిః. 6**

పరమకృపఁ బ్రచేతసుల పజ్జను వ్రాలితి వప్పుడే ఖగే
శ్వర వరవాహనమ్ముపయి చయ్యన; నెన్మిది చేతులఁ విని
ర్భర పరమాయుధద్యుతి పరంపర దిక్కులఁ బిక్కటిల్ల సుం
దరములకెల్ల సుందర మనం దగు రూపవిలాస మేర్పడఁ.

పరమకృపతో నీవు ప్రచేతసుల చెంతకు గరుడవాహనారూఢుడవై వచ్చితివి ఎన్మిది చేతులందు చక్రాద్యాయుధములు దాల్చి వాని కాంతులచే దశదిశలు మిఱుమిట్లు గొన నీ మూర్తి అద్భుతమై ప్రకాశించెను.

**ప్రచేతసాం తావ దయాచతా మపి త్వమేవ కారుణ్యభరా ద్వరా నదాః,**
**భవద్విచింతాపి శివాయ దేహినాం భవత్యసౌ రుద్రనుతిశ్చ కామదా. 7**

**వార లడుగని వరముల వారి కిచ్చి**
**నావు నీవ కృపారసా ప్లావితాత్మ!**
**నీదు ధ్యానమ్ము మంగళాపాదకమ్ము**
**రుద్రనుతి యిది; యెల్ల కోర్కులు ఫలించు.**

వరము లడుగకున్నను నీయంతనీవే కృపతో వారికి వరము లిచ్చితివి. ప్రచేతసులను మిమ్ము స్మరించినవారికి మంగళములగును. ఈయెడ వచ్చి రుద్రుడు చేసిన నా స్తుతి రుద్రగీతయు నిష్టసిద్ధినీయగలదు. ఇవే యా వరములు.

**అవాప్య కాన్తాం తనయాం మహీరుహాం**
**తయా రమధ్వం దశలక్షవత్సరీమ్**
**సుతోஉస్తు దక్షో నను తత్క్షణా చ్చ మాం**
**ప్రయాస్యథేతి న్యగదో ముదైవ తాన్. 8**

**తరువులకున్ జనించునొక తన్వి వరింపుఁడు; దానితోడ నె**
**ల్లరు విహరింపుఁడొక్క పదిలక్షలయేం; డ్లటమీఁద దక్షుఁడన్**

**వరతనయుండు మీ కొదవు; వాఁడు జనించిన యాక్షణంబునం**
**బరముని బొందనేర్తురని పల్కితి వప్పుడు వారితో హరీ!**

తరువులకు జనించు నొక కన్నియంబొంది పదిలక్షలయేండ్లామెతో విహరింపుడు ఆమెయందు దక్షుడు అను కుమారుడు గల్గును. అవ్వల మీరు నన్ను చేరుడు అనగా ముక్తులు గండు అని యేగితివి.

వి.వి : ప్రమ్లోచ అను నప్సరస కూతురుంగని విడిచిపోగా వృక్షములు పెంచినవి. ఆమెను మీరందఱు వివాహము చేసికొనుడని వర మిచ్చెనన్నమాట. ఇదంతయు వారడుగని వరమే.

**తతశ్చ తే భూతలరోధిన స్తరూన్ క్రుధా దహన్తో ద్రుహిణేన వారితాః,**
**ద్రుమైశ్చ దత్తాం తనయా మవాప్య తాం త్వదుక్తకాలం సుఖి నోఽభిరేమిరే. 9**

**వారలు తీవ్రకోపనులు వారిధిమేఖలిత క్షమాభర**
**మ్మారక యడ్డగించెడి తరూత్కరముం దహియించుచున్, విధి**
**ప్రేరణ శాంతిపూని పృథివీజము లిచ్చిన కన్యతోడ స్వే**
**చ్ఛారుచిఁ గ్రీడ లాడి రనిశంబును నీవనినంత కాలమున్.**

నీ వేగినంత నీరు వెల్వడి వారు కోపముగొని భూతలమెల్ల ఆవరించి దారి లేకుండ జేయుచున్నవని చెట్లను దహించుచుండగా, బ్రహ్మ వారిని వారించెను. అవ్వల వానికి జడిసి బ్రహ్మ యాజ్ఞచేతనే వృక్షములు తమ పెంపుడు కూతురును వారికిచ్చినవి. ఆమెం గూడి వారు నీ చెప్పినంత కాలము విహరించిరి.

**అవాప్య దక్షంచ సుతం కృతాధ్వరాః ప్రచేతసో నారదలబ్ధయా ధియా,**
**అవాపు రానందపదం తథావిధః త్వమీశ! వాతాలయనాథ పాహి మామ్. 10**

**కాంచిరి దక్షునిన్ దనయుఁగా; మఱి యజ్ఞము లెన్నియెన్నొ కా**
**వించిరి; యవ్విరించి సుతు నించిన నిందు ననుగ్రహాన మో**
**గించిన బుద్ధిగాంచి తులకించి రకించన సార్వభౌమ మో**
**దాంచిత దివ్యధామమున; నట్లె ననుం దిలకింపు మా ప్రభూ!**

వారామెయందు దక్షునిం గని అధ్వరములు చేసి నారదానుగ్రహలబ్ధమైన జ్ఞానముచే బ్రహ్మానందపదమందిరి. అట్టివాడవు ప్రభూ! గురువాయుపురసదన! నన్ను రక్షింపుము.

# 20వ దశకము

# ఋషభయోగీశ్వర చరిత్ర

**ప్రియవ్రతస్య ప్రియపుత్రభూతాత్ అగ్నీధ్రరాజా దుదితోహి నాభిః,**
**త్వాం దృష్ట్వా నిష్టద మిష్టమధ్యే తవైవ తుష్ట్యై కృతయజ్ఞకర్మా. 1**

**అలరెన్ రాజు ప్రియవ్రత ప్రియసుతుం డాగ్నీధ్రు, డవ్వానికిన్**
**గలిగెన్ నాభి, యతండు నీ ప్రియముగా గావించె యజ్ఞమ్ము,నం**
**దెలమిన్ దర్శన మిచ్చినాఁడవట యిష్టిన్ జాలసంతుష్టుఁడై**
**యిలపై వాని యభీష్టమిచ్చుటకునై యింపౌ విలాసమ్మునన్.**

స్వాయంభువ మనువు జ్యేష్ఠ కుమారుడు ప్రియవ్రతుడు. అతనికి బర్హిష్మతి యను భార్యయందు పదిమంది కుమారులు కలిగిరి. వారిలో జ్యేష్ఠుడు అగ్నీధ్రుడు. అతనికి పూర్వచిత్తి యను అప్సరస యందు నాభి యను కుమారుడు యజ్ఞ మధ్యమందు కలిగెను. అతడు యజ్ఞమందు ఒక యిష్టిలో నీ దర్శన భాగ్యము పడసెను.

**అభిష్టుత స్తత్ర మునీశ్వరై స్త్వం రాజ్ఞా స్వతుల్యం సుత మర్థ్యమానః,**
**స్వయం జనిష్యేఽ హమితి బ్రువాణః తిరోదధా బర్హిషి విశ్వమూర్తే. 2**

**నీ వట విశ్వమూర్తివి మునిస్తుతి నిస్తులమోద మంది నిన్**
**నీ వలె నుండు పుత్రు నొకనిన్ దయ నిమ్మని రాజు కోర,సం**
**భావన సేసి నేనె శిశుభావము నొంది జనింతు నంచు దే**
**వా! వర మిచ్చి యావల ముఖాగ్నిఁ దిరోహితుఁడైతి వయ్యెడన్.**

మునులు నిన్ను స్తుతించిరి. రాజు నీతో సమానుడైన కుమారుడు కావలెనని కోరెను. నేనే నీ తనయుడనై అవతరింతునని తెలిపి, ఓ విశ్వరూపా! నీ వా యజ్ఞాగ్ని యందు అంతర్ధాన మైతివి.

**నాభిప్రియాయాం అథ మేరుదేవ్యాం త్వ మంశతోఽభూః ఋషభాభిధానః,**
**అలోకసామాన్య గుణ ప్రభావ ప్రభావితాశేషజనప్రమోదః. 3**

ఎచ్చట లేని భావమున నెచ్చట లేని ప్రభావ సంపదన్
ముచ్చట గూర్చి యెల్లరఁ బ్రమోదరసాంబుధి నోలలార్ప నీ
యచ్చపు నంశ మూని ఋషభాఖ్య వహించి జనించినావు నీ
యిచ్చిన మాట చెల్లుబడికే యట నాభికి మేరుదేవికిన్.

మేరువు కుమార్తెయగు నాభియొక్క భార్యయందు ఋషభుడను పేర అసామాన్య గుణప్రభావ విశేషములచే సర్వజనాహ్లాదకుడవై అవతరించితివి. వారికి నీ విచ్చిన వరమును జెల్లించికొంటివి.

త్వయి త్రిలోకీభృతి రాజ్యభారం నిధాయ నాభిః సహ మేరుదేవ్యా,
తపోవనం ప్రాప్య భవన్ని షేవీ గతః కిలానందపదం పదం తే. 4

నాభి త్రిలోకభార వహనక్షముఁడైన ప్రభుండవైన నీ
కే భువి రాజ్యభార మది యెల్లను బట్టము గట్టి యేగె నిన్
వే భజియింప మేరుసతి వెంటఁ జనంగఁ దపోవనానకున్
శోభన మా పయిన్ బడసెనున్ భవదీయ వికుంఠ ధామమున్.

నాభి త్రిలోక ప్రభువగు నీ యందు రాజ్యభారముంచి, మేరుదేవితో తపోవనమున కేగి నిను సేవించి, పరమానందస్థానమైన నీ వైకుంఠధామమును అలంకరించెను.

ఇంద్ర స్త్వదుత్కర్షకృతా దమర్షాత్ వవర్ష నాస్మి న్నజనాభవర్షే,
యదా తదా త్వం నిజయోగశక్త్యా స్వవర్షమేనద్ వ్యదధా స్సువర్షమ్. 5

ఆ యుదితాద్భుతాద్భుత మహాతిశయంబు భవద్యశ మ్మ సూ
యాయతి గూర్ప నొక్కచినుకైన నిలం బడకుండ జేయగా
నో యనఘా! త్వదీయ నిజ యోగవిభూతి నపూర్వరీతి నీ
వే యమృత ప్రవర్ష మొనరించితి నీ యజనాభవర్షమున్.

ఇంద్రుడు నీ అతిశయమునకు అసూయపడి అతని రాజ్యమగు అజనాభ వర్షమందు వర్షము లేకుండ జేసెను. అప్పుడు హరి యవతారమైన నీవు యోగశక్తిచే సువృష్టి కురియించితివి.

**జితేంద్రదత్తాం కమనీం జయన్తీం అథోద్వహ న్నాత్మరతాశయో౽పి,**
**అజీజన స్త్రత శతం తనూజాన్ యేషాం క్షితీశో భరతాగ్రజన్మా. 6**

**ఆవిధి నోడి యింద్రు ఁడు జయంతిని జక్కనియింతి నీయగా**
**నీవును బెండ్లియాడితివి, నిచ్చలు బ్రహ్మరసాత్మభావ సం**
**భావితు ఁడయ్యు ఁగంటి వటుపైన కుమారుల నూర్వురన్, ధరి**
**త్రీవిభు ఁడందులోన వినుతిం గనియెన్ భరతుండు పెద్దయై.**

అట్లింద్రుడు నీ కోడిపోయి జయంతి యను కన్యను కమనీయ మూర్తిని ఒసంగగా ఆత్మోపాసన పరుడ వయ్యు నామెను బెండ్లాడి నూర్వురుకుమారులను గంటివి. వారిలో భరతుడు పెద్దవాడు.

**నవాభవన్ యోగివరా నవాన్యే త్వపాలయన్ భారతవర్షఖండాన్,**
**సైకాత్వశీతి స్తవ శేషపుత్రాః తపోబలా ద్భూసురభూయమీయుః. 7**

**అందరిలోన యోగివరులై రొక తొమ్మిదిమంది; యందరే**
**యిందు ఁ బ్రజానురాగమున నేలిరి భారతవర్ష ఖండముల్**
**పొందిరి బ్రాహ్మణత్వము నపూర్వతపో బలయోగమొంది యీ**
**బృందమునందు శిష్టులు వరిష్ఠులు శిష్టజనైక రక్షకా!**

ఆ నూర్వురలో తొమ్మండుగురు యోగులైరి. మఱి తొమ్మండ్రు భారత వర్షము నందలి కుశావర్త ఇలావర్త బ్రహ్మావర్త మలయకేతు భద్రసేన విదర్భ కీకటాది ఖండములను పాలించిరి. మిగిలినవారు తపోబలముచే బ్రాహ్మణ్యము నందిరి.

**ఉక్త్వా సుతేభ్యో౽థ మునీంద్రమధ్యే విరక్తిభక్త్యన్విత ముక్తిమార్గమ్,**
**స్వయంగతః పారమహంస్యవృత్తిం అధా జడోన్మ త్తపిశాచచర్యామ్. 8**

**ఆలీలన్ ఋషభాకృతిన్ నిజకుమారానీకముం బిల్చి నీ**
**వాలాపించి విరక్తి భక్తియుత పూర్ణా ద్వైత విజ్ఞాన ల**
**క్ష్మీలాభ మ్మవధూతవై తిరిగితి స్వేచ్ఛా విహారమ్ములన్**
**బాలోన్మత్త పిశాచ చర్య నవనిన్ వ్యాసక్తహంసాకృతిన్.**

ఋషభదేవుడుగా నీవు మునిమండలిలో భరతాది కుమారులకు విరక్తి భక్తినిష్ఠావిశిష్టమైన ముక్తి మార్గమును ఉపదేశించి పరమహంస వృత్తిని స్వీకరించి జడోన్మత్త పిశాచ వర్తనుడవై ఉంటివి.

వి.వి : పరమహంస స్వరూపము ధరించుటయే లోకమునకు నివృత్తి మార్గోపదేశము చేయుట, సన్న్యాసాశ్రమము అందుకొఱకే శాస్త్రమునందు విధింపబడినది.

**పరాత్మభూతోఽపి పరోపదేశం కుర్వన్ భవాన్ సర్వనిరస్యమానః,**
**వికారహీనో విచచార కృత్స్నాం మహీ మహీనాత్మరసాభిలీనః. 9**

**పారమహంస్య ధర్మపరిపాలనమొంది పరాత్మభూతుఁడై**
**వారికి వారికిం దగినవారికిఁ దత్త్వముదెల్పి యెవ్వరున్**
**జేరఁగ నీక తన్ను నిరసింపఁగ లో విరసంబులేక య**
**వ్వారిగ సంచరించె ఋషభప్రభుఁ డాత్మరసైకలీనుఁడై.**

ఋషభ రూపమున బ్రహ్మాత్మస్వరూపుడవైన నీవు బ్రహ్మోపదేశము చేయుటకు, ఆ చేయుటకూడ బోధరూపమున ఉపన్యసించుట కాక, స్వప్రవర్తన వలన అవధూతరూపమున వర్తించుచు బాలోన్మత్త పిశాచమట్లు వర్తించుచు. అందఱిచేత నిరసింపబడుచు, తన్మూలమున సుఖదుఃఖాది రహితుడవై నిస్సంగివై స్వరూపానందరసానుభూతియందు లీనుడవై జీవన్ముక్తస్థితిలో విహరించితివి.

**శయువ్రతం గోమృగకాకచర్యాం చిరం చర న్నాప్య పరం స్వరూపమ్,**
**దవాహృతాంగః కుటకాచలే త్వం తాపాన్ మమాపాకురు వాతనాథ. 10**

**అజగరవ్రతమ్ముఁ గని యావులలెన్ మృగమట్లు కాకి య**
**ట్లోజఁ జరించి మించి తెఱుగొందని నిష్ఠ స్వరూపలాభ వి**
**భ్రాజితుఁడై దవాగ్నిఁబడి ప్రాకృత దేహము నుజ్జగించినా**
**వీజగమందు నీవు ఋషభేశ్వర! మున్ గుటకాచలమ్మునన్.**

కొండ చిలువకు అజగరమనిపేరు. అది కదలక మెదలక పడియున్నట్లు ఇంద్రియ వ్యాపారములను ప్రత్యాహారము చేసి కేవల బ్రహ్మానందరసానుభూతి

యందు ఉండెడి స్థితికి అజగరవ్రతమని పేరు. అట్టి వ్రతము స్వీకరించి గోమృగ కాకము లట్లు అనగా శుద్ధ్య శుద్ధి విధి నిషేధాదులు లేక ఉపాధి మాత్ర ధర్మముచే సంచరించి స్వరూపసిద్ధినంది, కుటకాచలము నందు దావాగ్నికి శరీరమును అర్పించి బ్రహ్మీభావము నందితివి. ఓగురువాయూరు నారాయణా! నా తాపములను హరింపుము.

# 21వ దశకము

# జంబూద్వీపాదులందు భగవత్స్వరూపము

మధ్యోద్భవే భువ ఇలావృతనామ్ని వర్షే
గౌరీప్రధాన వనితాజనమాత్రభాజి,
శర్వేణ మంత్రనుతిభి స్సముపాస్యమానం
సంకర్షణాత్మక మధీశ్వర సంశ్రయే త్వామ్. 1

క్ష్మామధ్యోద్భవమౌ నిలావృతమునన్ గాత్యాయనీ ముఖ్య భా
మామాన్యమ్మయినట్టి వర్షమున నీ మంత్రస్తుతుల్ గొల్చి నీ
కా మృత్యుంజయుఁ డిందు శేఖరుఁడు నిత్యారాధనల్ సేయు నీ
శా! మా దైవమ! నిన్ను గొల్తు నట నీ సంకర్షణాకారమున్.

భూమధ్యమైన జంబూద్వీపముయొక్క నడిమి వర్షమైన ఇలావృతమను గౌరీ ప్రముఖ స్త్రీ జనము మాత్రము వసించు పుణ్యఖండమందు పరమశివునిచే మంత్రస్తుతులను అవధరించుచు సంకర్షణ స్వరూపుడవై యుండు నిన్ను ఆశ్రయించెదను.

భద్రాశ్వనామక ఇలావృతపూర్వవర్షే
భద్ర శ్రవోభిః ఋషిభిః పరిణూయమానమ్,
కల్పాంత గూఢ నిగమోద్ధరణ ప్రవీణం
ధ్యాయామి దేవ హయశీర్షతనుం భవన్తమ్. 2

అది భద్రాశ్వ మిలావృతమ్మునకుఁ దూర్పొ; నందు భద్రశ్రవుల్
ముదమొప్పన్ ఋషు లద్భుతస్తుతుల సంబోధింపఁగల్పాంతమున్
గదియం గానగరాని వేదము లొగిన్ గాపాడు నీకే నెఱం
గెద నాలోన నెఱింగి నీదగు హయగ్రీవాకృతిం గొల్చెదన్.

ఆ ఇలావృత వర్షమునకు తూర్పున భద్రాశ్వవర్ష మున్నది. అది పుణ్యశ్రవులు అనగా అధ్యాత్మ విద్యా శ్రవణము చేసినవారు అగు ఋషులతో నిండియుండును. కల్పాంతమందు నిగూఢములై యున్న వేదములను ఉద్ధరించు నేర్పు గలిగి హయగ్రీవ రూపమున అందు వసించు నిన్ను ధ్యానించెదను.

ధ్యాయామి దక్షిణగతే హరివర్ష వర్షే
ప్రహ్లాదముఖ్యపురుషైః పరిషేవ్యమాణమ్,
ఉత్తుఙ్గ శాంతధవలాకృతి మేకశుద్ధ
జ్ఞానప్రదం నరహరిం భగవన్! భవంతమ్. 3

ధ్యానింతున్ మఱి దక్షిణాన హరివర్షాఖ్యమ్మునన్ శుద్ధ వి
జ్ఞానైకప్రదమై కడుం ధవళమై శాంతమ్మునై దివ్య లీ
లానవ్యమ్మయి శ్రీనృసింహమయి ప్రహ్లాదాది భక్తాప్తసే
వానిత్యోత్సవ వత్సలమ్మయిన తత్త్వ మ్మద్భుతోత్సాహినై.

దక్షిణదిశయందలి హరివర్షమందు ప్రహ్లాదాది మహాపురుషులచే సేవింపబడుచు మహోన్నతమైన తెల్లని ప్రశాంత విగ్రహమున పరిశుద్ధ జ్ఞానానుగ్రహము సేయుచునుండు నరసింహమూర్తిని నిన్ను ధ్యానించెదను.

వర్షే ప్రతీచి లలితాత్మని కేతుమాలే
లీలావిశేష లలితస్మిత శోభనాఙ్గమ్,
లక్ష్మ్యా ప్రజాపతిసుతైశ్చ నిషేవ్యమాణం
తస్యాః ప్రియాయ ధృతకామతనుం భజే త్వామ్. 4

సేవింతున్ నిను నిత్యమున్ బడమటన్ శ్రీ కేతుమాలాఖ్య వ
ర్షావాసుండయి నారదాదిమునిబృందానేక సేవారసా

ప్లావమ్ముందుచు లచ్చి మెచ్చుకొన లీలామన్మథాకార స
ద్భావమ్ముం గొని లేతనవ్వు దొలుకన్ వర్తించు నా దైవమున్.

పడమట కేతుమాలమను చక్కని వర్షమందు లీలావిలాస లలిత మందహాస మధురాకృతివై లక్ష్మితో బ్రహ్మమానసపుత్రులగు సనక సనందనాదులచే సేవింపబడుచు ఆమె ప్రీతికొఱకు మన్మథ స్వరూపుడవై వర్తించు నిన్ను సేవించెదను.

రమ్యే హ్యుదీచి ఖలు రమ్యకనామ్ని వర్షే
తద్వర్షనాథ మనువర్య సపర్యమాణమ్,
భక్తైకవత్సల మమత్సరహృత్సు భాంతం
మత్స్యాకృతిం భువననాథ! భజే భవంతమ్. 5

రమ్యకనామవర్ష మతిరమ్య; మటన్ మనువర్య సేవ పా
రమ్యమునొంది భక్తజన రక్షకుఁడౌచు నమత్సరాత్మ హృ
ద్గమ్యుఁడవై వెలుంగు పరతత్త్వము కేవలమత్స్యమూర్తిఁ బ్రా
థమ్యముగన్న ని న్గొలుతుఁ దండ్రి! యుదీచి దిశాధినాయకున్.

ఉత్తరదిశ రమ్యమైన రమ్యకవర్షమందు ఆ వర్షాధిపతియైన వైవస్వత మనువుచే నర్చింపబడుచు భక్తవత్సలుడవై మత్సరములేని మహానుభావుల హృదయమందు మత్స్యరూపమున వసించు నిన్ను భజించెదను.

వర్షం హిరణ్మయసమాహ్వయ మౌత్తరాహ
మాసీన మద్రిధృతకర్మఠ కామఠాఙ్గమ్,
సంసేవతే పితృగణప్రవరో ఽర్యమా యం
తం త్వాం భజామి భగవన్! పరచిన్మయాత్మన్. 6

పరమమ్మైన హిరణ్మయోత్తర దిశావర్షమ్మునం దద్రి సం
భరణాత్యద్భుత కర్మఠమ్ము కమఠాంగ వ్యక్తరూపమ్ముతో
వర పిత్రగ్రణియైన యర్యమునిచే ప్రార్థ్యుండవైయున్న యో
పరచిద్రూప! నినుం దలంచి కొలుతున్ వాతాలయాధీశ్వరా!

ఉత్తరదిశ యందే హిరణ్మయ వర్షమందు మందరాద్రిని యెత్తిన కూర్మ రూపమున పితృగణనాయకుడైన అర్యమునిచే సేవింపబడుచుండు విశుద్ధ జ్ఞాన స్వరూపుని నిన్ను సేవించెదను.

కించోత్తరేషు కురుషు ప్రియయా ధరణ్యా
సంసేవితో మహితమంత్ర నుతిప్రభేదైః,
దంష్ట్రాగ్రఘృష్ట ఘనపృష్ఠ గరిష్ఠవర్ష్మా
త్వం పాహి విజ్ఞనుత యజ్ఞవరాహమూర్తే. 7

ధరణిని గూడి మంత్రమహిత స్తవ సంతతి సంతసించు చు
త్తరకురుభూముల న్మసలు దైవము యజ్ఞవరాహరూపమున్
కెరలెడి దంష్ట్రికాగ్ర వినిఘృష్ట సుపృష్ఠ గరిష్ఠ విగ్రహున్
పరము నుతింతు నిన్, గరుణఁ బాలనసేయగదే దయానిధీ!

ఉత్తర కురుభూములందు భూదేవితోగూడి మహామంత్రస్తుతి విశేషములచే జ్ఞానులు సేవింప వెనుకోఅచే నిజపృష్ఠమును గీరుకొనుచు యజవరాహ మూర్తివై యుండెడు నీవు మమ్ము పాలింపుము.

యామ్యాం దిశం భజతి కింపురుషాఖ్యవర్షే
సంసేవితో హనుమతా దృఢభక్తి భాజా,
సీతాభిరామ పరమాద్భుత రూపశాలీ
రామాత్మకః పరిలసన్ పరిపాహి విష్ణో! 8

అచ్చపుబత్తి నిన్ను హనుమన్న భజింపగ జానకమ్మతో
ముచ్చట గొల్పుచు న్పరమశోభన మోహన రామమూర్తివై
వచ్చి వసింతు కింపురుషవర్షమునం దటు దక్షిణమ్మునన్
గ్రచ్చర మమ్ము నేలుకొనరా! గురువాయుపురాధినాయకా!

దక్షిణదిక్కునందు అవ్వలిదగు ఇలావృతమునందు పరమభక్తుడైన హనుమంతునిచే సేవింపబడుచు సీతాదేవితో నభిరామమూర్తివై రామస్వరూపమున నున్న విష్ణుడవు మమ్ము రక్షింపుము.

శ్రీనారదేనసహ భారతఖండముఖ్యై
స్త్వం సాఙ్ఖ్యయోగనుతిభి స్సముపాస్యమానః,
ఆకల్పకాల మిహ సాధుజనాభిరక్షీ
నారాయణో నరసఖః పరిపాహి భూమన్. 9

పాయక నారదుం గలిసి భారతఖండ మునీంద్రకోటి వా
లాయము సాంఖ్యయోగ పరిలక్షిత సన్నుతి నీ యుపాసనల్
సేయగ సాధురక్షణము సేయుదు*వాలయ మందునిల్చి నా
రాయణదేవ శ్రీనరసఖా! పరిపాలనసేయరా ననున్.

శ్రీ నారదస్వామితో భారతఖండమందలి బ్రహ్మణ్యులచే సాంఖ్యయోగ స్తుతులద్వారా ఉపాసింపబడుచు సాధుజనరక్షణము సేయుచు నిచట కల్పాంతమువఱకు వేంచేసియుండు నరసఖుడవైన నారాయణుడవు మమ్ము కాపాడుము.

ప్లక్షేఽర్కరూప మయి శాల్మల ఇందురూపం
ద్వీపే భజన్తి కుశనామని వహ్నిరూపమ్,
క్రౌఞ్చేఽంబురూప మథ వాయుమయంచ శాకే
త్వాం బ్రహ్మరూప మయి పుష్కరనామ్ని లోకాః. 10

రవిగాఁ బ్లక్షమునందు, శాల్మలమునన్ రాజిల్లు జాబిల్లిగా,
హవిరాహారునిగాఁ గుశమ్మునను, గ్రౌంచాఖ్యమ్మునన్ నీరుగా,
పవనుంగా నట శాకమందు, నిను నాబ్రహ్మాత్ముగా నెంత్రు వై
భవ మొప్పన్ మఱి పుష్కరమ్మనెడు ద్వీపమ్మందు సర్వప్రజల్.

ప్లక్షద్వీపమందు సూర్యునిగ, శాల్మలమందు చంద్రునిగ, కుశద్వీపమందగ్నిగ, క్రౌంచమందు జలముగ, శాకద్వీపమందు వాయువుగ, పుష్కరద్వీపమందు బ్రహ్మస్వరూపునిగ, నాయా ద్వీపములం దున్న ప్రజలు నిన్ను సేవింతురు.

---

*ఆలయ-ప్రళయము వరకు

సర్వై ర్ధ్రువాదిభి రుడుప్రకరై ర్గ్రహైశ్చ
పుచ్ఛాదికే ష్వవయవే ష్వభికల్ప్యమానైః,
త్వం శింశుమార వపుషా మహతా ముపాస్యః
సంధ్యాసు రుంధి నరకం మమ సింధుశాయిన్! 11

తోకన్ మున్కొని నీ శరీరమున నస్తోకాఖిల స్థానమం
దాకల్పింత్రు ధ్రువాదులన్ గ్రహము లాయాచుక్కలన్, శింశుమా
రాకారాన నుపాస్యమయ్యెదవు సంధ్యావేళలం దెల్ల లో
కైక క్షేమపరుల్ మహామహుల కీశా! నన్నుఁ బాలింపుమా!

అశ్విన్యాది నక్షత్రములచే, సూర్యాది గ్రహములచే, ధ్రువాది జ్యోతిర్మండలముచే, తోక మొదలుగా గల అవయవములందు నిరూపింపబడిన శింశుమార స్వరూపుడవై యుండి మహానుభావులకు సంధ్యాసమయమున ఉపాస్యమానుడవైయున్న నీవు మాకు నరకము లేకుండ చేయుము.

పాతాళమూలభువి శేషతనుం భవంతం
లోలైకకుండలవిరాజ సహస్రశీర్షమ్,
నీలామ్బరం ధృతహలం భుజగాంగనాభి
ర్జుష్టం భజే హర గదాన్ గురుగేహనాథ! 12

భావింతున్ గురుగేహనాథుని నినున్ బాతాళమూలమ్ము నం
దావాసించు విలోలకుండల సహస్రాలోల శీర్షున్ వినీ
లావేల్లద్వసనున్ హలాయుధుని నానానేక నాగాంగనా
సేవావల్లభు దుర్లభున్ గుణవిభున్ శేషాహిరాడ్వల్లభున్.

పాతాళమూలమందు అల్లన నూగు మణిమండల మణిగణ విరాజమాన సహస్రశిరస్కుడవై నీలాంబరము ధరించి నాగలి చేబూని నాగాంగనలతో కూడియున్న శేషఫణి స్వరూపుడవైయున్న నిన్ను భజించెదను. ఓ గురుమందిర ప్రభూ! వ్యాధులను హరింపుము.

# 22వ దశకము

# అజామిలోపాఖ్యానము

అజామిలో నామ మహీసురః పురా
చరన్ విభో! ధర్మపథాన్ గృహాశ్రమీ,
గురో ర్గిరా కానన మేత్య దృష్టవాన్
సుధృష్టశీలాం కులటాం మదాకులామ్. 1

**ఉండె నజామిళుండనగ నొక్కద్విజుండు స్వధర్మ వృత్తిఁజా**
**యండు సమిత్కుశార్థి గురునానతి నేగి యరణ్యసీమ నొ**
**క్కండుగఁ జూచె పూర్వకృత కర్మముమాత్రముతోడుగాగఁ దా**
**నొండొకచో బజారి యగు నొక్కతుటారి మిటారికత్తియన్.**

అజామిళుఁడను నొక బ్రాహ్మణుడు గృహస్థాశ్రమ ధర్మములను ప్రవృత్తి నివృత్తి రూపములను అనుష్ఠించుచు, తండ్రియాజ్ఞచే పుష్ప సమిత్కుశాదులను దెచ్చుటకు వనమేగి మిక్కిలి ప్రౌఢయై మద్యసేవనముచే మదముగొనియున్న ఒక జారిణిని జూచెను.

వి.వి: అజాం=ఉత్తమకులమునందు పుట్టని స్త్రీని, మిలతి=కూడినవాడు, కావున అజామిళుడు.

స్వతఃప్రశాన్తో ఽపి తదాహృతాశయః
స్వధర్మ ముత్సృజ్య తయా సమారమన్,
అధర్మకారీ దశమీ భవన్ పున-
ర్ధధౌ భవన్నామయుతే సుతే రతిమ్. 2

**అతఁడు ప్రశాంతుఁడే సమయమట్టిది చిత్తము తత్తరించి మిం**
**డత పయి వ్రాలె దానికి నొడంబడియెన్ పరమ స్వధర్మ ని**
**ర్ధుతి నటు ప్రాయమున్ బదిపదు ల్గడువన్ భవదీయనామ సం**
**గతి గల బిడ్డపై నొలసె గాఢతమంబగు మోహ మవ్వలన్.**

స్వభావముచే ప్రశాంతుఁడయ్యు నయ్యింతివలలో బడి స్వధర్మమును సహధర్మచారిణిని విడిచి, దానితో క్రీడించుచు ముసలివాఁడై నీపేరింటి పదియవ కుమారునందు పెచ్చు మోహమును బొందెను.

స మృత్యుకాలే యమరాజకింకరాన్
భయంకరాం స్త్రీ నభిలక్షయన్ భియా,
పురా మనాక్ త్వత్స్మృతివాసనాబలా-
జ్జుహావ నారాయణనామకం సుతమ్. 3

**ఆ యమకింకరుల్ బహు భయంకరులై మరణమ్ము వేళయై**
**డాయఁగ, ముప్వుర న్గని తడంబడి బాలు నుదాహరించి నా**
**రాయణ యంచుఁబిల్చెను బురాస్మృతిఁ ద్వద్గత వాసనాబల**
**మ్మాయెడఁ దోడుగాఁగొడుకునందలి మోహ మమోఘమై హరీ!**

మరణసమయమందు పూర్వజన్మ సంస్కారముచే గలిగిన భగవ దుపాసనా వాసనచే నారాయణుడను పేర నున్న బాలుని పిలిచెను.

దురాశయస్యాఽపి తదాత్వనిర్గత
త్వదీయనామాక్షరమాత్ర వైభవాత్,
పురోఽభిపేతు ర్భవదీయపార్షదా
శ్చతుర్భుజాః పీతపటా మనోరమాః 4

**ఎంతటి పాపియైన నగునేమి తదాత్మకుఁడై వచించి నాఁ**
**డంతట నీదునామ మధురాక్షరపుంజము నంతమాత్రనే**
**చెంతను నిల్చి రెంతొ దయచేసి వికుంఠభటుల్ బలోద్భటుల్**
**వింత చతుర్భుజుల్ కనకపీతపటుల్ హరిభక్తలంపటుల్.**

సంసార సక్తి నొందినవాడయ్యు మృత్యుదశలో నోట వెడలిన నీ నామాక్షర మాత్ర వైభవముచేనైనను 'నారాయణ' యను నాలుగక్షరముల నుచ్చరించిన ప్రభావముచే యేలినవారి దూతలు వానిముందు సాక్షాత్కరించిరి.

అముం చ సంపాశ్య వికర్షతో భటాన్
విముంచతే త్యారురుధు ర్బలా దమీ,

నివారితా స్తే చ భవజ్జనై స్తదా
తదీయపాపం నిఖిలం న్యవేదయన్. 5

కడువడి వాని నీడ్చుచను కాలుని కింకరులన్ భవద్భటుల్
విడువిడుఁ డం చదల్చినఁ, జలించి వడిం బరికించి వాని యా
గడముల లెక్కలెల్లఁ గడకన్ వినిపించిరి, విష్ణుపార్షదుల్
దుడుకు లవెల్లనున్ దొలఁగద్రోచి వచించిరి వారి కివ్విధిన్.

యమదూతలు వాని కంఠమునకు పాశమువేసి లాగుచుండగా విష్ణుదూతలు 'వదలుడు వదలు'డని నిరోధించిరి. యమభటులు వారికి వాని పాపముల లెక్క నంతయు నివేదించిరి.

భవంతు పాపాని కథంతు నిష్కృతే
కృతేఽపి భో దండన మస్తి పండితాః,
న నిష్కృతిః కిం విదితా భవాదృశా
మితి ప్రభో! త్వత్పురుషా బభాషిరే. 6

ఉండిన నుండనిండు దురితోగ్రత; దానికి మారుసేఁత లే
కుండగఁ బోవునే? మఱియు నుండునె దండన, మీర లెల్లరున్
పండితులే కదా! సుకృతపాక మెఱుంగరొ! వీని పున్నెముల్
పండిన విప్పుడే యనిరి వారలతో భవదీయ కింకరుల్.

విష్ణుదూతలు వారింగని 'మీరు పండితులుగదా, నిజమే వీడు పాపములు చేసినాడు, కాని ప్రాయశ్చిత్తము చేసికొన్నప్పుడు దండన మెట్లుండును? హరినామ గ్రహణరూప ప్రాయశ్చిత్తమువలన పవిత్రుడైన వీనికి పాపము లేదని, కేవల ధర్మరాజు కింకరులైన మీకుగూడ తెలియదా అనిరి.

శ్రుతిస్మృతిభ్యాం విహితా వ్రతాదయః
పునన్తి పాపం న లునన్తి వాసనామ్,
అనన్త సేవా తు నికృన్తతి ద్వయీ
మితి ప్రభో త్వత్పురుషా బభాషిరే. 7

**పలుతీరుల్ శ్రుతులందు నా స్మృతులలో భాసించు నా యా వ్రతా**
**దులు పాపోపశమంబు సేయు మొదలున్ ద్రుంచంగ లే వాత్మలో**
**పలి మాలిన్యము జిడ్డు తోముటకుఁ ద్వత్పాదాంబుజశ్రీ సప**
**ర్యల మించంగల దింక లేదనిరి దేవా! త్వత్పదారాధకుల్.**

శ్రుతి స్మృతులలోని చాంద్రాయణాది వ్రతములు, క్షేత్ర తీర్థాది సేవనము పాపశోధనము చేయును. కాని వాసనను హరింపజేయలేవు. అనగా పాప సజాతీయమైన కర్మను మఱల చేయకుండ వారింపజాలవు. అనంత నామోచ్చారణము, హరిసేవయు మాత్రము పాపమును పాపవాసననుకూడ నిర్మూలింపగలవు.

అనేన భో జన్మసహస్రకోటిభిః
కృతేషు పాపేష్వపి నిష్కృతిః కృతా,
యదగ్రహీ న్నామ భయాకులో హరే
రితి ప్రభో త్వత్పురుషా బభాషిరే. 8

**ఎన్నియొ పుట్టువుల్ గడచి యెన్నియొ పాపము లాచరించినాఁ**
**డిన్నిఁటికిన్ బ్రతిక్రియగ నిప్పుడు ప్రాణములున్ హరీ! యనన్**
**మున్న హరీ! యటంచు దన ముద్దులబిడ్డని గూర్చియేని వీఁ**
**డన్నది చాలదా యని రయారె! భవచ్చరణాబ్జ సేవకుల్.**

వీడు అనేకకోటి జన్మల దుష్కృతములకు నారాయణ నామోచ్చారణ రూపమున ప్రాయశ్చిత్తముచేసికొన్నాడు భయభ్రాంతుడయ్యు హరి నామోచ్చారణము చేసినాడు. చాలు - అని మీ భటులు అనతిచ్చిరి.

నృణా మబుద్ధ్యాపి ముకుందకీర్తనం
దహ త్యఘౌఘాన్ మహిమాస్య తాదృశః,
యథాఽగ్ని రేధాంసి యథౌషధం గదా
నితి ప్రభో! త్వత్పురుషా బభాషిరే. 9

**మనసునఁ గాకపోయినను మాటకు వట్టి విలాసబుద్ధి నై**
**నను హరినామ మొక్కపరి నాలుక కొట్టకొన న్నటింప నిం**

**ధనముల నగ్నిగాల్చిన విధమ్మున రోగము నౌషధంబు చీ**
**ల్చినయటు పాపమెల్ల విదళించునటం చని రౌర! నీ భటుల్.**

గోవింద భగవన్నామ కీర్తనము తెలియక చేసినను అఖిల పాపములను దహించును. ఆ ప్రభావము అట్టిది. అగ్ని కట్టెలను, ఔషధము వ్యాధులను హరించునట్లు అది పాపములను హరింపగలదు.

ఇతీరితై ర్యామ్యభటై రపాసృతే
భవద్భటానాం చ గణే తిరోహితే,
భవత్స్మృతిం కంచనకాల మాచరన్
భవత్పదం ప్రాపి భవద్భటై రసౌ. **10**

**యమభటు లంతటం దొలఁగి, రంతట నేలినవారి భృత్య వ**
**ర్గము నపుడే తిరోహితము గాఁగ నజామిళుఁడుఁ భవత్ స్మృతిన్**
**గ్రమమునఁ గొంతకాలము ధరఁ సుఖియించి, భవద్భటుల్ విమా**
**నము గొనిరాఁ ద్వదీయ సదనమ్మది సేరె వికుంఠ లోకముఁ.**

ఇట్లు తెలియజెప్పగా యమభటులు తొలగిపోగా విష్ణుభటు లంతర్ధానమైరి. ఈ యజామిళుడు గంగాద్వారమందు ఒక దేవాలయమున వసించి కొంతకాలము నీ నామధ్యానము చేసిచేసి సమాధిజయము నొంది విష్ణుభటులు సాక్షాత్కరింపగా వారితో సారూప్య సిద్ధి నంది విమానమున మీ వైకుంఠధామమును చేరెను.

స్వకిఙ్కరావేదనశఙ్కితో యమ-
స్త్వదంఘ్రిభక్తేషు న గమ్యతామితి,
స్వకీయభృత్యా నశిశిక్ష దుచ్చకై
స్స దేవ వాతాలయనాథ! పాహి మామ్. **11**

**అటుపై స్వీయ భటాళి దెల్పినది తా నాలించి శంకించి మీ**
**రిటమీఁదఁ హరిభక్త కోటిదెసఁ బోనేవద్దు వద్దంచు ను**
**ద్భటమౌ నాజ్ఞ నొసంగె దండధరుఁ డప్పా! త్వత్ప్రభావంబు లిం**
**తటి వేమందు మరుత్పురాలయ! కృపాధారాధరా! ప్రోవరా!**

యమకింకరులు తమ ప్రభువునకు ఆ వార్త దెలుపగా ఆయన శంకితుడై- అనగా తన నౌకరులు చేసిన యపరాధము తనకుగూడ జుట్టుకొనునని భయపడి - విష్ణుచరణభక్తుల జోలికి మీరెన్నడును పోవలదని గట్టిగా నాజ్ఞయిచ్చెను. ఇట్టి భక్తవాత్సల్యముగల ప్రభువగు నీవు మమ్ము కాపాడుము.

## 23వ దశకము

# దక్ష చరిత్ర, చిత్రకేతూపాఖ్యానము, వృత్రాసుర వధ సప్త మరుదుత్పత్తి

ప్రాచేతసస్తు భగవ న్నపరో హి దక్ష
స్త్వత్సేవనం వ్యధిత సర్గవివృద్ధి కామః,
ఆవిర్బభూవిథ తదా లసదష్టబాహు
స్తస్మై వరం దదిథ తాం చ వధూ మసిక్నీమ్. 1

అవలఁ బ్రాచేతసుఁడు దక్షుఁడాత్మసృష్టి
వృద్ధికై నిన్ను గొల్వ, నావిర్భవించి
యెనిమిది భుజమ్ములన్; వరమిడి యసిక్ని
యను వధూమణి నిచ్చినా వతని కీశ!

ప్రాచీనబర్హి కుమారులు పదిమంది, వారిలో నొక కుమారుడు దక్షుడు ఈతడు బ్రహ్మయొక్క సాక్షాత్పుత్రుడైన దక్షునికంటె భిన్నుడు. అతడు మనసుచేతనే సృష్టిఁగావించి, అది యింకను పెంపొందవలెనని కోరి నిన్ను సేవించెను. నీవును ఎనిమిది బాహువులతో సాక్షాత్కరించి వరమిచ్చి పంచజనుని కుమార్తె యగు అసిక్నియను కన్యను పత్నిగా నొసంగితివి.

తస్యాత్మజా స్త్వయుత మీశ! పున స్సహస్రం
శ్రీనారదస్య వచసా తవమార్గ మాపుః,

నైకత్రవాస మృషయే స ముమోచ శాపం
భక్తోత్తమ స్త్వృషి రనుగ్రహమేవ మేనే. 2

వీని కుమారు లొక్క పదివేవురు వేవురు నారదోపదే
శాన విరక్తులై చనఁగ, శాపమొసంగెను దక్షుఁ 'డెందు కా
లానదు నీకుఁ బో' మ్మనుచు, నమ్ముని యంచితభక్తి నిబ్బరం
బైన మనమ్మునం గొనియె నాతనిశాప మనుగ్రహమ్ముగన్.

ఆ దక్షునికి పదివేలమంది హర్యశ్వులను పేరుగలవారును, మఱి వేయిమంది శబలాశ్వు లనువారును కలిగిరి. వా రందఱు తండ్రి యానతిచే సృష్టిని పెంచుటకు తపస్సు చేసియు, శ్రీ నారదస్వామి మాటచే - అనగా నివృత్తి మార్గోపదేశముచే సృష్టి మాని నీ పదమును మోక్షము నందిరి: దక్షుడు కోపించి నారదునికి 'ఒకచోట కాలు నిలువకుండ నిరంతర సంచారము చేయు' మని శాపమునిచ్చెను. భక్తశిరోమణి కావున శ్రీనారదస్వామి అది అనుగ్రహముగా భావించెను.

షష్ట్యా తతో దుహితృభిః సృజతః కులౌఘాన్
దౌహిత్రసూను రథ తస్య స విశ్వరూపః,
త్వత్ స్తోత్రవర్మిత మజాపయ దింద్ర మాజౌ
దేవ! త్వదీయమహిమా ఖలు సర్వజైత్రః. 3

అఱువదిమంది దక్షతనయల్ మఱి వారి కులమ్ము లీ భువిన్
బఱగెను గోటికోటి; మునిమన్మఁడు వానికి విశ్వరూపుఁడు
క్కఱిన మహేంద్రు విష్ణుకవచావృతి దైత్యుల గెల్వఁజేసె ని
త్తెఱగు భవత్ప్రతాపములు దెల్పవశమ్మె మరుత్పురాలయా!

ఆవల దక్షుడు దితి అదితి మొదలుగాగల అఱువదిమంది కూతులద్వారా స్థావర జంగమ సృష్టిని సేయుచుండగా, దక్షుని దౌహిత్రుడును దితియొక్క కుమారుడునైన త్వష్టఅనువానికి పుట్టినవాడు (త్వాష్ట్రుడు) విశ్వరూపుడు నీ స్తోత్రముచే అనగా నారాయణరూప కవచమును ఇంద్రునికి అంగరక్షగా నిచ్చి అతనికి దేవాసురయుద్ధమందు జయము చేకూర్చెను.

ప్రాక్శూరసేనవిషయే కిల చిత్రకేతుః
పుత్రాగ్రహీ నృపతి రంగిరసః ప్రభావాత్,
లబ్ధ్వైకపుత్ర మథ తత్ర హతే సపత్నీ
సంఘై రముహ్య దవశ స్తవ మాయయాఽసౌ. 4

కొడుకునుగోరి యంగిరసుఁగొల్చి తదీయ కృపోపలబ్ధిచే
బడసిన పుత్రు శత్రువుల పాల్పడి కోల్పడి శూరసేన మే
లెడు దొర చిత్రకేతు వెన లేని విషాదమునొంది మోహముం
గుడిచెను నీదు మాయపయికొన్న తరంబగునే తరింపగన్.

శూరసేన దేశములందు చిత్రకేతుడను రాజు అంగిరసుని ప్రభావమువలన నొక కుమారుని గనియెను. సవతితల్లులు వానిని చంపిరి. రాజు నీ మాయచే ఆ విషయము నెఱుగలే డయ్యెను.

వి.వి : చిత్రకేతుడు అంగిరస్సు అనుగ్రహించిన యజ్ఞశేషమును ప్రాశనముచేసి జ్యేష్ఠభార్యయందు పుత్రుని బడసెను.

తం నారదస్తు సమ మంగిరసా దయాలు
స్సంప్రాప్య తావ దుపదర్శ్య సుతస్య జీవమ్,
కస్యాస్మి పుత్ర ఇతి తస్య గిరా విమోహం
త్యక్త్వా త్వదర్చనవిధౌ నృపతిం న్యయుంక్త. 5

వాని యెడఁ దయందలఁచి వచ్చి సురర్షియు నంగిరస్సుతో
వాని కుమారు ప్రాణ మొకపాట ఘటించిన, నంత లేచి యె
వ్వాని కుమారుఁ డౌదునని పల్కుచు నాపసివాఁడు మాటలో
మానిచి మోహముం, దమ సమర్చనకుం బురికొల్పె నానృపుఁ.

నారదస్వామి దయతో అంగిరసునితో కూడ వచ్చి చనిపోయిన కుమారుని బ్రతికించెను. ఆ బాలుడు 'నే నెవరి కుమారుడను' అని యడుగగా దానివలన రాజు అజ్ఞానము పోగా అతనిని నారదుడు నీ సేవయందు నియోగించెను. తండ్రికొడుకుల సంబంధము ఔపాధికము గాని, పరమార్థము గాని గాదని తెలిసి తండ్రికి జ్ఞానోదయము గల్గించినాడని భావము.

స్తోత్రంచ మన్త్రమపి నారదతోఽథ లబ్ధ్వా
తోషాయ శేషవపుషో నను తే తపస్యన్,
విద్యాధరాధిపతితాం సహి సప్తరాత్రే
లబ్ధ్వా ప్యకుంఠమతి రన్వభజ ద్భవంతమ్. 6

బోధము నంది యమ్మునివిభుం డుపదేశ నిదేశ మీయ బల్
సాధన స్తోత్రమంత్రముల సారెకు నీదగు శేషమూర్తి నా
రాధనసేసి యాఋనొక రాత్రులలోన నకుంఠబుద్ధి వి
ద్యాధరనాయకాగ్రసరుఁడై భజియించెను ని న్ననంతునిన్.

అతడు శేషస్వరూపుడవై యున్న నీ అనుగ్రహముకొఱకు నారదుని వలన మంత్రోపదేశము పొంది తపస్సుచేసి యేడు రాత్రులలో విద్యాధరాధిపత్యము బడసి, ఆ మీదటగూడ అనంతస్వరూపుడవై యున్న నిన్నే భజించెను

తస్మై మృణాలధవలేన సహస్రశీర్‌ష్ణా
రూపేణ బద్ధనుతి సిద్ధగణావృతేన,
ప్రాదుర్భవ న్నచిరతో నుతిభిః ప్రసన్నో
దత్వాత్మతత్త్వ మనుగృహ్యా తిరోదధాథ. 7

తామరతూడువోలె విశదమ్మయి దివ్యఫణా సహస్ర శో
భామహితంబునై స్వజన బాంధవమౌ నొక రూపుతోడ నా
నా ముని సిద్ధకోటి స్తవనంబుల నందుచుఁ దోఁచి యాత్మవి
ద్యామహితోపదేశమిడి యంతటిలోఁ జనినాఁడ వీశ్వరా!

తామరతూడువలె తెల్లనివగు వేయిశిరస్సులతోగూడి తనను నుతించు సిద్ధగణ పరివారముతో అనంతుడు వెంటనే సాక్షాత్కరించి, అతని స్తోత్రములకు ప్రసన్నుడై ఆత్మతత్త్వము నుపదేశించి అంతర్ధాన మయ్యేను.

త్వద్భక్తమౌళి రథ సోఽపి లక్షలక్షం
వర్షాణి హర్షులమనా భువనేషు కామమ్,

సంగాపయన్ గుణగణం తవ సుందరీభి
స్సంగాతిరేక రహితో లలితం చచార. 8

ఆ దొర భక్తకోటిదొర హర్షులమైన మనమ్ముతోడ నా
నాదిశలందు సర్వభువనమ్ముల లక్షలు లక్షలేండ్లు నీ
మీది ప్రబంధముల్ హృదయమేళన నచ్చరలెల్ల పాడగా
సాదృతి వించు నెందు నొక సంగములేక చరించె ఁజక్కఁగన్.

ఆ భక్తశిరోమణి లక్షలక్ష సంవత్సరములు ఆనందభరితుడై నీకళ్యాణ గుణములను గానము చేయుచు విద్యాధర సుందరీజనముచే గానము చేయించుచు నిస్సంగుడై చక్కఁగా విహరించెను.

అత్యంతసంగవిలయాయ భవత్ప్రణున్నో
నూనం సరౌప్యగిరి మాప్య మహత్సమాజే,
నిశ్శంక మంకకృతవల్లభ మంగజారిం
తం శంకరం పరిహస న్నుమయాభిశేషే. 9

ఉన్న యొకింత సక్తియదియుం దొలఁగింపగ మీరుత్రోయ న
య్యున్నత రౌప్యశైలమున నుండి మహామహులున్న గోష్ఠిలో
గ్రన్నన ప్రాలి శంకరుని గాంచి ప్రియం దొడనిల్పుకొంటె శం
భన్న స్మరారి వౌదువని హాసముతోఁ బరిహాసమాడినన్.

మఱియు నతడు ఏమాత్రము సక్తిలేనివాడు అగుటకు నీచే ప్రేరణచేయబడి కైలాసమున కేగి సాధుసమాజమునందు సంశయము లేకుండ అంకతలమందు తన వల్లభయైన గౌరిని గూర్చుండబెట్టుకొని కూర్చున్న మన్మథవైరి యగు శంకరుని జూచి ఈయనకు గూడ అంగనాసంగము ఇంత ప్రబలముగా నున్నదని పరిహాసించి (అవహేళనము చేసి) ఉమా శాపమునకు గుఱి యయ్యెను.

నిస్సంభ్రమ స్త్వయ మయాచితశాపమోక్షో
వృత్రాసురత్వ ముపగమ్య సురేంద్రయోధీ,

**భక్త్యాత్మ తత్త్వకథనై స్సమరే విచిత్రం**
**శత్రోరపి భ్రమ మపాస్య గతః పదం తే. 10**

**ఉమ శపియించె, శాపమున కుల్కకఁడొకింతయు; శాపమోక్ష మా**
**యమ నడుగండు; వృత్రుఁడన నాసురభావము నొంది యింద్రుఁగ**
**య్యమునకుఁ బిల్చి శత్రుఁడన కాతని కాత్మ గురించి చెప్పి త**
**ద్భ్రమ దొలఁగించి నీ పరమధామముఁ దాఁబడసెఁ క్షణమ్మునన్.**

**త్వత్సేవనేన దితి రింద్రవధోద్యతాపి**
**తా న్ప్రత్యుతేంద్రసుహృదో మరుతోఽ భిలేభే,**
**దుష్టాశయేఽపి శుభదైవ భవన్నిషేవా**
**తత్తాదృశ స్త్వ మవ మాం పవనాలయేశ! 11**

**ఇంద్రుని జంపు నూహగలదే దితి, దానికి నీదు సేవ ని**
**స్తంద్రతఁజేసియున్నది, నిజ మ్మటు లుండియుఁగాంచెనొర! య**
**య్యింద్రుని కాప్తమిత్రుల బళీ! మరుదాఖ్యుల వేల్పులన్, దమ**
**స్సాంద్రులకేని నీ కొలువు సర్వ శుభప్రద మయ్యెడున్ హరీ!**

శాపవశుడయ్యు తొట్రుపడక శాపమోక్షమును యాచింపక విశ్వరూపుడు వృత్రాసురుడై జనించి దేవేంద్రునితో యుద్ధము జేసి ఆత్మతత్త్వమును ఉపదేశించుటచే యుద్ధమునందు శత్రువైన యింద్రునకు గూడ భ్రమను పోగొట్టి నీ స్థానమును పొందెను.

వి.వి : దితి నిను సేవించి భర్తయైన కాశ్యపుని ప్రసన్నుని జేసికొని, యింద్రుని సంహరింపగల పుత్రుని కోరి గర్భవతి యయ్యెను. కాని విపరీతము జరిగెను. ఇంద్రుడు ఆ సమయములో ఆమె గర్భమున ప్రవేశించి ఏడేడు ఖండములు గావింప నేర్పడిన మరుత్తులు నలుబది తొమ్మిది మంది ఇంద్రునికి మిత్రులై జన్మించిరి. ఇట్లు చెడ్డ యభిప్రాయము గలవారికి గూడ నీ సేవ మంచి ఫలమునే ప్రసాదించును. అట్టి దైవము నీవు నన్ను పాలింపుము.

# 24వ దశకము

# ప్రహ్లాద చరిత్ర

**హిరణ్యాక్షే పోత్రిప్రవరవపుషా దేవ భవతా**
**హతే శోక క్రోధగ్లపితధృతి రేతస్య సహజః,**
**హిరణ్యప్రారంభః కశిపు రమరారాతి సదసి**
**ప్రతిజ్ఞా మాతేనే తవ కిల వధార్థం మురరిపో.** 1

**అనుజాం డీల్గె వరాహమూర్తి యగు దైత్య ధ్వంసి నీ చేతిలో**
**నని శోకాన హిరణ్యపూర్వకశిపుం డత్యుగ్రుఁడై విహ్వాలిం**
**చిన చిత్తాన నినున్ వధింతునని చేసెఁ మున్ను తీవ్ర ప్రతి**
**జ్ఞను దోర్దండ యుగమ్మునుం జరచి రక్షశ్చక్ర మధ్యమ్మునన్.**

హిరణ్యకశిపుడు వరాహమూర్తివగు నీచేత తన తమ్ముడు హిరణ్యాక్షుడు చనిపోయెనని దుఃఖించి కోపించి నిన్ను సంహరింతునని రాక్షససభలో ప్రతిజ్ఞసేసెను

**విధాతారం ఘోరం స ఖలు తపసిత్వా స చిరతః**
**పుర స్సాక్షాత్కుర్వన్ సురనరమృగాద్యై రనిధనమ్,**
**వరం లబ్ధ్వా దృప్తో జగదిహ భవన్నాయక మిదం**
**పరిక్షుంద న్నింద్రా దహరత దివం త్వా మగణయన్.** 2

**హరి ఉహరి! ఘోరమైన తపమందుఁ జరించి విరించిచే సురా**
**సురవర జంతుకోటి నొకచోఁ దనకుఁ మృతి లేనియట్లుగా**
**వరము గడించి పెఁ బొగరువట్టి జగ మ్మలయించి యింద్రు మేల్**
**సిరి హరియించి నిన్ సరకుసేయఁడు క్రిందును మీఁదెఱుంగఁడుఁ.**

అతడు కఠోరతపస్సు చేసి బ్రహ్మవలన సురాసుర నర మృగాదు లెవ్వరి చేతను జావు లేకుండ వరము వడసి మదమెక్కి నీవు నాయకుడుగా గల యీ జగత్తును జూర్ణము సేయుచు ఇంద్రుని సిరుల గొల్లగొట్టెను

నిహంతుం త్వాం భూయ స్తవ పద మవాప్తస్య చ రిపో
ర్బహిర్దృష్టే రంతర్దధిథ హృదయే సూక్ష్మవపుషా,
నదన్నుచ్చై స్తత్రా ప్యఖిలభువనాంతే చ మృగయన్
భియా యాంతం మత్వా స ఖలు జితకాశీ నివవృతే. 3

నిను జంపన్ జనియెన్ వికుంఠమునకున్ నీవున్ బహిర్దృష్టి వా
పని యమ్మూర్ఖు హృదంతరాన వరిముల్వాటమ్ముగా నున్న, ని
న్గనలే కూరక బొబ్బరించుచు దెసల్ గాలించి తూలించి పో
యెను బో పో హరి యోడిపోయెనని తానే గెల్చిన ట్లుబ్బుచున్.

వాడు నిన్ను జంపుటకు వైకుంఠమున కేగెను. బాహ్యదృష్టి మాత్రముగల యా మూర్ఖుని మాంసచక్షుస్సునకు గానరాక అంతర్ధానవై వాని హృదయమందుననే వరిముల్లు వాటముగా దాగుకొంటివి. నీకై పదునాల్గులోకములు గాలించి చివరకు నీవు తనకు జడిసి పారిపోయినట్లును, నిన్ను తానే గెల్చితినని చాటుకొనుచు సింహగర్జనములు చేయుచు వెనుకకు పోయెను.

తతో ఽస్య ప్రహ్లాద స్సమజని సుతో గర్భవసతౌ
మునే ర్వీణాపాణే రధిగత భవద్భక్తి మహిమా,
స వై జాత్యా దైత్య శ్శిశురపి సమేత్య త్వయి రతిం
గత స్త్వద్భక్తానాం వరద పరమోదాహరణతామ్. 4

అవలన్ బుట్టెను వాని గర్భమునఁ బ్రహ్లాదుండు, వీణాధరుం
డవు మౌనీంద్రునిబోధ భక్తిమహిముండై జాతిచే రక్కసుం
డవు నైనన్ హరి! నీ పయిన్ వలపుమెండై సాధుసౌజన్యుఁడై
భవుఁడైయొప్పె నశేషభక్తనివహ ప్రారంభ దృష్టాంతమై.

ఆవల వాని కడుపున ప్రహ్లాదుడు జన్మించి, వీణాపాణియై త్రిలోకము లందు నారాయణ యశోగానము సేయుచు సంచరించు శ్రీ నారదమునివలన నీ యెడల భక్తి ప్రభావమంది, జాతిచే రాక్షసుడయ్యు శిశువయ్యును నీ యందు ప్రేమవడసి సర్వభక్తులకు నుదాహరణమై ప్రప్రథమ గణ్యుడయ్యెను.

సురారీణాం హాస్యం తవచరణ దాస్యం నిజసుతే
స దృష్ట్వా దుష్టాత్మా గురుభి రశిశిక్ష చ్చిర మముమ్,
గురుప్రోక్తం చాసా విద మిద మభద్రాయ దృఢమి
త్యపాకుర్వన్ సర్వం తవ చరణభక్త్యైవ వవృధే. 5

తన సుతునందు నీ చరణదాస్యము దానకోటి హాస్యముం
గని, గురుశిక్షలం దసుర గట్టిగఁ గట్టిన, వారు సేయు బో
ధనమది భద్రసాధనము దా నెటు గాదని బాలకుండు నీ
వినుత యశస్సుధారసము విందులఁదేలి కరంబు రంజిలెన్.

తన కొడుకు నీ చరణదాస్యమునకు మఱిగి దానవుల హాస్యమునకు గురి యగుట చూచి, దుష్టుడగు తండ్రి యాబిడ్డని శుక్రకుమారులైన చండామార్కుల శిక్షణలో బెట్టెను. కాని యా బాలుడు ఈ చదువు అమంగళహేతువని నిశ్చయించి, యది యెల్ల విడిచి నీ చరణారవిందభక్తి మకరందము గ్రోలి వర్ధిల్లెను.

అధీతేషు శ్రేష్ఠం కిమితి పరిపృష్టేఽథ తనయే
భవద్భక్తిం వర్యా మభిగదతి పర్యాకులధృతిః,
గురుభ్యో రోషిత్వా సహజమతి రస్యే త్యభివిద
న్వధోపాయా నస్మిన్ వ్యతనుత భవత్పాదశరణే. 6

చదువుల సారమేమనగ, సారసలోచను మీఁది భక్తి సం
పద యని తండ్రితో నెదురు పల్కిన, నుల్కి గురూపదేశ మి
ట్టిది యని వారిఁదిట్టి మఱి యెవ్వరు నేర్పని విద్య వచ్చి ప
డ్డది యని తండ్రి! నీదు చరణైకశరణ్యు నదల్చి రొప్పుచున్.

ఒకప్పుడు తండ్రి నీ చదివిన చదువులలో సార మేదన, నీ యెడల భక్తిని మించినది లేదని పల్కగా హిరణ్యకశిపు డులికిపడి, గురువులయెడ దోషము చూపి, యిది వీనికి సహజముగా పుట్టిన బుద్ధియే యని యెఱింగి నీ చరణైక శరణ్యుని వానిం జంపుటకు ఉపాయముల నన్వేషించెను.

స శూలై రావిద్ధ స్సుబహు మథితో దిగ్గజ గణై
ర్మహాసర్పై ర్దష్టోఽ ప్యనశన గరాహార విధుతః,
గిరీంద్రావక్షిప్తోఽ ప్యహహ! పరమాత్మ న్నయి విభో!
త్వయి న్యస్తాత్మత్వాత్ కిమపి న నిపీడా మభజత. 7

శూలాగ్రమ్మునఁ గ్రుచ్చి, ఘోరవిషమున్ జొప్పించి, యాశాంత శుం
డాలమ్ముల్ మెయిఁద్రొక్కఁ బంపి, నడికొండన్ మీటి దొర్లించి, స
ర్పాళిన్ మైఁగఱపించి మించిన క్షుథాభారాగ్ని నొప్పించినన్
బాలుం డించుకయేని కందఁడు భవద్భావాత్త తాదాత్మ్యతన్.

శూలములచే గ్రుచ్చి, దిగ్గజములచే ద్రొక్కించి, పాములచే గఱపించి, ఉపవాసము లుంచి, విషమిచ్చి, కొండలనుండి దొరలించి, యెంత చేసినను ఆ బాలుడు పరమాత్మయగు నీ యందు మనసు జేర్చుటచే కందడు, నలియడు.

తత శ్శంకావిష్ట స్స పున రతిదుష్టోఽస్య జనకో
గురూక్త్యా తద్గేహే కిల వరుణపాశై స్తమరుణత్,
గురో శ్చాసాన్నిధ్యే స పున రనుగా న్దైత్యతనయాన్
భవద్భక్తే స్తత్త్వం పరమమపి విజ్ఞాన మశిషత్. 8

ఆయది చూచి వాడును దురాగ్రహుఁడై గడు నుగ్రుఁడై యుపా
ధ్యాయుల యింటనుంచి సుతు దారుణ వారుణ పాశబద్ధునిన్
జేయ, గురుల్ దొలంగి చనఁ జేరి సురారికుమారుఁడా సహా
ధ్యాయుల కాత్మభక్తి భరితమ్మగు వైష్ణవబోధ సేసినన్.

అవల సంశయమంది ఆ పరమ దుష్టుడగు తండ్రి ఉపాధ్యాయులయింటనే వారుణపాశములచే బంధించెను. బద్ధుడయ్యు నా గురువు లట్టిటు చనినపుడు రాక్షసబాలురం బిలిచి ప్రహ్లాద కుమారుడు నీ భక్తిస్వరూపమును పరమ విజ్ఞానమును అనగా బ్రహ్మజ్ఞానమును బోధించెను.

పితా శృణ్వన్ బాలప్రకర మఖిలం త్వత్స్తుతిపరం
రుషాంధః ప్రాహైనం కులహతక! క స్తే బల మితి,

బలం మే వైకుంఠ స్తవ చ జగతాం చాపి స బలం
స ఏవ త్రైలోక్యం సకల మితి ధీరో ఽయ మగదీత్. 9

బాలకు బోధలన్ దనుజ బాలకు లందరు విష్ణు భక్తి లీ
లా లులితాత్ములైరని కలంగి "కులాంతక! నీ బల మ్మెవం
డాలము లేక తెల్పు" మన నర్భకుఁ "డా హరి నాకు నీకు లో
కాళికినిన్ బల" మ్మని చరాచర మాతఁ డొకం డనెన్ ధృతిన్.

తండ్రి వానితోబాటు తోడి బాలురందఱు విష్ణుభక్తి వినోదములో బడినా రని కలతచెంది రోషముచే కన్నుగానక 'ఓరి కులాంతక! నీ బల మెవ్వ' డని బెదరించియడుగ నా అర్భకుడు 'విష్ణువే నాకును నీకును జగమ్ములకును బలము. అతడే ముల్లోకములు' నని ధీరుడై పలికెను.

అరే క్వాసౌ క్వాసౌ సకలజగదాత్మా హరి రితి
ప్రభిన్తే స్మ స్తంభం చలితకరవాలో దితిసుతః,
అతః పశ్చా ద్విష్ణో! న హి వదితు మీశోఽస్మి సహసా
కృపాత్మన్ విశ్వాత్మన్ పవనపురవాసిన్ మృడయ మామ్. 10

హరి విశ్వాత్ముకుఁ డందు నిందుఁగలడా యంచున్ సురద్రోహి స
త్వరతన్ చేఁగరవాలమూచి భవనస్తంభమ్మునన్ గొట్టె; నా
తరమా పల్క? కృపాంతరంగ! బహిరంతర్వ్యాప్త! వాతాలయే
శ్వర! యా మీఁది భవద్భయానకరస వ్యాపార పారీణతల్.

ఓరీ! హరి విశ్వాత్మయంటివి. ఏది! ఇందున్నాడాచూపుమని హిరణ్యకశిపుడు కరవాలముచే సభాభవన స్తంభము నూచి కొట్టగా ఆ పై జరిగిన వింత నేను జెప్పజాలను. కృపారూపమా! విశ్వరూపా! పవనపురవాసీ! నన్ను సుఖింపజేయుము.

# 25వ దశకము

# నృసింహావతారము

స్తంభే ఘట్టయతో హిరణ్యకశిపోః కర్ణౌ సమాచూర్ణయ
న్నాఘూర్ణ జ్జగదండ కుహరో ఘోర స్తవాభూ ద్రవః,
శ్రుత్వా యం కిల దైత్యరాజహృదయే పూర్వం కదాప్యశ్రుతం
కంపః కశ్చన సంపపాత చలితో౽ ప్యంభోజభూ ర్విష్టరాత్. 1

స్తంభాఘాతరవమ్ము కర్ణకుహరాస్తంభమ్ము గూర్పన్ జగ
త్కుంభ మ్మెల్ల విఘూర్ణమానమయి యా ఘోరాసురానీక రా
డ్గంభీరోగ్ర హృదగ్రవీథిఁ జటులోత్కంపమ్ముఁ గల్పించె; న
య్యంభోజాసనుఁడున్ జలించెఁ బ్రళయాభ్రావిర్భవ భ్రాంతిచే.

స్తంభమును గొట్టగా బుట్టిన ధ్వని హిరణ్యకశిపుని చెవులను బ్రద్దలు గొట్టి, బ్రహ్మాండమును ఘూర్ణిల్లచేసి, యెన్నడు వినరానిదై దైత్యహృదయమందు కంపము పుట్టించెను. బ్రహ్మ ఇదియేమి యకాలప్రళయమా యని తన లోకమునుండి చలించెను.

దైత్యే దిక్షు విసృష్టచక్షుషి మహాసంరంభిణి స్తంభత
స్సంభూతం న మృగాత్మకం న మనుజాకారం వపు స్తే విభో!
కింకిం భీషణ మేత దద్భుత మితి వ్యుద్భ్రాంతచిత్తే౽ సురే
విస్ఫూర్జ ద్ధవళోగ్రరోమ వికసద్వర్ష్మా సమాజృంభథాః. 2

దిక్కుల్ దిక్కులు చూచుచున్ బఱచి యుద్రేకించి స్తంభాన నే
మొక్కో భీషణ ఘోషణమ్మనుచు లో నుద్భ్రాంతుఁడౌ రక్కసున్
ధిక్కారింప మృగంబుగాక నరుఁడేనింగాక రెండౌచు నా
చక్కిం దోచితి వక్కజమ్ముగ సటాజాలమ్ము నిక్కించుచున్.

దైత్యుడు దిక్కులందు చూపుబఱపి సంరంభముగొని చూడగా స్తంభమందుండి ప్రభూ! నీ మూర్తి అటు మృగముగాక, ఇటు మనుజుండుగాక

యవతరింప నీ భీషణ ధ్వని యేమనుచుండగనే అచ్చము తెల్లనైన జూలు నిక్కింప జేయుచు నరసింహస్వరూపమున విజృంభించితివి.

**తప్తస్వర్ణ సవర్ణ ఘూర్ణ దతిరూక్షాక్షం సటా కేసర**
**ప్రోత్కంప ప్రనికుంబితాంబర మహో జీయా త్తవేదం వపుః**
**వ్యాత్త వ్యాప్త మహాదరీసఖముఖం ఖడ్గాగ్ర వల్గన్మహా**
**జిహ్వా నిర్గమదృశ్యమాన సుమహాదంష్ట్రాయుగోడ్డామరమ్.** 3

* తప్తస్వర్ణ సవర్ణ ఘూర్ణ చటులోదగ్రాక్ష ముద్యత్సటా
వ్యాప్తోత్కంపి నికుంభితాంబరము ఖడ్గాగ్రోగ్రజిహ్వాగ్ర సం,
దీప్త ప్రోద్ధత దంష్ట్రికాయుగ మహాదిగ్ధాద్రిరాడ్గహ్వరో
ద్వృప్తాస్యమ్మయి మా యుపాస్య మిరవొందెన్ శ్రీనృపంచాస్యమై.

పుటము వెట్టిన బంగారమువలె నెఱ్ఱనై, తిఱుగుడువడు గ్రుడ్లచే మిక్కిలి తీక్ష్ణమైన కన్నులు గల్గి, నిక్కిన జూలుచే గగన మండల మావరించి కత్తియంచు పదునై యెఱ్ఱగ వెలికి దీపించు కఱకు నాలుకతో నిడుదలైన రెండు కోరలతో పర్వతగుహవోలె నతి భయంకరమైన ముఖముతో అతిభీషణమైన నీ నరసింహాకారము సర్వోత్కృష్టమై ప్రకాశించెను.

**ఉత్సర్పద్వలిభంగ భీషణ హను హ్రస్వస్థవీయ స్తర**
**గ్రీవం పీవరదోశ్శతోద్గతనఖక్రూరాంశు దూరోల్బణమ్,**
**వ్యోమోల్లంఘి ఘనాఘనోపమ ఘన ప్రధ్వాన నిర్ధావిత**
**స్పర్ధాళుప్రకరం నమామి భవత స్త న్నారసింహం వపుః.** 4

వలిభంగస్ఫుట గండమై పృథుల హ్రస్వగ్రీవమై దోశ్శతా
కలితోద్యన్నఖపుంఖపుంఖితరుచి క్రాంత్యుల్బణమ్మై నభో

---

* పుటముంబెట్టిన జాళువా మిసిమి కెంపుల్ నింపు కన్నుల్ సటా
చ్ఛట నిక్కన్ వడి నింగికిం దుముకుచున్ జంచద్గుహా ఘోరమౌ
నటులౌ మో మసిధారవోలెఁ బదనైయల్లాడు జిహ్వాగ్ర ము
త్కట దంష్ట్రాయుగళోగ్రమౌ నరమృగాకారమ్ము భావించెదన్.

వలయోల్లంఘి ఘనాఘన ప్రతిఘన ప్రధ్వాన నిర్ధావితా
ఖిల ఘోరాసురమౌ నృసింహమునకున్ గేల్మోడ్తు నీ మూర్తికిన్.

నీవు అట్టహాసము చేయగా ముడుతలు దేరిన గండభాగముచే అతి భయానకమై బలిసి హ్రస్వమైయున్న కంఠముతో, తీక్ష్ణములైన గోళ్ళయొక్క ఎఱ్ఱని కాంతి పుంజముచే మిక్కిలి భయంకరమైన నూరు హస్తములతో నాకస మంటిన పెనుమబ్బుల గర్జనమునకు ఈడైన పెనుబొబ్బలచే హడలి కకావికలై ప్రతిస్పర్ధి రాక్షసమండలిని పారిపోజేసిన నీ నరసింహ స్వరూపమునకు నమస్కరించెదను.

నూనం విష్ణు రయం నిహన్మ్యము మితి భ్రామ్యద్గదాభీషణం
దైత్యేంద్రం సముపాద్రవంత మధృథా దోర్భ్యాం పృథుభ్యా మముమ్,
వీరో నిర్గళితోఽథ ఖడ్గఫలకౌ గృహ్ణ న్విచిత్రశ్రమాన్
వ్యావృణ్వన్ పున రాపపాత భువనగ్రాసోద్యతం త్వాం మహో. 5

ఇడుగో విష్ణువుఁ ద్రుంతుఁగాకని గదా హేరాళ హస్తోద్ధతిన్
పడిఁబైపైఁబడువాని బాహుయుగళిన్ బంధించి సంధింప, నీ
సడరం బట్టు తొలంగి డా ల్పలకతోనై వాఁడు జృంభించె లో
నడలం డింతయు నిన్ జగత్కబళన వ్యాటోపునిన్ డాయగన్.

కపటవేష మూని వచ్చిన విష్ణువు ఇడుగో వీడే యని వీనిని ద్రుంతునని గదబూని మీదికివచ్చి పడుచున్న యా రాక్షసుని రెండు బాహువులను నీవు పెడవిఱిచి కట్టగా వాడు పట్టువిడిపించుకొని కత్తియుం డాలునుం బూని విజృంభించి వింతవింత నడకలు సూపుచు జగమ్ములెల్ల కబళింపనున్న నిను జూచి యించుకయు బెదరక కసిగొని విజృంభించెను.

భ్రామ్యంతం దితిజాధమం పునరపి ప్రోద్గృహ్య దోర్భ్యాం జవాద్
ద్వారేఽథోరుయుగే నిపాత్య నఖరా న్వ్యుత్ఖాయ వక్షో భువి,
నిర్భింద న్నధిగర్భ నిర్భర గలద్రక్తాంబు బద్ధోత్సవం
పాయం పాయ ముదైరయో బహుజగత్సంహారి సింహారవాన్. 6

అటు దితిజాధముండు దిరుగాడగ నీ పృథుబాహు వల్లరిన్
జటుకనఁబట్టి ముంగడప చాయల నీ తొడఁ దాపి రొమ్మునన్

**బటు నఖరాగ్రము ల్దిగిచి పాయలు సేసి దతుగ్రగర్భ ని**
**ష్కుటగళ దస్రధారలను గ్రోలితి వుద్భట సింహగర్జనన్.**

అట్లు అటు నిటు వీరవిహారముసేయు నా రాక్షసుని జటుకున బట్టి నీ బాహులతలచే బంధించి యా సభాద్వారము ముందుగడప మీద నీ తొడపై బెట్టుకొని వాని రొమ్మున నీ తీక్ష్ణనఖాగ్రములను దింపి పాయలు పాయలుగా జీల్చి యందుండి వెలికి జిమ్ముకొను రక్త ప్రవాహములను ద్రావిద్రావి బ్రహ్మాండ భాండభేదనముగ సింహగర్జనము లొనరించితివి.

**త్యక్త్వా తం హత మాశు రక్తలహరీ సిక్తోన్నమద్వర్ష్మణి**
**ప్రత్యుత్పత్య సమస్తదైత్యపటలీం చాస్వాద్యమానే త్వయి,**
**భ్రామ్యద్భూమి వికంపితాంబుధికులం వ్యాలోలశైలోత్కరం**
**ప్రోత్సర్పత్ఖచరం చరాచర మహో దుఃస్థా మవస్థాం దధౌ. 7**

**గుటగుట ద్రావి రక్తనదకోటులు మేన నలంది, దైత్యు నీ**
**వటు లెగమీటి సర్వదితిజాధమ భక్షణ కంగవింప, ది**
**క్తటుల గుభిల్లుభిల్లనె నగమ్ములు, వార్ధులు పొంగె, వేల్పు లా**
**ర్భటపడి, రాకులించె దురవస్థఁ జరాచర భూత సంఘముల్.**

అట్లు వాని గర్భకుహరమందలి రక్తనదములను గుటగుట ద్రావి యా దైత్యుని అట్టె మీదికి ఎగమీటి విసరి పారవైచితివి. ఆ మీద నక్కడ గవిసిన వాని పరివారమగు దైత్యాధములను నీవు భక్షింప నారంభింపగా గుభిల్లు గుభిల్లుమని పర్వతములు ప్రతిధ్వనించెను. సముద్రములు పొంగినవి. దేవతలుగూడ హడలిపోయిరి. స్థావర జంగమమ్మైన అశేష జగమ్ము లాకులపడెను.

**తావ న్మాంసవపా కరాలవపుషం ఘోరాన్త్రమాలాధరం**
**త్వాం మధ్యే సభ మిద్ధకోప ముషితం దుర్వార గుర్వారవమ్,**
**అభ్యేతుం న శశాక కోఽపి భువనే దూరే స్థితా భీరవ**
**స్సర్వే శర్వ విరించి వాసవముఖాః ప్రత్యేక మస్తోషత. 8**

**అరుదౌ మాంస వపా సిరాస్థి భరిత మ్మారక్తధారా ధర**
**మ్మురు ధారాధర ఘోరగర్జనము నోహో! ఆంత్రమాలా సము,**

త్కర రౌద్రమ్మగు మూర్తి చూడ వెఱఁగై కంపించి, దూరాన ని
ల్చిరి బ్రహ్మేంద్ర సదాశివాదులు సురల్ వేర్వేర నిన్వేడుచున్.

అయ్యెడ నా రక్కసుని మాంసము, వస, ప్రేవులు, ఎముకలతో గూడి ఎఱ్ఱని రక్తమయమ్మైన మేఘమట్లు ఉద్భట గర్జనము సేయుచు ప్రేవులను పెరికి మాలగా ధరించిన పరమరౌద్రమగు నీ మూర్తిని కనులెత్తి చూచుటకు గూడ భయమై కంపించిపోయి బ్రహ్మేంద్ర సదాశివాది దేవతా ప్రభువులుగూడ దూర దూరముననేయుండి చేతులు ముడిచి నిన్ను వేడుకొనుచు నిలువబడిరి.

భూయోఽ ప్యక్షతరోషధామ్ని భవతి బ్రహ్మాజ్ఞయా బాలకే
ప్రహ్లాదే పదయో ర్నమ త్యపభయే కారుణ్యభారాకులః,
శాంత స్త్వం కర మస్య మూర్ధ్ని సమధాః స్తోత్రై రథోద్గాయత
స్త స్యాకామధియోఽపి తేనిథ వరం లోకాయ చానుగ్రహమ్. 9

నీదౌ నుగ్రత డిగ్గకున్న గని వాణీజాని పంపంగఁ బ్ర
హ్లాదస్వామి భవత్పదాబ్జముల వ్రాలన్ బూర్ణ వాత్సల్య లీ
లోదీర్ణమ్మగు శాంతి నౌదలఁ గర మ్మూనించి, తత్కీ ర్తనా
స్వాద స్వాదువవై యయాచిత వరప్రాప్తిన్ గటాక్షింపవే.

నీ ఉగ్రత యెంతకును శాంతింపకున్న జూచి బ్రహ్మ అనునయించి పంపగా బ్రహ్లాదస్వామి వచ్చి నీచరణములపై బడగా, సంపూర్ణవాత్సల్య రసభరితమ్మైన మూర్తితో నీ చేయి వాని యౌదల నుంచి యత డొనరించు నీ స్తుతి సంకీర్తన మాధుర్యమునకు జొక్కి వరమడుగుమని నీ వన్నను, నేదియు నడుగని నిష్కాముడైన యా శిశువుం గనికరించి దైత్యరాజ్యాధి పత్యమును లోకానుగ్రహమునకై వాని కనుగ్రహించితివి.

ఏవం నాటిత రౌద్రచేష్టిత విభో శ్రీతాపనీయాభిధ
శ్రుత్యంత స్ఫుటగీత సర్వమహిమ న్నత్య న్తశుద్ధాకృతే!
తత్తాదృఙ్నిఖిలోత్తరం పున రహో కస్త్వాం పరో లంఘయేత్
ప్రహ్లాదప్రియ! హే మరుత్పురపతే! సర్వామయా త్పాహి మామ్. 10

ఇత్యాకారక రౌద్రవర్తన సమాధీ! తాపనీయాభిధ
శ్రుత్యంత స్ఫుటగీత దివ్యమహిమా! శుభ్రద్యుతీ! భక్తి సా

**హిత్య శ్రీ మకుటాయమాన సుషమా హేరాళ! ప్రహ్లాద సం**
**స్తుత్య! శ్రీ గురువాయు మందిర సుధాజ్యోతీ! నమస్కారముల్.**

ఈ విధమైన రౌద్రనర్తనమునం దేకాగ్రత గొన్న ఓ స్వామి! తాపనీయ నృసింహాపనిషద్వాణిచే చక్కగ గానము సేయబడిన మహిమగల అచ్చమైన రూపుగల ప్రభూ! ఇట్టి నిన్ను ఎవడు అతిక్రమింపగలడు? ఓ ప్రహ్లాద ప్రియా! భక్తవరదా! గురువాయూరు మందిరాధీశ్వర! నావ్యాధులను హరింపుము.

తెలుగు అనువాదములో - భక్తిరసభరిత వాఙ్మయశోభకు కిరీటము పెట్టినట్లుండు ప్రభావప్రభాసంపన్నుడవై గురువాయుమందిరమందు అమృతజ్యోతి స్వరూపమై దీపించు స్వామికి నీకు నమస్కారము - అని కొంత మూలాధిక భావ విహారము చేయబడినది.

## 26వ దశకము

# గజేంద్ర మోక్షము

ఇంద్రద్యుమ్నః పాండ్య ఖండాధిరాజ
స్త్వద్భక్తాత్మా చందనాద్రౌ కదాచిత్,
త్వత్సేవాయాం మగ్నధీ రాలులోకే
నైవాగస్త్యం ప్రాప్త మాతిథ్యకామమ్. 1

**ఇంద్రద్యుమ్నుఁడు పాండ్యదేశపతి నీ కెంతేని భక్తుండు ని**
**స్తంద్ర ధ్యానసమాధిఁ జందనగిరిన్ దానుండగా వానిపై**
**సాంద్రప్రీతి నగస్త్యుఁడే యతిథియై సాక్షాత్కరింపంగ రా**
**జేంద్రుం డమ్మునివంకఁ జూడకయపోయెన్ దుర్విధిప్రేరణన్.**

భారతఖండ దక్షిణభాగమైన పాండ్యమండలమున కధిపతి ఇంద్రద్యుమ్నుడు నీ భక్తుడు. చందనాద్రిపై నిశ్చల ధ్యానసమాధిలో నుండగా,

అతని ననుగ్రహింపవలయుననియే అగస్త్యమహర్షి అతిథియై రాగా రాజు దైవ ప్రేరణ యట్లున్నది కాబోలు - ఆ మునివంక చూడనే చూడడయ్యెను.

కుంభోద్భూతి స్సంభృతక్రోధభార
స్తబ్ధాత్మా త్వం హస్తిభూయం భజేతి,
శప్త్వాథైనం ప్రత్యగా త్సోఽపి లేభే
హస్తీంద్రత్వం త్వత్స్మృతివ్యక్తి ధన్యమ్. 2

మదమునఁ గన్ను గానవటె! మాన్యుని నన్ గనుగొనఁజూడ వు
న్మదకరివై చరించెద వనన్, భయమంది క్షమార్పణమ్మనన్,
సదయత నా క్షమాపతికి శాపము తప్పదు గాని, భక్తి సం
పద భవదీయ సంస్మృతియుఁ బాయదనెన్ముని యా క్షణమ్మునన్.

అగస్త్యుడు కోపించి 'మదముచే కన్నులు మూతపడె గాఁబోలు కడగంటనైన నావంక చూడకున్నావు. కావున మదపుటేనుగవై జన్మింపుము' అని శాపమిచ్చెను. రాజు కన్దెఱచి భయపడి క్షమాభిక్ష వేడగా నమ్ముని శాంతినంది 'నాశాపము తిఱుగదు, అయినను నీ కా గజజన్మమందు హరిభక్తి హరిస్మరణయు పో'వని యనుగ్రహము చూపెను.

దుగ్ధాంభోధే ర్మధ్యభాజి త్రికూటే
క్రీడన్ శైలే యూథపోఽయం వశాభిః,
సర్వాన్ జంతూ నత్యవర్తిష్ట శక్త్యా
త్వద్భక్తానాం కుత్ర నోత్కర్షలాభః. 3

క్షీరాంభోనిధి నా త్రికూటగిరిపై క్రీడించుచున్ గుంభినీ
వారమ్ముల్ దశలక్షకోటి వరియింపన్ దత్కరాంభోజ వా
ర్ధారావృష్టి గజాధిరాజ్య పదవిన్ రంజిల్లె నారాజు; నీ
వారౌ వా రెటువోయి యభ్యుదయాలాభస్ఫూర్తికిం బాత్రముల్.

ఆ రాజు గజరాజై త్రికూట పర్వతమందు పాలసముద్రములో అనేకములగు నాడు యేనుగులతో విహరించుచు నక్కడగూడ సమున్నత రాజ్యాధికారముం జెల్లించుకొనియె. స్వామీ! నీ భక్తులగువా రెటువోయియు నున్నతస్థితిలోనే యుందురు.

తెలుగులో నాడు ఏనుగులు తొండములెత్తి యాతనికి అమృతాభిషేకము తామరపూవులతో బూజయు సేయగా సార్వభౌముడై యుండెననునది మూలాధిక విశేషము.

స్వేన స్థేమ్నా దివ్యదేశత్వశక్త్యా
సోఽయం ఖేధా నప్రజానన్ కదాచిత్,
శైలప్రాంతే ఘర్మతాంత స్సరస్యాం
యూథై స్సార్ధం త్వత్ప్రణున్నో ఽభిరేమే. 4

అమిత ప్రాగ్భవదీప్తి కొంత, యటుపై నాపుణ్యదేశ ప్రభా
వము కొంతై మది నెట్టి తాపములు తోపన్‌రాక నైదాఘ తాఁ
పము చల్లార్ప కరేణుయూథములతోఁ ద్వత్ప్రేరణన్ వారణో
త్తమ రాజన్యము చల్లులాడె గిరికాంతారాంత రంభఃస్థలిన్.

పూర్వజన్మస్మృతిచే గలిగిన సహజ ప్రాభవము ప్రకృతము వర్తించు నా పుణ్యతీర్థ ప్రభావము, ఋతుమతియను నా పుణ్యోద్యానమహిమయు గలిసి యాతని మది కెట్టి తాపము గలుగనీయవయ్యెను. కాని గ్రీష్మకాలికమైన స్థూలశరీరతాపము చల్లార్చికొనుట కాతడు తనయంగనలతో నీ ప్రేరణచేతనే పర్వత ప్రాంత కాంతారములందున్న మడువులలో జలక్రీడలాడ మరగెను

హూహూ స్త్వావ ద్దేవలస్యాపి శాపాత్
గ్రాహీభూత స్తజ్జలే వర్తమానః,
జగ్రాహైనం హస్తినం పాదదేశే
శాంత్యర్థం హి శ్రాంతిదోఽసి స్వకానామ్. 5

ఒకచో దేవలశాపముం గనిన హూహూనామ గంధర్వ నా
యకుఁడా నీటఁ జరించుచున్ మొసలియై, హస్తీంద్రుపాదంబు ప
ట్టుక బాధింపఁదొడంగె నుద్ధత మదాటోపాన, నీవారి నూ
రక వేధింతువు ము న్నఖండ సుఖసామ్రాజ్యాభిషేకానకున్.

దేవలుని శాపముచే మొసలియై హూహూనామ గంధర్వుడొక డా మడువునం జరించువాడు గజేంద్రుని పాద మ్మొడిసిపట్టి ఆకర్షించి పీడింప నారంభించెను.

తండ్రీ! నీ వారికి శాంతి ననుగ్రహించుటకే, విషయవిరక్తి గూర్చుటకే ముందుగా నానాశ్రమలకు గురిచేయుచుందువు.

త్వత్సేవాయా వైభవా ద్దుర్నిరోధం
యుధ్యంతం తం వత్సరాణాం సహస్రమ్,
ప్రాప్తే కాలే త్వత్పదై కాగ్ర్యసిద్ధ్యై
నక్రాక్రాంతం హస్తివర్యం వ్యధా స్త్వమ్. 6

నిను సేవించిన పుణ్యవైభవమునన్ వేయేండ్లు విశ్రాంతి నే
డని లేకుండగఁ బోరె వారణవిభుం డా రీతి కాలమ్ము రాఁ
జనగాఁ ద్వచ్చరణస్మృతిన్ బరమనిష్ఠాయోగ మందింప నా
తని గ్రాహగ్రహ దుర్ముఖమ్మునకు సంధానించినా వీశ్వరా!

గజరాజు 'నిను సేవించిన పుణ్యాబలమున్నదిగావున' వేయేండ్లు ఆ మొసలితో బోరెను. చివరకు నీ చరణస్మృతిచే పరమనిష్ఠాయోగ మందించుటకే వాని కా గ్రాహగ్రహావేశము గల్పించినావు.

ఆర్తివ్యక్త ప్రాక్తన జ్ఞానభక్తి
శ్శుండోత్క్షిప్తైః పుండరీకై స్సమర్చన్,
పూర్వాభ్యస్తం నిర్విశేషాత్మనిష్ఠం
స్తోత్రశ్రేష్ఠం సోఽన్వగాదీత్ పరాత్మన్! 7

ఆర్తుండైన కొలంది పూర్వభవ దీవ్యద్ జ్ఞాన భక్తిస్ఫుహల్
స్ఫూర్తిన్ నిల్వగఁ దొండమెత్తి జలజమ్ముల్ గోసి యర్చించి యా
వర్తించెన్ మఱి స్తోత్రపాఠమదియుం బ్రాగ్జన్మ లభ్యమ్ము స
ర్వార్తి ధ్వంసము నిర్గుణాత్మక పరబ్రహ్మైక తాత్పర్యముఁ.

పీడ అధికమైనకొలది యతడు పూర్వజన్మ సంస్కారరూపమైన జ్ఞానముచే భక్తిచే తొండమెత్తి అందినంతవరకు తామరపూలు గోసి నిన్నెంచి పూజ గావించుచు, నోటికివచ్చిన నీ స్తోత్రములను సర్వపీడానివారకములు నిర్గుణ

బ్రహ్మవస్తు తాత్పర్యములునైన వానిని వల్లెవేయుచు నట్టె నినుగూర్చి యాక్రందించెను.

శ్రుత్వా స్తోత్రం నిర్గుణస్థం సమస్తం
బ్రహ్మేశాద్యై ర్నాహ మిత్యప్రయాతే,
సర్వాత్మా త్వం భూరికారుణ్యవేగా
త్తార్క్ష్యారూఢః ప్రేక్షితోఽ భూః పురస్తాత్. 8

విని యా కేవల నిర్గుణస్తవము నా పిల్పిందులో లేదు, నా
పనికా, దీ స్తుతి నన్ను గాదనుచు నా బ్రహ్మేంద్ర రుద్రాదు లా
తని కడ్డంపడ రార యొక్కరు; గరుత్మద్వాహనారూఢుఁడై
యనఘా! శ్రీహరి! నీవ వచ్చితివి సార్వాత్మ్యంబు దీపింపగన్.

ఆ నిర్గుణపరమైన స్తుతు లాలించి నా పేరిందులో లేదు నా రూపిందు పొడగట్టదు - అని నామరూపాత్మక దృష్టిగల నీ సగుణమూర్తులగు బ్రహ్మేంద్ర రుద్రాది దేవత లొక్కరును పలుకరైరి. వాని కడ్డుపడరైరి. అపుడు గరుడారూఢుడవై శ్రీహరి యను పేరి అవతారమైన ఏలినవారు సర్వదేవతా స్వరూపులు గావున అటకు దయచేసినారు.

హస్తీంద్రం తం హస్తపద్మేన ధృత్వా
చక్రేణ త్వం నక్రవర్యం వ్యదారీః,
గంధర్వేఽ స్మిన్ ముక్తశాపే సహస్తీ
త్వత్సారూప్యం ప్రాప్య దేదీప్యతేస్మ. 9

కరిరాజున్ కరపద్మ మూత యిడి యాకర్షించి, చక్రమ్ముచే
నురునక్రమ్మును గోఁత పెట్టితివి; వాఁడొండొక్క గంధర్వుఁడై
పరగెన్ శాప విముక్తినంది; యవలన్ బాత్రమ్మునై యొప్పె నీ
శ్వర! యమ్మత్తగజమ్ము నంచిత భవత్సారూప్య సంసిద్ధికిన్.

అట్లు దయచేసి నీ కరకమల మూతయిచ్చి యా కరిరాజును వెలికి ఆకర్షించి యుద్ధరించి, నీ చక్రాయుధధారచే నమ్మొసలిని ఱంపపుగోత పెట్టితివి. వాని భాగ్యముపండి శాపవిముక్తి గని ఎప్పటియట్లే గంధర్వుడై

నిన్ను గానముచేసి ధన్యుడయ్యె. ఓ పరమేశ్వర! మదపుటేనుగుగూడ నీ సారూప్యసిద్ధి నందెను.

**ఏతద్వృత్తం త్వాంచ మాంచ ప్రగే యో**
**గాయే త్సోఽయం భూయసే శ్రేయసే స్యాత్,**
**ఇత్యుక్త్వైనం తేన సార్థం గత స్త్వం**
**ధిష్ణ్యం విష్ణో పాహి వాతాలయేశ! 10**

**'ఈ కథ నిన్ను నన్ దలఁచి యింపుగ నమ్మలయానిలాంకుర**
**శ్రీ కొసరించు వేకువలఁ జెల్వుగఁ బాడినవారు భద్రముల్**
**సేకొన నేర్తురం' చతనిఁ జేకొని నీ సదనమ్ముఁ జేరి నా**
**వో కమలేశ! యేలుకొనవోయి నన్నుఁ బవనాలయేశ్వరా!**

'నా భక్తుని నిన్నును (గజేంద్రు నన్నమాట), నన్నును దలచుకొని యీ గజేంద్రమోక్షణ కథను వేకువవేళ నల్లన చల్లని మలయానిలాంకురము పైకొని హాయి గూర్చుచుండగా గానముచేయు పుణ్యులు సర్వమంగళముల నందగల' రని యనుగ్రహించి యా గజేంద్రుని తోడుకొని నీ వైకుంఠమునకు దయచేసినావు. ఓ గురువాయూరుప్రభూ! నన్నును నట్లేలుకొనుము.

## 27వ దశకము

# అమృత మథనము, కూర్మావతారము

**దుర్వాసా స్సురవనితాప్త దివ్యమాల్యం**
**శక్రాయ స్వయ ముపదాయ తత్ర భూయః,**
**నాగేంద్ర ప్రతిమృదితే శశాప శక్రం**
**కా క్షాంతి స్త్వదితరదేవతాంశజానామ్. 1**

**తనకై యచ్చర లిచ్చినట్టి సుమనోదామమ్ము దుర్వాసుఁడి**
**చ్చెను దేవేంద్రుని; కాతఁడున్ విసరివైచెన్ దాని నైరావత**

**మ్మునఁనద్దానినిఁ గాలరాచె నది, య మ్ముక్కోపి యింద్రుఁ శపిం**
**చెను; నీ పా లది లేనివారికి క్షమాశ్రీలాభ మేదీ హరీ!**

ఒకనాడు దూర్వాసుడు అప్సరసలు తనకిచ్చిన కల్పవృక్ష సుమమాలను దారిలో కనబడిన ఇంద్రునికి బహూకరించెను. అతడు రాజసముచే తానెక్కిన ఐరావతము మెడలోనికి దానిని విసరివైచెను. ఆ యేనుగు ఆ మాలను కాలితో నలిపివైచెను. అంతట నా ముక్కోపి (ముందు కోపము తరువాత అనుగ్రహము చూపు మహానుభావుడు) 'నీవేకాదు నీ యేల్బడిలోనున్న దేవతలందరును అశాంతులే కావున మీరందఱును అభాగ్యులు గండు' అని ఇంద్రుని శపించెను.

**శాపేన ప్రథితజరే ఽథ నిర్జరేంద్రే**
**దేవేష్వప్యసురజితేషు నిష్ప్రభేషు,**
**శర్వాద్యాః కమలజ మేత్య సర్వదేవా**
**నిర్వాణప్రభవ సమం భవంత మాపుః. 2**

**అమరవిభుండు నష్టశుభుఁడై ముదిమిం బడె, శాపదగ్ధులై**
**రమరు లరాతి నిర్జితులునై విగతద్యుతులైరి, శంకర**
**ప్రముఖులు నంతటం గదలి బ్రహ్మనుజూచి; రతండు వారునున్**
**విమల భవద్వైకుంఠపుర వీథికి నిన్ గనవచ్చి రచ్యుతా!**

దేవేంద్రుడు శుభములను బాసెను. పైని వార్ధక్యము వడసెను. దేవతలు శత్రుల కోడిపోయి ప్రభ తగ్గిపోయిరి. శంకరాదులు బ్రహ్మను జూచిరి. అతడును వారును, స్వామి! వైకుంఠమునకు నీ దర్శనార్థ మేగిరి.

**బ్రహ్మాద్యైః స్తుతమహిమా చిరం తదానీం**
**ప్రాదుష్యన్ వరద పురః పరేణ ధామ్నా,**
**హే దేవా దితిజకులై ర్విధాయ సంధిం**
**పీయూషం పరిమథతేతి పర్యశా స్త్వమ్. 3**

**నిను బ్రహ్మాదు లనేకకాలము గుణానీక మ్మనేకమ్ముగాఁ**
**గొనియాడన్, గొనియాడరాని వెలుఁగై గోవింద! సాక్షాత్కృతిఁ**

జనవుం గూరిచి 'దేవతల్ దితిజులున్ సంధానమై కవ్వముం
గొని ద్రచ్చుం డమృతాన్న మక్కడలి మీకున్ లభ్యమౌ' నంచనన్.

బ్రహ్మాదిదేవతలు పెక్కుకాలము నీ గుణములం గొనియాడగా, నీ వర్ణనాతీతమయిన వెలుగుతో సాక్షాత్కరించి, 'దేవాసురులు కలిసి సముద్రముం దఱువుడు. అందు అమృతము లభించు'నని యానతిచ్చితివి.

సంధానం కృతవతి దానవై స్సురౌఘే
మంథానం నయతి మదేన మందరాద్రిమ్,
భ్రష్టేఽస్మిన్ బదరమివోద్వహన్ ఖగేంద్రే
సద్యస్త్వం వినిహితవాన్ పయఃపయోధౌ. 4

అటు లమృతాశనుల్ గదలి యప్పలలాశనకోటితోడ నొ
క్కటియయి మందరాద్రి పెనుగవ్వముగాఁ గొనివచ్చు దారిలోఁ
జటుకున జారిపో నుభయ సంఘము లార్వఁగ, రేగుపండు ము
చ్చటగ ఖగేంద్రుపై నిడి వెసన్ గొనివచ్చితి వన్నగేంద్రమున్.

నీ చెప్పినట్లు అయ్యిద్దరు గూడి కవ్వముగా మందరపర్వతముం గొని వచ్చుచుండగా, దారిలో నది జారిపోగా వారు మొఱ్ఱో అని ఘోషింపగా, కరబదరమట్లు (అరచేత రేగుపండట్లు) దానినెత్తి గరుత్మంతునిపై నిడికొని వచ్చితివి.

ఆదాయ ద్రుత మథ వాసుకిం వరత్రాం
పాథోధౌ వినిహితసర్వబీజజాలే,
ప్రారబ్ధే మథనవిధౌ సురాసురైస్తై
ర్వ్యాజాత్త్వం భుజగముఖే ఽకరో త్సురారీన్. 5

వడిఁ దరిత్రాడు సేసికొని వాసుకి వాసికి మీఱఁ ద్రచ్చి ర
క్కడలి నశేష బీజములు గ్రాలగ; మున్దలగొన్న వేలుపుల్
బడలు వడంగఁ, గొండొక నెపమ్మిడి యా తలతోక మార్చి నా
వడలి విషాగ్నిదాకి నివురై రటుపైఁ దలకొన్న రక్కసుల్.

పన్నగేంద్రుడగు వాసుకిని అన్నగేంద్రమునకు కవ్వముత్రాడుచేసి వారిర్వురు సర్వౌషధ బీజ నివాసమైన సాగరముం ద్రచ్చిరి. ఆ తఱచునపుడు ఇంద్రుడు దేవతలతో తోక అమంగళమని చెప్ప, వారు తలవైపు పట్టుకొనిరి. అంత కొంత సేపటికి వాసుకి యలిగి విషజ్వాలలను గ్రక్క మొదలిడెను. అప్పుడుపాయము సెప్పి నీవు వారిలో పొరుపులు పెట్టి, అనగా మేము నీచమైన తోక ఏల పట్టవలె నని రాక్షసులచేతనే యనిపించి,వారిని తోకనుండి తలకు మార్చి విషాగ్ని పాల్సేసి కొందరిని మట్టుపెట్టినావు. దేవతలను సురక్షితులను జేసినావు.

క్షుబ్ధాద్రౌ క్షుభితజలోదరే తదానీం
దుగ్ధాబ్ధౌ గురుతర భారతో నిమగ్నే,
దేవేషు వ్యథితతమేషు తత్ప్రియైషీ
ప్రాణైషీః కమఠతనుం కఠోరపృష్ఠామ్. 6

గుభులుగుభుల్లటంచుఁ బరిఘూర్ణిత దుగ్ధపయోధి నిర్భరా
రభటి నభమ్ము దాకికొనఁ ద్రచ్చగఁ, గవ్వపుకొండ క్రిందికిఁ
రభసమునన్ దిగంబడ, సురల్ బెదరన్, దనువూనినావు దు
ర్లభము కఠోరపృష్ఠ చటుల ప్రభమున్ గమఠాభమున్ హరీ!

ఉభయులు సముద్రముం దఱువగా గుభులుగుభుల్లుమను ధ్వని యాకస మంటెను. అంతలో గవ్వము (మందరాద్రి) క్రిందికి దిగబడిపోయెను. దేవతలు గ్రుంగిపోయిరి. అప్పుడు కఠోరమగు వెనుడిప్పతో నద్భుత ప్రభతో కూర్మావతారము ధరించితివి.

వజ్రాతిస్థిరతర కర్పరేణ విష్ణో
విస్తారా త్పరిగత లక్షయోజనేన,
అంభోధేః కుహరగతేన వర్ష్మణా త్వం
నిర్మగ్నం క్షితిధరనాథ మున్నినేథ. 7

నీ వెనుగాడి వజ్రకఠినీకృతమై, మఱి లక్ష యోజన
మ్మై వెలుఁగొంద నబ్ధికుహరావృత దీర్ఘ వపుఃప్రభావ సం

**భావన నుద్ధరించితివి మందరపర్వత మీా వఖర్వ లీ**
**లావలమాన సంభ్రమ కలా కమనీయ కలాయకోమలా!**

లక్ష యోజనముల వెఱవైన రూపముతో నీ వజ్రకఠినమైన వెనుడిప్పపై నా మందరపర్వతమును బూని ఆనించి పైకెత్తితివి. ఇదంతయు నీకు లీలా మాత్రము.

**ఉన్మగ్నే ఝటితి తదా ధరాధరేంద్రే**
**నిర్మేథు ర్దృఢ మిహ సమ్మదేన సర్వే,**
**ఆవిశ్య ద్వితయగణేఽపి సర్పరాజే**
**వైవశ్యం పరిశమయ న్న వీవృధ స్తాన్.** **8**

**అటు ఝటితి ప్రకారమున నా గిరి నెత్తిన, నెత్తికొన్న త**
**చ్చటుల సుఖాతిరేకమున సర్వులు పొంగిరి; పొంగిపోయి నీ**
**వట నిరువంకలందు నురగాధిపులో శ్రమమెల్ల వాప న**
**ప్పటికి సముద్రమున్ వెడలి వచ్చితి ముచ్చటగొల్పు చెల్వునన్.**

తటుకున నీ వా గిరి యెత్తగా నతిశయించిన సుఖముగ్గొని యాయందఱు నుప్పొంగిరి. రాపిడిచే నలిగి మిగుల శ్రమించియున్న వాసుకి సేదదేర్చుటకు సముద్రము వెడలి ముచ్చటైన మూర్తితో నీవు వెలికి వచ్చితివి.

**ఉద్దామభ్రమణ జవోన్నమ ద్గిరీంద్ర**
**న్యస్తైక స్థిరతర హస్తపంకజం త్వామ్,**
**అభ్రాంతే విధిగిరిశాదయః ప్రమోదా**
**దుద్భ్రాంతా నునువు రుపాత్తపుష్పవర్షాః.** **9**

**గిరగిర బొంగరమ్మటులఁ గ్రీడగఁ ద్రిప్పుచుఁ గేలుఁదామరన్**
**బిరబిర మందరమ్ము నెగమీటుచు వచ్చిన నిన్నుఁ జూచుచున్**
**జరచర న వ్వియచ్చరులు సారసగర్భ గిరీశముఖ్యు ల**
**య్యరవునఁ బుష్పవృష్టి గురియించిరి నించిన వేడ్కఁ బాడుచున్.**

నీ కరపద్మమునం బూని మందరము నెత్తి బొంగరమట్లు త్రిప్పుచు మీదికి వచ్చిన నిన్ను జూచి బ్రహ్మయు శివుడు మున్నుగాగల దేవతలు నిన్ను గీర్తించుచు దివ్యకుసుమవృష్టి గురియించిరి.

దైత్యౌఘే భుజగముఖానిలేన తప్తే
తేనైవ త్రిదశకులేఽపి కించిదార్తే,
కారుణ్యాత్తవ కిల దేవ వారివాహాః
ప్రావర్షన్నమరగణాన్న దైత్యసంఘాన్. 10

భుగభుగలాడు తద్భుజగ ఫూత్కృత ఘోరవిషానల ప్రభన్
బగబగ మాడిపోవు సురవైరులపై నొక చిన్కు లేదుపో
సగము సగమ్ముగా నుడుకు సర్వసుపర్వులమీఁద గుండ పోత
తఁగ గురిసెన్ భవత్కృప సుధారసపర్వ మొనర్చి యయ్యెడన్.

ఆ సర్పరాజు ముఖములందు భుగభుగమని వెడలు ఫూత్కారములతోడి విషాగ్నిప్రభలకు మాడిపోవు రాక్షసులపై నీ కురియించిన అమృతవర్ష మొక్క చినుకైన పడదయ్యెను. సగము సగముడికిన దేవతలపై నది కుండపోతగ కురిసినది. ఆ కురిసినది తండ్రీ! నీ కృపామృతధారాపూరమే కాని, వట్టి జలపూరము కాదు.

ఉద్భ్రామ్య ద్బహుతిమి నక్రచక్రవాలే
తత్రాబ్ధౌ చిరమథితేఽపి నిర్వికారే,
ఏక స్త్వం కరయుగకృష్ట సర్పరాజ
స్సంరాజన్ పవనపురేశ! పాహి రోగాత్. 11

భ్రామ్య న్నక్ర తిమింగిలాకులిత మభ్రభ్రాంతమై యబ్ధి ని
స్సామ్య ప్రక్రియమై మథింపఁబడి విశ్రాంతస్థితిం బొందె; పా
రమ్యమ్మొంది కరమ్ములందు భుజగేంద్రస్వామి లాలించుచున్
గమ్యుండైతివి కామతాకృతి రుజల్ ఖండింపరారా! హరీ!

తిమి తిమింగిల నక్ర చక్రమెల్ల కలగుండువడ సాగర మువ్వెత్తుగ నాకాశము దాక అనుపమప్రక్రియతో మథింపబడిన సముద్రము విశ్రాంతి

దశనందెను. సంకల్పపరమావధి చేరి నీ హస్తములందాకి పన్నగేంద్రస్వామిని లాలించుచు శ్రమవాపిన ఓ కూర్మావతారమూర్తీ మా వ్యాధిశ్రమ నివారింపుము.

# 28వ దశకము

# లక్ష్మీ స్వయంవరము - అమృతోదయము

గరలం తరలానలం పురస్తా
జ్జలధే రుద్విజగాల కాలకూటమ్,
అమర స్తుతివాద మోదనిఘ్నో
గిరిశ స్తం నిపపౌ భవత్ప్రియార్థమ్. 1

గనగన మండుచుఁ విషము కంధి జనింప గలంగఁ నెల్లరుం,
గని గరళంబు కుత్తుక నెగాదిగగా నటు లుబ్బు లింగఁడా
యన కబళించె నిందుమకుటా! యని వేల్పులు పేర్కొనంగ నౌ
నని, తుహినాద్రి కన్యక యపాంగశుచిస్మిత రోచి చల్లగఁ.

సముద్రమథనమందు మొదట కాలకూటవిషము అగ్నిజ్వాలలను జిమ్ముచు బయలువెడలెను. దేవతల స్తుతులకు నుబ్బి శివుడు నీ ప్రీతికొఱకు ఆ విషమును త్రావెను. అత్తరి గౌరి జగన్మాత గావున కటాక్షములను అచ్చపు చిఱునవ్వు వెన్నెలను జల్లుగా చిలకరించినది.

విమథత్సు సురాసురేషు జాతా
సురభిస్తా మృషిషు న్యధా స్త్రిధామన్,
హయరత్న మభూ దథేభరత్నం
ద్యుతరు శ్చాప్సరస స్సురేషు తాని. 2

సురభి జనించె దానిని ఋషుల్ గొని రీవ యొసంగ, వెండియున్
శరధి సురాసురుల్ దఱువ సామజరత్నము, నశ్వరత్నమున్

సురతరుబృంద మయ్యమరసుందరు లందుదయించి, రప్పు డం
దరిని సురాళి కొన్కగఁ గొనం దయచేసితి వాప్తబంధువై.

సురాసురులు, మఱియు మథింపగా కామధేనువు జన్మించెను. దానిని ఋషులకు అనుగ్రహించితివి. అటుపై అశ్వరత్నమగు ఉచ్చైశ్శ్రవము, గజరత్నమగు ఐరావతము, తరురత్నమగు కల్పవృక్షము, తరుణీరత్నములగు నప్సరసలు, నుదయించిరి. వానిని దేవతలకు ప్రసాదించితివి.

జగదీశ! భవత్పరా తదానీం
కమనీయా కమలా బభూవ దేవీ,
అమలా మవలోక్య యాం విలోల
స్సకలోఽపి స్పృహయాం బభూవ లోకః. 3

కలకల లాడుచున్ గలిమికన్నియ వన్నెలమిన్న నీపయిన్
వలపుల గుల్కు కల్కి యెలనవ్వులతో నటఁదోఁచెనంత న
క్కలుకుమిటారి తళ్కుబెళుకుల్ గని యొండొక చూపులేని చూ
పుల వెలబోసి లోఁగొని రపూర్వ తదీయవిలాస మెల్లరున్.

ఓ జగదీశ్వరా! నీయందే మనస్సుగల సుందరి మహాలక్ష్మి ఆవిర్భవించి నది. ఆమె అతిలోకమోహనమైన యందముగని సకలలోకము మనస్సుపడి కావలెనని కోరిరి.

త్వయి దత్తహృదే తదైవ దేవ్యై
త్రిదశేంద్రో మణిపీఠికాం వ్యతారీత్,
సకలోపహృతాభిషేచనీయై
ఋషయ స్తాం శ్రుతిగీర్భి రభ్యషించన్. 4

ఆగతి నిన్నెకోరు నమృతాగ్రజ నయ్యమరేశ్వరుండు వే
వేగమ దివ్య భర్మ మణిపీఠిక కల్లన దింపె నంతలో
మూగి యశేష మౌనికులముల్ శ్రుతిసూక్తుల నాభిషేచన
శ్రీగదితార్థయుక్తి నభిషేకముసేసిరి చూడ్కి విందుగఁ.

నీయందే మనస్సును సమర్పించిన శ్రీదేవికి దేవేంద్రుడు మణిపీఠము నర్పించెను. అవ్వల నదులు భూదేవి మొదలగువారు కొనివచ్చిన అభిషేక సాధనములచే సువర్ణకుంభములతో మంత్రసమ్మితముగా మహర్షులు మహాలక్ష్మి నభిషేకించిరి.

అభిషేక జలానుపాతి ముగ్ధ
త్వదపాంగై రవభూషితాంగవల్లీమ్,
మణికుండల పీతచేల హార
ప్రముఖై స్తా మమరాదయో ఉస్వభూవన్. 5

ఆ రుచిరాభిషేచన రసానుపతత్త్వదపాంగరోచి రా
పూర తరంగితన్ భువనమోహిని శ్రీలలితాంగి నెల్ల బృం
దారక బృందముల్ మణికనత్కనకాంగదహారకుండలో
దార దుకూలజాల ముపదల్ గొని దీరిచి దిద్ది రత్తిఱిన్.

అభిషేకమైన వెనువెంటనే నీ ముగ్ధమోహన కటాక్షములచే భూషింపబడిన తనువల్లిగల ఆ తల్లిని దేవగణము మణికుండల పీతాంబర హార కంకణ ప్రముఖ భూషణములచే అలంకరించిరి.

వరణస్రజ మాత్తభృంగనాదాం
దధతీ సా కుచకుంభ మందయానా,
పదశింజిత మంజునూపురా త్వాం
కలితవ్రీళవిలాస మాససాద. 6

ఉరులజ్జా లసమాన మాధురికి నింకొక్కింత తోడై పయో
ధర కుంభద్వయిఁ గౌనుదీగ వడఁకన్ దన్వంగి వచ్చెన్ స్వయం
వరమాలా కర సంభ్రమద్భ్రమర శుంభన్మంజు శింజాన నూ
పుర నాదమ్ములు తూర్యనాదములుగాఁ బూఁబోణి నీచెంతకున్.

తుమ్మెదలు ఝుమ్మని మ్రోయుచు పరిమళమునకు మూగుచున్న స్వయంవర పుష్పమాలను జేకొని, కుచకుంభభరమున మెల్లగ నడచుచు పదము లందు మ్రోయు మంజుల మంజీర నాదము శ్రుతి మనోహరము కాగా, సిగ్గు దూగాడ సవిలాసముగా కమలాలయ నీ సన్నిధి కేతెంచెను.

**గిరిశద్రుహిణాది సర్వదేవాన్**
**గుణభాజో ఒప్యవిముక్త దోషలేశాన్,**
**అవమృశ్య సదైవ సర్వరమ్యే**
**నిహితా త్వయ్యనయా ఒపి దివ్యమాలా.** **7**

**అందరునున్ గుణాశ్రయులె యైనను దోషముస్పర్శ లేనివా**
**రిందరుఁగారటంచు గ్రహియించి, విరించి శివాది దేవతా**
**బృందము దాటి నీదు మెడనే వయిచెన్ మణికంకణావళుల్**
**సందడిసేయ నిందుముఖి చక్క స్వయంవర పుష్పమాలికన్**

సదాశివ బ్రహ్మాది దేవతలు గుణవంతులైనను కామక్రోధాది దోషముల స్పర్శలేనివారు కారని విమర్శించి, సర్వగుణ రమ్యుడవై నీ మెడలో మహాలక్ష్మి ఆ దివ్యమాలను అలంకరించినది.

**ఉరసా తరసా మమానితైనాం**
**భువనానాం జననీ మనన్యభావామ్,**
**త్వదురోవిలస త్తదీక్షణశ్రీ**
**పరివృష్ట్యా పరిపుష్టమాస విశ్వమ్.** **8**

**వేగమ నీదువక్షమున విశ్వజగ్జననీమణిఁ గృపా**
**సాగర! గారవించితివి; సాగరకన్య కటాక్ష చంద్రికా**
**శ్రీ గురిపించె నిన్నిటు వరించి, యశేషజగత్కుటుంబినీ**
**యోగము నంది లోకము లహో! పరిపుష్టియు తుష్టి నందగఁ**

అలంకరించినదే తడవుగా నీవు వేవేగ నా భువనజననిని ఉరమ్మునకు జేర్చికొని అనన్యభావయైన ఆ దేవిని లాలించితివి.నీ వక్షస్థలమందున్న ఆ మంగళదేవత యొక్క కరుణాకటాక్షశోభావర్షముచే విశ్వమెల్ల తనిసి పుష్టిచెంది సకల సంపత్సమృద్ధమయ్యెను.

**అతిమోహనవిభ్రమా తదానీం మదయంతీ ఖలు వారుణీ నిరాగాత్,**
**తమసః పదవీ మదా స్త్వ మేనా మతిసమ్మాననయా మహాసురేభ్యః.** **9**

మాదకమై పుట్టె జనో
న్మాదకమై భువన మోహన మ్మపుడు తమో
మేదురమై వారుణి, నీ
వాదృతి లాలించి యిచ్చి తసురుల కదియున్.

అంతట మోహనమైన విలాసముగలిగి లోకమునెల్ల మైమఱపింపజేయు వారుణి జనించెను; తమోగుణమునకు అనగా అజ్ఞానమునకు స్థానమైన ఆ మద్యమును మిగుల సమ్మానించి అసురవర్యుల కిచ్చితివి

**తరుణాంబుద సుందర స్తదా త్వం నను ధన్వంతరి రుత్థితో ఽంబురాశేః,**
**అమృతం కలశే వహన్ కరాభ్యా మఖిలార్తిం హర మారుతాలయేశ! 10**

అంతట లేతమబ్బుతళు కందము గొల్పగఁ బాలవెల్లి ధ
న్వంతరి రూపమై యుదయమంది సుధారసపూర్ణకుంభ మ
త్యంతనఁ ద్వత్కరాంబుజమునందు ధరించి స్ఫురించినావు నీ
వెంత చికిత్సకుండవొ కదే మరుదాలయ! ఆర్తిఁ బాపుమా.

తొలకరి మేఘమట్లు సుందరుడవై నీవు ధన్వంతరి స్వరూపమున హస్తములతో అమృతపూరిత సువర్ణకుంభము నెత్తుకొని సముద్రమునుండి లేచితివి అట్టి నీవు మా బాధలను హరింపుము

# 29వ దశకము

# మోహినీ వేషము

**ఉద్గచ్ఛత స్తవ కరా దమృతం హరత్సు**
**దైత్యేషు తా నశరణా ననునీయ దేవాన్,**
**సద్య స్తిరోదధిథ దేవ భవత్ప్రభావా**
**ద్యుద్యత్స్వయూథ్యకలహా దితిజా బభూవుః. 1**

వచ్చితొ లేదొ నీదు కరపద్మమునం దమృతమ్ము రక్కసుల్
ద్రుచ్చిలిః రంత వెల్ల మొగముల్వాడి వేల్పులు డిల్లవోవగా
నచ్చటనే తిరోహితుఁడ వైతివి నీ మహిమమ్ముచేత బల్
ద్రుచ్చులు దైత్యులెల్లఁ దమలోఁ దమరై తుముఱైరి పోరులన్.

అమృతకుంభముతో దర్శనమిచ్చిన నీ చేతినుండి దైత్యులు అమృతమును హరింపగా, అసహాయులైన దేవతలను ఊరడించి నీవు అప్పుడే అంతర్ధానమైతివి. నీ ప్రభావముచే అనగా మాయశక్తిచే ఆవల రాక్షసులు అన్యోన్య కలహమునకు దిగిరి.

శ్యామాం రుచాఽపి వయసాఽపి తనుం తదానీం
ప్రాప్తోఽసి తుంగ కుచ మండల భంగురాం త్వమ్,
పీయూష కుంభ కలహం పరిముచ్య సర్వే
తృష్ణాకులాః ప్రతియయు స్త్వదురోజకుంభే. 2

హంగగు మేనికాంతి వయసందున శ్యామవనంగ నొప్పి, యు
త్తుంగకుచద్వయిన్ నడుము తూగ నటింపగఁ జూచి దప్పి పెం
పుం గొని సోలి వ్రాలుచు నపూర్వభవత్కుచకుంభవిభ్రమ
మ్ముం గొననెంచి, కాదనిరి పూర్వసుధారస పూర్ణకుంభమున్.

కేవలము శరీరకాంతిచేతనే శ్యామవు కాక - అనగా చామనచాయ మేనిదానవేకాక, వయసుచే శ్యామవై=యౌవనమధ్యస్థవై, ఉత్తుంగకుచమండల భరముచే వినమ్రురాలవై అచట సాక్షాత్కరించితివి. అంతట నందఱును అమృతకుంభ నిమిత్తమైన కలహసంరంభమును విడిచి, నీ కుచకుంభమునెడ దప్పికగొని వ్యాకులతచెందిరి.

కా త్వం మృగాక్షి విభజస్వ సుధా మిమా మి
త్యారూఢ రాగ వివశా నభియాచతోఽ మూన్,
విశ్వస్యతే మయి కథం కులటాఽస్మి దైత్యా
ఇత్యాలపన్నపి సువిశ్వసితా నతానీః. 3

ఓహరిణాక్షి! నీ వెవతవో యమృతమ్మిది పంచుమంచు వ్యా
మోహము సెంది మైమఱచి పొందిక డగ్గరి వేడువారి స
న్నాహము సూచి, వాడవదినన్ నను నమ్మిన నవ్వుబాటు సం
దేహము లేదటంచునె పదింబది నమ్మిక పుచ్చి తందఱన్.

'ఓ మృగాక్షీ! నీ వెవ్వతవు? మా కీ అమృతమును సమముగ పంచి విందుసేయు'మని మోహవివశులై చేరిన వారి దగ్గరకు అల్లనచేరి 'ఓ దైత్యులారా! నా యెడల మీరు నమ్మకముగొనియున్నారుగాని, నేను కులటను,' అని పలికి వారిని దృఢవిశ్వాసము గలవారిగా నొనరించితివి.

మోదాత్ సుధాకలశ మేషు దదత్సు సా త్వం
దుశ్చేష్టితం మమ సహధ్వ మితిబ్రువాణా,
పంక్తిప్రభేద వినివేశిత దేవ దైత్యా
లీలావిలాసగతిభి స్సమధా స్సుధాం తామ్. 4

పాయని పొంగుతో నమృత పాత్రము వారటు తెచ్చి చేతికం
దీయగ, జేఁతగా దబల నే నెది సేయఁగ ఁబోయి యేమిగాఁ
జేయుదునో యటం చొడుపుసేసి వడిన్ గిరిగీసి వేల్పు లా
ప్యాయన మన్నయంతకు నొయారమునన్ సుధ వోసినా వటన్.

వారు సంబరపడి, నీచేతికి అమృతకుంభ మందీయగా 'నే నేదేని పొరపాటు చేసినచో మీరు సహింపవలయు'నని పలుకుచు, దేవ దైత్యులను రెండు పంక్తులుగా కూర్చుండబెట్టి సవిలాస వినోదముగా నీ వమృతమును వడ్డింప నారంభించితివి.

అస్మా స్వియం ప్రణయినీ త్యసురేషు తేషు
జోషం స్థితేష్వథ సమాప్య సుధాం సురేషు,
త్వం భక్తలోక వశగో నిజరూప మేత్య
స్వర్భాను మర్ధ పరిపీతసుధం వ్యలావీః. 5

మనమీఁదన్ వల పెంతయేని కల దిమ్మాన్యాత్మ కంచున్ విలా
సిని నీ వంకనె చూడ రక్కసులు, నిశ్శేషమ్ము గావింప నీ

**జనమం దయ్యమృతమ్ము పంచి, నిజ పక్షమ్మౌని నీ రూపుతోఁ**
**జని స్వర్భానుని వ్రక్కలించితి సుధన్ సాఁజాల్గొనన్ దిగ్గనన్.**

అసురులు 'ఈమెకు మనయెడ అనురాగ మెక్కువ. ఓహో! మనభాగ్యము పండినది. మనల నీమె మోసపుచ్చదు'. అని కిక్కురు మనకుండ కూర్చుండగా, నీవు భక్తలోకసులభుడవు గావున అమృతమెల్ల దేవతలకు పంచి, నిజరూపము వహించి, దేవతల రూపొంది అమృతము సగము ద్రావిన రాహువు శిరస్సును చక్రాయుధముచే ఖండించితివి.

**త్వత్త స్సుధా హరణయోగ్య ఫలం పరేషు**
**దత్వా గతే త్వయి సురైః ఖలు తే వ్యగృహ్ణన్,**
**ఘోరేఽథ మూర్ఛతి రణే బలిదైత్య మాయా**
**వ్యామోహితే సురగణే త్వ మిహావిరాసీః. 6**

**'శ్రమ మెల్లన్ మనదై, ఫల మ్మిదిరిదై సర్వస్వమున్ బోయె' నం**
**చమరశ్రేణి నెదిర్చి రయ్యసురు, లయ్యేదేవసంఘాత మె**
**ల్ల మునింగెన్ బలి మాయలోన, నది యాలక్షించి యయ్యుద్ధరం**
**గమునం దెక్కడినుండి వచ్చితివొ సాక్షాత్కార మైనా వటన్.**

అమృతసంపాదన ఫలము పరుల పాలుసేసి నీవు వెడలిన తరువాత అసురులు సురలతో తలపడిరి. ఇరువురకు ఘోరయుద్ధము జరిగెను. బలిదైత్యుని మాయచే అమరులు మూర్ఛపడగా నీవు ప్రత్యక్షమైతివి.

**త్వం కాలనేమి మథ మాలిముఖాన్ జఘంథ**
**శక్రో జఘాన బలిజంభబలాన్ సపాకాన్,**
**శుష్కార్ద్ర దుష్కరవధే నముచౌ చ లూనే**
**ఫేనేన నారదగిరా న్యరుణో రణం త్వమ్. 7**

**ఈవట కాలనేమి వధియించితి మాలిముఖాసురావళిన్**
**జావునఁ బుచ్చి, పాకు, బలి, జంభు, బలున్ మఱి యింద్రుడేచి య,**
**చ్చో వధియించె, నన్నముచి శుష్కము నార్ద్రము గాని నుర్వుచే,**
**నావల యుద్ధ మాపితి వయారె! యొయారివి నారదోక్తులన్.**

నీ వటుపై కాలనేమిని, మాలి మొదలైన రాక్షసులను సంహరించితివి. ఇంద్రుడు బలి, జంభ, బలులనెడు రాక్షసులను సంతానముతో గూడ సంహరించెను. శుష్కము, ఆర్ద్రమునైన ఆయుధమునకు దేనికిని చావని నముచిని శుష్కార్ద్రమగు నురుగుచే సంహరింపజేసి, బ్రహ్మపంపున వచ్చిన నారదుని మాటవలన యుద్ధము విరమించితివి.

యోషావపు ర్దనుజమోహన మాహితం తే
శ్రుత్వా విలోకనకుతూహలవాన్ మహేశః,
భూతై స్సమం గిరిజయా చ గతః పదం తే
స్తుత్వాఽబ్రవీ దభిమతం త్వమథో తిరోధాః. 8

దనుజుల మోహ పెట్టుటకుఁ దాల్చిన నీ నవమోహినీ కళన్
విని, కనఁగోరి భూతములు వెంబడిరా గిరికన్య వెంటరాఁ
జని చని నీదుజాడఁ గని సంస్తవనమ్ము లొనర్చి, కోరికన్
వినిచె ననంగవైరి; వెనువెంటనె నీవు తిరోహితుండవై.

దనుజులను మోహ పెట్టుటకు నీవు మోహినీరూపము నెత్తితివని విని, నిన్ను చూడవలెనను వేడుకగొని, మహేశుడు భూతగణముతో వైకుంఠమునకు వచ్చి అభిమతమెఱింగించి నీ మోహినీరూపమును స్తుతించెను. ఆపైని నీ వంతర్ధానమైతివి.

ఆరామసీమని చ కందుకఘాతలీలా
లోలాయమాన నయనాం కమనీం మనోజ్ఞామ్,
త్వా మేష వీక్ష్య విగలద్వసనాం మనోభూ
వేగా దనంగరిపు రంగ! సమాలిలింగ. 9

ఆరామమ్మున బంతి యాడుకొనుచో నాలోల నేత్రాంచల
శ్రీ రాణింపఁగఁ గట్టుచీర దెరలన్ శృంగారభావంబు పొం
గారన్ జేసెడు ని న్ననంగదమనుం డాలింగన క్రీడన
ప్రారంభుండయి యొప్పె మాన్మథ శరవ్యాపార లక్ష్యాత్ముఁడై.

అవ్వల ఉద్యానవనమందు బంతియాడుచు బెదరుచూపులతో మనోహర రూపమున వలువ తొలగియున్న నిన్నుచూచి, అనంగరిపు డయ్యును అంగజుని వేగమునకు వశుడై నిన్ను ఆలింగనము జేసికొనెను.

భూయోఽపి విద్రుతవతీ ముపధావ్య దేవో
వీర్య ప్రమోక్ష వికస త్పరమార్థబోధః,
త్వన్మానిత స్తవ మహత్త్వ మువాచ దేవ్యై
తాదృశ స్త్వమవ వాతనికేతనాథ! 10

**పఱువెత్తెన్ పఱువెత్తు నీ వెనుకనే పద్మాక్ష! ఫాలాక్షుఁడ**
**త్తఱి తేజఃస్ఖలనంబు నొంది పరమార్థస్ఫూర్తియుం గాగ నే**
**డ్తెఱ నీచే నుపలాలితుండగుచు నీ దివ్యానుభావంబు లో**
**తెఱుఁగన్ జెప్పెను దేవి కి త్తెఱఁగు వాఁడీ వేలుకోరా హరీ!**

అటు పరువెత్తుకొని పోవు నీవెంబడి అతడును పరుగిడి రేతఃస్ఖలనము కాగా పరమార్థజ్ఞాన మొంది, నీ చేత సమ్మానితుడయ్యెను. నీ మహిమను గౌరికి ముచ్చటించెను. ఓ గురువాయు మందిర ప్రభూ! నీ వట్టి మహిమగల వాడవు నన్ను రక్షింపుము.

## 30వ దశకము

# వామనావతారము

శక్రేణ సంయతి హతో ఽపి బలి ర్మహాత్మా
శుక్రేణ జీవితతనుః క్రతువర్ధితోఁ ష్మా,
విక్రాంతిమాన్ భయనిలీన సురాంఁ త్రిలోకీం
చక్రే వశే స తవ చక్రముఖా దభీతః. 1

**అనిలో గూలి మహాత్ముడైన బలి దేవాధీశుచే, శుక్రుచేఁ**
**బునరుజ్జీవితుడై, క్రతుప్రతతిఁ బెంపుంగాంచి బల్ విక్రమ**
**మ్మునఁ జక్రాయుధ ధారకుం బెదరకే ముల్లోకముల్ దాన లోఁ**
**గొనియెన్ వేల్పులు మూలమూలల భయోత్కోచమ్ముచే డాగఁగన్.**

బలిచక్రవర్తి ఇంద్రునిచే యుద్ధమందు నిహతుడై శుక్రాచార్యులచే సంజీవితుడై పెంపొంది తన విక్రమముచే చక్రాయుధమునకు గూడ బెదరక ముల్లోకములను స్వాధీనము చేసికొనెను. దేవత లడలి ఎందో దాగుకొనిరి.

పుత్రార్తి దర్శనవశా దదితి ర్విషణ్ణా
తం కాశ్యపం నిజపతిం శరణం ప్రపన్నా,
త్వత్పూజనం తదుదితం హి పయోవ్రతాఖ్యం
సా ద్వాదశాహ మచర త్త్వయి భక్తిపూర్ణా. 2

పనవి కుమారులందరి యవస్థకుఁ గాశ్యపమౌని జీవితే
శుని శరణొంది యయ్యదితి సొంపుగఁజేసెఁ బయోవ్రతాఖ్య మా
యన యెఱిఁగించినట్టుల త్వదర్చనముం బరిపూర్ణ భక్తిభా
వనఁ బది రెండురోజులు శుభస్ఫురణన్ దృఢదీక్ష పెంపునన్.

అదితి తన కుమారుల దురవస్థకు దుఃఖించి తన భర్తయగు కాశ్యపుని శరణొంది యాయనను సేవించి, నీయందలి భక్తితో యాయన చెప్పిన పయోవ్రతమును పండ్రెండు రోజు లాచరించెను.

తస్యావధౌ త్వయి నిలీనమతే రముష్యాః
శ్యామ శ్చతుర్భుజవపు స్స్వయ మావిరాసీః,
నమ్రాం చ తామిహ భవత్తనయో భవేయం
గోప్యం మదీక్షణమితి ప్రలప న్నయాసీః. 3

వ్రతము సమాప్తి యం దదితిభావము నీ మధురస్వరూపమం
దతుకగ శ్యామసుందరుఁడ వౌచుఁ జతుర్భుజుఁడౌచు నీవు తో
చితివి వినమ్రయౌ నదితిచెంత; 'భవత్తనయుండ నయ్యెదన్
సతతము గోప్య మీక్షణము నా'దని యేగితి వాక్షణమ్మునన్.

వ్రతసమాప్తి కాగా యామె మనసు నీ పరమసుందరమూర్తియందు లగ్నము కాగా శ్యామసుందరుడవై నాల్గు హస్తములతో సవినయముగా నామె చెంత సాక్షాత్కరించి 'నీకు నేను తనయుడనై జనింతు'నని చెప్పి 'నీ భర్తయం దీ రూపమున నన్ను భావించి యాయనను బొందు' మని పరమగోప్యముగ తెల్పి యంతర్ధానమైతివి.

త్వం కాశ్యపే తపసి సన్నిదధ త్తదానీం
ప్రాప్తోఽసి గర్భ మదితేః ప్రణుతో విధాత్రా,
ప్రాసూత చ ప్రకటవైష్ణవ దివ్యరూపం
సా ద్వాదశీ శ్రవణపుణ్యదినే భవంతమ్. 4

అవలం గాశ్యపమౌని తీవ్రతపమం దారూఢనిష్ఠం వసిం
ప విరించి స్తుతి మెచ్చి నీ వదితిగర్భంబందు రా దివ్యవై
ష్ణవ రూపుం బ్రసవించె నిం పరమపుణ్యంబైన లగ్నమ్మునం
శ్రవణద్వాదశి నప్పతివ్రత కృపాసర్వస్వరూపా! హరీ!

ఆపై కాశ్యపుడు తీవ్రతపమ్మున కేగగా బ్రహ్మ నిన్ను స్తుతింపగా అదితి గర్భమందు బ్రవేశించితివి. శ్రావణ ద్వాదశినాడు పుణ్యలగ్నమం దా సాధ్వికి వైష్ణవాంశమున శంఖ చక్ర గదా పద్మ కిరీట మకరకుండల శ్రీవత్స కౌస్తుభ వనమాలా పీతాంబర సువర్ణ కాంచీ నూపురాది శుభాభరణ భూషితుడవై యావిర్భవించితివి.

పుణ్యాశ్రమం త మభివర్షతి పుష్పవర్షై
ర్హర్షాకులే సురగణే కృత తూర్యఘోషే,
బద్ధాంజలిం జయజయేతి నుతః పితృభ్యాం
త్వం తత్క్షణే పటుతమం పటురూప మాధాః. 5

అల పుణ్యాశ్రమ వీథి దేవగణముల్ హర్ష ప్రకర్షమ్ములో
నలరన్ నించిరి పుష్పవర్షముల నుద్యత్తూర్య ఘోషమ్ములన్
దలిదండ్రుల్ వినుతించుచున్ జయజయ ధ్వానంబులన్ జేసి యం
జలి గావింపఁగఁ బూనినా వచట సాక్షాద్వామనాకారమున్.

ఆ పుణ్య సమయమందు పుణ్యాశ్రమమందు నీ యవతారము జరిగినపుడు దేవతలు దుందుభులు మ్రోయించి దివ్య కుసుమవర్షమును గురియించిరి. తలిదండ్రులు నిన్ను స్తుతించిరి. నీవు వామనమూర్తివై చూడనొప్పితివి.

తావత్ ప్రజాపతి ముఖై రుపనీయ మౌంజీ
దండాజినాక్షవల యాదిభి రర్చ్యమానః,

దేదీప్యమాన వపు రీశ కృతాగ్ని కార్య
స్త్వం ప్రాస్థిథా బలిగృహం ప్రకృతాశ్వమేధమ్. 6

అజినమ్మున్ మృదుదండ మక్షవలయ మ్మమ్మౌంజి యొక్కొక్కరై
యజముఖ్యుల్ బహుమాన మిచ్చికొనఁగా నయ్యగ్నియున్ వేల్చి య
క్కజముం గొల్పెడి బ్రహ్మతేజమునఁ బ్రస్థానమ్ము గావించినా
వజితశ్రీ ప్రకృతాశ్వమేధము బలీంద్రావాస మల్లల్లనన్.

బ్రహ్మాదిదేవత లొక్కొక్కరు ఒక్కొక్కరుగ బహుమాన మీయ గైకొని తాల్చి, దేదీప్యమాన బ్రహ్మతేజోమూర్తివై వింతగొలిపి యశ్వమేధము చేయుచున్న బలి నివాసమునకు బయలుదేరితివి

కశ్యపప్రజాపతి నీకు ఉపనయనము గావించెను సూర్యభగవానుడు గాయత్రి నుపదేశించెను. బృహస్పతి యజ్ఞోపవీతమును, మీ తండ్రి మౌంజిని, భూమి కృష్ణాజినమును, సోముడు దండమును, అదితి కౌపీనమును, ఆకాశము గొడుగును, బ్రహ్మ కమండలువును, సప్తర్షులు దర్భలను, సరస్వతి అక్షమాలను నీకు కాన్క లిచ్చిరి.

గాత్రేణ భావి మహిమోచిత గౌరవం ప్రా
గ్వ్యావృణ్వతేవ ధరణీం చలయ న్నయాసీః,
ఛత్రం పరోష్మతిరణార్థ మివాదధానో
దండంచ దానవజనేష్వివ సన్నిధాతుమ్. 7

భావి మహత్త్వ వైభవము వ్యాఖ్య యొనర్చుచు మేని గౌరవ
మ్మా వసుధాతలంబు వణఁకింపఁగ శత్రు మహోష్మవారణ
మ్మై విలసిల్లు నా గొడుగు నంది మహాసురదండనార్థమో
నా వెస దండమూని చనినావఁట మున్ బలియజ్ఞ వాటమున్.

నీ శరీర గౌరవముచే (బరువుచే) నీవు పూనగల మహత్తర విశ్వరూపమును వ్యాఖ్యానించుచు భూమండలము వణకగా, శత్రులవలని యుడుకు వారింతునని తెలుపుటకో అన్నట్లు గొడుగు పూని, అసుర దండనమునకో అన్నట్లు చేత దండము పూని, బలి యున్న యజ్ఞవాటమునకు వెళ్లితివి.

**తాం నర్మదోత్తరతటే హయమేధశాలా**
**మాసేదుషి త్వయి రుచా తవ రుద్ధనేత్రై :,**
**భాస్వాన్ కిమేష దహనో ను సనత్కుమారో**
**యోగీ ను కో௨య మితి శుక్రముఖై శ్శశంకే.** **8**

**చని యంతంతట నర్మదోత్తర తటాంచ ద్యజ్ఞశాలాంగణ**
**మ్మున నీవుండ భవత్తనుప్రభల చూపుల్ సంభ్రమింపంగ నీ**
**యన యా భానుఁడొ చిత్రభానుఁడొ సముద్యద్దీప్తి యోగీంద్రుఁడా**
**యనయే యౌను సనత్కుమారుఁడని శంకావిష్టులై రందరున్.**

నర్మదానదీ తటంబున నిర్మింపబడిన యజ్ఞశాల ముందర నీవు నిలువబడిన తఱి నీ నెమ్మేని కాంతులకు చూపులు మిఱుమిట్లుగొన, సూర్యుడో అగ్నియో లేక సనత్కుమారమహాయోగియో వచ్చెనని యందఱు సంశయమందిరి.

**ఆనీత మాశు భృగుభి ర్మహసాభిభూతై**
**స్త్వాం రమ్యరూప మసురః పులకావృతాంగః,**
**భక్త్యా సమేత్య సుకృతీ పరిషిచ్య పాదౌ**
**తత్తోయ మన్వధృత మూర్ధని తీర్థతీర్థమ్.** **9**

**భృగుముఖ్యుల్ భవదద్భుతప్రభలలో వెల్వెల్లనై తోడితే**
**రగ నిన్ మోహనమోహనాకృతి; శరీరమ్మెల్లనున్ బుల్కరిం**
**పగ భక్తిన్ బలి పుణ్యజీవి కడిగెన్ ద్వత్పాదపద్మమ్ములన్**
**దగఁ దత్తీర్థము తీర్థతీర్థము తలన్ దాల్చెన్ దయాసాగరా!**

భృగు ముఖ్యులయిన ఋషులు నీ బ్రహ్మతేజఃపుంజమున వెలవెలవోయి పరమ మోహనరూపుని నిన్ను లోనికిం గొనిపోయిరి. బలిచక్రవర్తి ఎదురువచ్చి శరీరము పుల్కరింపగా భక్తిచే వినమ్రుడై నీ పాదకమలములను ప్రక్షాళనము చేసి నీ పాదతీర్థముం దలపై జల్లుకొనెను.

**ప్రహ్లాదవంశజతయా క్రతుభి ర్ద్విజేషు**
**విశ్వాసతో ను తదిదం దితిజో௨పి లేభే,**

యత్తే పదాంబు గిరిశస్య శిరోభిలాల్యం
స త్వం విభో గురుపురాలయ పాలయేథాః. 10

అటు ప్రహ్లాదుని మన్మడై యుదయమై యజ్ఞమ్ములన్ విప్రులన్
జటులప్రీతి వహించుటన్ గతిన రక్షస్సయ్యునుం బొందె ధూ
ర్జటి జూటాగ్ర కుటీ వటత్సలిలధారా వాహినీరూప మి
ట్లిట నీదౌ చరణామృతాప్లవన; మిట్లీవేలుకోవే ననున్!

ప్రహ్లాదుని మనుమడై యజ్ఞములందు బ్రాహ్మణులయెడ మిక్కిలి ప్రీతి వహించుటవలన క్రూరరాక్షసుడయ్యు శివ జటాజూట మలంకరించిన నీ పాద తీర్థలాభమునకు పాత్రమయ్యెను. ఇట్టి ప్రభావ సంపన్నుడవు స్వామి! గురువాయూరు పురాధీశ్వర! నన్ను పాలింపుము.

## 31వ దశకము

# బలి నిగ్రహము

ప్రీత్యా దైత్య స్తవ తను మహః ప్రేక్షణాత్ సర్వథాఽపి
త్వా మారాధ్య న్నజిత రచయ న్నంజలిం సంజగాద,
మత్తః కిం తే సమభిలషితం విప్రసూనో వద త్వం
వ్యక్తం భక్తం భవన మవనిం వాఽపి సర్వం ప్రదాస్యే. 1

కని దైత్యేంద్రుఁడు త్వత్తనుద్యుతుల కాకంపించి కైవంచి యి
ట్లనియెన్ "నాయెడ నేమి కోరెదవు కుఱ్ఱా! షడ్రసోపేత భో
జనమా, కాంచనమా, మణీభవనమా, సర్వంసహారాజ్య రం
జనమా, స్త్రీజనమా? యెదే నడుగుమా! సందేహమా! నీ" కనెన్.

దైత్యప్రభువు నీ తనుప్రభలకు సంభ్రమించి చేతులు మోడ్చి 'బాలక! నావలన నీకు గావలసినదేమి? ధనమా? షడ్రసోపేత భోజనమా? భవనమా? భూమియా? సర్వము నిచ్చెద నడుగుము, సంశయింపకుము' అని పలికెను.

**తా మక్షీణాం బలిగిర ముపాకర్ణ్య కారుణ్య పూర్ణో౽
ప్యస్యోత్సేకం శమయితుమనా దైత్యవంశం ప్రశంసన్,
భూమిం పాదత్రయ పరిమితాం ప్రార్థయామాసిథ త్వం
సర్వం దేహీతి తు నిగదితే కస్య హాస్యం న వాస్యాత్.** 2

అనినన్ వాని యుదార వాగ్రచన నీ వాలించి వాత్సల్యమున్
గొనియున్ వాని మదమ్ము డించుటకు రక్షోనాథు వంశమ్ము వ
ర్ణనముం జేసి 'పదత్రయ మ్మొసఁగుమన్నా! చాలు'నన్నావు కా
దని సర్వమ్మును నీవయై యడుగ వహ్వా! నవ్వరే యెవ్వరున్.

జగదీశ్వరత్వమును వ్యాఖ్యానించుచున్న యా బలి యుదార వాగ్రచనను విని నిండుకరుణ గలవాడవయ్యు, వాని గర్వము శమింపజేయనెంచి వాని వంశముం గొనియాడుచు, మూడడుగుల భూమినిమ్మని ప్రార్థించితివి. అట్లుగాక సర్వము నిమ్మని యడిగినచో నెవ్వరైన నవ్విపోరా?

**విశ్వేశం మాం త్రిపద మిహ కిం యాచసే బాలిశ స్త్వం
సర్వాం భూమిం వృణు కిమమునే త్యాల పత్త్వాం స దృప్యన్,
యస్మా ద్దర్పా త్త్రిపద పరిపూర్త్యక్షమః క్షేపవాదాన్
బంధం చా సావగమ దతదర్హో౽పి గాఢోపశాంత్యై.** 3

"భువనేశుండను నన్ను మూఁడడుగులా పో వట్టి పిల్లాట లి
య్యవనీచక్రము కోరు మిత్తు"నని తీవ్రౌద్ధత్యముం జూపి, తా
నవి యీనేరక యప్రతిష్ఠపడి తానై ఘోరబంధమ్ములం
దవిలెన్ దాని కనర్హుఁడయ్యుఁ బరమార్థంబైన శాంతింగొనన్.

'విశ్వమునకెల్ల ప్రభుడనైన నన్ను మూడడుగు లిమ్మని యడుగుటా! నీవు తెలివితక్కువవాడవు. దీనిచే నీవేమి చేయుదువు? సర్వభూమండల మడుగుము. ఇచ్చెద'నని దర్పముం జూపెను. ఆ దర్పమునకు ఫలముగానే మూడడుగులు కూడ యీయనేరకయే ఈసడింపులకు గురియై విషయవిరక్తి నంది మనస్సును సమాధానపఱచుకొనుటద్వారా పరమశాంతి (ముక్తి)వడయుటకే బంధనానర్హుడయ్యు బంధింపబడెను.

**పాదత్రయ్యా యది న ముదితో విష్టపైర్నా౽పి తుష్యే
దిత్యుక్తే౽స్మిన్ వరద భవతే దాతుకామో౽థ తోయమ్,**

దైత్యాచార్య స్త్రవ ఖలు పరీక్షార్థినః ప్రేరణా త్త్రం
మా మా దేయం హరిరయ మితి వ్యక్త మేవాబభాషే. 4

ముక్కాలిచ్చినఁ దృప్తి చిక్కదనుకో ముల్లోక మీవచ్చినన్
చిక్కంబోదన నీవు, రాజు మఱి వచ్చెన్ ధారవోయంగ నా
చక్కిన్ శోధనసేయ నీ పనుపునన్ "జాల్చాలు నీవద్దు పొ
మ్మిక్కాన్కన్ హరిసుమ్మితం" డనియె మున్నే తెంచి శుక్రుండటన్.

'మూడడుగులకు సంతుష్టిగలుగదేని ముల్లోకము లిచ్చినను అది గలుగ బోదు'. అని నీవు సంతృప్తిని వెల్లడింపగా బలి భూమిని ధారవోయుటకు రాగా అసురపురోహితుడుగాన, శుక్రాచార్యులు జరుగబోవు విషయమెల్ల చెప్పి 'వలదు వలదు దానమీయవల'దని బలిని పరీక్షింపవచ్చిన నీ ప్రేరణచేతనే వారించెను.

యాచత్యేవం యది సభగవాన్ పూర్ణకామో ఽస్మి సో ఽహం
దాస్యామ్యేవ స్థిరమితి వదన్ కావ్యశప్తో ఽపి దైత్యః,
వింధ్యావల్యా నిజదయితయా దత్త పాద్యాయ తుభ్యం
చిత్రం చిత్రం సకలమపి స ప్రార్పయ త్తోయపూర్వమ్. 5

'భగవంతుం డిటు వచ్చి నన్నడిగె నా భాగ్యమ్ము పండెన్ నిజ
మ్ముగ ముమ్మాటికి నిత్తు' నంచు గురువున్ బోనాడి, శప్తుండునై
తగ వింధ్యావళి ధర్మపత్నియును పాద్యంబీయ రాజన్యమూ
ర్ధగుఁ డిచ్చెన్ తన సర్వమున్ సలిలధారా మంత్ర పూర్వంబుగన్.

'ఈ యాచనకు వచ్చినవాడు భగవంతుడే యని మీరన్నది నిజమగునేని యింతకంటె నాభాగ్యమింకేమియున్నది. ముమ్మాటికిని దాన మిచ్చితీరెదను.' అని గురువుం ధిక్కరించి, యతని శాపమునకు గురియయ్యు, నిజధర్మపత్ని వింధ్యావళి పాద్యంబువోయ, వామనుడగు నీ పాదములు గడిగి సర్వసామ్రాజ్యమును ధారవోసెను.

నిస్సందేహం దితికులపతౌ త్వయ్యశేషార్పణం త
ద్వ్యాతన్వానే ముముచు ఋషయః సామరాః పుష్పవర్షమ్,

దివ్యం రూపం తవ చ తదిదం పశ్యతాం విశ్వభాజా.
ముచ్చై రుచ్చై రవృధ దవధీకృత్య విశ్వాండభాండమ్. 6

అమరస్పర్ధి యశేష మప్పనముసేయన్ సంశయమ్మేది 'తు
భ్యమహం సంప్రదదే వటో! నమమ' యం చన్మాటలోఁ బుష్పవ
ర్షము వర్షించిరి దేవతల్ ఋషులు, నా బ్రహ్మాండ భాండమ్ముగా
నమరెన్ నీదగు దివ్యరూప మది యింతింతౌచు నంతంతయై.

ఆ సర్వస్వదానము చేయుట చూచి దేవతలు ఋషులు పుష్పవర్షమును గురిపించిరి. అంతట విశ్వప్రజానీకము చూచుచుండగానే నీ రూప మింతింతై బ్రహ్మాండ కటాహాంత మవధిగ పెరిగెను.

త్వ త్పాదాగ్రం నిజపదగతం పుండరీకోద్భవో ఽసౌ
కుండీ తోయై రసిచ దపునా త్తజ్జలం విశ్వలోకాన్,
హర్షోత్కర్షాత్ సుబహు ననృతే ఖేచరై రుత్సవే ఽస్మిన్
భేరీం నిఘ్నన్ భువన మచర జ్జాంబవాన్ భక్తిశాలీ. 7

తన లోకమ్మును దాకవచ్చిన భవత్పాదాగ్రమున్ క్షాళనం
బొనరించెన్ విధి కుండికన్ గల జలమ్ముల్ వంచి, యన్నీటఁబా
వనమయ్యెన్ జగముల్, నటించి రమరుల్, బ్రహ్మాండముం జుట్టివ
చ్చెను భక్తాగ్రణి జాంబవంతుఁడు శుభ శ్రీ భేరి మ్రోయించుచున్.

నీ పాదము తనలోకముదాక వచ్చినం గని పద్మభవుండు తన కమండలూదకము వంచి పాదప్రక్షాళనము చేసెను. ఆ పాదోదకము అశేషలోకపావన మయ్యెను. నీ భక్తుడు జాంబవంతుడు ఆనందవివశుడై యీ త్రిభువనదాన మహోత్సవమందు దేవతలతోగూడ భేరి వాయించుచు బ్రహ్మాండముం జుట్టి వచ్చెను. అనగా విశ్వమూర్తివగు నీకు బ్రదక్షిణము చేసెనన్న మాట.

తావద్దైత్యా స్త్వనుమతి మృతే భర్తు రారబ్ధయుద్ధా
దేవోపేతై ర్భువదనుచరై స్సంగతా భంగమాపన్,
కాలాత్మా ఽయం వసతి పురతో యద్వశాత్ ప్రాగ్జితాః స్మః
కిం వో యుద్ధైరితి బలిగిరా తే ఽథ పాతాల మాపుః. 8

**అనీకిన్ జొచ్చిరి రాజు నానతివినా, యందోడి, రా దేవతా**
**జనమున్ నీ జనమెత్తి రాగ, బలి "సాక్షాత్కాలరూపుండ యీ,**
**యన విష్ణుం డిటమున్న యోడితిమికాదా, వీనితో పోరు వ"**
**ద్దనఁ బాతాళముఁ జొచ్చి రంతటన దైత్యానీక మొక్కుమ్మడిన్.**

బలి యాజ్ఞ లేకుండగనే దైత్యులు దేవతలతో, నీ వైకుంఠపరివారముతో యుద్ధమునకు దలపడిరి. కాని 'యీ వామనమూర్తి కాలస్వరూపుడు ఎదుటబడినాడు. ఈయనవలననే మున్ను ఓడిపోయినారము. ఈయనతో యుద్ధము వల'దని బలిచక్రవర్తి చెప్పగా దానవులు పాతాళమునకు బోయిరి.

**పాశై ర్బద్ధం పతగపతినా దైత్య ముచ్చై రవాదీ**
**స్తార్తీయీకం దిశ మమ పదం కిం న విశ్వేశ్వరోఽసి,**
**పాదం మూర్ధ్ని ప్రణయ భగవ న్నిత్యకంపం వదంతం**
**ప్రహ్లాద స్తం స్వయ ముపగతో మానయ న్నస్తవీ త్వామ్. 9**

**అవలన్ గారుడ పాశ బద్ధుఁడగు దైత్యస్వామితో నీవు "మూఁ**
**డవ పాదానకుఁ జోటుచూపు మిఁక బ్రహ్మాండాధిపుండీవ యౌ**
**దువు కాదా" యన నప్రకంప్యమతి నీతో "మూర్ధమందుంపు మా**
**ధవ!"యన్ మన్మని మెచ్చి నిన్పొగడె నంతన్ వచ్చి ప్రహ్లాదుడున్.**

అంతట గారుడపాశబద్ధుడైయున్న ఆ దానవరాజుతో నీవు 'మూడవ పాదమునకు చోటు చూపుము. బ్రహ్మాండమునకు నేనే ప్రభువు నంటివి కాదా!' అన నాతడు చలింపక 'ఇదిగో ఈ నా నడినెత్తిం బెట్టు'మనినంతట ప్రహ్లాదుండు స్వయముగా నటకు విచ్చేసి, మనుమని మెచ్చుకొని నిన్ను గొనియాడెను.

**దర్పోచ్ఛిత్త్యై విహిత మఖిలం దైత్య సిద్ధోఽసి పుణ్యై**
**ర్లోక స్తే ఽస్తు త్రిదివ విజయీ వాసవత్వం చ పశ్చాత్,**
**మత్సాయుజ్యం భజ చ పునరిత్యన్వగృహ్ణా బలిం తం**
**విప్రై స్సంతానిత మఖవరః పాహి వాతాలయేశ! 10**

**"నీ దర్పమ్ము హరించినాము బలి! యింతే, పుణ్య సిద్ధుండ వ**
**య్యా! దేవేశ్వరుఁడౌదు వీ పయిన స్వర్గాతీతలోకమ్ము నో**

**హో! దైవారు;భజింతు వా పయిని సాయుజ్యమ్ము"నంచున్ మఖ**
**శ్రీ దీక్షా పరిపూర్తి ఋత్విజులచే చేయించినా వీశ్వరా!**

'బలీ! నీ గర్వపరిహారమునకే యింత చేసినారము. నీవు పుణ్యసిద్ధుడవు. స్వర్గాధికమైన పుణ్యలోకము ఇంద్రత్వమును నీకు ఇక ముందు కలుగుగాక! ఆవల నా సాయుజ్యముంగూడ బడయుదువుగాక!' అని యా బలి ననుగ్రహించి యాతడారంభించిన యజ్ఞమును ఋత్విజులచే బూర్తిచేయించితివి. ఓ గురువాయూరు నారాయణప్రభూ! నన్ను రక్షింపుము.

# 32వ దశకము

# మత్స్యావతారము

**పురా హయగ్రీవ మహాసురేణ షష్ఠాంతరాంతోద్య దజాండకల్పే,**
**నిద్రోన్ముఖబ్రహ్మముఖాద్ధృతేషు వేదేష్వధిత్సః కిల మత్స్యరూపమ్. 1**

**బ్రహ్మ యాఱవకల్పమ్ము పవటివేళ**
**దాటి నిద్రోన్ముఖుండైన, తన్ముఖంబు**
**నుండి శ్రుతుల హయగ్రీవు డొక్క యసుర**
**ముచ్చిలన్ మత్స్యరూపమున్ బూనినావు.**

మునుపు బ్రహ్మయొక్క యాఱవకల్పమయిన చాక్షుషమన్వంతరము పగటి చివర అవాంతరకల్పమందు బ్రహ్మ నిదురింపబోగా నాతని ముఖమందున్న శ్రుతులను హయగ్రీవుడను నొక్క రాక్షసుడు హరింప, వానిందెచ్చుటకు మత్స్యావతార మెత్తితివి.

**సత్యవ్రతస్య ద్రమిడాధిభర్తు ర్నదీజలే తర్పయత స్తదానీమ్,**
**కరాంజలౌ సంజ్వలితాకృతి స్త్వ మదృశ్యథాః కశ్చన బాలమీనః. 2**

**ద్రమిళ దేశేశ్వరుండు సత్యవ్రతుండు**
**నదిని తర్పణమొనరింప సదమల ప్ర**

**భాతి శయమొప్ప నొక చిన్ని బాలమీన**
**మిది యనన్ వాని దోయిటన్ మెదలినావు.**

ద్రమిలదేశాధిపతి సత్యవ్రతుండు నదీజలములందు తర్పణము చేయుచుండగా విమలకాంతిపుంజమును జిమ్ముచు నొక చిన్ని బాలమీనమై యాతని దోసిలిలో మెదలుచు దర్శనమిచ్చినావు.

**క్షిప్తం జలే త్వాం చకితం విలోక్య నిన్యేఽంబుపాత్రేణ మునిః స్వగేహమ్,**
**స్వల్పై రహోభిః కలశీం చ కూపం వాపీం సర శ్చానశిషే విభో త్వమ్. 3**

**నీట నిడ మిట్టిపడఁజూచి నిన్ను పాత్ర**
**మందుకొని యింటికేతేర, నంత కంత**
**కడరి యంతంతగా నూతియందుఁ జెఱ్వు**
**నందు నిముడని మహిమ నీ వొందినావు.**

అతడు తటుకున నీటిలో నిడి మిట్టిపడు నిన్ను తన పాత్రమందుంచికొని యింటికేగ నదియుం బట్టక నూతియందు చెఱ్వునందు వరుసగా విడువగా నిముడక నీమహిమ చూపినావు.

**యోగప్రభావా ద్భవదాజ్ఞయైవ నీత స్తతస్త్వం మునినా పయోధిమ్,**
**పృష్టోఽమునా కల్పదిదృక్షు మేనం సప్తాహ మాస్వేతి వద న్యయాసీః. 4**

**యోగమహిమను నీదు నియోగమునను**
**నతఁడు నిన్ను సముద్రమం దవతరింపఁ**
**జేసి కల్ప నిరీక్షణ సేయ నతని**
**నిలిపినావందు సప్తాహ నియతి సేసి.**

ఆ రాజర్షి యోగశక్తిచే నీ యాజ్ఞతోనే కొనిపోయి సముద్రమందు వదలి, అతని ప్రార్థనచే కల్పాంతమున కెదురుచూచు నాతని నేడుదినము లవధి పెట్టి యక్కడనే నిలిపినావు.

**ప్రాప్తే త్వదుక్తే ఽహని వారిధారాపరిప్లుతే భూమితలే మునీంద్రః,**
**సప్తర్షిభి స్సార్ధ మపారవారి ణ్యుద్ఘూర్ణమాన శ్శరణం యయౌ త్వామ్. 5**

**ఈవు తెల్పిన రోజు రా, నెలమి బంతి**
**లీల పెనునీట నిన్నేల తేలిపోవ,**
**నీది రాజర్షి సప్తర్షులెల్ల తనకుఁ**
**దోడురా నిన్ను శరణొందెఁ దోయజాక్ష.**

నీ తెల్పిన రోజు రాగా, ఈ భూమి యా సముద్రమునీట బంతివలె తేలిపోగా సప్తర్షులు తోడురాగా నా రాజర్షి యా సముద్రమిాది నిన్ను శరణుజొచ్చెను.

**ధరాం త్వదాదేశకరీ మవాప్తాం నౌరూపిణీ మారురుహు స్తదా తే,**
**తత్కంప కంప్రేషు చ తేషు భూయ స్త్వ మంబుధే రావిరభూ ర్మహీయాన్. 6**

**వారు నీ యాన నియ్యేల్ల ధారుణియును**
**నోడయై తేల, దానిపై కురికినారు,**
**ఓడయూగఁగ దానితో నూగినారు,**
**కడలి యంతట నీవయై కదలినారు.**

నీ యాజ్ఞచే నీ భూమి ఓడరూపమంది ప్రళయసాగరమందు ఊగుచుండగా వారును నూగిపోయినారు. అంతలో నీ వా సముద్రమంతయు నావరింపగా.

**ఝషాకృతిం యోజనలక్షదీర్ఘాం దధాన ముచ్చైస్తర తేజసం త్వామ్,**
**నిరీక్ష్య తుష్టా మునయ స్త్వదుక్త్యా త్వత్తుంగశృంగే తరణిం బబంధుః. 7**

**అచట నిన్ లక్షయోజనాయతునిఁ జూచి,**
**ఎలమి మత్స్యాకృతిం దళ్కు బెళుకు కులుకు**
**నిన్ను మునికోటి నుతియించి నీదు నాజ్ఞ**
**నీదు కొమ్మున నోడ బంధించినారు.**

లక్ష యోజనముల నెఱవు గల్గియున్న మహామత్స్యమును నిన్నుజూచి, నీ తళుకు బెళుకులు గని మునికోటి నిన్ను బొగడుచు, నీకొమ్మునందు భూరూపమైన యానౌకను గట్టినారు.

**ఆకృష్టనౌకో మునిమండలాయ ప్రదర్శయన్ విశ్వజగద్విభాగాన్,**
**సంస్తూయమానో నృపవరేణ తేన జ్ఞానం పరం చోపదిశ న్నచారీః. 8**

నౌకనడపుచు మునిజనానీకమున కు
దార విశ్వవిభాగ సౌందర్య దర్శ
నమ్ముఁ గూరిచి జ్ఞానబోధ మ్మొనర్చి,
నృపుఁడు నిన్నెన్న నట విహరించినావు.

ఆ కట్టిన నౌకను నీవు నడుపుకొనుచుంబోయి సత్యవ్రతునికి, సప్తర్షులకు అశేష విశ్వవిభాగములను జూపించి జ్ఞానోపదేశమొనరించి, సత్యవ్రతునిచే గీర్తింపబడుచు నచట విహరించినావు.

కల్పావధౌ సప్తమునీన్ పురోవత్ ప్రస్థాప్య సత్యవ్రత భూమిపం తమ్
వైవస్వతాఖ్యం మను మాదధానః క్రోధా ద్ధయగ్రీవ మభిద్రుతో ఽభూః. 9

కల్పమవధిని సప్తర్షి గణముఁ బూర్వ
మట్లు నియమించి, సత్యవ్రతాఖ్యు నతని
మనిచి వైవస్వతాఖ్యుఁడౌ మనువు జేసి,
యా హయగ్రీవు నెదిరింప నడరినావు.

కల్పాంతమందు సప్తర్షులను వెనుకటి కల్పమునందువలె నధికారమందు నియమించి, సత్యవ్రతుని రక్షించి యతనిని వైవస్వత మనువుం గావించి, ఆ మీద హయగ్రీవునిపైకి దండెత్తితివి.

స్వతుంగశృంగ క్షతవక్షసం తం నిపాత్య దైత్యం నిగమాన్ గృహీత్వా,
విరించయే ప్రీతహృదే దదానః ప్రభంజనాగారపతే ప్రపాయాః. 10

కొమ్మునన్ వాని రొమ్మునన్ గ్రుమ్మి చీల్చి
కూల్చి యసురను, వేదముల్ గొని విరించి
మెచ్చుకొన నిచ్చినావు సమీరపురవి-
హార! నారాయణా! ప్రోవరార! నన్ను.

నీ కొమ్ముచే వానిరొమ్ముంగొట్టి చీల్చి వానిం గూల్చి, వాడు హరించిన వేదములను గొనివచ్చి బ్రహ్మ కిచ్చితివి. ఓ గురువాయూరపుర విహార! నన్ను బ్రోవుము.

# 33వ దశకము

# అంబరీషోపాఖ్యానము

వైవస్వతాఖ్యమను పుత్ర నభాగజాత
నాభాగనామక నరేంద్రసుతో ఽంబరీషః,
సప్తార్ణవావృత మహీ దయితో ఽపి రేమే
త్వత్సంగిషు త్వయి చ మగ్నమనా స్సదైవ. 1

అల వైవస్వతపుత్రుఁ డొప్పెను నభాగాఖ్యుండు, తత్పౌత్రుఁడై
యలఘుప్రాభవుఁ డంబరీషుఁడన సప్తాంభోధి పర్యాప్త భూ
వలయ మ్మేలుచు నీ పయిన్ మఱియు నీ భక్తాళిపై భక్తి తుం
దిలుడై రాజస మింత లేక యలరెన్ దేవా! చిదానందియై.

వైవస్వతమనువు కుమారుడు నభాగుడు. వానికుమారుడు నాభాగుడు. అతని తనయుడు అంబరీషుడు. సప్త సముద్రావృతమైన భూమండలము నేలు సార్వభౌముడయ్యు సర్వభువనాధిపతివగు నీ యందు, నీభక్తులందును భక్తిగలవాడయి ఆనందభరితుడై యుండెను.

త్వత్ప్రీతయే సకలమేవ వితన్వతో ఽస్య
భక్త్యైవ దేవ నచిరా దభృథాః ప్రసాదమ్,
యే నాస్య యాచన మృతే ఽ ప్యభిరక్షణార్థం
చక్రం భవాన్ ప్రవితతార సహస్రధారమ్. 2

నీ కైంకర్య మొనర్చుచున్ తను ధనానీకంబు నీదన్న యా
లోకారాధ్యుని మీఁద నీదగు కృపాలోకమ్ముల న్నించి, తా
నై కామింపక యున్నఁ బంపితివి రక్షార్థంబు రక్షోజనా
నీక క్రూరపరాక్రమ క్రమభిదా నిర్వక్రమున్ జక్రమున్.

లౌకిక వైదిక కర్మకలాపమంతయు నీ ప్రీత్యై యొనర్చుచు త్రికరణములు నీ కర్పించిన యాయనపై నీ వనుగ్రహముపూని, అతడడుగకున్నను రక్షణకొఱకు నీ సహస్రధారమయిన చక్రాయుధమును దయచేసితివి.

స ద్వాదశీవ్రత మథో భవదర్చనార్థం
వర్షం దధౌ మధువనే యమునోపకంఠే,
పత్న్యా సమం సుమనసా మహతీం వితన్వన్
పూజాం ద్విజేషు విసృజన్ పశుషష్టికోటిమ్. 3

అఱువదికోటి గోవుల ద్విజాళి కొసంగి ముకుందు నర్చనల్
నెఱపుచు ధర్మపత్ని తననీడగ నీడది లేనియట్లుగా
జఱపెను ద్వాదశీవ్రతము చారు కళిందమునీంద్రకన్య దా
నొఱసెడు నమ్మహామధువనోర్వి నొకానొక యే డగర్వియై.

ద్వాదశీవ్రతము పూని యొక్క సంవత్సరము యమునాతీరమందలి మధువనమున భక్తురాలగు పత్నితో నెఱపుచు నిన్ను సర్వోపచార సమృద్ధముగా నర్చించుచు నఱువది కోటి గోవులను బ్రాహ్మణులకు దానము చేసెను

తత్రాఽథ పారణదినే భవదర్చనాంతే
దుర్వాససాఽస్య మునినా భవనం ప్రపేదే,
భోక్తుం వృతశ్చ స నృపేణ పరార్తిశీలో
మందం జగామ యమునాం నియమాన్ విధాస్యన్. 4

అటుపై ద్వాదశి పారణమ్ముతఱి నీ యర్చావసానమ్మునన్
జటి దుర్వాసుఁడు వచ్చెఁ దా నతిథియై, సర్వంసహానేత ము
చ్చటగా వేడగ దేవతార్చన కనుష్ఠానార్థియై యేగె, నం
తటఁ గాళిందికి మెల్లమెల్లఁగా బరాంతస్తాపనుం డయ్యెడన్.

వ్రతోద్యాపన సమయమున ద్వాదశిపారణము చేయబోవువేళకు దుర్వాసోమహర్షి యతిథియై వచ్చి 'దేవతార్చనకు దయచేయు'డని యా నృపునిచే నర్థింపబడి స్నానాద్యనుష్ఠానమునకు కాళిందీనది కేగెను.

రాజ్ఞాఽథ పారణముహూర్తసమాప్తి ఖేదాత్
వారైవ పారణ మకారి భవత్పరేణ,
ప్రాప్తో ముని స్తదథ దివ్యదృశా విజానన్,
క్షిప్యన్ క్రుధోద్ధృతజటో వితతాన కృత్యామ్. 5

**రా రే వేళకుఁ, బారణార్హ సుముహూర్త మ్మేగునో యంచుఁడా,**
**నీరుం గ్రోలెను భక్తమౌళి; మఱి రానే వచ్చె, దివ్యేక్షణ**
**స్మేరుండై ముని చండకోపనుఁడు వ్రాల్చెన్ గృత్య నుద్యత్క్రుధా**
**స్ఫారోదార సముద్ధృత స్ఫుట జటాభారోద్ధతిన్ దూల్చుచున్.**

వెళ్ళినవా డెంతకు రాకున్న ద్వాదశీ పుణ్యఘటికలు దాటిపోవునని భక్తశిరోమణి అంబరీషుడు తీర్థమాత్ర ప్రాశనమున ద్వాదశిపారణ చేయగా, నది దివ్యదృష్టిచే గ్రహించి, వచ్చి క్రుద్ధుడై జట పెరికి కృత్యయను శక్తిని సృష్టించి యాప్రభువుపైకి పంపెను.

**కృత్యాం చ తా మసిధరాం భువనం దహంతీ**
**మగ్రేఽభివీక్ష్య నృపతి ర్నపదా చ్చకంపే,**
**త్వద్భక్త బాధ మభివీక్ష్య సుదర్శనం తే**
**కృత్యానలం శలభయ న్మని మన్వధావీత్.** 6

**అసిధారాస్ఫుట జిహ్వికాజ్వలన నిర్యజ్జ్వాలలన్ లోకమున్**
**మసిసేయం జను కృత్యఁ గాంచి యడుగైనంబోని యా సాధు న**
**య్యసహాయస్థితి నెంచి వచ్చిపడె నుద్యద్దివ్యచక్రమ్ము తా**
**పసువెంటం బడె నందు కృత్య శలభప్రాయమ్మునై గ్రగ్గగన్.**

కత్తియంచువలె పదునైన నాలుక లల్లార్చుచు నగ్నిజ్వాలలం జిమ్ముచు భువనముల దహింపనున్న యా కృత్యం గని ఒక్క యడుగైన కదలక ధీరుడై నిలచిన యా సాధువుంగని నీ సుదర్శన చక్రాయుధ మా కృత్యాగ్ని తన తేజస్సులో మిడుతయై నశించునట్లు మునివెంటబడి తఱిమెను.

**ధావ న్నశేషభువనేషు భియా స పశ్యన్**
**విశ్వత్ర చక్రమపి తే గతవాన్ విరించమ్,**
**కః కాలచక్ర మతిలంఘయతీత్యపాస్తః**
**శర్వం యయౌ; స చ భవంత మవందతైవ.** 7

**వెనువెంటంబడు చక్రముం గని భయావేశమ్మునన్ బద్మగ**
**ర్భుని జేరం జనఁ, గాలచక్ర మిది యేమో గర్భనిర్భేదన**

**మ్మని మృత్యుంజయు డాయఁబో, నతఁడు సాష్టాంగంబు సాక్షాత్సుద**
**ర్శన దివ్యాయుధ దర్శనాన కనియెన్; రాఁ డడ్డమై యొక్కఁడున్.**

వెంటబడి తఱుముచున్న యా విష్ణుచక్రమునకు వెఱచి యమ్ముని సర్వ భువనములుం బఱుగులెత్తి బ్రహ్మాదరి కేగిన నతడు ఈ కాలచక్రము నెవ్వడతిక్రమింపగలడనియె. శివుని శరణంద, నాయన నీ కొక నమస్కారము పెట్టెను. ఒక్కరును అడ్డుపడరైరి.

**భూయో భవన్నిలయ మేత్య మునిం నమంతం**
**ప్రోచే భవా నహ మృషే! నను భక్తదాసః,**
**జ్ఞానం తపశ్చ వినయాన్వితమేవ మాన్యం**
**యా హ్యంబరీష పదమేవ భజేతి భూమన్. 8**

**అటునిటు పారి తుట్టతుద కమ్ముని నిన్నని మ్రొక్కుకొన్న న**
**జ్జటిలునిఁ జూచి "యాశ్రితవశంవదుఁడన్, దపమేని జ్ఞానమే**
**నెటను బ్రపత్తితోన గడియించుఁ బ్రతిష్ఠను; అంబరీషుఁడు**
**న్నట కటువోయి యాతని పదాంబుజమున్ శరణందుమా" యిఁకన్.**

అందందు పరువులెత్తి తుద కమ్ముని నీ సదనమైన వైకుంఠమునకు రాగా 'నా జడదారికి నీవు నేను నా దాసులకు దాసుడను. తపస్సుగాని జ్ఞానము గాని వినయముచేతనే రాణించును. అప్పుడే యది నిశ్శ్రేయసమును గూర్చును. ఆ యంబరీషుని పాదములం బట్టుకొను' మని యానతిచ్చితివి.

**తావత్ సమేత్య మునినా స గృహీతపాదో**
**రాజాఽపసృత్య భవదస్త్ర మసా వనౌషీత్,**
**చక్రే గతే ముని రదా దఖిలాశిషోఽస్మై**
**త్వద్భక్తి మాగసి కృతేఽపి కృపాంచ శంసన్. 9**

**అన నీయాన మునీంద్రుఁడా ప్రభుని పాదాబ్జమ్ములం బట్టగాఁ**
**జన, వారించి నృపుండు చక్రమును సంశ్లాఘించి పంపన్ సుద**
**ర్శన మేగెన్; ఋషిరాజమౌళి యట నా రాజర్షిమౌళి క్షమా**
**వినయమ్ముల్ హరిభక్తియుం బొగడి దీవించెన్ సమగ్రమ్ముగన్.**

నీ మాట తలదాల్చి యమ్మునిని అంబరీషుని పాదముల వ్రాలబోగా, నా రాజర్షి యమ్మహర్షిని వారించి, నీ సుదర్శనాయుధరాజమును స్తుతించి అనునయించి పంపగా, నది నీ దరి కేగెను. దుర్వాసుం డా తని యోరిమిని వినయమును విష్ణుభక్తిని బ్రశంసించి ఆశీర్వదించెను.

రాజా ప్రతీక్ష్య ముని మేక సమా మనాశ్వాన్
సంభోజ్య సాధు త మృషిం విసృజన్ ప్రసన్నమ్,
భుక్త్వా స్వయం త్వయి తతోఽపి దృఢం రతోఽభూత్
సాయుజ్య మాప చ; స మాం పవనేశ! పాయాః. 10

రాజటు చూచి చూచి ముని రాకకునై యొక యేడు చిత్తము
ద్వేజనమొంది, నేటి కిటు విందిడి విప్రునిఁ దేర్చి యంపి, తా
భోజన మాచరించె, మునుముంధటికంటె నినున్ భజించి నీ
తో జతగూడె; నన్ను దయతో గనరా! గురువాయుమందిరా!

అంబరీషు డొక్కయేడు జలమాత్రప్రాశనము చేయుచు నమ్మునిని రాకకు ఎదురుతెన్నులు చూచి 'అయ్యో! మహర్షి రాకపోయెనే'యని తపించి యీ నాటి కాయనకు తృప్తిగా విందుచేసి తానును నా ద్విజభుక్తశేష మారగించి ముందటి కంటె నెక్కువ భక్తితో నిన్నారాధించి నీ సాయుజ్య మందెను. గురువాయుదైవమా! నన్ను పాలింపుము.

## 34వ దశకము

# శ్రీరామ చరిత్ర

గీర్వాణై రర్థ్యమానో దశముఖనిధనం కోసలేష్వృశ్యశృంగే
పుత్రీయా మిష్టి మిష్ట్వా దదుషి దశరథక్ష్మాభృతే పాయసాగ్ర్యమ్,
తద్భుక్త్యా తత్పురంధ్రీష్వపి తిసృషు సమం జాతగర్భాసు జాతో
రామ స్త్వం లక్ష్మణేన స్వయ మథ భరతేనాపి శత్రుఘ్ననామ్నా. 1

"రాయన రావణుం దునుమరా"యన వేల్పులు; కోసలాన నం
దీయగ ఋష్యశృంగుఁ డొనరించిన యిష్టిని బాయసమ్ముఁ దా
మా యెడ గ్రోలు పంక్తిరథు నంగనలం దుదయించినావు రా
మాయణ మాలికాభరణులౌ నలుమూర్తులు నీవయై హరీ!

దేవతలు రావణుని సంహరింపుమని ప్రార్థింపగా, కోసలమునందు ఋష్యశృంగుడు పుత్రకామేష్టిని నిర్వహించి దశరథునకు పాయసము నీయగా, నతని భార్యలు ముగ్గురును నయ్యది యారగించి గర్భవతులు కాగా, వారియందు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల రూపమున నీవే యవతరించితివి.

కోదండీ కౌశికస్య క్రతువర మవితుం లక్ష్మణేనానుయాతో
యాతోఽభూస్తాతవాచా మునికథిత మనుద్వంద్వ శాంతాధ్వఖేదః,
నౄణాం త్రాణాయ బాణై ర్మునివచనబలా త్తాటకాం పాటయిత్వా
లబ్ధ్వాస్మా దస్త్రజాలం మునివన మగమో దేవ సిద్ధాశ్రమాఖ్యమ్. 2

జనకుం డంపగఁ గౌశికాత్త మఖరక్షాదీక్ష లక్ష్మన్నతో
జని గాధేయుఁ డొసంగు మంత్రయుగళిం శాంతాధ్వఖేదుండవై
మునియానన్ జగమేలఁ దాటక సమున్మూలించి దివ్యాస్త్రముల్
గొని సిద్ధాశ్రమ మేగుదెంచితి కదే కోదండరామప్రభూ!

విశ్వామిత్రుని యాగరక్షణకు కోదండమూని లక్ష్మణుడు వెంట రాగా తండ్రి యానతిని చని విశ్వామిత్రు డుపదేశించిన బల అతిబల - అను మంత్రముల మహిమచే ప్రయాణశ్రమను క్షుత్పిపాసలను జయించి, మునివాక్యబలముచే, మానవసంరక్షణ ప్రారంభముగా తాటకను జంపి విశ్వామిత్రు డిచ్చిన అస్త్ర సంపదను స్వీకరించి ఆయన సిద్ధాశ్రమమునకు వెళ్ళితివి.

మారీచం ద్రావయిత్వా మఖశిరసి శరై రన్యరక్షాంసి నిఘ్నన్
కల్యాం కుర్వ న్నహల్యాం పథి పదరజసా ప్రాప్య వై దేహగేహమ్,
భిందాన శ్చాంద్రచూడం ధను రవనిసుతా మిందిరామేవ లబ్ధ్వా
రాజ్యం ప్రాతిష్ఠథా స్త్వం త్రిభిరపి చ సమం భ్రాతృవీరై స్సదారైః. 3

అట మారీచు నదల్చి యమ్మఖశిరమ్మందాడు రక్షస్సులఁ
పటు బాణంబులఁ జించి పాదరజమున్ బైనించి కల్యాత్మయౌ
నటుగావించి యహల్యఁ జాంద్రమకుట మ్మావిల్లు ఖండించి మీ
రుట మా జానకి చెట్టబట్టి మఱిదంద్రుఁ దమ్ములున్ దోడరాన్.

యజ్ఞశాలలో మారీచుని దఱిమి, బాణములచే సుబాహుని నితరరాక్షసులను సంహరించి, యహల్యను మీ పాదపరాగముచే ధన్యురాలను జేసి, జనక గృహమున కరిగి శివుని విల్లు విఱిచి సాక్షాన్మహాలక్ష్మియైన జానకిని జేపట్టి పెండ్లికూతులతో కూడిన తమ్ములతో మీ రాజధానికి పయనమైతివి.

ఆరుంధానే రుషాంధే కిల భృగుతిలకే సంక్రమయ్య స్వతేజో
యాతే యాతోఽ స్యయోధ్యాం సుఖమిహ నివసన్ కాంతయా కాంతమూర్తే,
శత్రుఘ్నైకదాథో గతవతి భరతే మాతుల స్యాధివాసం
తాతారబ్ధోఽభిషేక స్తవ కిల విహతః కేకయాధీశపుత్ర్యా. 4

దారిన్ నిల్పియు భార్గవుం డవల సంధానించి స్వీయప్రభన్
దారిన్ బోవ; నయోధ్య కేగి యట సీతాయుక్తుఁడై, తమ్ముతో
నారీతిన్ భరతుండు మాతులకుల మ్మందుండఁ బట్టాభిషే
కారంభంబును దండ్రిసేయ వనవాసారంభమై కైకచే.

దారిలో పరశురాముడు రోషముగొని యెదిరింపవచ్చి తన వైష్ణవతేజమును నీయందు సంక్రమింపజేసి చనగా, అయోధ్యకు నీవు విచ్చేసితివి. ఆవల శత్రుఘ్నునితో భరతుడు మేనమామ గృహమున కేగగా, దశరథు డారంభించిన నీ పట్టాభిషేకము కైకచే నాగిపోయినది.

తాతోక్త్యా యాతుకామో వన మనుజ వధూసంయుత శ్చాపధారః
పౌరా నారుధ్య మార్గే గుహనిలయగత స్త్వం జటాచీరధారీ,
నావా సంతీర్య గంగా మధిపదవి పున స్తం భరద్వాజ మారా
న్నత్వా తద్వాక్యహేతో రతిసుఖ మవస శ్చిత్రకూటే గిరీంద్రే. 5

జనకాజ్ఞన్ జనకాత్మజానుజులతోఁ జాపంబు చేబూని తోఁ
జనుదేరం జన మాపి, యాగుహునిచే సంవాహితమ్మైన నా

వను గంగానది దాటి యవ్వల భరద్వాజాశ్రమ మ్మేగి యా
యనకున్ మ్రొక్కి తదాజ్ఞనుంటి జటివై యా చిత్రకూటాద్రిపై.

దశరథుడు కైక కిచ్చిన మాటను చెల్లించుటకు తమ్మునితో ధర్మపత్నితో విల్లు చేకొని అరణ్యమునకు జటాచీరధారివై, పౌరులను రావలదని నిలిపి, బయలువెడలి గుహునికడ కేగి యతడు కూర్చిన నావపై గంగనుదాటి భరద్వాజునకు మ్రొక్కి అయన చెప్పినట్లు చిత్రకూటగిరిపై సుఖముగా నుంటివి.

శ్రుత్వా పుత్రార్తి ఖిన్నం ఖలు భరతముఖాత్ స్వర్గయాతం స్వతాతం
తప్తో దత్వాంబు తస్మై నిదధిథ భరతే పాదుకాం మేదినీం చ,
అత్రిం నత్వాఽథ గత్వా వన మతివిపులం దండకం చండకాయం
హత్వా దైత్యం విరాధం సుగతి మకలయ శ్చారు భో శ్శారభంగీమ్. 6

భరతోక్తిన్ విని పుత్రశోకహతుఁడై స్వర్గస్థుఁడౌ తండ్రి క
బ్బురపుంబత్తి నివాప మిచ్చి భరతుం బూనించి శ్రీ పాదుకల్
ధరణిన్, మ్రొక్కియు నత్రి, దండకవనిన్ దైత్యున్ విరాధాఖ్యుఁగూ
ల్చి, రహిన్ శ్రీశరభంగు ముక్తి పదవిం జెందించినా వీశ్వరా!

నీకై తపియించి తండ్రి స్వర్గస్థుడయ్యెనను వార్తను భరతుని వలన విని ఆయనకు నివాపోదకము లిచ్చి, భరతునకు పాదుకలను రాజ్యమును అనుగ్రహించి, అత్రిమునికి మ్రొక్కి సువిశాల దండకారణ్యమును ప్రవేశించి విరాధు జంపి శరభంగునకు మోక్ష మనుగ్రహించితివి.

నత్వాఽగస్త్యం సమస్తాశరనికర సపత్నాకృతిం తాపసేభ్యః
ప్రత్యశ్రౌషీః ప్రియైషీ తదనుచ మునినా వైష్ణవే దివ్యచాపే,
బ్రహ్మాస్త్రే చాపి దత్తే పథి పితృసుహృదం వీక్ష్య భూయో జటాయుం
మోదా ద్గోదాతటాంతే పరిరమసి పురా పంచవట్యాం వధూట్యా. 7

అటుపై మౌనులగొల్చి బాసయిడి దైత్యశ్రేణి ద్రుంపఁగ, దప
శ్చటులుం గుంభజు మ్రొక్కి వైష్ణవ మహాచాపంబు బ్రహ్మాస్త్రమా

**దటఁ బ్రాపించి, జటాయువుం బితృసఖుఁ దర్శించి, గోదావరీ**
**తటమం దంగనతోడఁ బంచవటి మోదంబందినా వచ్యుతా!**

అవల అగస్త్యునకు మ్రొక్కి సర్వరాక్షస సంహారమును ప్రతిజ్ఞచేసి, అగస్త్యు డనుగ్రహించిన వైష్ణవాస్త్రమును స్వీకరించి నీ తండ్రికి మిత్రుడగు జటాయువుం జూచి, నీ పత్నితో గోదావరీ తీరమందు పంచవటిలో వసించి యానందభరితుడ వైతివి

ప్రాప్తాయాః శూర్పణఖ్యా మదన చలధృతే రర్థనై ర్నిస్సహాత్మా
తాం సౌమిత్రౌ విసృజ్య ప్రబలతమ రుషా తేన నిర్లూననాసామ్,
దృష్ట్వైనాం రుష్ట చిత్తం ఖర మభిపతితం దూషణంచ త్రిమూర్థం
వ్యాహింసీ రాశరాన ప్యయుత సమధికాం స్తత్క్షణా దక్షతోష్మా. 8

**మరుబారిన్ ధృతివాసి శూర్పణఖయుం బారాడ ద్రోనాడ రా**
**క రహిన్ లక్ష్మణుచెంత కంప నలుకన్ ఖండించె ముక్కుం జెవుల్;**
**ఖరుఁడున్ దూషణుఁడున్ద్రిమూర్ధుఁడది యాలక్షించి దండెత్త నం**
**దర మ్రందించితి వా క్షణాన పదివేల్ తత్సైన్య మొక్కండవై.**

అంతట శూర్పణఖ వచ్చి నీ యెడల మోహముగొని నిన్ను కోరగా దానిని లక్ష్మణుని కడ కంపితివి అతడు దాని ముక్కుకోసి పంపెను దాని వికృత రూపము జూచి రోషించి యెత్తివచ్చిన ఖరదూషణుల నెదిరించి వారు విసరిన పదివేల బాణముల నవలీలగా ఖండించి వారినందఱ నొక్కడవే సంహరించితివి.

సోదర్యా ప్రోక్తవార్తా వివశదశముఖా దిష్టమారీచమాయా
సారంగం సారసాక్ష్యా స్పృహిత మనుగతః ప్రావధీ ర్బాణఘాతమ్,
తన్మాయాక్రంద నిర్యాపిత భవదనుజాం రావణ స్తాం మహార్షీ
త్తేనార్తోఽపి త్వ మంతః కిమపి ముద మధా స్తద్వధోపాయలాభాత్. 9

**అటుపై చెల్లెలు సెప్ప రోషవివశుండై రావణుం డంప న**
**చ్చట మారీచుఁడు మాయలేడియయి యాసంగొల్ప నీ దేవి ము**

**చ్చట దీర్పంజని కూల్చ, నార్చె నది, మీ సౌమిత్రి యందేగినం**
**తట సీతన్ హరియించె రావణుఁడు వంతన్ మున్గి తీవంతటన్.**

చెల్లెలగు శూర్పణఖ చెప్పిన వార్తను విని ఒడలు మఱచి రావణుడు మారీచుని మాయలేడినిగా పంపగా, జానకి దానిపై మనసుపడగా, నా బంగారు లేడి వెంట నీవేగి దానిని సంహరించితివి ఆ లేడిరూపమున నున్న మారీచుడు చేసిన "హా లక్ష్మణా!" అన్న ఆక్రందనమును విని లక్ష్మణు డటుపోగా, రావణుడు సీతను హరింపగా, నీవు వెలికి శోకించిన ట్లగుపడినను రావణ వధోపాయము లభించెనని లోలోన ఆనందించితివి.

**భూయ స్తన్వీం విచిన్వ న్నహృత దశముఖ స్త్వద్వధూం మద్వధేనే**
**త్యుక్త్వా యాతే జటాయౌ దివమథ సుహృదః ప్రాతనోః ప్రేతకార్యమ్,**
**గృహ్ణానం తం కబంధం జఘనిథ శబరీం ప్రేక్ష్య పంపాతటే త్వం**
**సంప్రాప్తో వాతసూనుం భృశముదితమనాః పాహి వాతాలయేశ! 10**

**వెదుకంబోయితి రీరు; కూల్పఁబడి యావీథిం జటాయుండు మీ**
**కది యెల్లన్ వినిపించి ప్రాణములు వాయన్; వాని స్వర్గాన కం**
**పి దయన్, దారిఁ గబంధుఁ జంపి, శబరిన్ వీక్షించి పంపాతటా**
**స్పదు శ్రీ వాయుజుఁ జూచి పొంగితివి; నన్ వాతాలయా! ప్రోవరా**

సీతను వెదకి వెదకి జటాయువువలన రావణుడు సీతను హరించి కొని పోయెనని విని, జటాయువునకు పరలోకక్రియలు నిర్వర్తించి స్వర్గ మనుగ్రహించితివి. ఆవల గబంధు జంపి పంపాతటసంచారిణి శబరిం జూచి వాయు కుమారుని యెడకు వచ్చి మిక్కిలి ఆనందమును జెందితివి. ఓ వాయుపురాధీశా! మము రక్షింపుము.

# 35వ దశకము

# శ్రీరామ చరిత్ర

నీత స్సుగ్రీవమైత్రీం తదను హనుమతా దుందుభేః కాయ ముచ్చైః
క్షిప్త్వాంగుష్ఠేన భూయో లులవిథ యుగప త్పత్రిణా స ప్తసాలాన్,
హత్వా సుగ్రీవఘాతోద్యత మతులబలం వాలినం వ్యాజవృత్త్యా
వర్షావేలా మనైషీ ర్విరహ తరలిత స్త్వం మతంగాశ్రమాంతే. 1

**హనుమంతుండు కపీంద్రునిం గలుప, నీ వంగుష్ఠమాత్రమ్మునన్**
**ఘనమౌ దుందుభి మీటి యొక్క ములికిన్ ఖండించి సాలమ్ము లే**
**డును, వాలిన్ మఱి భ్రాతృఘాతి యని చాటుం జెంది వాలించి, హా**
**యని వేగించితి వర్షకాలము వియోగార్తిన్ మతంగావనిన్.**

హనుమంతునివలన సుగ్రీవునితోడి స్నేహము నొంది పాదాంగుష్ఠముచే దుందుభి శరీరము నెగమీటి, ఒక్క బాణముచే సప్తసాలముల ఖండించితివి. అవల సుగ్రీవుని సంహరింప నుద్యమించిన వాలిని మిషవెట్టి సంహరించి, వర్ష ఋతువును సీతా విరహవేదనతో మతంగాశ్రమమందు వెళ్ళించితివి.

సుగ్రీవవే ణానుజోక్త్యా సభయ మభియతాం వ్యూహితాం వాహినీం తా
మృక్షాణాం వీక్ష్య దిక్షు ద్రుత మథ దయితా మార్గణా యావనమ్రామ్,
సందేశం చాంగులీయం పవనసుతకరే ప్రాదిశో మోదశాలీ
మార్గే మార్గే మమార్గే కపిభి రపి తదా త్వ త్ప్రియా సప్రయాసైః. 2

**అనుజోక్తిన్ గపిరాజు భీతిఁ గపిసేనానీకముల్ సేర్చి సీ**
**తను వేగన్ వెదకంగఁబంపఁదగు వార్తల్ సెప్పి నీ యుంగర**
**మ్మును వాతాత్మజు చేత నుంచి కడు సమ్మోదించి నీ వంపఁజ**
**య్యన కోతుల్ పలుపాటులన్ వెదకి రా యా దుర్గమార్గమ్ములన్.**

లక్ష్మణుని మాటవెంట నీసన్నిధికి సుగ్రీవుడు వచ్చి కపిసేనను సంఘటింపజేయగా, నీ ప్రియురాలిని వెదకుటకు విధేయమైయున్న కపిసేనంజూచి, అంగులీయకమును నీ సందేశమును ఆంజనేయున కిచ్చిపంపి

ఆనందించితివి. నీ పంపిన వానరులు పలు ప్రయాసలకు లోనై అన్ని దారులను వెదకిరి.

త్వద్వార్తాకర్ణనోద్య ద్గరుదురు జవసంపాతి సంపాతివాక్య
ప్రోత్తీర్ణాంభోధి రంతర్నగరి జనకజాం వీక్ష్య దత్వాంగుళీయమ్
ప్రక్షుబ్ధోద్యాన మక్షక్షపణచణరణ స్సోఢబంధో దశాస్యం
దృష్ట్వా ప్లుష్ట్వాచ లంకాం ఝటితి స హనుమాన్ మౌళిరత్నం దదౌ తే. 3

విని సంపాతి భవత్కథల్, బలము రా వే ఱెక్క లాడించి యా
డిన మాటన్ హనుమన్న యక్కడలి దాటెన్ జూచె సీతమ్మ, ని
చ్చెను ముద్రన్, వనిఁగూల్చె బంధనము సైచెన్, జూచె దైత్యేంద్రుఁగా
ల్చెను లంకన్ మఱి వచ్చి స్వామి కొసఁగాన్ సీతమ్మ చూడామణిన్.

వానరులవలన నీ వార్త విన్నందున శాపమోక్ష మొంది ఱెక్కలు వచ్చి మహావేగమున నెదుట వ్రాలియున్న సంపాతి మాటలను బట్టి హనుమంతుడు వార్ధి దాటి, లంకానగరమందు జానకిని దర్శించి, రామాంగుళీయక మొసగి, అశోకవనము బెరికి, అక్షకుమారుని జంపి, బ్రహ్మాస్త్రబంధమును సైచి, దశముఖుని జూచి, లంకనుగాల్చి, వేవేగ వచ్చి సీతాదేవి చూడామణిని నీ కొసంగెను.

త్వం సుగ్రీవాంగదాది ప్రబల కపిచమూ చక్రవిక్రాంతభూమీ
చక్రో ఽభిక్రమ్య పారే జలధి నిశిచరేంద్రానుజా శ్రియమాణః,
తత్రోక్తాం శత్రువార్తాం రహసి నిశమయన్ ప్రార్థనాపార్థ్యరోష
ప్రాస్తాగ్నేయాస్త్ర తేజస్త్ర సదుదధిగిరా లబ్ధవాన్ మధ్యమార్గమ్. 4

వరసుగ్రీవముఖోగ్ర వానరచమూవర్గమ్ముతో నబ్ధి య
ద్దరి రక్షఃపతితమ్ము దిక్కగుచుఁ దద్వాక్యమ్ములన్ శత్రు న
న్నిరు కెల్లన్ విని దారియీ నుదధి నాగ్నేయాస్త్ర తేజస్సము
త్కర సంత్రస్తునిఁ జేసి కాంచితివి మార్గ మ్మబ్ధిమధ్యమ్మునన్.

నీవు సుగ్రీవాంగదాది వానరప్రముఖులతో ప్రబల కపిసైన్యముతో నవని నెల్ల ఆక్రమించి సముద్రతీరమున విభీషణునకు శరణిచ్చి, అతడు చెప్పిన శత్రురహస్యముల నవధరించి, నీ చేసిన ప్రార్థన విఫలమగుటచే సముద్రునిపై

నాగ్నేయాస్త్రమెత్తి, దానికి జడిసిపోయిన యా సాగరుని మాటవెంబడి సముద్ర తరణోపాయమును పొందితివి.

**క్షై రాశాంతరోపాహృత గిరినికరై స్సేతుమాధాప్య యాతో**
**యాతూ న్యామర్ద్య దంష్ట్రా నఖ శిఖరిశిలాసాల శస్త్రై స్స్వసైన్యైః,**
**వ్యాకుర్వన్ సానుజ స్త్వం సమరభువి పరం విక్రమం శక్రజేత్రా**
**వేగా న్నాగాస్త్రబద్ధః పతగపతి గరున్మారు తైర్మోచితోఽభూః** **5**

**వారిధిఁ గొండలన్ విసరి వారధి గట్టి తరించి వానరుల్**
**కోరల గోళ్ళ దంతములఁ గొండల జెట్లను బోర దారుణ**
**మ్మై రణ మింద్రజిత్తు నురగాస్త్రమునంబడి చిక్కు విప్పుకొ**
**న్నా రనుజుండు నీవు ఖగనాథుని ఱెక్కలగాలి చల్వకున్!**

వానరులు పలుదెసల నుండి కొనివచ్చిన బండలచే సేతువు గట్టి లంక కేగి నీ సేనలు కోరలు నఖాగ్రములు రాళ్లు వృక్షములు ఆయుధములుగా గొని రాక్షసులను గూల్చగా, నీవు తమ్మునితో యుద్ధరంగమందు అవక్ర పరాక్రమము చూపి, ఇంద్రజిత్తుచే నాగాస్త్రబద్ధుడవై గరుత్మంతుని ఱెక్కల గాలిచల్వకు మూర్ఛదేరితివి.

**సౌమిత్రి స్త్వస్త్రశక్తి ప్రహృతిగలదసు ర్వాతజానీత శైల**
**ఘ్రాణాత్ ప్రాణానుపేతో వ్యకృణుత సుకృతశ్లాఘినం మేఘనాదమ్,**
**మాయాక్షోభేషు వైభీషణ వచనహృత స్తంభనః కుంభకర్ణం**
**సంప్రాప్తం కంపితోర్వీతల మఖిలచమూభక్షిణం వ్యక్షిణో స్త్వమ్.** **6**

**అని సౌమిత్రి మహోగ్రశక్తి బడి మూర్ఛాక్రాంతుఁడై వాయు నం**
**దననీతాద్రిమరుత్సమాకలనఁ బ్రాణమ్మొంది మాయా వికః**
**త్థను నింద్రారి వధించె, నీవు బల మంతన్ మ్రింగు నక్కుంభక**
**ర్ణుని వైభీషణబోధ నూల్కొని యనిన్ ద్రుంగించినా వీశ్వరా!**

లక్ష్మణుడు మాత్రము ఇంద్రజిత్తు శక్త్యాయుధము దెబ్బకు కూలి, వాయుసూనుడు కొనివచ్చిన సంజీవిపర్వతము గాలి వాసనచూచి ప్రాణములొంది తన మాయల కుప్పొంగు ఇంద్రజిత్తు నెదిరించి, వాడు

చేసిన మాయాస్తంభనమును విభీషణుని మాటవెంబడి తొలగించుకొని, అటుపై నెత్తివచ్చి భూతలమెల్ల కంపింపజేయుచు సేనలను భక్షించుచున్న కుంభకర్ణు నీవు సంహరించితివి.

గృహ్ణన్ జంభారి సంప్రేషిత రథకవచౌ రావణే నాభియుధ్యన్
బ్రహ్మాస్త్రేణాస్య భిందన్ గలతతి మబలా మగ్నిశుద్ధాం ప్రగృహ్ణన్,
దేవశ్రేణీవరోజ్జీవితసమర మృతై రక్షతై రృక్షసంఘై
ర్లంకాభర్త్రా చ సాకం నిజనగర మగా స్సప్రియః పుష్పకేణ. 7

హరి పంపన్ గవచంబు తేఱుకొని, బ్రహ్మాస్త్రాన లంకేశు కం
ధరముల్ ద్రుంచి, గ్రహించి యగ్నిపరిపూతన్ సీత, నా దేవతా
వర సంజీవిత వానరర్క్షములతోఁ బద్మాక్షితో రాక్షసే
శ్వరుతోఁ బుష్పక మెక్కి చేరితివి మీ సాకేతమున్ రాఘవా!

ఇంద్రుడంపిన రథకవచములను గొని రావణునితో తలపడి ఆదిత్య హృదయ పారాయణబలమున బ్రహ్మాస్త్రానుసంధానము సేసి రావణుని గళములం ద్రెంచి అగ్నిశుద్ధయైన సీతను స్వీకరించి, హనుమదాదులతో, సంజీవకరణి విశల్యకరణి సంధానకరణి మొదలగు మహౌషధులచే నుజ్జీవింపజేయపడిన ఋక్షవానర సంఘములతో, నీచే లంకాధిపుడుగా జేయబడిన విభీషణునితో, జానకితో పుష్పక మధిరోహించి నిజ రాజధాని కేగితివి.

ప్రీతో దివ్యాభిషేకై రయుతసమధికాన్ వత్సరాన్ పర్యరంసీ
ర్మైథిల్యాం పాపవాచా శివ! శివ కిల తాం గర్భిణీ మభ్యహాసీః,
శత్రుఘ్నే నార్దయిత్వా లవణనిశిచరం ప్రార్దయ శ్శూద్రపాశం
తావ ద్వాల్మీకి గేహే కృతవసతి రుపాసూత సీతాసుతౌ తే. 8

అభిషిక్తుండయి రాజ్యమేలి పదివేలౌ నేండ్లు; వర్ధించి పా
ప భయానన్ సతి గర్భిణిన్, లవణుఁ జంపన్ జేసి శత్రుఘ్ను చేఁ
బ్రభుతఁ శూద్రతపస్విఁ గూల్చితివి; శ్రీవాల్మీకి గేహమ్మునన్
శుభలగ్నమ్మునఁ గాంచె జానకియు నచ్చో పుత్రు లయ్యిద్దరన్.

అయోధ్యయందు పట్టాభిషిక్తుడవై పదివేలయేండ్లకు మించి రాజ్యమునేలి, శివశివా! అపనిందకు లోనైన జనకాత్మజను గర్భిణిని త్యజించితివి. అటుపై శత్రుఘ్నునిచే లవణాసురుం జంపించి, శూద్రమునిని శంబూకుని సంహరించితివి. ఆవల వాల్మీకి ఆశ్రమమందున్న సీతాదేవి యిరువురు తనయులను గనెను.

**వాల్మీకే స్త్వత్సుతోద్గాపిత మధురకృతే రాజ్ఞయా యజ్ఞవాటే**
**సీతాం త్వ య్యాప్తుకామే క్షితి మవిశ దసౌ త్వంచ కాలార్థితోఽభూః,**
**హేతో స్సౌమిత్రి ఘాతీ స్వయ మథ సరయూమగ్న నిశ్శేషభృత్యై**
**స్సాకం నాకం ప్రయాతో నిజపద మగమో దేవ వైకుంఠ మాద్యమ్.** 9

**ముని వాల్మీకుల యాన నీ కృతి సుతుల్ మున్ బాడి రయ్యజ్ఞవా**
**టిని, సీతాప్తిని నీవు కోర సతి పట్టెన్ భూమి గర్భమ్ము; లీ**
**లను సౌమిత్రిఁ ద్యజించి, కాలు పిలు పాలక్షించి భృత్యాళియుం**
**జన వైకుంఠము సేరినావు సరయూ నద్యంత రున్మగ్నతన్.**

వాల్మీకులవారి ఆజ్ఞతో వారు గానముచేయించిన నీ మధురాతిమధురమైన కృతిని యజ్ఞవాటమునందు కుశలవులు పాడగా నవధరించితివి. ఆ మీద సీతను తిరిగి నీవు స్వీకరింప కోరగా నామె భూమిం బ్రవేశించెను. ఏలినవారు కాలదేవతాప్రార్థన మవధరించి కొండొక హేతువుపై సౌమిత్రిని త్యజించి, స్వయముగా నీవారితో అనగా దేవాంశ సంభవులై అవతరించిన పౌరులతోగూడ సరయూనదియందు మునిగి నీ వైకుంఠధామమునకు దయచేసితివి. ఆ దివ్య పదము సర్వలోకములకు మొదటిది. అనగా బ్రహ్మాండోత్పత్తికంటె ముందరిది.

వి.వి:- ధర్మదేవతయు దానును అవతారవిరమణ విషయమైన రహస్య ప్రసంగము జేయుచునుండి, ఆ సమయములో తనను జూడవచ్చిన వానిని త్యజింతునని యమునియెదుట తాను చేసిన ప్రతిజ్ఞనుబట్టి, ఆ నడుమవచ్చిన లక్ష్మణుని రాముడు పరిత్యజించెను - అని ఉత్తరరామాయణము కథ.

**సోఽయం మర్త్యావతార స్తవ ఖలు నియతం మర్త్యశిక్షార్థమేవ**
**విశ్లేషార్తి ర్నిరాగ స్త్యజనమపి భవేత్ కామధర్మాతిసక్త్యా.**

**నోచే త్స్వాత్మానుభూతేః క్వను తవ మనసో విక్రియా చక్రపాణే**
**స త్వం సత్త్వైక మూర్తే పవనపురపతే వ్యాధును వ్యాధితాపాన్.** **10**

**ఈ నీ మానవలీల లెల్ల నియత మ్మిమ్మర్త్య శిక్షార్థ మె**
**ద్దానన్ వీడుట దుఃఖముఁ నిపరాధ త్యాగముఁ కామ ధ**
**ర్మానూనస్ఫుటసక్తిఁ గల్గు హరి! నీ కా యా వికారమ్ము డెం**
**దానఁ లే దురుసత్త్వమూర్తివగుటఁ దాపమ్ము చల్లార్పవే.**

ఈ నీ మానవావతారము మానవులకు ధర్మశిక్షణము చేయుటకు వచ్చినది. "రామో విగ్రహవాన్ ధర్మః" రాముడు కేవలము రూపముగొన్న ధర్మమే అనుటచే బ్రహ్మాదులకు గూడ నెఱుగరాని వైభవముతో నీవు లీలామానుష విగ్రహమును ధరించినవాడవు కావున, కామాదులందు అతిసంగము లేకుండ విరహాది దుఃఖములను అనుభవించుట కేవల ధర్మశిక్షణమునకు చేసిన లోకవిడంబనము గాని మఱియొకటి కాదు. ఇట్లు స్వప్రకాశ సంవిద్రూపమైన పరబ్రహ్మకు నీకు రాగద్వేషమోహాది వికారములు లేనే లేవు. ఓ చక్రపాణీ! (కాలరూపమైన చక్రమును స్వాధీనమున నుంచుకొనిన మహానుభావుడవు అగు నీకు సంసారమును తెచ్చి పెట్టుటలో కాలమునకు సమర్థతలేదు అని తెలుపుటకు ఈ సంబోధనము.) ఓ సత్త్వమూర్తీ! భక్తానుగ్రహము కొఱకు శుద్ధసత్త్వమయమూర్తిని అంగీకరించిన ఓ రామచంద్రావతారమూర్తీ! ఓ గురువాయూరు నారాయణస్వామీ! మా ఆధి వ్యాధి తాపములను హరింపుము.

## 36వ దశకము

# పరశురామావతారము

**అత్రేః పుత్రతయా పురా త్వ మనసూయాయాం హి దత్తాభిధో**
**జాతః శిష్యనిబద్ధ తంద్రితమనాః స్వస్థ శ్చరన్ కాంతయా,**
**దృష్టో భక్తతమేన హైహయమహిపాలేన తస్మై వరాన్**
**అష్టైశ్వర్య ముఖాన్ ప్రదాయ దదిథ స్వేనైవ చాంతే వధమ్.** **1**

**అనసూయాసతి కత్రికిన్ గలిగి దత్తాత్రేయ నామాన; శి**
**ష్య నిరాసమ్మున కింతితో మసలియున్ స్వస్థుండవై; హైహయుం**
**డను భక్తాగ్రణికిన్ వరమ్ము లిడి యష్టైశ్వర్య ముఖ్యమ్ము; లా**
**తని నీవే వధియించినాఁడ వటమీదన్ జన్మ శూన్యంబుగన్.**

అనసూయయందు అత్రిమహర్షికి కుమారుడవై యవతరించి దత్తు డను పేర నొప్పితివి.

వి.వి : భగవంతుడు నాచేత దత్తుడు=ఇవ్వబడినవాడు - అని యనుటచే నాయనకు దత్తుడను పేరు సార్థకమైనది. నిరంతర సమాధి నిష్ఠకు భంగము కలుగునని నిస్సంగుడగుటకు శిష్యసంగ్రహము చేయ నిష్టములేనివాడై ఒకస్త్రీతో కూడివర్తించుచు మద్యము త్రాగుచు ఆత్మారాముడై చరించుచు, మిక్కిలి భక్తుడైన కార్తవీర్యార్జునిచే సందర్శింపబడి అష్టైశ్వర్యముల నాతనికి అనుగ్రహించి, నీ విచ్చిన వరము ననుసరించి నీవే తుద కతనిని సంహరించితివి.

**సత్యం కర్తు మథార్జునస్య చ వరం తచ్ఛక్తిమాత్రానతం**
**బ్రహ్మద్వేషి తదాఖిలం నృపకులం హంతుం చ భూమే ర్భరమ్,**
**సంజాతో జమదగ్నితో భృగుకులే త్వం రేణుకాయాం హరే**
**రామో నామ తదాత్మజే ష్వవరజః పిత్రో రథా స్సంమదమ్.** 2

**హరి! ము న్నర్జును కోర్కె తీర్పను దదీయాజ్ఞన్ జగద్భారమౌ**
**పరమబ్రాహ్మణశత్రురాజులను గూల్పన్ రేణుకాదేవి కం**
**దరలోనం గడగొట్టు బిడ్డ డగుచున్ రామాభిధానంబునన్**
**ధరణిం బుట్టితి వీవు భార్గవకులానందానుసంధాయివై.**

కార్తవీర్యార్జునుని శక్తికి వశమై బ్రహ్మద్వేషియైన సకల రాజకులమును సంహరించుట మూలమున భూభారమును హరించుటకు భృగుకులమునందు జమదగ్నికి ఆయన కుమారులలో కడగొట్టువాడవై యవతరించి రాముడనుపేర తలిదండ్రుల కానందమును గలిగించితివి.

**లబ్ధ్వామ్నాయగణ శ్చతుర్దశవయాః గంధర్వరాజే మనా**
**గాసక్తాం కిల మాతరం ప్రతి పితుః క్రోధాకులస్యాజ్ఞయా,**
**తాతాజ్ఞాతిగ సోదరై స్సమ మిమాం ఛిత్వాథ శాంతాత్ పితు**
**స్తేషాం జీవనయోగ మాపిథ వరం మాతాచ తేఽదా ద్వరాన్. 3**

పదునాల్గేడుల యీడులోనె శ్రుతిలాభ మ్మొంది గంధర్వుపై
మదిఁ వ్రాలన్ గని తల్లిఁ జంపుఁడనఁగా మారాడు నయ్యన్నలన్
దుదముట్టించియుఁ దండ్రియాన మఱి యా తోఁబుట్టులన్ దల్లినిఁ
ముదమొప్పన్ బ్రతికించికొంటివి; వరమ్ముల్ కొంటి వాయమ్మచే.

పదునాలుగేండ్ల వయస్సు వచ్చువఱకు అర్థజ్ఞానసమన్వితముగా వేదాధ్యయనము చేసితివి. ఒకప్పుడు చిత్రరథుడను గంధర్వునియెడల రేణుకాదేవి యించుక మనస్సుపడగా నీమెను సంహరింపుమని క్రోధాతురుడై నీ తండ్రి జమదగ్ని యాజ్ఞాపించగా, ఆ యాజ్ఞను ధిక్కరించిన జ్యేష్ఠ సోదరులను, తల్లిని సంహరించి, ఆవల ప్రశాంతుడైన తండ్రివలన వరముగా వారందఱను బ్రతికింపజేసితివి. పిమ్మట నీకు మీయమ్మకూడ వరములిచ్చెను.

**పిత్రా మాతృముదే స్తవాహృత వియద్ధేనో ర్నిజా దాశ్రమాత్**
**ప్రస్థాయాథ భృగోర్గిరా హిమగిరా వారాధ్య గౌరీపతిమ్,**
**లబ్ధ్వా తత్పరశుం తదుక్త దనుజచ్ఛేదీ మహాస్త్రాదికం**
**ప్రాప్తో మిత్ర మథాకృతవ్రణమునిం ప్రాప్యాగమః స్వాశ్రమమ్. 4**

మును గొనివచ్చె మీ జనని ముచ్చటకై శ్రుతిసూక్తి వేల్పుటా
వును జమదగ్ని; తండ్రి పనుపుంగొని శంకరుఁగొల్చి మంచుగొం
డను గొని గండ్రగొడ్డలి నడంచి తదుక్త సురారికోటి నం
తన కని నీదు మిత్రు నకృతవ్రణు, వచ్చితి వాశ్రమానకున్.

అనంతరము మీయమ్మ ఆనందముకొఱకు ప్రీతితో స్తుతించి సురభియను కామధేనువును మీ తండ్రి రప్పించెను. మీ పితామహుడగు భృగుమహర్షియొక్క మాట ననుసరించి హిమాలయమున కేగి యచట గౌరీపతి నారాధించి పరశువను నాయుధము నాయనవలన బడసి, ఆయన చెప్పిన రాక్షసులను దానిచే సంహరించి, అందువలన మఱియును సంతుష్టుడైన శివునివలన

దివ్యాస్త్రములను పొంది సింహముఖమునుండి రక్షింపబడిన అకృతవ్రణుడను మునిని మిత్రునిగా బడసి నిజాశ్రమమునకు వచ్చితివి.

**ఆఖేటోపగతోఽర్జునః సురగవీ సంప్రాప్త సంపద్గణై**
**స్త్వత్పిత్రా పరిపూజితః పురగతో దుర్మంత్రివాచా పునః,**
**గాం క్రేతుం సచివం న్యయుంక్త కుధియా తేనాఽపి రుంధన్ ముని**
**ప్రాణక్షేప సరోష గోహత చమూ చక్రేణ వత్సో హృతః. 5**

వేటకుఁబోయి యర్జునుఁడు విందయి గో వొనరించు విందులఁ
వీటికిఁబోయి గోవుఁగని వేఁగొనిరమ్మని మంత్రిఁబంపఁ బ
ల్తీట మునిన్ వధింప సురధేనువు రేగి యశేషసేన న
ప్పాటన మట్టుపెట్టె నట వత్సముఁ దోడ్కొని వాడు పోవగన్.

కార్తవీర్యార్జునుడు వేటకేగి నీ యాశ్రమమునకు వచ్చి కామధేనువు వలన ప్రాప్తించిన దివ్యపదార్థసముదాయముచే ఆతిథ్య మీయబడి, నిజ రాజధానియగు మాహిష్మతీ నగరమునకు వెళ్ళియు, దుష్టమంత్రి ప్రోద్బలముచే నందుల కుద్యుక్తుడై మంత్రిని నియోగించెను. ఆ దుర్బుద్ధిని వారించిన జమదగ్నిని వాడు సంహరించెను. అందులకు కామధేనువు కోపించి వానిసైన్యమును మట్టుపెట్టెను. ఆవల నా దుర్మంత్రి యాసురభియొక్క దూడను హరించి నగరమునకు గొంపోయెను.

**శక్రోజ్జీవిత తాతవాక్యచలితక్రోధోఽథ సఖ్యా సమం**
**బిభ్ర ద్ధ్యాతమహోదరోపనిహితం చాపం కుఠారం శరాన్,**
**ఆరూఢ స్సహవాహయంతృకరథం మాహిష్మతీ మావిశన్**
**వాగ్భి ర్వత్స మదాశుషి క్షితిపతౌ సంప్రస్తుథా స్సంగరమ్. 6**

అట మీ తండ్రియు శుక్రుచే బ్రతికి నిన్నంపింప నీమిత్రుతో
నటకుంబోయి మహోదరుం డొసఁగు దివ్యాస్త్రాళిఁ జేపట్టి యు
ద్భటరథ్యధ్వజచోదకమ్ము రథ మాపై నెక్కి సామోక్తిచే
నటు గోవత్సము నీయనన్న నృపు రమ్మన్నావు యుద్ధానకున్.

శుక్రాచార్యులచే నుజ్జీవింపజేయబడిన జమదగ్ని మాటలచే క్రోధము పెచ్చుపెరగగా, మిత్రుడైన అకృతవ్రణుడు ధ్యానింపగా ప్రసన్నుడైన శివుని

అనుచరుడైన మహోదరునిచే కొనిరాబడిన ధనుస్సు గొడ్డలి బాణములు సారథితోగూడిన రథమును స్వీకరించి రథారూఢుడవై మాహిష్మతీ నగరమును ముట్టడించి అడిగిన మాత్రమున దూడ నియ్యని రాజుతో యుద్ధ మారంభించితివి.

పుత్రాణా మయుతేన సప్తదశభి శ్చాక్షౌహిణీభి ర్మహా
సేనానీభి రనేక మిత్రనివహై ర్వ్యాజృంభితాయోధనః,
సద్యస్త్వత్కకుఠార బాణ విదళ న్నిశ్శేష సైన్యోత్కరో
భీతిప్రద్రుత నష్ట శిష్ట తనయ స్త్వామాపత ద్ధేహయః. 7

అయుతమ్మౌ సుతకోటితోఁ బదియునే డక్షౌహిణుల్ సేనతో
డయి సేనాపతి మిత్రకూటములతో వ్యాజృంభితాయోధనుం
డయి వాఁడెత్తి భవత్కుఠార శరజాలాచ్ఛిన్న సేనాంగ సం
చయుఁడైఁ పైఁబడెఁ జావగామిగులు దత్సైన్యమ్ములుం బారిపోఁ.

పదివేలమంది కొడుకులతో పదునేడక్షౌహిణుల సేనతో గొప్ప సేనాధిపతులతో అనేక మిత్రబలములతో యుద్ధవిజృంభితుడైన కార్తవీర్యార్జునుడు క్షణములో నీ కుఠారధారకు బాణములకు నిజసైన్యము నిశ్శేషముగా నశింపగా అడలి కొడుకులు పాఱిపోగా నీపై నెదురు నడచెను.

లీలావారిత నర్మదాజల వల ల్లంకేశ గర్వాపహ
శ్రీమద్బాహుసహస్ర ముక్త బహుశస్త్రాస్త్రం నిరుంధ న్నముమ్,
చక్రే త్వ య్యథ వైష్ణవేఽపి విఫలే బుధ్వా హరిం త్వాం ముదా
ధ్యాయంతం ఛితసర్వదోష మవధీ స్సోఽగా త్పరం తే పదమ్. 8

లీలావారిత నర్మదాసలిల కేళీదృప్త రక్షోమద
వ్యాలుంటాక భుజా సహస్ర విగళ ద్బాణాళియై చక్రమే
మూలన్ దాకమి చక్రిగా నెఱిగి నిఁ మోదించి ధ్యానించి పా
పాళిన్ బాసి భవద్ధతుండయి పరమ్మందెన్ పద మ్మయ్యెడఁ.

విలాసమాత్రముగ నర్మదానదియందు జలక్రీడలాడుచు తన యిరువది బాహువులచే నర్మదా జలప్రవాహము నాపిన లంకాధిపతియగు రావణుని

గర్వమును అణచిన తన వేయి బాహువులచే శస్త్రాస్త్రపరంపరను విసరుచున్న ఆ కార్తవీర్యార్జునుని వారించుచు అతడు విసరిన విష్ణుచక్రముకూడ నీ యెడ మొఱవోవుట చూచి నీవు సాక్షాద్విష్ణుడవని ఆనందభరితుడై నిన్ను ధ్యానించి సర్వదోషములు నశించిన వాని వేయిచేతులను ఖండించి వానిని సంహరించితివి. అతడు నీ పరమపదమున కేగెను.

**భూయో మర్షిత హైహయాత్మజగణై స్తాతే హతే రేణుకా**
**మాఘ్నానాం హృదయం నిరీక్ష్య బహుశో ఘోరాం ప్రతిజ్ఞాం వహన్,**
**ధ్యానానీత రథాయుధ స్త్వమకృథా విప్రద్రుహః క్షత్రియాన్**
**దిక్చక్రేషు కుఠారయన్ విశిఖయన్ నిఃక్షత్రియాం మేదినీమ్. 9**

**వంతన్ దత్సుతు లేగి నీ జనకుఁ జంపన్ రేణుకాకాంత తా**
**నంతన్ గుండెలు బాదుకో, శపథ మిూవై పట్టి ధ్యానించి నీ**
**చెంతన్ బాణములున్ రథమ్ము నిలువన్ జేపట్టి నానా దిశా**
**క్రాంతిన్ ద్రుంచియు ద్రెంచి చేసితివి నిఃక్షత్రమ్ముగన్ మేదినిన్.**

అంతతో నాగక కసిగొని గడచిన యుద్ధమున చావగా మిగిలిన కార్తవీర్యార్జునుని కుమారులు నీవు ఆశ్రమమున లేనప్పుడు వచ్చి మీతండ్రియగు జమదగ్నిని సంహరింపగా, రేణుకాదేవి యిరువదియొక్కమాఱులు గుండెలు బాదుకొని యేడువగా జూచి, లోకమును నిఃక్షత్రియము చేసెదనని ఘోరప్రతిజ్ఞచేసి, ధ్యానమాత్రమున దివ్యాయుధ రథాదులను రప్పించి, బ్రాహ్మణద్రోహులగు క్షత్రియులను గొడ్డలిపెట్టువెట్టి సకలదిశలు గాలించి భూమిపై రాచపురుగు లేకుండ చేసితివి.

**తాతోజ్జీవనకృ న్నృపాలకకులం త్రిస్సప్తకృత్వో జయన్**
**సంతర్ప్యాథ సమంతపంచక మహారక్త హ్రదౌఘే పితౄన్,**
**యజ్ఞే క్ష్మామపి కాశ్యపాదిషు దిశన్ సాల్వేన యుధ్యన్ పునః**
**కృష్ణోముం నిహనిష్యతీతి శమితో యుద్ధా త్కుమారై ర్భవాన్. 10**

**పునరుజ్జీవితుఁ జేసి తండ్రి; నృపులన్ ముయ్యేడు మారెత్తి చం**
**పిన రక్తాన శమంతపంచకమునన్ వే తర్పణ మ్మిచ్చి ద**
**క్షిణ గావించియు కాశ్యపాదుల కిలాశ్రీ, సాల్వుతోఁబోరి యా**
**సనకాదుల్ హరి వీనిఁ జంపు ననఁగా శాంతించినా వంతటన్.**

తండ్రి శిరస్సును సంధించి యజ్ఞములచేత నాయనను ఉజ్జీవింపజేసి, యిరువదియొక్కమాఱులు దండెత్తిరాజుల నెల్లరను సంహరించి, శమంత పంచకమనుపేర నేర్పడిన వారి రక్తపు మడుగులందు భక్తితో పితృతర్పణ మొనరించి, యజ్ఞదక్షిణగా కాశ్యపాది ఋత్విక్కులకు నీ గెలిచిన భూమండల మంతయు దానముచేసితివి. అటుపై మఱల సాల్వునితో తలపడి సనకాది బ్రహ్మ మానసపుత్రులు 'శ్రీకృష్ణుడు వీనిని సంహరింపగలడు' అని తెలుపగా నప్పటికి యుద్ధమునుండి మరలి ప్రశాంతుడవైతివి.

న్యస్యాస్త్రాణి మహేంద్రభూభృతి తప స్తన్వన్ పున ర్మజ్జితాం
గోకర్ణావధి సాగరేణ ధరణీం దృష్ట్వార్థిత స్తాపసైః,
ధ్యాతే ష్వాస ధృతానలాస్త్రచకితం సింధుం స్రువక్షేపణా
దుత్సార్యోద్ధృత కేరలో భృగుపతే వాతేశ సంరక్ష మామ్. 11

శరముల్ డించి మహేంద్రమందు తపమున్ సల్పంగ నయ్యబ్ధి ని
ద్ధర గోకర్ణముదాక ముస్గ మును లంతన్ వేడ, ధ్యానించి విల్
శర మాగ్నేయముచే నదల్చి జలధిన్ సర్వేశ! ఈ కేరళ
మ్మరిదిన్ నీ స్రువ మెత్తి యెత్తితివి వాతాగార! నన్ బ్రోవరా!

మహేంద్రపర్వతమునందు అస్త్రసన్యాసముజేసి తపస్సుజేసి, గోకర్ణ పర్యంతము సముద్రముచే భూమి మునిగిపోవుటను గమనించి, తాపసులచే ప్రార్థింపబడి, ధ్యానమాత్రమున రప్పించిన విల్లు చేపట్టి ఆగ్నేయాస్త్ర సంధానము చేసినంతట హడలిపోయిన సముద్రుని, స్రువమ్ము విసరి దూరముగా తఱిమి, కేరళరాష్ట్రము నుద్ధరించితివి. ఓ పరశురామా! వాతాలయధామా! నన్ను సంరక్షింపుము.

# 37వ దశకము

# కృష్ణావతార ప్రసంగము

**సాంద్రానందతనో హరే నను పురా దైవాసురే సంగరే**
**త్వత్కృత్తా అపి కర్మశేషవశతో యే తే న యాతా గతిమ్,**
**తేషాం భూతలజన్మనాం దితిభువాం భారేణ దూరార్దితా**
**భూమిః ప్రాప విరించి మాశ్రితపదం దేవైః పురైవాగతైః. 1**

ఆనందైక చిదాత్మవిగ్రహ! భవద్వ్యాపాదితుల్ కర్మశే
షానం గొందఱు రాక్షసుల్ ధరఁ బునర్జన్మించి; రా మోపు పా
పానం బర్వయి మోయలేక దివిషద్వర్గమ్ము తోనన్ జనన్
గానంబోయె ధరిత్రి స్వాశ్రయగతున్ కంజోద్గతున్ ద్వత్సుతున్.

సాంద్రానంద జ్ఞానమూర్తీ! హరీ! మున్ను దేవాసుర యుద్ధమందు నీ చేతిలో మడిసియు కర్మశేషముచే ముక్తినందని దైత్యులయొక్క భారముచే మిగుల క్రుంగిన భూమి, అంతకుమున్న వచ్చియున్న దేవతలచే ఆశ్రయింపబడిన చరణములు కల బ్రహ్మను శరణందెను.

వి.వి : నారాయణభట్టు ఏతద్గ్రంథ ప్రారంభమున "సాంద్రానందావ బోధాత్మకమ్" అను పదముతో మంగళాచరణము గావించెను. పూర్ణపుణ్యా వతారమైన కృష్ణావతారమునకు నాందీప్రస్తావనయైన యీ దశకమునందు అదే పదముతో సచ్చిదానందఘనమైన భగవత్తత్త్వమును సంబోధించెను. ఇది యొక విశేషము. భగవంతునిచేత మడిసినవారికి సద్యోముక్తి కలుగవలెను గదా, అది కలుగక కొందఱు శేషించిరనుట రెండు మూడు జన్మములలో ముక్తి ననుగ్రహింతునని చెప్పిన భగవద్వాక్యమును జ్ఞాపకము చేయుచున్నది. అట్లు మిగిలిన వారే కాలనేమి, కంస శిశుపాల దంతవక్త్రాదులు.

**హాహా దుర్జనభూరిభార మథితాం పాథోనిధౌ పాతుకా**
**మేతాం పాలయ హంత మే వివశతాం సంపృచ్ఛ దేవా నిమాన్,**

ఇత్యాది ప్రచుర ప్రలాప వివశా మాలోక్య ధాతా మహీం
దేవానాం వదనాని వీక్ష్య పరితో దధ్యౌ భవంతం హరే! 2

"అక్కట! పాపకోటి బరువై దిగజారెద వార్ధిఁ గ్రుంగెదన్
దిక్కెవ రీవుగా, కడుగు దేవత లిందఱి" నంచు దీనయై
మిక్కిలి పొక్కుచున్న పుడమిం గని వేల్పుల యమ్మొగమ్ము ల
మ్మక్క! విధాత సూచి హృదయాన నినున్ దరిసించె నయ్యెడన్

'అయ్యో! పాపాత్ముల బరువుచే సముద్రమున క్రుంగిపోవు ఈ నన్ను రక్షింపుము. నా దురవస్థను గూర్చి యీ దేవతల నడుగుము.' అని యిట్లు పెక్కు విధముల వాపోవుచు మైమఱచియున్న భూదేవిని జూచి, అటు దేవతల మొగములను పరికించి, బ్రహ్మ నిన్ను ధ్యానించెను.

ఊచే చాంబుజభూ రమూ నయి సురా స్సత్యం ధరిత్ర్యా వచో
నన్వస్యా భవతాంచ రక్షణవిధౌ దక్షో హి లక్ష్మీపతిః,
సర్వే శర్వపురస్సరా వయ మితో గత్వా పయోవారిధిం
నత్వా తం స్తుమహే జవాదితి యయు స్సాకం తవాకేతనమ్. 3

ధ్యానము సేసి యవ్విధి "సురాళి! నిజమ్ము ధరిత్రిమాట, శ్రీ
జానియె యీమెకున్ మనకు సర్వుల కిప్పుడు రక్షకుం డుమా
జానినిగూడి పాల్కడలి చాయకుఁబోదము మోదమంద శ్రీ
జాని నుతింతమా నతులు సల్పి" యనం జని రట్లు యందఱున్.

మఱియు పద్మభవుడు దేవతలం గని, 'భూమి చెప్పినది సత్యము, నా దివ్యదృష్టికి గోచరించినది. ఈమెనుగాని మిమ్ముగాని రక్షించుటయందు లక్ష్మీ వల్లభు డొక్కడే దక్షుడు. శివుని మున్నిడుకొని మనమందఱము క్షీరసాగరమునకు జని మ్రొక్కి శ్రీహరిని స్తుతింతము' అని చతుర్ముఖుడనగా వారందఱు నీనివాసమునకు వచ్చిరి.

తే ముగ్ధానిలశాలి దుగ్ధజలధే స్తీరంగతా స్సంగతా
యావ త్త్వత్పదచింతనైకమనస స్తావ త్స పాథోజభూః,
త్వద్వాచం హృదయే నిశమ్య సకలా నానందయ న్నూచివా
నాఖ్యాతః పరమాత్మనా స్వయ మహం వాక్యం తదాకర్ణ్యతామ్. 4

**అంతంతం జని మందమంద పవన వ్యాలోల దుగ్ధాబ్ధి తీ**
**రాంతానంతపదాన నీ చరణ దివ్యాబ్జద్వయచ్ఛాయ వి**
**శ్రాంతమ్మైన నిలింపకోటి కజుఁడున్ సాక్షాత్స్వయం వ్యక్తి న**
**త్యంతానందము గూర్చు నీ పలుకులన్ దా వించె విన్నట్లుగన్.**

చల్లని పిల్లవాయువులు వీచుచున్న పాల్కడలి తీరమును జేరి కూడుకొని నీ చరణకమల ధ్యానమందు ఏకాగ్రచిత్తులై యున్నతరి, బ్రహ్మ నీ మాటను హృదయమునందు విని 'విష్ణువు స్వయముగా నాకీ వాక్యమును వినిపించెను. దాని నందఱు వినుండు' అని వారిని ఆనందపఱచుచు నిట్లు పలికెను.

జానే దీనదశా మహం దివిషదాం భూమేశ్చ భీమై ర్నృపై
స్తత్ క్షేపాయ భవామి యాదవకులే సోఽహం సమగ్రాత్మనా,
దేవా వృష్ణికులే భవంతు కలయా దేవాంగనా శ్చావనౌ
మత్సేవార్థ మితి త్వదీయవచనం పాథోజభూ రూచివాన్. 5

**ఎఱుఁగుదు మీకు నిప్పుడమి కీదశ ముష్కరులైన రాజులన్**
**బొఱియుట, పూర్ణరూపమునఁ బుట్టెద యాదవవంశమందు, నం**
**దఱు నిఁక మీరు నంగనలు నన్ గొలువన్ జనియింపుఁడంశలన్**
**మఱి చని వృష్ణివంశమున, మంగళమౌ నిఁక మీఁదటన్ ధరన్.**

'జరాసంధాది భయంకర క్షత్రియవర్గముచే దీనదశ నందిన భూమి యొక్కయు, దేవతల యొక్కయు దుర్దశ నే నెఱుంగుదును. ఆ దుష్టుల నిగ్రహించుటకు నా సంపూర్ణాంశముతో యాదవకులమం దవతరింతును. దేవతలును వారి అంగనలును వారివారి యంశములతో నన్ను సేవించుటకై వృష్ణివంశమందు అవతరింతురు గాక' అని వినిపించిన నీ మాటను బ్రహ్మ వారికి వినిపించెను.

శ్రుత్వా కర్ణరసాయనం తవ వచ స్సర్వేషు నిర్వాపిత
స్వాంతే ష్వీశగతేషు తావక కృపాపీయూష తృప్తాత్మసు,
విఖ్యాతే మధురాపురే కిల భవత్సాన్నిధ్యపుణ్యోత్తరే
ధన్యాం దేవకనందినీ ముదవహ ద్రాజా స శూరాత్మజః. 6

విని నీ కర్ణరసాయనమ్ములు ముదుల్ వేల్పుల్ సుఖస్వాంతులై
కని త్వద్దివ్యకృపామృతాప్లవనరంగత్తృప్తి నుండంగ, నీ
ఘన సాన్నిధ్య భవిష్య పుణ్యమధురన్ కల్యాణ దివ్యోత్సవ
మ్మును నయ్యెన్ వసుదేవ దేవకులకున్ మున్ లోకకల్యాణమై.

వీనులకు అమృతప్రాయమైన నీ పలుకు విని హృదయము లానంద భరితములై నీ కరుణాపీయూష పానముచే తృప్తినొంది వారు వెళ్ళగా, నీ కాబోవు సన్నిధానముచే పరమాభ్యుదయమునకు స్థానము కానున్న సుప్రసిద్ధమైన మధురా పురమందు శూరుని కుమారుడైన వసుదేవనృపతి ధన్యురాలైన దేవకనందనయగు దేవకిని వివాహమాడెను.

ఉద్వాహావసితౌ తదీయసహజః కంసోఽథ సమ్మానయ
న్నేతౌ సూతతయా గతః పథి రథే వ్యోమోత్థయా త్వద్గిరా,
అస్యా స్త్వా మతిదుష్ట మష్టమ సుతో హంతేతి హంతేరితః
సంత్రాసాత్ సతు హంతు మంతికగతాం తన్వీం కృపాణీ మధాత్. 7

అంతట నూత్నదంపతుల నంపుచు సారథియై రథాన "ని
క్కాంతకుఁ గల్గు నెన్మిదవ గర్భము నిన్ ఖలు జంపు"నంచుఁ బ
ల్వింతగ నీదు పల్కు వినువీథి వినంబడఁ గంసుఁడన్న సం
భ్రాంతమనస్కుఁడై కొనెఁ గృపాణముఁ జెల్లెలి సంహరింపగన్.

వివాహమహోత్సవము చివర ఆమె సోదరుడు కంసుడు నూతన దంపతులను సమ్మానించుచు రథమెక్కించుకొని యేగుచుండగా, ఆకాశమందు నీ మాటగా 'ఈమె అష్టమగర్భమందు జన్మించు కుమారుడు దుష్టుడగు నిన్ను సంహరించును' అని వినిపించినది. విని కంసుడు మిక్కిలి జడిసి చెంతనున్న అబలయైన పెండ్లికూతురును జంపుటకు కృపాణము గైకొనెను.

గృహ్ణన శ్చికురేషు తాం ఖలమతి శ్శౌరే శ్చిరం సాంత్వనై
ర్నో ముంచన్ పునరాత్మజార్పణగిరా ప్రీతోఽథ యాతో గృహాన్,
ఆద్యం త్వత్సహజం తథార్పితమపి స్నేహేన నాహ న్నసౌ
దుష్టానామపి దేవ పుష్టకరుణా దృష్టా హి ధీ రేకదా. 8

**అయ్యయొ! పెండ్లి కూతురు గదయ్య! సహోదరిఁ బ్రోవుమన్న వాఁ**
**డియ్యకొనండు; పుట్టగనె యెల్లకుమారులఁ దెచ్చియిత్తునా**
**నియ్యకొనెన్; యదూద్వహుఁడు నిచ్చెను దొల్తటి బిడ్డఁ, జంపరాఁ**
**డయ్యెను వాఁడు ఆకటికియై సుతిమెత్తన చిత్త మొక్కెడన్.**

వాడు దేవకిజుట్టు పట్టుకొని వసుదేవు డెంత బ్రతిమాలినను వినక 'నా పుట్టిన కుమారులను ఎప్పటికప్పుడు నీకు సమర్పింతును' అను వసుదేవుని మాటకు బ్రీతుడై యింటి కేగెను ఆవల నీకు ముందు పుట్టిన శిశువును నీతండ్రి అన్నట్లు కొనిపోయి కంసునకు సమర్పింపగా నాదుష్టుడు స్నేహము పాటించి ఆ శిశువును జంపడయ్యెను స్వామి! ఒక్కొక్కప్పుడు దుష్టుల హృదయముకూడ కరుణాభరితమై కానబడును గదా!

**తావ త్త్వన్మనసైవ నారదమునిః ప్రోచే స భోజేశ్వరం**
**యూయం నన్వసురా స్సురాశ్చ యదవో జానాసి కిం న ప్రభో!**
**మాయావీ స హరి ర్భవద్వధకృతే భావీ సురప్రార్థనా**
**దిత్యాకర్ణ్య యదూ నదూధున దసౌ శౌరేశ్చ సూనూ నహన్.** **9**

**నీ సంకల్పముచేత నారదుఁడు వానింజేరి "యోకంస! స్వ**
**ర్వాసుల్ యాదవులెల్ల, మీరొ విను బూర్వస్వర్నివాసుల్, మదిఁ**
**వీస మ్మెంచవు నిన్ వధించు హరి" నా; వేగన్ బదభ్రష్టులన్**
**జేసెన్ యాదవులందుఁ బెద్దల; వధించెన్ దేవకీసూనులన్.**

ఆవల నీ మనస్సు ననుసరించియే నారద మహర్షి కంసునికడకు వచ్చి 'మీ రసురులు, యాదవులు సురలు (దేవతలు), ఓ రాజా! ఇది యెఱుగవా? హరి దేవతల మొఱవిని నిన్ను సంహరింపగలడు' అన విని కంసుడు యాదవులను స్థానభ్రష్టులను చేసెను. వసుదేవుని ముందరి బిడ్డల నందఱను సంహరించెను

**ప్రాప్తే సప్తమగర్భతా మహిపతౌ త్వత్ప్రేరణా న్మాయయా**
**నీతే మాధవ రోహిణీం త్వమపి భో స్సచ్చిత్సుఖైకాత్మకః,**
**దేవక్యా జఠరం వివేశిథ విభో! సంస్తూయమాన స్సురైః**
**స త్వం కృష్ణ! విధూయ రోగపటలీం భక్తిం పరాం దేహి మే.** **10**

ఘను(డా శేషుని వైష్ణవాంశమును సంకర్షించి గర్భమ్ము నీ
వన నీ మాయయె రోహిణీజఠరమం దర్పింప, సచ్చిత్సుఖా
త్మ నిరూఢిన్ మఱి దేవకీజఠర మంతన్ జేరినా వా సురల్
గొనియాడన్; పరభక్తి నీ(గదవె మాకున్ రామకృష్ణా! హరీ!

శేషుడు దేవకీ సప్తమగర్భమై యుండి నీ ప్రేరణచే మాయాశక్తి సహాయమున రోహిణిదరికి కొనిపోబడెను. కేవల సచ్చిదానంద స్వరూపుడవైన నీవు దేవకీ గర్భమున ప్రవేశించి దేవతలచే మిగుల స్తుతింపబడితివి. అట్టి కృష్ణుడవు నీవు నా రోగములను హరించి, పరమభక్తి ననుగ్రహింపుము.

## 38వ దశకము

# శ్రీకృష్ణావతారము

ఆనందరూప భగవ న్నయి తే౾వతారే
ప్రాప్తే ప్రదీప్త భవదంగ నిరీయమాణైః,
కాంతివ్రజై రివ ఘనాఘనమండలై ర్ద్యా
మావృణ్వతీ విరురుచే కిల వర్షవేలా. 1

ఆనందాత్మక! నీదు మేన్వెడలి దీవ్యత్కాంతిపుంజమ్ము ల
భ్రానం గ్రమ్మెననంగ వారిధరముల్ వ్యాపించి రూపించి శో
భా నవ్య మ్మొనరించె వర్షఋతు వప్పా! పూర్ణపుణ్యావతా
రానన్ నీ వరుదేరు వేళ భగవద్రమ్యార్థరూపా! హరీ!

ఓ ఆనందస్వరూపా! భగవంతుడా! నీ యవతారమునందు నల్లని తళుకు నించెడి నీ మేనికాంతి పుంజమో అనునట్లు మేఘమండలము ఆకసమావరించి, వర్షఋతువు మిగుల శోభించెను.

ఆశాసు శీతలతరాసు పయోదతోయై
రాశాశితాప్తివివశేషు చ సజ్జనేషు,

నై శాకరోదయవిధౌ నిశి మధ్యమాయాం
క్లేశాపహ స్త్రిజగతాం త్వ మిహావిరాసీః. 2

చలువల్ గ్రమ్మ దిశావకాకాశముల, వాంఛాసిద్ధియై పుణ్యక
ర్తలు హర్షింపగ, మూఁడులోకములకుం దాపాంత మౌనట్లుగా
నిలపై నీ వవతార మెత్తితివి తండ్రీ! యర్ధరాత్రానఁగ
ల్వలతేఁ డప్పుడె తూర్పుకొండకొన పైపై తొంగిచూడన్ హరీ!

సకలదిశలు మేఘోదకముచే మిగుల చలువ నందెను సజ్జనులు అభీష్టసిద్ధి యయ్యెనని ఆనందవివశు లగుచుండిరి అర్ధరాత్రమందు అమృతాంశుబింబము అప్పుడే ఉదయించుచుండెను జగత్త్రయక్లేశ హారివై ఓ హరీ! నీవు ఆ పుణ్యసమయమందు అవతరించితివి

బాల్యస్పృశాఽపి వపుషా దధుషా విభూతీ
రుద్యత్కిరీటకటకాంగదహార భాసా,
శంఖారి వారిజ గదా పరిభాసితేన
మేఘాసితేన పరిలేసిథ సూతిగేహే. 3

అనయ మ్మయ్యణిమాదివైభవము తొల్కాడంగ, సౌవర్ణనూ
తన కేయూర కిరీట కంకణ కనద్ధారావళుల్ గుల్కగా
ఘన శంఖాబ్జ గదా సుదర్శనములన్ గైసేసి మేఘద్యుతిన్
గననైనావట! సూతికా గృహమునన్ గైశోర రమ్యాకృతిన్.

శిశుమూర్తివయ్యును నీమూర్తియందు అణిమాదివిభూతులు స్ఫూర్తినందగా కిరీట కంకణ అంగద మణిహారముల కాంతులు మిరుమిట్లు గొలుపగా, శంఖ చక్ర పద్మ గదా విభాసివై తొలకరి మేఘమట్లు మెఱయు మేనితో పురిటింటిలో మిగుల శోభించితివి

వక్షఃస్థలీ సుఖ నిలీన విలాసి లక్ష్మీ
మందాక్షలక్షిత కటాక్ష విమోక్షభేదైః,
తన్మందిరస్య ఖల కంసకృతా మలక్ష్మీ
మున్మార్జయన్నివ విరేజిథ వాసుదేవ! 4

**ఆయెడ ల్మచ్చి నీదు హృదయాంబుజ పీఠి వసించి హాస ల**
**జ్జాయుత దృష్టి వెన్నెలఁ బ్రసారముసేసి ఖలుండు కంసు నా**
**జ్ఞాయతిఁ గ్రమ్మి చీకఁటుల చాయ నలక్ష్మిఁ దొలంగఁ జేయ శో**
**భాయతిఁ దేజరిల్లితి గదయ్య! ధగద్ధగితాద్భుతద్యుతిౕ.**

నీ వినూతన లీలామానుష విగ్రహపరిగ్రహముచే ప్రేమోత్కర్ష విశేషము నంది నీ వక్షఃస్థలమందు విలసిల్లు మహాలక్ష్మియొక్క లజ్జావిలాస కటాక్షములచే ఆ చీకటియింట నలముకొనిన యలక్ష్మిని పరిహరించుచున్నావన్నట్లు అందు దేదీప్యమానుడవై విలసిల్లితివి.

**శౌరిస్తు ధీర మునిమండల చేతసోఽపి**
**దూరస్థితం వపు రుదీక్ష్య నిజేక్షణాభ్యామ్,**
**ఆనందబాష్ప పులకోద్గమ గద్గదార్ద్ర**
**స్తుష్టావ దృష్టిమకరందరసం భవంతమ్.** 5

**ధీరోదాత్తము యోగిబృందము సమాధిం బట్టుకోలేని యా**
**కార మ్మొట్టెదురై కనుల్ చెమరుపంగా మై గగుర్పాటు పొం**
**గారన్, గందొవఁ దేనెతేట యయి డాయౕ నిండు సౌందర్యభాం**
**డారమ్ముం గని హర్ష గద్గదికతోడౕ శౌరి ని న్నిట్లనుౕ.**

వసుదేవుడు ధీరులైన మునిబృందముల డెందములకు గూడ అందరాని నీ యందము కనులార చూచి ఆనందబాష్పములు నించుచు మేను పులకరింపగా గద్గదిక వొడమ కన్నులకు మకరందధారయైయున్న నిన్నిట్లు స్తుతించెను.

**దేవ ప్రసీద పరపూరుష తాపవల్లీ**
**నిర్లూన దాత్ర సమనేత్ర కలావిలాసిన్!**
**ఖేదా నపాకురు కృపాగురుభిః కటాక్షై**
**రిత్యాది తేన ముదితేన చిరం నుతోఽభూః.** 6

**"ఓ పరమేశ! ఓ వరద! ఓయి హరీ! కరుణింపవోయి నౕ**
**దాపలతా లవిత్ర! సమతా స్తుతిపాత్ర! సమస్త సృష్టి లీ**

లా పరికల్ప నాద్భుతకలాకలనా! కరుణా కటాక్ష సం
వ్యాపృతి నా శ్రమ మ్ముడుపరా!"యనియెన్ వసుదేవుఁడయ్యెడన్.

'దేవా! పరమపురుషా! తాపములనెడి తీగలను ఖండించు కొడవలి స్వరూపమైన ఓ పరమాత్మా! ఓ సర్వనియంతా! స్వాంశమైన మాయతో జగత్సృష్ట్యాది క్రీడావిలాసి వగు నో దైవమా! నా ఖేదములను నీ గురుకృపాకటాక్షములచే వారింపుము'. అని యిట్లు పెక్కు భంగుల ఆనందవివశుడైన ఆయనచే స్తుతింపబడితివి.

మాత్రాచ నేత్రసలిలా స్సృతగాత్రవల్ల్యా
స్తోత్రై రభిష్టుతగుణః కరుణాలయ స్త్వమ్,
ప్రాచీన జన్మయుగలం ప్రతిబోధ్య తాభ్యాం
మాతుర్గిరా దధిథ మానుష బాలవేషమ్. 7

అమ్మయు హర్ష బాష్ప సలిలాప్లుత గాత్రలతాభిరామయై
నెమ్మి నుతించె నీ సొగసు! నీ తల్లిదండ్రుల కాత్మ జన్మజ
న్మమ్ముల జ్ఞప్తికిం గొలిపి మాధవ! దేవకి కోరుకొన్న సౌ
మ్యమ్మగు రూపు దాల్చితివి మానుష చారుకిశోర వేషముఁ.

ఆనందబాష్పములచే మేనుదీవ తడియగా నీ తల్లి దేవకి నీ కళ్యాణగుణము లను నుతింపగా కరుణానిధివైన నీవు నీ పూర్వావతారములను రెండింటిని అనగా పృశ్ని సుతపస్సు అను దంపతులకు పృశ్నిగర్భుడను పేరను అదితి కాశ్యపులకు వామనుడను పేరను అవతరించిన వృత్తాంతమును దేవకీ వసుదేవులకు జ్ఞప్తిచేసి తల్లిమాట నాదరించి మానవ శిశువేషమును ధరించితివి.

త్వత్ప్రేరిత స్తదను నందతనూజయా తే
వ్యత్యాస మారచయితుం సహి శూరసూనుః,
త్వాం హస్తయో రధిత చిత్తవిధార్య మార్యై
రంభోరుహస్థకలహంస్థ కిశోరరమ్యమ్. 8

న న్నటడించి నందు సదనమ్మునఁ బుట్టిన కొమ్మఁ దెచ్చికొ
మ్మన్న భవత్ప్రచోదనకు నవ్వసుదేవుఁడు యోగు లాత్మలో

**నెన్నఁడు, దాల్చు నిన్ను వహియించెఁ గరమ్ముల; నప్పు డొప్పినా**
**వన్న! సరోరుహాగ్ర కలహంస కిశోర మనోరమాకృతిన్.**

యశోద ప్రక్కలోనున్న పిల్లను కొనివచ్చి నన్నచట నుంచి రమ్మని చెప్పిన నీ ప్రేరణచే, మునులు నిత్యము చిత్తమునందు ధరించు నిన్ను, కమలముపై నున్న కలహంస కిశోరమట్లు అందముగొలుపగా వసుదేవుడు నిన్ను తనహస్తములందు ధరించెను.

**జాతా తదా పశుపసద్మని యోగనిద్రా**
**నిద్రావిముద్రిత మథాకృత పౌరలోకమ్,**
**త్వత్ప్రేరణా త్కిమివ చిత్రమచేతనై ర్య**
**ద్ద్వారై స్స్వయంవ్యఘటి సంఘటితై స్సుగాఢమ్.** 9

**నందునియింట నాడు జననమ్మయి యున్నది యోగనిద్ర ని**
**ద్రం దులకింపఁజేసె వ్రజవాటము నెల్లను నీదు ప్రేరణన్**
**ముందుఁబ్రగాఢ సంఘటితముల్ దలుపుల్ గడియల్ జడమ్ము ల**
**య్యుం దమయంతటన్ దెఱచుకొన్నవి వింత యికేమి యింతకున్.**

అట్లు నీవు ప్రయాణమైన సమయమున యోగనిద్ర మాయ నందునియింట యశోదకు జనియించి నీ ప్రేరణచేతనే మధురాపురవాసులైన జనులను గాఢ నిద్రాముద్రితులను జేసెను. మఱియు అఘటన ఘటనా సమర్థుడవగు నీ ప్రచోదనచేతనే అచేతనములైన ద్వారముల గడియలు తమంత విడి తలుపులు తెఱచుకొన్నవి. ఇంతకంటె ఆశ్చర్యమేమున్నది?

**శేషేణ భూరిఫణ వారితవారిణాఽథ**
**స్వైరం ప్రదర్శితపథో మణిదీపితేన,**
**త్వాం ధారయన్ సఖలు ధన్యతమః ప్రతస్థే**
**సోఽయం త్వమీశ మమనాశయ రోగవేగాన్.** 10

**పడగల్ విప్పి ప్రవాహ మాపి మణిదీప జ్యోతులం జోపి శే**
**షగడు మున్ముందుఁ ద్రోవ సూపి నడువన్ శూరాన్వయాంభోధిచం**
**ద్రుఁడు నిన్ దాల్చి పురోగమించె నిటు లెందున్ నీ ప్రభావమ్ము లే**
**ర్పడు నీ రీతులఁ దాపవేగ ముడిగింపన్ రార! మావల్లభా!**

శేషుడు తన విశాలమైన పడగలు విప్పి యమునానదీ ప్రవాహము నాపి నిజ ఫణామణి దీపములు జోపి తనంత దారి చూపగా ధన్యుడగు వసుదేవుడు నిన్నెత్తుకొని వ్రేపల్లెకు పయనమయ్యెను. అట్టి అచింత్యమహిమలు గలిగిన యీశ్వరుడవు నీవు నా వ్యాధివేగమును నశింపజేయుము.

## 39వ దశకము

# యోగమాయానయనాదికము

భవంత మయ ముద్వహన్ యదుకులోద్వహో నిస్సరన్
దదర్శ గగనోచ్చల జ్జలభరాం కలిందాత్మజామ్,
అహో సలిలసంచయ స్స పున రైంద్రజాలోదితో
జలౌఘ ఇవ తత్ క్షణాత్ ప్రపదమేయతా మాయయా. 1

చేతుల నిన్ వహించి యదుశేఖరుఁ డభ్రనటత్తరజ్గ సం
ఘాతను సర్వకల్మషవిఘాతను దాటఁ జనఁ గళిందసం
జాతను నింద్రజాలమనఁ జాల్కొని యన్నది చిన్న పిల్ల కా
ల్వై తులకించె నాక్షణమునం దఱకాలు మునుంగుపాటియై.

యదుకుల శ్రేష్ఠుడు వసుదేవుడు నిన్నెత్తుకొని నడచుచు నాకాశమంటు తరంగములతోనున్న కాళిందిని చూచెను. ఆ ప్రవాహము ఇంద్రజాలము చేతవలె ఆక్షణమునందు అఱకాలు లోతు మాత్రము కలదయ్యెను.

ప్రసుప్తపశుపాలికాం నిభృత మారుద ద్బాలికా
మపావృత కవాటికాం పశుపవాటికా మావిశన్,
భవంత మయ మర్పయన్ ప్రసవతల్పకే తత్పదా
ద్వహన్ కపటకన్యకాం స్వపుర మాగతో వేగతః. 2

నిద్రాముద్రిత పాశుపాలకము నిర్నిద్రారుదద్బాలిక
మ్ముద్రోద్ఘోరుకవాటముం బశుపగేహోపాంతవాటమ్ము స

**చ్చిద్రూపా! చని సూతికాశయనవాసిం జేసి యా శౌరి దీ**
**వ్యద్రక్తిం జనె నంత నెత్తికొని మాయాకేలికన్ బాలికన్.**

పశుపాలురు నిదురించిరి. ఇది యశోద గృహమని తెలుపుచు నామెకు పుట్టిన శిశువు కొంచెము కొంచెముగా నేడ్చుచుండెను. తమంతట నా యింటి తలుపులు తెఱచుకొనినవి. వసుదేవుడు నందగోపుని ఆ యింట ప్రవేశించి యశోద పురిటి మంచముపై నిన్నుంచి అచటగల మాయాశిశువు నెత్తుకొని వేగముగ తన పురమునకు తిరిగి వచ్చెను.

**తత స్త్వదనుజారవ క్షపితనిద్ర వేగద్రవ**
**ద్భటోత్కర నివేదిత ప్రసవవార్తయైవార్తిమాన్,**
**విముక్త చికురోత్కర స్త్వరిత మాపతన్ భోజరా**
**డతుష్ట ఇవ దృష్టవాన్ భగినికా కరే కన్యకామ్.** 3

**బాలిక పోరిడన్ నిదురఁబాసి హడల్కొని పాఱి నౌకరుల్**
**వ్రాలి వచింప నప్పురిటివార్తను, గంసుఁడు బెంగటిల్లి బెం**
**బేలయి జుట్టువీడి వెనువెంటన పర్విడి దేవకమ్మ కెం**
**గేల వసించు బాలఁగని కించవడెన్ దలక్రిందులై యెదఁ.**

మాయాశిశువు యొక్క ఏడుపు విని నిద్రభంగమై వేవేగ పఱుగెత్తి కారాగారభటులు దేవకి పురిటివార్త దెలుపగా నార్తిజెంది తలముడివీడ పఱుగుపఱుగున వచ్చి భోజరాజు చెల్లెలి హస్తమందున్న ఆడుశిశువును చూచియు సంతుష్టి జెందడయ్యెను.

**ధ్రువం కపటశాలినో మధుహరస్య మాయా భవే**
**దసావితి కిశోరికాం భగినికా కరాలింగితామ్,**
**ద్విపో నలిని కాంతరాదివ మృణాలికా మాక్షిప**
**న్నయం త్వజనుజా మజా ముపలపట్టకే పిష్టవాన్.** 4

**అగుఁ గపటాత్ముఁడైన మధుహంతకు మాయ యిదెల్ల నిక్కమే**
**యగునని తల్లి చేతి శిశు వయ్యది తామర తూడు నొక్క యే**

నుఁగు వడి లాగినట్లు మది నూల్కొన లాగి యజాస్వరూపయై
సొగసులుగుల్కు నాశిశువుఁ జొన్పి శిలన్ వడి రాచె నయ్యెడన్.

నిజముగా నిది కపటియగు మధుసూదనుని మాయయే అయియుండునని చెల్లెలి చేయి నంటికొనియున్న యాశిశువును యేనుగు తామరతీగనుండి తూడును లాగినట్లు లాగికొని నీచెల్లెలగు మాయను ఱాతిపై వైచి నలిపివైచెను.

తతో భవదుపాసకో ఝటితి మృత్యుపాశాదివ
ప్రముచ్య తరసైవ సా సమధిరూఢ రూపాంతరా,
అధస్తల మజగ్ముషీ వికస దష్టబాహు స్ఫుర
న్మహాయుధ మహో గతా కిల విహాయసా దిద్యుతే. 5

అటుపయి నీదుసేవకుఁ డయారె భయావహ మృత్యుపాశముల్
దటుకునఁదప్పుకొన్నటులఁ దప్పి తటాలున వేర రూప మ
ప్పటఁ గొని క్రిందికిం బడక వాయుపథమ్మున నంటి పోయి తా
నట వెలుగొందె సంవికసదష్టభుజా స్ఫురదాయుధద్యుతిన్.

ఆవల వేగముగ నీ యుపాసకుడు మృత్యుపాశమునుండి విడివడినట్లు కంసునిచేత విడివడి వేఱొక రూపము గొని ఆ మాయాబాలిక క్రిందబడక, నింగి కెగిరి యెనిమిది చేతులందు నెనిమిది దివ్యాయుధముల బూని తేజరిల్లెను.

నృశంసతర కంస తే కిము మయా వినిష్పిష్టయా
బభూవ భవదంతకః క్వచన చింత్యతాం తే హితమ్,
ఇతి త్వజనుజా విభో! ఖల ముదీర్య తం జగ్ముషీ
మరుద్గణపణాయితా భువి చ మందిరా ణ్యేయుషీ. 6

ఓరి నృశంస కంస! నను నూరక రాచిన నేమివచ్చె, నీ
వారసికొమ్ము నీ హితవు; నంతకుఁ డొండెడ నీకుఁ బుట్టె నం
చా రహిఁ బల్కి నీదు చెలియల్ వెలసెన్ భువి పెక్కు దేవతా
గారములం దనేకతను గాంచి మరుద్గణగణ్యమానయై.

'ఓరీ! నీచుడా! కంసా! నన్ను రాచినమాత్ర నేమైనది. నీ యంతకుడు ఒకచో నున్నాడు. నీ గతి చూచుకొనుము.' అని పలికి దేవతలచే నుతింపబడుచు

నేగి ఆ మాయాశక్తి జనుల ననుగ్రహించుటకు ఆయాగుడులందు సొచ్చి ఆ యా రూపముల వెలసియున్నది.

ప్రగే పున రగాత్మజా వచన మీరితా భూభుజా
ప్రలంబ బక పూతనా ప్రముఖ దానవా మాయినః,
భవన్నిధనకామ్యయా జగతి బభ్రము ర్నిర్భయాః
కుమారక విమారకాః కిమివ దుష్కరం నిష్కృపైః. 7

మరుసటి ప్రొద్దునః గిరిజమాటలు కంసునినోట విన్న ము
ష్కరు లదటింతలేక నినుఁ జంప వడిన్ జెలరేగి నల్దెసల్
దిరిగిరి బాలఘాతుకులు తీరి ప్రలంబ బకాది దానవుల్;
కొరకొరలాడు నక్కటికగుండెల నంటని క్రౌర్య ముండునే.

మఱునాడు ఉదయమున కంసుడు ప్రలంబ బక పూతనా ప్రముఖ దానవుల కా శిశువు మాటలు తెలుపగా, దురభిమానులైన యా రక్కసులు నిన్ను సంహరింపదలచి జడుపు విడిచి శిశుమారకులై లోకమందు చరించిరి. నిర్దయులకు చేయరాని ఘోర మేమియుండును?

**తతః పశుపమందిరే త్వయి ముకుంద నందప్రియా**
**ప్రసూతిశయనేశయే రుదతి కించిదంచత్పదే,**
**విబుధ్య వనితాజనై స్తనయసంభవే ఘోషితే**
**ముదా కిము వదా మ్యహో సకల మాకులం గోకులమ్.** 8

ఇంతులు నందు నింటఁ బురిటింట యశోదమ ప్రక్కలోన నొ
క్కింతన చిన్ని నీ యడుగు లెత్తుచు నేడ్వగ, గొల్లభామలున్
వింతగ మా యశోద మగబిడ్డ గనెం గనుడంచుఁ జాటి ర
త్యంతము గోకులమ్ము ప్రమదాకుల హర్షసమాకులమ్మగన్.

ఆవల నందమందిరమున పురిటిమంచమందు పరుండి యించుక కాలు పైకెత్తి నీ వేడ్చుచుండగా స్త్రీలు మెలకువగొని యశోదకు మగపిల్లవాడు కలిగెనని తెలుపగా గోకులమెల్ల ఆనందసంకులమయ్యెను. ఆ వైభవ మేమి చెప్పుదును?

**అహో ఖలు యశోదయా నవకలాయచేతోహరం**
**భవంత మల మంతికే ప్రథమ మాపిబంత్యా దృశా,**
**పునః స్తనభరం నిజం సపది పాయయంత్యా ముదా**
**మనోహర తనుస్పృశా జగతి పుణ్యవంతో జితాః.** **9**

**అద్దిర నీ దపింఛకుసుమాభశరీరుఁ గుమారుఁ జూచి పల్**
**ముద్దులు గుల్కు నీ చెలువముం గనుదమ్ములఁ ద్రావి నందు న**
**మ్ముద్దియ పాలొసంగి నవముగ్ధ మనోహర బాలమూర్తి నీ**
**ముద్దిడి గెల్చె ముజ్జగముపుణ్యవతీతిలకమ్ము లందఱన్.**

ఆహా! యశోద ఇరుగుడుపూవువలె నల్లనై చక్కగనున్న నిన్ను మునుముందు తన చూపులచే ద్రావి యవల నీకు తాను చనుగుడిపి నీ మనోహరమైన నెమ్మేను నిమురుచు సర్వభువనములందున్న పుణ్యశీలు రందఱకు బైచేయియై యొప్పెను.

**భవత్కుశలకామ్యయా స ఖలు నందగోప స్తదా**
**ప్రమోదభరసంకులో ద్విజకులాయ కింనాదదాత్,**
**తథైవ పశుపాలకాః కిము న మంగళం తేనిరే**
**జగత్త్రితయమంగళ! త్వ మిహ పాహి మా మామయాత్.** **10**

**అప్పుడు నందగోపుడుఁ త్వదభ్యుదయ మ్మెదఁగోరి యెంతయుఁ**
**ముప్పిరిగొన్న హర్షమున పుణ్యులు విప్రుల కీయకున్న దే?**
**మప్పుడు గోపకుల్ సలుప నట్టిది మంగళ మేమియున్న దో**
**యప్ప? మదార్తిఁబో నడపవయ్య! జగత్త్రయ మంగళోదయా!**

నందగోపుడు నీ క్షేమమును గోరి యానందభరితుడై బ్రాహ్మణ సంఘమునకు మనసార నీయనిది లేనే లేదు. అట్లే గోపకులును ఒనరింపని మంగళములును లేనే లేవు. సకల భువన మంగళమూర్తివైన నీవు న న్నాధివ్యాధుల నుండి స్వామి! రక్షింపవలయును.

# 40వ దశకము

# పూతనానుగ్రహము

**తదను నంద మమందశుభాస్పదం నృపపురీం కరదానకృతే గతమ్,**
**సమవలోక్య జగాద భవత్పితా విదితకం ససహాయజనోద్యమః. 1**

పన్నులు గట్టనందుఁడు శుభస్ఫురణం జన రాజధాని, కం
దెన్నియొ దుర్ణయమ్ము లొనరింపఁ దలంచిన కంసువార్త లం
దున్న తదాప్తవర్గము మహోగ్రతయున్ వసుదేవుఁ డెంచి తా
నున్నవి యున్నటుల్ దెలిపి యొయ్యన నాప్తత సూపి వెండియున్.

అవ్వల ఉత్తమగుణ సంపన్నుడైన నందుడు కంసునికి పన్ను చెల్లించుటకు మధురానగరమునకు వెళ్ళెను. అప్పుడు నీ జనకుడు వసుదేవుడు, పసి పిల్లల నందఱను సంహరించుటకు కంసుడు పన్నిన కుతంత్రములను విని నందునికి తెలిపి జాగరూకులై యుండుడని హెచ్చరించెను.

**అయి సఖే తవ బాలకజన్మ మాం సుఖయతేఽద్య నిజాత్మజ జన్మవత్,**
**ఇతి భవత్పితృతాం వ్రజనాయకే సమధిరోప్య శశంస త మాదరాత్. 2**

నీకు బిడ్డఁడు గలుగగా నాకుఁ గలిగి
నంత యానందమయ్యె నందాధిపా? య
టంచు వసుదేవుఁ డాత్మీయ జనకభావ
మదియుఁ గడునేర్పుతోడ గోప్యమ్మొనర్చె.

నీకు కుమారుడు కలుగుట నాకు కలిగినట్లే ఆనందము చేకూర్చినది. అని వసుదేవుడు నిజముగా నిన్ను కనిన తండ్రిగా తా నర్థమగునట్లు నందుని కొనియాడెను.

**ఇహ చ సంత్యనిమిత్తశతాని తే కటకసీమ్ని తతో లఘు గమ్యతామ్,**
**ఇతి చ తద్వచసా వ్రజనాయకో భవదపాయభియా ద్రుత మాయయౌ. 3**

ఇచ్చట నీ వ్రేపల్లియ
నచ్చట దుశ్శకునజాల మదె కనవచ్చెన్
జెచ్చెరఁ జనుమన, నందుఁడు
వచ్చెన్ వెనుదిరిగి భవదపాయ భయానన్.

ఇక్కడను మీ వ్రేపల్లెయందును దుశ్శకునములు చాల గానవచ్చుచున్నవి వేగముగ నింటికి వెళ్ళుము అని చెప్పిన వసుదేవుని హెచ్చరిక ననుసరించి, నీ కేమైన ప్రమాదము కలుగునన్న భయముచే నందుడు వెంటనే యింటికి వచ్చెను

అవసరే ఖలు తత్ర చ కాచన వ్రజపదే మధురాకృతి రంగనా,
తరళషట్పద లాలితకుంతలా కపటపోతక తే నికటం గతా. 4

సరిగా నా సమయానకు
సరసాకృతి పూని తరళ షట్పదకుల సుం
దరవేణి యొకతె మాయా
నరబాలక! నీదు దరికి నవ్వుచు వచ్చెన్.

ఆ సమయమందు ఒకానొక అందకత్తెయై పూతనయను రాక్షసి తుమ్మెదల మించు నల్లనైన కొప్పుతో ఓ కపట బాలకమూర్తీ! నీ దరికి వచ్చెను

సపది సా హృతబాలకచేతేనా నిశిచరాన్వయజా కిల పూతనా,
వ్రజవధూష్విహ కేయమితి క్షణం విమృశతీషు భవంత ముపాదదే. 5

పూతన యా రాక్షసి శిశు
ఘాతిని వ్రజకాంత లెల్లఁ గని; యెవరే యీ
నాతి యను నంతలోఁ జే
సేతన్ నిన్నెత్తికొని హసించుచు నిలిచెన్

అది శిశుఘాతిని రాక్షసి గోపకాంతలు ఇదియెవరని విమర్శించుచున్న క్షణములోనే అది నిన్నెత్తుకొని లాలించుచు నిలుచుండెను

లలిత భావవిలాసహృతాత్మభి ర్యువతిభిః ప్రతిరోద్ధు మపారితా,
స్తనమసౌ భవనాంతనిషేదుషీ ప్రదదుషీ భవతే కపటాత్మనే. 6

**అది నట్టింటను గూరుచుండి నిను మాయాడింభకుఁ రొమ్మునన్**
**గుదియం జేయుచు నల్లనయ్య! కడు నా కొన్నావు పాల్ద్రావు మం**
**చదిరా! చూపెడు నట్టి వత్సలరస మ్మాహావభావమ్ములఁ**
**ముదితల్ దత్తరమంది కాదనక యేమో చూచి రాశ్చర్యమై.**

దాని విలాసములకు, శిశువును లాలించుటలో చూపెడి సొంపునకు మోసపోయి గోపికలుదానిని వద్దని వారింపలేకపోయిరి. అది యా నందభవనమున గూర్చుండి నీకు పాలిచ్చుట కారంభించెను.

**సమధిరుహ్య తదంక మశంకిత స్త్వమథ బాలకలోపనరోషితః,**
**మహదివామ్రఫలం కుచమండలం ప్రతిచుచూషిథ దుర్విషదూషితమ్. 7**

**శంకింప కంక మెక్కి వి**
**షాంకమ్మగు తత్కుచమ్ము నామ్ర ఫలమ్మ**
**ట్లంకించి కుడిచితివి శిశు**
**సంకటకారిణి యటన్న చలమూని హరీ!**

నీవు సంశయింపక దాని యొడిలో కూర్చుండి అది పెక్కుమంది శిశువులను పొట్టబెట్టికొనియున్నదని కోపముగొని మామిడిపండు కుడిచినట్లు విషదూషితమగు దాని కుచమండలమును గ్రహించి పాలు త్రాగ నారంభించితివి.

**అసుభిరేవ సమం ధయతి త్వయి స్తనమసౌ స్తనితోపమనిస్వనా,**
**నిరపత ద్భయదాయి నిజం వపుః ప్రతిగతా ప్రవిసార్య భుజా వుభౌ. 8**

**పాలను పేరుతో నసుర ప్రాణము లన్నియు తోడివైచి వేఁ**
**గ్రోలితి; వంత రక్కసియు ఘోర ఘనాఘన గర్జనమ్ముగాఁ**
**బోలన నార్చి కూలెఁ దనముందటిదేహ మనేకయోజనా**
**భీలముగాగ గుండెలు గుభిల్లన నెల్లరు తల్లడిల్లగన్**

పాలతోబాటు దాని ప్రాణములనుగూడ నీవు త్రాగగా పిడుగుపడినట్లు రొదగా నది యార్చి యోజనపరిమాణ శరీరముతో చేతులు పాఱజాచి నేలపై బడిపోయెను.

**భయదఘోషణ భీషణవిగ్రహ శ్రవణ దర్శన మోహితవల్లవే,**
**వ్రజపదే తదురస్థలఖేలనా న్యనుభవంత మగృహ్ణత గోపికాః. 9**

భీషణాఘోషమది దాని వేషమదియు
విని కని యశేష జనమును వివశమయ్యె
దాని రొమ్మునఁ బ్రాకుచోఁ దరుణు లరసి
యెత్తి కొని నిన్ను నురముల కొత్తికొనిరి.

అతిభీషణమైన ఆ ఘోషణమును విని ఆ రక్కసి యధార్థవేషమునుజూచి వ్రేపల్లెలోని అశేషజనము మూర్ఛపడిరి కొంతవడికి తెప్పిరిలి గోపాంగనలు మెల్లన జేరి దాని రొమ్మున క్రీడించు నిన్ను తటాలున నెత్తికొని ఉరమ్ముల నొత్తికొనిరి

**భువనమంగళనామభి రేవ తే యువతిభి ర్బహుధా కృతరక్షణః,**
**త్వ మయి వాత నికేతన నాథ మా మగదయిన్ కురు తావకసేవకమ్. 10**

అంగనలు లోకమంగళ మంగళమ్ము
లైన నీ నామముల సకలాంగములకు
రక్ష వెట్టిరి భక్త సంరక్షణైక
దక్షునకు స్వామి! మాకంగరక్ష గమ్ము

ఓ జగన్మంగళమూర్తీ! గోపికలు లోకమంగళములైన నీ నామములతోనే నీ సకలాంగములకు అంగరక్షవెట్టిరి అట్టి వాయుపురనివాసా! ఓ కృష్ణా! నీ దాసులను మమ్ము ఆరోగ్యవంతుల జేసి రక్షింపుము

# 41వ దశకము

# గోపీ గోపాల లాలనము

వ్రజేశ్వర శ్శౌరివచో నిశమ సమావ్రజ న్నధ్వని భీతచేతాః,
నిష్పిష్ట నిశ్శేషతరుం నిరీక్ష్య కంచిత్పదార్థం శరణంగత స్త్వామ్. 1

నందుఁడు శౌరిమాటల మన మ్మురియాడగ నింటి కేగుచున్,
ముందర పెద్ద మ్రాకులు సమూలము కూలిపడంగ నందుఁ జా
వొందిన రక్కసిం గని యహో! యని డెందము కొందలించి యే
మందును నిన్నొకానొక మహార్థ మెదఁ శరణందె నయ్యెడన్.

మధురా నగరమున వసుదేవుని మాటవిని నందుడు భీతుడై వ్రేపల్లెకు వచ్చి, అందు రెండు క్రోసులమేర చెట్లెల్ల కూల్చిన పూతన శరీరమును జూచి సంభ్రమించి పరవశుడై, ఒకానొక పదార్థమును అనగా అనిర్వచనీయ భగవత్తత్త్వమైయున్న నిన్నే శరణందెను.

నిశమ్య గోపీవచనా దుదంతం సర్వేఽపి గోపా భయ విస్మయాంధాః,
త్వత్పాతితం ఘోరపిశాచదేహం దేహు ర్విదూరేఽథ కుఠారకృత్తమ్. 2

గోప కులమ్ము ఘోష వ్రజఘోషమునం బ్రతిఘోష మీన లో
లోపల వింతయుం జడుపు లోఁగొన గొడ్డట ఖండఖండముల్
వాపి పిశాచిదేహమును బల్లెకు దవ్వులఁజేర్చి పేర్చి తా
రేపగిదిం దహించిరో కదే కడు నచ్చెరువయ్యె నద్దియున్.

గోపికలవలన పూతనా వృత్తాంతము విని గోపకులు దాని భయంకరరూప దర్శనముచే భయమును, నీచే నిదియెట్లు కూల్చబడినదని విస్మయమును బొంది గొడ్డళ్ళచే దానిశరీరమును ఖండించి, పల్లెకు దూరముగ గొనిపోయి దహింప జేసిరి.

**త్వత్పీతపూత స్తనత శ్శరీరాత్ సముచ్చల న్నుచ్చతరో హి ధూమః,**
**శంకా మధా దాగరవః కిమేష కిం చాందనో గౌగ్గులవో ఽ థవేతి. 3**

**ఈ వటు పాలు ద్రావి యొదవించిన పుణ్య విశేష వాసనన్**
**పావనమైన దాని మెయి పైపయి లేచిన ధూమమెల్ల నల్**
**ద్రోవలఁ జందన మ్మగురుధూపము గుగ్గులు ధూపమో యనన్**
**దావుల నించె నాశ్రితజనప్రియవల్లభ! దుష్టదుర్లభా!**

నీవుపాలు ద్రావుటచే రజస్తమోగుణనిలయమయ్యు శుద్ధసత్త్వమయమైన కుచయుగముతో కూడిన దాని శరీరమునుండి లేచిన పొగ గ్రమ్ముకొని, ఇది యగరుధూపమా లేక మంచిగంధ పరిమళమా గుగ్గులు ధూప వాసనయా అను సంశయము కలిగించెను.

**మదంగసంగస్య ఫలం న దూరే క్షణేన తావ ద్భవతా మపి స్యాత్,**
**ఇత్యుల్లప న్వల్లవతల్లజేభ్య స్త్వం పూతనా మాతనుథా స్సుగంధిమ్. 4**

**నాతను వంటు నా క్షణమునన్ బహు పుణ్య విశేష సౌరభ**
**మ్మా తెఱఁగై రహిన్ బరిమళింపక మాన దటంచు వల్లవీ**
**వ్రాత మెఱుంగఁ జేయుటకొ పాపిని పూతన మేను పుణ్య గం**
**ధాతతముం బొనర్చితి వయారె మహాద్భుత సాగరా! హరీ!**

"సచ్చిదానందమయుడనైన నన్నెత్తికొని ముద్దులాడుట యందు కలిగిన నా శరీరసంగము వలని ఫలము ఎన్నడోకాదు. కలిగిన క్షణమునందే కలుగును అట్టి ముక్తికి మీరును పాత్రులు" అని గోపికలకు తెలియజేయుటకు పూతన శరీరమును సుగంధ బంధురము గావించితివి.

**చిత్రం పిశాచ్యా న హతః కుమార శ్చిత్రం పురై వాకథి శౌరిణేదమ్,**
**ఇతిప్రశంసన్ కిల గోపలోకో భవన్ముఖాలోకరసే న్యమాంక్షీత్. 5**

**ఘోర పిశాచిచేఁ బడక కుఱ్ఱఁడు దక్కె నిదేమొ యీశ్వర**
**ప్రేరణ మంచు నింతమునుపే వసుదేవుఁడు సెప్పె నంచు, వి**

**స్మేర విలోచనాత్ములయి చెం గున గోపకులెల్ల నీ ముఖాం**
**భోరుహ దర్శనైకరస పూరమునందు మునింగి రచ్యుతా!**

పిశాచిచేత నందకుమారుడు హతుడు కాకపోవుట మహాశ్చర్యము. ముందే వసుదేవుడు చెప్పియున్నాడు కదా, అని పెక్కు రీతుల కొనియాడుచు గోపకులు నీ ముఖావలోకనము వలన గలిగెడి ఆనందములో మునిగిపోయిరి.

**దినేదినేఽథ ప్రతివృద్ధలక్ష్మీ రక్షీణమాంగల్యశతో వ్రజోఽయమ్,**
**భవన్నివాసా దయి వాసుదేవ! ప్రమోదసాంద్రః పరితో విరేజే. 6**

**ఆవల నాడు నాటి కొక యందము చందము నంది యంది నా**
**నావిధ మంగళాభ్యుదయ నవ్యవిలాసముచేఁ బ్రమోద సం**
**భావితమై యెసంగె వ్రజవాట ముదార రమావిహార లీ**
**లావసథ త్వదీయ చరణాంబుజ నిత్యనివాసమై హరీ!**

అంతటి నుండి వ్రేపల్లె ప్రతిదినము నిట్లు జరుగు మంగళములచే అక్షీణ లక్ష్మీసమృద్ధమై ఓ వాసుదేవా! ఇదంతయు నీ నిరంతర నివాసము వలన గలిగిన భాగ్యమని సాంద్రానంద వివశమై విలసిల్లెను.

**గృహేషు తే కోమలరూపహాస మిథఃకథాసంకలితాః కమన్యః,**
**వృత్తేషు కృత్యేషు భవన్ని రీక్షాసమాగతాః ప్రత్యహ మత్యనందన్. 7**

**నీ సుకుమార వేషమున నీ దరహాసము నీదు హాస్య వి**
**న్యాస విలాసముల్ మఱగి యచ్చిక బుచ్చిక లాడుకొంచు నె**
**ట్లో సరిదీర్చి యింటిపను లొప్పులకుప్పను నిన్నెచూచి యు**
**ల్లాసము చెందుచుండి రబలల్ మఱి మై మఱపొంది యందరుఁ.**

వ్రజకాంతలు తమతమ యిండ్లలో నీ మృదుల హాస రూప సంభాషణ మాధుర్యపరవశలై ఇంటిపనులు త్వరగా ముగించుకొని యశోదాగృహమునకు నిన్నె చూడవలెనను ముచ్చటతో వచ్చి ముద్దులాడి ఆనంద భరితులగుచుండిరి.

**అహో! కుమారో మయి దత్తదృష్టిః స్మితం కృతం మాం ప్రతి వత్సకేన,**
**ఏహ్యేహి మా మిత్యుపసార్య పాణిం త్వయీశ కింకిం న కృతం వధూభిః.8**

బాలుని చూపు నాపయిన వ్రాలెడు నెప్పుడుఁ జూడు చిన్నిగో
పాలుఁడు నవ్వ నన్నె కని; పాపఁడ! రా యిటు రార యంచు గో
పాల కులాంగనామణులు బాహులతల్ మఱిసాచి నీకునై
హేలగ నేమియేమి యొనరింపరు ముద్దులు ముచ్చటల్ హరీ!

వారు "అదిగో కృష్ణుడు నా వంకనే చూచుచున్నాడు, నన్నుచూచి నవ్వుచున్నాడు" అని యెవరికి వారే నీ విలాసములు ఆత్మోన్ముఖములైనట్లు తోచి చేతులు చాచి రా రమ్మని నిన్నెత్తికొని ముద్దుపెట్టుకొని యక్కున జేర్చికొని మఱి యెన్నో వినోదములచే మైమఱచిపోయిరి. ఆ గోపికల భాగ్యవిశేష మిట్టిట్టిదని చెప్పనలవి కాదు.

భవద్వపుఃస్పర్శనకౌతుకేన కరాత్కరం గోపవధూజనేన,
నీత స్త్వ మాతామ్ర సరోజమాలా వ్యాలంబి లోలంబతులా మలాసీః. 9

నీ లలితాంగ సంగరుచి నించిన వేడుకతో వ్రజాంగనల్
హేలగ చేత నందుకొని యింకొక చేతికి నందియిచ్చి యు
య్యాలగ నూచి పాడ నరుణారుణ నవ్య సరోజ పీఠికా
దోలికఁదూగు నక్కొదమ తుమ్మెదతోఁ దులతూగినా వటఁ.

నీ శరీరస్పర్శ యెడల గల కుతూహలములచే గోపవధూకులము చేతులలో నిన్ను ఒకచేతినుండి వేరొకచేతికి అందుకొనగా నందు అరుణ కమలమాలికపై తూగు కొదమ తుమ్మెద అందమునకు సాటియై క్రీడించితివి.

నిపాయయంతీ స్తన మంకగం త్వాం విలోకయంతీ వదనం హసంతీ,
దశాం యశోదా కతమాం నభేజే స తాదృశః పాహి హరే గదా న్మామ్. 10

నిను నొడిలోన నుంచికొని నించిన వేడుకఁ బా లొసంగుచుఁ
కనికని నీ మనోజ్ఞ వదనమ్మును నవ్వులఁ బుల్కరించుచు
న్మను మన గోపి నోము లెవి నోచెనొ యయ్యనుభూతియేమొ యె
వ్వని తరమౌనురా తెలిసి పల్కగ నన్ దయనేలరా! హరీ!

యశోద నీకు పాలిచ్చుచు నీ నెమ్మోముచూచి నవ్వుచు యిట్టిదని నుడువరాని ఆశ్చర్యానందముల నందెను. అట్టి గోపాలబాలమూర్తివి నన్ను వ్యాధి విముక్తుని జేయుము.

# 42వ దశకము

# శకటాసుర భంజనము

**కదాపి జన్మర్‌దినే తవ ప్రభో! నిమంత్రితజ్ఞాతివధూమహీసురా,**
**మహానస స్త్వాం సవిధే నిధాయ సా మహానసాదౌ వవృతే వ్రజేశ్వరీ. 1**

వలనొప్పన్ జిఱుబొజ్జనిండు నటులన్ బా లిచ్చి మీ యమ్మ నీ
తొలిజన్మర్క్ష మహోత్సవమ్మునకు విందుల్ సేసి యాప్త ద్విజా
వళి పుణ్యాంగన లందరం బిలిచి సంబాళించుచున్; సందడిన్
దలఁ పింకొక్కటిగాగ నిన్ను మఱచెన్ వంటింటి గుమ్మమ్ములోన్

నీయొక్క జన్మోత్సవమందు యశోద గోపికలను, బ్రాహ్మణపుణ్యస్త్రీలను బంధువర్గమును పేరంటము బిలిచి, నిన్ను వంటయిల్లు ప్రాంతమున విడిచి, వంటపనిలో నుండెను.

**తతో** భవత్త్రాణనియుక్త బాలక ప్రభీతి సంక్రందన సంకులారవైః,
విమిశ్ర మశ్రావి భవత్సమీపతః పరిస్ఫుటద్దారుచటచ్చటారవః. 2

ఆరసి చూచుచుండుఁడని యావిడ యచ్చట నిల్పినట్టి కౌ
మారకబృందముల్ భయసమంచితమై పొనరించినట్టి హా
హారవ మేకమై భవదుపాంతమునందు హఠాత్ పరిస్ఫుటత్
దారుచటచ్చటారవము దారుణమై వినిపించె నయ్యెడన్.

అయ్యెడ యశోద యీ బాలుని చూచుచుండుడని నియోగించిన బాలురు చేసిన యలజడి కేకలతోపాటు నీచేత విఱుగగొట్టబడి పడిన ఒక బండియొక్క చటచట ధ్వని వినవచ్చెను.

**తత** స్తదాకర్ణన సంభ్రమశ్రమ ప్రకంపి వక్షోజభరా వ్రజాంగనాః,
**భవంత మంత ర్దదృశు స్సమంతతో వినిష్పత ద్దారుణదారు మధ్యగమ్. 3**

**సంతత తద్రవశ్రవణ సంభ్రమణశ్రమకంపితోత్తుంగ చ**
**క్రాంతిభరానఁ గౌను వడకంగ వ్రజాంగన లేగి కాంచి రు**

**ద్వాంత వినిష్పత చ్ఛకట దారుణ గారవ ఖండ మధ్యగున్**
**వింతగ దోచు నిన్ను నరవిందముఖు నిజభక్త సమ్ముఖున్**

ఆ ధ్వని వినుటవలన తొట్రుపాటుజెంది కుచభరములు కంపింప గోపికాంగనలు పఱుగిడివచ్చి నీ భవనమందు నలువంకల విరిగి పడియున్న శకట దారుఖండములను, ఆ నడుమనున్న నిన్నును జూచిరి.

**శిశో రహో కిం కి మభూదితి ద్రుతం ప్రధావ్య నందః పశుపాశ్చ భూసురాః**
**భవంత మాలోక్య యశోదయా ధృతం సమాశ్వస న్నశ్రుజలార్ద్రలోచనాః. 4**

**ఇంతటఁ జిన్ని పాపనికి నేమొకొ యాపద సంభవించె నం**
**చెంతయుఁ దత్తరించి పలవించుచు నందుఁడు గొల్లలున్ ద్విజాల్**
**పొంత యశోద చంకనిడి ముద్దిడ నాడుచునున్నఁ జూచి ని**
**న్నంతట నెమ్మదింబడసి రశ్రుజలార్ద్ర విలోల నేత్రులై.**

నందుడు మఱిగోపకులు బ్రాహ్మణులు పఱుగిడివచ్చి శిశువునకు ఏమి ప్రమాదము జరిగినదని యలజడిజెంది యశోద యెత్తుకొనిన నిన్ను జూచి కన్నీరు నించుచు నెమ్మది జెందిరి

**కస్కో ను కౌత స్కుత ఏష విస్మయో విశంకటం యచ్ఛకటం విపాటితమ్,**
**న కారణం కించి దిహేతి తే స్థితా స్వనాసికా దత్తకరా స్త్వదీక్షకాః. 5**

**ఇది యే మే మిది యెట్టి దెట్టి దిదియెట్లెట్లయ్యె నాశ్చర్యమి**
**య్యది శంకింప విశంకటమ్ము శకట మ్మప్పాట నిష్పాటిత**
**మ్మదె; కొంచెమ్మును గారణమ్ము గనరాదయ్యెంగదా యంచు ని**
**న్నెదుటన్ ముక్కున వ్రేలుపెట్టుకొని యట్లే చూచి రయ్యందఱున్.**

ఈ బండి ఎక్కడ నుండి వచ్చినది, యెట్లువిరిగినది, యిట్లెట్లయినది, దీని నెవరు విఱుగగొట్టిరి, కారణము కనుపింపదు, అని ముక్కుపై వ్రేలువైచికొని నిన్ను చూచుచు నివ్వెరపడి నిలిచిరి.

**కుమారకస్యాస్య పయోధరార్థినః ప్రరోదనే లోలపదాంబుజాహతమ్,**
**మయా మయా దృష్ట మనోవిపర్యగా దితీశ తే పాలకబాలకా జగుః 6**

**ఆకటఁ జిక్కి పా కని యాకులుఁడై తన చిన్నిపాద మే**
**మో కదలించినాఁ డితడు నొయ్యన నయ్యది తాఁకి ప్రయ్యలై**
**యీకడఁ గూలె బండి, తిలకించితి నే నటంచుఁ దా**
**మేకముఖమ్ముగాఁ బలికి రెల్లరు గోపకడింభకుల్ ప్రభూ!**

పాలకొఱకు పోరువెట్టుచు నీ కృష్ణుడు కాలెత్తినంతట నది తాకి యీ బండి విఱిగి పడినదని నేను చూచితి నేను చూచితినని ఏకగ్రీవముగా గోపాలకబాలకులు నందాదులకు చెప్పిరి.

**భియా తదా కించి దజానతా మిదం కుమారకాణా మతిదుర్ఘటం వచః,**
**భవత్ప్రభావావిదురై రితీరితం మానాగివాశంక్యత దృష్టపూతనైః. 7**

**అననుగతంబు, సుంత నిజ మంటకుఁగా దిది, ముక్కుపచ్చ లా**
**రని నిసువుల్ భయంపడి కర మ్మిటు లందురు కాని వేర కా**
**దని రటఁ గొంద రందుఁ గల యయ్యలు, కొందరు పూతనాగతిన్**
**గని యగు నేమొ కాదనుట గాదని సందియ మంది రచ్యుతా!**

భయముచే తెలియక యేదో చెప్పెదరు. ఈ బాలుర మాటలు అతుకువడవు అని పెద్దలు కొందఱు నీ ప్రభావ మెఱుగనివారు అలక్ష్యముచేసి పలికిరి.

పూతనగతి చూచిన నందుడు ఉపనందుడు మొదలైనవారు ఇది జరిగియుండునేమో యని యించుక శంకించిరి.

**ప్రవాళతామ్రం కిమిదం పదం క్షతం సరోజరమ్యౌ ను కరౌ విరాజితౌ,**
**ఇతి ప్రసర్పత్కరుణాతరంగితా స్త్వ దంగ మాపస్పృశు రంగనాజనాః 8**

**ఇది పవడంబు డంబు హరియించు పద మ్మిటు గంటువోయె, నొ**
**ప్పిదము దొరంగి కందినవి బిడ్డని చేతులు తమ్మిపూవులం,**
**చదిర! కృపాతరంగిత హృదంతరలై తరళాక్షు లెల్ల ని**
**న్నొదఁ గదియించి మేన్పులకరింపుల ముద్దులు వెట్టి రంతటన్.**

పవడము వోలె నున్న యీ పాదము, అయ్యో! గంటువడినది. కమలము లట్లున్న హస్తములు నలిగినవి అనుచు కరుణాతరంగితలై గోపాంగనలు అల్లల్లన నిన్నెత్తికొని హృదయముల కొత్తికొనిరి.

**అయే సుతం దేహి జగత్పతేః కృపాతరంగపాతా త్పరిపాత మద్య మే,**
**ఇతి స్మ సంగృహ్య పితా త్వదంగకం ముహుర్ముహుః శ్లిష్యతి జాతకంటకః 9**

**అమ్మకచెల్లఁ చిన్న శిశు వప్పరమేశు కృపాతరంగపా**
**తమ్మిటు నెట్టి నంతటగదా యొక యొద్దునుబట్టి దక్కినాఁ**
**డిమ్మిటు తెమ్మటంచు నిను నెత్తి కవుంగిటఁ జేర్చి నందుఁ డ**
**బ్రమ్మగు హర్షముంబడసె నమ్మోయి నెమ్మోయి పుల్కరింపగన్**

ఏదీ పిల్లవానిని యిట్లందిమ్ము.. జగత్పతియగు విష్ణువు నంతరంగ కృపాతరంగము యీ శిశువు నీ కష్టమునుండి యొడ్డునకు నెట్టినది, అనుచు నీ తండ్రి నందుడు నిన్ను మాటిమాటికి కౌగిలించుకొని పులకిత శరీరుం డయ్యెను.

**అనోనిలీనః కిల హంతు మాగత స్సురారి రేవం భవతా విహింసితః,**
**రజోఽపి నో దృష్ట మముష్య తత్కథం న శుద్ధసత్త్వే త్వయి లీనవాన్ ధ్రువమ్.10**

**శకటమునందు నక్కి నిను జంపగ దైత్యుఁడు వచ్చి నీదు కా**
**లికి నటుదాకి కూలెను బళీ యొక యింత రజమ్ముగాని రే**
**గకయ; తమమ్ము మాట మఱి గల్గునె కేవల శుద్ధసత్త్వరూ**
**పకమగు నీ స్వరూపమున వాఁడు లయించుట నిక్క మీశ్వరా!**

శకటమందు నిగూఢముగ విలీనుడై నిన్ను చంపవచ్చిన రాక్షసు డిట్లు నీచే నిహతుడయ్యెను. అయినను రజోలేశము కూడ అనగా యించుక పరాగము కూడ లేదు అని యొక అర్థము. నీ చేతిలో నిహతుడగుటచే రజోగుణలేశమేని వీనియందు లేకుండ బోయినది, తమోగుణము మాట వేఱుగ జెప్పనక్కరలేదు. అని రెండవ యర్థము. అతడు సత్త్వగుణమాత్రుడై తత్త్వైకమూర్తివగు నీలో లీనమయ్యెను.

**ప్రపూజితై స్తత్ర తతో ద్విజాతిభి ర్విశేషతో లంభిత మంగలాశిషః**
**వ్రజంనిజై ర్బాల్యరసైర్విమోహయన్మరుత్పురాధీశ!రుజాం జహిహి మే.11**

**ఆ యెడఁ జేయు భూసుర కులార్చన గోకులమెల్ల నీకునై**
**చేయు నశేష మంగళ విశేషములన్ బెనుపొందఁజేసి నీ**

**చేయు నపూర్వ బాలక విచిత్ర వినోదములన్ విముగ్ధులన్**
**జేయుచు నుల్లసిల్లితివి శ్రీ గురువాయుపురేశ!ప్రోవవే.**

నందుడు బ్రాహ్మణులను బూజించి వారివలన యాశీర్వాదములను పొంది స్వస్థుడయ్యెను. నీవు నీ బాల్యలీలలచే వ్రజవాటమును మోహింపజేయుచు నిట్లు ఉల్లసిల్లితివి. ఓ మరుత్పుర ప్రభూ! నారోగమును విదళింపుము.

# 43వ దశకము

# తృణావర్త వధ

**త్వా మేకదా గురుమరుత్పురనాథ వోఢుం**
**గాఢాధిరూఢ గరిమాణ మపారయంతీ,**
**మాతా నిధాయ శయనే కిమిదం బతేతి**
**ధ్యాయంత్యచేష్టత గృహేషు నివిష్టశంకా. 1**

**ఒకతఱి నో మరుత్పురవిభూ! యొడిలో నిడి ముద్దులాడు న**
**మ్మకు భరియింపరాని గరిమమ్మయి తోఁచిన మోయరాని ని**
**న్నొకట! యశోద శయ్యపయి నొయ్యన డించి మహాద్భుత మ్మిదే**
**మొకొ యని సందియంపడుచు నుండెను దా నిలుదీర్చుతొందరన్**

ఒకనాడు ఒడిలో నిడుకొని యశోద నీకు పాలిచ్చి ముద్దులాడుచుండ తటాలున యెత్తుకొనరాని బరువై నీవు తోచితివి. ఇది యేమి విడ్డూరమని ఆ యమ్మ నివ్వెరపడి నిన్ను ప్రక్కపై పరుండబెట్టి యింటిపనులలో నుండెను.

**తావద్విదూర ముపకర్ణిత ఘోర ఘోష**
**వ్యాజృంభి పాంశుపటలీ పరిపూరితాశః,**
**వాత్యావపు స్సకిల దైత్యవరస్తృణావ**
**ర్తాఖ్యో జహార జనమానసహారిణం త్వామ్. 2**

వర్తిత ఘోరఘోష పరివర్తితమై పెనుధూళి రేచి స
ర్వార్తిదమై యశేష దిశ లల్లుకొనన్ సుడిగాలి వీచి చి
న్మూర్తి! హరించె నిన్ భువన మోహనమూర్తిని; వాఁడెపో తృణా
వర్తుఁడు రాక్షసాధముఁ డపారబలావినివర్తుఁ డయ్యెడన్

అంతలో దవుదవ్వుల పెనురొదతో ధూళిరేగి దిశలెల్ల క్రమ్మగా సుడిగాలి వీచి తృణావర్తుడనుపేరి రాక్షసుడై వచ్చి సర్వభువన మనోహరుడైన నిన్ను మీదికెత్తికొని పోయెను.

ఉద్దామ పాంసు తిమిరాహృత దృష్టిపాతే
ద్రష్టుం కిమప్యకుశలే పశుపాలలోకే,
హా బాలకస్య కిమితి త్వదుపాంత మాప్తా
మాతా భవంత మవిలోక్య భృశం రురోద. 3

కన్నుల ధూళి క్రమ్ముకొని కానగరా కిదియేమి దారుణ
మ్మన్న భయాన గోపజన మందరు వంత మునుంగ నయ్యో! మా
యన్న! యెచ్చైతి వన్న! కనుమన్న! యటం చటు సేరవచ్చి చూ
చె న్నిను బూని మీ జనని చెప్పగరాని విషాద వేదనన్.

ఉవ్వెత్తుగ రేగిన ధూళిచే కనుగానక మూగిన గోపకులు యిదేమి దారుణమని ఘోరదుఃఖమున మునిగిరి. నాతండ్రీ! ఏమైతివని ఆ దరికివచ్చి నీవు కనబడక యశోద హోరుమని యేడ్చెను.

తావ త్స దానవవరో ఽపిచ దీనమూర్తి
ర్భావత్కభారపరిధారణ లూనవేగః,
సంకోచ మాప తదను క్షతపాంసుఘోషే
ఘోషే వ్యతాయత భవజ్జననీనినాదః 4

అంతట దానవుండు, హరి! ఆదట మోయగరాని భారమై
నంతట నందె చచ్చువడి యవ్వాడి దగ్గి యొడల్ దిగాల్వడన్
గంతులు దక్కియంద యడగారె క్షతాఖిల పాంశుఘోషమై
కొంత యదోషమైన వ్రజ ఘోషము నిండె యశోదఘోషమున్

సుడిగాలి రూపమున వచ్చి నిన్నెత్తికొన్న తృణావర్తుడనెడి యారక్కసుడు నీ బరువునకు తట్టుకొనలేక వేగముడిగి దీనుడై నొశ్చేష్టుడైపోయెను. అవ్వల వ్రజఘోషమునందు మీ యమ్మ ఆక్రందనము అందఱకు వినిపించెను.

రోదోపకర్ణనవశా దుపగమ్య గేహం
క్రందత్సు నందముఖగోపకులేషు దీనః,
త్వాం దానవస్త్వఖిలముక్తికరం ముముక్షు
స్త్వయ్యప్రముంచతి పపాతవియత్ప్రదేశాత్. 5

విని యాక్రందన మింటికిన్ మఱలి యావ్రేలెల్ల నాలోచన
మ్మొనరింపన్, వెలవెల్లనై యసుర యోహో! సర్వముక్తి ప్రదున్
నిను ముక్తుం బొనరింపనెంచె; నవుగా నీవా దురాత్మున్ విము
క్తిని గావింపమి వాఁడ రాలిపడె నిందునో మృత్యు వాసన్నమై.

యశోద రోదనము విని నందాదిగోపకులు పనిమీద యిలువిడిచి దూర మేగినవారు యింటిమొగమై వచ్చి ఆక్రందించుచుండగా, దీనుడైన దానవుడు సర్వజనముక్తిదాతవైన నీ చేతినుండి ముక్తివడయగోరియు నీవు వానిని విడిచి పెట్టనందున నెట్లో నీతోగూడ నాకసమునుండి క్రిందబడెను.

రోదాకులా స్తదను గోపగణా బహిష్ఠ
పాషాణపృష్ఠభువి దేహ మతిస్థవిష్ఠమ్,
ప్రైక్షంత హంత నిపతంత మముష్యవక్ష
స్యక్షీణమేవచ భవంత మలం హసంతమ్. 6

ఆ యేడ్పుల్ వెడ బొబ్బలెల్ల విని గోపానీక మత్యాకుల
మ్మై యాముంగల నొక్కరాతిపయి వ్రేగై కూలి సర్వ ప్రజా
పాయమ్మౌ పెనుదేహ మట్టె కని రప్పా! నవ్వు తొల్కాడ నీ
వై యామేనునఁ బ్రాకులాడుటది యత్యాశ్చర్య మయ్యెన్ విభూ!

గోపకులు శోకాతురులై గ్రామము వెలుపలనున్న ఒక పెద్ద పాషాణముపై బడిన తృణావర్తుని స్థూలదేహమును, వాని వక్షముపై నేవిధమైన యాఘాతమును లేకుండ నవ్వుచు నాడుకొనుచున్న నిన్నును చక్కగా చూచిరి.

గ్రావప్రపాత పరిపిష్టగరిష్ఠ దేహ
భ్రష్టాసు దుష్టదనుజోపరి ధృష్టహాసమ్,
అఘ్నాన మంబుజకరేణ భవంతమేత్య
గోపా దధు ర్గిరివరాదివ నీలరత్నమ్. 7

పెనుశిలదాకి నుగ్గయిన పెద్ద యొడల్ విడి ప్రాణమేగినన్
దనుజుని రొమ్ముపై కెగసి నవ్వుచుఁ బ్రాకుచు నాటలాడు చుం
డిన నిను గోపు లెత్తుకొను తీవి గనన్ గిరి శృంగ సంగతిన్
గనిన మహేంద్ర నీలమణిఁగైకొను నందము దోఁచె నంతటన్.

పాషాణముపై పడుటవలన పిండిపిండియైన రాక్షసునిపై నవ్వుచు హస్తాబ్జములచే చప్పటులుగొట్టుచున్న నిన్ను గోపకులు పర్వతమునుండి యింద్ర నీలమణిని గైకొన్నట్లు కైకొని యెత్తికొనిరి.

ఏకైక మాశు పరిగృహ్య నికామనంద
న్నందాదిగోప పరిరబ్ధ విచుంబితాంగమ్,
ఆదాతుకామ పరికంపితగోపనారీ
హస్తాంబుజ ప్రపతితం ప్రణుమో భవంతమ్. 8

నందాదివ్రజబృంద మొక్కొకరు నిన్ నారాయణున్ సచ్చిదా
నంద బ్రహ్మముఁ గౌగిలించికొని యానందాన ముద్దాడఁ గ
న్విందై గోపిక లట్టె ముచ్చటపడన్ నీ వెంచి నీ యంతటన్
ముందే వ్రాలితి తత్కరాంబుజములన్ బూర్ణాత్మ! నన్బ్రోవవే.

ఒక్కొక్కరు నీ మృదుల కరచరణాదికము స్పృశించి నందాదులు ఆనంద భరితులై ముద్దిడి కౌగిలించుకొనిరి. అట్టి నిన్ను ఎత్తుకొన మేము మేమని యుబలాట పడుచున్న గోపసుందరుల హస్తాబ్జములందు నీయంతట నీవు వ్రాలితివి. అట్టి సొగసుకానిని నిన్ను మ్రొక్కుకొనుచున్నాము.

భూయోఽపి కిన్నుకృణుమః ప్రణతార్తిహారీ
గోవిందఏవ పరిపాలయతాత్ సుతం నః,

**ఇత్యాది మాతరపితృప్రముఖై స్తదానీం**
**సంప్రార్థితస్త్వదవనాయ విభో త్వమేవ.** 9

**ఎందులఁ జొత్తు, మే ముపచరింతుము, బిడ్డని రక్షవెట్టి మ**
**మ్మందఱ నేలువాఁడు ప్రణతా ర్తిహరుండగు వాఁడు వాఁడె గో**
**విందుఁ డటంచు, నిన్నె మఱి వేడిరి నీదగు రక్షణార్థ మీ**
**శుం దగ నందుఁడున్ మఱి యశోదయు గోపకు లేక వాక్యతన్.**

మీ యమ్మయు తండ్రియు యేమిచెప్పవలెను! ప్రణతార్తిహరుడగు గోవిందుడే మా పిల్లవానిని రక్షించుగాక అని యెన్నోరీతుల నీరక్షణమునకై నిన్నే ప్రార్థించిరి.

**వాతాత్మకం దనుజమేవమయిప్రధూన్వన్**
**వాతోద్భవాన్మమగదాన్ కిమునోధునోషి,**
**కిం వా కరోమి పునరప్యనిలాలయేశ**
**నిశ్శేషరోగశమనం ముహురర్థయే త్వామ్.** 10

**వాతాత్మక దనుజునికి వి**
**ఘాతము గల్గించినావు; ఘనమటరా నా**
**వాతము హరియించుట; యో**
**వాతాలయ! కొల్తునిన్ కృపారసనిలయా!**

వాతస్వరూపుడైన తృణావర్తుని యిట్లు విదళించిన స్వామీ! నావాతరోగముల నేల విదళింపకున్నావు? ఓ వాయుపురనాథా! నే నేమి చేయుదును? నిశ్శేష రోగశాంతిని చేయుమని పలురీతుల నిన్నే సేవించు చున్నాను.

# 44వ దశకము

# నామకరణోత్సవము

గూఢం వసుదేవగిరా కర్తుం తే నిష్క్రియస్య సంస్కారాన్,
హృద్గతహోరాతత్త్వో గర్గముని స్త్వద్గృహం విభో గతవాన్. 1

తను వసుదేవుం డేకత
మనుప గర్గుండు జ్యోతిషాచార్యుఁడు వ
చ్చెను మీ యింటికి నిష్క్రియుఁ
డనఁబడు నీ కెల్ల విధులు ననువుగ నడుపన్.

వసుదేవుని ప్రార్థనచే నిష్క్రియుడవైన నీకు నామకరణాది సంస్కారముల నొనరించుటకు హోరాశాస్త్రమెల్ల-సద్యఃస్ఫురణలో నున్న గర్గాచార్యులు మీ యింటికి వచ్చిరి.

నందో౾థ నందితాత్మా వృందిష్ఠం మానయ న్నముం యమినామ్,
మందస్మితార్ద్ర మూచే త్వత్సంస్కారాన్ విధాతు ముత్సుకధీః. 2

నందనుని కుత్సవము లా
నందమ్ముగ జరుపుఁడనుచు నందుఁడు వలికెన్
మందస్మిత సుందర వద
నేందిరుఁడగు యోగిబృంద వృందిష్ఠమునిన్.

ఆ మునివరుని నందు డానందభరితుడై సమ్మానించి, మందస్మితమధురుడై నీకు నామకరణాది సంస్కారములను చేయింపుడని కోరెను.

యదువంశాచార్యత్వాత్ సునిభృత మిద మాత్మకార్యమితి కథయన్,
గర్గో నిర్గతపులక శ్చక్రే తవ సాగ్రజస్య నామాని. 3

యదువంశ గురుత్వ మ్మొ
ప్పిదముగ నిది యాత్మభాగ్యవిధియని గర్గుం

దదె యన్నయ్యకు నీకున్
ముదమునఁ బేర్వెట్టె నొడలు పులకింపగన్.

నేను యదువంశ పురోహితుడైనందున ఈ నామకరణాదికము రహస్యముగా చేయవలసి యున్నదని చెప్పి నీకును, నీయన్న బలరామునకును గర్గాచార్యులు హర్షమున మేను పులకరింప యథావిధి నాయా సంస్కారముల జరిపెను.

కథ మస్య నామకుర్వే సహస్రనామ్నో హ్యనంతనామ్నో వా,
ఇతి నూనం గర్గముని శ్చక్రే తవ నామ నామ రహసి విభో 4

ఒకటా రెండా యిది యె
ట్లొకొ వందలును వేలు నున్నవి నామం
బొకడేల యనుచుఁ బేర్కొనె
నకలంకుని నిన్ను గర్గుఁడటఁ బేర్వేరన్.

సహస్రనామవాచ్యుడు అనంతనామధారియు నగు నీబాలునకు ఏమని పేరుబెట్టెదను? అని నీకు గర్గుడు రహస్యముగా నామకరణము జరిపించెను.

కృషిధాతు ణకారాభ్యాం సత్తానందాత్మతాం కిలాభిలపత్,
జగదఘకర్షిత్వం వా కథయ దృషిః కృష్ణనామ తే వ్యతనోత్. 5

ఉనికిని గృషి ధాతువు దె
ల్పును; ఆనందస్వరూప బోధ'ణ'కార
మ్మున నగును, బాపకర్షక
మనియును కృష్ణాఖ్య నాతఁడట నీ కుంచెన్.

కృషి ధాతువునకు సత్త అనగా ఉనికి అర్థము. న కారమునకు ఆనందమర్థము. సత్తయు ఆనందమను నారెండిటి యొక్క సామానాధి కరణ్యముచే కృష్ణ నామము పరబ్రహ్మవాచకమై నీయం దన్వర్థమైన దనియు, లేదా జగత్తు యొక్క పాపములను కర్షించువాడు అనగా తీసివేయువాడవు అనియు, గర్గఋషి నీకు కృష్ణుడను పేరుపెట్టెను. ప్రమాణము -

కృషి ర్భూవాచకశ్శబ్దో నశ్చ నిర్వాణవాచకః
తయో రైక్యం పరంబ్రహ్మ కృష్ణ ఇ త్యభిధీయతే

**అన్యాంశ్చ నామభేదాన్ వ్యాకుర్వ న్నగ్రజే చ రామాదీన్,**
**అతిమానుషానుభావం న్యగద త్వా మప్రకాశయన్ పిత్రే.** 6

**రామాది దివ్యనామము**
**లేమో మీ యన్న కన్వయించెన్ ముని ని**
**న్నేమో యతిమానుష సుష**
**మా మూర్తిగఁ దెలిపె గుప్తమార్గమున హరీ!**

మున్ను నీకున్న వాసుదేవాది నామములను నీయెడల నన్వయించుచు అతిమానుష ప్రభావుడవైన నిన్ను సాక్షాద్విష్ణుడవని వెల్లడికాకుండుటకు జాతకదృష్టితో మీ తండ్రికి ఆయానామములయర్థములను సమన్వయించి గర్గాచార్యుడు వివరించి చెప్పెను.

వి.వి.: వాసుదేవుడను పదమునకు సర్వదేవతలు ఈయనయందు వసింతురు అను నర్థవిశేషమును హృదయమున నుంచుకొని, వసుదేవుని కుమారుడు వాసుదేవుడు అను నభిప్రాయమునుగూడ నిగూఢపఱచుచు ఆచార్యుడు ఋషి కావున "ఋషిశ్చకిల దర్శనాత్" అతీంద్రియద్రష్టలు అనుటనుబట్టి నీ సకల నిష్కల రూప మెఱిగినవాడు కావున ఉభయవిధముగా సార్థకమగునట్లు నీకు నామకరణము గావించెనని భావము.

**స్నిహ్యతి యస్తవపుత్రే ముహ్యతి స న మాయికైః పున శ్శోకైః,**
**ద్రుహ్యతి య స్సతు నశ్యే దిత్యవదత్తే మహత్త్వ మృషివర్యః** 7

**శ్రీహరి! నీ పాపనితో**
**స్నేహముగని నరుఁడు మాయచే శోకముచే**
**మోహమ్ముఁ గనఁడు, వానికి**
**ద్రోహమ్మొనరించినతఁడు తోన నశించును.**

ఎవడు నీతనయునియెడ స్నేహముచూపునో అతడు మాయానిమిత్తములైన శోకములను అనుభవింపడు. నీ పుత్రునికి ఎవడు ద్రోహము సేయునో వాడు నశించును అనగా సంసారి యగును అని యిట్లు నీ జాతకమును గణించి గూఢార్థముగా నా ఋషివర్యుడు నీ మహత్త్వ విశేషములను పేర్కొనెను.

**జేష్యతి బహుతరదైత్యాన్ నేష్యతి నిజబంధులోక మమలపదమ్,**
**శ్రోష్యతి సువిమలకీర్తి ర స్యేతి భవద్విభూతి మృషి రూచే. 8**

**గెలుచుం దైత్యుల, గోత్రము**
**నిలుపు న్నిర్వాణపదము నీడల, శ్రుతులన్**
**గొలుపున్ విమల యశమ్ముల,**
**నలఘుం డని నీ విభూతు లమ్ముని పలికెన్**

మఱియు నీ బాలుడు దైత్యులను జయించును. తన బంధులోకమును విమలమైన స్థానమును బొందించును. అనగా నిష్కల బ్రహ్మభావమును జెందించును. లోకము పాపహరములైన యితని యశోగానములను వినగలదు అని నీ విభూతి విశేషములను వర్ణించెను.

**అమునైవ సర్వదుర్గం తరితాస్థ కృతాస్థ మత్ర తిష్ఠధ్వమ్,**
**హరి రేవే త్యనభిలప న్నిత్యాది త్వా మవర్ణయత్ స మునిః 9**

**తరియింతురు దుర్గమ్ముల**
**భరియింతురు ధన్య వృత్తిస్వాస్థ్యాన నిలన్**
**జరియింతు రనుచు నమ్ముని**
**హరి వని నిన్దెలుపకుండ నన్నియుఁ దెలిపెన్.**

మీ రందఱు నీ కుమారునిచే సర్వసంకటములను తరింపుడు, కృతార్థులు కండు. ఈయనను నమ్ముకొని యుండుడు, అని యతడు నీవు 'హరి' యని చెప్పకుండ నీ శ్రీకృష్ణావతార కార్యవిశేష మశేషమును వర్ణించెను.

**గర్గేఽథ నిర్గతేఽస్మిన్ నందిత నందాది నంద్యమానస్త్వమ్,**
**మద్గద ముద్గతకరుణో నిర్గమయ శ్రీమరుత్పురాధీశ! 10**

**గర్గాచార్యులు చని రప**
**వర్గద! నందాది సకల బంధువులు సుహృద్**
**వర్గమ్ములు నీతో సం**
**సర్గమ్మున నలరి రట్లు సాకుము కృష్ణా!**

గర్గాచార్యులు దయచేసిన తరువాత ఆనందభరితులైన నందాదాలచే అభినందితుడవైన ఓ మరుత్పురాధీశా! కరుణ ఉప్పొంగ నా రోగములను హరింపజేయుము.

# 45వ దశకము

# బలరామ కృష్ణ లీలలు

**అయి సబల మురారే పాణి జాను ప్రచారైః**
**కిమపి భవనభాగాన్ భూషయంతౌ భవంతౌ,**
**చలిత చరణకంజౌ మంజు మంజీర శింజా**
**శ్రవణ కుతుకభాజౌ చేరతు శ్చారువేగాత్.** 1

**ఆ నందాధిపు నింటి కెల్ల తొడవై యన్నయ్యయున్ నీవునున్**
**సానందంబుగ నుచ్చల చ్చరణ గుంజ న్మంజు మంజీర శిం**
**జా నాదమ్మునఁ జెంగలించి కర మాస్ఫాలించి జానుద్వయ**
**మ్మానం బ్రాకుట చూడ ముచ్చట గదన్నా! దేవకీ నందనా!**

బలరామ సహితుడవై ఓ కృష్ణా! చేతులతో జానువులతో ప్రాకుచు నందరాజ భవన భాగములను సర్వశోభనము లొనరించుచు మంజు మంజీర శింజామధురముగ చరణ కంజములను ఆడించుచు మీ రిద్దరు క్రీడ లాడుచుండుట చూడ ముచ్చటయ్యెను.

**మృదుమృదు విహసంతా వున్మిషద్దంతవంతౌ**
**వదనపతితకేశౌ దృశ్య పాదాబ్జదేశౌ,**
**భుజగళిత కరాంత వ్యాలగ త్కంకణాంకౌ**
**మతి మహరత ముచ్చైః పశ్యతాం విశ్వనౄణామ్.** 2

**అలకలు మోముపై గునిసియాడగఁ గొంచెము గొంచెమైన న**
**వ్వులఁ బలు మొగ్గలం దళుకు బొంపిరి వోవగ, రత్నకంకణా**

**వళి మణికట్టు లందుఁ బొదువన్ జరణమ్ములు పద్మరాగ కాం**
**తులఁదులకింప మీ సొబఁగు తోఁచెను విశ్వ విమోహనమ్ముగన్.**

అల్లల్లన నవ్వుచు దంతకాంతులు వెన్నెలలు గురియ మొగమునందు ముంగురు లొలయగా ప్రాకునపుడు మీ పాదాంబుజముల సొంపు గోచరింపగా, భుజములనుండి బాజుబందులు జారి ముంజేతి కంకణములను జేరగా మిమ్ము జూచెడి విశ్వమానవకోటి మనస్సులను మీరు హరించుచుంటిరి.

**అనుసరతి జనౌఘే కౌతుక వ్యాకులాక్షే**
**కిమపి కృతనినాదం వ్యాహసంతౌ ద్రవంతౌ,**
**వలిత వదనపద్మం పృష్టతో దత్తదృష్టీ**
**కిమివ న విదధాథే కౌతుకం వాసుదేవ. 3**

**వింతలు గుల్కు కందొవలు విచ్చి కనన్ వ్రజవీట మెల్ల మీ**
**చెంతనఁ జప్పటల్ సరువ చిర్నగవుల్ దొలుకంగ దూకి కే**
**రింతలు గొట్టుచున్ బొరిపొరిన్ వదనాబ్జము ద్రిప్పిచూచు చిం**
**తింతనరాని ముద్దు ఘటియించిరి మీ బలరాముఁడీవునున్.**

గోపాలురు వేడుకగొని కనులప్పగించి మీవెంటబడి చప్పటులు చరువ నవ్వుచు పఱుగెత్తి ముఖకమలముల వెనుకకు ద్రిప్పి చూచుచు మీరు చూపు పరమాద్భుత బాల విలాసములు చేకూర్చెడి వేడుక అపూర్వము.

**ద్రుతగతిషు పతంతా వుత్థితౌ లిప్తపంకౌ**
**దివి మునిభి రపంకై స్సస్మితం వంద్యమానౌ,**
**ద్రుతమథ జననీభ్యాం సానుకంపం గృహీతౌ**
**ముహురపి పరిరబ్ధౌ ద్రాగ్యువాం చుంబితౌ చ. 4**

**లీలగఁ బ్రాకుచున్ బడుచు లేచుచు మేనులు ధూళి బ్రుంగ మి**
**మ్మోలిన చూచి లేనగవులూని మునుల్ కయిమోడ్పు వెట్టగా,**
**జాలిగఁదల్లు లెత్తికొని చక్కన నక్కునఁజేర్చి ముద్దులన్**
**దేలుచునుండ్రు చిత్తము విలీనముగా నరమోడ్పుఁగన్నులన్.**

చరచర నడుచుచు నడుమనడుమ పడుచు లేచుచు, బురద (పంకము) మేనికి బూసికొనుచు అపంకులైన అనగా పంకరహితులు పాపరహితులు నైనమును లాకసమునందుండి అల్లన నవ్వుచు మీ మానుషవేషములను జూచి నమస్కరించుచుండగా, క్రింద పడుదురో అను భయముచే యశోదా రోహిణులు మిమ్మెత్తుకొని అక్కున జేర్చికొని ముద్దుపెట్టుకొనగా మీరు ముచ్చట చేకూర్చుచుండిరి.

**స్నుత కుచభర మంకే ధారయంతీ భవంతం**
**తరళ మతి యశోదా స్తన్యదా ధన్యధన్యా,**
**కపట పశుపమధ్యే ముగ్ధ హాసాంకురం తే**
**దశన ముకుళ హృద్యం వీక్ష్య వక్త్రం జహర్ష. 5**

**స్తనకుంభమ్ములఁ బాలుచేపగా యశోదాదేవి నా తండ్రి! ర**
**మ్మనుచున్ ని న్నొడిఁజేర్చి పాలొసఁగుచో నంతంత లేనవ్వు లిం**
**పెనయన్ వచ్చియురాని పల్వరుస నెంతేనిన్ నిగారింపు చిం**
**దిన నీ మో మటుచూచి గోపి మరియున్ నీతోడిదే లోకమై.**

యశోద పాలుచేపగా నిన్ను కుచభరమున నానించుకొని స్తన్యమిచ్చుచు ధన్యధన్యయై నడుమనడుమ ముగ్ధహాస మధురమై వచ్చియు రాని పలు మొగ్గల వరుసచే అగ్గలమైన యానందము కూర్చుచున్న నీ నెమ్మోము జూచి అపరిమితానంద భరితురాలయ్యెను.

**తదను చరణచారీ దారకైస్సాక మారా**
**న్నిలయతతిషు ఖేలన్ బాలచాపల్యశాలీ,**
**భవన శుక బిడాలాన్ వత్సకాం శ్చానుధావన్**
**కథమపి కృతహాసై ర్గోపకై ర్వారితోఽభూః 6**

**నడకల్ నేర్చి కుమార గోపకులతో నానా శిశుక్రీడలన్**
**దుడుకుల్ సూపుచు నిల్లిలుం దిరుగుచున్ దూకించుచున్ లేగలన్**
**వడిమైఁ బెంపుడు పిల్లులన్ జిలుకలన్ బట్టన్ దువాళించు మీ**
**యొడుపుల్ సూచుచు నవ్వి పట్టుదురు మిమ్ముత్సాహులై గోపకుల్.**

అవల తప్పటడుగులు వేయుచు తోడిబాలురతో నిరుగు పొరుగిండ్లలో నాడుచు బాలచాపల్యముగొని పెంపుడు చిలుకలను పిల్లులను లేగదూడలను వెంబడించి పఱువెత్తుచు అల్లన నవ్వు గోపకులచే నడుమ నడుమ నాపబడుచు మీరిద్దఱు అద్భుతానందమును చేకూర్చితిరి.

హలధరసహిత స్త్వం యత్ర యత్రోపయాతో
వివశపతితనేత్రాస్తత్ర తత్రైవ గోప్యః,
విగళిత గృహకృత్యా విస్మృతాపత్యభృత్యా
మురహర ముహు రత్యంతాకులా నిత్య మాసన్. 7

హలధరుతోడ నీ మసలు నట్టి యెడన్ దమ చూపు వ్రాలగా
లలనలు పుత్ర మిత్ర హితులన్ దలపోయక యింటికృత్యముల్
జలుపగ రాక కోర్కె కొనసాగఁ ద్వద్గతచిత్తవృత్తులై
వలపుల ముచ్చటల్ గొని రవారితభావనిరూఢి గోపికల్

గోపికలు బలరామునితో నీ వెచ్చట మసలుదువో అచ్చటనే వివశలై కను లప్పగించి యింటిపనులు విడిచి బిడ్డలను దాసదాసీజనమును మఱచి నిండు వేడుకగొని యుండిరి.

ప్రతినవనవనీతం గోపికాదత్త మిచ్ఛన్
కలపద ముపగాయన్ కోమలం క్వాఽపి నృత్యన్,
సదయ యువతిలోకై రర్పితం సర్పి రశ్నన్
క్వచన నవవిపక్వం దుగ్ధమ ప్యా పిబస్త్వమ్. 8

నవనవనీత మింద యదువందన! కొమ్మనఁ గొమ్మలందఱన్
దవిలి గ్రహించుచున్ కలపదమ్ముగఁ బాడుచుఁ జక్కనాడుచున్
యువతులు వెట్టు నేతులవియుం దిని మీఁగడ పాలు బొజ్జ నిం
తువు నవపక్వముల్ గొలిపి తోయజ నేత్రలు బుజ్జగింపగన్,

అప్పుడే తీసినవెన్నను గోపకన్యలు అందింప నందుకొనుచు అవ్యక్త మధురముగ కూనురాగములు దీయుచు నల్లల్లన నటించుచు జాలిగొని యువతులు నీకు తినిపించు నేతిముద్దలను దినుచు అప్పుడే కమ్మగ కాచిన గోక్షీరమును త్రావుచు విహరించితివి.

**మమఖలు బలిగేహే యాచనం జాత మాస్తా**
**మిహ పున రబలానా మగ్రతో నైవ కుర్వే,**
**ఇతివిహితమతిః కిం దేవ సంత్యజ్య యాచ్ఞాం**
**దధి ఘృత మహరస్త్వం చారుణా చోరణేన. 9**

**"బలి యాచించితిఁ గాక యిప్పు డబలావర్గమ్ము యాచింతునే!**
**యలుసై పోయెద" నన్న నిశ్చయముతోనా యాచనావృత్తి కె**
**వ్వలనన్ బూర్తిగ స్వస్తిచెప్పి యిపు డీ పాల్పెర్వులున్ వెన్న ప్రము**
**చ్చిలు నీ కొంటెతనాలకున్ దిగుట లక్ష్మి మానచోరా! హరీ!**

మున్ను బలియింట నేను యాచన మొనరించిన నొనరించితిగాక, ఇప్పుడిచట అబలల ముందాపని చేయనని నిశ్చయించి కాబోలు స్వామీ! ఆ యాచనావృత్తికి స్వస్తిచెప్పి ముచ్చటగొలుపు చోరవృత్తిచే పాలు పెరుగునేతులను ప్రముచ్చలించు పనికి పూనుకొన్నావు.

వి.వి.: బలి యనగా బలముకలవాడు అబల లనగా బలములేనివారు స్త్రీలు అని శ్లేష చమత్కారము.

**తవ దధిఘృతమోషే ఘోషయోషాజనానా**
**మభజత హృది రోషో నావకాశం న శోకః**
**హృదయ మపి ముషిత్వా హర్ష సింధౌ న్యధాస్త్వం**
**స మమ శమయ రోగాన్ వాతగేహాధినాథ. 10**

**పెరుగుల్ నేతులు దొంగిలించితని గోపీ ముగ్ధ చిత్తమ్ములం**
**దిరవుంగాంచవు కోపమున్ వగపు, తండ్రీ! సర్వవిత్తమ్ములన్**
**హరియిం తావల ముంచియెత్తెదవు బ్రహ్మానంద పాథోధిలోఁ,**
**గరుణాసింధుఁడ వేలుకోఁగదర నన్ కైవల్యదీక్షాగురూ!**

నీవు పాలు పెరుగులు దొంగిలించినను వ్రజఘోషమందలి యోషారత్నముల హృదయములందు రోషమునకుగాని శోకమునకుగాని అవకాశము లేక పోయెను. మఱియు వారిహృదయములనే దొంగిలించి హర్షసింధువునందు ముంచెత్తితివి. ఓ వాతాలయనాథా! నా రోగమును శమింపజేయుము.

## అధిక పాఠములు

శాఖాగ్రేఽథ విధుం విలోక్య ఫలమి త్యంబాం చ తాతం ముహుః
సంప్రార్థ్యాథ తదా తదీయవచసా ప్రోక్షిప్తబాహౌ త్వయి,
చిత్రం దేవ! శశీ సతే కరమగాత్ కింబ్రూమహే సంపతత్
జ్యోతిర్మండలపూరితాఖిలవపుః ప్రాగా విరాడ్రూపతామ్ 11

కని తరుశాఖలం దది యెకానొక పండని చందమామఁజ
య్యన నది తెచ్చి యిమ్మనగ నందుఁడు నిన్ జెయిసాచి యందుకొ
మ్మన నటు సేయి యెత్తితివి; అందెను జాబిలి నీదు చేతి కే
మనవలె యెల్ల వెల్గులొకఁడైన విరాట్పు రుషుండ వీవుగా

చెట్టుకొమ్మలందు చందమామను జూచి నందయశోదలను దానిని దెచ్చి యిమ్మని నీవనగా వా రదిగో అందికొమ్మన నీవు చేయి జాచితివి. స్వామి! అప్పుడు జాబిల్లి నీ చేతి కందివచ్చెను. ఏమి చెప్పవలెను? సర్వజ్యోతిర్మండల మందు నిండి విరాణ్మూర్తివై అయ్యెడ నిట్లు శోభించితివి.

కిం కిం బతేదమితి సంభ్రమభాజ మేనం
బ్రహ్మార్ణ వే క్షణమముం పరిమజ్జ్య తాతమ్,
మాయాం పున స్తనయమోహమయీం వితన్వన్
ఆనంద చిన్మయ! జగన్మయ! పాహి రోగాత్. 12

సంబరమంది నందుఁడెద సంభ్రమముంబడగా క్షణమ్ము చి
త్రంబది బ్రహ్మసింధువున తండ్రిని ముంచియు నంతలోనె మో
హంబును గప్పినావు పరమాద్భుతలీలల నొప్పినావు సాం
ద్రంబగు జ్ఞానమున్ సుఖము దానయి ప్రోవుము నన్ జగన్మయా!

ఈ చిత్రమేమని సంబరపడి సంభ్రమించు నీ తండ్రిని క్షణమాత్రము బ్రహ్మనందసింధువున ముంచి క్షణములో మాయామోహమును గప్పుచు విచిత్ర లీలల నొనరించిన ఓ ఆనందచిన్మయ జగన్మయరూపా! నన్ను రక్షింపుము.

# 46వ దశకము

# విశ్వరూప సందర్శనము

**అయి దేవ పురా కిల త్వయి స్వయముత్తానశయే స్తనంధయే,**
**పరిజృంభణతో వ్యపావృతే వదనే విశ్వమచష్ట వల్లవీ.** 1

**మును యశోద యొడిని మురువుగా శయనించి**
**నీవు పాలు ద్రావి యావులింప**
**విశ్వరూప మందు విశదమ్ముగాఁ జూచె**
**ముగ్ధగోపి నీదు మోమునందు.**

మునుపు యశోదప్రక్కలో వెల్లకిలపరుండి పాలుత్రావుచు నావులించి నంతట నీ ముఖమునందా అమాయకురాలు విశ్వరూపసందర్శనము చేసినది.

**పునరపత్య బాలకై స్సమం త్వయి లీలానిరతే జగత్పతే,**
**ఫలసంచయ వంచనక్రుధా తవ మృద్భోజన మూచు రర్భకాః.** 2

**ఆటలాడమఱగి యచటి బాలకులతో**
**ఫలము లీక మోసపఱచి తనుచు**
**కోపమెత్తి యమ్మకుం జెప్పి రేమే మొ**
**కొంటె వనుచు మన్ను తింటి వనుచు.**

నీవు తోడిబాలకులతో నాడుకొనుచు నొకతఱి మీరందరు సేకరించుకొన్న నేరేడుపండ్లలోనో, రేగుపండ్లలోనో వారికి భాగమీయక అన్నియు నీవే కాజేసితివన్న కోపముతో వారు మీయమ్మతో నీవు మన్ను తిన్నావని కొండెములు సెప్పిరి.

**అయి తే ప్రళయావధౌ విభో క్షితితోయాది సమస్త భక్షిణః,**
**మృదుపాశనతో రుజా భవే దితి భీతా జననీ చుకోప సా.** 3

ప్రళయమందు మన్ను జలములున్ మొదలుగా
సర్వ భక్షణమ్ము జరుపు నీకు
నలఁత సేయునన్న యలుకుతో గొల్లది
కొసరి కసరి నిన్ను గోపవడియె.

యశోద నీ కలరూపుతెలియని బేలకావున, ప్రళయమందు భూమి నీరు మొదలైన సర్వ భూతప్రపంచమును భక్షించు నీ కథ తెలియక మన్నుతిన్నావని అది నీకు జబ్బు సేయునని యెంచి నిన్ను గసరి కోపపడినది.

**అయి దుర్వినయాత్మక త్వయా కిము మృత్స్నా బత వత్స భక్షితా,**
**ఇతి మాతృగిరం చిరం విభో వితథాం త్వం ప్రతిజజ్ఞిషే హసన్. 4**

ఓరి దుడుక! నీ వయో మన్నుతిన్నాఁడ
వటర నిజము సెప్పుమనుచు నడుగు
నమ్మతోడ లేదు లేదమ్మ యిది వట్టి
మాట యంటి వొక్కమాటు నవ్వి.

దుందుడుకుపనులు సేయు నోరి! కృష్ణ! మన్ను తింటివట! నిజము సెప్పుము అని బెదరించి యడుగు మీఅమ్మతో అమ్మా! లేదు లేదు ఇది వట్టిమాట యని యల్లన నవ్వుచు నామెను గికురించితివి.

**అయి తే సకలైర్వినిశ్చితే విమతిశ్చే ద్వదనం విదార్యతామ్,**
**ఇతిమాతృ విభర్త్సితోముఖం వికసత్పద్మనిభం వ్యదారయః. 5**

అంద రిందు నిక్క మనుచుండఁగాదందు
వేది మోము తెఱువు మేన కందు
ననగఁజూపినాఁడ వవ్వకు నీ నవ్వు
మోము విచ్చుతమ్మి పువ్వువోలె.

బలరామునితోగూడ పిల్లలందరు ఒక్కటేమాటగ జెప్పుచున్నారు. ఏమియు లేదందువు. ఓరోరి నోరు తెఱువుము. నేను జూచెదనన మీతల్లికి పద్మముంబోలిన నీ నవ్వుమోము తెఱచి చూపించితివి.

**అపి మృల్లవదర్శనోత్సుకాం జననీం తాం బహు తర్పయన్నివ,**
**పృథివీం నిఖిలాం న కేవలం భువనాన్య ప్యఖిలా న్యదీదృశః. 6**

మన్నురుచికి మనసు గొన్న మాయమ్మకుఁ
దనివి తీర్పవలయు ననియొ యేమొ
భూమి యొకటిగాదు భువనముల్ పదునాల్గుఁ
జూపినావు కరుణ జోపినావు.

నీ నోటిలో నించుక మన్ను చూడవలెననుకొన్న మాజనని కుతూహలము నెరవేర్చుటకో యన్నట్లు మన్నుమాత్రము కాదు (భూలోకమే కాదు) పదునాల్గు లోకములు చూపించితివి. నీ కరుణ యాతల్లిపై గురియించితివి.

**కుహచి ద్వన మంబుధిః క్వచిత్ క్వచిదభ్రం కుహచిద్రసాతలమ్,**
**మనుజా దనుజా క్వచిత్సురా దదృశే కిన్న తదా త్వదాననే. 7**

ఒకట నడవి కడలి యొకమూల గగనమ్ము
నోహో! రసాతలమ్ము నొక్కచోట
మనుజు లొకట దేవ దనుజ లొక్కట దానఁ
గానఁబడని దొకటి గానఁబడదు.

ఒకవైపు సముద్రము, ఒకవంక నాకాశము, ఒక్కట పాతాళము, ఒకచోట మనుజులు, ఒకప్రక్క దేవతలు, ఒకచో రాక్షసులు ఇట్లు సర్వబ్రహ్మాండములు నీ ముఖమందు చూపించితివి. అందు కనబడనిదే లేదు.

**కలశాంబుధిశాయినం పునః పరవైకుంఠపదాధివాసినమ్,**
**స్వపురశ్చ నిజార్భకాత్మకం కతిధా త్వాం నదదర్శ సా ముఖే. 8**

పాలకడలిలోనఁ బవ్వళించెడు వాని
నిటు వికుంఠ సీమ నేలువాని
తనదుముంద చిన్ని తనయుఁడై నగువాని
గాంచె నిన్ను నీ మొగమ్మునందు.

అంతలో నిటు పాల్కడలిపై శయనించినవానిగ, అటు వైకుంఠసౌధ నివాసిగ నిన్ను జూచి అంతలోనే యాగోపి తనముందు చిన్నికుమారుడై యాడుకొనుచున్న వానినిగ నిన్ను నీ ముఖమందు దర్శించెను.

**వికసద్భువనే ముఖోదరే నను భూయో౽పి తథావిధాననః,**
**అనయా స్ఫుట మీక్షితో భవాననవస్థాం జగతాం బతాతనోత్. 9**

**అఖిల లోకములకు నాటపట్టగు నీదు**
**మోముసూపి యిట్లు ముద్దు సూపి**
**తోఁచి జనని కనులఁ దోచిన జగ మెల్ల**
**వట్టి కల్ల సేసి పెట్టినావు.**

సర్వభువననివాసమైన నీ మోము చూపి అంతలో శిశువువోలె నటించి ముద్దులుసూపి, మీ జనని కనులార గాంచిన విశ్వరూపము నంతలో కనుమఱుగు గావించిన తండ్రివి నీవు.

వి.వి : యశోద తనయుని ముఖమందు విశ్వమును తనయునిం జూచెను. అందు తాను జూచుచున్న కృష్ణుని ముఖమందు మఱల విశ్వమును తనయుని జూచెను. ఇట్లు అద్దాలమేడలో అద్దమందు బ్రతిబింబమును ఆ ప్రతి బింబములందు మరల అదే ప్రతిబింబములను జూచినట్లు జగత్పరంపర యొక్కయు జగన్మయు డగు నీయొక్కయు అంతులేమిని యామె సందర్శించెనని భావము.

**ధృతతత్త్వధియం తదా క్షణం జననీం తాం ప్రణయేన మోహయన్,**
**స్తనమంబ దిశేత్యుపాసజన్ భగవన్న ద్భుతబాల పాహిమామ్. 10**

**ఇంతసేసి తత్త్వ మింతగాఁ దెలిసిన**
**జనని నపుడ ప్రణయ చకితఁజేసి**
**ప్రాకివచ్చి, అమ్మ! పాలీయవే యంటి**
**వేలుకొనర చిత్రబాలకుండ!**

ఇట్లపూర్వ విశ్వరూపసందర్శనమును అనుగ్రహించుటమూలమున నీ సర్వాత్మభావ మాతల్లి కవగాహనచేసికూడ అంతలో నీమాయను గప్పి ప్రాకుచు

వచ్చి అమ్మా! పాలీయవే అనుచు గారాము చూపితివి.న ఈ బాలకలీల లద్భుతములు తండ్రీ! నన్నేలుకొనుము.

# 47వ దశకము

## ఉలూఖల బంధనము

**ఏకదా దధివిమాథకారిణీం మాతరం సముపసేదివాన్ భవాన్,**
**స్తన్యలోలుపతయా నివారయ న్నంకమేత్య పపివాన్ పయోధరౌ. 1**

**పెరుగు ద్రచ్చుచుండ వేవేగఁ జని కవ్వ**
**మొడిసి పట్టి అమ్మ యొడిని జేరి**
**పాలు గుడిచినావు లీలమై బుడిబుడి**
**యాట లాడి ముద్దు మాటలాడి**

ఒకనాడు యశోద పెరుగు తఱచుచుండగా నీవు పాలిమ్మని మారాముచేసి కవ్వము పట్టియాపి ఆమె యొడిలో జేరి పాలు త్రావుచుంటివి.

**అర్ధపీతకుచకుట్మళే త్వయి స్నిగ్ధహాస మధురాననాంబుజే,**
**దుగ్ధ మీశ దహనే పరిప్లుతం ధర్తు మాశు జననీ జగామ తే. 2**

**సగము పాలుద్రావి చక్కని చిఱునవ్వు**
**మోము సూపి నీవు ముద్దు గులుక**
**పాలు పొంగి డింపవలె నంచు మీ యమ్మ**
**పరువు వెట్టె జఘనభరము వడక.**

పాలు సగము త్రావిన తరువాత తృప్తికలిగినందులకు గుర్తుగా నీవు మధుర మందహాసముఖుడవగుట చూచి వినోదించి మీయమ్మ దాలిపై పాలు పొంగినవని, డించి రావలయునని నిన్నుటడించి లోగిటిలోనికిం జనెను.

**సామిపీత రసభంగసంగత క్రోధభార పరిభూత చేతసా,**
**మంథదండ ముపగృహ్య పాటితం హంత దేవ దధిభాజనం త్వయా 3**

**త్రావుచుండ నడుమ రసభంగ మొనరించె**
**ననుచు నమ్మమీఁద నలుకఁబూని**
**కవ్వమూని పెరుగు కడవపై నడచినా**
**విట్టి దుడుకుసేత లెందుఁ గలవు?**

సగముత్రావినంతలో రసభంగమొనరించెనని కోపమునటించి నీవు కవ్వముంబట్టికొని పెరుగుకడవపై నడచి రెండొనరించితివి.

**ఉచ్చలధ్ధ్వనిత ముచ్చకై స్తదా సన్నిశమ్య జననీ సమాద్రుతా,**
**త్వద్యశోవిసరవ ద్దదర్శ సా సద్య ఏవ దధి విస్తృతం క్షితౌ 4**

**అప్పుడైన చప్పు డాలించి మీ యమ్మ**
**వెఱచి పఱువు వెట్టి వేగ వచ్చి**
**చూచె నీదు కీర్తి సాగ సెల్ల నవనిపై**
**నిండె ననగఁ బెరుగు నిండుకొనగ**

ఆ చప్పుడు విని యశోద పరుగిడివచ్చి యవనిపై నీకీర్తివలె నలుముఖముల వ్యాపించిన పెరుగును జూచెను.

**వేదమార్గ పరిమార్గితం రుషా త్వా మవీక్ష్య పరిమార్గయం త్యసౌ,**
**సందదర్శ సుకృతి న్యులూఖలే దీయమాన నవనీత మోతవే. 5**

**వేద వీథులందు వెదకి పట్టగనైన**
**నిన్ను బట్టఁబోయి నిలిచి చూచె**
**వెఱ్ఱితల్లి యట్టె బెంపుడు పిల్లికి**
**వెన్నముద్ద వెట్టుచున్న వాని.**

వేదమార్గములందు వెదకి పట్టవలసిన నిన్ను వెదకి పట్టుకొనబోయి యట్టె నిలబడి యంతలో నింటిలో తిరుగుపిల్లికి వెన్న దినుపించుచున్న నిన్నుజూచెను.

**త్వాం ప్రగృహ్య బత భీతిభావనా భాసురానన సరోజ మాశు సా,**
**రోషరూషితముఖీ సఖీపురో బంధనాయ రశనా ముపాదదే. 6**

పట్టి! నిన్నుబట్టి వట్టి భయాభిన
యమ్ము సేయు మోముదమ్మి సూచి
చలమునన్ యశోద చెలులందఱన్ నిన్ను
గట్టఁ ద్రాడు వెదకి పట్టి దెచ్చె.

భయపడుచున్నట్లు నటించుచున్న నీ బిక్కమొగముచూచి చలమూని యశోద సఖురాండ్రముందు నిన్ను బట్టుకొనలేకపోయెనని వారు నవ్వుదురని రోషముగొని నిన్ను బంధించుటకు త్రాడు చేబట్టెను

బంధు మిచ్ఛతి యమేవ సజ్జన స్తం భవంత మపి బంధు మిచ్ఛతీ,
సా నియుజ్య రశనాగుణాన్ బహూన్ ద్వ్యంగులోన మఖిలం కిలైక్షత. 7

యోగు లెడదఁ గట్ట నుంకింతు రెవ్వని
నట్టి నిన్నుబట్టి కట్ట నెంచి
ఇంట ద్రాడు లెన్నియేఁ జుట్టిన బెత్తెఁ
డెడము వడియె గోపి జడను వడియె.

మహాయోగు లెవ్వని మోక్షమనుగ్రహించుబంధువని భావించుచుందురో, అట్టినిన్ను బంధింపనెంచి ఇంటనున్న త్రాళ్ళన్నియుం దెచ్చి చుట్టినను నవి నీ బొజ్జ తిరిగిరాక యెప్పటికప్పుడు రెండంగుళము లెడము కాజొచ్చెను

విస్మితో స్మ్రితసఖీజనేక్షితాం ఖిన్నసన్నవపుషం నిరీక్ష్య తామ్,
నిత్యముక్తవపు రప్యహో హరే బంధమేవ కృపయాన్వమన్యథాః. 8

వింతపడుచు పడుచు కాంత లెల్లరు చూడ
చెమట లొలసి యొడలు చిడిముడివడు
జనని జూచి జాలిగొని నిత్యముక్తుండ
వయ్యు బంధమునకు నియ్యకొంటి.

ఆశ్చర్యపడి సఖురాం(డ్రు తనవంక నట్టె చూచుచుండగా నిన్ను బంధింపయత్నించి మిగుల శ్రమించి యలసియున్న మీయమ్మను జూచి జాలిగొని నిత్యముక్తుండవయ్యు నీయంతట నీవామె బంధమునకు అంగీకరించి లోబడితివి.

**స్థీయతాం చిర ములూఖలే ఖలే త్యాగతా భవన మేవ సా యదా,**
**ప్రా గులూఖల బిలాంతరే తదా సర్పి రర్పిత మద న్నవాస్థిథాః. 9**

**రోటఁగట్టి యింక మాటాడ కుండురా**
**కొంటె కుఱ్ఱ! యనుచు గోపి చనగ**
**నంతము న్నులూఖలాంతరమ్మునఁ దాచు**
**కొన్న వెన్న తినుచుఁ గులికినావు.**

అప్పుడు యశోద నిన్ను ఱోటికి కట్టి ఓరి కొంటెపిల్లవాడ! ఇక మాటాడకు. కిక్కురుమనకుండ యిటనుండుమనుచు గోపి వెనుదిరిగినంతట నీ వా ఱోటిలో మున్ను దాచుకొన్న వెన్న యారగించుచు ముఱిపెము చూపితివి.

**యద్యపాశసుగమో విభో భవాన్ సంయతం కిము సపాశ యానయా**
**ఏవ మాది దివిజై రభిష్టుతో వాతనాథ పరిపాహి మాం గదాత్. 10**

**పాశ ముక్తులైన భాగ్యవంతుల వశ**
**మ్మగు మహానుభావుఁడయ్యు జనని**
**పాశములకుఁ జిక్కువడుట వేల్పులు సూచి**
**పొగడి రాప్త సులభ! ప్రోవునన్ను.**

విషయపాశముక్తులయినవారికి సుగముడవయ్యు నీవు సపాశయైన యశోదకు గట్టువడుట చూచి దేవతలు నిన్ను స్తుతించిరి. వారియెడ ననుగ్రహము చూపిన యో గురువాయూరు స్వామీ! నారాయణ! నన్ను రోగముక్తునిగావించి రక్షింపుము.

# 48వ దశకము

# యమలార్జున భంజనము

**ముదా సురౌఘై స్త్వముదార సమ్మదై రుదీర్య దామోదర ఇత్యభిష్టుతః,**
**మృదూదరః స్వైర ములూఖలే లగ న్న దూరతో ద్వౌ కకుభా వుదై క్షథాః. 1**

**మోదమున సురలు విను దా**
**మోదరుఁడని పొగడ బొజ్జ యొత్తుకొనంగా**
**వే దరిసి రోటితో నీ**
**వాదట మద్దులను జూచి తట రెండింటిన్.**

ఆనందభరితులై అమరబృందములు దామముచే=త్రాటిచే ఉదరమందు గట్టబడుటచే నిన్ను దామ+ఉదర-దామోదరుడని వినోదముగ పిలువగా నీ మృదువైన కడుపు ఒత్తుకొనగా ఱోటి నీడ్చుకొనుచుం బోయి వీధిలోనున్న రెండు మద్దిచెట్లను (అర్జున వృక్షములను) చూచితివి.

**కుబేర సూను ర్నలకూబరాభిధః పరో మణిగ్రీవ ఇతి ప్రథాం గతః,**
**మహేశ సేవాధిగత శ్రియోన్మదౌ చిరంకిల త్వద్విముఖా వఖేలతామ్. 2**

**కావలెనంచు శంభుకృపఁగాంచిన యయ్యణిమాది సంపదన్**
**గావరమెత్తి నిన్ను మదిఁగానని యానలకూబరుని మణి**
**గ్రీవుఁ గుబేరసూనుఁ దిలకించితి వత్తరి నత్తరుత్వశా**
**పావధి యంతలోన సరి యౌటరుదే హరి నీదు చూపులో.**

కుబేరుని కుమారుడు నలకూబరుడు, రెండవవాడు మణిగ్రీవుడును శివుని ఆరాధించి తత్కృపచే నణిమాద్యష్టైశ్వర్యములంది, దానితోబాటు ధనమదమంది నీయెడ విముఖులై విహరించిరి. వారిపై నీచూపు పడినది. అందుచే వారికి ప్రాప్తించిన అర్జునతరుజన్మ మంతతో ముగిసినది.

**సురాపగాయాం కిల తౌ మదోత్కటౌ సురాపగాయ ద్బహుయౌవతావృతౌ,**
**వివాససౌ కేళిపరౌ స నారదో భవత్పదైక ప్రవణో నిరైక్షత. 3**

ముని గంగానదిలో నశేషదివిషన్మృగ్ధాంగనా రత్న ప
జ్క్తిని మించంగల మించుబోణులు జలక్రీడా వినోదమ్ము లం
దనువర్తింప వివస్త్రులై చెలఁగి యోలాడంగఁ ద్వద్భక్తి చం
దన సేవాదరుఁడైన నారదుఁడు నంతం జూచె వారిద్దఱిన్.

వారికి వృక్షజన్మ మొదలవుటకు గారణము : ఒకనాడు మంచి వయస్సులో వారలిద్దరును అప్సరసలను మించిన యందముగల యంగనలతో వివస్త్రులై గంగానదిలో జలక్రీడ లాడుచుండగా నీ చరణసేవారసికుడైన నారదమహర్షి యట్టటు పోవువాడు వారిద్దఱిని చూచెను.

భియా ప్రియాలోక ముపాత్తవాససం పురో నిరీక్ష్యాఽపి మందాధచేతసౌ,
ఇమౌ భవద్భక్త్యుపశాంతిసిద్ధయే ముని ర్జగౌ శాంతి మృతే కుతస్సుఖమ్. 4

చెలువలు దత్తరించి తమ చీరలు గట్టుకొనంగఁ జూచియుఁ
దలఁగక దుర్మదాంధులయినం గని భక్త్యుపశాంతి సిద్ధి వా
రలకగుఁగాత మంచు మధురమ్ముగ శాంతము లేక సౌఖ్యముల్
గలుగవటంచుఁ బాడి యనుకంప శపింప మునీంద్రుఁ డిట్లనెన్.

అపుడానదిలో క్రీడలాడు ఆడువారు సిగ్గుచే జెదరి గట్టెక్కి చీరలు గట్టుగొనగా నది చూచియు మదాంధులైన యయ్యన్నదమ్ములు అట్లే దిగంబరులై యుండుట చూచి, నారదమహర్షి వారికి విష్ణుభక్తియు శాంతియుం గలుగుటకై ఇట్లు శపించెను: శాంతిలేనిచో సుఖము (మోక్షము) ఎట్లు లభించును?

యువా మవాప్తౌ కకుభాత్మతాం చిరం హరిం నిరీక్ష్యాథ పదం స్వమాప్నుతం,
ఇతీరితౌ తౌ భవదీక్షణస్పృహం గతౌ వ్రజాంతే కకుభౌ బభూవతుః. 5

చిరకాలము మీరర్జున
తరువులరై యుండి విష్ణు దర్శనమై కాం
తురు మీ పదమనఁ జెట్టై
సురిఁగిరి నీ రాక కెదురు సూచుచుఁ వారల్.

మీరిద్దరును మద్దిచెట్లయి పడియుండి విష్ణుదర్శనము కాగానే శాపముక్తి నంది మీ స్థానమునకు వత్తురుగాక! అను నారదుని శాపముచే వారీ వ్రేపల్లెలో మద్దిచెట్లైయుండి నీరాక కెదురు చూచుచుండిరి.

**అతంద్రమింద్రద్రుయుగం తథావిధం సమేయుషా మంథరగామినా త్వయా,**
**తిరాయితోలూఖలరోధ నిర్ధుతౌ చిరాయ జీర్ణౌ పరిపాతితౌ తరూ. 6**

**తొందరపడ కా తరువుల**
**సందున రో లీడ్చికొంచుఁ జనఁగా నది య**
**మ్మొందల నడ్డము పడి యే**
**మందు సమూలముగఁ గూలె నమ్మది తరువుల్.**

నీవు తొందరపడక మెల్లగా ఱోలీడ్చుకొంచు పోగా నది యా రెండుచెట్ల నడుమ నడ్డముపడి నీవు ముందునకు లాగగా నాయూపున నా ముదిచెట్లు రెండును గూలిపోయినవి.

**అభాజి శాఖిద్వితయం యదా త్వయా తదైవ తద్గర్భతలా న్ని రేయుషా,**
**మహాత్విషా యక్షయుగేన తత్క్షణా దభాజి గోవింద భవానపి స్తవైః. 7**

**అటు నీవు చెట్ల విరువఁగఁ**
**దటుకున నా వృక్ష గర్భతలమున వెలుఁగొ**
**క్కటి తోఁచె యక్షు లిరువురు**
**నటఁదోఁచి నినున్ నుతించిరఁట గోవిందా!**

అచెట్లు విరుచుకొనిపడగా వాని తొఱ్ఱలలో నొక వింత వెలుగుతోచి యందు యక్షస్వరూపులై వారిద్దరు బయలుపడి నిన్ను స్తుతించిరి.

**ఇహాన్యభక్తో ఽపి సమేష్యతి క్రమాత్ భవంత మేతౌఖలు రుద్రసేవకౌ**
**మునిప్రసాదా ద్భవదంఘ్రి మాగతౌ గతౌ వృణానౌఖలు భక్తిముత్తమామ్. 8**

**ఎవరెవరేమి దేవతల నెన్నివిధమ్ములఁ గొల్చి రేనియు**
**జివరకు నిన్నె చేరుదురు; శ్రీ శివపాద సరోజభక్త సా**

**ధువులు నిలింపమౌని కృపతో నటుగోరి యనన్యముక్తివై**
**భవమును జూరలాడిరి భవచ్చరణైక శరణ్యులై హరీ!**

ఇతర దేవతలకు భక్తులై యెవ్వరేదేవతలను సేవించినను తుదకు సర్వ దేవతాత్మకుడవైన నిన్నే చేరుదురు, కావున శివభక్తులైన యాయిద్దరు నారదానుగ్రహమువడసి యిప్పుడు విష్ణుభక్తిశిరోమణులందెడు యనన్య ముక్తివైభవమును జూరలాడిరి.

**తత స్తరూద్దారణ దారుణారవ ప్రకంపి సంపాతిని గోపమండలే,**
**విలజ్జిత త్వజ్జననీ ముఖేక్షిణా వ్యమోక్షి నందేన భవాన్ విమోక్షదః. 9**

**తరుదారణ దారుణరవ**
**పరికంపితమయ్యె గోపవర్గము; లజ్జన్**
**బరికింప గోపి, ముక్తిదు**
**మురహరు నిన్ దండ్రి తరువిముక్తు నొనర్చెన్.**

పెద్ద మద్దిచెట్లవి విరిగి పడగా నేర్పడిన ధ్వనికి గోపకులందఱు కంపించి పోయిరి, యశోదా! ఏమి చేసితివి? యిట్లు జరిగినదేమి? వెనుక ముందు చూడవైతివి? యని సాభిప్రాయముగ యశోద మొగమువంక చూపుబఱపి నందుడు నిన్ను కూలిన చెట్లనడుమనుండి తప్పించి యెత్తికొనెను.

**మహీరుహో ర్మధ్యగతో బతార్భకో హరేః ప్రభావా దపరిక్షతో ఒధునా,**
**ఇతిబ్రువాణైర్గమితో గృహం భవాన్ మరుత్పురాధీశ్వర పాహి మాం గదాత్. 10**

**హరిమహిమఁ జెక్కు సెదరక**
**తరుమధ్యమునందుఁ జిక్కి దక్కెనుశిశువం**
**చరసి నినున్ గొనివచ్చిరి**
**పరమేశ్వర! శరణు నన్ను బాలింపు హరీ!**

గోపకులు విష్ణువు ననుగ్రహముచే చెక్కుచెదరక దక్కినాడు కుమారుడనుకొనుచు నిన్నింటికిం గొనివచ్చిరి. ఓ గురువాయూరు ప్రభూ! పరమేశ్వర! నన్ను రక్షింపుము.

# 49వ దశకము

# బృందావనగమనము

భవత్ప్రభావావిదురా హి గోపా స్తరుప్రపాతాదిక మత్ర గోష్ఠే,
అహేతు ముత్పాతగణం విశంక్య ప్రయాతు మన్యత్ర మనో వితేనుః. 1

నీ మహిమమ్ములం దెలియనేరని గొల్లలు గొల్లపల్లెలో
నేమియుఁ గారణమ్ము గనిపింపదు చట్టనఁగూలెఁ జెట్టు లిం
కేమి యుపద్రవమ్ము లిటు లేర్పడునో యనుకొంచు సంశయో
ద్దామ మనస్కులౌచుఁ బలుదారులఁ దారు దలంచి రేగగన్.

నీ ప్రభావమెట్టిదో యెఱుగని గోపకులు వ్రేపల్లెలో చెట్లు కూలుట మొదలగు విడ్డూరములు కారణము లేకయే దైవికముగా సంభవించిన ఉపద్రవములు కాబోలుననుకొని పల్లె విడిచి వేఱొకచోటికి పోవ నిశ్చయించిరి.

తత్రోపనందాభిధ గోపవర్యో జగౌ భవత్ప్రేరణయైవ నూనమ్,
ఇతః ప్రతీచ్యాం విపినం మనోజ్ఞం బృందావనం నామ విరాజతీతి. 2

ఉపనందుఁడనెడి గోపకుఁ
డపుడు భవత్ప్రేరణమున నటకుఁబడమటన్
విపినము బృందావన మన
నపరిమితామోదమధుర మది గలదనియెన్.

వారిలో ఉపనందుడు అను గోపాలశ్రేష్ఠుడు నీ ప్రేరణచేతనే కావలయును ఇచ్చటికి బడమరగా బృందావనమను చక్కని వనమొకటి యున్నదని పలికెను.

బృహద్వనం తత్ఖలు నందముఖ్యా విధాయ గోష్ఠీన మథ క్షణేన,
త్వదన్విత త్వజ్జననీ నివిష్ట గరిష్ఠయానానుగతా విచేలుః. 3

బృందావీథులు గోష్ఠముల్ జలిపి కన్విందైన గోబృందమం
దందు న్నిల్వ క్షణమ్ములోఁ గదలి యత్యానంద సందోహులై

నందాదుల్ వెనువెంబడిన్ నడువ నంతన్ మా యశోదమ్మ యిం
పొందన్ నిన్నొడిఁజేర్చి యందుఁ జనె నెంతో ముచ్చటల్ గుల్కుచున్.

ఆ మాటవిని నందుడు మొదలయిన పెద్దలు బృందావనము వాసయోగ్యమయినదని యెంచి, ఇంతకు మున్ను తాము వసించుచున్న బృహద్వనమను పేరుగల వ్రేపల్లెను విడిచిపెట్టి, నీతో కూడ మాయమ్మను యశోదను బలరామునితో రోహిణిని బండియెక్కించికొని బృందావనమునకు బ్రయాణమైరి.

అనోమనోజ్ఞధ్వని ధేనుపాలీ ఖుర ప్రణాదా న్తరతో వధూభిః,
భవద్వినోదాలపితాక్షరాణి ప్రపీయ నాజ్ఞాయత మార్గదైర్ఘ్యమ్. 4

ఆల యంభారవమ్ములయందు బండ్ల
చక్రములఁ గుల్కు కిరకిర శబ్ద మందు
నెడనెడన్ నీదు బుడిబుడి నుడుల సొగసు
గ్రోలుచున్ దూర మెఱుఁగ రా గోపసతులు.

బండ్లకిఱ్ఱుచప్పుడులలో ఆవులమందల కాలిడెక్కలతాకిడి వలన నేర్పడిన ధ్వనులలో నడుమ గోపికలు నీ ముద్దుమాటల మాధుర్యమును నాస్వాదించి పరవశులై తామెంతదూరము ప్రయాణము చేసిరోకూడ యెఱుంగరైరి.

నిరీక్ష్య బృందావన మీశ నందత్ప్రసూనకుంద ప్రముఖద్రుమౌఘమ్,
అమోదథా శ్శాద్వల సాంద్రలక్ష్మ్యా హరిన్మణీకుట్టిమపుష్టశోభామ్. 5

ఘుమఘుమలాడు కుంద సుమకోమల గంధవహమ్ము హర్ష వి
భ్రమ మొదవింపఁ బచ్చనగు పచ్చిక పచ్చలు దాపినట్టి కు
ట్టిమ మనిపింప నవ్వనము తీవికి నందలి వింత యందచం
దములకు నీవునున్ మురిసినావు ముకుంద! మునీంద్రవందితా!

దేవా! మల్లెలు మొల్లలు మొదలయిన పెక్కురకములతో నుల్లసిల్లు బృందావనముంగాంచి అందలి పచ్చని పచ్చికలతో ఇంద్రనీలమణులుతాపిన వాకిళులట్లు శోభనమైయున్న తావులయందముచూచి నీవెంతో మురిసితివి.

**నవాకనిర్వ్యూఢ నివాస భేదే ష్వశేషగోపేషు సుఖాసితేషు,**
**వనశ్రియం గోపకిశోరపాళీ విమిశ్రితః పర్యవలోకథా స్త్వమ్. 6**

**అల బృందావన వీథుల**
**నిలు దీరిచి గోప బృంద మెల్లరు మసలన్**
**చెలు లగు గోప కిశోరులఁ**
**గలసి మెలసి తిరిగి తిరిగి కాంచితివెల్లన్.**

క్రొత్తగా నిర్మింపబడిన యిండ్లలో గోపకులెల్లరు హాయిగ వసింప నీవు గోపకుమారులతో నేగి బృందావనపరిసరముల శోభను దిలకించితివి

**అరాళమార్గాగత నిర్మలాపాం మరాళకూజాకృతనర్మలాపామ్,**
**నిరంతర స్మేరసరోజవక్త్రాం కళిందకన్యాం సమలోకయ స్త్వమ్. 7**

**వంకర టింకరన్ దిఱిగి వచ్చుచు నచ్చము తీయనౌ రస**
**మ్మంకిత మిచ్చుదానిఁ గలహంస వచః కలహాస్య వైభవ**
**మ్మంకువ సేయుదానిని నవోన్మిష దబ్జముఖిన్ గృపా కటా**
**క్షాంకితఁ జేసినావు కమలాక్ష? కళిందమునీంద్రనందనన్.**

రాజహంసల అవ్యక్త మధురములయిన కూతల నెపమున సరసములాడుచు వికసించి నిండుగనున్న కమలములనెడి నెమ్మోముతో పలు వంకరలు తిరిగి పాఱు నిర్మలోదకములతో గూడిన కళిందకన్యను నీవు దిలకించితివి.

**మయూరకేకాశతలోభనీయం మయూఖమాలాశబలం మణీనాం,**
**విరించిలోకస్పృశ ముచ్చశృంగైర్గిరిం చ గోవర్ధన మై క్షథాస్త్వమ్. 8**

*** నెమళుల్ గేకల నింపు పెంపు గొలుపన్, నీరంధ్ర రత్నచ్ఛటా**
**సముదాయమ్ములుదాత్తశోభ నిలుపన్, స్వాయంభవమ్మైనలో**
**కముదాకం గల శృంగముల్ గులుకఁ జొక్కమ్మైనగోవర్ధనో**
**త్తమ శైలమ్మటఁ జూచినావఁట ముకుందా! ముక్తికాంతాప్రియా!**

నెమళ్ళ కేకారవములచే నింపుగొలుపుచు, నవరత్నకాంతిపుంజముచే జిగజిగ మెఱయుచు బ్రహ్మలోకమునుదాకు శిఖరములతో గూడిన గోవర్ధన పర్వతముం జూచితివి.

**సమం తతో గోప కుమారకైస్త్వం సమంతతో యత్ర వనాంతమాగాః**
**తత స్తత స్తాం కుటిలా మపశ్యః కళిందజాం రాగవతీమివైకామ్.** 9

**బృందావన వీథుల శిశు**
**బృందముతో మసలినాఁడ వింద ముదటఁగా**
**ళిందిం గుటిలం జూచితి**
**సుందరిఁ దను వలచుదాని జూచిన భంగిన్**

గోపాలబాలకులతోగూడ యల్లల్లన బృందావన ప్రాంతముల కీవేగి తిరిగి తిరిగి యచట వంకరటింకరలు తిరిగి (కుటిలయై) నీ యనుసరణము నెడల ననురాగవతియై కామించి దరిసిన యొకానొక నాయికయో యన్నట్లు గోచరించు కళిందకన్యను (కాళిందీనదిని) గాంచితివి.

**తథావిధేస్మిన్ విపినే పశవ్యే సముత్సుకో వత్సగణప్రచారే**
**చరన్ సరామోఽథ కుమారకై స్త్వం సమీరగేహాధిప పాహి రోగాత్** 10

**ఆవులు సంచరింపఁదగు నావనసీమల నాలమందలన్**
**గావగ వేడ్కఁబూని జతగాండ్రను గూడుక రాముతోడ నా**
**నావిధలీలలన్ మఱగినాఁడవు వాయుపురాధినాథ! నన్**
**బ్రోవర! యీయశేష భవరోగమడంచి యకించన ప్రియా!**

పశువులకు ననువైన యా బృందావనమందు లేగలను మేపు నుల్లాసము గొని బలరామునితో తోడిగోపకులతో నందందు సంచరింప నారంభించితివి. అట్టి సొగసుగల ఓ గురువాయూరుపుర స్వామీ! నన్ను రక్షింపుము.

# 50వ దశకము

# వత్సాసుర బకాసుర సంహారము

**తరళమధుకృ దబ్బృందే బృందావనే ఽథ మనోహరే**
**పశుపశిశుభిస్సాకం వత్సానుపాలనలోలుపః,**
**హలధరసఖో దేవ శ్రీమన్విచేరిథ ధారయన్**
**గవల మురళీవేత్రం నేత్రాభిరామతనుద్యుతిః.** 1

**జుమ్మని తుమ్మెదల్ ముసరు చోటుల నీటులుగుల్కు బృంద సం**
**దమ్మగు మందలన్ బశుపనందనులన్ బలరాము గూడి బె**
**త్తమ్మును గొమ్ముబూరయును దాలిచి, వేణువు నూది నేత్ర ప**
**ర్వమ్మగు మేనిసొంపు లలరం గయికొంటివి పాశుపాల్యముఁ.**

తుమ్మెదలు జుమ్మని ముసురుకొను పూఁబొదలతో నందముగుల్కు బృందావనమందు బలరామునితో గోపబాలురతో కొమ్ముబూరయుం జేకొని పిల్లనగ్రోవి యూదుచు కనులపండువు సేయు సోయగముతో పశువులగాచు పనికి బూనుకొంటివి.

**విహిత జగతీరక్షం లక్ష్మీకరాంబుజ లాలితం**
**దదతి చరణద్వంద్వం బృందావనే త్వయి పావనే**
**కిమివ న బభౌ సంపత్సంపూరితం తరువల్లరీ**
**సలిల ధరణీ గోత్ర క్షేత్రాదికం కమలాపతే.** 2

**లచ్చి కరారవిందముల లాలితముల్ భువనావనమ్ములౌ**
**త్వచ్చరణమ్ములఁ బరమపావన మవ్వనవీథి నుంపగా**
**నచ్చట లేని సంపదలు నందము లున్నవె చెట్లు తీగలుఁ**
**ముచ్చటగొల్పెనందు జలముల్ పొలముల్ గిరులుఁ ఝరమ్ములుఁ.**

సాక్షాన్మహాలక్ష్మి కరపద్మములందు లాలింపబడుచు సర్వభువనములను బాలించు నీ చరణములచే నా బృందావనవీధులను నీవు బవిత్రము చేయుటచే

నచట నెచటలేని సంపదలు అందములు నిరవుకొని యందున్న సరోవర జలములు పొలములు కొండలు కొండవాగులును జూపరులకెంతో ముచ్చట గూర్చుచుండెను.

**విలసదులపే కాంతారాంతే సమీరణశీతలే**
**విపులయమునాతీరే గోవర్ధనాచల మూర్ధసు,**
**లలిత మురళీనాద స్సంచారయన్ ఖలు వాత్సకం**
**క్వచన దివసే దైత్యం వత్సాకృతిం త్వము దై క్షథాః.** **3**

**యమునాతీర విశాల శీతలసమీరాలోల బృందావనీ**
**సముదంచత్తృణశయ్యలం దొకట నుచ్చైశ్చారు గోవర్ధనో**
**త్తమ మూర్ధమ్మున వేణు వూదుచును వత్స శ్రేణి బాలించు నా**
**సమయానం గనినావు రక్కసుని సాక్షాద్వత్సరూపుం హరీ!**

యమునానది యొడ్డుల విశాలమై చల్లని గాలిచే సుఖకరమైయున్న బృందావనమందలి పచ్చికలపై గూర్చుండి, గోవర్ధన పర్వత శిఖరముపై గూర్చుండియు వేణువూదుచు లేగదూడలనుగాచు నాసమయమం దొక రాక్షసుని వత్సరూపమున (లేగదూడ రూపమున) నున్న వానిని జూచితివి.

**రభస విలసత్పుచ్ఛం విచ్ఛాయతోఒస్య విలోకయన్**
**కిమపి వలితస్కంధం రంధ్రప్రతీక్ష ముదీక్షితమ్,**
**తమథ చరణే బిభ్ర ద్విభ్రామయన్ ముహురుచ్చకైః**
**కుహచన మహావృక్షే చిక్షేపిథ క్షతజీవితమ్.** **4**

**తోకను మీఁది కెత్తికొని దూటుచు నించుక ముట్టె వంచి నీ**
**లోకువ సూచి క్రుమ్ముటకు లోఁదలపోసెనొ లేదొ వాని కా**
**ళ్లాక యొకింతలేక కొని యద్దిర! గిర్గిరఁద్రిప్పికొట్టి బల్**
**ఢాక నడంచి ప్రాణ మెడలన్ వడిఁ జిమ్మితి వట్టె చెట్టుపై.**

వాడు తోక మీదికెత్తి దూకుచు నుట్టి కొంచెమువంచి బాలుడవని నిన్ను లోకువచేసి క్రుమ్మ నవకాశ మెట్లు దొరుకునాయని చూచు వాని

నాల్గుకాళ్లు చేర్చి పట్టుకొని గిరగిర త్రిప్పి నేలకు గొట్టి వాని ప్రాణములు వాపి యచట చెట్లతోపులోనికి విసరివైచితివి.

**నిపతతి మహాదైత్యే జాత్యా దురాత్మని తత్ క్షణం**
**నిపతన జవక్షుణ్ణ క్షోణీరుహ క్షతకాననే,**
**దివి పరిమిళ ద్బృందా బృందారకాః కుసుమోత్కరై**
**శ్శిరసి భవతో హర్షా ద్వర్షంతి నామ తదా హరే.** 5

**జాతి దురంతకుం డసుర చాగిపడన్ మఱి గూలె వృక్ష సం**
**ఘాత మరణ్యముం దెఱపిగా; నటఁ గూటువగట్టి దేవతా**
**వ్రాతములెల్ల నీ శిరముపై నవకల్పక పుష్పమంజరుల్**
**ప్రీత మనస్కు లౌచుఁ గురిపించిరి దుందుభి వాద్య ఘోషలన్.**

వాడు సహజముగ రాక్షసజాతివాడు క్రూరుడు కావున చాపచుట్టగా నిజ స్వరూపము వడసి కూలిపోగా నయ్యడవిలో చెట్లు కూలి యదియంతయు తెఱపి యయ్యెను. అప్పుడు దేవతలు గుమిగూడి నీ శిరస్సుపై నూతన కల్పతరు కుసుమ గుచ్ఛములను ప్రీతితో గురియించిరి. దేవదుందుభులు మ్రోయించిరి.

**సురభిలతమా మూర్ధ న్యూర్ధ్వం కుతః కుసుమావళీ**
**నిపతతి తవేత్యుక్తో బాలై స్సహేల ముదైరయః,**
**ఝటితి దనుజక్షే పేణోర్ధ్వంగత స్తరుమండలా**
**త్కుసుమనికర స్సోఽయం నూనం సమేతి శనైరితి.** 6

**అనుపమ సౌరభ ప్రచురమై కురిసెం బువువాన నీ శిర**
**మ్మునఁ బయినుండి యేమనెడి ముగ్ధకుమారులఁ గేలిసేసి వెం**
**టనె "యసురన్ వడిన్ విసరుటన్ దరుమండలి నుండి పైకిఁ బో**
**యిన విరిసోన జల్లుపడియెన్ నిజ" మంటివి మాయలాఁడవై.**

అపుడు కురిసిన పూలవాన సాటిలేని పరిమళములను నించెను. ఈ పువ్వులవానయేమి యీ సువాసన లేమని అమాయకులు గొల్లపిల్ల లచ్చెరువు పడ వారినిజూచి పరిహసించి నీ భగవదనుభావము బోధపడకుండుటకు,

ఆరాక్షసుని మీదికి విసరగా వాని తాకున గదలి చెట్లకొమ్మల నుండి పూలజల్లులు పడినవి. ఇంతేకాని మఱియేమి కాదని వారిని విష్ణుమాయలో ముంచితివి.

క్వచన దివసే భూయో భూయస్తరే పరుషాతపే
తపనతనయాపాథః పాతుం గతా భవదాదయః,
చలితగరుతం ప్రేక్షామాసు ర్బకం ఖలు విస్మృతం
క్షితిధరగరుచ్ఛేదే కైలాసశైల మివాపరమ్. 7

చెలికాం డ్రీవును మండుటెండ వడి గాసిం జెంది సూర్యాత్మజా
జలము ల్ద్రావగ నేగి చూచితి రుదంచత్పక్షవిక్షేపు ని
శ్చల వజ్రాయుధ విస్మృతోద్ధతగరుత్సంఛేద నాన్యాదృ శో
జ్జ్వల కైలాసగిరీంద్రతుల్యు బకు సాక్షాత్కంస సంసేవకున్.

ఆవల నొకనాడు నీవు చెలికాండ్రును నెండలో దిరిగి శ్రమపడి దప్పికవడి యమునానదిలో మంచినీళ్ళు ద్రావనేగితిరి. అక్కడ బెనుతెక్కలు విదల్చుచు వజ్రాయుధము మఱచి ఱెక్కలు నరుకకుండ వదలిన సాటిలేని కైలాస పర్వతమా అన్నట్లు తెల్లగనున్న బకుని కొంగరూపముననున్న రక్కసుని కంసుని సేవకుని జూచితివి.

పిబతి సలిలం గోపవ్రాతే భవంత మతిద్రుత
స్సకిల నిగిల న్నగ్నిప్రఖ్యం పునర్ద్రుత ముద్వమన్,
దలయితు మగా త్త్రోట్యాః కోట్యా తదాశు భవాన్ విభో
ఖలజనభిదాచుంచు శ్చంచూ ప్రగహ్య దదార తమ్. 8

గోవులు దప్పికన్ జలము గ్రోలుచునుండ బకుండు పర్వునన్
నీఁపయిఁ దూకి నిప్పునటు నిఁగబళించి దహించుటెంచి, తా
నోపక క్రక్కి ముక్కున నహో! మఱి చీల్పగఁబోవ దుష్టని
ర్వాపణచుంచువై యసుర వ్రక్కలుసేసితి చీల్చి చంచువుల్.

ఆవులు దప్పికగొని యమునలో నీళ్ళు త్రావుచుండగా బకాసురుడు నీమీదికి తటాలున దూకి- నిప్పును మ్రింగినట్లు నిన్నొఱుంగక మ్రింగి, నీవు వాని గొంతుకయందు మంట పుట్టింపగా నోర్వలేక నిన్ను క్రక్కి, అప్పుడుకూడ

పగమానక వాడు ముక్కుతో నిన్నుబొడిచి చీల్చబోగా దుష్టశిక్షణ నిపుణుండవగు నీవు వాని ముక్కుపెడలుపట్టి చీల్చి వానిని ముక్కలు చేసితివి.

**సపది సహజాం సంద్రష్టుం వా మృతాం ఖలు పూతనా**
**మనుజ మఘమ ప్యగ్రే గత్వా ప్రతీక్షితు మేవవా,**
**శమననిలయం యాతే తస్మిన్ బకే సుమనోగణే**
**కిరతి సుమనోబృందం బృందావనా ద్గృహ మైయథాః. 9**

**మును జనె నాడుతోడనుచుఁ బూతనఁ జూడనొ, యింకమీఁద వ**
**చ్చును చినతమ్ముఁడం దెదురుచూచి యఘాసురు నాదరింపనో**
**చనెననఁగా బకుండు యమసన్నిధికేగిన, నింటికేగి తం**
**దును సుమనోగణమ్ము సుమనోగణముం గురిపింప నీపయిఁ.**

వానికి అప్పగారు పూతన ఆడుతోడు ముందు పోయినదని. దానిని జూడవలయుననియో, ఇటుపై నాతమ్ముడు అఘాసురుడు త్వరలోనే యమలోకమునకు వచ్చును. వానిరాక కెదురుచూడవలయుననియో యన్నట్లు బకాసురుడప్పుడే యమపురి కేగెను. నీవును దేవతలు పూలసోనలు గురిపింపగా నింటికేగితివి.

**లలితమురళీనాదం దూరా న్నిశమ్య వధూజనై**
**స్త్వరిత ముపగమ్యారా దారూఢమోద ముదీక్షితః,**
**జనితజననీ నందానంద స్సమీరణమందిర**
**ప్రథితవసతే శౌరే దూరీకురుష్వ మమామయాన్. 10**

**మురళీనాదము దూరమందె విని యా ముగ్ధాంగనల్ హర్షవి**
**స్తరులై మిక్కిలి తత్తరించెదరు బృందావీథులందుండి స**
**త్వరుఁడై వచ్చెడు నిన్నుజూడఁగ యశోదానంద దృక్పందనా!**
**గురువాయూరుపురీవిహారకలనా! గోబృంద హృన్నందనా!**

అందందు బృందావనమందు నీవూదు వేణునాదమును ఆలించి ముగ్ధనాయికలు గోపికలు సంబరపడి తత్తరపడి నీవాలమందలుగాచి వ్రేపల్లె కెప్పుడు వత్తువోయని యెదురుచూచుచుండిరి. యశోద కన్నుల చందనము

చలువల నించుచు, గోబృందము హృదయములను ఆనందభరితము లొనర్చుచు విహరించిన యో గురువాయూరుపుర విహారరసికా! నన్నానందభరితుం గావింపుము.

# 51వ దశకము

# అఘాసుర సంహారము

**కదాచన వ్రజ శిశుభి స్సమం భవాన్ వనాశనే విహితమతిః ప్రగేతరామ్,**
**సమావృతో బహుతర వత్స మండలై స్సతేమనై ర్నిరగమ దీశ జేమనైః . 1**

**ఈ వొకనాడు గోప శిశుబృందముతో వఱువాత లేచి బృం**
**దావన వీథులందు యమునాతటినీతట శాద్వలమ్ములం**
**దావుల మేప నేగు నపు డక్కడఁ జల్దుల నారగింపఁగా**
**నేవెవొ వింతవింత చవు లీను రుచు ల్గొని యేగి ముచ్చటన్**

ఒకప్పుడు నీవు గోపాలురతో బృందావనమందు యమునాతీరమందు ఆవుల మేపుచు పచ్చికబయలున చల్దు లారగింపవలెనని వింత వింత రుచులు గులుకు నూరగాయలు పచ్చళ్ళు తినుబండారములు గొని యేగితివి.

**వినిర్యతస్తవ చరణాంబుజ ద్వయా దుదంచితం త్రిభువన పావనం రజః,**
**మహర్షయః పులకధరైః కలేబరై రుదూహిరే ధృత భవదీక్షణోత్సవాః. 2**

**నిజరుచితోఁ గళింద తటినీతటమందుఁ జరించుచుండఁగ౯**
**ద్రిజగములం బవిత్ర మొనరించు భవచ్చరణాంబుజద్వయీ**
**రజ మొడ లెల్లఁ బూసికొని రక్తిమెయి౯ బులకించుచుందు ర**
**క్కజ మొనరించు నీ సొగసు గన్గొను ముచ్చటజెంది సన్మునుల్.**

ఇలు వెడలి బృందావనమందు కాళింది నదియొద్దున త్రిభువన పవిత్రము లయిన నీ చరణకమలములు మోపి నీవు సంచరించుచుండగా మునులు నీ పాదధూళి ననురక్తిచే మేనులం బూసికొని పులకరించుచు నీ సోయగమే చూడ వేడుకవడుచుండిరి.

ప్రచారయ త్యవిరలశాద్వలే తలే పశూ౯ విభో భవతి సమం కుమారకైః,
అఘాసురో న్యరుణ దఘాయ వర్తనీం భయానక స్సపదిశయానకాకృతిః. 3

పచ్చని పచ్చికల్ మొలచు పట్టుల బాలురు నీవుఁ గ్రేపుల౯
మచ్చిక గొల్పి మేపుతఱి మార్గమున౯ శయనించినట్లు తా
నచ్చము దోఁచి మీ తెరువు నంతయు దానయి యాక్రమించెఁగాఁ
గ్రచ్చర న య్యఘాసురుఁ డఘస్ఫురణ౯ బహుభీషణాకృతి౯.

పచ్చని పచ్చికచే నింపుగులుకు తావులయం దావులమేపుచు గోపాలురతో నీవు సంచరించుచుండగా నీ నాయకత్వమున మసలు గోపాలురయెడ నఘము (పాపము) గావించుటకు అఘాసురుడు అజగరస్వరూపుడై (కొండచిలువయై) వనమాక్రమించి పడుకొని మీ దారి నరికట్టెను.

మహాచలప్రతిమతనో ర్గుహానిభ ప్రసారిత ప్రథిత ముఖస్య కాననే,
ముఖోదరం విహరణకౌతుకా ద్గతాః కుమారకాః కిమపి విదూరగే త్వయి. 4

ఉండినవాఁడ వున్నటుల నొక్క క్షణమ్మున దూర మేగఁ బె౯
గొండయు బోలెఁ దత్తనువు గోచరమై మఱి వానినోరు ను
ద్దండ గుహాముఖ మ్మయిన దాన విహార కుతూహలమ్ముచే
నొండు తలం పెఱుంగ కట నొక్కొకరే చొరఁజొరి రర్భకుల్.

ఉన్నట్లేయుండి యొకింతలో నీవు దూరము చనగా గోపాలురు విహారము సేయు వేడుకతో నల్లల్లనబోయి పెద్ద కొండవలె నున్న వాని శరీరము కానబడి, ఒక కొండ గుహవోలె నున్న వాని నోటిలోని కొక్కొకరే చొచ్చిరి.

ప్రమాదతః ప్రవిశతి పన్నగోదరం క్వథ త్తనౌ పశుపకులే సవాత్సకే
విద న్నిదం త్వమపి వివేశిథ ప్రభో సుహృజ్జనం విశరణ మాశు రక్షితుమ్. 5

క్రేపులతోడ గోపకులు కేవలముం బొరపాటుచేత సం
తాపిత దేహు లౌచు బహు దారుణ పన్నగ గర్భముం జొరం
బ్రాపయి మిత్రకోటిఁ బరిపాలన సేయగ నీవును౯ గృపా
రూప! యెఱింగిచొచ్చితివి క్రూర మహోరగ గర్భగోళము౯.

ఎండవడి తాపము వాపుకొనుటకని చల్లని కొండగుహయనుకొని పెనుబామునోట వారు పొరపాటున జొరబారుట చూచి వారి పాలిట రక్షకుడవు గావున నీవు కేవల కృపామూర్తివి కావున వారి వెనుకనే నీవును నా క్రూరరాక్షసుని గర్భగోళమం దెఱిగియే ప్రవేశించితివి.

**గళోదరే విపులితవర్ష్మ ణాత్వయా మహోరగే లుఠతి నిరుద్ధమారుతే,**
**ద్రుతం భవాన్ విదళిత కంఠమండలో విమోచయన్ పశుపపశూన్ వినిర్యయౌ. 6**

**పాము గళమ్ము నె న్నడుమ ఁబట్టగరానటు మేను వెంచు నీ**
**చే మఱి యూపిరాడ కది చేడ్పడి తన్నుకొనంగ నీవు ను**
**ద్దామత దాని కుత్తుకఁ బదంపడి చీలిచి గోప గో శిశు**
**స్తోమము నాపదం గడువఁద్రోచి వెలిం బఱతెంచి తీశ్వరా!**

ఆ పాము నోరు పట్టనంతగా నీ శరీరముం బెంచితివి అది యూపిరాడక విలవిల దన్నుకొనెను. దాని దవడలు పట్టిచీల్చి నీవు గోపాలురను గోవులను విపత్తునుండి తప్పించి వెలికి వచ్చితివి.

**క్షణం దివి త్వదుపగమార్థ మాస్థితం మహాసుర ప్రభవ మహో మహో మహత్,**
**వినిర్గతే త్వయి తు నిలీన మంజసా నభఃస్థలే ననృతు రథో జగు స్సురాః 7**

**అసురశరీరమున్ వెడలి యద్భుతమౌ నొకవెల్గు నిల్చె నా**
**కసమున నీవు వచ్చుదనుకన్; వెలి కీవరు దెంచినంతటఁ**
**వెస నది లీనమయ్యెఁ; గడువేడుక నచ్చరలాడి రంత నీ**
**యసదృశ కీర్తి పాడి రఖిలామరగాయనగాయనీమణుల్!**

నీవు వెలికి వచ్చులోపలనే యఘాసురుని శరీరమందుండి ఒక తేజస్సు వెడలి నీవు వెలికి రాగానే నీలో లీనమయ్యెను. అప్పుడు గంధర్వులు నీకీర్తిని గానముచేసిరి. అప్సరస లానందభరితలై నృత్యములు చేసిరి.

వి.వి: అసుర శరీరమందుండి వెడలిన ప్రాణరూపమైన తేజస్సు వాని సూక్ష్మ శరీరము అనగా లింగదేహముకూడ నశించుటవలన పరిమితము కానందున రెండు సజాతీయ తేజస్సు లొకటియైనట్లు అపరిమితము నిరుపాధికము నైన నీ జ్యోతిర్మూర్తియం దైక్యమందెనని భావము.

సవిస్మయైః కమలభవాదిభి స్సురై రనుద్రుత స్తదనుగతః కుమారకైః,
దినే పున స్తరుణదశా ముపేయుషి స్వకై ర్భవా నతనుత భోజనోత్సవమ్. 8

కమలభవాది నిర్జర నికాయము విస్మయమంది కొల్వఁ జొ
క్కములగు లీలలన్ గమల కర్ణిక చుట్టునున్న రేకుల
ట్లమరిన బాలురన్ నడుమ నల్లన బువ్వములారగించు నం
దము మురిపించినాఁడవు గదా! నడిమింట నినుండు వెల్గఁగన్.

అవ్వల బ్రహ్మాదిదేవతలచ్చెరువంది చూడ, మధ్యాహ్నవేళ తామరపువ్వు దుద్దుచుట్టునున్న రేకుల చందమున గోపాలురు నీ చుట్టును గూర్చుండ నడుమ నీవు కూర్చుండి మధ్యాహ్నభోజనోత్సవము గావించితివి.

విషాణికామపి మురలీం నితంబకే నివేశయన్ కబలధరం కరాంబుజే,
ప్రహాసయన్ కలవచనైః కుమారకాన్ బుభోజిథ త్రిదశగణై ర్ముదా నుతః 9

నడుమున దిండుజుట్టు వసనమ్మున నొక్కెడఁ గొమ్ముబూర యొం
డెడ మురళిన్ వడిన్ జొనిపి యెల్లరతో నెకసక్కెమాడుచున్
బుడిబుడి ముచ్చటల్ గులికి మున్ బెరుగన్నము ముద్ద చేతిలో
నిడికొని యారగించితి వహో! సురబృందము ని న్నుతింపగాన్.

నడుమునకు దిండుగా జుట్టిన వలువలో నొకవైపు వంశనాళమును,ఒక వైపు కొమ్ము బూరయుం జొనిపి తోడి పిల్లలను ముగ్ధమధురవచనములచే నవ్వించుచు ముచ్చటలు నించుచు దేవతాబృందము పొగడ విందారగించితివి.

సుఖాశనం త్విహ తవ గోపమండలే మఖాశనాత్ప్రియ మివ దేవమండలే,
ఇతిస్తుత స్త్రిదశవరై ర్జగత్ప్రభో మరుత్పురీనిలయ గదాత్ ప్రపాహి మామ్. 10

కదిసి నిలింపనాయక నికాయముతో మఖభోజనమ్ము సే
యుదువఁట,యంతకంటెఁ బ్రియమో! మఱి యీవనభోజనమ్ము సే
సెదవు కుమార గోపకులచెంత హరీ! యని దేవబృంద మె
న్నెదరు మరుత్పురీనిలయు నిన్, నను బ్రోవర భక్తవల్లభా!

ఇంద్రాది దేవనాయకులతో యజ్ఞమందు మాతో హవిర్భాగము లారగించు మహానుభావుడవు నీ కంతకంటె గోపకులతో గూర్చుండి యిట చల్ది

లారగించుటయే ప్రియమయ్యెనా? అని బ్రహ్మాదిదేవతలచే నుతింపవడిన స్వామివి ఓ మరుత్పురధామ! నన్ను రక్షింపుము.

# 52వ దశకము

# గోవత్సాపహరణము

**అన్యావతార నికరే ష్వనిరీక్షితం తే భూమాతిరేక మభివీక్ష్య తథాఘమోక్షే,**
**బ్రహ్మా పరీక్షితుమనా స్స పరోక్షభావం నిన్యేఽథవత్సకగణాన్ ప్రవితత్యమాయామ్.**

**ఏ యవతారమందు స్ఫురియింపని నీ దురితాపనోద లీ**
**లాయతమైన నేటి మహిమాతిశయమ్ముఁ బరీక్షసేయఁగా**
**మాయనుబెంచి మందలను మాయముచేసెను వెఱ్ఱిబ్రహ్మ వి**
**శ్వాయత సృష్టికర్తకు లయాభినివేశ మదేమి కర్మమో!**

ముందటి నీ యవతారములం దెందును గానరాని పాపహరణ నిపుణములైన లీలలను జూపు నీ కృష్ణావతార విశేషమేమో పరీక్షింపదలచి అమాయకుడైన బ్రహ్మ మాయగొని పశులమందలను మాయముచేసెను. తాను సృష్టిచేయు నధికారము గలవాడు గదా, లయకార్యమునకు బూనుకొన్నాడు. అదేమి కర్మమో! అదేమిపనియో! మఱియు నదేమి ప్రారబ్ధమో అనియు తెలుగులో విశేషము.

**వత్సా నవీక్ష్య వివశే పశుపోత్కరే తా నానేతుకామ ఇవ ధాతృమతానువర్తీ,**
**త్వం సామిభుక్తకబలోగతవాం స్తదానీం భుక్తాం స్తిరోధితసరోజభవః కుమారాన్.2**

**కదుపులఁ గానమిఁ బసులకాపరు లెంతయుఁ గొందలింప న**
**య్యదనునఁ దెచ్చు వానివలె నాలరిబ్రహ్మ యొనర్చు మాయలో**
**నొదిగినవాఁడుఁబోలె జని మొయ్యన కొంచెము తిన్నముద్దతో;**
**నదనది సూచి యక్కడి ప్రజార్భకులఁ హరియించె బ్రహ్మయుఁ.**

మందలు కనబడకపోవుటచే బసులకాపరులు మిగుల పరితపించిరి. నీవో వానిని దెచ్చువాడట్లు బ్రహ్మమాయలో బడినవాడట్లు నటించి బాలురను

భోజనము చేయుడని చెప్పి సగము తిన్న అన్నపు ముద్దతోనే నీ వేగితివి. ఆ సమయముచూచి బ్రహ్మయక్కడున్న గోపాలురనుగూడ గొనిపోయి దాచెను.

**వత్సాయిత స్తదను గోపగణాయిత స్త్వం**
**శిక్యాది భాండ మురళీగవలాదిరూపః,**
**ప్రాగ్వద్వి హృత్యవిపినేషు చిరాయసాయం**
**త్వం మాయయాథబహుధావ్రజమాయయాథ. 3**

**ఒక్కండయ్యునుదూడలుఁ వ్రజ శిశువ్యూహమ్మునై మాయచేఁ**
**జిక్కమ్ముల్ దధిభాండముల్ మురళులుఁ జేఁగఱ్ఱలుఁ బూరలుఁ**
**బెక్కై ముందటి యన్ని రూపులగచుఁ వేర్వేర బృందావనిఁ**
**జక్కంగా విహరించి వచ్చితిగదే సాయాహ్నమందింటికిఁ.**

అప్పుడు నీవు నిజానకు ఒక్కడవేయయ్యు (ఏకమేవా ద్వితీయం బ్రహ్మ) మాయగొని దూడలు దూడకాపరులు నీవేయై చల్దిచిక్కములు కుండలు పిల్ల గ్రోవులు చేతికఱ్ఱలు కొమ్ముబూరలుగకూడ నీవేయై నీ సర్వాత్మభావ మచ్చుపడ బృందావనమందు విహరించి, సాయంసమయమున నింటికి నట్లే యేతెంచితివి.

**త్వామేవ శిక్యగవలాదిమయం దధానో**
**భూయ స్త్వమేవ పశువత్సక బాలరూపః,**
**గోరూపిణీభిరపి గోపవధూమయీభి**
**రాసాదితోఽసి జననీభి రతిప్రహర్షాత్. 4**

**ఆవుల్ లేగలు బాలరూపములు నీవై చిక్కముల్ బూరలే**
**వేవో నీవయి వాని నెల్ల మఱి నీవే తాల్ప గో గోపికా**
**భావమ్మందిన తల్లులందరు నపూర్వమ్మైన యానంద ని**
**ష్ఠా వైరాజ్యము చూరలాడిరి భవత్సర్వాత్మభావమ్మునఁ.**

మఱియు గోవులు దూడలు గోపబాలురు నీవేయై ఆ యా చిక్కములు మొదలయిన జడములయిన సాధనములు కూడ నీవేయై వానిం దాల్చిరాగా, గోరూపమునున్నతల్లులు దూడల రూపమున నిన్నుగనిమున్నెన్నడులేని

యానందము నంది వాత్సల్యముతో జేరి తమ లేగ యనుకొని నీకు కుంభవృష్టిగా పాలు చేపినవి. అట్లే గోపికలు తల్లులు నిన్ను తమ బిడ్డయే యనుకొని నిన్నొడిలోనికి దీసికొని కౌగిలించి ముద్దాడి పాలిచ్చి యెన్నడులేని వాత్సల్యముగని ఆనందవివశలైరి.

**జీవం హి కంచి దభిమానవశా త్స్వకీయం**
**మత్వా తనూజ ఇతి రాగభరం వహంత్యః,**
**ఆత్మానమేవతు భవంత మవప్య సూనుం**
**ప్రీతిర్యయు ర్న కియతీం వనితాశ్చ గావః. 5**

**తమకుఁ బిడ్డగ మున్ను జీవు నొకనిఁ దర్కించి యాత్మీయుగాఁ**
**గుమతుల్ రాగము వెంచి రెంతవరకుఁ; గోగోపికాబృందముల్**
**తమకున్ బిడ్డగ నేడు కేవలము నాత్మన్ బొంది తారెట్టి యం**
**దము నానందము నందిరోతెలిసి యెన్నఁ శక్యమే యేరికిన్.**

లోకములో తల్లులు తన కర్మము తానను భవించుటకు వచ్చిన జీవుని ఆత్మగా నభిమానించిన స్థూలసూక్ష్మ శరీరమును (ఉపాధిని) నా కుమారుడను మమకారము పెట్టుకొని అనురాగము పెంచుకొందురు. ఇక్కడ గోవులు గోపికలు కేవలము ఆత్మవేయైయున్న నిన్ను-నేను నేననుకొనుటలో అన్యాయము, వీడు నా కొడుకు అనుటలో ఇదమంశరూపుడైయున్న కృష్ణుని నిన్ను గుమారునిగా బడిసి వారు ఏలాటి ప్రీతి నందిరో యది మాటలచే చెప్పుటకు సాధ్యముగాదు.

**ఏవం ప్రతిక్షణ విజృంభితహర్ష భార**
**నిశ్శేషగోపగణ లాలితభూరిమూర్తిమ్**
**త్వా మగ్రజో పి బుబుధేకిల వత్సరాంతే**
**బ్రహ్మాత్మనోరపి మహాన్ యువయోర్విశేషః**

**ఈ విధమై క్షణక్షణము హెచ్చిన మోదముతో నశేషగో**
**పావళి లాలనంబడసి యందఱు నీవగుచుఁ నటించు నీ**
**భావము నొక్క వత్సరముపై బలరాముండునుం గ్రహించె నా**
**హా! విలసించె బ్రహ్మమయులయ్యును మీయెడఁదారతమ్యముల్.**

ఇట్లు ప్రతిక్షణమును ఉప్పొంగుచున్న యానందముతో గోపకుల లాలన మందుచు సర్వాత్మస్వరూపమై చరించు నీ కలరూపు బలరాముడు ఒక్కయేడు జరిగిన తర్వాత గ్రహింపగల్గెను. స్వామి! మీరిద్దరు కేవల బ్రహ్మస్వరూపులే యయ్యును మీలోగూడ భేదమున్నది.

వి.వి: బ్రహ్మవిత్తు-బ్రహ్మవిద్వరుడు-బ్రహ్మవిద్వరిష్ఠుడు అను భేదము లోకప్రసిద్ధమే. ఇచట కృష్ణుడు నిష్కల బ్రహ్మము. బలరాముడు సకలబ్రహ్మము ననునదియే యా భేదము.

వర్షావధౌ నవపురాతనవత్సపాలాన్
దృష్ట్వా వివేకమసృణే ద్రుహిణే విమూఢే,
ప్రాదీదృశః ప్రతినవాన్ మకుటాంగదాది
భూషాంశ్చతుర్భుజయుజః సజలాంబుదాభాన్. 7

* చనెనటు లొక్కయే డెఱుక సాలియుఁ జాలక మున్ను దాను దా
చిన మఱి సేడు సూచిన యశేష కుమారక గోకదంబమున్
గని వెఱగందె నవ్విధి కనత్కనకాంగద భూషణుల్ ఘనా
ఘనరుచులున్ జతుర్భుజాలు కాంచనచేలురు నంద రౌటకున్.

ఒకయేడట్లు జరిగినది. అవ్వల క్రొత్తగా శ్రీకృష్ణమయులైయున్న దూడలను బసులకాపరులను, తాను దాచిన వెనుకటి దూడలను బసులకాపరులను-ఇటు-అటు సూచి బ్రహ్మ తికమకపడి, ఇవే నిజమయినవి అవి మాయామాయములకు కొని వివేకము గోలుపోయినతఱి క్రొత్తగా కిరీటములు భుజకీర్తులు మొదలగు వానిని ధరించి తొలకరి మేఘమురంగులతో చతుర్భుజములతో గూడిన మూర్తులను జూపించితివి.

ప్రత్యేకమేవ కమలాపరిలాలితాంగాన్
భోగీంద్రభోగశయనాన్ నయనాభిరామాన్,

---

* వనజోద్భూతి సనాతనాద్యతన గోపాలార్భక శ్రేణిఁ గ
న్గొని యేడవ్వల, నున్న తెల్వి సెడి సంకోచింపఁగా నూత్ననూ
తనులన్ శ్రీ మకుటాంగదాభరణులన్ దర్శింపఁగాఁ జేసినా
వన పీతాంబరులన్ జతుర్భుజాల నవ్యాంభోద సంకాశులన్

**లీలానిమీలితదృశ స్సనకాదియోగి**
**వ్యాసేవితాన్ కమలభూ ర్భవతో దదర్శ. 8**

**సిరికిరవైన మేనులు నశేషఫణీంద్ర ఫణాగ్రమందు ని**
**ద్దుర నటియించుచున్ మొగుచు తోరపుఁ గన్నులు గల్గువారలన్**
**వర సనకాది యోగిజన వందితులయ్యేడు వారి మిమ్మొకొ**
**క్కరి విడిగాఁ గనుంగొనియెఁ గంజభవుం డభిరామమూర్తులన్.**

మఱియు నా చతుర్ముఖబ్రహ్మ వక్షస్థలమందు లక్ష్మిగల్గి అనంత భోగి భోగాగ్రశయ్యలయందు నిద్రవోవుచున్నట్లు కన్నుమొగిచియున్నవారిని సనకాది మహాయోగులచే కొలువబడుచున్న రమణీయమూర్తులను పెక్కుమంది నారాయణ మూర్తులను దర్శించెను.

**నారాయణాకృతి మసంఖ్యతమాం నిరీక్ష్య**
**సర్వత్ర సేవకమపి స్వ మవేక్ష్య ధాతా,**
**మాయానిమగ్నహృదయో విముమోహ యావ**
**దేకో బభూవిథ తదాకబలార్థపాణిః. 9**

**ఆయెడ మాయగ్రమ్మ హృదయమ్మున మోహితుఁడై యనంత నా**
**రాయణ మూర్తులన్ మఱి స్వయమ్మటఁ గింకరులైన తన్ను నున్**
**దోయజసూతి సూచిన యనుక్షణమే కబలార్ధ పాణివై**
**డాయఁగ వచ్చి నాఁడవు దటాలున నొక్కఁడుగాగ నొక్కఁడై.**

మాయ యావరింపగా బ్రహ్మ మోహమున మునింగి అనంత నారాయణ మూర్తులను, అందఱిచెంత నొక్కొక్కడుగా దాసుడై సంచరించుచున్న తన మూర్తులను బెక్కుమందిని జూచి తబ్బిబ్బువడి అట్టిటు చూచుచున్నంతలోనే నీవు విశ్వరూప ముపసంహరించి చేతిలో పెరుగన్నపుముద్ద గైకొని ఒక్క గోపాలమూర్తివై తటాలున నక్కడనే దగ్గరకు వచ్చి దర్శనమిచ్చితివి.

**నశ్యన్మదే తదను విశ్వపతిం ముహుస్త్వాం**
**నత్వాచ నూతవతి ధాతరి ధామయాతే,**

**పో తైస్సమం ప్రముదితైః ప్రవిశ న్నికేతం**
**వాతాలయాధిపవిభో పరిపాహిరోగాత్. 10**

**అంతట విశ్వనాథు పదమంటి నినుంగొనియాడి బ్రహ్మ యం**
**తంతన యింటికిం జనఁగ, నర్భకబృంద మమంద హర్ష వి**
**భ్రాంతిని బొంది మందగొనిరాఁజనినాఁడవు గొల్లపల్లెకుఁ**
**వంత సమస్తముం దొలఁచి వాతని కేతన! ప్రోవరా ననుఁ**

అంట పద్మగర్భుడు పద్మనాభుడగు నీ పాదములపై వ్రాలి నిన్ను స్తుతించి తన స్థానమున కేగెను. ఆనందభరితులై గోపాలురు మందలను మఱలించికొని వెంటరాగా నీవు వ్రేపల్లెకేగి మీ యిల్లు చొచ్చితివి, ఓ గురువాయూరు పురనివాస! నన్ను బ్రోవుము.

## 53వ దశకము

# ధేనుకాసుర సంహారము

**అతీత్య బాల్యం జగతాం పతే త్వ ముపేత్య పౌగండవయో మనోజ్ఞమ్,**
**ఉపేక్ష్య వత్సావన ముత్సవేన ప్రావర్తథా గోగణపాలనాయామ్. 1**

**కడచి బాల్యమ్ము మిసిమి పౌగండమూని**
**చిన్ని తువ్వాయులన్గాచు చిన్ని పనికిఁ**
**జొరక గోలోకముంగాచు చొరవఁ బూని**
**నావు భువనైక పరిపాలనావినోద!**

బాల్యావస్థ (అయిదేండ్లు) దాటి చక్కని పౌగండవయస్సు అనగా నారవయేడు (ద్వితీయ పంచకము) ఈడున బ్రవేశించి యీడునకు దగినట్లు చిన్ని లేగలను గాయుట మాని గోవుల మందలను గాచు పనిని ప్రారంభించితివి.

**ఉపక్రమ స్యానుగుణైవ సేయం మరుత్పురాధీశ తవ ప్రవృత్తిః**
**గోత్రాపరిత్రాణకృతేఽవ తీర్ణ స్తదేవ దేవారభథా స్తదా యత్. 2**

**పవనపురనాథ! నీదు ప్రవర్తనమ్ము**
**పక్రమమునకు సమనురూపముగ నడచెఁ**
**బూని గోత్రాపరిత్రాణమునకు నవత**
**రించితివికాన యదె యుద్యమించి తిపుడు.**

నీ ప్రారంభమునకు దగినట్లే అపుడు నీ నడతయు నారంభమైనది. అదెట్లన; గోత్రా+ గోవులయొక్క, పరిత్రాణ=రక్షణకై, అవతీర్ణః=అవతరించిన వాడవు గావున, తదేవ గోత్రా=భూమియొక్క, పరిత్రాణం=రక్షణమునే, ఆరభథాః =అరంభించితివి. ఇది గోత్రాశబ్దముమీద కవి చేసిన చమత్కారము శ్లేషాలంకారము.

**కదాఽపి రామేణ సమం వనాంతే వనశ్రియం వీక్ష్య చరన్ సుఖేన,**
**శ్రీదామనామ్నః స్వసఖస్య వాచా మోదా దగా ధేనుకకాననం త్వమ్. 3**

**రాముతోఁగూడి యవ్వనరామణీయ**
**కమ్ము గనుగొంచు సుఖముగాఁ గలిసి తిరిగి**
**సఖుఁడు శ్రీదాముఁ డెఱిఁగింపఁ సంతసమున**
**నీవు ధేనుక వనమున కేగినావు.**

ఒకనాడు బలరామునితో నావనరామణీయకము గనుగొను వేడుకతో నీ మిత్రుడు శ్రీదాము డెఱిగింపగా దెలిసి నీవు ధేనుకుడను రాక్షసుడుండు నావనమున కేగితివి.

**ఉత్తాలతాళీనివహే త్వదుక్త్యా బలేన ధూతేఽథ బలేన దోర్భ్యామ్,**
**మృదుః ఖర శ్చాభ్యపత త్పురస్తాత్ ఫలోత్కరో ధేనుకదానవోఽపి. 4**

**లీల నీ మాటపై సముత్తాల తాళ**
**తరుల బలరామమూర్తి హస్తముల నూప**
**రాలె తాళఫలమ్ము లా రవము విన్న**
**వాఁడు ధేనుకుఁడున్ వచ్చి వ్రాలె నచట.**

అచట నీ మాటను బట్టి అన్నయ్య బలరామమూర్తి తాటిచెట్లను జేతులం బట్టి యూపెను. ఆ యూపునకు తాటిపండ్లు రాలెను. అంతేకాదు

ఆ చప్పుడునకు అక్కడనున్న ధేనుకుడను రక్కసుడు కూడ వచ్చి మీముందు వ్రాలెను.

**సముద్యతో ధేనుకపాలనేఽహం కథం వధం ధైనుక మద్య కుర్వే,**
**ఇతీవ మత్వా ధ్రువ మగ్రజేన సురౌఘ యోద్ధార మజీఘన స్త్వమ్. 5**

**ధేనుతతిఁగాచు పనికదా పూనివచ్చి**
**నాఁడఁదద్వధ మెటుసేయు వాఁడ ననుచు**
**తలఁచి కాఁబోలు బలరామువలన నమర**
**వైరు జంపించినాఁడ వుదారచరిత!**

ధైనుక=ధేనువుల సమూహము (వ్యా. ధేనూనాం సమూహః ధైనుకం. సమూహార్థములో అణ్ ప్రత్యయము) దాని పాలనమునకు గదా నేను వచ్చితిని. అట్టియెడ ధైనుకవధ=గోసమూహ సంహారము, శ్లేష ధేనుకాసురునియొక్క వధ ఎట్లు చేయుదునని కాబోలు, ఆపని బలరామునిచేత జేయించినాడవు. అనగా ధేనుకాసురుని బలరాముడు సంహరించెనన్నమాట.

**తదీయభృత్యానపి జంబుకత్వే నోపాగతా నగ్రజసంయుతస్త్వమ్,**
**జంబూఫలానీవ తదా నిరాస్థ స్తాలేషు ఖేలన్ భగవన్ నిరాస్థః. 6**

**వాని బంటులు నక్కలై వచ్చినంత**
**బలుఁడు నీవును నేరేడు పండ్లు రాలఁ**
**గొట్టిన ట్లందరం బట్టి గొట్టి తాటి**
**తోపులం దాటుకొంటిరి తొంటియట్ల.**

ధేనుకాసురుని బంట్లు రాక్షసులు నక్కలయి ఎత్తిరాగా నీవును బలరాముడును నేరేడుపండ్లను రాల్చినట్టు వారల వ్రాలించి యా తాటితోపులో నెట్టి యాస్థయు లేకయే విహరించితిరి.

వి.వి: లీలామానుషావతారులైన మీకు దుష్టశిక్షణ శిష్టరక్షణములు స్వభావములుగాన వానియందు మీకెట్టి యభినివేశము లేదని భావము.

**వినిఘ్నతి త్వ య్యథ జంబుకౌఘం సనామకత్వా ద్వరుణ స్తదానీమ్,**
**భయాకులో జంబుకనామధేయం శ్రుతిప్రసిద్ధం వ్యధితేతి మన్యే. 7**

జంబుకవధమ్ము నీవట జరిపి బంధ
ముక్తి నొనరించితని బంధముక్తి గోరి
చెలఁగి తానును శ్రుతి సుప్రసిద్ధమైన
యదియ పేరూనె వరుణుఁడం చాత్మనెంతు.

నీవు జంబుకములను (నక్కలను) వధించి వారికి బంధవిముక్తి (మోక్షమును) జేకూర్చితివని వినికాబోలు వరుణుడు తానును ముక్తిగోరి శ్రుతిప్రసిద్ధమైన జంబుక నామమును ధరించెనని నేను భావింతును. (ఇది కవివాక్యము) వరుణ దేవునికి జంబుకుడను పేరు వేదప్రసిద్ధము. దాన్నిబట్టి కవిచేసిన చమత్కారమిది. శ్లేష.

**తవావతారస్య ఫలం మురారే సంజాత మద్యేతి సురై ర్నుత స్త్వమ్,**
**సత్యం ఫలం జాత మిహేతి హాసీ బాలై స్సమం తాలఫలా న్యభుంక్థాః. 8**

కలిగె నీ వవతరించి నందులకు ఫల మ
టంచు వేలుపు లెల్ల నుతించుచుండ
నీవు నిదిగో ఫలమ్మంచు నెలమి నవ్వి
తాటిఫలమారగించి తందరను గూడి.

నీ యవతారమునకు ఫలము ధేనుకవధ దానిచే నిది ఫలవంతమయినదని దేవతలు నిన్ను నుతింపగా; నిజము నిజము-ఇదిగో ఫలమనుచు వారింజూచి పరిహసించుటకో యన్నట్లు గోపకులతో నీవు తాళఫలములం దింటివి.

**మధుద్రవస్రుంతి బృహంతి తాని ఫలాని మేదోభరభృంతి భుక్త్వా,**
**తృప్తైశ్చ దృప్తై ర్భవనం ఫలౌఘం వహద్భి రాగాః ఖలు బాలకైస్త్వమ్. 9**

తేనెలూరుచు గుంజు నెంతేని గలుగు
పెనుపుగల పండ్లు తిన్నన్ని తినియు, మోయఁ
గలిగినన్నియు మోచుక వెలలివచ్చు
బాలకులతోడ నింటికి వచ్చినావు.

మంచి గుంజుగల్గి తేనెలూరుచున్న పెద్ద తాటిపండ్లు తిన్నన్నితిని, తనివిచెంది, సంతసించి మోయగల్గినన్ని మోచికొనివచ్చు పిల్లలతో నింటికి వచ్చితివి.

**హతో హతో ధేనుక ఇత్యుపేత్య ఫలా న్యదద్భి ర్మధురాణిలోకైః,**
**జయేతి జీవేతి నుతో విభో త్వం మరుత్పురాధీశ్వర పాహి రోగాత్. 10**

ధేనుకుఁడు గూలెఁగూలె నంచూని మధుర
ఫలము లానుచు లోకులు పాడి నిన్ను
జేరి జయజయ యని చిరంజీవ యనుచు
నాడి రనిలపురేశ! న న్నాదరింపు.

ధేనుకుడు కూలెకూలెనని సంతోషవడి పండ్లు దినుచు పల్లెజనము జయ జయ! యని యభినందించి చిరంజీవ చిరంజీవ! యని నిన్ను దీవింప నింపు గొలిపితివి. ఓ మరుత్పురాధీశ! కృష్ణా నన్ను వ్యాధినుండి రక్షింపుము.

## 54వ దశకము

# గోగోపోజ్జీవనము

**త్వత్సేవోత్క స్సౌభరి ర్నామ పూర్వం కాళింద్యాంత ర్ద్వాదశాబ్దం తపస్యన్,**
**మీనవ్రాతే స్నేహవాన్ భోగలోలే తార్క్ష్యం సాక్షా దైక్ష తాగ్రే కదాచిత్. 1**

ముందొకనాడు చూచె ఖగపుంగవు సౌభరియన్ మునీంద్రుఁడా
నందమునొంది నీ కొలువునన్ బదిరెండగునేండ్లు నిల్చి కా
ళింది జలమ్ములన్ దపము లీలగఁజేయుచు, భోగలోలమై
యందు వసించు మీనముల యందు గనెన్ దరిలేని స్నేహమున్.

ఒకనాడు సౌభరియనుముని ఆనందముతో నిన్ను పంద్రెండేండ్లు సేవించి, కాళిందిమడువులో తపస్సు చేయుచు నందలి చేపపిల్లలపై నంతులేని స్నేహభావమును వహించెను.

**త్వద్వాహం తం సంక్షుధం తృక్షసూనుం మీనం కంచి జ్జక్షతం లక్షయన్ సః,**
**తప్తశ్చిత్తే శప్తవా నత్ర చేత్త్వం జంతూన్ భోక్తా జీవితంచాపి మోక్తా. 2**

కడువడి నాకటన్ నకనకంబడి నీదగు వాహనమ్మ య
క్కడ నొక చేపపిల్ల దినగాఁగని యమ్ముని యుమ్మలించి య
ప్పుడ శపియించె నా ఖగవిభున్ బొగరెక్కి యొరోరిపక్షి! యి
య్యెడ నొకప్రాణి నీవు భుజియింతువొ మేను త్యజింతువంచునున్.

ఆకలిచే నకనకలాడి నీ వాహనమగు గరుడుడువచ్చి ఆ మడువులోని ఒక చేపపిల్లను గబళించెను. అదిచూచి సౌభరి శోకించి "ఓరీ! పక్షీ! ఇందున్న ఒక ప్రాణిని నీవు తిందువో అప్పుడే నీవు శరీరము విడచెదవు" అని యా గరుత్మంతుని శపించెను.

తస్మిన్ కాలే కాలియః క్ష్వేళదర్పాత్ సర్పారాతేః కల్పితం భాగ మశ్నన్,
తేన క్రోధా త్త్వత్పదాంభోజభాజా పక్షాక్షిప్త స్తద్దురాపం పయోఽగాత్. 3

అదె సమయానఁ గాళియమహాఫణి దుర్విషగర్వ ధూర్వహుం
డదిర! గరుత్మదర్థమగు నాబలి తాన భుజించినంతఁ ద్వ
త్పద జలజార్చకుండు వినతాసుతుఁడీసున ఱెక్కలార్చి యం
దదలిఁచి సర్పముం దరిమె నయ్యది యా హ్రదవారిలోబడన్.

అదే సమయములో కాళియుడను సర్పరాజు విషవేగముచే గర్వించి యున్నవాడు గరుడుని కొఱకు నిర్దేశింపబడిన బలిని తాను భుజించెను. స్వామీ! మీ చరణకమల సేవానిపుణుడయిన గరుడుడు కోపముకొని ఱెక్కలు విదల్చికొని యెగిరి యా పామును దరుముకొనిపోగా నది కాలిందిమడువులో వచ్చిపడెను.

ఘోరే తస్మిన్ సూరజానీరవాసే తీరే వృక్షాః విక్షతాః క్ష్వేళవేగాత్
పక్షివ్రాతాః పేతు రభ్రే పతంతః కారుణ్యార్ద్రం త్వన్మన స్తేన జాతమ్. 4

కుతకుతఁ గ్రాగె నమ్మడుగు ఘోరమహాహివిషాగ్ని కీలలన్
సతమత మయ్యెఁదత్తటమునన్ దరుషండము మింటఁజారు ప
క్షితతులు గుప్పగూలె విషకీలల యవ్వడగాలిసోకి య
చ్యుత! కరుణారసార్ద్రమయి యొప్పె భవద్హృదయమ్ము నయ్యెడన్.

ఆ కాళియుని విషవహ్ని కా మడుగునీరు కుతకుత వేడెక్కెను ఆ వేడికా యొడ్డున నున్న చెట్లు మాడిపోయెను. మింట నెగురుచున్నపక్షులు రాలిపోయెను. అపుడు కృష్ణా! నీ హృదయము కరుణారసార్ద్రమయినది.

**కాలే తస్మి న్నేకదా సీరపాణిం ముక్త్వా యాతే యామునం కాననాంతమ్,**
**త్వయ్యుద్దామగ్రీష్మ భీష్మోష్మతప్తా గోగోపాలా వ్యాపిబన్ క్ష్వేళతోయమ్. 5**

**యమునాతీర వనాంత వీథి నొకనా డన్నయ్య రాకుండ వే**
**గమ నీ వేగినవేళ నుద్ధతి నిదాఘక్షుబ్ధమై దప్పికన్**
**గుములంజొచ్చి సహింపనేర కట గోగోపాలబృందమ్ము లా**
**త్రమునన్ గేవలమున్ విషమ్ము విషమంతన్ ద్రావి రొక్కుమ్మడిఁ.**

నీవును బలరాముడు రాకుండ ముందే యొంటరిగా యమునా తీరవనమునకు వెళ్లితివి. అపుడు ఎండదెబ్బవడి దప్పికగొని గోవులు గోపాలురును బోయి యా మడువులోని కేవల విషమయిన విషమును=నీరును ద్రావిరి

నశ్యజ్జీవాన్ విచ్యుతాన్ క్ష్మాతలే తాన్
విశ్వాన్ పశ్య న్నచ్యుత! త్వం దయార్ద్రః,
ప్రాప్యోపాంతం జీవయామాసిథ ద్రాక్
పీయూషాంభోవర్షిభి శ్శ్రీకటాక్షైః 6

**త్రావిన యాక్షణ మ్మొడలి ప్రాణములందఱు నేలఁగూల గో**
**పావళి గోకదంబ మదియప్పుడ కన్గొని చేరవచ్చి సం**
**జీవితముం బొనర్చితివి చెల్వగు నయ్యమృతమ్ము వర్షధా**
**రావళినించు నంచిత కటాక్ష రుచుల్ వెలయించుచుఁ హరీ!**

త్రావగానే ప్రాణములు వీడి యందఱును నేలకొరిగిరి. అమృతధారలను వర్షించు నీ కటాక్షములను వారిపై బరపి యందఱిని బ్రతికించితివి.

**కింకిం జాతో హర్ష వర్షాతిరేక స్సర్వాంగేష్వ త్యుత్థితా గోపసంఘాః,**
**దృష్ట్వాఽగ్రే త్వాం త్వత్కృతం తద్విదంత స్త్వా మాలింగన్ దృష్టనానాప్రభావాః 7**

అవయవముల్ నిరంతర సుఖామృత వర్షమునందుఁ దోఁగ నే
డవుర యిదేమిదే మనుచు నల్లన నందరు లేచి చూచి రా
దవుల నినున్ గ్రహించి తుది త్వత్కృతమంచు భవత్ప్రభావ వై
భవము లవెన్నొ మున్గనిన వారగుటన్; నిను గౌగిలించుచున్

వారు సర్వావయములును నెన్నడులేని సుఖము నందగా ఈ వింత యేమి యేమి యనుచు నందఱు లేచి నిన్నుజూచి యిదంతయు నీవుచేసిన యనుగ్రహమే యని, అంతకు మున్ను నీ చేసిన లీలలు చూచినవారగుటచే నిను జేరి కౌగలించుకొనిరి.

గావశ్చైవం లబ్ధజీవాః క్షణేన స్ఫీతానందా స్త్వాంచ దృష్ట్వా పురస్తాత్,
ద్రా గావవ్రు స్సర్వతో హర్షబాష్పం వ్యాముంచంత్యో మంద ముద్యన్నినాదాః. 8

తీరుఁగ బ్రాణముల్ వడసి ధేనువు లబ్బురమైన యుబ్బునన్
జేరి నినున్ గనుంగొనుచు నిచ్చలు కన్నుల హర్ష బాష్పముల్
ధారలుగాగ నించుచును దండ్రి! నినున్ వడిఁజుట్టువారి యం
భారవముల్ పొనర్చె ఋషభస్వర మంద్ర మనోజ్ఞమూర్ఛనన్

ఆవులుకూడ ప్రాణములువచ్చి నీ దరికి వచ్చి కన్నులయం దానంద బాష్పములు నించుచు నీ చుట్టును జేరి వృషభస్వర గంభీరముగ నంభారవమ్ము లొనర్చినవి.

రోమాంచోఽయం సర్వతో న శ్శరీరే భూయస్యంతః కాచి దానందమూర్ఛా,
ఆశ్చర్యోఽయం క్ష్వేలవేగో ముకుందే త్యుక్తో గోపైర్నందితో వందితోభూః. 9

తనువెల్లఁ బులకించెఁ జూడుమిదె యంతర్వీథి నానంద మూ
ర్ఛన కాఁబోలిది దుర్విషగ్రసన మాశ్చర్యమ్ము గోవింద! క
న్గొను మావంక ముకుంద! రమ్మనెడు నాగోపాల బృందాభినం
దనమున్ వందన మందుకొంటివి గదన్నా నందరాణ్ణందనా!

కృష్ణా! నీ లీలలకు మా మేనులు పులకించినవి. మా మనసులలో నేదో యానందము ముంచెత్తుచున్నది. ఇమ్మహావిషమును శమింపజేయు టాశ్చర్యము.

మావంక ఒక్కసారి తిలకింపుము. రావోయి రమ్మని గోపాలురు చేయు నభినందనములను వందనములను అందుకొన్నాడవు.

**ఏవం భక్తాన్ ముక్తజీవా నపి త్వం ముగ్ధాపాంగై ర స్తరోగాం స్తనోషి,**
**తాదృగ్భూత స్ఫీతకారుణ్యభూమా రోగా త్పాయా వాయుగేహాధినాథ. 10**

**ఈ విధి ముక్తజీవులగు నెల్లర భక్తుల రోగ ముక్తులఁ**
**నీవొనరించుచుందువు వినిర్మల ముగ్ధకటాక్షవీక్షణా**
**ప్లావ మొనర్చి తాదృశ కృపాపరిపాక సుఖాతి రేక సం**
**భావన నాకొసంగఁ దగవా గురువాయుపురాధి నాయకా!**

ఇట్లు నీ కటాక్షములు నించి జీవితము బాసినవారికి సంసారబంధముక్తులగు భక్తులకుగూడ రోగముక్తి చేయుచుందువు. అట్టి నీ కృపారస పరిపాకము వలన సుఖాతిశయము నొసంగి నన్ను గారవించవోయి గురువాయూరపురాధీశ్వర!

## 55వ దశకము

# కాలియమర్దనము

**అథ వారిణి ఘోరతరం ఫణినం ప్రతివారయితుం కృతధీ ర్భగవన్,**
**ద్రుతమారిథ తీరగ నీప తరుం విషమారుతశోషిత పర్ణచయమ్. 1**

**అల ఘోరతరమ్మగు నయ్యహి వ్యా**
**కులుఁ జేయగ నీవును ఘోర విషా**
**గ్నుల మాడిన యాకులఁ గూడిన యు**
**జ్జ్వల నీపము నెక్కితి సత్వరమే.**

ఇది తోటకవృత్తము. గణములు జ జ జ జ: కాళియుని దర్పము హరించుటకై విషాగ్నులచే మాడిన యాకులతో మ్రోడువడిన నీపవృక్షముపై కెక్కితివి.

**అధిరుహ్యపదాంబురుహేణ చ తం నవపల్లవతుల్య మనోజ్ఞరుచా,**
**హ్రదవారిణి దూరతరం న్యపతః పరిఘూర్ణిత ఘోరతరంగగణే. 2**

నవపల్లవ సుందర నవ్యపద
చ్ఛవి నించుచు నెక్కివెసం దరువున్
దవుదవ్వుల దూకితి దాన మహో
గ్రవిధిన్ దరగల్ గలగం బడియెన్

లేత చిగుర లట్లు మృదులములైన నీ పదముల తళుకులను జిమ్ముచు నీ వా తరువుపై కెక్కి అల్లంత దూరమున దూకితివి. అప్పుడా మడుపులో కెరటములు రేగి కలగుండువడియెను.

**భువనత్రయ భారభృతో భవతో గురుభారవికంపి విజృంభిజలా,**
**పరిమజ్జయతి స్మ ధనుశ్శతకం తటినీ ఝటితి స్ఫుటఘోషవతీ. 3**

భువనత్రయమున్ మును బూనిన బ
ర్వవశమ్మయి యాకసమంటగ నం
బువు లెల్ల భువమ్మును ముంచెఁ దదు
ద్భవ భంగ సమూహ మభంగ గతిన్

ముల్లోకములు బొజ్జలో నూనిన నీ బరువున కా చెఱువులో నీరు లేచి యందలి తరంగము లా ప్రాంతభూములను ముంచెత్తెను.

**అథ దిక్షు విదిక్షు పరిక్షుభిత భ్రమితోదరవారి నినాదభరైః,**
**ఉదకా దుదగా దురగాధిపతి స్త్వదుపాంత మశాంతరుషాంధమనాః. 4**

నదినా సుడిగండమునన్ ధ్వని య
న్ని దెసల్ నిగుడన్ భయ నిస్తులమై
కదలెన్ మఱి యయ్యురగ మ్మొద నె
మ్మది దక్కి గడుంగడు మచ్చరమై

సుళ్లురేగిన యామడువులోని నీటి కెరటముల చప్పుడు అన్నిదిక్కులను గ్రమ్మగా నాపాము పగగొని నీదరికి గదలెను.

**ఫణశృంగ సహస్ర వినిస్సృమర జ్వలదగ్నికణోగ్ర విషాంబుధరమ్,**
**పురతః ఫణినం సమలోకయథా బహుశృంగిణ మంజనశైలమివ.** 5

**తలలఁ బదివందల దారుణ వ**
**హ్నులు రాల విషమ్ముల నొల్కు ఫణిం**
**గలయం గనుగొంటి వగణ్య శిరః**
**కలితాంజన శైలముఁ గన్న యటుల్**

వేయిపడగలనుండి భయంకర విషాగ్నులు చిమ్ముచున్న యాపాము పెక్కు శిఖరములతోడి కాటుకకొండ యట్లు నీకు గానిపించెను.

**జ్వలదక్షి పరిక్షర దుగ్రవిష శ్వసనోష్మభర స్స మహాభుజగః,**
**పరిదశ్య భవంత మనంతబలం పరివేష్టయ దస్ఫుటచేష్ట మహో.** 6

**జ్వల దక్షి వల ద్విషవహ్ని శిఖా**
**వలి నూర్పుల జిమ్మగఁ బాము మహా**
**బలు గాటిడి నిఁ బగఁబట్టి వడిఁ**
**నిలువెల్లను జుట్టుకొనెం బెలుచన్.**

నిప్పులు చెఱగు నెఱ్ఱని కన్నులతో విషాగ్నిజ్వాలలు చిమ్ముచు బుసలు కొట్టుచు లేచి యా పాము పగగొని నిన్ను బెక్కు కాట్లువేసి నీ శరీరమంతటం జుట్టుకొనెను.

**అవిలోక్య భవంత మథాకులితే తటగామిని బాలకధేనుగణే,**
**వ్రజగేహతలే ప్యనిమిత్తశతం సముదీక్ష్య గతా యమునాం పశుపాః** 7

**దరి నిల్చిరి నీదరి దాకక యం**
**దరు మందలుఁ గుందుచు దారి గృహం**
**తరసీమ నిమిత్త మదాంత శుభే**
**తరమున్ గని చిత్తము తత్తరిలన్**

నీవు వనమందు గనబడనికతన నంతట వెదకి గోపాలురు చివరకా మడువుదగ్గరకు వచ్చిరి. అక్కడ వ్రేపల్లెలో దుశ్శకునములు గనిపించి యక్కడి వారుకూడ తత్తరపడి యిక్కడకు వచ్చిరి.

**అఖిలేషు విభో భవదీయదశా మవలోక్యజిహాసిషు జీవభరమ్,**
**ఫణిబంధన మాశు విముచ్య జవా దుపగమ్యత హాసజుషా భవతా. 8**

త్వరగాఁ జని గోపకవర్గ మయో
హరి! ప్రాణము లొల్ల మటన్నఁ గృపా
స్ఫురణ౯ ఫణిబంధనమున్ విడి యీ
శ్వర! నవ్వుచు వేగమ వచ్చి తటన్

నీవున్న తీరుచూచి నీకై ప్రాణములు వదలుటకు సిద్ధమైన నీజనముం గని యల్లన నవ్వుచు నావెంటనే సర్పబంధమును విడిచి చెట్టుమీదికి నెక్కితివి.

**అధిరుహ్య తతః ఫణిరాజ ఫణా న్ననృతే భవతా మృదుపాదరుచా,**
**కలశింజిత నూపురమంజుమిల త్కరకంకణ సంకుల సంక్వణితమ్. 9**

ఫణిరాజ ఫణోజ్జ్వల పాద రణ
న్మణి నూపుర కింకిణి మంజుల స
న్మణి కంకణ నిక్వణనమ్మగు ధో
రణి నర్తన సేయవె రక్తి మెయి౯

సర్పరాజుపడగలపై నీ పాదముల చిఱుమువ్వకడియములు మొరయగా, చేతి మణికంకణములు మ్రోయగా నద్భుతముగా నర్తనము చేసితివి.

**జహృషుః పశుపాస్తుతుషు ర్మునయో వవృషుః కుసుమాని సురేంద్రగణాః,**
**త్వయి నృత్యతి మారుతగేహ పతే పరిపాహి సమాం త్వ మదాంత గదాత్. 10**

వ్రజవాసులు పొంగిరి భక్తముని
వ్రజ మెల్లరు ని౯ రహిఁబాడిరి ద్యో
వ్రజ పూవులు నించిరి వాతపతీ!
త్రిజగన్నుట శేఖర! తేర్పు ననున్

నీవు నృత్యము సేయుచుండగా వ్రేపల్లె జనముప్పొంగిరి. భక్తులు మునివ్రజము నిను కొనియాడిరి. సురగణము పూలవాన కురిపించిరి. ఓ గురుగేహపతీ! నన్ను రోగములనుండి ముక్తుని జేయుము.

# 56వ దశకము

# కాళియానుగ్రహము

రుచిరకంపిత కుండల మండల స్సుచిర మీశ ననర్తిథ పన్నగే,
అమరతాడిత దుందుభి సుందరం వియతి గాయతి దైవతయౌవతే. 1

కుండలమండనమ్ము తళుకుల్ కులుకన్ గులికించి పన్నగా
ఖండలుమీఁద దాండవ మఖండ గతిం బొనరింప నింగి యం
దుండి నిలింపకాంతలు నహో మఱి యాడిరి పాడి దేవతా
మండలి దుందుభిధ్వని సమంచిత మంగళఘోష మీనఁగన్.

ఆకసమున దేవదుందుభులు మ్రోయగా అప్సరసలు నినుగూర్చి పాడుచునాడగా నీ వాఫణిరాజు పడగలపై చెవికుండలాల కాంతులు చిమ్ముకొన చిరకాలము తాండవమొనరించితివి.

నమతి యద్య దముష్య శిరో హరే పరివిహాయ తదున్నత మున్నతమ్,
పరిమథన్ పదపంకరుహా చిరం వ్యహరథాః కరతాలమనోహరమ్. 2

తల లంతంతట వ్రాల్చి వంచు కొలఁదిన్ దప్పించి గుప్పించి యా
తల పైపై తలకెక్కి పాదజలజాంతర్జ్యోతి యంతస్తమ
స్సుల నెల్లన్ మథియింపఁ దత్ఫణి శిరస్సుల్ ద్రొక్కి నర్తించినా
వెలమిన్ ద్వత్కరతాళమేళనము నెంతే ముచ్చటల్ గూర్పగన్.

శ్రీహరీ! ఆ పాము ఒక్కొక్కతల వ్రాల్చిన కొలది నీవు ఆమీదితలలపై కెక్కి నీ పాదకమలములచే చిందులు త్రొక్కుచు చేతులతో తాళములు చఱచుచు అద్భుత నర్తన క్రీడ నెఱపితివి.

త్వదవభగ్న విభుగ్న ఫణాగణే గలితశోణితశోణితపాథసి,
ఫణిపతా వవసీదతి సన్నతా స్త దబలా స్తవ మాధవ పాదయోః 3

చావునఁ దప్పి భంగపడి జాలయి రక్తము నీరు రక్తమై
పోవు హ్రదమ్మునన్ ఫణివిభుం డవసానదశం జరింప ల

క్ష్మీవిభుఁడైన నీపద సమీపమునన్ బడి కాళియాహి ప
త్నీవిసరమ్ము దుఃఖపరిధీకృత ధీవికృత ప్రచారమై.

నీ త్రొక్కుడుల బడి పడగలు డీలువడి వ్రాలిపోగా తలలు చితికి కారిన రక్తముచే మడుగెల్ల రక్తముకాగా, ఫణిరాజు ప్రాణములమీదికి రాగా నీవు లక్ష్మీపతివని యెఱింగి పతిభిక్ష పెట్టుదువని యా కాళియాహి భార్యలు దుఃఖ పరమావధినందిన చిత్తములు చెదరిపోగా.

అయి పురైవ చిరాయ పరిశ్రుత ద్వదనుభావవిలీనహృదో హి తాః,
మునిభి రప్యనవాప్య పథైః స్తవై ర్నునువురీశ భవంత మయంత్రితమ్. 4

చిరకాలానకు మున్నుగ్రోలిన భవ చ్ఛ్రీస్వానుభావామృత
స్ఫురణన్ లీనత నొందు చిత్తములతో శోధించి మౌనీంద్రులే
నరుగన్‌రాని క్రమమ్మునన్ స్తుతిపథవ్యాసక్తలై పాడి ర
చ్చెఱువం దచ్చెరువైన నిన్ ఫణిఫణా శృంగార రంగాగ్రగున్.

కాళియుని భార్యలు సర్పరాజు ఫణాగ్రములనెడి శృంగారరంగమందు నర్తించు నిన్నుజూచి ఎన్నోజన్మము లాస్వాదించిన నీ మధురానుభావ సుధా ప్రవాహములో మనస్సులు విలీనములుకాగా నీ పాదములపై బడిరి. మహా మునులుగూడ అందుకొనలేని రీతిని నీ యశోగానముచేయ నారంభించిరి.

ఫణివధూగణ భక్తివిలోకన ప్రవికస త్కరుణాకులచేతసా
ఫణిపతి ర్భవతాచ్యుతజీవిత స్త్వయి సమర్పితమూర్తి రవానమత్. 5

పన్నగ సుందరీగణము భక్తి గనుంగొని పొంగి సత్కృపా
భ్యున్నతి జీవితమ్ము పరిపూర్తి యనుగ్రహ మిచ్చినావు నా
గన్నకు; నీకునై తనువు నప్పన చేసి ఫణాసహస్ర ఖే
లన్నవరత్న దీధితి కలాపము దీపమువెట్టి మ్రొక్కఁగన్.

పన్నగుని భార్యలు చూపిన భక్తికి సంతోషించి ఎనలేని దయనించి యా వెఱ్ఱినాగన్నకు కాళియునికి నీకై శరీరమర్పించి యాతడు తన వేయిపడగల చివరనున్న మణిదీపములు దీపములుగావెట్టి నీకు తలలువంచి మ్రొక్కగా జీవితము పూర్తిగా అనుగ్రహించినాడవు.

రమణకం వ్రజ వారిధిమధ్యగం ఫణిరిపుర్నకరోతి విరోధితామ్,
ఇతి భవద్వచనా న్యతిమానయన్ ఫణిపతి ర్నిరగా దురగైస్సమమ్. 6

'రమణక మింక పొమ్ముదధి రాజిలు; నం దహివైరి యెట్టి వై
రముఁగొన డెత్తి రాఁడిది వరమ్ము సుమీ' యని నీవు పంపగన్
సుమధురమైన నీపలుకు సొంపు గణించి యశేషనాగ సం
ఘము తన వెంబడిన్ నడువగా నటకుఁ నడచెఁ ఫణీంద్రుఁడున్.

నీవిక సముద్రమధ్యమందున్న రమణకద్వీపమునకు బొమ్ము. అక్కడ గరుడుండు నీపయికి రాడు. ఇది నేనిచ్చుచున్న వరము. అన నాతడు నీ మధుర వచనము విని యనుచరులైన ఉరగులు తనను వెంబడింప నచ్చోటికి తరలెను.

ఫణివధూజన దత్త మణివ్రజ జ్వలితహార దుకూల విభూషితః,
తటగతైః ప్రమదా శ్రువిమిశ్రితై స్సమగథా స్స్వజనై ర్దివసావధౌ. 7

కాళియు నంగనామణులు క్రమ మణిద్యుతి పుంజ రంజిత
శ్రీలగు హారముల్ నగలు చెల్వగు స్వర్ణ దుకూలజాలముల్
హేలగనీయఁ దాల్చి మఱి యేగితి వద్దరి నున్న హర్ష బా
ష్పాలసద్వగ్విలాసులగు నాప్తులతో నరసంజ ప్రొద్దునన్.

కాళియుని పత్నులు మనోహర మణికాంతిమంజులములగు హారాది భూషణములు బంగరుజరీ పట్టువస్త్రములు నీకు కానుకలు చెల్లింపగా నవి ధరించి ఆ మడుగు నద్దరియొడ్డున నీకై కాచుకొని ఆనందబాష్పములు గురియుచు స్వాగతవిలాసము నెఱపుచున్న నీ బందుగులతో ప్రొద్దుక్రుంకు చుండగా వ్రేపల్లెకు బయలుదేరితివి.

నిశి పునస్తమసా వ్రజమందిరం వ్రజితు మక్షమ ఏవ జనోత్కరే,
స్వపతి తత్ర భవ చ్చరణాశ్రయే దవకృశాను రరుంధ సమంతతః 8

చిప్పిలుకొంచు నక్కటికి చీఁకటి గ్రమ్మె, జనమ్ము పల్లె కిం
కిప్పుడు పోవుటెట్లని శయించిరి తో నిదురించి; రంతలో

గుప్పున గారుచిచ్చలముకొన్నది యెక్కడినుండి వచ్చెనో
యప్ప! భవత్పదాశ్రయుల నాశ్రయులై రపుడేమి సెప్పుదుఁ

అంతలో కారుచీకటు లలముకొనెను. జనము వ్రేపల్లె కిపుడు పోలేమని యక్కడనే పండుకొని నిద్రించిరి. అంతలో నెక్కడినుండి వచ్చెనో దావాగ్ని రేగి వారలను అలముకొన్నది. నీ చరణము నిలువ నీడగా గొన్న నీవారు నిలువలేక యల్లాడిరి.

ప్రబుధితా నథ పాలయ పాలయే త్యుదయ దా ర్తరవాన్ పశుపాలకాన్,
అవితు మాశు పపాథ మహానలం కిమిహ చిత్రమయం ఖలు తే ముఖమ్. 9

మేల్కనికావు కావు మను మిత్రులఁ గావఁదలంచి వారిపై
నాల్కలు సాచి మ్రింగ జవనమ్మునఁ గ్రమ్ము దవాగ్ని కీలలఁ
జుల్కనఁ ద్రావివైచితివి చోద్యము లన్నిఁటి కాటపట్టు నీ
కల్కి ముఖమ్ము గావలయుగా కరుణావరుణాలయా! హరీ!

మేల్కొని కృష్ణా! కావు కావుమని యాక్రందించు నీ చెలికాండ్రను రక్షింపదలచి నలువైపుల నాల్కలుసాచిన యా కారుచిచ్చు నట్టె సులభముగ త్రావివేసితివి. స్వామీ! కరుణకు సముద్రము నీవు. నీ చక్కని ముఖము వింతలకెల్ల ఆటపట్టు కాబోలును!

శిఖిని వర్ణత ఏవ హి పీతతా పరిలస త్యధునా క్రియయా ప్యసౌ,
ఇతి నుతః పశుపై ర్ముదితైర్విభో హర హరే దురితైస్సహ మే గదాన్. 10

అద్దిర వర్ణమాత్రమున నౌ శిఖియందలి పీతభావ మి
ప్డద్ది క్రియా విధిన్ వెలసెనంచును గోవులఁగాచు గొల్లలుఁ
సుద్దులు వాడి నిన్పొగడు సొంపది యింపొనరించె; కృష్ణ! మే
ల్గద్దరి వీవు నాదు రుజలఁ దురితమ్ములఁ ద్రోలలేవటే!

ఇది వరకు అగ్నికి పీతత్వము-పసుపురంగు గల్గియుండుట వర్ణమాత్రము ననే అనగా రంగుమాత్రముననే యున్నది. ఇపుడది నీచేత క్రియలోగూడ అనగా పీతత్వము=త్రాగబడినవాడు అగుట సిద్ధించినది. అని యానందించుచు పసుల కాపరులు నుతింపనొప్పిన శ్రీహరీ! మా వ్యాధితాపమును బాపములను బాపుము.

# 57వ దశకము

# ప్రలంబాసురవధ

**రామసఖః క్వాఽపి దినే కామద భగవన్ గతో భవాన్ విపినమ్,**
**సూనుభి రపి గోపానాం దేనుభి రభిసంవృతో లసద్వేషః. 1**

**బలరామునితో బృందా**
**స్థలి కేగితి వొక్కనాఁడు చక్కని వేస**
**మ్ములు పూని యాప్త మిత్ర**
**మ్ములతోడన్ గోకదంబములతోడ హరీ!**

ఒకనాడు బలరామునితో చక్కని వేషము వేసికొని గోపకుమారులతో ఆవుల మందలతో నీవు వనమున కేగితివి.

**సందర్శయన్ బలాయ స్వైరం బృందావనశ్రియం విమలామ్,**
**కాండీరై స్సహబాలై ర్భాండీరక మాగమో వటం క్రీడన్. 2**

**బృందావన సౌందర్యము**
**సందర్శింపించి హలికి స్వైర విహా రా**
**నందానన్ భాండీర మ**
**నందగు నొక మఱ్ఱిఁ జేరినాఁడవు కృష్ణా!**

బలరామునకు బృందావన శోభను జూపించుచు వేత్రహస్తులైన బాలురతో భాండీర మను మఱ్ఱివృక్షమును సమీపించితివి.

**తావత్ తావకనిధన స్పృహయాలు గోపమూర్తి రదయాళుః,**
**దైత్యః ప్రలంబనామా ప్రలంబ బాహు ర్భవంత మాపేదే. 3**

**రక్కసుఁడొకఁడతికర్కశుఁ**
**డక్కడఁ బ్రాలంబబాహువగు నిను గూల్పన్**
**మక్కువగాంచి ప్రలంబుం**
**డక్కట! గోపాలబాలకాకృతి వచ్చెన్.**

ఆజానుబాహువగు నిన్ను సంహరించు తలంపున పరమకర్కశుడగు ప్రలంబుడను రాక్షసుడు గోపాలబాలక వేషమున వచ్చెను.

**జానన్న ప్యవిజాన న్నివ తేన సమం నిబద్ధసౌహార్దః,**
**వటనికటే పటుపశుప వ్యాబద్ధం ద్వంద్వయుద్ధ మారబ్ధాః. 4**

**తెలిసియుఁ దెలియని యట్టుల**
**చెలిమిం గొని వానితోడఁ జెలు లందరితో**
**నల మఱ్ఱి నీడఁ గ్రీడన**
**ములఁ జొచ్చితి ద్వంద్వయుద్ధములఁ దలపడుచున్.**

వాని నెఱిగియు నెఱుగనట్లు స్నేహము నటించి యామఱ్ఱిచెట్టు సమీపమున శ్రీదాముడు మొదలైన నీతోడి గోపబాలురతో ద్వంద్వయుద్ధ మారంభించితివి.

**గోపాన్ విభజ్య తన్వన్ సంఘం బలభద్రకం భవత్కమపి,**
**త్వద్బలభీరుం దైత్యం త్వద్బలగతమన్వమన్యథా భగవన్. 5**

**బలరాముని దొక్కటి నీ**
**బల మొకటిగ గోపకుల విభాగించి భవ**
**ద్బల భీరువు రక్కసు నీ**
**వలనున నుండుటకు నిష్టపడితివి కృష్ణా!**

ఆ గోపకులను నీ పక్షము బలరాముపక్షము అని రెండుగా విభజించి నీ బలమునకు జడిసి నీపక్షమందే చేరుటకు ఇష్టపడిన ప్రలంబుని నీవైపున నుండుట కంగీకరించితివి.

వి.వి: నేను ఓడిపోయినట్లు మాయచేసి నటించి ఓడినవాడు ఓడని వానిని మోయవలసియున్నదను నియమమునకు కట్టువడి బలరామునిపక్షమున జేరి ఒకవేళ ఓడి కృష్ణుని మోయవలసి వచ్చిన యెడల తృణావర్తుని వలె వాని చేతిలో చనిపోవుదునేమో అను భయముచే ప్రలంబుడు నీపక్షమున జేరెను అని భావము.

**కల్పిత విజేతృ వహనే సమరే పరయూథగం స్వదయితతరమ్,**
**శ్రీదామాన మధత్థాః పరాజితో భక్తదాసతాం ప్రథయన్. 6**

గెలుపరి నెత్తికొనిచనన్
వలసిన పందెమున నాప్తవరు శ్రీదామున్
దల మోచినావు నా దా
సులకున్ నే దాసుఁడ నటంచుఁ జాట ముకుందా!

జయించినవాని నెత్తుకొని వెళ్ళవలయు నను నియమము ననుసరించి నీ వోడిపోయి బలరాము పక్షములో నున్న నీ ప్రియమిత్రుని శ్రీదాముని, నేను నా దాసులకుం దాసుడ నన్న విషయమును ప్రకటించుచు నెత్తుకొని మోసితివి.

ఏవం బహుషు విభూమన్ బాలేషు వహత్సు వాహ్యమానేషు,
రామవిజితః ప్రలంబో జహార తం దూరతో భవద్భీత్యా. 7

మోయుచు మోయంబడు చిటు
లై యందరు నడువ, నోడి యా రాక్షసుఁడున్
మోయుచుఁ జనె బలభద్రు న
పాయము నీవలన నెంచి బహుదూరముగన్.

ఈ యాటలో నియమము ననుసరించి గోపాలురనొకరి నొక రెత్తికొనుట, యెత్తికొనబడుట పలుపర్యాయములు జరిగినతర్వాత ప్రలంబుడు బలరామున కోడిపోయి యతని నెత్తికొని నీకు జడిసి దింపవలసిన స్థానము వఱకు మెల్లగా నడచి యామీద వేగముగా గొనిపోయెను.

త్వ ద్దూరం గమయంతం తం దృష్ట్వా హలిని విహిత గరిమ భరే,
దైత్యః స్వరూపమాగా ద్యద్రూపాత్ సహి బలో౽పి చకితో౽భూత్. 8

దూరము గొనిపోఁబోవ న
పార భరమ్మగుచుఁదోచె బలరాముఁడు స్వా
కారముఁగొనె రాక్షసుఁ; డా
క్రూరాకృతి కతఁడు వెఱపు గొనె బలుఁడయ్యున్

నీ దగ్గఱనుండి దూరము గొనిపోవుట జూచి బలరాముడు బరువుకాగా నతనిని మోయలేక ప్రలంబాసురుడు తన సహజరూపమును ధరించెను. ఆ

రూపము చూచి తాను బలుడయ్యు (ఆదిశేషుని అవతారమయ్యు మనుష్య భావముచే) నించుక జడిసెను.

**ఉచ్చతయా దైత్యతనో స్త్వన్ముఖ మాలోక్య దూరతో రామః,**
**విగతభయో దృఢముష్ట్యా భృశదుష్టం సపది పిష్టవా నేనమ్. 9**

**పొడవడరు వాని యొడలిన్**
**బొడుచుచు బలరామమూర్తి పొలుపగు నీమో**
**మెడనెడఁ గనుచున్ జడియక**
**సుడియన్ దృఢముష్టి దుష్ట చూర్ణము సేసెన్.**

ఆ రాక్షసుడు మిక్కిలి పొడవరియై యుండుటవలన వాని మూపుపైనున్న బలరాముడు దూరమున నున్న నీముఖమును జూచుచు మిక్కిలి దుష్టుడైన యా రాక్షసుని పిడికిలిపోటు పొడిచి నుగ్గుచేసెను.

**హత్వా దానవవీరం ప్రాప్తం బల మాలిలింగిథ ప్రేమ్ణా,**
**తావ న్మిలతో ర్యువయో శ్శిరసి కృతా పుష్పవృష్టి రమరగణైః. 10**

**ఖలు ప్రబలుఁ జంపివచ్చిన**
**బలు సుబలుం గౌగిలించి వలపొల్కితి వ**
**వ్వల మీ యిద్దరి పైపై**
**నొలికించిరి పూలజల్లు లొకటై వేల్పుల్.**

దానవ వీరుని గూల్చివచ్చిన బలరాముని ప్రీతితో నీవు కౌగలించుకొంటివి. ఆవిధముగ మీరు కలిసికొనుట జూచి సకల నిష్కల బ్రహ్మైక్యము ప్రకృతి లయమగుట అనగా, ఈ యిద్దరి సమ్మేళనమే యని యానందభరితులై యమరబృందము మీపై పుష్పవృష్టి గురిపించినది.

**ఆలంబో భువనానాం ప్రాలంబం నిధన మేవ మారచయన్,**
**కాలం విహాయ సద్యో లోలంబరుచే హరే హర క్లేశాన్. 11**

**ప్రాలంబుఁగూల్చి యిటు భువ**
**నాలంబనమైన సామి వవిలంబముగన్**

**రోలంబచికుర! పవనపు-**
**రాలంబ! రుజల్ హరింపరా నిను గొలుతుఁ**

సర్వ భువనములకు నాలంబమైన నీవు ప్రలంబవధ నిట్లు నిర్వహించి జగన్మంగళ మొనరించితివి. తుమ్మెద చాయకురుల సొగసుగులుకు నో శ్రీహరీ! విలంబము గాకుండ నా క్లేశములను హరింపుము.

## 58వ దశకము

# దవాగ్ని మోక్షణాదికము

**త్వయి విహరణ లోలే బాలజాలైః ప్రలంబ**
**ప్రమథన సవిలంబే ధేనవ స్స్వైరచారాః,**
**తృణ కుతుక నివిష్టా దూరదూరం చరంత్యః**
**కిమపి విపిన మైషీకాఖ్య మీషాం బభూవుః.** 1

**బాలురతో విహార పరిపాటిఁ జరించి ప్రలంబుఁ జంపు నా**
**లీలల నీవు నుండ, నవలీలగ నావులు దాటిపోయి వా**
**హ్యాళికిఁ జొచ్చి కోమల తృణాంకుర శీలన ఖాదనైక సం**
**రిగిశీలము లొచు దవ్వరిగి చేరె నిషీకవనాంత సీమకున్.**

గోపాలురతో విహరించుచు ప్రలంబాసురుని సంహరించు పనిలో నీవుండగా గోవులు స్వేచ్ఛగా దూరదూరము పోయి చక్కని చెంగలి బీడులో మేయవలెనని ఇషీకవనమునం బ్రవేశించెను. ఇషీకము అనగా ముంజగడ్డి.

**అనధిగత నిదాఘ క్రౌర్య బృందావనాంతాత్**
**బహి రిద ముపయాతాః కాననం ధేనవ స్తాః,**
**తవ విరహవిషణ్ణా ఊష్మలగ్రీష్మతాప**
**ప్రసరవిసరదంభ స్యాకులాః స్తంభ మాపుః.** 2

**గోవులు గ్రీష్మబాధ యొక కొంచెము తోపని చారుపుణ్య బృం**
**దావని దాటి ముంజవనమం దటు సొచ్చి నిదాఘ తాపమున్**

దావక దుర్వియోగ పరితాపముఁగూడి తపింపఁజేయ బి
ట్టావిరియుం బొగల్ మలయు నయ్యెడ చేష్టలు దక్కె దప్పికన్

ఆవులు గ్రీష్మబాధ కొంచెమేని కానరాని బృందావనము విడిచి ముంజవనముం జొచ్చి యెండ ఉడుకు నీ యెడబాటు వలని ఉడుకును గలిసి బాధింపగా వేడియావిరి పొగలుజిమ్మ నా అంభసి=నీళ్ళలో కదలలేవయ్యెను. ఊష్మల=వేడిచిమ్ము గ్రీష్మతాప=గ్రీష్మబాధవలన, ప్రసరత్=క్రమ్ముకొను, అంభస్యా=దప్పికచే, ఆకులాః=వ్యాకులమై, స్తంభమాపుః =నిశ్చేష్టతను పొందినవి. అనియు చెప్పవచ్చును.

తదను సహ సహాయై ర్దూర మన్విష్య శౌరే
గలితసరణి ముంజారణ్యె సంజాతఖేదమ్,
పశుకుల మభివీక్ష్య క్షిప్ర మానేతు మారా
త్త్వయి గతవతి హీహీ సర్వతో ఽగ్ని ర్జజృంభే. 3

అప్పుడు నీవు తోడి సఖు లారసి దూరముపోయి దారికిం
దప్పి యిషీకనామకవనమ్మున మందలు చిక్కికొన్న య
మ్ముప్పు గ్రహింపఁ దెత్తునని ముందుగ నీ వటుపోయినంతనే
గప్పున రేగి నల్దెసలఁ గ్రమ్మె దవాగ్నిశిఖాకలాపముల్.

నీవును నీ జతగాండ్రును ఆ ముప్పు తెలిసికొని ఎట్లనుకొనుచుండగా పశువుల నేను మరలించికొని వత్తునని నీవేగినంతట నలుమూలల దావాగ్ని (కార్చిచ్చు) మంటలు అలముకొనెను.

సకలహరితి దీప్తే ఘోరభాంకార భీమే
శిఖిని విహతమార్గా అర్ధదగ్ధా ఇవార్తాః,
అహహ భువనబంధో పాహి పాహీతి సర్వే
శరణ ముపగతా స్త్వాం తాపహర్తార మేకమ్. 4

హాహాకారము పుట్టి నల్దెసల దావాగ్నిచ్ఛటా జిహ్వికా
స్వాహాకారమునన్ సగమ్ము హుత మట్లై, దీనదీనమ్ముగన్

**"పాహి శ్రీహరి పాహి పాహి త్రిజగద్బంధో" యటం చాప్త బా**
**ధాహర్తన్ శరణంది రచ్చట నినున్ ద్వద్భక్త గోపార్భకుల్.**

నీ భక్తులైన గోపబాలురు నల్దెసల గ్రమ్మి దావాగ్నినాల్కలు సాపగా సగము చచ్చినట్లై భువనబంధువా! హరీ!రక్షింపు రక్షింపుమని సకల తాపహారియైన నిన్ను శరణందిరి.

**అలమల మతిభీత్యా సర్వతో మీలయధ్వమ్**
**దృశమితి తవవాచా మీలితాక్షేషు తేషు,**
**క్వను దవదహనోఽసౌ కుత్ర ముంజాటవీ సా**
**సపది వవృతిరే తే హంత భాండీర దేశే. 5**

**మీరు భయంపడన్ వలదు మీ కభయ మ్మిదె కండ్లుమూసికొం**
**డీ రహి నన్న నీపలు కటే యొనరించిరి; యింక నేది యా**
**ఘోర దవాగ్ని! యెక్కడిది కొండొక ముంజవనమ్ము? తొంటిబాం**
**డీరము తోఁచె, నచ్చట నటించిరి యెప్పటివోలె నందఋన్.**

ఉండుడుండుడు భయపడకుడు కనులు మూసికొనుడని నీ వన్నంతలో వారట్లు చేసిరి. ఇంక దావాగ్ని యెక్కడది ముంజవనమెక్కడ? అందరు మునుపటి బాండీర వనముం దెప్పటియట్లు చేరియుండిరి. యోగీశ్వరేశ్వరుండైన నీవలన నటకు గొనిపోబడిరన్నమాట.

**జయజయ తవ మాయా కేయ మీశేతి తేషాం**
**నుతిభి రుదితహాసో బద్ధ నానా విలాసః,**
**పునరపి విపినాంతే ప్రాచరః పాటలాది**
**ప్రసవనికర మాత్ర గ్రాహ్య ఘర్మానుభావే. 6**

**జయమౌఁగాత జయమ్ము నీకగుత కృష్ణా! యేమి నీమాయవి**
**స్మయద మ్మంచు నుతించువారలను సంభావించి లేనవ్వులన్,**
**రయమొప్పన్ నవపాటలాది సుమమాత్ర గ్రాహ్యనైదాఘ ని**
**శ్చయమౌ నవ్వని సంచరించితి వుదంచ ద్భాల కేళీరతిన్.**

కృష్ణా! జయము జయము. నీమాయ వింతయైనది అని వారు గొనియాడి నిను గౌరవింపగా నల్లన నవ్వుచు (నీ యోగమాయ వారి కర్థముగాకుండ

చేయుటకు) పాటలములు మల్లెలు మొదలగు పూవులనుబట్టి మాత్రమే యిది గ్రీష్మఋతువని గుర్తింప వీలయిన యా బృందావనమందు పిల్లాటలాడుచు జరించితివి.

**త్వయి విముఖ మివోచ్చై స్తాపభారం వహంతం**
**తవ భజవదంతః పంక ముచ్ఛోషయంతమ్,**
**తవ భుజవ దుదుంచ ద్భూరితేజః ప్రవాహం**
**తపసమయ మనైషీ ర్యామునేషు స్థలేషు. 7**

**నీదగు సేవవోలె నవనింగల పఙ్కము లింకఁ జేయుచున్**
**నీదుభుజమ్ము నట్లుగ ననిందిత తేజము జాలుకొల్పుచున్**
**నీదయ లేనివానివలె నిస్తుల తాపభరమ్ముఁ బూను గ్రీ**
**ష్మోదయముం గ్రమించితి వహో యమునాతటినీ తటమ్మునన్**

నీ సేవ యెట్లు పంకములు=పాపములను ఇంకించునో అట్లు పంకములను=బురదలను (శ్లేష) ఇంకించి నీ భుజమువలె అనిందిత తేజము=ప్రసస్తమైన ప్రతాపమును-శ్లేష-ప్రశస్తమైన సూర్యకాంతిని జిమ్ముచు, నీదయకు పాత్రులుకానివలె సాటిలేని తాపభరము=ఆధిదైవికాది తాపములను, (శ్లేష) ఉక్కను వహించిన గ్రీష్మఋతువును యమునానది యొడ్డున గడపితివి.

**తదను జలదజాలై స్త్వద్వపు స్తుల్యభాభి**
**ర్వికస దమలవిద్యు త్పీతవాసోవిలాసైః,**
**సకల భువన భాజాం హర్షదాం వర్షవేలాం**
**క్షితిధర కుహరేషు స్వైరవాసీ వ్యనైషీః. 8**

**నీ మేనిన్ జిగిమించు మబ్బుగమితో నీ స్వర్ణపీతాంబర**
**శ్రీమించం గల మించు మేలి సిరితోఁ జెల్వొందు వర్షాగమ**
**మ్మామీఁదన్ భువనైక హర్షదము దానైరాగ గోవర్ధనో**
**ద్దామాద్రీంద్ర గుహన్ గ్రమించితివి తద్వర్షార్తవాహర్నిశల్.**

అంతట నీశరీరకాంతి తులకించు కారుమబ్బులతో నీ బంగారు పీతాంబరము శోభను మించు క్రొమ్మించులయొక్క (మెఱుపుల యొక్క) సొంపుతో వర్షఋతువు భువనములకు హర్షప్రదమై రాగా నీవా ఋతువును గోవర్ధన పర్వతగుహలో వెళ్ళించితివి.

కుహర తల నివిష్టం త్వాం గరిష్ఠం గిరీంద్ర
శ్శిఖికుల నవకేకా కాకుభిః స్తోత్రకారీ,
స్ఫుట కుటజ కదంబ స్తోమపుష్పాంజలిం చ
ప్రవిదధ దనుభేజే దేవ గోవర్ధనోఽసౌ. 9

గుహలో నున్న నినుఁ మహామహు నటన్ గోవర్ధనస్వామి య
న్వహ మర్పించెను మొల్లలున్ గడిమిపూల్ వాసించు పుష్పాంజలిన్
రహిఁ గీర్తించె నతండు స్వాంతర వనాంతః కేకి కేకారవ
స్పృహణీయమ్మగు మేఘరంజనముగా విన్పించి షడ్జశ్రుతుల్.

తన గుహ నలంకరించియున్న నిన్ను మహానుభావు నీశ్వరుని గోవర్ధనగిరి స్వామి మొల్లలు వికసించిన కడిమిపూలతో నీకు పుష్పాంజలి సమర్పించి, వర్షఋతు చిహ్నముగ పురివిచ్చియాడు నెమళ్ళ కూతలనెడి భక్తిభరిత చాటూక్తులచేత (చాటువులు=అందమైన మాటలు) స్తుతించి, ఉపాసించెను. తెలుగు అనువాదములో నెమలికూత షడ్జస్వరముగావున `స' పలుకునుగావున అది శ్రుతిగా మేళవించి మేఘరంజనమగునట్లు మేఘరంజన మనురాగములో నిన్ను కీర్తించుచు సంగీతములు పాడెనను విశేషము చేర్చబడెను.

అథ శరద ముపేతాం తాం భవద్భక్త చేతో
విమల సలిల పూరాం మానయన్ కాననేషు,
తృణ మమల వనాంతే చారు సంచారయన్ గాః
పవనపురపతే త్వం దేహి మే దేహసౌఖ్యమ్. 10

అవలన్ శ్రీ శరదాగమమ్ము భవదీయాప్తాంతరంగమ్ము పో
లె విశుద్ధమ్మగు నంబుపూరముల హాళిన్ గొల్ప, లాలించుచున్
నవముల్ కోమలముల్ తృణమ్ము లట నానందమ్ముగా మేపుచున్
బవనాధీశ్వర! మందగాచి తటు నన్ గాపాడ రారా హరీ!

ఆమీద శరదృతువు నీ భక్తుల అంతరంగము (మనస్సు) వలె స్వచ్ఛమైన జలప్రవాహములచే నందముగూర్ప, లేబచ్చికల మేపుచు ఆలమందలను నచట గాచినావు. అట్లు ఓ గురుపవన పురాధిపా! నన్నును దేహసౌఖ్యమిచ్చి గావుము, విదేహకైవల్యము నిమ్మనియు భావము.

# 59వ దశకము

# వేణుగానము

**త్వద్వపు ర్న వకలాయ కోమలం ప్రేమదోహన మశేషమోహనమ్,**
**బ్రహ్మతత్త్వ పరిచిన్ముదాత్మకం వీక్ష్య సంముముహు రన్వహం స్త్రియః. 1**

**నవతాపింఛ సుమైక కోమల మనంతప్రేమ సందోహన**
**మ్మవురా! విశ్వవిమోహన మ్మయిన బ్రహ్మాకార సచ్చిత్సుఖ**
**స్తవనీయమ్మగు నీదుమూర్తి గని కాంతల్ మన్మథాక్రాంతలై**
**వివశత్వమ్మునఁ జెంది చొక్కిరట గోపీమానచోరా! హరీ!**

గోపమానినీమానచోరా! ఓ హరీ! అప్పుడే విరిసిన యిరుగుడుపూవువంటి తళుకుతో మిగుల కోమలమై అంతులేని ప్రేమను నించు నీముచ్చటైనయందము సూచి గోపికలు మన్మథవశలైరి.

**మన్మథోన్మథిత మానసాః క్రమాత్త్వద్విలోకనరతా స్తత స్తతః**
**గోపికాస్తవ న సేహిరే హరే కాననోపగతిమ ప్యహర్ముఖే. 2**

**మఱిమఱి మన్మథోన్మథిత మానసలై వ్రజసుందరీ జన**
**మ్మఱిమఱి నిన్నె చూడవలె నన్న తలంపులు నంతకంతకున్**
**గుఱికొన, నీవు ప్రొద్దునన గోవుల గావ నరణ్య సీమలన్**
**దఱియుట కోర్వలేక పరితాపము చెందుచునుండి రిండ్లలోన్.**

గోపికలు మరునిబారిబడి మనసులు చెదరి నిన్నె చూడవలెనను ముచ్చట గొని నీవడవికి ఆలమందలం గాచుటకు వెళ్ళుటకుగూడ ఓర్వలేక ఇండ్లలో కొందలవడజొచ్చిరి.

**నిర్గతే భవతి దత్తదృష్టయ స్త్వద్గతేన మనసా మృగేక్షణాః**
**వేణునాద ముపకర్ణ్య దూరతస్త్వద్విలాసకథ యాభిరేమిరే. 3**

**నీ వెంటన్ గను లప్పగించి హరిణీనేత్రల్ మనోదృష్టి బృం**
**దా వీథిన్ జను నీదురూపు గనుచున్ ద్వద్వేణు గానామృత**

శ్రీ విందు ల్గొని దవ్వుదవ్వులనె నీ చిత్రాతిచిత్ర ప్రసం
గావిర్భూత వినోదలై మురిసి రయ్యె ముచ్చటల్ గుల్కుచున్.

నీవు బృందావనమున కేగినపుడు నీపైనే చూపులుపెట్టికొని నీపై మనసుపడినందున దూరమందుండియు నీ వేణునాదము నాలించి నీ లీలలు కథలుగా జెప్పికొంచు మురిసి ముచ్చట పడుచుండిరి.

కాననాంత మితవాన్ భవానపి స్నిగ్ధపాదప తలే మనోరమే,
వ్యత్యయాకలిత పాద మాస్థితః ప్రత్యపూరయతవేణునాలికామ్. 4

కానన సీమకుం జని యొకానొక చల్లని చెట్టునీడ నెం
తేని మనోహర మ్మయిన యిమ్మున వ్యత్యయ పాదముద్రపైఁ
బూనిక నిల్చి వేణువును బూరణముం బొనరించినాఁడ వ
ద్దానఁ జరాచర ప్రకృతి తన్మయమై విలసించెఁ జిత్కళన్

ఒక చెట్టునీడ వ్యత్యస్తపాదముపై (కుడిపాదము ఎడమపాదముపైని ఆనించి) ఒయ్యారముగ నిలిచి పిల్లనగ్రోవి పూరించితివి. ఆ నాదమునకు ఒక్క జంగమప్రకృతియే కాదు (అంతర్వివిధములు) స్థావరములైన చెట్లు చేమలుకూడ ఆనందభరితములై చిగిరించినవి

మారబాణ ధుత ఖేచరీకులం నిర్వికార పశుపక్షి మండలమ్,
ద్రావణం చ దృషదా మపి ప్రభో తావకం వ్యజని వేణుకూజితమ్. 5

అసమశర ప్రహార వశమయ్యె నశేష నిలింపభామినీ
విసరము, నిర్వి చేష్టపదవిన్ నిలిచెన్ బశు పక్షిసంఘముల్
వెస శిలలున్ గఱంగి యటు వెల్లువగట్టెఁ బ్రభూ! భవత్కృపా
రస భరిత మ్మఖండ మధురమ్మగు తన్మురళీరవశ్రుతిన్.

నీ మురళీనాదమాలించిన దేవతాంగనలు చెఱకువిలుకాని పూవుటమ్ములకు గురియైరి. పశుపక్షులు గూడ నిశ్చేష్టములై నిలిచెను. రాళ్లు కరిగినవి. అది వేణునాదమాత్రము గాదు. అందు సర్వాత్మకుడవైన నీ కృపారస మాధుర్యము కూడ చేరిన కతన యదిగ్రోలి జడాజడ ప్రకృతియెల్ల మైమరచిపోయెనని భావము.

**వేణురంధ్ర తరలాంగులీదలం తాళ సంచలిత పాదపల్లవమ్,**
**తత్స్థితం తవ పరోక్ష మప్యహో సంవిచింత్య ముముహుర్వ్రజాంగనాః. 6**

కలకల వేణురంధ్రముల (గమ్మి చలించెడు నంగులీదళ
మ్ములు లయతాళ సంగతుల ముద్దులు గుల్కెడు పాదపల్లవ
మ్ములు గల నీయొయారమును ముద్దియలందఱు నిండ్ల నుండియే
తలఁచి తలంచి మోహమునఁ దత్తరముం గనసాగి రయ్యెడన్

వేణురంధ్రము లారింటిపై నీ వ్రేళులు మూసి తెఱచుచు సప్తస్వరా రోహణావరోహణములు గావించుచు నా యా రాగరంజనమొనర్చి రసస్థానములను సంగతులు-కులికించుచు నడుమనడుమ లయానుకూలతాళమేళన మొనరించు మృదులపాదములతో ముద్దులుగులుకు నీ యొయ్యారమును ముగ్ధలైనకతన నిలువెడలి వచ్చుటకు చొఱవసేయలేని ముద్దియలు తమతమ యిండ్లయందే భావించి భావించి భరింపరాని మోహమున తత్తరపాటు చెందుచుండిరి.

**నిర్విశంక భవదంగదర్శినీః ఖేచరీః ఖగమృగాన్ పశూనపి**
**త్వత్పద ప్రణయి కాననం చ తాః ధన్యధన్యమితి నన్వమానయన్. 7**

సందియ మింతలేక దివిషద్రమణుల్ భవదీయ దివ్య మూ
ర్తిం దరిసించి నీ చరణరేఖలు దాకిన యవ్వనాంత మం
దెందును నీదువెంటఁ జరియించు మృగమ్ములు పక్షులెల్ల గో
బృందము ధన్య ధన్యము గదేయని ముచ్చటగుల్కి రాత్మలన్.

దేవభామినులు తామెవ్వరికిని గనబడనివారుగావున సిగ్గు గొంకులేక నీ దివ్యరూప వైభవముల జూచి, నీ యడుగుజాడ ముద్రలువడిన యా బృందావనమందు నీ వెటువోయిన నటువచ్చుచు నీ యందమును జూరలాడుచున్న యా మృగమ్ములు పక్షులు యావుల మందలు నాహా! యెంత ధన్యధన్యములో కదా! యని తమలో దాము ముచ్చటించుకొని ముచ్చటవడజొచ్చిరి.

**అపిబేయ మధరామృతం కదా వేణుభుక్తరసశేష మేకదా,**
**దూరతో బత కృతం దురాశయే త్యాకులా ముహు రిమాః సమాముహన్. 8**

**చెలువగు వేణుభుక్త రసశేషము నీ మధురాధరామృత**
**మ్మెలయగఁగ్రోలు ముచ్చటది యెప్పు డొకప్పుడు నేని తీరునో**
**యలవికిఁగాని వట్టి యడియాసలఁ జిక్కితి మంచు సంభ్రమా**
**కులమతులైరి గోపికలు కొంచెముగాని మనోజవేదనన్.**

ఈ పిల్లగ్రోవి కడుపునిండ ద్రావగా మగిలిన నీ మధురమైన అధరామృతము తనివితీర జుబ్బనచూఱగా ద్రావెడి భాగ్యమది యెప్పుడుపట్టునా, ఆ కోరిక తీరునా? అని అంతలో ఇదివట్టియడియాస-ఇందులో జిక్కితిమని గుట్టువిడిచి గోపికలు ఉత్కటమైన మన్మథవేదనవలన కలతవడిరి.

**ప్రత్యహంచ పునరిత్థ మంగనా శ్చిత్తయోనిజనితా దనుగ్రహాత్,**
**బద్ధరాగవివశా స్త్వయి ప్రభో నిత్యమాపు రిహ కృత్యమూఢతామ్** 9

**ఈవిధి నించువిల్తుఁడెనయించు ననుగ్రహదృష్టి చేత నీ**
**పై వలపుల్ చిగిర్చి మురిపమ్ము లెలర్పగ రోజు రోజు మో**
**హావిలచిత్తలై వ్రజ కులాంగనలందరు నింట నిత్య కృ**
**త్యావళి నిర్వహించుటదియైన నెఱుంగకపోయి రయ్యెడన్.**

చెఱకువింటివాడు (మన్మథుడు) ఈ విధముగా తమయెడ ననుగ్రహము చూపుటచే దినదినము వలపు చిగిరింప కోరిక లీరికలెత్త నీపై మోహవశమయిన చిత్తములతో గోపికలు మతులులేక ఇంటిపనులు చక్కబెట్టుటయు నెఱుంగక యొల్లబోయి కలవరము చెందుచుండిరి.

వి.వి: శృంగారరసరూపమైన ప్రేమలక్షణమయిన భక్తిభూమికలో నున్నారుకావున నిది మన్మథుడు చేసిన యనుగ్రహమేకాని వారియెడల నతడు చేసిన నిగ్రహము (బాధ) గాదని కవిహృదయము.

**రాగ స్తావ జ్జాయతే హి స్వభావా న్మోక్షోపాయో యత్నతః స్యా న్నవాస్యాత్**
**తాసాం త్వేకం తద్ద్వయం లబ్ధ మాసీ ద్భాగ్యంభాగ్యం పాహి మాం మారుతేశ.**

**అనురాగమ్ము స్వభావసిద్ధము; ప్రయత్నాధీనమై ముక్తి వ**
**చ్చును రాకుండనువచ్చు; గోపికల కిచ్చో రాగమోక్షమ్ములై**

**క్య నిరూఢిన్ లభియించె నీదుదరి; భాగ్యమ్మన్న భాగ్యమ్మిదే**
**యనిలాగార విహార! యాదవకిశోరా! నన్ను బాలింపరా!**

ఒండొరులపైని ప్రేమరూపమైన అనురాగము అనునది స్త్రీలకుగాని పురుషులకుగాని స్వభావసిద్ధము. దానికి ప్రయత్న మవసరములేదు. ముక్తియన్ననో యత్నసాధ్యము. (ఈశ్వరునియందు ప్రేమరూపమైన భక్తి మోక్షోపాయము. అది నూటికికోటి కెవ్వరికో యత్నసాధ్యమై సిద్ధింపనువచ్చు సిద్ధింపకపోనువచ్చు. ప్రకృతము ఇటు కామసుఖము గూర్చు కాంతునిపై ప్రేమయు మోక్షసుఖమునిచ్చు నీశ్వరునిపై ప్రేమయు ఒక్క కృష్ణుడే కాంతుడు ఈశ్వరుడుగూడయైనందువలన ఒక్కచోటనే రాగము మోక్షమును ఏకరూపమున గోపికలకిక్కడ లభ్యమైనవి- ఓహో! గోపికల భాగ్య మేమనవలయును? ఇట్లు గోపికా మనోవల్లభుడైన ఓ గోపాల! మారుతాగారశృంగారమా! నన్ను గారవింపుము-రక్షింపుము.

# 60వ దశకము

# గోపికా వస్త్రాపహరణము

**మదనాతురచేతసో ఽన్వహం భవదంఘ్రిద్వయ దాస్యకామ్యయా,**
**యమునాతటసీమ్ని సైకతీం తరళాక్ష్యో గిరిజాం సమార్చిచన్.** 1

**హా యని కన్య లెల్ల కుసుమాయుధు నోర్వక నీ పదాబ్జ దా**
**స్యాయతి కోరికోరి సికతాకృతి నా యమునా తటానఁగా**
**త్యాయని నిల్పి కొల్చి తరళాక్షులు వేకువజాములన్ వ్రతా**
**ధ్యాయమునం ద దేకమతులైరి భవద్గతులై చరించుచుః.**

గోపకన్యలు మన్మథవ్యధను సైపలేక నీ పాదదాస్యమును కోరి నీవేగతియని మనసు నీపైజేర్చి యమునాతీరమందు వేకువవేళ కాత్యాయనీ వ్రతమనుపేర గౌరీపూజ లారంభించిరి.

**తవనామకథారతా స్సమం సుదృశః ప్రాత రుపాగతా నదీమ్,**
**ఉపహారశతై రపూజయన్ దయితో నందసుతో భవేదితి.** 2

*** చంచలనేత్ర లన్నదికిఁ జాగి యుషఃప్రభ వెంబడించి రా**
**నించెడి నీ యశః కథ లనేకము గానము సేసికొంచు న**
**భ్యంచిత భక్తి గౌరి కుపహారశతమ్ముల నారగింపు కా**
**వించిరి; నందనందను వరించి నుతించిరి సర్వమంగళన్.**

అందరు కలిసి నీ పేరులను నీ కథలను గూర్చిన పాటలు పాడుకొనుచు ఉషఃకాంతులు తమ్ము వెంబడింప యమునకేగి నందకుమారుడు మా మనోహరుడు గావలెనని యెంచి గంధ పుష్ప ధూప దీప నైవేద్యాదులచే గౌరీపూజ గావించిరి.

**ఇతి మాస ముపాహితవ్రతా స్తరళాక్షీ రభివీక్ష్య తా భవాన్,**
**కరుణామృదులో నదీతటం సమయాసీ త్తదనుగ్రహేచ్ఛయా. 3**

**ఈవిధి నొక్కమాస మొనరించిన నోము ఫలమ్ము నీవయై**
**శ్రీవర! యామునాంత తట సీమల నచ్చపలాక్షులన్ గృపా**
**ప్లావిత దృష్టినేలెడు తలంపున వచ్చితి వంతలోన నీ**
**భావము భక్తభావరస భావితమై యనుధావమై హరీ!**

ఇట్లు మాసవ్రతముపూని యొనరించిన వారి నోమునకు నీవు ఫలముగా వారిని కృపాకటాక్షములు నించి యనుగ్రహింపనెంచి భక్తవరాధీనమైన భావముతో నచ్చటి కేగితివి.

**నియమావసితౌ నిజాంబరం తటసీమ న్యవముచ్య తా స్తదా,**
**యమునాజల ఖేలనాకులాః పురతస్త్వా మవలోక్య లజ్జితాః 4**

**త్రపయా నమితాననా స్వథో వనితా స్వంబరజాల మంతికే,**
**నిహితం పరిగృహ్య భూరుహో విటపం త్వం తరసాధిరూఢవాన్. 5**

---

* చారువిలోకనల్ నదికిఁ జాగి యుషఃప్రభ వెంబడింప శృం
గారము లొల్కు నీ కతలు గానము సేయుచు గౌరిఁ గొల్చి యొ
య్యారము భక్తిఁ గొల్పి యుపహార శతమ్ములు నిచ్చి యంబికన్
కోరిరి నందసూనుఁ దమకుం బతిసేయు మటంచు పొందికన్.

కన్నియ లా వ్రతమ్ము తుదఁ గట్టిన చీరలు విప్పి గట్టునన్
గ్రన్ననఁ బ్రోపువెట్టి యమునాజల ఖేలన మాచరించుచున్
మున్నిను గాంచి సిగ్గువడి మోములు వంచినవేళ చీర లీ
వన్ని హరించి పొన్నతరు వక్కొనకొమ్మకు నెక్కి చయ్యనన్

ఆ కన్యలు వ్రతోద్యాపనమునాడు తమచీరలు గట్టుమీద బ్రోవువెట్టి యమునలో దిగి ఒండొరులపై నీళ్లుచల్లుకొనుచు, నీరు చరచి చప్పుడులు సేయుట మొదలగు నాటల సందడి గొని, యెదుటనున్న నిన్ను గని సిగ్గువడి ముఖములు వంచికొనగా నీ వా చీరలుగొని దాపుననున్న పొన్న చెట్టుపై కెక్కితివి.

ఇహ తావదు పేత్య నీయతాం వసనం వః సుదృశో యథాయథమ్,
ఇతి నర్మమృదుస్మితే త్వయి బ్రువతి వ్యాముముహే వధూజనైః. 6

ఇచ్చటి కీరు వచ్చి కొనుఁ; డెవ్వరి దెయ్యోయి చీర యెంచికొం
డిచ్చెదఁ జారులోచన లివే యనుచున్ దరహాస వైభవ
మ్మచ్చు వడంగ నీవు పరిహాసము సేయగ, గన్య లెల్ల నీ
మెచ్చుల నిచ్చకంపు మెరమెచ్చుల మోహము సెంది రచ్యుతా!

బాలికలు! మీరిక్కడకువచ్చి ఎవరి దేచీరయో యెంచికొని కొనిపొండని అల్లన నవ్వుచు నీవు గేలిసేయగా నాకన్యలందఱు నీ ముచ్చటగుల్కు మాటలకు, నీమెరమెచ్చుగుల్కు పరిహాసములకు మోహపడిపోయిరి. మాఱుపల్కుటకు గూడ చేతకానివారైరి.

అయి జీవ చిరం కిశోర నస్తవ దాసీ రవశీకరోషి కిమ్,
ప్రదిశాంబర ముంబుజేక్షణే త్యుదితస్త్వం స్మితమేవ దత్తవాన్. 7

ఓయి! చిరాయువై మనగదోయి! కిశోర! త్వదీయ దాసులన్
న్యాయమె తమ్ముఁ దాము మఱపం దగ మోసముసేసి యిట్లు గాఁ
జేయుదె యంబుజాక్ష! దయసేసి వడిన్ దయసేయు చీరలో
రా! యన నిచ్చినాడవు స్మితాంశుక మెంతటి జాణవో హరీ!

చివరకు ఓయిపాపడ! చిరంజీవ! నీదాసురాండ్రను పరవశలజేయు చున్నావు. ఇట్లు మోసము సేయుట న్యాయమటయ్యా! నీకన్నులు తామరరేకులట్లు చాఱెడేసి. మాయెడ దయచేసి మా చీరలు దయసేయుము అని వారు వేడికొనగా నీ నెఱజాణతన మచ్చువడ చీరలీయలేదుగాని మొలకనవ్వుమాత్ర మనుగ్రహించితివి. తెలుగు అనువాదములో అంశుకములు (వస్త్రములు) ఈయలేదుకాని, స్మితాంశుకము-చిఱునవ్వుకిరణమును మాత్ర మిచ్చితివని మూలాధికము.

**అధిరుహ్య తటం కృతాంజలీః పరిశుద్ధాః స్వగతీ ర్నిరీక్ష్యతాః,**
**వసనా న్యఖిలా న్యనుగ్రహం పునరేవం గిరమ ప్యదా ముదా** **8**

**వారిఁ దొలంగి గట్టునకు వచ్చి కరమ్ములు దోయిలించి య**
**వ్వారిజనేత్ర లీవగతి వారికిఁ గావునఁ వల్వ లిమ్మనఁ;**
**వారు పవిత్ర లౌటగని వస్త్రములెల్ల యనుగ్రహించి శృం**
**గారరసోచితమ్ము నొక మాట యనుగ్రహ మిచ్చినా వటన్.**

ఒడ్డెక్కి చేతులు మొగిచి నమస్కరించి పరిశుద్ధలైనంత నీవ గతియైన యా ముగ్ధలకు వారివారి వలువలను ఒసంగి, ఉచితరీతిగ నొక చక్కని పలుకుగూడ వారి కనుగ్రహించితివి.

**విదితం నను వో మనీషితం వదితార స్త్విహ యోగ్య ముత్తరమ్,**
**యమునాపులినే సచంద్రికాః క్షణదా ఇత్యబలాస్త్వ మూచివాన్.** **9**

**ఉపకర్ణ్య భవన్ముఖచ్యుతం మధునిష్యందివచో మృగీదృశః,**
**ప్రణయా దయి వీక్ష్యవీక్ష్యతే వదనాబ్జం శన కైర్గృహంగతాః.** **10**

**మీవల పే నెఱుంగుదును మీ రుచితోత్తర మీవలంతు, లీ**
**తావులు యామునాంత సికతాస్థలు,లిందలి రేలు చంద్రికా**
**ప్లావములన్నఁ దేనియలు వంచెడు నీ వదనారవింద శో**
**భావధిఁ గాంచికాంచి చని రంగన లిండ్లకు మెల్లమెల్లనఁ.**

మీ వలపు (కోరిక) నాకు తెలిసినదేకదా! యమునదరి నిసుకతిన్నెలు ఇందలి రేలు వెన్నెలల పండువులు ఇవి మీకు దగిన ప్రత్యుత్తరము

కేవలము మాటలతోగాదు చేతలతో నీయగల సమర్థములు అని నర్మగర్భముగా పల్కిన తేనెలొలుకు మాటలు నీనోట నాలించి, మృగాక్షులు ప్రేమభరమున నీమోము తిరిగితిరిగి చూచుచు మెలమెల్లన నిండ్లకుం జనిరి.

**ఇతి నన్వనుగృహ్య వల్లవీ ర్విపినాంతేషు పురేవ సంచరన్,**
**కరుణాశిశిరో హరే హర త్వరయా మే సకలామయావలీమ్.** **11**

**ఈవిధిఁ గింకరీజనము నేలితి వెల్లర, వల్లవీమణి**
**శ్రీవలయాగ్ర నాయకరుచిఁ గరుణా శిశిరుండవైచు బృం**
**దావన రత్నభూషణ మనంగ మరుత్పురసౌధ వీథికా**
**ప్లావిత పావనామృత కళా! పరితాపము దీర్పరా! హరీ!**

ఇట్లు నీకు కింకరులైన వ్రజకుమారికల నందఱ ననుగ్రహించుచు నీవల్లవీ మణిహారమునకు నాయికమణివై చల్లని దయనించి, బృందావనికొత్తిన రత్నభూషణమోయన మెఱసిన ఓ గురువాయూరు పురవీథులందు అమృత ప్రవాహరూపమయిన కళలగుల్కు నో కృష్ణా! నా తాపమార్చి అమృతుని గావింపుము.

# 61వ దశకము

# మునిపత్నీ మహానుగ్రహము

**తతశ్చ బృందావనతో ఽతిదూరతో**
**వనం గత స్త్వం ఖలు గోపగోకులైః,**
**హృదంతరే భక్తతర ద్విజాంగనా**
**కదంబకానుగ్రహణాగ్రహం వహన్.** **1**

**బృందారణ్యముదాటి గోపశిశు గో బృందమ్ముతో దూరమం**
**దందందుఁ విహరించుచున్ హృదయమం దాత్మీయ భక్తప్రజా**
**సందోహమ్మగు విప్రపత్నులకు సాక్షాద్భక్తి యోగైక సి**
**ద్ధిం దర్శింపగఁ జేయు కౌతుకము నుద్దీపింప నంతంతటఁ.**

అవ్వాల గోపకులతో గోవులతో బృందావనమున కెంతో దూరమేగి యందు విహరించుచునీ భక్తిచేత రంగితాంతరంగలయి నీవారయిన అంగనల ననుగ్రహింపవలెనను నభినివేశము గొని;

**తతో నిరీక్ష్యాశరణే వనాంతరే**
**కిశోరలోకం క్షుధితం తృషాకులమ్,**
**అదూరతో యజ్ఞపరాన్ ద్విజాన్ ప్రతి**
**వ్యసర్జయో దీదివియాచనాయ తాన్.** 2

నిలువన్ నీడయుఁ గానరాని యడవిఁ దృష్ణాకులమ్మై క్షుధా
విలమై యున్న కిశోరగోపకులము న్వీక్షించి యొక్కింత దా
పుల యజ్ఞ మ్మొనరించుచున్న ద్విజులఁ బొం దన్నమర్థించి మీ
రలు వేవేగమ తెచ్చికొండని దయార్ద్ర స్వాంతుఁడై పంపగఁ.

నిలువనీడ గనరాని యవ్వనిలో దప్పివడి ఆకలిచే నకనకంబడిన గోపబాలురంగని, "ఈ దాపుననే అదిగో అక్కడ యజ్ఞము సేయుచున్న విప్రులను పోయి అన్నమడిగి తెచ్చికొండు" అని దయామతివై పంపితివి.

**గతేష్వథో తేష్వభిధాయ తేఽభిధాం**
**కుమారకే ష్వోదనయాచిషు ప్రభో,**
**శ్రుతిస్థిరా అప్యభినిన్యు రశ్రుతిం**
**న కించి దూచుశ్చ మహీసురోత్తమాః.** 3

చని నీ పేరటు సెప్పి యన్నమడుగన్ సర్వేశ! యా ఛాందసుల్
మును సర్వమ్మును గాంచి కానియటుల్ శ్రుత్యర్థ సంపన్నులై
వినియుఁ సర్వము కొంచెమే విననటుల్ విప్రోత్తముల్ కద్దు లే
దని ప్రత్యుత్తర మీయరై రదికదా యాశ్చర్య మిప్పట్టునన్.

నీ చెప్పిన జాడ నరిగి వారు నీ పేరు సెప్పి యన్నమడుగగా, ప్రభూ! బ్రాహ్మణోత్తములు శ్రుతిస్థిరాఅపి=వినుకలిశక్తియందు స్థిరులైనను మంచి శ్రవణేంద్రియశక్తి ఉన్నవారయ్యు అశ్రుతిం=వినమిని, వినిపించుకొనక పోవుటను, నిన్యుః=పొందిరి.

శ్లేష: శ్రుతిస్థిరా అపి. వేదములందు నిశ్చయజ్ఞానము గలవారయ్యు శ్లేష. మంచి వినికిడి అనగా అనేక శాస్త్ర విషయములను బాగుగా శ్రవణము సేసిన వారయ్యు, అశ్రుతిమ్=వినికిడి లేకపోవుటను పొందిరి. అనగా "అన్నస్యక్షుధితం పాత్రమ్" ఆకలిగొన్నవాడు అన్నమునకు పాత్రుడు-అక్కడ జాతి కుల విచక్షణ చేయరాదన్న మాట తెలిసియు తెలియనివారైరని భావము.

**అనాదరా త్ఛిన్నధియో హి బాలకాః**
**సమాయయు ర్వ్యక్తమిదం హి యజ్వసు,**
**చిరా దభక్తాః ఖలు తే మహీసురాః**
**కథంహి భక్తం త్వయి తై స్సమర్ప్యతే. 4**

**అట్లు లనాదరాన గురియై పసికుఱ్ఱలు చిన్నఁబోయి నీ**
**పట్టున కేగుదెంచి; రది భావ్యమ; యజ్వల యందునెల్లఁగ**
**న్పట్టు నభక్తభావ మొకనాటిదకాదు యథార్థ మిట్లు చూ**
**పట్టగ నెట్లు సేయుదురు భక్తసమర్చన నీవు కోరినన్.**

అట్లు నిరాదరింపబడిన పసిబాలురు చిన్నబోయిన మనసులతో నీవున్న మేడకు తిరిగివచ్చిరి. ఆ సోమయాజులు చేసినది న్యాయమే. వారు అభక్తులు=శక్తిలేనివారు కావున వారు భక్తిసమర్చన=నీయెడల భక్తులయినవారి పూజ. శ్లేష. అన్నసంతర్పణ ఎట్లు చేయగలరు? అని ఒక అర్థము, వారు చిరాత్=చిరకాలము, అభక్తాః=భక్తము (అన్నము) లేనివారు, అట్టివారిచే నీయెడ భక్తం=అన్నము, కథం సమర్ప్యతే=ఎట్లు సమర్పింపబడును? అనగా అనంతరము ఉపవాసము లుండువారు అన్నసంతర్పణ మెట్లుచేయుదురు? అని భావము.

**నివేదయధ్వం గృహిణీజనాయ మాం**
**దిశేయు రన్నం కరుణాకులా ఇమాః,**
**ఇతి స్మితార్ద్రం భవతేరితా గతా స్తే**
**దారకాదారజనం యయాచిరే. 5**

**నన్నెఱిఁగింపుఁ డా ద్విజ జనమ్ములపత్నుల కట్టులైన వా**
**రన్నము మీకుఁబెట్టఁగల రందఱుఁ జాలి కరంగిపోయి నా**

నన్నువ నవ్వుచే మధురమౌ భవదుక్తి గ్రహించి చిన్నిగో
పన్నలు వెండియుం జని ద్విజాంగనలన్ మఱి వేడి రన్నముల్.

అటుపై నీవు "ఆ సోమయాజుల పత్నులకు సోమిదేవమ్మలకు నాపేరు చెప్పుడు. వారు అన్నము మీకు బెట్టగలరు" అని నీవనగా నీ చిఱునగవుచే తీపిగొన్న నీమాటను వారు గ్రహించి మరల చని యా మునిపత్నులను అన్నము పెట్టుడని వేడికొనిరి.

గృహీతనామ్ని త్వయి సంభ్రమాకులా
శ్చతుర్విధం భోజ్యరసం ప్రగృహ్య తాః,
చిరం ధృతత్వత్ప్రవిలోకనాగ్రహాః
స్వకై ర్నిరుద్ధా అపి తూర్ణ మాయయుః. 6

ఇమ్మెయి నిన్ను బేర్కొనినదే తడవై త్వరసెంది సోమిదే
వమ్మలు జడ్డవన్ బహువిధాన్నములన్ గొని బంధుజాల మ
డ్డమ్ముగ వచ్చినం విడిచి డాయగ వచ్చిరి నిన్ను జాల కా
లమ్ముగం జూచువేడ్క సఫలమ్మగు టిప్పటికంచు నుబ్బుచున్.

నీ పేరు చెప్పినదే తడవుగ నయ్యిల్లాండ్రు తొట్రుపడి భోజ్య-చోష్య=పేయ లేహ్యారూపమున నలువిధములయిన వంటలను ఎత్తికొని చిరకాలము నుండి నిన్ను జూడ వేడుకవడుచున్నవారుగావున తమవారడ్డువడినను మునిభార్యలు లెక్కసేయక విదలించుకొని చయ్యన నీదరి కేతెంచిరి.

విలోల పింఛం చికురే కపోలయోః
సముల్లసత్కుండల మార్ద్ర మీక్షితే
నిధాయ బాహుం సుహృదంససీమని
స్థితం భవంతం సమలోకయంతా తాః. 7

శిరమునం దూగు పించియము, చెక్కిళులన్ మణికుండల ద్యుతి
స్ఫురణము, కన్గొలంకులను బూర్ణ దయారస పూర మొప్పగా
కరకమలమ్ము నొక్క చెలికాని భుజాగ్రమునందుం జూచి యం
దొరగి యొయారమొప్ప నిలుచుండిన నిన్ గని రంబుజేక్షణల్

శిరమున దూగు నెమలిపింఛము, చెక్కిళుల నూగు రత్నకుండలములు కన్నులదోగుతడి అనగా వాత్సల్యము కల్గి ఒక చెలికాని భుజముపై నిజహస్త పద్మమునానించి అల్లన యొయ్యారముగ నొరిగి నిలుచున్న నిన్ను తామరరేకులట్టి కనులుగలవారు దర్శించిరి.

**తదా చ కాచిత్త్వదుపాగమోద్యతా**
**గృహీతహస్తా దయితేన యజ్వనా,**
**తదైవ సంచింత్య భవంత మంజసా**
**వివేశ కైవల్య మహో కృతిన్యసౌ. 8**

నీ దరి కేగుదెంచు నొక నీరజలోచన నడ్డగించి పో
రాదని చేయి పట్టుకొని ప్రాణ విభుం డొక యజ్వ నిల్ప, ని
న్నే దరిసించి ధ్యానమున నింతి కృతార్థత నెంది కేవల
త్వోదితమైన ముక్తిపద మొందెఁ దటాలున బంధముక్తయై.

అక్కడ ఒక మునిభార్య నీదరికి వచ్చుచుండగా భర్తపట్టుకొని పోరాదని యడ్డగింపగా నిన్నుధ్యానించుచు నట్టె నిలువబడి నీ నిరతిశయ సంకల్ప సుఖానుభవము చేతను నీ విరహము వలనను గలిగిన సంతాపదుఃఖా నుభవముచేతను గూడ సుఖదుఃఖరూపబంధములు రెండును దెగి అనాయాసముగ కైవల్యమును (మోక్షమును) పొందెను. ఈమె కృతార్థురాలు.

**ఆదాయ భోజ్యా ననుగృహ్య తాః పున**
**స్త్వదంగ సంగస్పృహయోజ్ఝ తీ ర్గృహమ్,**
**విలోక్య యజ్ఞాయ విసర్జయ న్నిమా**
**శ్చకర్థ భర్తౄ నపి తా స్వగర్హణాన్. 9**

వారలు వెట్టు భోజ్యము లవారిగ నీవట నారగించి య
వ్వారి ననుగ్రహించితివి త్వత్తను సంగతి కోరి వారు సం
సారము లిండ్లు వాకిళులు సర్వము వీడగ; యజ్ఞపూర్తికై
వారల బంపినాఁడ వట భర్తలు తప్పన కాదరింపగన్.

ఆయింతులు నివేదించిన భోజ్యములను ఆరగించి, నీ తనుస్పర్శకోరి యిండ్లు వాకిళులు విడిచి వచ్చినారని యనుగ్రహించి యజ్ఞపూర్తికై వారి

భర్తలు వారియెడల నాగ్రహపడక యాదరించునట్లు చేసి వారలను యజ్ఞశాల కంపితివి.

నిరూప్య దోషం నిజ మంగనాజనే
విలోక్య భక్తిం చ పున ర్విచారిభిః,
ప్రబుద్ధత త్త్వైస్త్వ మభిష్టుతో ద్విజై
ర్మరుత్పురాధీశ నిరుంధి మే గదాన్. 10

తమయెడఁ దప్పిద మ్మరసి ధన్యలు భార్యలటంచు భక్తి చం
దము గని స ద్విమర్శనమునన్ గల తత్త్వ మెఱింగి బ్రాహ్మణో
త్తములగు యజ్వలందరు సదా వినుతించిరి నిన్; మదార్తి స
ర్వమును హరింపవోయి గురువాయుపురీవరమందిరా! హరీ!

తమతప్పు తామెఱిగి తమ భార్యల భక్తివైభవము లక్షించి తత్త్వవిమర్శనము సేసి యా కర్మఠులు నిన్ను స్తుతించిరి. ఓ గురువాయూరు మందిర సంచారీ! హరీ! నా ఆర్తి హరింపుము.

## 62వ దశకము

# ఇంద్రయాగ భంగము

కదాచి ద్గోపాలాన్ విహితమఖసంభార విభవాన్
నిరీక్ష్య త్వం శౌరే మఘవమద ముధ్వంసితుమనాః,
విజాన న్న ప్యేతాన్ వినయమృదు నందాది పశుపా
నపృచ్ఛః కో వాయం జనక భవతా ముద్యమ ఇతి. 1

ఒకతఱి గోపకుల్ మఘవు నూహఁదలంచి యజింప యజ్ఞ సా
ధకములఁ గూర్ప, వాసవు మద మ్మణఁగింపగ నీవువోయి యా
సకల మెఱింగి తా నెఱుక సాలనటుల్ "దమచేయు యజ్ఞ మే
మొకో"యని యంటివల్లన మృదూక్తుల నందముఖాప్తబంధులన్.

ఓ శౌరీ! ఒకతఱి యజ్ఞసంభారములు సమకూర్చుకొనిన గోపాలురం జూచి నీవు ఇంద్రుని గర్వము హరింపదలంచి యేమియు నెఱుగని బేలవలె అయ్యా! మీరిపుడు చేయబోవు యాగమేమి? అని మెత్తగ నందుడు మొదలైన ఆప్తులను అడిగితివి.

బభాషే నంద స్త్వాం సుత నను విధేయో మఘవతో
మఖో వర్షే వర్షే సుఖయతి స వర్షేణ పృథివీమ్,
నృణాం వర్షాయత్తం నిఖిల ముపజీవ్యం మహితలే
విశేషా దస్మాకం తృణసలిల జీవ్యా హి పశవః. 2

ఇది యయ్యింద్రుని దృప్తిసేయు మఖమౌ నేటేట వర్షించి య
ల్లదె యాతండు సుఖింపఁజేయు నిల, వర్షాయత్తముల్ మానవా
భ్యుదయమ్ముల్, పశుబృందముల్ తృణజలమ్ముల్ గ్రోలి జీవింప,మా
బ్రదుకెల్లన్ మఱియున్ దదేకరసనిర్వాహ్య మ్మగున్ నాయనా!

నందుడు కుమార! ఏటేట నింద్రునిగూర్చి యాగము సేయవలయును. దాన తృప్తిజెంది ఆయన వర్షము గురిపించి భూమిని సుఖింపజేయును. మానవుల బ్రతుకెల్ల వర్షాధీనము విశేషించి మన పశువులు గడ్డి నీరుచేగదా జీవించును.

ఇతి శ్రుత్వా వాచం పితు రయి భవా నాహ సరసం
ధిగేత న్నో సత్యం మఘవజనితా వృష్టి రితి యత్,
అదృష్టం జీవానాం సృజతి ఖలు వృష్టిం సముచితాం
మహారణ్యే వృక్షాః కిమివ బలి మింద్రాయ దదతే. 3

అనఁగా నాపలుకాలకించి సరస మ్మామీఁద నీవంటి వే
మన నింద్రుండటే వాన యిచ్చునటె వహ్వా! యేటి సత్యమ్మ?చా
లు, నదృష్ట మ్మదియెందునున్ తగినయట్లున్ వృష్టి గల్పించు నెం
దు; నరణ్యమ్మునఁ జెట్టు లేమి బలి యింద్రున్ గూర్చి యీనేర్చెడిన్

ఆ పలుకు లాలించి, నీవు సరసముగా మీతండ్రితో నిట్లంటివి: చాలు చాలు ఇంద్రుడట వాన కురిపించునట. ప్రాణుల అదృష్టము (కర్మఫలము)

వర్షమును సృజించును. ఇంద్రుడు గాదు. ఆ ఇంద్రుడుగూడ అదృష్టముంబట్టియే ఆపదవికి వచ్చినాడు. అడవిలో చెట్లు ఇంద్రునికి పూజ చేయుచున్నవా? అవి బ్రతుకుట లేదా?

**ఇదం తావత్ సత్యం యదిహ పశవో నః కులధనం**
**తదాజీవ్యాయాసౌ బలి రచలభర్త్రే సముచితః,**
**సురేభ్యో ప్యుత్కృష్టా నను ధరణిదేవాః క్షితితలే**
**తతస్తే ప్యారాధ్యా ఇతి జగదిథ త్వం నిజ జనాన్. 4**

**నచ్చిన సత్యమౌ కులధనమ్ము లహో! మన కిందు మంద, లీ**
**వచ్చును గొండరాజునకు వాని సుఖానకుఁ బూజ; దేవతా**
**భ్యుచ్చయులౌదు రీధరణిఁ బొల్చెడు నియ్యిలవేల్పు లందుచే**
**నిచ్చుటఁ బూజలిచ్చుటది యెంతయు ముచ్చటి యంటి వాప్తులన్.**

మీరన్నది యిది యొక్కటి మాత్రము నిజము. ఈ పశుసంపద మన కులధనము. వానికి తృణ జల సమృద్ధి కావలయునన్న ప్రారంభించిన యీ యాగమును యిలవేల్పు ఈ కొండరాజగు గోవర్ధనమునకు జేయుట ఉచితము. దేవతలకంటె గొప్పవారు భూమిలో ధరణిదేవులు. ఆ బ్రాహ్మణులు మనకు ఆరాధింపదగినవారు అని నీవారితో నంటివి

**భవద్వాచం శ్రుత్వా బహుమతియుతా స్తేఽపి పశుపా**
**ద్విజేంద్రా నర్చంతో బలి మదదు రుచ్చైః క్షితిభృతే**
**వ్యధుః ప్రాదక్షిణ్యం సుభృశ మనమ న్నాదరయుతా**
**స్త్వ మాదా శ్శైలాత్మా బలి మఖిల మాభీర పురతః. 5**

**మదిఁ గొని నీదుమాట మతిమంతులెపో యట నాలకాపరుల్**
**గొదుకక పారులన్ గొలిచి కొండకుఁ గొప్ప బలిం ఘటించి యొ**
**ప్పిదముగఁ జుట్టునుం దిఱిగి వెట్టిరి గుట్టకు మ్రొక్కులెల్ల, నీ**
**వదె గిరిరూపమై యెదుటనై బలియెల్ల భుజించినాఁడవున్.**

నీమాట లాలించి బుద్ధిమంతులు ఆలకాపరులు సంశయింపక విప్రులను బూజించి గోవర్ధనగిరికి బలు లిచ్చిరి. గిరి ప్రదక్షిణములు సేసి మ్రొక్కుకొనిరి.

నీవా గిరి స్వరూపుడవై వారిముందు గోవర్ధనగిరి నేను ప్రసన్నుడనైతిని; అనుచు వారిచ్చు బలులను నీ వారగించితివి.

**అవోచ శ్చైవం తాన్ కి మిహ వితథం మే నిగదితం**
**గిరీంద్రో నన్వేష స్వబలి ముపభుం క్తే స్వవపుషా,**
**అయం గోత్రో గోత్రద్విషిచ కుపితే రక్షితు మలం**
**సమస్తా నిత్యుక్త్వా జహృషు రఖిలా గోకులజుషః** 6

> **అటుపై గట్టిగఁ బల్కినావు వితథమ్మైపోయెనే నాదు ప**
> **ల్కిటు లీ కొండ స్వయమ్ముగాఁగొనె బలిౘ హీహీ! యనన్ వారు నిం**
> **తటి గోత్రుండిఁక గోత్రవిద్విషుఁడు పంతమ్మొత్తి దానెత్తి యి**
> **చ్చుటకుౘ వచ్చినఁ బ్రోచు నీతఁడని స్వాస్థ్యమ్మొంది రానందమున్.**

ఆమీద గట్టిగా చూచితిరా! నామాట నిజమైనది. ఈ కొండ స్వయముగా మీ బలిని స్వీకరించినది. ఈ గోత్రము=కొండ, గోత్రద్విషి=ఇంద్రుడు కోపించినను మనలందఱ రక్షింప సమర్థుడు. అని నీవనగా గోకులము ప్రజ లానందపడిరి.

**పరిప్రీతా యాతాః ఖలు భవ దుపేతా వ్రజజుషో**
**వ్రజం యావ త్తావ న్నిజమఖవిభంగం నిశమయన్,**
**భవంతం జానన్న ప్యధికరజసాక్రాంతహృదయో**
**నసేహే దేవేంద్ర స్త్వదుపరచితాత్మోన్నతి రపి.** 7

> **పరమప్రీతిని నిన్నుగూడి చనిరప్పా! వార; లల్లంతలో**
> **విరసమ్మై నిజ యజ్ఞభంగ మదియున్, విన్నంత కన్నంత నీ**
> **సరకెల్లన్ దనుదా నెఱింగియు రజశ్ఛాయా సమాక్రాంత దు**
> **ర్భర హృద్భారుఁడు సైపఁడింద్రుఁడు భవత్ప్రాప్తోన్నతిన్ బొల్చియున్**

వారు ప్రీతితో నీతోడ వ్రేపల్లెకుం జనిరి. అంతట తనను గూర్చిన యజ్ఞము భంగమైనదని విరసుడై నీమహిమ విన్నంతయు కన్నంతయు చక్కగా నెఱిగియు, రజోగుణము గ్రమ్మిన హృదయముతో నీచేత నేర్పడిన స్వకీయమగు ఇంద్రపదవి యందుండియు నీ చేసిన పని సైపడయ్యెను.

మనుష్యత్వం యాతో మధుభిదపి దేవే ష్వవినయం
విధత్తేచే న్నష్ట స్త్రిదశసదసాంకో౽పి మహిమా,
తతశ్చ ధ్వంసిష్యే పశుపహతకస్య శ్రియమితి
ప్రవృద్ధ స్త్వాం జేతుం సకిల మఘవా దుర్మదనిధిః. 8

మనుజుండై మధుహంతయే యగును బో! మా మీఁదనే యెత్తి యి
ట్లనయమ్మున్ వినయేతరమ్ము గొనెనే నస్మత్సభా ప్రాభవ
మ్మున కింకేటి ప్రతిష్ఠ మంటగలిసెన్ బో; గొల్ల యైశ్వర్య మిం
తననే కూల్తు నటంచు నింద్రుఁ డెగసెన్ దర్పించి ని న్గెల్వగన్.

మధువైరియే (విష్ణువే) యగుగాక మనుజుడుగా నికృష్టమైన జన్మమంది నాడు. నిజముగా విష్ణువే యైనచో స్వర్గవాసులకు ద్రోహము చేయునా? అందువలన నితడు విష్ణువుగాడు. దేవతల ప్రభావము మంట గలిసినది. ఈ గొల్ల సిరియెల్ల గూల్తునని ఇంద్రుడు మదమెక్కి నిన్గెల్చుటకు బూనెను.

త్వదావాసం హంతుం ప్రలయజలదా నంబరభువి
ప్రహిణ్వన్ బిభ్రాణః కులిశ మయ మభ్రేభగమనః,
ప్రతస్థే౽న్యై రంత ర్దహన మరుదాద్యై ర్విహసితో
భవన్మాయా నైవ త్రిభువనపతే మోహయతి కిమ్. 9

వడి నీ నిల్చిన కొండఁ గూల్పఁ బ్రళయాభ్రశ్రేణి నభ్రమ్మునన్
నడిపింపన్ గొని వజ్రముం గొని వియన్నాగేంద్ర యానమ్మునన్
నడిచెన్, లోనన నవ్వుకో దహనుఁడున్ వాయ్వాది దిక్పాలు; రె
క్కడ నెవ్వాఁ డిటు మోసపోఁడు త్రిజగత్కాంతా! భవన్మాయకున్

ఇంద్రుడు నీవున్న కొండను గూల్చుటకు ప్రళయకాల మేఘబలముల నాకసమువెంట నడిపించుటకు బూని, వజ్రాయుధము చేకొని, తన యైరావతమెక్కి ఎత్తివచ్చెను. అదిచూచి అగ్ని వాయువు మొదలైన దిక్పాలురు తమలోదాము నవ్వుకొనిరి. త్రిభువనాధీశ! నీమాయ ఎవనిని మోహింపజేయదు?

సురేంద్రః క్రుద్ధశ్చే ద్విజకరుణయా శైలకృపయా
ప్యనాతంకో౽స్మాకం నియత ఇతి విశ్వాస్య పశుపాన్,

**అహో కింనాయాతో గిరిభిదితి సంచిత్య నివసన్**
**మరుద్గేహాధీశ ప్రణుద మురవైరిన్ మమ గదాన్** 10

**ఇటు వజ్రాయుధుఁ డెత్తి క్రుద్ధుఁడగునే నింకే మనాతఙ్క మిం**
**కిట మాకున్, ద్విజకోటి సత్కరుణ మాకీకొండ వాత్సల్య ముం**
**డుట సాలున్, గిరిభేది యింతకును రాఁడున్ పొఁడిదేమంచు నీ**
**వటు లున్నావు మరుత్పురేశ! మురహంతా! వంతలన్ బాపుమా!**

ఇట్లు వజ్రాయుధుడు దండెత్తినా ఉత్తమ విప్రుల దయచే గోవర్ధనగిరి కృపచే మనకు సుఖము నిశ్చయము అని పశుపాలురకు నమ్మకము గల్గించి గిరిభేధి కుపితుడై రాడేమి? అని అనుకొనుచుంటివి. అట్టి ఓ మురారి! నా వ్యాధులను బోగొట్టుము.

## 63వ దశకము

# గోవర్ధనోద్ధరణము

**దదృశిరే కిల తత్క్షణ మక్షత స్తనిత జృంభిత కంపిత దిక్తటాః,**
**సుషమయా భవదంగతులాంగతా వ్రజపదోపరి వారిధరా స్త్వయా.** 1

**ఆక్షణ మక్షత స్తనితమై పరిజృంభిత కంపితాఖిలా**
**శా క్షితియై వ్రజస్థలిని జక్కన సూటిగఁ గాఱుగ్రమ్మెఁదా**
**నీక్షణగోచర మ్మగుచు నెల్లెడ బమ్మి వియత్పథానఁ బ్ర**
**త్యక్షమునయ్యె మేఘనివహమ్మట నీతనుకాంతి కీడుగన్**

ఆ క్షణమందే అవిచ్ఛిన్నముగ పిడుగులువడ దిక్కులు కంపింప వ్రేపల్లెలో నీ మేని కాంతికీడై కాఱుమబ్బులు క్రమ్ముకొనెను.

**విపులకరకమిశ్రైః తోయధారానిపాతై**
**ర్దిశిదిశి పశుపానాం మండలే దండ్యమానే,**

**కుపితహరికృతాన్నః పాహిపాహీతి తేషాం**
**వచన మజిత! శృణ్వన్ మాబిభీతేత్యభాణీః. 2**

**వడగలి రాళ్ళకున్ సుడిసి పైఁబడు నేనుఁగుతొండ మంతలై**
**జడిగొను వర్షధారలను జాగి యిలన్ నలుమూలలందునున్**
**బడి కుపితాత్ముఁడింద్రుఁడిదె బాధలఁ బెట్టెడు 'పాహి పాహి' యం**
**చడలగ గోపమండలి, భయంపడవద్దనినాఁడ వండయై.**

వడగండ్లతో గూడి యేనుగుతొండమంత ధారలతో జడివాన గురియ, పశుపాలురు బడలుపడి కుపితుడైన యింద్రుని బారినుండి మమ్ము రక్షింపుమని యాక్రందింప జడియకుడు జడియకుడని బలికితివి.

**కుల ఇహ ఖలు గోత్రో దైవతం గోత్రశత్రో**
**ర్విహిత మిహ స రుంధ్యాత్కోను వః సంశయో ఽస్మిన్,**
**ఇతిసహసితవాదీ దేవ! గోవర్ధనాద్రిం**
**త్వరిత ముదముమూలో మూలతోబాల! దోర్భ్యామ్. 3**

**'కుల మిది గోత్ర దైవతము, గోత్రరిపుం డొనరించు దాని ని**
**వ్వలనున నాపునట్టి పని వానిది, మీ కనుమాన మేల' యం**
**చెలమి నొకింత నవ్వి వచియించుచునే యటు చిట్టిచేతులన్**
**గొలిపియు మట్టుతోఁ గదిపి గొబ్బున నెత్తితి వగ్గి రీంద్రముః.**

ఈ గోకులము, గోత్ర=కొండ, దైవతము=దేవతగాగలది అందుచే గోత్ర రిపుడు=కొండల ఱెక్కలు ఖండించిన శత్రువైన ఇంద్రుడు కురిపించు వానను అపవలసిన పని కొండది, కావున మీ కనుమాన మెందులకు? అని అల్లన నవ్వి పరిహసించుచు నీచిట్టి చేతులతో మట్టుగదల్చి గోవర్ధనగిరి యెత్తితివి.

**తదను గిరివరస్య ప్రోద్ధృతస్యాస్య**
**తావత్ సికతిలమృదుదేశే దూరతో వారితాపే,**
**పరికరపరిమిశ్రాన్ ధేనుగోపా నధస్తా**
**దుపనిదధ దధత్థా హస్తపద్మేన శైలమ్. 4**

అటుపైఁ బైఁ బడకుండ నొక్క చినుకే నాకొండకుం గ్రిందలో
దిటవుం బూనిచి సన్ననౌ నిసుక తిన్నెన్ సాధన శ్రేణితో
నట గో గోపాలుర నిల్పి నీ యెడమ హస్తాబ్జమ్ము చేనెత్తి నీ
విటె గోవర్ధనమొక్క చిన్ని గొడుగట్లే పట్టినా వీశ్వరా!

ఆ విధముగ చిన్న చినుకు గూడ పైని బడకుండ ధైర్యము చెప్పి గోవులను గోపాలురను వారివారి చల్ది చిక్కములు కొమ్ము బూరలు చేగఱ్ఱలు మొదలగు సాధనములతో కొండ క్రిందికి రమ్మని పిల్చి అవలీలగ నీ యెడమచేతితో నా గిరిని చిన్న గొడుగువలె నెత్తి పట్టినావు.

భవతి విధృతశైలే బాలికాభి ర్వయస్యై
రపి విహిత విలాసం కేలిలాపాదిలోలే,
సవిధమిలితధేనూ రేకహస్తేన కండూ
యతి సతి పశుపాలా స్తోష మైషంత సర్వే. 5

నగవొప్పఁ నగమెత్తి బాలికలతో నర్మోక్తులన్ జెల్మి కాం
డ్రగు గోపాలురతోడ ముచ్చటల నీవంతంత వర్తించి దా
పుగ డాయంజను గోవులఁ నిమురుచుఁ బొల్పుల్ పచారించు విం
తగు నీయందము చందముంగని యమందానందులై రందఱున్

నవ్వుచు నొక చేత కొండయెత్తి, వ్రజ బాలికలతో నొకవంక బరియాచకములాడుచు నింకొకవంక జతగాండ్రగు గోపాలురతో ముచ్చటలాడుచు నీ దరికి వచ్చి నిలిచిన ఆవులమేను లొకచేత నిమురుచు ముచ్చటలు గొలుపుచున్న నీ యందచందములు గాంచి గోకులము మురిసిపోయినది.

అతిమహాన్ గిరి రేషతు వామకే కరసరోరుహి తం ధరతే చిరమ్,
కి మిద మద్భుత మద్రిబలం న్వితి త్వదవలోకిభి రాకథి గోపకైః. 6

ఎంతో దొడ్డది కొండ, బిడ్డ కరమం దిట్టే కదా యెత్తినాఁ
డెంతే, గాలము, ఎంత ఎంత గదవే యీచేఁత లద్రీంద్రు న
య్యంత స్సార మిదేమొ కాదుగద యం చట్టే నినుంగన్న బ
ల్వింతఁ గోపకు లాడఁ జొచ్చిరి భవల్లీలావిశేషమ్ములన్

ఈ కొండ పెద్దది. ఈ పాప డవలీలగ చిన్ని చేతితో నెత్తి యెంతోసేపు పట్టుకొన్నాడు. ఈ పని అత్యద్భుతము. ఒకవేళ ఇది గోవర్ధన గిరి యొక్క ప్రభావమయియుండునా? అనగా కొండల ఱెక్కలను ఖండించిన ఇంద్రునిపై నీ కొండకు గల పగచేత తనకుదాన గోవర్ధనము తేలికయైపోయినదా? అని గొల్లలు నీ లీలావిశేషములను జెప్పుకొనుచు నట నిలువబడిరి.

అహహ దార్ఢ్య మముష్య వటో ర్గిరిం
వ్యథితబాహు రసా వవరోపయేత్,
ఇతి హరిస్త్వయి బద్ధ విగర్హణో
దివస సప్తకముగ్ర మవర్షయత్. 7

అహ! వసివాని గండ్ర తన! మగ్గిరి దిగ్గన చేయి నొచ్చెనా
ఇహి! ఇటు పారద్రొబ్బక మఱేమగు నంచును వెక్కిరించి వృ
త్రహుఁడట నేడునాడు లొకధారగ జోరుగ రాళ్ళవాన తా
నహో కురిపించెఁ దానహరి నంచును గ్రించుదనాన నీపయిన్

ఇంద్రుడు అహో! ఈ కుఱ్ఱవాని యౌద్ధత్యము! చేయి నొప్పి పుట్టినా యీ కొండను చట్టన పారవేయును. అని హసించి యింద్రుడు ధారాపాతముగ నేడుదినములు పిడుగులతో మెఱుపులతో వాన గురిపించెను తెలుగులో హరిని నేనే అనగా హరి శబ్దము నాకే చెల్లును. నీకు చెల్లదన్నట్లు నీయెడ కొంటిదనమూని యీ పని చేసెనని మూలాధికమగు నొక కల్పనము.

అచలతి త్వయి దేవ పదాత్పదం
గలిత సర్వజలే చ ఘనోత్కరే,
అపహృతే మరుతా మరుతాంపతి
స్త్వ దభిశంకితధీ స్సముపాద్రవత్. 8

అడుగు గదల్ప కీ వచట నట్టె నిలంబడ, మేఘపఙ్క్తినీ
రొడుచుక పింజపింజలయి యొయ్యన గాలికిఁ దూలిపోవ, నె
క్కడఁ గనుగొందువో యనుచు గాటపుశంకను వేల్పు సామిదాఁ
బడుచును లేచుచున్ బరువు వారె మరుత్పథవీధులన్ హరీ!

అడుగు కదల్ప కుండ నీ వటు గిరియెత్తికొని నిలువబడ మేఘములు నీరంతయు నొడిచికొని గాలికి తూలి పింజపింజలుగా విడిపోయినవి. ఇంద్రుడు తన్నెక్కడ చూచిపోవుదువో యని సిగ్గుచే నీ కంటబడకుండ తురతుర పడుచు లేచుచు గగన వీధిని బారిపోయెను.

**శమ ముపేయుషి వర్షభరే తదా పశుపధేనుకులే చ వినిర్గతే,**
**భువి విభో సముపాహితభూధరః ప్రముదితైః పశుపైః పరిరేభిషే. 9**

**పెనువాన వెలిసి వెలికిఁ**
**జన గోవులు గోపకులను, చక్కన శైల**
**మ్మును దించి వచ్చి కౌఁగిట**
**నినిచితి వానందభరితు లగు నీవారిఁ**

పెద్ద వాన వెలిసినది. గోవులు గోపాలురు గోవర్ధన గిరిక్రిందినుండి వెలుపలి కేగిరి. నీవా కొండను చక్కగా దించి ఆనంద భరితులైన నీ బంధుమిత్రులను గౌగిలించుకొంటివి.

**ధరణి మేవ పురా ధృతవానసి క్షితిధరోద్ధరణే తవ కః శ్రమః,**
**ఇతి నుత స్త్రిదశైః కమలాపతే గురుపురాలయ పాలయ మాం గదాత్. 10**

**ధరణి సమగ్రమ్మెత్తిన**
**బిరుదున కీధరణిధరము పెద్దదె యిదియుఁ**
**భరమనె యని సుర లెన్నిరి**
**గురువాయుపురేశ! యేలుకొనరా! నన్నుఁ**

మునుపు వరాహావతారమెత్తి సర్వభూమిని ఎత్తిన బిరుదుగానికి నీకీ కొండ యెత్తుట పెద్ద పనియా? బరువాయని దేవతలచే నుతింపబడిన ఓ గురువాయుపురాధిపతీ! లక్ష్మీపతీ! నన్ను రోగమునుండి కాపాడుము.

# 64వ దశకము

# గోవింద పట్టాభిషేకము

**ఆలోక్య శైలోద్ధరణాదిరూపం ప్రభావ ముచ్చై స్తవ గోపలోకాః,**
**విశ్వేశ్వరం త్వా మభిమత్య విశ్వే నందం భవజ్జాతక మన్వపృచ్ఛన్.** 1

గోపకులమ్ము కొండయటు గొబ్బున మీటుట మున్నుగాగ ను
ద్దీపితమైన నీమహిమ తెల్లముగాఁ గని విశ్వభర్తగా
నోపు నటన్న నిశ్చయము నొంది కుమారుని జాతకమ్ము నే
రూపమొ యంచు నందుని నిరూపణ సేయగ వేడి రయ్యెడన్.

గోపకులు గోవర్ధన మెత్తుట మొదలగు నీ యత్యద్భుత ప్రభావము చూచి నీవు విశ్వేశ్వరుడవని భావించి నీ జాతకమును గూర్చి నందుని ప్రశ్నించిరి.

**గర్గోదితో నిర్గదితో నిజాయ వర్గాయ తాతేన తవ ప్రభావః,**
**పూర్వాధిక స్త్వ య్యనురాగ ఏషా మైధిష్ట తావ ద్బహుమానభారః.** 2

నందుఁడు సెప్పి నివ్విధమునన్ ముని గర్గమునీంద్రు లంచు న
య్యందర కాప్తవర్గమున కానతియిచ్చెను నీ ప్రభావ; మే
మందును వారికిన్ వలపు లగ్గలమయ్యెను నీదుపైని ము
న్నుందటి కంటె నీయెడన ముద్దులు ముచ్చట లెచ్చె నీశ్వరా!

నందుడు మున్ను గర్గాచార్యులు చెప్పిన జాతక విశేషములను దనవారికెఱుక పరచెను. అటుపై వారికి నీ యెడల అనురాగ మెక్కువయ్యెను. ముందుటికంటె నీపై ముద్దు మురిపెమలు ఆదరమును పెంపొందెను

**తతో ఒవమానోదిత తత్త్వబోధ స్సురాధిరాజ స్సహ దివ్యగవ్యా,**
**ఉపేత్య తుష్టావ స నష్టగర్వః స్పృష్ట్వా పదాబ్జం మణిమౌళినా తే.** 3

అవమానమ్మునఁ దత్త్వ విస్ఫురణమై యా దేవలోకేశ్వరుం
డవనిన్ వ్రాలి తనంత దేవగవి తోడైవచ్చి నీ సన్నిధిన్

స్తవముం జేసెను ద్వత్పదాబ్జ వినతోద్యన్మౌళి రత్నచ్ఛటా
ప్లవన క్షాళిత హృద్గుహాగహన గర్వస్ఫూర్తియై యల్లనన్.

దేవరాజ్యాధిపతి యింద్రుడు తనకు జరిగిన అవమానముచే తనను గూర్చి తానెఱింగి జ్ఞానము పొంది సురధేనువుతోగూడ యవనికి వచ్చి గర్వముడిగి తన మణికిరీటము నీ పాదములుతాక సాష్టాంగమెఱగి నిన్ను స్తుతించెను.

వి.వి: నీ పాదకమలములపై నింద్రుడు వ్రాలినపుడు నీ పాదములకు హృదయము దగ్గరైనందున తన కిరీటమందలి మణులు నీపాదములపై జిగజిగ మెఱసినపుడు ఆ కాంతులు అతని హృదయ గుహయందున్న గర్వరూపమైన చీకటి అజ్ఞానమును హరించినవని అనువాదమందలి భావస్ఫురణ. మఱియు "యేగత్యర్థాః తే జ్ఞానార్థాః" అన్న వ్యాకరణమర్యాద ననుసరించి, 'పద్ల గతౌ' అన్న ప్రకారము గత్యర్థకమైన పద్ల ధాతువునుండి యేర్పడిన పాద శబ్దమునకు జ్ఞాన మర్థము కనుక; పెద్దల పాదములు పట్టుకొని నమస్కరించుట వలన జ్ఞానము లభించునను రహస్యము మనసులో నుంచికొని ఋషులు పెద్దల పాదములు పట్టుకొని వందనము చేయవలెనని అట్టిపాదాభివందనమను సంప్రదాయమును ఏర్పరచిరి. 'చత్వారి తస్య వర్ధంతే ఆయు ర్విద్యాయశోబలమ్' ఆయుర్దాయము-జ్ఞానము-కీర్తి శరీరబలము పెంపొందును. అని ఫలశ్రుతి చెప్పినారు మనువు.

స్నేహ స్నుతై స్త్వాం సురభిః పయోభి ర్గోవిందనామాంకిత మభ్యషించత్,
ఐరావతోపాహృత దివ్యగంగా పయోభి రింద్రో ఒపిచ జాతహర్షః. 4

గోవిందుం డపు డైతి, వందు దివిషద్గోమాత పాల్పేపి నీ
పై వాత్సల్యము సూపి చేసెఁ ద్రిజగత్పట్టాభిషేకమ్ము హ
ర్షావేగమ్మున *నన్నిలింపపతి యయ్యైరావతానీత గం
గా వాఃపూరములం బొనర్చె నభిషేక శ్రీవిధిన్ నీ కటన్.

---

* .......నన్నిలింపపతి య య్యైరావతావర్జిత
శ్రీవైహాయస గాంగపూరముల నాసేకించె నిన్నంతటన్.

కామధేనువు (సురభి) వాత్సల్యముచే పాలుచేపి త్రిజగత్సామ్రాజ్యాభిషేకము నీకు చేసినది. అందుచే నీ గోవింద నామము సార్థకమైనది అనగా గాః=గోవులను, విందతి=పొందువాడు-గోవులయోగక్షేమము పరిశీలించుట మూలమున వాని రక్షణలో నుండువాడు అను నిర్వచనముచే నీయెడల చక్కగా సమన్వయించిన దన్నమాట. ఇంద్రుడైరావతము మీద గొనివచ్చిన దివ్యగంగాతీర్థములచే నన్నభిషేకించెను.

**జగత్త్రయేశే త్వయి గోకులేశే తథాభిషిక్తే సతి గోపవాటః,**
**నాకేఽపి వైకుంఠపదే ఉప్యలభ్యాం శ్రియం ప్రపేదే భవతః ప్రభావాత్. 5**

**లోకమ్ముల్ మఱి మూఁడు నేలు దొర వాలో గోకులమ్మేల నా**
**సేకమ్మొందగ కోపవాటము వహించెఁ నీ ప్రభావాన నా**
**నాకమ్మందునఁగాని యంతకవలన్ వైకుంఠ మందేని యా**
**లోకింపఁ వల నింతలేని సిరులన్ లోకైక రక్షామణీ!**

త్రిలోక సామ్రాజ్యాధినేత వయిన నీవు గోకులమునకు బ్రభువుగ పట్టాభిషిక్తుడవగుటవలన స్వర్గమందుగాని వైకుంఠమందుగాని కని విని యెఱుంగని పరమైశ్వర్యములతో గోపవాటమపూర్వశోభతో రాణించెను.

**కదాచి దంత ర్యమునాం ప్రభాతే స్నాయన్ పితా వారుణపూరుషేణ,**
**నీత స్తమానేతు మగాః పురీం త్వం తాం వారుణీం కారణమర్త్యరూపః. 6**

**నందుం డొక్క ప్రభాతవేళ యమునా స్నానమ్ము గావించుచుం**
**డం ద్దోడ్తోఁగొని పోయె నవ్వరుణుదండఁ బొల్చుభృత్యుండు వీ**
**కిం దో తేరగ నీవును పరుణలోకం బేగి తద్రాజధా**
**నిం దర్శించితి వద్భు తాద్భుతముగన్ లీలానరాకారమై**

ఒక వేకువవేళ మీతండ్రి నందుడు యమునా స్నానమున కేగగా వరుణ దూత వచ్చి యాతనిం గొంపోయెను. అది విని నీ వాయనం గొనివచ్చుటకు వరుణలోకమును దర్శించితివి. నీ లీలామానుషావతారవిశేషము లందిది యొక చిత్రము.

**ససంభ్రమం తేన జలాధిపేన ప్రపూజిత స్త్వం ప్రతిగృహ్య తాతమ్,**
**ఉపాగత స్తత్క్షణ మాత్మగేహం పితా వద త్తచ్చరితం నిజేభ్యః. 7**

**ఆందోళించి జలాధిపుం డొసగె నిన్నర్చించి మీతండ్రి; నే**
**మందుఁ నీదు చరిత్ర మద్భుతము దేవా! యింటికేతెంచి యా**
**నందుం డందటి కాత్మబంధువుల కానందాన వర్ణించి చె**
**ప్పెం దివ్యానుభవమ్ము నీదు మహిమావిర్భావ మీయందమున్**

అప్పుడు వరుణుడు నీరాక విని తొట్రుపడి నిన్ను బూజించి మీతండ్రిని నీకు సమర్పించెను. ఇంటికి వచ్చి నందుడు వరుణలోకమందు దాను జూచిన నీ అద్భుత దివ్యమహిమానుభావ మాత్మబంధువులకు దెలిపెను.

**హరిం వినిశ్చిత్య భవంత మేతాన్ భవ త్పదాలోకన బద్ధతృష్ణాన్,**
**నిరీక్ష్య విష్ణో పరమం పదం త ద్దురాపమన్యై స్త్వ మదీదృశస్తాన్. 8**

**హరి వీవంచును నిశ్చయించి భవదీయమ్మైన వైకుంఠమం**
**దిరముం జూడ గుతూహలించు జనముఁ నీవారి నీక్షించి నీ**
**పరమ మ్మన్యదురాపమైన పదముఁ భద్రాతిభద్రమ్ము సుం**
**దరమౌనంతకు సుందర మ్మదియు నంతఁ జూపినా వీశ్వరా!**

నీవు సాక్షాద్వైకుంఠుడవని నిశ్చయించి నీవైకుంఠధామము దర్శింప వేడుకపడు నీవారి నీక్షించి అన్యుల కందరాని యా నీ పరమపదమును దర్శింప జేసితివి.

**స్ఫురత్పరానంద రసప్రవాహ ప్రపూర్ణ కైవల్య మహాపయోధౌ,**
**చిరం నిమగ్నాః ఖలు గోపసంఘా స్త్వయైన భూమన్ పున రుద్ధృతా స్తే. 9**

**పరమానంద రసప్రవాహ నివహ వ్యాపూర్ణ కైవల్య సా**
**గరమం దూరక పెక్కుకాల మిటు మున్కల్ వెట్టు నయ్యాలకా**
**పరితండమ్ముల నుద్ధరించి తటు లాపై నీకునీవై యహో!**
**పరిపూర్ణాత్ముఁడ వీవు కృష్ణ! సకలబ్రహ్మ స్వరూపా! హరీ!**

పరమానందరస ప్రవాహ పరిపూర్ణమైన కైవల్యమనెడి సాగరమందిట్లు చిరకాలము మునకలు వెట్టించి వారి నుద్ధరించితివి. నీవు కేవల పూర్ణపర బ్రహ్మమవు.

కరబదరవ దేవం దేవ కుత్రావతారే
పరపద మనవాప్యం దర్శితం భక్తిభాజామ్,
తదిహ పశుపరూపీ త్వంహి సాక్షాత్పరాత్మా
పవనపురనివాసిన్ పాహిమా మామయేభ్యః. 10

ఏ యవతారమందు మును పెవ్వరి కందని నీ పదమ్ము నా
హా! యిటు భక్తులన్ గరతలామలకం బొనరించినాఁడ వ
య్యా! యటుగాన నీవు పశుపాకృతి నున్న పరాత్ముఁడౌదువౌ
రా! యదువంశ భూషణ! దయం గనరా! గురువాయుమందిరా!

ఏ యవతారమందును భక్తులకు జూపింపని దుర్లభమైన నీస్థానమును ఇట్లు గోపాలురకు కరబదరమట్లు (అరచేతిలో రేగుపండట్లు) కరతలామలకమటు (అరచేతిలో నుసిరిక పండట్లు) స్పష్టముగా కానిపింప జేసినావు. అందుచే నీవు పశుపాలకరూపమున నున్న పరమాత్మవే. ఓ గురువవన పురనివాసీ! నన్ను రోగముల నుండి కాపాడుము.

## 65వ దశకము

# గోపికల బృందావనాగమనము

గోపీజనాయ కథితం నియమావసానే
మారోత్సవం త్వమథ సాధయితుం ప్రవృత్తః,
సాంద్రేణ చంద్రమహసా శిశిరీకృతాశే
ప్రాపూరయో మురళికాం యమునా వనాంతే. 1

వ్రతపూర్తిన్ మును గోపికామణులకుఁ వాగ్దానముఁ జేసి య
చ్యుత! కందర్ప మహోత్సవ, మ్మదియు నిచ్చేనింక చెల్లింప నూ
దితి నీ వేణువు యామునాంతవని నెంతే సాంద్రచంద్రాతపో
ద్గతి నయ్యెల్ల దిగంతముల్ శిశిరతాక్రాంతమ్ములై నంతటన్

కాత్యాయనీవ్రతోద్యాపన సమయమందు గోపికలకు వాగ్దానము సేసిన రాసక్రీడాది మన్మథోత్సవములను జెల్లించుటకు బూని యమునాతీరమందు దట్టముగ వెన్నెల లలముకొని చలువలు నించు ప్రదేశమునందు వేణువూదితివి.

**సంమూర్ఛనాభి రుదితస్వరమండలాభి**
**స్సంమూర్ఛయంతమఖిలం భువనాంతరాళమ్,**
**త్వద్వేణునాద ముపకర్ణ్య విభో తరుణ్య**
**స్తత్తాదృశం కమపి చిత్తవిమోహమాపుః. 2**

**మురువొప్పన్ భువనాంతరాళముల సమ్మూర్ఛింపఁ గాఁ జేయు సు**
**స్వర సంతానిత తాన మూర్ఛనముగాఁ ద్వద్వేణునాదమ్ము సుం**
**దరు లందందున వీనులన్ నినిచి తత్తాదృఙ్మనోమోహ మొం**
**ది రనిర్వాచ్యము స్వానుభావము రసార్ద్రీభూత చైతన్యమున్.**

చక్కగ సర్వమండలము యొక్క ఆరోహణావరోహణాది వివిధ విన్యాస భేదములతో కూడిన సప్త స్వర పూరణముచే నేర్పడు సప్తవిధ మూర్ఛనలచే సర్వ భువనములను సమ్మోహింప జేయుచున్న నీ వేణుగీతమాలించి తరుణులు ఇట్టిట్టి దనరాని చిత్త విమోహమును బొందిరి.

వి.వి: మూర్ఛనలు అనగా "క్రమయుక్తాః స్వరా స్సప్త మూర్ఛనాః పరికీర్తితా" సప్తస్వరములయొక్క ఆరోహణావరోహణముల యొక్క క్రమప్రయోగ భేదము లేడింటికి మూర్ఛనలు అనిపేరు.

**తా గేహకృత్యనిరతా స్తనయప్రసక్తాః**
**కాంతోపసేవనపరాశ్చ సరోరుహాక్ష్యః,**
**సర్వం విసృజ్య మురళీరవమోహితా స్తే**
**కాంతారదేశ మయి కాంతతనో సమేతాః. 3**

**పనిపాటల్పొనరించుచుఁ గృహములఁ, బాలిచ్చుచుఁ బిడ్డకున్**
**వినయానఁ నిజ భర్తృసేవ జనియు విస్మృతి నీవేణు ని**
**స్వనముఁ వీనుల విన్నయాక్షణమునఁ వర్జించి సర్వమ్ము మో**
**హనమూర్తీ! యమునావనాంతరమునం దాసన్నలై రంగనల్**

గృహకృత్యములు నిర్వహించుచు, బిడ్డలకు పాలిచ్చుచు భర్తల సేవించుచు, వినువీథి నీ వేణునాద మాలించిన క్షణములో సర్వము విడిచి యమునాతీర వనప్రాంతమునకు పరువులిడి గుమిగూడిరి.

**కాచి న్నిజాంగ పరిభూషణ మాదధానా**
**వేణుప్రణాద ముపకర్ణ్య కృతార్థభూషాః,**
**త్వా మాగతా నను తథైవ విభూషితాభ్య**
**స్తా ఏవ సంరురుచిరే తవ లోచనాయ. 4**

**మురళీనాదము విన్న యాక్షణమునన్ ముగ్ధాంగనల్ గొందరా**
**భరణమ్ముల్ దడవాటుగా సగముగాఁ బల్వింతఁ గైసేసి నిం**
**చిరి నిన్ జూచి సమగ్ర భూషితలకంటెం గూడ యర్ధాంగ సుం**
**దరభూషామణిభూషితల్ గొలిపి రానందమ్ము నీ చూడ్కికిన్**

నీ వేణునాదము విన్న క్షణములో ముద్దరాండ్రు కొందరు తొందరలో నొక చోట పెట్టుకొనవలసిన నగల నింకొక చోట పెట్టుకొని, సగము సగముగా కైసేసి నిన్ను జూచువేడ్కతో వచ్చిరి. ఆ వచ్చినవారు నీ చూపులకు సర్వాంగ సమగ్రముగ నలంకరించుకొని వచ్చినవారికంటెను నెక్కువ యానందమును జేకూర్చిరి.

**హారం నితంబ భువి కాచన ధారయంతీ**
**కాంచీంచ కంఠభువి దేవ మాగతా త్వాం,**
**హారిత్వ మాత్మజఘనస్య ముకుంద తుభ్యం**
**వ్యక్తం బభాష ఇవ ముగ్ధముఖీ విశేషాత్. 5**

**హార మ్మొక్కనితంబినీ మణి నితంబాగ్రమ్మునం బూని నీ**
**దారి న్నిల్చె ముకుంద! స్వీయ జఘ నౌదార్యమ్ము చాటంగ, శృం**
**గారించెన్ గలకంఠి కంఠమునఁ జక్కన్ గజ్జె లొడ్డాణమున్**
**జేరం బిల్చెనొ నిన్ స్వకంఠకలితాశ్లేషాన కన్నట్లుగన్.**

ఒక గోపిక మెడలో ధరింపవలసిన హారమును ఒడ్డాణము పెట్టుకొన వలసిన నితంబ ప్రదేశమందు ధరించెను. ఆ ధరించుట స్వీయజఘన వైశాల్యమును నీకు వెల్లడించుకోయన్నట్లుండెను. అట్లే మఱియొక గోపిక

నడుమున నలంకరించుకొనవలసిన గజ్జెలొడ్డాణమును కంఠమునం దలంకరించుకొనెను. అట్లు సేయుట ఆ నాయిక నిన్ను స్వకీయ కంఠమును కౌగలించుకొనరమ్మని నిన్ను పిలిచెనా యన్నట్లుండెను.

వి.వి : గజ్జెలొడ్డాణము అని తెలిగించుటలో నాయొడ్డాణమునందలి గజ్జెల మ్రోతనిన్ను పిలిచిన సవ్వడి యనియు, కలకంఠి యనుటలో నామెపిలుపు మధురాతి మధురమయి నిన్నాకర్షింపగలదిగా నున్నదనియు, నామెకంఠము అవ్యక్త మధురమగుటచేతనే అది నీవంటి రసికాగ్రేసరుడు కౌగలించుకొనదగి యున్నదనియు తెలుగులో ధ్వనింప జేయబడినది.

కాచిత్ కుచే పున రసజ్జితకంచులీకా
వ్యామోహతః పరవధూభి రలక్ష్యమాణా,
త్వా మాయయౌ నిరుపమప్రణయాతిభార
రాజ్యాభిషేకవిధయే కలశీధరేవ. 6

ఏ తెంచెఁ గుచసీమఁ గంచుకము లే కింకొక్కవామాక్షి త
న్నే తన్వంగియుఁ జూడకుండఁ దన కేమే 'దిష్టి' యౌనంచునున్
బ్రాతిఁ నీదగు నిర్భరప్రణయ సామ్రాజ్యాభిషేకార్థమే
మో తానొక్క సువర్ణపూర్ణ కలశమ్ముం బూని యేతెంచెనాఁ

ఒక గోపకన్య తన చక్కదనమున కెక్కడ దిష్టితగులునోయని యేమో తన నెవ్వరు చూడకుండ రైక తొడిగికొనకుండ పైటలేకుండ కుచకుంభములు బయటవడ నిన్ను చూడవచ్చెను. ఆ వచ్చుట నీ ప్రణయ సామ్రాజ్యపట్టాభిషేక మందు బంగారుకలశముంబూని వచ్చెనాయన్నట్లు భాసించెను.

కాశ్చిత్ గృహాత్కిల నిరేతుమపారయంత్య
స్త్వామేవ దేవ! హృదయే సుదృఢంవిభావ్య,
దేహంవిధూయ పరచిత్సుఖరూప మేకం
త్వా మావిశన్ పరమిమా నను ధన్యధన్యాః 7

రామల్ గొందఱు గేహశృంఖలల మీరన్ లేక నీ చెంతకుఁ
నీమూర్తిం దలపోసి పాసితనువుఁ నిన్ గేవలుఁ బ్రహ్మ మా

**త్మారాముఁ బరుఁబొంది పొందిరి కృతార్థత్వమ్ము గోపాంగనా**
**స్తోమ మ్మయ్యది ధన్యధన్యముగదే శుద్ధాద్వయశ్రీగురూ!**

ఓ కేవలాద్వైత జగద్గురుమూర్తీ! కొందఱు ముద్దులాండ్రు అత్తమామలను, భర్తలను దప్పించుకొని గృహబంధములను ద్రెంచుకొని రాలేక యిండ్లయందే నీమూర్తిని ధ్యానించి స్థూలమైన గుణదేహముం బాసి కేవల నిర్గుణ బ్రహ్మము ఆత్మారాముడవు పరుడవు నైన నిన్నుజెందిరి. అనగా నీవేయైరి. అట్టి గోపికలు అందరి కంటెను ధన్యాతిధన్యలు.

**జారాత్మనా న పరమాత్మతయా స్మరంత్యో**
**నార్యో గతాః పరమహంసగతిం క్షణేన,**
**తం త్వాం ప్రకాశపరమాత్మతనుం కథంచి**
**చ్చిత్తే వహన్నమృత మశ్రమ మశ్నువీయ.** **8**

**పరమాత్ముండని కాక జారుఁడనుచుఁ భావించియుఁ గోప సుం**
**దరు లప్పారమహంస్యమైన గతి నందంగల్గినా; రట్టి నిన్**
**బరమజ్యోతిని బ్రహ్మవస్తువు మదిఁ ధ్యానించియానంద సా**
**గరగర్భమ్మయినట్టి యా యమృతమున్ గైకొందు మేమున్ హరీ!**

నీవు కేవలము పరతత్త్వమనుకొని కాక మానవుడవు జారుడవనియే భావించియు గోపికలు పరమహంస లందుకొను కైవల్యస్థానమందుకొన్నారు. అందుచే స్పష్టముచేయబడిన బ్రహ్మత్మస్వరూపుని పరంజ్యోతిని నిన్ను ఎట్లో అనగా కోరికల కొఱకు వైరముచేత, భయముచేత, భక్తి చేతను, ధ్యానించి ఆనంద పారావారపరమసారమైన అమృత స్థితిని పొందెదము.

**అభ్యాగతాభి రభితో వ్రజసుందరీభి**
**ర్ముగ్ధస్మితార్ద్రవదనః కరుణావలోకీ,**
**నిస్సీమకాంతిజలధి స్త్వమవేక్ష్యమాణో**
**విశ్వైకహృద్య హర మే పవనేశ! రోగాన్.** **9**

**మృదుహాసార్ద్ర విముగ్ధ సుందర ముఖశ్రీతోఁ గృపాలోక సం**
**పదతో నెట్టెదుటఁ నటించు నిను లావణ్యాకృతిన్ గాంచి ర**

**య్యదన౯ నీదరిఁ దారి గ్రమ్ముకొని యయ్యబ్జేక్షణల్ విశ్వ స**
**ద్హృదయగ్రాహి! సమీరగేహి! కరుణాబ్ధి! పాహి! పాహి! ప్రభో**

చిఱునవ్వుతో, ప్రేమ యొలికించు నీచక్కని నెమ్మోము శోభతో, కరుణా కటాక్షసంపదతో నెట్టయెదుట నటించు నీ దాపున గ్రమ్ముకొని మూర్తీభవించిన లావణ్యమైయున్న నిన్ను ఆ యమాయికలైన గోపికలు దర్శించిరి.

## 66వ దశకము

# ధర్మోపదేశము

**ఉపయాతానాం సుదృశాం కుసుమాయుధబాణపాత వివశానామ్**
**అభివాంఛితం విధాతుం కృతమతి రపి తా జగాథ వామ మివ. 1**

**వచ్చిరి విరితూపులఁ గడు**
**నొచ్చిరి తీర్చెదన మఱి మనోరథమని నీ**
**వచ్చపలాక్షులతోఁ బల్**
**ముచ్చటలం గులికినావు మును వామోక్తి౯**

ఇండ్లువీడి వచ్చినారు. పూలబాణములచే మిక్కిలి నొచ్చినారు. వీరి మనోరథము సఫలము సేసెదగాకయని నిశ్చయించియు గోపికలతో ముందు పెడసరముగా మాటలాడినట్లాడి ముచ్చటలు గులికినావు. వక్రోక్తి శృంగారోద్దీపనము.

**గగనగతం మునినివహం శ్రావయితుం జగిథ కులవధూధర్మమ్,**
**ధర్మ్యం ఖలు తే వచనం కర్మతు నో నిర్మలస్య విశ్వాస్యమ్. 2**

**మునులు విన గగనమున కుల**
**వనితల ధర్మమ్ము లెల్ల వాక్రుచ్చితి నీ**
**వనినది ధర్మ్యము, నీ చే**
**సినది యవిశ్వాస్య మమల! చిన్మయరూపా!**

ఓ పరిశుద్ధ జ్ఞానమూర్తీ! నీవు నింగినున్న మునులు వినుటకై స్త్రీల ధర్మములను వాక్రుచ్చితివి. ఈశ్వరుడవగు నీవు చెప్పినది ధర్మమే. కాని నీ చేసిన చేత మట్టుకు నమ్మదగినది గాదు. ఒకప్పుడది అధర్మరూపముగూడ యగును. కాన నీ కే దోషము లేదు. ఎందుచేత? నిర్మలుడవుగనుక, నిర్గుణ పరబ్రహ్మవు గాన నీవు కర్మమునకు అనధికారివి అన్నమాట.

వి.వి: ఉపనయనము కానివాడు కులకాంతలతో కామోత్సవ మొనరించుట అధర్మము. అట్టి అధర్మ మాచరించినవాడు కులస్త్రీల ధర్మములు చెప్పిన ముని లెట్లునమ్మిరి? అను సందియమును దీర్చుటకీ మాటను కవిచెప్పెను.

**ఆకర్ణ్య తే ప్రతీపాం వాణీ మేణీదృశః పరందీనాః,**
**మా మా కరుణాసింధో పరిత్యజే త్యతిచిరం విలేపు స్తాః.** 3

**విరసములగు నీ మాటల**
**హరిణీలోచనలు దీనలయి కడుఁ, గరుణా**
**శరధీ! మము విడువకు మని**
**పరిపరివిధములను దుఃఖపడఁ జొచ్చి రటన్.**

మీరర్ధరాత్రి భర్తలను విడిచి యిట్లు నాదగ్గరకు వచ్చుట తప్పు కావున తిరిగి వెళ్ళిపొండు అను నీ ప్రతికూల వచనములను (విరసములయిన మాటలను) విరిబోణులు విని, దిగులువడి, వలదు వలదు మమ్ము విడువవలదని పెక్కుతీరుల వాపోయిరి. రోదనము చేసిరి.

**తాసాం రుదితై ర్లపితైః కరుణాకులమానసో మురారే త్వమ్**
**తాభి స్సమం ప్రవృత్తో యమునాపులినేషు కామ మభిరంతుమ్.** 4

**చెలుల విళాపాలాప**
**ములఁ జాలిఁ మనసు కరఁగి పూనితి యమునా**
**పులినములఁ స్మరకేళీ**
**కలనములఁ గోపకన్యకా కులములతో.**

ఆ చెలువలు విలపించుచు పలికిన పలుకు లాలించి జాలిచే మనసుకరగి యమునానది యిసుకతిన్నెలపై వారితో రమింప నారంభించితివి.

**చంద్రకరస్యంద లస త్సుందర యమునా తటాంత వీథీషు,**
**గోపీజనో త్తరీయై రాపాదితసం స్తరో న్యషీద స్త్వమ్.** 5

**ఇందుకరస్యందమ్ముల**
**విందయి యమునాతటాంత వీధుల గోపీ**
**సుందరుల పైట చెఱఁగుల**
**నందము లగు సంస్తరముల నాసీనుఁడవై.**

చంద్రుని అమృతకిరణములు (వెన్నెలలు) నిండ జాలుకొను యమునానదీ తీరములందు గోపికలు పైటచెఱగులు పరచి యేర్పరచిన ప్రక్కలపై నీవు ఆసీనుడ వైతివి.

**సుమధుర నర్మాలాపైః కరసంగ్రహణైశ్చ చుంబనోల్లాసైః**
**గాఢాలింగనసంగై స్త్వ మంగనాలోక మాకులీచకృషే.** 6

**ముద్దు గులుకు హాస్యమ్ముల**
**ముద్దుల బిగికౌఁగిలింపు ముచ్చటలన్ బల్**
**సుద్దులఁ జేసే కొని య**
**మ్ముద్దియలన్ వగల మిగుల మురిపించి తజా!**

ముద్దులొలుకు హాస్యములచే ముద్దులచే బిగి కౌగిళులచే ముచ్చటైన పలుకులచే చేయిచేయి పట్టుకొని యాముద్దురాండ్రను మురిపించి కరగించితివి.

**వాసోహరణదినే య ద్వాసోహరణం ప్రతిశ్రుతం తాసామ్**
**తదపి విభో రసవివశ స్వాంతానాం కాంత సుభ్రువా మదదాః.** 7

**వలువలు హరించి నప్పుడు**
**వలువలు హరియింతు ననిన వాగ్దాన మ్మి**
**వ్వలనన్ రసవివశ స్వాం**
**తల కింతుల కప్పగించి తనియించి తహో!**

మునుపు వస్త్రాపహరణమప్పుడు నీవు మీ వలువలు హరింతునని (మానహరణము సేయుదునని) ఇచ్చిన మాటను శృంగారరసవివశలైన యా గోపికల కిప్పుడు చెల్లించితివి.

**కందలిత ఘర్మలేశం కుందమ్మృదుస్మేర వక్త్రపాథోజమ్,**
**నందసుతం త్వాం త్రిజగ త్సుందర ముపగూహ్య నందితా బాలాః. 8**

**నునుజెమట లొలయ మొల్లల**
**కెనయగు లేనగవుఁ జిల్కరించు ముఖాబ్జ**
**మ్మునఁ ద్రిజగన్మోహనుఁ డగు**
**నిను గౌఁగిటఁ జేర్చి ముదము నించిరి ముదితల్**

చిఱుచెమటలు గ్రమ్మ, గోపికలు మొల్లలు మొగ్గతొడిగినట్లున్న చిఱునగవులు నించు ముఖకమలముగల త్రిజగత్సుందరుడవైన నిన్నో నంద కుమార! కౌగిటంజేర్చి యా సుందరు లెనలేని యానందమందిరి.

**విరహే ష్వంగారమయః శృంగారమయశ్చ సంగమే హి త్వమ్,**
**నితరా మంగారమయ స్తత్ర పున స్సంగమేఽపి చిత్ర మిదమ్. 9**

**అంగారమయుఁడ వెడసిన**
**శృంగారమయుండ వెనసి చిత్రము 'సంగే**
**ష్యంగారమయ స్తత్ర' య**
**నంగా నంగనలఁ గూడి వర్తించి తటఁ.**

జతకూడినతఱి శృంగారమయుడవు. విరహమందు అంగారమయుడవు. అనగా నిప్పుకణమట్లు మిక్కిలి తాపము గూర్చువాడవు అయినను, సంగేఽపి=కూడినపుడుకూడ-అంగారమయః-నిప్పుకణమట్టివాడవు శ్లేషలో అంగ=ఓయి! అరమయః=రమింపజేసితివి. అనునట్లు గోపాంగనలతో గూడి యచట వర్తించితివి. ఇది శ్లేషానుప్రాణిత విరోధాభాసాలంకారము.

**రాధా తుంగపయోధర సాధుపరీరంభ లోలుపాత్మానమ్,**
**ఆరాధయే భవంతం పవన పురాధీశ శమయ సకలగదాన్. 10**

**రాధా తుంగపయోధర**
**సాధు పరీరంభ పరమ సౌఖ్యాదరు నా**
**రాధింతు నిన్ను వాయుపు**
**రాధీశ్వర! సకలరుజల హరియింపు హరీ!**

రాధాదేవి యుత్తుంగ కుచకుంభ పరీరంభ పరమసుఖ రసికుడవగు నిన్ను నే నారాధింతును. ఓ పవనపురనాథ! హరీ! నా రుజలెల్ల హరింపుము.

# 67వ దశకము

# తిరోధానము-అన్వేషణము

స్ఫురత్పరానంద రసాత్మకేన త్వయా సమాసాదిత భోగలీలాః,
అసీమ మానందభరం ప్రపన్నా మహాంత మాపు ర్మద మంబుజాక్ష్యః. 1

పరమానందము రూపమైన నిను సంభావించి భావించి నీ
కరుణన్ భోగ వినోదముల్మఱిఁగి యాకంజాక్షు లా నంద వి
స్తరత భావములం గఱంగి మఱి తత్సౌభాగ్యగర్వాన నెం
చిరి తా రేరికివారు ధన్యలనుచున్ నీరేజ పత్రేక్షణా!

బ్రహ్మానందమూర్తివగు నీతోడి క్రీడావిలాసముల కలవాటుపడి గోపికలు అవధిలేని యానందమునంది ఎనలేని తమ సౌభాగ్యసంపదకు గర్వపడజొచ్చిరి.

నిలీయతేఽ సౌ మయి మయ్యమాయం రమాపతి ర్విశ్వమనోభిరామః
ఇతిస్మ సర్వాః కలితాభిమానా నిరీక్ష్య గోవింద తిరోహితోఽ భూః. 2

నను బాయండని నాదుచాయ వలలోన జిక్కెనే విశ్వమో
హనుఁడేమాయలు నేరఁడమ్మయని భాగ్యమ్మన్న నాదే సుమా
యనుచున్ శ్రీపతి నన్మఱంగెనని వా రాత్మాభిమాన మ్మెదం
గొనినంతం గనుచాటు సెందితి వటన్ గోవింద బృందావనిన్

కృష్ణుడు నాయందె లీనుడైనాడు. ఆ విశ్వమోహనుడు ఏమాయలెఱుంగడు నా వలపువలలో జిక్కినాడు అని ముగ్ధాంగనలు తమ సౌభాగ్యమునకు గర్వింపగా చూచి ఓ గోవింద! బృందావనమునందు అంతర్ధానమైతివి.

రాధాభిధాం తావ దజాతగర్వా మతిప్రియాం గోపవధూం మురారే,
భవా నుపాదాయ గతో విదూరం తయా సహ స్వైరవిహారకారీ. 3

తిరోహితేఽ థ త్వయి జాతతాపా స్సమం సమేతాః కమలాయతాక్ష్యః,
వనే వనే త్వాం పరిమార్గయంత్యో విషాద మాపు ర్భగవ న్నపారమ్. 4

మనసు హరించి గర్వమనుమాట యెఱుంగని రాధతోడఁ జెం
గునఁ జని యామునాంతర నికుంజములన్ సుమపుంజశయ్యలన్
దనిపెడి నీకునై వెదకి తారు వియోగ మనోజవేదనన్
గనిరి వలమ్ములెల్ల వెదుకం జని నిన్గనరైరి కామినుల్

గర్వమన్నదే యెఱుంగనికతన నీకు మనఃప్రియమైనరాధను జేకొని సుదూరమేగి యేకాంత విహారము లొనర్చితివి అపుడు గోపకన్య లవ్వనములెల్ల అన్వేషించి దరిలేని వేదనం గనిరి కాని నిన్ను మాత్రము గన నేరరైరి

హా చూత హా చంపక కర్ణికార హా మల్లికే మాలతి బాలవల్ల్యః,
కిం వీక్షితో నో హృదయైకచోర ఇత్యాది తా స్త్వత్ప్రవణా విలేపుః. 5

తీయని దాన వాదువు పతిన్ గనినావటె తియ్యమావి! మ
ల్లీ! యిటు తెల్లవోయెదు వచింపవె ఓ యెలతీవలార! య
మ్మాయలమారిఁ జూచితిరె? మా సకలమ్ము హరించు దొంగ రాఁ
డా యిటు మాలతీ! తెలుపవే యనుచుం దురపిల్లి రంగనల్

ఓ సహకారమ! కృష్ణుజాడ దెలిపి మాకు సహకరింపుము ఓచంపకమా! కర్ణికారమ! ఓ మల్లియ! తెల్లబోనేల? ఓ బాలవల్లులార! మా హృదయముల దొంగిలిన యా మాయలమారి నెందైన జూచితిరే ఓ మాలతీ! తెలుపవేయని యా భామినులు నీమీది వలపున విలపించిరి.

నిరీక్షితో ఽ యం సఖి పంకజాక్షః పురో మమే త్యాకుల మాలపంతీ,
త్వాం భావనాచక్షుషి వీక్ష్య కాచి త్తాపం సఖీనాం ద్విగుణీచకార. 6

కంటిని గంటికింపుగ జగా మెఱుఁగుల్ మెఱయించువాని వా
ల్గంటిరొ! కౌగిట న్నిలిచెఁ గా చెలియా! ఇదుగో! యటంచు ని
న్నంటిన భావనం గని యహా! కలకంఠి యొకర్తుపల్కియా
వెంటను బెంచె దుఃఖ మొక వెంట నసూయ సఖీజనమ్ములన్

చెలీ! స్వామి నిదిగో చూచితిని. నాముందు నందనందనుని కనువిందొనరించికొంటినే! ఇదుగో! ఆ సుందరుడని భావనాదృష్టితో

(ఊహాపథమున) నిన్నుగని అవ్యక్తమధురకంఠస్వరమున నొక గోపిక పలుకుచు తన చెలికత్తెలకు ఒకవంక పరితాపమును ఒక వంక అసూయను ఇనుమడింపజేసెను.

**త్వదాత్మికాస్తా యమునా తటాంతే**
**తవానుచక్రుః కిల చేష్టితాని,**
**విచిత్య భూయోఽపి తథైవ మానాత్**
**త్వయా వియుక్తాం దదృశు శ్చ రాధామ్. 7**

**నీదగుభావనన్ సతులు నీవయి యా యమునాతటాంత మం**
**దాదటఁ జేరి యందరు త్వ దద్భుత లీల లవెల్ల నెంచి యం**
**దేదియు బీరువోనటు నటించుచు నిన్ వెదుకాడి చూచి రీ**
**మాదిరి నిన్నుబాసి యభిమానమునన్ జరియించు రాధికన్**

భావనాబలముచే నీ ధ్యానసమాధి సిద్ధింపగా నయ్యబలలు నీతోడి తాదాత్మ్యమునంది యమునాతీరమందు నీయాకారమును వేషమును నీచేష్టలను అనగా పూతనానుగ్రహ-అర్జున భంజనాది విలాసముల ననుకరించుచు నభినయింపజొచ్చిరి. మఱియు వారందు నిన్ను వెదకుచు నొకచో నేను కృష్ణునకెక్కువ యిష్టురాలనను స్వాభిమానముచే నీ యెడబాటునంది యెనలేని తాపమునకు గురియైన రాధను దర్శించిరి.

**తత స్సమం తా విపినే సమంతా త్తమోవతారావధి మార్గయత్యః,**
**పునర్విమిశ్రా యమునాతటాంతే భృశం విలేపుశ్చ జగు ర్గుణాం స్తే. 8**

**ఆతఱిఁ జీఁకటు ల్వొడెడు నంతకుఁ గాంతలు కాంతుఁగాన క**
**బ్జాతముఖుల్ తపించి మరుబారికి, నయ్యమునాతటాంత సం**
**కేత పద్మమ్ముఁ జేరికొని కిన్నెర మ్రోసినయట్టు లేడ్చి సం**
**గీతము మేళవించిరి మృగీనయనల్ లలనల్ ముఖారిలోన్**

అంతలో ప్రొద్దుగ్రుంకెను. చీకటు లలముకొనెను. అవ్వన మంతట నా మృగాక్షులు కాంతునికై వెదకి విసివి వేసారి యమునాతీర ప్రాంతమందు సంకేత స్థానమున గుమిగూడి కిన్నెర మ్రోయించినట్లు గళములెత్తి భోరన నేడ్చిరి. అనురాగసంగతి నేడ్చువారి యేడ్పులుకూడ అవ్యక్తమధురరాగ

సంగతులు కులుక సంగీతము పాడినట్లు సొంపుగొలిపెను. ముఖారి రాగములోనని తెలుగులో మూలాధికస్ఫురణము. అది కరుణరసపోషకము

**తథా వ్యథాసంకులమానసానాం వ్రజాంగనానాం కరుణైక సింధో,**
**జగత్త్రయీమోహన మోహనాత్మా త్వం ప్రాదురాసీ రయి మందహాసీ. 9**

**ఆవిధి గాసిచెంది విరహాకుల లైన నిజానురక్తలన్**
**గావఁ గృపారసాబ్ధివి జగత్త్రయ మోహనమోహనుండవై**
**యీ వెలనవ్వుల జిలుకరించుచు నించిన వేడ్క గోపక**
**న్యావళి యీక్షణాన క్షణమై నటియించితి వీక్షణమ్మునన్**

అట్లు విరహవేదనం దపించు నబలలపై కనికరమూని కరుణాసముద్రుడవు జగత్త్రయ సమ్మోహనమూర్తివై యల్లన నవ్వుచు సాక్షాత్కరించితివి తెలుగు అనువాదములో గోపికల, ఈక్షణానన్=చూపులందు, క్షణమై=ఉత్సవమై-(నయనోత్సవమై అన్నమాట) ఈక్షణమునన్=ఈ క్షణములో దర్శనమిచ్చినావు అని మూలాధిక శబ్దవిన్యాసము.

**సందిగ్ధ సందర్శన మాత్మకాంతం**
**త్వాం వీక్ష్యతన్వ్యస్సహసా తదానీమ్,**
**కింకిం నచక్రుః ప్రమదాతిభారాత్**
**స త్వం గదాత్ పాలయ మారుతేశ! 10**

**ఐనను గాంతుదర్శన మదైనదొ లేదొ యటంచు నింక ముం**
**దేనియు నౌనొ కాదొ యని యింతులు సందియమేచి చూచి యెం**
**తేనియు హర్షమూని మఱి యేమెమి సేయరు స్వామి! గోపికా**
**మానసచోర మావెతలు మానిచి యేలర! మారుతాధిపా!**

అట్లు నీ దర్శన మైనను నిజముగా నైనదో లేదో ఇకనైన నగునో కాదోయని యానందాతిశయముచే సందేహమునకు లోనై యాత్మవల్లభుని నిన్ను నిజముగా నచట దర్శించి యేమేమి సేసిరో యాయనుభావములు అనిర్వచనీయములు ఇట్టి మరుత్పురాధీశ్వర! నీవు మమ్ము పాలింపుము.

# 68వ దశకము

# గోపీసాంత్వనము

**తవవిలోకనాద్ గోపికాజనాః ప్రమదసంకులాః పంకజేక్షణ,**
**అమృతధారయా సంప్లుతా ఇవ స్తిమితతాం దధుస్త్వత్పురోగతాః. 1**

కమలలోచనల్ గాంచి నిన్నటన్
ప్రమద సంభ్రముల్ పఙ్క జేక్షణ!
అమృతధార నోలాడి నట్టులై
స్తిమితభావముం జెంది రచ్యుతా!

నీ సందర్శనమంది యానందించి గోపసుందరులు అమృతధారలం దోలలాడినంత సుఖముపొంది స్వస్థతచిత్తలైరి. ఈ దశకమందు గోపికలు కృష్ణపరమాత్మ తోడి సంగముచే పొందిన మన్మథదశావిశేషములను శృంగారలీలానుభావములను కవి చక్కగా వర్ణించెను.

ఇది సమ్మతావృత్తము. వందిత కామిని భద్రికయనునవి దీని నామాంతరములు, గణమలు, నరరలగ, యతియేడవ అక్షరము-తాళము-ఆదితాళము కాంభోజిరాగము.

**తదను కాచన త్వత్కరాంబుజం సపది గృహ్ణతీ నిర్విశంకితమ్,**
**ఘనపయోధరే సన్నిధాయ సా పులకసంవృతా తస్థుషీ చిరమ్. 2**

వనిత నీకరాబ్జ మ్మొకర్తు సి
గ్గనక పూని మోహైకతప్తయై
ఘనపయోధరాగ్రాన మోపినిన్
మొనసి నిల్చె మై పుల్కరింపగన్

విరహతాపముచే వివశయైన యొకబాలిక సిగ్గువిడచి నీహస్తాబ్జమును దనపయోధరాగ్రమం దత్తికొని మేను పులకరింప మైమరచి యట్టె నిలిచెను. ఇది హ్రీత్యాగమనెడి మన్మథదశావిశేషము.

**తవ విభోపరా కోమలం భుజం నిజగలాంతరే పర్యవేష్టయత్,**
**గలసముద్గతం ప్రాణమారుతం ప్రతినిరుంధతీ వాతి హర్షులా. 3**

**విడనివేదనన్ వేగి నీదరిన్**
**బడతి యొర్తు నీ బాహువల్లరిన్**
**మెడకుఁ జుట్టె మున్ మీఁదికేగఁ బా**
**ల్పడిన ప్రాణముం బట్టినట్లుగ**

ఒక గోపిక వియోగదుఃఖముచే వెడలుచున్న ప్రాణమును వెలికి పోకుండ లోనికి బిగబెట్టినా యన్నట్లు నీభుజమును దనమెడకు జుట్టుకొనెను ప్రాణాయామరూపమున సమాధి సుఖమనుభవించెనా యన్నట్లుండెననియు ధ్వని.

**అపగత త్రపా కాపి కామినీ తవ ముఖాంబుజాత్ పూగ చర్వితమ్,**
**ప్రతిగృహయ్య తద్వక్త్ర పంకజే నిదధతీగతా పూర్ణకామతామ్. 4**

**బిడియ మెల్లఁ బో వీడి బాలయ**
**ప్పుడు త్వదాస్యతాంబూల చర్విత**
**మ్మొడిసి శ్రీముఖాబ్జోల్లసద్రుచుల్**
**వొడమ రంజిలెన్ బూర్ణకామయై**

ఒక గోపిక సిగ్గు విడిచి నీ నెమ్మోము ముద్దుపెట్టుకొని తాంబూలము తమ్మి నందుకొని దానివలన తనముఖకమలమం దినుమడించిన రాగముచే ఎఱుపుచే కృష్ణపరబ్రహ్మమందు తనకేర్పడిన రాగము (కామపురుషార్థము) సంపూర్ణ ప్రసిద్ధి నందెను. అనగా తన శృంగారము మోక్షానంద పర్యవసాన మయ్యెనని మురిసిపోయెను.

**వికరుణో వనే సంవిహాయ మా మపగతోఽసికా త్వామిహ స్పృశేత్,**
**ఇతి సరోషయా తావదేకయా సజలలోచనం వీక్షితో భవాన్. 5**

**కరుణవాసి నన్ గానఁ బాసితే**
**తరుణి యింక నిన్ దాకు నంచునున్**

సరసిజాక్షి రోషానఁ గంటి నీ
ర్దొరుగఁ జూచె నిన్ దోయజేక్షణ!

మరియొక ముద్దరాలు (కలహాంతరితనాయిక) కృష్ణా! కరుణలేక అబలనైన నన్ను అడవిలో విడచి యేగితివి. ఇట్టి ధూర్తుని నిన్నెవతె చేరనిచ్చును? అని కన్నీరు దొరుగ రోషదృష్టితో నిన్ను జూచెను. కంట నీర్వెట్టుకొనుట అధీరయగు నాయిక లక్షణము.

ఇతి ముదాకులై ర్వల్లవీజనైః స్సమ ముపాగతో యామునే తటే
మృదుకుచాంబరైః కల్పితాసనే ఘుసృణభాసురే పర్యశోభథాః. 6

చని కలిందజా సైకతమ్ములన్
ఘన కుచాంబరా కల్పితాసన
మ్మునగు గుంకుమామోద ముద్రపై
మొనసి కూడి తాముద్దరాండ్రతో

కాళిందీతీరమం దిసుకతిన్నెపై గోపికలు పైటచెఱగులువఱచి నీరాకకై యెదురుచూడగా నీవరుదెంచి వారిస్తనములం బూసికొన్న కుంకుమపూత పరిమళించెడి యాస్తరణములం దాముద్దరాండ్ర గూడి క్రీడించితివి. ముస్తాబు సేసికొని ప్రియునిరాకకై యెదురుచూచు లక్షణముంబట్టి యీ గోపికలు వాసకసజ్జికానాయికలుగా భావింపదగుదురు.

కతివిధా కృపా కేఽపి సర్వతో ధృతదయోదయాః కేచి దాశ్రితే,
కతిచి దీదృశా మాదృశేష్వపీ త్యభిహితో భవాన్ వల్లవీజనైః. 7

కరుణ తీర్లనేక మ్మకారణ
మ్మరయ నందరం, దాప్తులందుఁ గొం
దరకు; కొందఱో మమ్ముఁ బోంట్ల నీ
తెరగటంచు నిన్ దెప్పి రంగనల్

కరుణ (జాలి) యనునది అనేక విధములుగ నుండును. కొందఱుప్రియులు అందరియందును అవ్యాజ దయానిధులు. వారు దక్షిణ నాయకులు, కొందరు ఆశ్రితులయందు మాత్రము దయచూపుదురు. ఇట్టివారు అనుకూలనాయకులు. కొందఱు మహానుభావు లీవిధముగా (మాబోంట్లయందు నీవున్నట్లు) నుందురు.

అనగా నీకై యల మఱుగుచు గృహారామక్షేత్రవిత్తాదులను విడిచి యడవిపాలై వచ్చిన ప్రియురాండ్రను విడిచి యన్యాసక్తులగు చుందురు. ఇట్టి శఠనాయకునిగ నర్మగర్భముగా స్వామిని దెప్పిపొడిచిరి. నాయకు డన్యాసంగ మందినపుడు ఈర్ష్యావశమున తెగనాడునాయిక ఖండిత. ఈ గోపిక యాజాతికి చెందినదన్నమాట.

**అయి కుమారికా నైవ శంక్యతాం కఠినతా మయి ప్రేమకాతరే,**
**మయితు చేతసో వోనువృత్తయే కృతమిదం మయేత్యూచివాన్ భవాన్.**

**తరుణులార! నిస్తంద్రరాగ వి**
**స్ఫురణు వేరుగాఁ జూడకుండు నన్**
**బరమ నిష్ఠ నాపై ఘటింప ని**
**ట్లు రసి చేసినా నంటి వయ్యెడన్**

ఓ యువతులార! మీయందనురక్తుడనై మీవాడనైయున్న నన్ను అన్యునిగా చూడవలదు. నామీద మీకు దృఢమైన అనురక్తి నిష్ఠ కుదురుటకే యిట్లు సేసితిని. కానివేరుగాదని వారి నూరార్చితివి. సంభోగ శృంగారముకంటె విప్రలంభశృంగారము అన్యోన్యరసోత్కర్షస్థానమని హృదయము.

**అయి నిశమ్యతాం జీవవల్లభాః ప్రియతమో జనో నేదృశో మమ,**
**తదిహ రమ్యతాం రమ్యయామినీ ష్వనుపరోధమి త్యాలపో విభో.** 9

**అయొ! వినుండు పుణ్యాంగనల్ మరే**
**మయిన వల్లభ మ్మైనె మీవలెన్**
**భయము లేదిటన్ భవ్యచంద్రికో**
**దయ విభావరిన్ దగ రమింతమే**

ఓ పుణ్యవతులార! ఈ సంబోధనము గోపికలు కేవలము భగవత్సాయుజ్య లాభమునకై తపస్సు సేసిన మహర్షులే యని జ్ఞాపకము చేయును. నాకు మీకంటె ప్రియమైన పదార్థములేదు. అనగా మీరు నాకు కేవలము ఆత్మ స్వరూపులే అయి యున్నందున ఆత్మకంటె ప్రియమైన వస్తువు మఱియేమి యుండునని భగవంతుని హృదయము. కావున భయమక్కరలేదు. ఇది పరమాత్మ అనుగ్రహించిన అభయము. చంద్రోదయ మందీ శీతల యమునా

తీర సైకతైకాంత ప్రదేశమున నీపండువెన్నెలరాత్రి నిక్కడ రమింతముగాక! రండు! అని షోడశకలా పరిపూర్ణమైన యానందము స్వరూపమయిన పరమాత్మ రమ్యమయిన యీ సమావేశరూపమున తన సాయుజ్యమును గ్రహించెనని తాత్పర్యము.

**ఇతి గిరాధికం మోదమేదురై ర్వ్రజవధూజనై స్సాక మారమన్,**
**కలితకౌతుకో రాసఖేలనే గురుపురీపతే పాహి మాం గదాత్. 10**

**అన నమంద హర్షాస్తి సుందరీ**
**జనముతోడరాఁ జారురాసఖే**
**లన మహోత్సవోల్లాసివైన పా**
**వనపురాగ్ర సంవాస! ప్రోవవే!**

నీవట్లనగా విని అమందానందభరితలై గోపసుందరీ బృందము నీ వెంటరాగా నాయమునాసైకత రంగస్థలమందు రాసక్రీడామహోత్సవమునకు నాందీప్రస్తావన గావించితివి. స్వామీ! ఓ గురువాయూరుపురవిలాసినీరసి కాగ్రేసరా! నారాయణా! నన్ను రక్షింపుము.

వి.వి. వ్యాసవాఙ్మయమునకెల్ల యిది మహాపండితులను తికమకపెట్టు యొక్క అద్భుతఘట్టము. "ప్రజ్ఞావతాం భాగవతే పరీక్షా" "బుద్ధిమంతులకు పరీక్ష భాగవతమందు" అన్న వాడుకకు లక్ష్యమైన భాగవతరహస్య విశేషములకెల్ల యిది యెల్ల. గోపికాకృష్ణాలంబనమైన యీ శృంగారము కేవలశృంగారము గాదు. ఇది 'ఉజ్జ్వల రసము' అని నిరూపించుచు బృందావనవాసి రూపగోస్వామి "ఉజ్వలనీలమణి" అనునొక ప్రత్యేక గ్రంథమును రచించినారు. విభావానుభావ సాత్త్వికవ్యభిచారిభావ సముల్లాసితమైన రతిస్థాయిభావము శృంగారము. అది అలౌకికము అన్నారు ఆలంకారికులందఱును. కాని యాయన "శృంగారః శుచి రుజ్జ్వలః"- అను అమరునిమాట నెత్తికొని, శృంగారము వేఱు, అదే శుచియైనపుడు "శుచిశ్శృంగారః" అనగా కేవల భగవత్తత్త్వమైన కృష్ణపరమాత్మ నాలంబనముగా గొని, జన్మాంతరమున మహర్షులైన గోపిక లీయవతారమందు వ్యక్తపరచిన పరమ ప్రేమరూపమైన శృంగారము పరమపవిత్రమైనది కావున, ఇది ఉజ్వల రసము, అను పేర వేరుగ పేర్కొనదగినదని నిర్వచించి, శ్రీమద్భాగవతమందు వ్యాసభగవానులు వర్ణించిన గోపికాకృష్ణ లీలావిహారమును రాసపంచాధ్యాయిని తదనుగుణమైన విభావానుభావసామగ్రిగా సమన్వయపరచి

యొకనూతన ప్రస్థానమును రూపొందించెను. అందుచే శృంగారరసముగా అలౌకికమే యయినను గోపికా కృష్ణశృంగారము లౌకికాలౌకికాతీతమై బ్రహ్మానంద సబ్రహ్మచారి గాక కేవల బ్రహ్మానందమేయయి నిర్మములు నిరహంకారులు వీతరాగులయిన మహాయోగుల కాస్వాద్యమై సాక్షాద్విష్ణువు నవతారమైన వ్యాసదేవుల కవితా హృదయమునకు విషయమైనదని యెఱుంగ నగును ఇందలి రహస్యమింకను దెలిసికొనగోరు యేకాంతభాగవతభక్తబృందము మహామహులయిన శ్రీకరపాత్రస్వామిపాదులు రాసపంచాధ్యాయిమీద చేసిన అగాధమధురభావ వ్యాఖ్యానగ్రంథములను పలుమారులు పఠించి భావనచేసి రసభావితులగుదురుగాక!

# 69 వ దశకము

# రాసక్రీడ

**కేశపాశ ధృతపింఛికా వితతి సంచల న్మకరకుండలం**
**హారజాల వనమాలికాలలిత మంగరాగ ఘనసౌరభమ్,**
**పీతచేల ధృత కాంచికాంచిత ముదంచ దంశుమణి నూపురం**
**రాసకేళి పరిభూషితం తవ హి రూప మీశ కలయామహే. 1**

వేనలిన్ నెమలిపింఛెమున్ జెవుల వ్రేలుకుండల రవిప్రభల్
శ్రీనితాంత సరసీజమాల మణిచిత్ర హారములచెల్వు వ
క్షాన గంధ ఘనసార కుంకుమ విసారి చారుతర సౌరభా
నూన మెంతును మనోజ్ఞభర్మమణి నూపురమ్ము సుమనోరమా
ప్రాణవల్లభము రాసలీల మధురస్వరూప మెద రంజిలన్.

శిఖలో నెమలిపింఛె మింపుగులుక చెవులందు మకర కుండలము లూగి శోభలు నింప వక్షమందు అందముగుల్కు వనమాలయు నవరత్నముల నానావిధకాంతుల సమ్మేళనమున మెరయు హారములు సొంపుగొన, చందనము పచ్చకర్పూరము కుంకుమపువ్వు పునుగు జవ్వాది మొదలగు పరిమళవస్తువుల కలపపుపూత నెత్తావులు నెఱప,మణులుపొదివినబంగారుటందె లందము

గూర్పు దేవతలకు లక్ష్మికిని ప్రాణప్రియమై, రాసక్రీడ చాతుర్యముచే నొప్పుగుల్కు నీ రూపసౌందర్య మాధుర్యమును భావించెదను.

**రాసోనామ బహు నర్తకీయుక్తో నృత్త విశేషః**

రాసక్రీడయనగా పెక్కుమంది నాట్యకత్తెలతో గలిసి చేయు నృత్య విశేషము. ఈ దశకమందలి వృత్తము నాట్యానుకూలమై చతురస్ర గతి త్రిపుట తాళముతో శృంగారరసానుకూలమైన రాగములలో పాడి యభినయింపదగి యున్నది. కేరళమందు 'కథాకళి' అను ప్రసిద్ధ నాట్యమందిది ఈనాడు అభినయింపబడుచున్నది. ఇది ఛందస్సులో సమ్మతావృత్తము గణములు: రనరన రనర. 21 అక్షరములు. విరామస్థానములు మూడు: 6+6+6 తెలుగు అనువాదము గూడ యిదే వృత్తములో రచింపబడినది. మరియు విరామస్థానమందు (యతియందు) అక్షరసాజాత్యమును గూడ పాటించుట తెనిగింపులో విశేషము. దీనికి సురనర్తకియనియు పేరు.

**తావదేవ కృతమండనే కలిత కంచులీక కుచమండలే**
**గండలోల మణికుండలే యువతిమండలేఽథ పరిమండలే,**
**అంతరా సకల సుందరీ యుగల మిందిరారమణ సంచరన్**
**మంజులాం తదను రాసకేళి మయి కంజనాభ సముపాదధాః.** 2

**మండితోరు పరిమండలాన వ్రజమానినీ కలిత మండలిన్**
**గండ లోల మణిక్రమ కుండ లాకల్పితోరు కుచకంచులిన్**
**దండి నొక్కొకతె దండ నొక్కఁడయి తాను నిండుకొని తన్పిరే**
**యెండగాయ విలసించి రాస మొనరించినావు మురిపించుచున్**

గోపాంగనలు చనుకట్టులందు గుత్తమగుతైకలు బిగించి, చెక్కుటద్దము నందు మణిస్థగిత కుండలములూగ, మండలాకారముగదీరి రాసక్రీడ కాయత్తమై గోపికకు గోపికకు నడుమ కృష్ణుడుగా తీరి చక్కగా సంచరంచుచు, అనగా అభినయ విన్యాసభంగిమములందు కుచ కంఠ కపోలాదులపై భుజములు హస్తములను అనించుట మూలమున మురిపించి మైమఱపించుచు నో సుందరమూర్తీ! ఇందిరారమణ! రాసలీలా విహారమునకు ఉపక్రమించితివి.

వి.వి. లీలాశుకులు కృష్ణకర్ణామృతమందు రాసక్రీడయందలి గోపికా కృష్ణవిన్యాసమును ఇట్లే వర్ణించినారు.

**అంగనామంగనా మంతరే మాధవం**
**మాధవం మాధవం చాంతరే ణాంగనా!**
**ఇత్థమాకల్పితే రాసలీలావిధౌ**
**సంజగౌ వేణునా దేవకీ నందనః**

ఒక గోపికకు నింకొకగోపికకు నడుమ కృష్ణుడు కృష్ణునికి కృష్ణునికి నడుమ గోపికయునుగా నేర్పడిన రాసలీలయందు దేవకీనందనుడు వేణువును మేళవించెను. యోగేశ్వరేశ్వరుడుగావున కృష్ణపరమాత్మ అందరి కన్ని రూపులగుటలో వింతలేదు. అష్టవిధ యోగసిద్ధులందు ఒకటైన యీశత్వము అను నీయోగశక్తినే వత్సాపహరఘట్టములో చూపి బ్రహ్మను తబ్బిబ్బు చేసెను.

**వాసుదేవ తవ భాసమాన మిహ రాసకేళి రససౌరభం**
**దూరతోఽపి ఖలు నారదాగదిత మాకలయ్య కుతుకాకులా**
**వేషభూషణ విలాసపేశల విలాసినీశత సమావృతా**
**నాకతో యుగప దాగతా వియతి వేగతోఽథ సుకరమండలీ.** 3

**వాసుదేవ! సువిభాసమాన గుణవద్విలాస రసవాసనా**
**భ్యాస మెంచి కుతుకాకుల మ్మగుచు నన్నలింపమునియాన ను**
**ల్లాస పేశలవిలాస భాసుర విలాసినీకుల కల స్వన**
**మ్మై సురాళి యొకటై వియత్పథరథాళిఁ గ్రమ్ముకొనె నంతటన్**

ఓ వాసుదేవా! నీవీ యవనిపై రాసక్రీడావినోద మాధుర్యమును బ్రదర్శించుచున్నావని నారదమహర్షి వలన నాలించి దేవత లది తిలకింప వేడుకగొని వివిధ నాట్య విశేష వేషభూషణ విలాస నేపథ్య రచనయందు నెఱజాణలైన సురాంగనలతో అప్సరసలతో గానచతురులైన గంధర్వులతో విమానములెక్కి బృందావన వీథిపైపై నాకాశపథమునందు గ్రమ్ముకొనిరి

**వేణునాదకృత తానదాన కలగాన రాగగతి యోజనా**
**లోభనీయ మృదుపాదపాతకృత తాలమేలన మనోహరమ్,**
**పాణి సంక్వణిత కంకణం చ ముహు రంసలంబిత కరాంబుజం**
**శ్రోణిబింబ చలదంబరం భజత రాసకేళి రసడంబరమ్.** 4

**పిల్లఁగ్రోవి వినిపించు తానసమవేతగాన గతి విభ్రమ**
**ప్రోల్లస న్నటన ముచ్చల త్పదపయోజ తాళలయ యోజనన్**
**ఘల్లనంగ మణి కంకణాళి పద క్రమనూపురయుగ క్వణ**
**మ్మల్ల శ్రోణిచలదంబరల్ నెఱపి రంసలంబిత కరాబ్జలై**

వేణురంధ్రములందు మృదులాంగుళివిన్యాసము సేయుచు 'తానము' అనెడి స్వరారోహణావరోహణ ప్రక్రియా విశేషముతో గూడిన ఆయా రాగాలాపన రూపమైన పాటయొక్క గతివిలాస మనుసరించి పాదపద్మములచే తాళము వేయుచు లయను అనుసంధించి మణికంకణములు, పాదముల యందెలును మ్రోయగా, పిఱుదులందు కోకలు చెదరగా ప్రక్కనున్న కృష్ణుని భుజము లూతగొని గోపికలు నృత్యము సేసిరి.

వి.వి. కంఠేనాలంబయేద్గీతం పాదాభ్యాంతాళ మాచరేత్!
చక్షుర్భ్యాందర్శయేద్భావం హస్తాభ్యా మర్థమాదిశేత్

అను భరతరసప్రకరణోక్త లక్షణముంబట్టి యిక్కడ ఆయా యవయవములచే నాయాప్రక్రియ అనగా వేణువున సంగీతము, పాదములచే తాళము,కరములం దర్థాభినయము, మొదలగు నాట్యవిశేషములు సూచింపబడినవి.

శ్రద్ధయా విరచితాను గాన కృత తారతార మధురస్వరే
నర్తనేఽథ లలితాంగహార లులితాంగరాగ మణిభూషణే .
సమ్మదేన కృతపుష్పవర్షమల మున్మిషద్దివిషదాంకులం
చిన్మయే త్వయి నిలీయమాన మివ సమ్ముమోహనవధూకులమ్. 5

**తారతార విధృత స్వరానుగతధన్యగాన మధుధారలన్**
**దారహార లలితాంగహార లులితాంగరాగ సముదారతా**
**పూరమై సురలు పూలవానలను ముంచి పొంచి కని పొంది ర**
**జ్ఝారె! నీయెడల సచ్చిదాత్మక రసానుభూతి వివశస్థితిన్**

కుతూహలముతో నంతంతకు తారస్థాయినందుకొనునట్లు రాగమధురముగ వంతపాడుచు, ముత్యాలహారములచే అంగహారములు అనగా అవయవముల యొక్క కదలికలచేతను గూడ అల్లల్లన చిందికొను చందనాదుల పూతలచే

నుదాత్త సౌందర్య ప్రవాహమైన యా రాసలీలంగని దేవతలు పుష్పవృష్టి గురిపించి పొంచి పొంచి చూచుచు (మానవలోకమున కింతమున్నెన్నడు తమకుగూడలేని యీలాటియపూర్వభాగ్యము పట్టెనని సిగ్గుచే పొంచిపొంచి చూచుట) సచ్చిదానందాత్మక బ్రహ్మరసానుభవముచే గల్గిన మైమఱపు నీయెడల పొందిరి అనగా నీలో లీనమయిరన్నమాట

స్విన్న సన్న తనువల్లరీ తదను కాऽపి నామ పశుపాంగనా
కాంత మంస మవలంబతే స్మ తవ తాంతిభారముకులేక్షణా,
కాచి దాచలితకుంతలా నవపటీరసార ఘనసౌరభం
వంచనేన తవ సంచుచుంబ భుజ మంచితోరుపులకాంకురా. 6

తీవబోణి మెయితీవ లేఁజెమట దేరి సోలి శ్రమఁదేలి కన్
గ్రేవ మూఁతవడ కేల నీభుజ మొకించు కానుకొని కేరి కె
మ్మోవి ముద్దుగొని పుల్కరించె నిను మోడిసేసి యతి మోహన
శ్రీ విలాసయయి చేరి నీభుజము శ్రీపటీరరససేవధిన్

ఒక లలితాంగి తీగవంటి శరీరమందు చిఱుచెమటలొలయ నాట్యశ్రమచే సోలి ఆనందపారవశ్యముచే కన్నులరమోడ్పువెట్టి నీభుజము నించుక ఆనుకొని, కేరి=చెలరేగి కొండొక మిషతో నిన్ను మఱపించి అతిమోహనశోబావిలాసము నెఱపి మంచిగంధపుపూతచే వలపునించు నీబుజముదాపునకుచేరి నీ యెఱ్ఱని పెదవి ముద్దువెట్టికొని పులకరించెను

కాऽపి గండభువి సన్నిధాయ నిజగండ మాకులిత కుండలం
పుణ్యపూరనిధి రన్వవాప తవ పూగచర్విత రసామృతమ్,
ఇందిరావిహృతిమందిరం భువనసుందరం హి నటనాంతరే
త్వా మవాప్య దధు రంగనాః కిము న సమ్మదోన్మదదశాంతరమ్. 7

చెంతఁజేర్చి తన చెక్కుటద్దములఁ జింద కుండల రుచివ్రజ
మ్మంత నానె సుకృతైకసేవధి త్వదాస్యచర్విత రసామృత
మ్మింతు లిట్లుగని రెంతో యున్మదము నిందిరామణి సమీహితా
శ్రాంతవిహృతివిశ్రాంతి మందిరుఁ బరాత్పరుం గని సరాగలై

కొండొకనెపమున నీ దాపునకుజేరి నీ చెక్కిటి మణికుండలకాంతులు విందుకొన తనచెక్కిలి నానించి నీముఖమందలి తాంబూలపు తమ్మి రూపమునానందామృతము గ్రోలి ఒక అనిర్వచనీయమైన చొక్కును (మైమఱపును) ఒక గోపిక పొందెను. మహాలక్ష్మి విహరించు విశ్రాంతి మందిరమైన పరమాత్మను నిన్నుగని నీయెడ వలపు లగ్గలమై వారు పొందిన యనుభూతి అద్భుతము.

**గాన మీశ విరతం క్రమేణ కిల వాద్యమేలన ముపారతం**
**బ్రహ్మసమ్మద రసాకులా స్సదసి కేవలం సనృతు రంగనాః,**
**నావిద న్నపిచ నీవికాం కిమపి కుంతలీమపి చ కంచులీం**
**జ్యోతిషామపి కదంబకం దివి విలంబితం కి మపరం బ్రువే. 8**

**ఆగె గాన మట నాగెవాద్యము క్రమాప్తి బ్రహ్మమయ మద్భుత**
**శ్రీగడించి మఱి నృత్యమాత్ర మొనరించి రందెఱుఁగ రేకదా!**
**వేగమం దెడలువేణి త్రైకముడి వీడి పోకముడి వీడుటల్**
**ఆగిపోయె దివి నన్ని వెల్గు లవురౌర! చిత్రమిది యౌననన్**

నృత్యాభినయములయిన తరువాత కొంతవడికిగల్గిన పారవశ్యముచే సంగీతము పాడుట వాద్యముల మేళవింపు మొదలయినవి ఆగిపోయెను. కేవల నృత్యము సేసిరి. తాండవమనుపేర జరుగు నీ ముక్తాయింపు లోక ప్రసిద్ధము. ఇక్కడ గోపాంగనలు కేవల బ్రహ్మానందవిలీనలయినందున కొంచెమేనిబాహ్యప్రవృత్తి లేనందున, నర్తనవేగములో కొప్పు వీడుటను నీపైమోహముచే గబ్బిగుబ్బలుబ్బినకతన త్రైకముడి విడిపోవుటను, పోకముడి విశ్లథమగుటను గూడ యెఱుంగలేరైరి. మఱియు నారేయి నక్షత్రతారాగ్రహాది జ్యోతిర్మండలము నడక ఆగిపోయెను. అదియొక అపూర్వమైన దీర్ఘరాత్రి. ఆ భగవద్విలాసములో సచ్చిదాత్మక కేవల బ్రహ్మానుభవము దేశకాలాద్య పరిచ్ఛిన్నము గావున కాల గణనమునకు నిమిత్తమైన జ్యోతిశ్చక్రమెల్ల నిష్క్రియమై స్తంభించి దేశకాల విభాగము అంతరించి యొకానొక యనిర్వచనీయశాంతిస్థితి యేర్పడెనని భావము. యుగయుగములు జరిగిపోయిన యీ రాసలీలావిహారము జరిగిన అప్రాకృత యామినీవిశేషమునకు (విభావరికి) బ్రహ్మరాత్రమని సంకేతము.

మోదసీమ్ని భువనం విలాప్య విహృతిం సమాప్య చ తతో విభో
కేళి సమ్మృదిత నిర్మలాంగ నవఘర్మలేశ సుభగాత్మనామ్,
మన్మథాసహనచేతసాం పశుపయోషితాం సుకృత చోదిత
స్తావదాకలితమూర్తి రాదధిథ మారవీరపరమోత్సవాన్. 9

మేదినిన్ సొలపు మేర ముంచి వగ మించి కేళి విరమించి యా
మీద నొత్తిడుల మేన్దెమర్ప నెఱి మించుబోణులకు మీన కె
తూదయమ్మయిన నొక్కొకర్తెదరి నొక్కొకండయి రసోత్సవ
మ్మాదటన్ నెఱపి తందఱందర పురార్జితాభ్యుదయ మౌననన్

అశేషభువనములను ఆనందపరమావధిలో ముంచి నాట్యవిహారము విరమించి, రాసక్రీడా పరిశ్రమచే నలుగుడువడి చిఱుచెమటవట్టిన మేనులచే నింపుతులకింప మన్మథలీల కింతరాయము సహింపలేక తత్తరపడుచున్న యాపడుచులందర కన్నిరూపములు ధరించి వారి పురాకృతసుకృతముచే (అదృష్టముచే) నెన ప్రేరణచే భువనైకసుందరుడనైన నీ వాసుందరులకు రాసోత్సవము ననుగ్రహించితివి

కేలిభేదపరిలోలితాభి రతిలాలితాభి రబలాలిభిః
స్వైర మీశ నను సూరజాపయసి చారు నామ విహృతిం వ్యధాః,
కాననేఽపి చ విసారి శీతల కిశోర మారుతమనోహరే
సూనసౌరభమయే విలేసిథ విలాసినీశతవిమోహనమ్. 10

వింతకేళి మురిపించి ముచ్చటలువించి లాలనము వెంచి నీ
వంత యామున వనాంతకేళుల నితాంత సౌరభలతాంత శ
య్యాంత పాళుల ననంతలీలల సుహాసినీశత మహాద్భుత
మ్మెంతో సేసితివి యించువిల్తుని సమీర మింపు లొలయింపగన్

యామునవనాంతరములందు నీవాగోపికలకు ఆలింగన చుంబన ప్రహరణ దంతక్షత నఖక్షత సీత్కారాది విలాసములచే నెనలేని వేడుకలు గూర్చి మురిపించి లాలించి ఆ అబలలతో జలక్రీడావిహారములు సేసితివి అటుమీద యమునోపవనములందు పుష్పాపచయాది వనవిహారములు గావించితివి. అటుపై లేతచిగురులు పువ్వులు పరచి యేర్పరచిన శయ్యలందు మందమంద మలయవాయువులు విసరి నెత్తావులునించి హాయిగొల్పు తావులందు మన్మథు

నింతింతనరానివానిగా నొనరించితివి. అనగా గోపికలయందు మన్మథోద్దీపనము గావించి సమ్మోహింపచేసితివి.

వి.వి: ఇచట మలయవాయువు ప్రసక్తిచే శాంతికళ సూచింపబడి, అందు పరమాత్మయొక్క గుణభానముగల యొకానొక స్థితి అభివ్యక్తము సేయబడినది.

**కామినీ రితిహి యామినీషు ఖలు కామనీయకనిధే భనాన్**
**పూర్ణసమ్మద రసార్ణవం కమపి యోగిగమ్య మనుభావయన్,**
**బ్రహ్మ శంకరముఖా నపీహ పశుపాంగనాసు బహుమానయన్**
**భక్తలోక గమనీయ రూప కమనీయ కృష్ణ పరిపాహి మామ్. 11**

**అట్టియామినుల నాత్మభామినుల కౌర! యందముల కందమై**
**యట్టె యోగి హృదయైకగమ్యమగు నద్వయామృతరసాబ్ధి చేఁ**
**బట్టఁజేసి పశుపాలకాంగనల బ్రహ్మముఖ్యులు సెబాస్ బలే**
**పట్టటంచుఁ గొలువంబొనర్చితివి భద్రమూర్తివి కృపానిధీ!**

ఇట్లు పండువెన్నెల రాత్రివేళ పశుపాలకాంగనలను (ఇది వారి అనధికారమును సూచించును) యోగిహృదయమాత్ర గమ్యమగు అద్వైత బ్రహ్మనంద సంపూర్ణమహార్ణవమునం దోలలాడించి అధికారులైన సకలదేవాధీశ్వరులను బ్రహ్మను శంకరులను గూడ "ఆహా ఈ పశులకాపరులతో కాపురములు సేయు నీపుణ్యాంగనల పుణ్యమేమొకో" యని అచ్చెరువంది మెచ్చుకొనునట్లు సేసితివి. నీవు భక్తజనభద్రమూర్తివి, కృపానిధివి కావున మాయెడ కృపసూపి భద్రములను (మంగళసూత్రములను) అనుగ్రహింపుమని భావము.

వి.వి: యోగి హృదయగమ్యము అనుటలో "హృదామనీషా మనసాభిక్లప్తి" అను ఉపనిషద్వాక్యము జ్ఞాపకము చేయబడినది. బ్రహ్మానుభవము హృదయముచేతనే అభివ్యక్తమని శ్రుతిహృదయము మఱియు నిట హృదయశబ్దము దహరాకాశమును సూచించును. అది పరమాత్మయొక్క శాంత్యతీతకళాస్థానము. అది కేవల నిర్గుణస్థితి యోగిమాత్రగమ్యము యోగీశ్వరేశ్వరుడు జగద్గురువునగు కృష్ణపరబ్రహ్మము పూర్ణపుణ్యావతారము కావున ప్రవృత్తినివృత్తులనడుమ సంధ్యాస్థానమందుండి గోపికలకా శాంత్యతీత కలాస్థానమున రాసక్రీడయొక్క పరమావధిగా అభయరూపమైన అద్వైతమునే అనుగ్రహించిరని యిచట రహస్యము.

## 70 వ దశకము

# సుదర్శన శాపమోక్షము, శంఖచూడాను శాసనము, వృషభాసుర సంహారము

**ఇతి త్వయి రసాకులం రమితవల్లభే వల్లవాః**
**కదాఽపి పుర మంబికాకమితురంబికాకాననే,**
**సమేత్య భవతా సమం నిశి నిషేవ్య దివ్యోత్సవం**
**సుఖం సుషువు రగ్రసీ ద్వ్రజప ముగ్రనాగస్తదా.** 1

రాసక్రీడను నీవుగోపికలతో రంజించుచో, గోపు లు
ల్లాసమ్మందుచు నంబికావనమునన్ లక్షించి యా శంకరా
వాస మ్మచ్చటి యుత్సవమ్ముల నిశల్ వర్తించి నీతోడ ని
ద్రాసక్తింగొన, నుగ్రనాగ మొకఁడంతన్ మ్రింగె నా నందునిన్

ఇట్లు గోపికలను రసతన్మయల నొనరించుచుండగా గోపకులు అంబికా వనమనెడి శివక్షేత్రమందు నీతో గలిసి శివరాత్రి మహోత్సవమును సేవించి నిద్రవోయిరి. అపుడొక క్రూరసర్పము అజగరము-కొండచిలువ నందుని గఱచెను.

**సమున్ముఖ మథోల్ముకై రభిహతేఽపి తస్మిన్ బలా**
**దముంచతి భవత్పదే న్యపతి పాహి పాహీతి తైః,**
**తదా ఖలు పదా భవాన్ సముపగమ్య పస్పర్శ తం**
**బభౌ సచ నిజాం తనుం సముపసాద్య వైద్యాధరీమ్.** 2

**కొఱవులఁ జూఁడి రయ్యహిని గోపకు; లంతకు వీడకున్న, వా**
**రఱచిరి 'పాహి పాహి' యని, యంతట నీ వరుదెంచి యంఘ్రిన**
**త్తఱి స్పృశియించినాఁడ, వదియున్ దొలిమేను త్యజించి నీదుముం**
**దఱ నటియించె నద్భుతము! దాను నొకానొక దేవయోనియై.**

గోపకులు ఆ సర్పమును కొఱకంచులతో గాల్చిరి. అయిన నది వదలిపెట్టనందున రక్షింపు రక్షింపుమని నీ పాదములపై బడిరి. అంతట నీవరుదెంచి దాన్ని స్పృశింపగా నద్ది విద్యాధరస్వరూపము నొందెను.

సుదర్శనధర! ప్రభో! నను సుదర్శనాఖ్యోఽస్మ్యహం
మునీన్ క్వచి దపాహసం త ఇహ మాం వ్యధు ర్వాహసమ్,
భవత్పదసమర్పణా దమలతాం గతోఽస్మి త్యసౌ
స్తువన్ నిజపదం యయౌ వ్రజపదంచ గోపా ముదా. 3

ప్రోచి తహో! సుదర్శనధరుండవు నేను సుదర్శనుండ; ము
న్నేచి హసించి సన్మునుల నిట్టిదశం బడినాఁడ; నీపద
శ్రీ చిగిరించె నింత మును జేసిన పుణ్యమటంచుఁ బల్కి యా
త్మోచితధామ మొందె, మఱి యొందిరి గోపకులాత్మ ధామమున్

ఓ సుదర్శనధరా! ప్రభూ! నేను సుదర్శనుండనువాడను. ఒకప్పుడు మునులను పరిహసించితిని. వారు అజగరము గమ్మని శపించిరి. నీ పాదము తాకినంతట శాపమోక్షమందితిని అని తెలిపి విద్యాధరలోకమున కేగెను. గోపాలురు నిజనివాసముల కెగిరి.

కదాఽపి ఖలు సీరిణా విహరతి త్వయి స్త్రీజనై
ర్జహార ధనదానుగ స్స కిల శంఖచూడోఽబలాః,
అతిద్రుత మనుద్రుతస్త మథ ముక్త నారీజనం
రురోజిథ శిరోమణిం హలభృతే చ తస్యాదదాః. 4

హలియును నీవు గోపికలు నవ్వనిలో విహరించుచుండగాఁ
జెలులఁ హరించె నా ధనదుసేవకుఁ డొక్కఁడు శంఖచూడుఁ, డా
ఖలు వడి నాపి వెంటబడి కాంతల ముక్తలఁ జేసి తచ్ఛిరః
కలితమణిం గ్రహించి మణి కంజదళాక్ష! యొసంగి తన్నకున్.

ఒకప్పుడు బలరాముడు నీవును విహరించుచుండగా కుబేరుని మిత్రుడు శంఖచూడుడనువాడు నీ స్నేహితురాండ్రను గోపికలను హరించెను. నీవు వాని వెంబడించి దఱుముకొనివెళ్ళి వారినివిడిపించికొని వాని శిరోమణిని గొనివచ్చి బలరామునిి కొసంగితివి.

దినేషు చ సుహృజ్జనై స్సహ వనేషు లీలాపరం
మనోభవమనోహరం రసిత వేణునాదామృతమ్,

**భవంత మమరీదృశా మమృతపారణాదాయినం**
**విచింత్య కిము నాలపన్ విరహతాపితా గోపికాః. 5**

**హరి! చెలికాండ్రతోడ పవలంత వనాంతములన్ విహారసుం**
**దరుఁడగు నిన్నిలింపలలనా నయనామృత మాధురీపరి**
**స్ఫురణు మనోజ మోహనుని పూరితవేణురవామృతున్ రసా**
**భరణుఁ డలంచి గోపికలు పల్కని దేమి వియోగ తప్తలై**

పగలెల్ల నీవు జతగాండ్రతో బృందావనమందు విహరించుచుండగా, దేవతాంగనలు కన్నుల కమృతపర్వమయిన యందగాని నిన్నును నీ వేణునాద మాధుర్యమును భావించుచు నిండ్లలోనుండి విరహవేదనం బడి పలురీతుల వాపోయిరి.

**భోజరాజభృతక స్త్వథ కశ్చిత్ కష్టదుష్టపథదృష్టి రరిష్టః,**
**నిష్ఠురాకృతి రపష్ఠునినాద స్తిష్ఠతేస్మ భవతే వృషరూపే. 6**

**భోజవల్లభు భృత్యాధముం డొకండు**
**దుష్టమార్గైకదృష్టి యరిష్టమగుచు**
**నిలిచె ఱంకెలు వేయుచు నీకునై భ**
**యంకరాకృతి మున్ వృషభాకృతియయి.**

భోజరాజు సేవకుడు పరహింసాపరుడు నగు నొకడు వృషభరూపమున ఘోరముగ ఱంకెవేయుచు నీదారిలో నిలువబడెను.

**శాక్వరోఽథ జగతీధృతిహారీ మూర్తిమేష బృహతీం ప్రదధానః,**
**పంక్తిమాశు పరిఘూర్ణ్య పశూనాం ఛందసాంనిధి మవాప భవంతమ్. 7**

**శాక్వరము జగతి ధైర్యము సడలఁజేసి**
**బృహతి యగు మూర్తి ధరియించి యెల్ల వసుల**
**పఙ్క్తిఁ గలగుండువఱచి యాపైని నిన్ను**
**జేరె ఛందోనిధిన్ వృత్త చిత్ర మగుచు.**

శాక్వరము=వృషభము, జగతి=భూమియొక్క, ధృతిహారీ=ధైర్యమును సడలింపజేసి, బృహతి=పెద్దదియగు మూర్తిని ధరించి, ఎల్లపసుల పఙ్క్తిని=పశువుల సమూహమెల్ల క్షోభింపజేసి, ఛందోనిధిన్=వేదగర్భుడవైన నిన్ను వృత్తచిత్రము అగుచున్= గుండ్రముగా దిరుగుచు చేరెను. శ్లేష: ఛందోనిధివి అనగా, జగతి మొదలగు వృత్తములకు పద్యములకు నిధివైనవానిని, శాక్వరము-జగతి-ధృతి పఙ్క్తి అను పేరుగల ఆయా వృత్తభేదములను రచింపగల ఛందోనిధిని=కవిని ఓడించుటకు వచ్చిన కుకవివలె నీపై కెత్తివచ్చెనని శబ్దశ్లేష చమత్కారము.

**తుంగశృంగముఖ మాశ్వభియంతం సంగ్రహయ్య రభసా దభియంతమ్,**
**భద్రరూప మపిదైత్య మభద్రం మర్దయ న్నమదయః సురలోకమ్. 8**

**పొడవడరు మేటి శృంగాగ్రములను బొడువఁ**
**బైఁబడుచు భద్రరూపుఁడై వఱలియును న**
**భద్రుఁడై యున్న రక్కసుం బట్టి కిట్టి**
**యపుడ మర్దించి సురలోక మంపినావు.**

జడియక సుదీర్ఘములైన కొమ్ములతో నినుబొడువబోవుచున్న భద్రరూపుని=వృషభ స్వరూపుడైయున్న, అభద్రుని=దుష్టుని చేతితోబట్టి మర్దించి చంపితివి. ఇక్కడ భద్రరూపుడయ్యు-అభద్రుడైనవాడు అనుటవలన నిది శ్లేషానుప్రాణిత మైన విరోదాభాసాలంకారము.

**చిత్రమద్య భగవన్ వృషఘాతాత్ సుస్థిరాజని వృషస్థితి రుర్వ్యామ్,**
**వర్ధతే చ వృషచేతసి భూయాన్ మోద ఇత్యభినుతో సి సురై స్త్వమ్. 9**

**చిత్ర మీనేటి వృషభ నిష్పేషణమున**
**సుస్థిరమ్మయ్యె వృష సమావస్థితి ధర**
**వృషమనోహర్ష పరమ సమృద్ధి యయ్యె**
**ననెడి గీర్వాణ వినుతి గమ్యార్థ మైతి.**

వృషవినిష్పేషణమున=వృషభసంహారముచే భూమియందు వృష సమావస్థితి= ధర్మముయొక్క నిలుకడ సుస్థిరమయ్యెను. దానిచే వృష

మనోహర్షము = ఇంద్రుని మనసునకు ధర్మమునకు గూడ ఆనందసమృద్ధి యేర్పడెను అని దేవతలు నిన్ను స్తుతించిరి. ఇక్కడ వృషభశబ్దమునకు గల వృషభము-ఇంద్రుడు-ధర్మము అను నానార్థము లనుసరించి శ్లేషకల్పనము చేయబడినది.

ఔక్షాణి పరిధావత దూరం వీక్ష్యతా మయ మిహోక్షవిభేదీ,
ఇత్థ మాత్తహసితై స్సహ గోపై ర్గేహగస్త్వమవ వాతపురేశ. 10

పశువిభేది యిడుగొ ప్రత్యక్షమైనాఁడు
పాఱిపొండు పసువులార! యనుచు
మేలమాడు గోప బాలురతోఁగూడి
యింటి కేగినాఁడ, వేలుకొనర!

పశుసంహారకుడు అడుగో ఓ పశువులు! పారిపొండని గోవులను సంబోధించి పలుకుచు హాస్యము చేయు మిత్రులగు గోపాలురతో గృహమునకేగితివి. స్వామీ నన్ను పాలింపుము.

# 71 వ దశకము

# కేశిమథనము

యత్రైష సర్వే ష్వపి నావకేశీ కేశీ స భోజేశితు రిష్టబంధుః,
త్వం సింధుజావాప్య ఇతీవ మత్వా సంప్రాప్తవాన్ సింధుజ వాజిరూపః. 1

హరిని నిన్ సింధుజాప్తుగా నరసి యేమొ
తాను నొక సింధుజాశ్వమై దరిసె నిన్ను
కంసునికి నిష్ట బంధుండు క్రౌర్యరాశి
కేశి విశ్వోద్యమానవకేశి యగుచు.

నిన్ను సింధుజా=సముద్రుని కూతురగు మహాలక్ష్మికి, అప్తగా=బంధువుగా నరసికాబోలు, కంసబంధువగు నొకదుష్టుడు కేశియనువాడు సింధుజాశ్వమై= సింధుదేశమందు బుట్టిన గుఱ్ఱమై (సైంధవమై) నీమీదికి వచ్చెను.

**గంధర్వతా మేష గతోఽపి రూక్షై ర్నాదై స్సముద్వేజిత సర్వలోకః,**
**భవద్విలోకావధి గోపవాటీం ప్రమర్ద్య పాపః పునరాపత త్త్వామ్. 2**

**వాఁడు గంధర్వమూర్తియై కూడ క్రూర**
**హేషియై సర్వజన భయోన్మేషి యగుచు**
**బెరసి వ్రేపల్లెఁ గలఁచె నీ దరిసెన మ్మ**
**దెంతదాక లభించునో యంతదాక.**

వీడు గంధర్వతాం=గుఱ్ఱముయొక్క స్వరూపము, గతోపి=పొందియు కూడ, శ్లేష=దేవతావర్గములో చేరిన గంధర్వుడైకూడ క్రూరముగ సకిలించుచు నెల్లరకు వెఱపుగొలుపుచు నీ దర్శనమగునంతవరకు అనగా యీనాటివరకు వ్రేపల్లెను బాధించి యిపుడు నీకంట బడెను.

**తార్క్ష్యార్పితాంఘ్రే స్తవ తార్క్ష్య ఏష చిక్షేప వక్షోభువి నామ పాదమ్,**
**భృగోః పదాఘాతకథాం నిశమ్య స్వేనాఽపి శక్యం తదితీవ మోహాత్. 3**

**తార్క్ష్యుపై పాదమూను త్వద్వక్షమందుఁ**
**దన్నెఁ దార్క్ష్యుండు తనదు పాదమ్ము నెత్తి**
**మును భృగుమహర్షి నిన్ను దన్నిన చరిత్ర**
**వినెనొ, యటు సేయ శక్యమౌ ననెనొ తనకు!**

ఈతార్క్ష్యుడు=రాక్షసుడు, తార్క్ష్య=గరుత్మంతునియందు, అర్పిత=ఉంచబడిన, అంఘ్రేః=పాదముగల నీయొక్క, వక్షోభువి=వక్షమునందు, పాదం=పాదము, చిక్షేప=విసరెను. అనగా నిన్ను తన్నెను. మున్ను భృగు మహర్షి తన పాదముచే నీఱొమ్ముపై తన్నినట్లు తానుగూడ చేయుటకు శక్యమగునని వాడు పొరబాటువడి యిట్లు చేసియుండును.

**ప్రవంచయ న్నస్య ఖురాంచలం ద్రా**
**గముం చ చిక్షేపిథ దూరదూరమ్,**

**స మూర్ఛితోఽపి హ్యతిమూర్ఛితేన**
**క్రోధోష్మణా ఖాదితు మా(ద్రుతస్త్వామ్.** 4

**కదము త్రొక్కించి కికురించి కడకు విసరి;**
**తతఁడు మూర్ఛిలి మూర్ఛిలనట్టి పగను**
**సగము సచ్చియుఁ జావని పొగరుతోడ**
**మ్రింగవలెనంచు నీ మీఁది కంగవించె.**

నీవా గుఱ్ఱమును కదముత్రొక్కించి చివరకు విసరి పారవైచితివి. వాడు మూర్ఛపోయి కూడ కసితీరక, సగము సచ్చికూడ చావని పొగరుతో నిన్ను మ్రింగవలెనని నీ మీదికి దూకెను.

**త్వం వాహదండే కృతధీశ్చ వాహా**
**దండం న్యధా స్తస్య ముఖే తదానీమ్,**
**తద్వృద్ధిరుద్ధశ్వసనో గతాసుః**
**సప్తీభవ న్నప్యయ మైక్య మాగాత్.** 5

**వాహము దండము కోరియు**
**వాహాదండమ్ము గొలుప వదనమునన్ వా**
**య్వాహతి సప్తీ భావ**
**మ్మై హర్వొందియును జిత్ర మైక్యమ్మందెన్**

నీవు వాహము యొక్క అనగా గుఱ్ఱముయొక్క, దండము=దండించుటను కోరియు, వాహాదండమును=నీ బాహుదండమును (దండమువలె దీర్ఘమైన బాహువును) వాని నోటియందు దూర్చితివి. ఆచేయి ఉబ్బి, వాడు ఊపిరాడక సప్తీభవన్+అపి=గుఱ్ఱమై ప్రాణముంబాసి, ఐక్యమ్ గతః=అనగా నీలో నైక్యము నందెను. రెండవ యర్థము సప్తీభవన్ అపి=ఏడు ముక్కలైకూడ, ఐక్యము=ఒక్కడగుటను, ఆగాత్=పొందెను. ఇది శ్లేషచే కల్పింపబడిన విరోధాభాసాలంకారము.

**ఆలంభమాత్రేణ పశోః సురాణాం**
**ప్రసాదకే నూత్న ఇవాశ్వమేధే,**

**కృతే త్వయా హర్షవశాత్ సురేంద్రా**
**స్త్వాం తుష్టువుః కేశవనామధేయమ్. 6**

పశువు నాలంభముననె సుపర్వ సుప్ర
సాదమౌ నశ్వమేధ మాశ్చర్య మీవు
సేయ, హర్షాన గీర్వాణ నాయకులు ని
ను న్గణించిరి కేశవాఖ్య న్గుణించి.

కేశినం-అసురం హతవా నితి కేశవః=కేశియను రాక్షసుని సంహరించిన వాడు గావున కేశవుడు అని విష్ణునికి పేరువచ్చెను. ఆశబ్దము మీద శ్లేషచమత్కారమిది. అశ్వమేధయాగమందు పశువుయొక్క ఆలంభనముచే= హింసచే సుపర్వ సుప్రసాదము అగును. అనగాదేవతలు ప్రసన్నులగుదురు. అందువలన నీవు చేసిన యీ క్రొత్తరకమైన అశ్వమేధమునందు చేసిన యీ కేశిరూపమైన అశ్వసంహారము మాత్రమున దేవతలకు తృప్తికలిగి వారునిన్ను కేశవుడను పేర పేర్కొని స్తుతించిరి.

**కంసాయ తే శౌరిసుతత్వ ముక్త్వాతం తద్వధోత్కం ప్రతిరుధ్య వాచా,**
**ప్రాప్తేన కేశిక్షపణావసానే శ్రీ నారదేన త్వ మభిష్టుతోఽ భూః. 7**

కంసునికి నిన్ను వసుదేవు కన్న బిడ్డ
యని యెఱింగించి యతని జంపను జనంగ
వాని వారించి మాటలోవచ్చి కేశి
ముక్తి తర్వాత సురమౌని పొగడె నిన్ను.

నారదుడు నీవు వసుదేవుని కుమారుడవని కంసునికి దెలిపి, కంసుడా వసుదేవుని జంపబోగా వలదని నివారించి, వచ్చి కేశిసంహారమయిన తరువాత నిన్ను కీర్తించెను.

**కదాపి గోపైః సహ కాననాంతే నిలాయన క్రీడనలోలుపం త్వామ్,**
**మయాత్మజః ప్రాప దురంతమాయో వ్యోమాభిధో వ్యోమచరోపరోధీ. 8**

మున్ను చెలు లీవు దాఁగుడుమూఁత లాడు
సరణి నుండంగ వని వియచ్చర విరోధి

వచ్చె మయు నాత్మజుండు దుర్వార మాయుఁ
డెగసి వ్యోమాభిధుండు దుండగుఁడు వాడు.

నీవును నీ మిత్రులను దాగుడుమూతలాడుచుండగా దురంతమాయావి యగు వ్యోముడను దేవతల విరోధి మయుని కుమారుడు నీదగ్గరకు వచ్చెను.

స చోరపాలాయిత వల్లవేషు చోరాయితో గోపశిశూన్ పశూంశ్చ,
గుహాసు కృత్వా పిధధే శిలాభి స్త్వయాచ బుధ్వా పరిమర్దితో ఽభూత్. 9

ఆట దొరలయి దొంగలై యాడు నీదు
వారిలో తోడిదొంగయై చేరి వారి
నాల దొంగిలి గుహ డాచి రాలు ద్రోచె
నెఱిఁగి యావును వాని మర్దించినావు.

ఆ దాగుడుమూతలాటలో కొందరు గోపాలురు దొంగలు, కొందరు దొరలునైరి. మయుని కొడుకు వాడుమాత్రము దొంగగా నటించుచు గోపాలురలో జేరి ఆలమందలను దొంగిలించుకొనిపోయి, ఒక గుహలో దాచి, పైని రాతిబండలను మూతవేసెను. అది గ్రహించి నీవు వానిని మర్దించితివి.

ఏవంవిధై శ్చాద్భుతకేలిభేదైరానంద మూర్ఛా మతులాం వ్రజస్య,
పదేపదేనూతనయన్న సీమాం పరాత్మరూపిన్ పవనేశ పాయాః. 10

ఈవిధములౌవిచిత్ర కేళీవిలాస
ముల నఖండ ప్రమోద సంమూర్ఛఁబదప
ద క్షణక్షణ నవ్య నవ్య క్షణమ్ము
నర్చితివి గోకులమ్ము, నన్ గావ గదర!

ఇట్లు చిత్రాతిచిత్రములైన లీలలు చేసి గోపాలురను ప్రతిపదమందును హద్దు లేని ఆనందములో వివశులను గావించి క్షణక్షణ నూతనమైన యుత్సవము గావించితివి. ఓ గురుపవనపురవాసీ నను పాలింపుము.

# 72వ దశకము

## అక్రూరభాగ్యము

కంసో౽థ నారదగిరా వ్రజవాసినం త్వా
మాకర్ణ్య దీర్ణహృదయ స్సహి గాందినేయమ్,
ఆహూయ కార్ముకమఖచ్ఛలతో భవంత
మానేతు మేన మహినో దహినాథశాయిన్! 1

అంతన్ గంసుఁడు నారదోక్తి విని నీ వామందలో నున్న వృ
త్తాంతమ్మున్, జలియించి స్వాంతము, ధనుర్యాగమ్ము పేర్పెట్టి ని
న్నంతన్ వెంటనె వెంటఁబెట్టుకొని రా నంపించె నక్రూరునిన్
శాంతున్ దాంతు ననంతభోగిశయనా! సద్భక్తి చిత్తాయనా!

ఓ అనంతశయనా! నీవు వ్రేపల్లెలో నున్నట్లు కంసుడు నారదునివలన విని మనసుచెదరి ధనుర్యాగమను నెపమున నిన్ను దీసికొనిరమ్మని శాంతుడు దాంతుడునైన యక్రూరుని బంపెను.

అక్రూర ఏష భవదంఘ్రిపర శ్చిరాయ
త్వద్దర్శనాక్షమమనాః క్షితిపాలభీత్యా,
తస్యాజ్ఞయైవ పునరీక్షితు ముద్యత స్త్వా
మానందభార మతిభూరితరం బభార. 2

నీ దివ్యాంఘ్రిసరోజచింతనసుధా నిష్యంద సందోహ సు
స్వాదు స్వాంతుఁడె కాని తేనిభయమ్మై త్వద్దర్శనప్రాప్తి లే
కీదాకన్, నృపు నాజ్ఞనే యిపుడు నిన్నీక్షింపగాఁ గల్గి యా
హ్లాదబ్రహ్మరసప్రపూర్ణ హృదయుం డక్రూరుఁ డయ్యేన్ హరీ!

అక్రూరుడు నీ చరణధ్యాన నిరతుడేయయినను కంసరాజు వలని భయముచే నింతదాక నిను దర్శింపలేడయ్యెను. ఇపుడు రాజాజ్ఞచేతనే నిన్ను జూచుభాగ్యము సిద్ధించెనని యానందభరితుడయ్యెను.

సో౽యం రథేన సుకృతీ భవతో నివాసం
గచ్ఛన్ మనోరథగణాం స్త్వయి ధార్యమాణాన్,
ఆస్వాదయన్ ముహు రపాయభయేన దైవం
సంప్రార్థయన్ పథి న కించిదపి వ్యజానాత్. 3

అరదమ్మెక్కి యతండు నేగుచు ద్వదీయావాసమున్ బుణ్య వి
స్తరుఁడైన నీ యెడ బల్ మనోరథము లాస్వాదించుచున్ ద్రోవ నీ
శ్వరుఁ బల్రీతుల మ్రొక్కుచున్ బ్రతిపదాపాయాగమాశంక,నా
సరణిన్ విశ్వము విస్మరించెను భవత్సందర్శనోత్కంఠియై.

ఆ పుణ్యాత్ముడు రథమెక్కి యేగుచు నీయెడల అనేక మనోరథములను భావించుచు దారిలో ప్రయాణమునకు విఘ్నములు అపాయములు రానీకుమని భగవంతునికి మ్రొక్కికొనుచు నీ సందర్శమందలి యపేక్షచే ప్రపంచమునే మఱచిపోయెను.

ద్రక్ష్యామి వేదశతగీతగతిం పుమాంసం
స్ప్రక్ష్యామి కింస్విదపి నామ పరిష్వజేయమ్,
కిం వక్ష్యతే స ఖలు మాం క్వను వీక్షితః స్యా
దిత్థం నినాయ స భవన్మయమేవ మార్గమ్. 4

కనుగొందున్ శ్రుతిగీతికాశతగతిన్ గైవల్యపుం మూర్తి, న
ల్లన నాస్వామి స్పృశింతునో, కవుగిటన్ లాలింతునో, కన్గొనన్
గనునో యేమని పల్కరించునొ యెటన్ గన్పించునో నేను జే
సిన పుణ్యమ్మెటు లున్నదోయనుచుఁ జూచెన్ విశ్వమున్ నీవుగా.

వేదవాక్యములు పెక్కింటిచే పేర్కొనబడువానిని కైవల్యానందస్వరూపుని నా స్వామిని దర్శించెదను. స్పృశించెదను, కౌగిలింతును, లాలింతును; నన్ను జూచి నాదైవమేమనునో పల్కరించునో లేదో, ఎక్కడుండగా కనిపించునో నా చేసిన పుణ్యమేరీతినున్నదోయనుచు దారిలో నంతటను భావనలో నిన్నే చూచెను.

భూయః క్రమా దభివిశన్ భవదంఘ్రిపూతం
బృందావనం హరవిరించసురాభివంద్యమ్,

**ఆనందమగ్న ఇవ లగ్న ఇవ ప్రమోహే**
**కిం కిం దశా న్తర మవాప న పంకజాక్ష !** 5

**చని యల్లల్లనఁ జొచ్చి నీ చరణ సంస్పర్శమ్మునన్ బుణ్యమై**
**వినత బ్రహ్మ శివాది వంద్యమగు నా బృందావన మ్మేగి యొ**
**య్యన నానందనిమగ్నుఁడైనటుల మూర్ఛామగ్నుఁడైనట్టులున్**
**మనమం దిట్లనరాని చిత్రపరిణామ మ్మంది యక్రూరుఁడున్!**

అట్లు మెలమెల్లన నేగి నీపాదస్పర్శచే పవిత్రమై బ్రహ్మ శివాదివంద్యమగు బృందావనమున ఆనందమున మునిగి మైమఱచినట్లై మనసునందద్భుత పరిణామముం బొందెను.

**పశ్య న్నవందత భవద్విహృతిస్థలాని**
**పాంసు ష్వవేష్టత భవచ్చరణాంకితేషు,**
**కిం బ్రూమహే బహుజనాహి తదాపి జాతా**
**ఏవంతు భక్తితరలా విరలాః పరాత్మన్!** 6

**కని యల్లంతన సాగిలంబడి నమస్కారమ్ము గావించె న**
**వ్వనిలో నీ విహరించు తావులకు, నీపాదాబ్జ చిహ్నమ్ము లం**
**టిన ధూళిన్ బొరలాడె; నెంతొ ప్రజ పుట్టెన్ నాడు నీనాడునున్**
**గన నక్రూరుని బోలు భక్తి వివశుల్ గన్పింతురే యింకొరుల్?**

అట్లు సని నీవిహరించు పుణ్యస్థానములకు నమస్కారములు గావించుచు నీ పాదములందలి శంఖ చక్రాది చిహ్నములంటిన యా వనమునందలి పరాగమందు పొరలాడెను. నీ అవతారము ముందును, తరువాతను నెందఱో జనము పుట్టిరి కాని అక్రూరునివంటి భాగ్యవంతులు భక్తివివశులు మఱి కనిపింపరు.

**సాయం స గోపభవనాని భవచ్చరిత్ర**
**గీతామృత ప్రస్నుత కర్ణరసాయనాని,**
**పశ్యన్ ప్రమోదసరితేవ కిలోహ్యమానో**
**గచ్ఛన్ భవద్భవన సన్నిధి మన్వయాసీత్.** 7

**చని సాయంసమయాన గోపవనితా సంగీత దివ్యామృత**
**స్వనముల్ కర్ణరసాయనమ్ములు భవ చ్చారిత్రసాహిత్య మో**
**హనముల్ గోపకమందిరమ్ములకు బ్రహ్మానందపూర్ణాపగా**
**స్వనునీతుండయినట్టు లేగి దరిసెన్ ద్వన్మందిరాళిందమున్.**

అతడు సాయంసమయమునకు వ్రేపల్లె జేరి గోపికలు నీ లీలలను కర్ణరసాయనముగ గానము సేయుచుండగా నాలించి బ్రహ్మానందప్రవాహము తన్నునాయాసముగ గొంపోయెనా యన్నట్లు గోపమందిరములం దరిసి మీయింటి వాకిటికి చేరెను.

**తావద్దదర్శ పశుదోహవిలోకలోలం**
**భక్తోత్తమాగతి మివ ప్రతిపాలయంతమ్**
**భూమన్ భవంత మయ మగ్రజవంత మంత**
**ర్బ్రహ్మానుభూతిరససింధు మివోద్వమంతమ్.** **8**

**దరిసించెన్ బలుతోడఁ బాల్పిదుకునంద మ్మొట్టె కన్గొంచునున్**
**వర భక్తోత్తము స్వాగతమ్మొసఁగి సంభావింప నున్నట్టులున్**
**బరమబ్రహ్మరసార్ణవమ్ము హృదయాంతఃస్థాయి యుప్పొంగి ని**
**స్సరణమ్మై యెదురయ్యె నన్నటులు సాక్షాత్పూర్ణరూపున్ నినున్**

అక్కడ బలరామునితో పాలుపిదుకుచున్నట్లు, తనకు స్వాగతమీయ నున్నట్లును తనహృదయమందుప్పొంగిన బ్రహ్మానందసాగరమెదురై తన కెదుర్కోలు ఇచ్చుచున్నట్లును నున్న యాసన్నివేశములో పూర్ణరూపుడవైన నిన్ను దర్శించెను.

**సాయంతనాప్లవవిశేష వివిక్తగాత్రౌ**
**ద్వౌ పీతనీలరుచిరాంబరలోభనీయౌ,**
**నాతిప్రపంచధృతభూషణచారువేషౌ**
**మందస్మితార్ద్రవదనౌ స యువాం దదర్శ.** **9**

**సాయంస్నాన విశేష నిర్మలతనుల్ సత్పీత నీలాభ కౌ**
**శేయశ్రీ పరిధాన సుందరులు కించిన్మాత్ర భూషోత్కరా**

ధేయుల్ చారు దరస్మితార్ద్ర వదనుల్ దివ్యాంగరాగోజ్జ్వలుల్
మీ యా యిద్దఱఁ జూచె భక్తుఁడు సమున్మీలద్వృశో ద్రిక్తుఁడై.

సాయంసమయమున స్నానముచేసి పీతాంబరము నీవు, నీలాంబరము మీ యన్నయుం దాలిచి, కొలది భూషణములం ధరించి చిఱునగవులు గుల్కు నెమ్మోములతోదివ్యములయిన చందన కర్పూర కుంకుమాదులు కలిపి గూర్చిన కలపములు పూసికొని సువాసనలు నించుచున్న మీ అన్నదమ్ములను బాగుగ కన్నులు విచ్చి తేఱిపాఱ దర్శించెను.

దూరా ద్రథా త్సమవరుహ్య నమంత మేన
ముత్థాప్య భక్త కులమౌళి మథోపగూహన్,
హర్షా న్మితాక్షరగిరా కుశలానుయోగీ
పాణిం ప్రగృహ్య సబలో ఒథ గృహం నినేథ. 10

కని దూరాన రథమ్ము డిగ్గి యవనిన్ గ్రైవాలు నాభక్త మౌ
ళిని బాహుద్వయి గ్రుచ్చి యెత్తికొని యాశ్లేషించి యానంద ధో
రణి నల్పాక్షర సుందరమ్ము కుశలప్రశ్నమ్ము గావించి కే
ల్గొని కేలన్ బలరాముఁగూడి యతనిన్ గొంపోయి నా వింటికిన్.

అల్లంతదూరమందే నిన్ను జూచి అక్కడనే రథముదిగి అక్కడనుండియే వ్రాలి నమస్కరించు నీ ప్రియభక్తు నాతని నీ దీర్ఘబాహువులు సాచి యెత్తి కౌగిలించి ఆనందవశమున నెక్కువ పలుకక కుశల ప్రశ్నము మాత్ర మొనరించి నీచేయి యాతనిచేయింజేర్చిపట్టుకొని బలరామునితో గూడి నీవు మీ భవనమునకు గొంపోతివి.

నందేన సాక మమితాదర మర్చయిత్వా
తం యాదవం తదుదితాం నిశమయ్య వార్తామ్,
గోపేషు భూపతినిదేశకథాం నివేద్య
నానాకథాభి రిహ తేన నిశా మనైషీః. 11

నందునితోడ నాదరమునన్ మఱి నీవును పూజసేసి, యా
నందుని వానివార్తలు వినన్ దగురీతి ఘటించి, గోపుల

**య్యందఱు రాజు నానతియు నానతియిచ్చియు నేకశయ్య నా**
**నంద కథారతిన్ మురిసినావట రాతిరియెల్ల వానితో.**

అక్కడ నందునితోగూడి నీవును అక్రూరుని పూజించి యాయన తెలుపు వార్తలను నందుడుగూడ వినునట్లొనర్చి గోపకులకు కంసుడు పంపిన యాజ్ఞను తెలిపి, అక్రూరునితో నేకశయ్యపై పరుండి యానందముగూర్చి పెక్కు కథలు ముచ్చటించుచు నా రేయెల్ల నతనితోనే మురిసినాడవు.

**చంద్రాగృహే కిముత చంద్రభగాగృహే ను**
**రాధాగృహే ను భవనే కిము మైత్రవిందే,**
**ధూర్తో విలంబత ఇతి ప్రమదాభి రుచ్చై**
**రాశంకితో నిశి మరుత్పురనాథ పాయాః. 12**

**హరి రాఁడాయెను చంద్రికాగృహమునందా చంద్రభాగాగృహాం**
**తరమందా మఱి మిత్రవిందభవనానన్ డాగెనా! రాధికా**
**వర పర్యంక వినోది యయ్యెనొ నిశాపర్యాప్తి ధూర్తుం డటం**
**చరవిందాస్యలు సందియంపడిరి వాతాగార! నన్ బ్రోవరా!**

అట్లు నీవుండగా గోపిక లెవరికి వారు తమ యిండ్లకు రాలేదేమియని, చంద్రికయను గోపియింటనే స్వామి యారేయి యుండెనేమో! చంద్రభాగ మందిరమందాగెనేమో! రాధా పర్యంకమున వినోదించెనేమో! వట్టి ధూర్తుడు గూఢ విప్రియములు అనగా మెరమెచ్చులుచూపు శఠుడు కృష్ణుడని నిన్ను దెప్పిపోయుచుండిరి. ఓ గురువాయూరు నివాస! శ్రీనివాస! నన్ను రక్షింపుము.

# 73వ దశకము

# మథురాయాత్ర-అక్రూరునికి భగవత్సాక్షాత్కారము

**నిశమయ్య తవాథ యానవార్తాం భృశ మార్తాః పశుపాలబాలికా స్తాః,**
**కిమిదం కిమిదం కథ న్వితీమాః సమవేతాః పరిదేవితా న్యకుర్వన్. 1**

మథురాప్రయాణమున్ విని
మధురాధర లెల్ల వనరి మఱిమఱి యొకటై
మథనపడి రెట్టు లెట్లీ
వ్యథ యేమేమనియు వగచి రందఱు నదటై.

మధురకు నీ వక్రూరునితో పయనమగుచున్నావనువార్తవిని మధురాధరలు (గోపికలు) అందఱు నొకచోజేరి మథనపడి అయ్యో! ఈ వ్యథ వచ్చిపడినదని నీ విరహము శంకించి మనసు కంపించి దుఃఖించిరి.

కరుణానిధి రేష నందసూనుః కథ మస్మా న్విసృజే దనన్యనాథాః,
బత నః కిము దైవమేవ మాసీ దితి తాస్త్వద్గతమానసా విలేపుః 2

నందకుమారుఁడు కరుణా
నందనవన మిట్లు తనను నమ్మిన మన ని
య్యందఱ విడిచెను మన విధి
యందమ్మిటు తేలె ననుచు సడలిరి పడఁతుల్.

ఆ గొల్లపడుచులు నందసూనుడు కరుణచే నందనవనమువంటివాడు తనను నమ్మిన మననందఱును విడిచి వెళ్ళినాడు. ఇది ఆయనదోసము గాదు. దైవముయొక్క యందమిట్లు తేలినదని వాపోయి దైవమును తూలనాడజొచ్చిరి.

చరమప్రహరే ప్రతిష్ఠమానః
సహ పిత్రా నిజమిత్రమండలైశ్చ,
పరితాభరం నితంబినీనాం
శమయిష్యన్ వ్యముచ స్సఖాయ మేకమ్. 3

నందునితో నాప్తసుహృద్
బృందముతోఁ జనుచు నీవు వేకువ గోపీ
సుందరుల తాప ముడుప న
మందకృపన్ బంపినావు మఱి స్నేహితునిన్.

నీవు ఉషఃకాలమందు మీతండ్రి నందునితో మిత్రబృందముతో ప్రయాణమై యేగుచు నీ ప్రియసుందరులపాలి కొకస్నేహితుని (ఉద్ధవుని) దూతగా బంపినాడవు:

**అచిరా దుపయామి సన్నిధిం వో**
**భవితా సాధు మయైవ సంగమశ్రీః,**
**అమృతాంబునిధౌ నిమజ్జయిష్యే**
**ద్రుత మిత్యాశ్వసితా వధూ రకార్షీః.** 4

**త్వరలో మీ సన్నిధి కే**
**నరుదెంచెద నన్ను గలియ నగు శోభనముల్**
**జిర మమృత సింధువున నె**
**ల్లర ముంచెద ననుచు లలనలన్ దేర్చి తటన్.**

ఆయనచే "త్వరలోనే వచ్చెదను. నాతోడి సమాగమ సౌఖ్యము మీకు కలుగగలదు. ఆనందామృత సింధువున మిమ్ము ముంచెత్తెద"నని యాగోపికలకు సందేశ మంపితివి.

**సవిషాదభరం సయాచ్ఞ ముచ్చై**
**రతిదూరం వనితాభి రీక్ష్యమాణః,**
**మృదు తద్దిశి పాతయ న్నపాంగాన్**
**సబలోఽ క్రూరరథేన నిర్గతోఽ భూః** 5

**కన్నుల కబ్బిన దూరము**
**కన్నియ లటుసూచి వేడగా నాదెస క్రేఁ**
**గన్నుల నల్లనఁ జూచుచు**
**నన్నా! యేగితివి రథమునం దటు బలుతో.**

కనిపించినంత దూరము నీకై కను లప్పగించి యాకన్నియలు నీవు త్వరగా రావలెసుమా అని యాచించి విషాదముతో వెనుదిరుగ వారిపై నీ వాల్చూపులు ప్రసరింపచేయుచు బలరామునితో నీ వా రథమునం దేగితివి.

**అనసా బహులేన వల్లవానాం మనసా చానుగతో உథ వల్లభానామ్,**
**వన మార్తమృగం విషణ్ణవృక్షం సమతీతో యమునాతటీ మయాసీః 6**

మగువల మనసులు, లెక్కకు
మిగులగు శకటములు నపుడు మీ వెంటనె రాన్
మృగములు నెగులొందగ న
న్నగములు దిగులొంద దాటినాఁడవు యమునన్.

గోపవనితల మనస్సులును, గోపకు లెక్కివచ్చు లెక్కకు మిగిలిన ఆసనములు=బండ్లును నీవెంబడిని రాగా, పశువులు దిగుల వడి చూడ, చెట్లు కూడ వగజెంది వాడిపోగా యమునాతీరమున కేగితివి.

**నియమాయ నిమజ్య వారిణి త్వా మభివీక్ష్యాஉపి రథేథ గాందినేయః,**
**వివశోஉజని కిన్విదం విభో స్తే' నను చిత్రం త్వవలోకనం సమంతాత్.7**

స్నానాదుల మునిఁగి కనెన్
లోనన్, మఱి లేచి రథములోనన్,వివశుం
డైనిలిచెన్ చిత్రము విభుఁ
డౌ నీ సర్వత్ర దర్శనావాప్తి హరీ!

అక్రూరుడు సాయంస్నానానుష్ఠానములకు యమునలో మునిగి నపుడందులోను లేచి గట్టుమీదనున్న రథములోను నిన్నుజూచి నీ ప్రాప్తిరూప యోగవిభూతి కాశ్చర్యపడి యట్టె నిలిచెను.

**పునరేష నిమజ్య పుణ్యశాలీ పురుషం త్వాం పరమం భుజంగభోగే,**
**అరికంబుగదాంబుజైః స్ఫురంతం సురసిద్ధౌఘపరీత మాలులోకే. 8**

మునిఁగి మఱి పుణ్యపురుషుఁడు
గనె నిన్నున్ బరమపురుషుఁ గరకలిత గదా
ఘన శంఖ చక్ర సరసిజు
ముని సిద్ధ పరీతు భోగి భోగ వినీతున్

మఱియొకసారి మునిగి యా పుణ్యపురుషుడు మహాపురుషు నిన్ను హస్తము లందు గద శంఖము చక్రము పద్మమును ధరించి సనకాది సిద్ధులతో గూడి అనంత భోగ పర్యంకమం దొదిగి యున్న వానిం జూచెను.

స తదా పరమాత్మ సౌఖ్యసింధౌ
వినిమగ్నః ప్రణువన్ ప్రకారభేదైః,
అవిలోక్య పునశ్చ హర్ష సింధో
రనువృత్యా పులకావృతో యయౌ త్వామ్. 9

పరమబ్రహ్మసుఖాంబుధి
పరిమగ్నుం డతఁడు పొగడి బహువిధముల నిన్
దరిసెన్, నిను గనకయుఁ బ్రాక్
స్ఫురణన్ హర్షానువృత్తిఁ బులకించె హరీ!

బ్రహ్మానందసుధావారధిలో మునిగి యతడు నిన్ను పెక్కు విధముల స్తుతించి గట్టెక్కి నిన్నుజూచి హర్షవిస్ఫురణచే వివశుడై యంతలోనే మఱి నిన్ను జూడకయు ముందటి యానందముచే పులకితుడై నిన్ను జేరెను.

కిము శీతలిమా మహాన్ జలే యత్
పులకోఽ సావితి చోదితేన తేన,
అతిహర్షనిరుత్తరేణ సార్ధం
రథవాసీ పవనేశ! పాహి మాం త్వమ్. 10

చలినీళ్ళ కఱచెనో మెయి
పులకించె నటంచు నడుగ ముద ముత్కటమై
పలుకని యక్రూరునితో
నెలమిన్ జనినావు మథుర, కేలర నన్నున్.

చన్నీళ్ళలో మునుగుటచే చలినిన్ను గఱచెనా? శరీరము పులకరించె నని నీవు నీయోగవిభూతి మఱుగుపరచుటకై యడుగగా సంతోషమెక్కువై డగ్గుత్తికచే నెలుంగు కుంటుపడి పలుకజాలని అక్రూరునితో మథురకు వేంచేసితివి. అట్టి నీవు నన్నేలుము.

# 74 వ దశకము

# మథురాపురీ విహారము

సంప్రాప్తో మథురాం దనార్ధనిగమే తత్రాంతరస్మిన్ వస
న్నారామే విహితాశన స్సఖిజనై ర్యాతః పురీ మీక్షితుమ్,
ప్రాపో రాజపథం చిరశ్రుతిధృత వ్యాలోక కౌతూహల
స్త్రీపుంసోద్య దగణ్యపుణ్యనిగలై రాకృష్యమాణో ను కిమ్. 1

**హరి! నీవు మ్మథురాపురమ్ము బహిరుద్యానమ్ము మధ్యాహ్నమే**
**దరియం జొచ్చి కృతాశనుండవయి యాప్తశ్రేణితోనేగి త**
**ప్పురముం జూడఁ జిరశ్రుతిప్రవిహితామోద త్వదాలోక స**
**త్వర పౌరోద్య దగణ్యపుణ్యనిగళ వ్యాకృష్టుఁ డైనట్లుగన్**

శ్రీహరీ! మధ్యాహ్నమునకు నీవు మథురానగరము వెలుపలి యుద్యానము చేరి భోజనముచేసి మిత్రులతో చిరకాలము నిన్నుగురించి విని నిన్నుజూడ ముచ్చటగొని త్వరపడు పురప్రజలు సేసికొన్న పుణ్యములనెడి సంకెలలచే నాకర్షింపబడినవాడట్లు వెంటనే యా నగరముంజూడ నేగితివి.

త్వత్పాదద్యుతివ త్సరాగసుభగా స్త్వన్మూర్తివ ద్యోషిత
స్సంప్రాప్తా విలస త్పయోధరరుచో లోలా భవద్దృష్టివత్,
హారిణ్య స్త్వదురఃస్థలీవ దయి తే మందస్మిత ప్రౌఢివ-
న్నైర్మల్యోల్లసితాః కచౌఘ రుచివ ద్రాజత్కలాపాశ్రితాః. 2

**భవదంఘ్రిద్యుతివోలె రాగసుభగల్, త్వన్మూర్తిచందమ్మునన్**
**సువిలాసోరుపయోధర ప్రభలు, నీ చూపట్లుగాఁ జంచలల్,**
**భవదీషత్స్మిత మట్లు నిర్మలలు, నీ వక్ష మ్మటుల్ హారిణుల్,**
**నవలాల్ వచ్చిరి నీ క చద్యుతివలెన్ రాజత్కలాపల్ హరీ!**

మథురాపురాంగనలు నీచరణకాంతివలె రాగ=ఎఱుపుచే నందమైనవారు. శ్లేష:అనురాగముచే నందమైనవారు. త్వన్మూర్తి చందమ్మునన్=నీయాకారమట్లు, సువిలాస=చక్కని సొంపుగులుకు, ఉరుపయోధర=పాలిండ్లయొక్క

ప్రభలు=శోభగలవారు: శ్లేష: నీ మూర్తి మేఘముయొక్క కాంతిగలది నీ చూపులట్లు చంచలల్=నిన్ను దర్శింపత్వరపడుటచే సంచలించువారు శ్లేష: నీచూపులు చంచలములు భవదీషత్ స్మితమట్లు-నీ మందస్మితమువలె, నిర్మలలు స్వచ్ఛమైనవారు శ్లేష: నీ చిఱునవ్వుకూడ స్వచ్ఛమే నీ వక్షఃస్థలమువలె, హారిణులు=మనస్సు హరించువారు శ్లేష:నీవక్షము హారములు గలది, నీ కచద్యుతివలెన్=నీజుట్టు యొక్క కాంతివలె రాజత్కలాపల్=ప్రకాశించు భూషణములుగలవారు శ్లేష: నీ జుట్టుముడి అందముగుల్కు కలాపము నెమలిపించెముగలది ఇది శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారము

**తాసా మాకలయ న్నపాంగవలనై ర్మోదం ప్రహర్షాద్భుత**
**వ్యాలోలేషు జనేషు తత్ర రజకం కంచిత్ పటీం ప్రార్థయన్,**
**కస్తే దాస్యతి రాజకీయవసనం యాహీతి తేనోదితః**
**సద్య స్తస్య కరేణ శీర్ష మహృథా స్సోఽప్యాప పుణ్యాం గతిమ్. 3**

**పౌరస్త్రీల నపాంగదృష్టి ముదమొప్పం దేర్చి, హర్షాద్భుత**
**స్ఫారమ్మై ప్రజ సూడ నొక్క రజకున్ వస్త్రమ్ములీఁ గోరి, పో**
**పో రాజోచిత మెవ్వఁ డిచ్చునను నమ్మూర్ఖాత్ము శీర్షమ్ము నీ**
**వౌరా! త్రుంచిన, వాఁ డునుం జనియె పుణ్యశ్లోకియై సద్గతిన్**

పౌరాంగనలను నీ యపాంగప్రసారముచే నలరించి ఆనందతుందిలులై పౌరులు నిన్నే చూడగా, కంసరాజునకు వస్త్రములు చలువచేసి యిచ్చు చాకలిని గని నీవు విలువైన యావలువల నాకిమ్మని యడుగగా వాడు ఇవి రాజార్హములు నీకేమి యివి యిచ్చుటేమని నిన్నీసడింపగా వాని శిరస్సును ఖండించితివి. నీ చేతిలో జచ్చి వాడుత్తమకీర్తిశాలియై పుణ్యగతి కేగెను

**భూయో వాయక మేక మాయతమతిం తోషేణ వేషోచితం**
**దాశ్వాంసం స్వపదం నినేథ సుకృతం కోవేద జీవాత్మనామ్,**
**మాలాభిః స్తబకైః స్తవై రపి పున ర్మాలాకృతా మానితో**
**భక్తిం తేన వృతాం దిదేశిథ పరాం లక్ష్మీం చ లక్ష్మీపతే! 4**

**నీ వేషమ్మున కర్హమౌ వలువ లెంతే భక్తి నర్పింప నీ**
**తావున్ జేర్చితి సాలె; నెవ్వఁ డెఱుఁగున్ దత్తత్పురాపుణ్యముల్,**

**పూవుంగుత్తులు మాలలిచ్చి పొగడన్ బుణ్యాత్ము మాలాకరున్**
**దేవా! యేలితి భాగ్యమిచ్చి పరభక్తిన్ గూర్చి లక్ష్మీపతీ!**

ఒకసాలెవాడు నీ యందమునకు దగిన వలువలనెంచి భక్తితో నీకు సమర్పింపగా వానికి నీ స్థానమైన వైకుంఠ మనుగ్రహించితివి. వారువారు సేసికొన్న పుణ్యములు కేవలము ఫలానుమేయములు. అవి నీకుగాక మఱి యెవ్వరికి దెలియును? పూలగుత్తులు మాలలు నీకు సమర్పించి నిన్ను గొనియాడు నొక మాలాకరునికి ఐశ్వర్యమును హరిభక్తిని అనుగ్రహించితివి.

**కుబ్జా మబ్జవిలోచనాం పథి పున ర్దృష్ట్వాంగరాగే తథా**
**దత్తే సాధు కిలాంగరాగ మదదా స్తస్యా మహాంతం హృది,**
**చిత్తస్థా మృజుతా మథ ప్రథయితుం గాత్రేఽపి తస్యాః స్ఫుటం**
**గృహ్ణన్ మంజుకరేణ తా ముదనయ స్తావ జ్జగత్సుందరీమ్.** 5

**కమలాక్షిన్ గని కుబ్జ నామె యొసగంగా నంగరాగమ్ము భా**
**వమునన్ దాని కనంగరాగ ముదయింపంజేసి యయ్యింతి డెం**
**దములోనున్న ఋజుత్వమున్ దనువునన్ వ్యక్తీకరింపంగ హ**
**స్తమునన్ జేకొని యెత్తి చేసితి వహో సాక్షాజగత్సుందరిన్.**

నడుమున మెడను పాదములందు ముువ్వంకరలుదిరిగి వికృతమైన గూనుగల్గి మరుగుజ్జుగనున్న కుబ్జ, రాజునకు పరిమళద్రవ్యములతో కలపములు చేసి యిచ్చు నొక రాజదాసి రాజవీథిలో నిన్నుజూచి యా సుగంధవస్తువులను (అంగరాగములను) నీకర్పింపగా, దానికి అనంగరాగమును నీపై మోహమును ఉదయింపజేసి యామె హృదయమందు గల సూటితనమును ఆమె శరీరమందు అభివ్యక్తము అగునట్లు నీ చేతులు దాని మెడక్రింద జొనిపి నీ పాదములతో దాని పాదముల నదిమి చక్కని హస్తముతో (నొప్పికలుగ నీ మెత్తని చేతితో) యెత్తి సాగలాగి మేని వంకరలు దీర్చి జగదేకసుందరిని గావించితివి.

**తావ న్నిశ్చిత వైభవా స్తవ విభో నాత్యంతపాపా జనా**
**యత్కించి ద్దదతేస్మ శక్త్యనుగుణం తాంబూలమాల్యాదికమ్,**
**గృహ్ణనః కుసుమాని కించన తదా మార్గే నిబద్ధాంజలి-**
**ర్నాతిష్ఠం బత హా యతోఽద్య విపులా మార్తిం వ్రజామి ప్రభో!** 6

ప్రకటస్ఫూర్తి భవత్ప్రభావముల సంభావించి పుణ్యాత్ము లిం
తకు నీ నేర్చిరి శక్తి కిం దగినటుల్ తాంబూలముల్ మాలలున్
అకటా! నీ వరుదెంచు మార్గమున నే నానాడు కైమోడ్చి నీ
కొక పువ్వేనియు నీయలేనగుట నిట్లు ద్వేగినై కుందెదన్.

నీ ప్రభావములను భావించి పుణ్యాత్ములు యథాశక్తి తాంబూలమో పూలమాలయో యొకటి నీకు సమర్పించిరి. కృతార్థులైరి. ఆ నీఅవతార సమయమందు నేను పుట్టియుండ నీవచ్చుమార్గమునందు నిలుచుండి నీకు నమస్కరించి పువ్వో, పండో సమర్పించలేనైతిని. అయ్యో! ఇట్లు రోగినై ఉద్వేగినై దుఃఖించుచున్నాను.

ఏష్యా మీతి విముక్తయాఽపి భగవ న్నాలేపదాత్ర్యా తయా
దూరాత్ కాతరయా నిరీక్షితగతి స్త్వం ప్రావిశో గోపురమ్,
అఘోషానుమితత్వదాగమ మహా హర్షోల్లల ద్దేవకీ
వక్షోజప్రగలత్పయోరసమిషా త్త్వత్కీర్తి రంతర్గతా. 7

వనితా! వచ్చెదనన్న కుబ్జ తమి నోర్వన్‌లేక నీవంక నే
కనగాఁ దత్పుర గోపురాంతరమునన్ గాల్మెట్టినా వంతకున్
మును నీకిరితి త్వత్సమాగమ మహామోదోల్లస ద్దేవకీ
స్తనకుంభప్రగళత్పయోరసము చందమ్మొంది లోఁజొల్కొనన్

ఓ సుందరీ! నేను తిరిగి వచ్చెదనని తనయింటికి రమ్మన్న కుబ్జను అనునయించి యేగితివి. నీ వెంతకు రాకున్న నామె కంతునిబాఱికింజిక్కి వలవంత స్రుక్కుచు నీరాక నట్టె చూచుచున్నతఱి గృహప్రాంతమందున్న పురద్వారము గోపురమునందు కాలు మోపితివి. నీకై యెదురుచూచు నిను గన్నతల్లి దేవకీదేవియొక్క స్తనయుగమందు చేపుగొనిన క్షీరమట్లు నీ కీర్తి ఆ నగరమం దంతకు మున్నె ప్రసరించి యుండెను.

ఆవిష్టో నగరీం మహోత్సవవతీం కోదండశాలాం వ్రజన్
మాధుర్యేణ ను తేజసా ను పురుషై ర్దూరేణ దత్తాంతరః,
స్రగ్భి ర్భూషిత మర్చితం వరధను ర్మామేతి వాదాత్ పురః
ప్రాగృహ్ణా స్సమరోపయః కిల సమాక్రాంక్షి రభాంక్షీ రపి. 8

పురముం జొచ్చి మహోత్సవస్ఫురణ మాౖమోలన్ ధనుశ్శాలలోఁ
బురుషుల్ చక్కదనమ్ము తేజమునకున్ మూర్ఛిల్ల, ఖండించినా
వరరే తద్ధను వంతమున్న సుమనో హారార్చిత మ్మైన విల్
గరమం దెత్తియు నెక్కు వెట్టియును నాకర్షించియున్ బెళ్లునన్

ధనుర్యాగనిమిత్తముగ మహోత్సవము జరుగుచున్న కంసనగరము నీవు సొచ్చి ధనుశ్శాలవైపు చనుచు, నీ యందమునకు నీ ప్రతాపమునకు పురుషులు వివశులై దారితొలగి నీకు మార్గమీయగా పుష్పమాలలచే నలంకరింపబడి యర్చింపబడిన మహాధనుస్సును వద్దు వద్దని యచటి కావలివారనునంతకు ముందే ఎక్కుపెట్టి ఆకర్షించితివి. విఱచితివి గూడ.

శ్వః కంసక్షపణోత్సవస్య పురతః ప్రారంభతూర్యోపమ
శ్చాపధ్వంస మహాధ్వని స్తవ విభో దేవా నరోమాంచయత్,
కంస స్యాఽపిచ వేపథు స్తదుదితః కోదండఖండద్వయీ
చండాభ్యాహత రక్షిపూరుష రవై రుత్కూలితోఽభూత్త్వయా. 9

ఆ కంస క్షపణోత్సవమ్మునకు మున్నారంభ తూర్యస్వన
మ్మై కోదండరవమ్ము వేల్పులకు రోమాంచమ్ము గల్పించెఁ జీ
కాకున్ గూర్చెను గంసుచిత్తమునకున్ ఖండాల్పఖండస్ఫుట
వ్యాకృత్త్యోద్భట చాప రక్షకభట వ్యాలోల హాహాధ్వనుల్.

కాబోవు కంససంహార మహోత్సవమునకు ఆరంభమంగళవాద్య ఘోషమై యా ధనుర్భంగ ఘోషము దేవతల మేన గగుర్పాటు గల్గించెను. ఛిన్నాభిన్నమైన ధనుస్సుయొక్కయు, తద్రక్షకులైన భటులయొక్కయు హాహాకారములు నారదుని మాటచే వణకుటకంటె మిన్నగా కంసుని మనస్సును వణకింపజేసెను.

శిష్టై ర్దుష్టజనైశ్చ దృష్టమహిమా ప్రీత్యా చ భీత్యా తతః
సంపశ్యన్ పురసంపదం ప్రవిచరన్ సాయం గతో వాటికామ్,
శ్రీదామ్నా సహ రాధికావిరహజం ఖేదం వదన్ ప్రస్వప
న్నానంద న్నవతార కార్యఘటనా ద్వాతేశ సంరక్ష మామ్. 10

సదసద్వర్గము సూచి నీ మహిమమున్ సంతోష సంత్రాసముల్
మది నూనన్ మధురావిహారివయి యంతన్ వచ్చి శ్రీదాముతో

నదె రాధావిరహార్తి సెప్పికొని యుద్యానాన నిద్రించి త
య్యెదనన్ నీ యవతార కార్యఘటనన్ హర్షించి; నన్నేలరా!

అయ్యెడ సాధువర్గము నీమహిమచూచి సంతోషించిరి. అసాధువర్గము సంత్రాసమును (భయమును) పొందిరి ఆమీద మధురానగరమందు విహరించి బసకువచ్చి మిత్రుడగు శ్రీదామునితో నీ హృదయమందుగల రాధావిరహ నిమిత్తమైన క్షోభ వెళ్ళబోసికొని, అటుపై నీ యవతారప్రయోజనమైన కంససంహారము ప్రధానకార్యముగా సంఘటితమయ్యెనని ఆనందించి హాయిగా నిదురించితివి. అట్టి హాయి నాకు గూర్చి నన్నేలుకొనుము

# 75 వ దశకము

# కువలయాపీడ చాణూర ముష్టిక కంసవధలు

ప్రాత స్సంత్రస్తభోజక్షితిపతివచసా ప్రస్తుతే మల్లతూర్యే
సంఘే రాజ్ఞాంచ మంచా నభియయుషి గతే నందగోపేఽపి హర్మ్యమ్,
కంసే సౌధాధిరూఢే త్వమపి సహబల స్సానుగ శ్చారువేషో
రంగద్వారం గతోఽభూః కుపితకువలయాపీడనాగావలీఢమ్ 1

ఖలునాజ్ఞన్ వరువాతఁ దూర్య నినదోత్కంపమ్ముగా నెల్ల రా
జులు మంచమ్ముల నిల్వ సౌధమునఁగంసుండుండ నందుండునున్
విలసద్వేషముతోడ నక్కువలయాపీడావలీఢమ్మునన్
బలుతో సానుగుఁడై చరించితివి రంగద్వారం రంగస్థలిన్

నాడు ప్రొద్దున ఖలుడగు కంసుని యాజ్ఞచే, వాద్యముల మ్రోత వణకింప రాజులువచ్చి మల్లరంగమం దమర్చబడిన మంచంబులం దాసీనులు కాగా కంసుడు నుందుండును మేడమీద నుండగా కంసుని ప్రధానమంత్రిచే రెచ్చగొట్టబడి కోపించి కువలయాపీడమను ఏను గడ్డముగా నిలిచినందున లోని కేగుట కవకాశములేని మల్లరంగమును నీవు బలరామునితోగూడ ప్రవేశించితివి.

పాపిష్ఠాపేహి మార్గా ద్ద్రుత మితి వచసా నిష్ఠుర క్రుద్ధబుద్ధే
రంబష్ఠస్య ప్రణోదా దధికజవజుషా హస్తినా గృహ్యమాణః,
కేళిముక్తో౾థ గోపీకుచకలశ చిరస్పర్థినం కుంభమస్య
వ్యాహ త్యాలీయథా స్త్వం చరణభువి పున ర్నిర్గతో వల్గుహాసీ. 2

అరరే పాపి! తొలంగి పొమ్మనఁగనీ, వంబష్ఠుఁ డుద్యత్క్రుధో
ద్ధరతన్ మీఁదికిఁదోల నేనుఁగు నినున్ దొండమ్మునన్ బట్ట, స
త్వరమే వెల్వడి గోపికా కుచయుగస్పర్థాలు తత్కుంభ మీ
వురలన్ మీటి తదంఘ్రులం దడఁగి యోహో వచ్చితుద్యత్ స్మితిన్

ఓరీ పాపీ! తొలగి ఆవలకు బొమ్మని నీవన్నంత కోపించి అంబష్ఠుండు (మహామంత్రి) నీ మీదికి తోలగా నేనుగు తొండముచే నిన్ను బంధింప లీలగా తప్పించుకొని గోపీకుచకుంభములతో తగవులాడు నేనుగుకుంభస్థలముపై గొట్టి దానిపాదములసందున వెలువడి యల్లన నవ్వుచు నీవలకు వచ్చితివి.

హస్తప్రాప్యో౾ప్యగమ్యో ఝుటితి మునిజనస్యేవ ధావన్ గజేంద్రం
క్రీడ న్నాపత్య భూమౌ పునరభిపతత స్తస్యదంతం సజీవమ్,
మూలా దున్మూల్య తన్మూలగ మహితమహామౌక్తికా న్యాత్మమిత్రే
ప్రాదా స్త్వం హారమేభి ర్లలిత విరచితం రాధికాయై దిశేతి. 3

హస్తమ్మం దటు లంది యందనటులై యమ్మౌనిలోకాన క,
ట్లస్తవ్యస్త మొనర్చి ప్రాణములతో నా దంతిదంతమ్ము వి
ధ్వస్తమ్మొం బొనరించి యందొదవు ముత్యాలిచ్చి పంపించి తీ
వస్తోకద్యుతి హారముం గొలిపి యిమ్మా రాధ కంచున్ జెలిన్.

భక్తమునిసంఘముల కందుబాటగునట్లు, ఆ యేనుగుయొక్క హస్తమునకు తొండమునకు అందియును అందనివాడనై తప్పించుకొని దాని వెంబడించి తఱిమి క్రీడించి భూమిపైబడగొట్టి ప్రాణములతో పాటు దాని దంతమును మొదలితో నున్మూలించి దాని కుంభస్థలమందలి ముత్యాల నీ మిత్రునికిచ్చి హారము గ్రుచ్చి రాధకిమ్మని కాన్కపంపితివి.

గృహ్ణనం దంత మంసే యుత మథ హలినా రంగమంగా విశంతం
త్వాం మంగల్యాంగభంగీరభసహృతమనోలోచనా వీక్ష్య లోకాః,

**హంహో ధన్యోను నందో నహినహి పశుపాలాంగనా నో యశోదా**
**నోనో ధన్యేక్షణాః స్మ స్త్రిజగతి వయ మేవేతి సర్వే శశంసుః. 4**

**కరిదంతమ్ము భుజాగ్రమం దునిచి రంగక్షోణి కీ వన్నతో**
**నరుదేరన్, భవ దంగభంగిమకు లోనై పౌరు లానందుఁ డం**
**దర ధన్యుం, డది కాదు వ్రేతలు, యశోదా దేవియేఁ గాద, యి**
**ద్ధరలో ధన్యుల మేము మేమనిరి నిన్ దర్శించి, ధన్యేక్షణుల్.**

ఊడబెరికిన కరిదంతమును భుజముపై వేసికొని బలరాముతో నీవు మల్లరంగమునకు రాగా, నీ యాకార సౌందర్యమునకు పౌరులు నివ్వెఱపడి నందుడెంత ధన్యుడు; యశోద యేమి పుణ్యముసేసినది. అదంతయుగాదు గోపికలేమి పుణ్యము లాచరించిరి వారందఱిమాటకేమి యీ సుకుమారకుమారుని దర్శించి కన్నుల సాఫల్యము పొందిన మనమెంత ధన్యులమని మురిసిపోయిరి.

**పూర్ణం బ్రహ్మైవ సాక్షా న్నిరవధి పరమానంద సాంద్రప్రకాశం**
**గోపేషు త్వం వ్యలాసీ ర్నఖలు బహుజనై స్తావ దావేదితోభూః,**
**దృష్ట్వాఽథ త్వాం తదేదం ప్రథమ ముపగతే పుణ్యకాలే జనౌఘాః**
**పూర్ణానందా విపాపా స్సరస మభిజగు స్త్వత్కృతాని స్మృతాని. 5**

**పరమానంద రసప్రపూర్ణ మధుర బ్రహ్మమ్ముగా గొల్లలన్**
**నిరతిన్ వర్తిలు నిన్ననేకు లెఱుఁగన్ లేరైరి, ప్రాక్పుణ్య వి**
**స్తర మీనాఁ డిటు పక్వమై కని నినున్ సంపూర్ణ హర్షోదయ**
**స్ఫురణన్ బాడిరి త్వత్పవిత్రచరితమ్ముల్ రాగబంధమ్ములన్.**

పరమానంద మధురమైన కేవల పరబ్రహ్మమయియున్న నీ నిజమును మహాయోగులుగూడ పూర్తిగ నెఱుంగలేరు. అట్టి నిన్ను పుణ్యములుపండి సంపూర్ణానందోదయమై మధురాపురవాసులు ప్రత్యక్షముగా నిటు తొలిసారి దర్శించి నీ కథల ననురాగము రాగసమ్మేళమును నొనర్చి గానములు సేసిరి.

**చాణూరో మల్లవీర స్తదను నృపగిరా ముష్టికో ముష్టిశాలీ**
**త్వాం రామం చాభిపేదే ఝటఝటిత మిథో ముష్టిపాతాతిరూక్షమ్,**

**ఉత్పాతాపాతనాకర్షణ వివిధ రణా న్యాసతాం తత్ర చిత్రం**
**మృత్యోః ప్రాగేవ మల్లప్రభు రగమ దయం భూరిశో బంధమోక్షాన్. 6**

**అటఁ జాణూరుఁడు మల్లవీరుఁ డటుపై నమ్ముష్టికుండెత్తి ఛట్**
**ఫట శబ్దమ్ముగ ముష్టిపాతముల నుత్పాతావపాతమ్ములం**
**దటు నీతో బలరామునితో నెదిరి ప్రాణాపాయమౌ మున్న యు**
**త్కటతం గాంచిరి బంధమోక్షము లనేకమ్ముల్ విచిత్రమ్ముగన్.**

తొలుత చాణూరుడును తరువాత ముష్టికుడును ప్రసిద్ధికెక్కిన మల్లురిద్దరు పిడుగులంబోలు పిడిగ్రుద్దులను విఱుచుకొనిపడి యెగిరిపడుచు నీతో, బలరామునితో దాకి డీకొని కుస్తీ పట్టి ప్రాణములు పోవుటకుముందే బంధ మోక్షములు-నీచేతిలోబంధనము విడుపును పొందిరనియొక యర్థము. నీచేతి స్పర్శచే బ్రతికియుండగానే సంసారబంధమునుండి మోక్షమందిరని రెండవ యర్థము.

**హాధిక్కష్టం కుమారౌ సులలితవపుషౌమల్లవీరౌ కఠోరౌ**
**న ద్రక్ష్యామో వ్రజామ స్త్వరితమితి జనే భాషమాణే తదానీమ్,**
**చాణూరం తం కరోద్భ్రామణవిగదసుం పోథయామాసిథోర్వ్యామ్**
**పిష్టోఽభూ న్ముష్టికోఽపి ద్రుత మథ హలినా నష్టశిష్టై ర్దధావే. 7**

**సుకుమారాకృతు లీకుమారు, లతిభీష్ముల్ క్రూరు లీమల్లు, రె**
**ట్లొకొ యీ దారుణ మేము చూచుటని పో నుంకింపగా లోక, మూ**
**రక చాణూరుని ద్రిప్పికొట్టితి వటన్, రాముండు నమ్ముష్టికున్**
**వికలుంజేసెను, జావగా మిగిలి వేవే పాఱి రా కొందరున్.**

మిక్కిలి సుకుమారులు చక్కని కుమారులు వీరు, ఈ మల్లు లిద్దరు నతిక్రూరులు, అక్కటా! ఈ ఘోరము చూడలేమని పురజనులు వెడలి పోనుంకించు చున్నతఱి నీవా చాణూరునెత్తి గిరగిర త్రిప్పి నేలకు గొట్టితివి. బలరాముడు ముష్టికుని పిష్టము చేసెను. చావగా మిగిలిన వాంద్రపరివారము పాఱిపోయిరి.

**కంసః సంవార్య తూర్యం ఖలమతి రవిదన్ కార్య మార్యాన్ పితౄంస్తా**
**నాహంతుం వ్యాప్తమూర్తే స్త్వవచ సమశిష ద్దూర ముత్సారణాయ,**

రుష్టో దుష్టోక్తిభి స్త్వం గరుడ ఇవ గిరిం మంచ మంచ న్నుదంచ
త్ఖడ్గవ్యావల్గ దుస్సంగ్రహమపి చ హఠా త్ప్రాగ్రహీ రౌగ్రసేనిమ్. 8

ఖలుఁ డక్కంసుడు తూర్యము న్నిలిపి కింకర్తవ్యతామూఢుఁ డై
బలు నిన్నుం దఱుమంగ నాజ్ఞయిడి చంపంజూచె నా వృద్ధులన్
చలముం బూని దురుక్తులన్ గరుడుడున్ శైలమ్ముపైదూకి న
ట్లల మంచెన్ వడి దూకి పట్టితి వసివ్యావల్గ దుస్సంగ్రహున్.

అంతట కంసుడు వాద్యముల నాపి యేమి చేయుటకుందోచక మిమ్మిద్దఱను దఱిమివేయుడని, కసిగొని వృద్ధులయిన వసుదేవ-నంద-ఉగ్రసేనులను చంపుడని తన యనుచరుల కాజ్ఞయిచ్చెను. నీవు వాని దుష్టవచనములకు రోషించి, గరుత్మంతుడు కొండశిఖరముపై వ్రాలినట్లు మంచెపై దూకి కత్తియెత్తి పరువళ్లు ద్రొక్కుచున్న ఔగ్రసేనిపై (ఉగ్రసేను కుమారుడైన కంసునిపై) దూకి పట్టుకొంటివి.

సద్యో నిష్పిష్టసంధిం భువి నరపతి మాపాత్య తస్యోపరిష్టా
త్త్వ య్యాపాత్యే తదైవ త్వదుపరి పతితా నాకినాం పుష్పవృష్టిః,
కిం కిం బ్రూమ స్తదానీం సతతమపి భియా త్వద్గతాత్మా స భేజే
సాయుజ్యం త్వద్వధోత్థా పరమ పరమియం వాసనా కాలనేమేః. 9

కీలుంగీ లెడలించి వ్రాలి ఖలుపై క్రీడింప నీ మీఁదనున్
బూలున్ వ్రాలెను వేలుపుల్ గురియ నేమో పల్కుటల్, భీతి ని
న్నేలిన్ ధ్యానమొనర్చి చేకొనియె సాయుజ్యమ్ము నీ చేతిలో
వ్రాలం గల్గుట కాలనేమి యయి మున్ బ్రాపించు నవ్వాసనన్.

మఱియు వాని మేన కీలు కీలు సంధులను విడగొట్టి వానిపై బడి మల్ల క్రీడా వినోదముసేయు నీ మీద దేవతలు పూలవానలు గురిపించిరి. ఇంకే మనవలెను? భయముచే కంసుండు నిన్ను ఇన్నాళ్ళు ధ్యానించి యిపుడు నీచేతిలో మడిసి అంతకు ముందటి జన్మలో కాలనేమియను రాక్షసుడై విష్ణువుచే హతుడైనందున గల్గిన పూర్వవాసనచే సాయుజ్యముక్తి వడసెను.

తద్భ్రాతౄనష్ట పిష్ట్వా ద్రుతమథ పితరౌ సన్నమ న్నుగ్రసేనం
కృత్వా రాజాన ముచ్చై ర్యదుకుల మఖిలం మోదయన్ కామదానైః,
భక్తానా ముత్తమం చోద్ధవ మమరగురో రాప్తనీతిం సఖాయం
లబ్ధ్వా తుష్టో నగర్యాం పవనపురపతే రుంధి మే సర్వరోగాన్. 10

అలఘుల్ కంసుని తమ్ములం జదిపి మున్నర్చించి నిన్ గన్న వా
రల నర్పించియు నుగ్రసేనునకుఁ దద్రాజ్యమ్ము, నయ్యాదవా
వలి కిష్టార్థము లిచ్చి యుద్ధవు గురుప్రాప్తార్థనీతిజ్ఞు భ
క్తులలో నుత్తము మిత్రుగం బడసి, తెందున్ నన్ను బాలింపుమా.

అటుపై దండెత్తిన కంసుని తమ్ముల కంకన్యగ్రోధాదుల నెనమండ్రను సంహరించి కంసుని చెఱనున్న నీ తల్లిదండ్రులను నందయశోదలను పూజించి ఆనందపఱచి రాజ్యమును మాతామహుడగు నుగ్రసేనున కర్పించి యాదవుల కందఱ కభీష్ట వస్తు సత్కారములు చేసి బృహస్పతి దగ్గర నీతిశాస్త్ర మభ్యసించిన నీ భక్తశిరోమణిని నీ నెచ్చెలిగా బడసి అవతార ప్రయోజనము నిర్వహించి కృతార్థుడైనట్లు ఆనందభరితుడై మధురానగరమందు కొంతకాలము విహరించితివి. స్వామీ! నన్ను రక్షింపుము.

# 76 వ దశకము

# ఉద్ధవదౌత్యము

గత్వా సాందీపని మథ చతుష్షష్టి మాత్రై రహోభి
స్సర్వజ్ఞస్త్వం సహ ముసలినా సర్వవిద్యాం గృహీత్వా,
పుత్రం నష్టం యమనిలయనా దాహృతం దక్షిణార్థం
దత్వా తస్మై నిజపుర మగా నాదయన్ పాంచజన్యమ్. 1

చని సాందీపని సన్నిధిన్ బలునితో సర్వజ్ఞుఁడై కూడ యొ
య్యన నీ పర్వదినాల్గురోజాలను విద్యల్ సర్వము న్నేర్చి, కా

లుని ప్రోలిన్ జని, వాని తత్తనయ నాలో నిచ్చి యాచార్య ద
క్షిణగా నొత్తుచుఁ బాంచజన్యము యశశ్రీ వచ్చినా వింటికిన్

నీవు సర్వజ్ఞుడవయ్యు లోకానుశిక్షణకై బలరామునితో సాందీపని సన్నిధానమున సర్వవిద్యలు నరువదినాల్గు రోజులలో నభ్యసించి, యాయన కుమారుని యమలోకమేగినవానిం గొనివచ్చి గురుదక్షిణగా సమర్పించితివి. మఱియు యమునిగూడ శాసించినవా డీయన భగవంతుడేయను నీకీర్తిని వెల్లడించు చుంటివో యన్నట్లు నీ పాంచజన్య శంఖారావముం బూరించుచు గురుకులము నుండి యింటికి వచ్చితివి.

వి.వి: శంఖవేషముదాల్చి యెదిరింపవచ్చిన పంచజనుడనువానింగూల్చి వానిమేనం బుట్టిన శంఖమును పాంచజన్యమను దానిని విష్ణువు స్వీయ మొనరించుకొనెనని పురాణప్రసిద్ధి.

స్మృత్వా స్మృత్వా పశుపసుదృశః ప్రేమభారప్రణున్నాః
కారుణ్యేన త్వమపి వివశః ప్రాహిణో రుద్ధవం తమ్,
కిం చాముష్మై పరమసుహృదే భక్తవర్యాయ తాసాం
భక్త్యుద్రేకం సకలభువనే దుర్లభం దర్శయిష్యన్. 2

వలపు ల్గుల్కెడు గోపికా నివహమున్ భావించి భావించి మి
క్కిలిగా జాలిఁ గరంగి, గోపికల భక్తిన్ రక్తిఁ జూపించి నె
చ్చెలి యయ్యుద్ధవు భక్తు ధన్యతమునిన్ జేయంగఁ బంపించితా
తల నా వ్రేతల త్వద్వియోగపరితాప మ్మార్పి రమ్మంచునున్.

నీపై నగ్గలపు వలపుచే విరహవేదనపడు పడతులయెడ గడుంగడు జాలివడి కరగి, వారి కూరట గల్పించుటకు, వారి అలోక సామాన్యభక్తి నాతనికి జూపి నేనే కృష్ణునకుభక్తుడను మిత్రుడనను నహంభావ మాతనిలో నుదయింపకుండ పరిశుద్ధుం జేయుట ఉత్తమ మిత్రధర్మమని యెంచి, గోపికల నూరార్చి రమ్మని వారిదరికుద్ధవుని బంపితివి.

త్వన్మాహత్మ్యప్రథిమపిశునం గోకులం ప్రాప్య సాయం
త్వ ద్వార్తాభి ర్బహు స రమయామాస నందం యశోదామ్,

ప్రాత ర్దృష్ట్వా మణిమయరథం శంకితాః పంకజాక్ష్యః
శ్రుత్వా ప్రాప్తం భవదనుచరం త్యక్తకార్యా స్సమీయుః. 3

చని గోధూళికవేల గోకులము సాక్షాత్త్వత్ప్రభావైక బో
ధన మాతం డలరించె నీకథ యశోదానందులన్ వేకువన్
గని తద్రత్న రథ మ్మపూర్వమది శంకం జెంది యాలించి యా
తని రాకన్ గుమిగూడి రింటిపను లంత న్వీడి గోపాంగనల్

గోవు లింటిమొగమై వచ్చు సాయంసంధ్యాసమయమును గోధూళికాలగ్న మందురు. ఆశుభసమయములో నీయోగమహిమలు అనగా పూతనా-శకటాసుర-అర్జునతరు భంజనాదుల జాడలుగల వ్రేపల్లెలో ప్రవేశించి నందభవనమునకేగి నంద యశోదలకు నీయోగక్షేమములు తెలిపి యుద్ధవుడు వారిని యానంద పరచెను.

దృష్ట్వా చైనం త్వదుపమ లసద్వేషభూషాభిరామం
స్మృత్వా స్మృత్వా తవ విలసితా న్యుచ్చకై స్తాని తాని,
రుద్ధాలాపాః కథమపి పునర్గద్గతాం వాచ మూచు
స్సౌజన్యాదీ న్నిజపరభిదా మప్యలం విస్మరంత్యః. 4

వేషమ్మయ్యది భూషణమ్ములవియే వీక్షింప భాషా సము
న్మేష మ్మంతయు నట్లె యున్నదని నిన్ వేమాఱు భావించి సం
తోషోద్రిక్తత గద్గద స్వరముగాఁ దోడ్తో నినుంగూర్చి సం
భాషింపం జని రంగనల్ స్వపరభావస్ఫూర్తి లేకుండగన్.

రూపమదియే వేషమదే భాషావిలాసము నదేయని యుద్ధవునందు నీ పోలికలు చూచి మురిసి నీవును నీచేసిన లీలలు తలపునకు వచ్చి సంతోషోద్రేకమువలన గద్గదస్వరమువొడమ స్వపరభేదమువాసి గోపిక లాతనితో భాషింప మొదలిడిరి.

శ్రీమన్ కిం త్వం పితృజనకృతే ప్రేషితో నిర్దయేన
క్వాఽసౌ కాంతో నగర సుదృశాం హా! హరే నాథ పాయ్యాః,
ఆశ్లేషాణా మమృతవపుషో హంత తే చుంబనానా
మున్మాదానాం కుహకవచసాం విస్మరేత్ కాంత కా వా. 5

స్వామి! తల్లిని దండ్రినిం దెలిపిరాఁ బంపించెనా! నిర్దయుం
డేమో! తా మరఁగెన్ బురాంగనలఁ గాదే; హా హరీ! హాప్రియా!
స్వామి! ఎవ్వతె విస్మరించు నమృతాస్వాదమ్ము నీ రూప మా
యామాటల్ మురిపెమ్ము లిచ్చకము లా యాశ్లేషముల్ ముద్దులున్

ఓ ఉద్ధవస్వామి! మా చెలికాడు వట్టి నిర్దయుడు. మా కొఱకుగాదు తల్లిదండ్రులకొఱకు అన్యోన్యక్షేమము లెరుక సేయుటకు నిన్ను బంపించి యుండును. ఆ రసికుడు నాగరిక విలాసిను లా నెఱజాణల హావభావ విలాసములలో బడినాడు. అని ప్రణయకోపమున పలుకుచునే యంతలో భగవద్గుణ పరవశలై హా హరీ! హా! ప్రియవల్లభ! అమృతప్రాయమైన నీరూప మాస్వాదించి నీ యిచ్చకములకు ముచ్చటలు నీ కౌగిలింతలకు నీ ముద్దులకు మఱగిన యే తెఱవ నిన్ను మఱువగలదు? అని వ్రేతలు వాపోయిరి

రాసక్రీడా లులిత లలితం విశ్లథ త్కేశపాశం
మందోద్భిన్న శ్రమజలకణం లోభనీయం త్వదంగమ్,
కారుణ్యాబ్ధే సకృ దపి సమాలింగితుం దర్శయేతి
ప్రేమోన్మాదా ద్భువనమదన త్వత్ప్రియా స్త్వాం విలేపుః 6

లీలన్ గ్రొమ్ముడివీడి ఘర్మజలమున్ జిందంగ రాసోత్సవ
శ్రీలాలిత్యము నిత్యశోభనముగా శ్రీమూర్తి మాకౌఁగిటన్
లాలింపన్ దయసేయు మొక్కపరి హేలామన్మథా! యంచునుం
దాళంజాలక యేడ్చి రంగజ సమున్మాదమ్ముచే నంగనల్

అప్పుడు రాసక్రీడయందు మా కొప్పులు వీడగా మేనం జెమట గ్రమ్మగా లాలించి నిత్యశోభనముగా శృంగారరస సామ్రాజ్యమేలించిన నీ మూర్తి నింకొక్కమారైన మాకౌగిట లాలించుకొన దయసేయుమని యయ్యంగనలు అంగజోన్మాదమున సిగ్గువిడిచి వాదెఱచి యేడ్చిరి. ఇది మన్మథావస్థలలో నెన్మిదవ స్థితి

ఏవం ప్రాయై ర్వవశవచనై రాకులా గోపికా స్తా
స్త్వ త్సందేశైః ప్రకృతి మనయత్సోఽథ విజ్ఞానగర్భైః,

భూయ స్తాభి ర్ముదితమతిభి స్త్వన్మయీభి ర్వధూభి
స్తత్తద్వార్తా సరస మనయ త్కానిచి ద్వాసరాణి. 7

ఆ లీలన్ మఱపొంది నీ కొఱకునై యల్లాడు నా గోప క
న్యాళిన్ నీదగు జ్ఞాన గర్భితవచోవ్యాసక్తిచేఁ బెక్కు చం
దాలన్ దేర్చి నినుం దలంచి మఱపొందం జేసి యవ్వారితోన్
హేలన్ గొన్ని దినమ్ములుండె నతఁడున్ నీవార్తలే చెప్పుచున్

అట్లు తమ్ముతాము మరచి యారాటపడుచున్న యా ముద్దరాండ్రను మన్మథావస్థలలో తొమ్మిదవ మూర్ఛావస్థలో పడినారు. ఇక దశమావస్థకు అనగా ప్రాణాపాయమునకు గురియౌదురని గమనించి నీవు చెప్పిన విజ్ఞాన గర్భితములైన మాటలు సెప్పి యూరార్చి తేర్చి నీలీలలే వర్ణించి దుఃఖము మఱచిపోవునట్లు సేయుట కుద్ధవుడక్కడనే కొన్ని దినములుండెను.

త్వత్ప్రోద్గానై స్సహిత మనిశం సర్వతో గేహకృత్యం
త్వద్వార్తైవ ప్రసరతి మిథ స్సైవ చోత్స్వాపలాపాః,
చేష్టాః ప్రాయ స్త్వదనుకృతయ స్త్వన్మయం సర్వమేవం
దృష్ట్వా తత్ర వ్యముహ దధికం విస్మయా దుద్ధవో௨యమ్. 8

నీ సంకీర్తన గానముల్ గృహవిధుల్ నీవార్త లన్యోన్య స
ద్వ్యాసంగమ్ములు నిన్నుగూరిచిన స్వప్నాలాపముల్ వేసముల్
బాసల్ చేష్ట లవెల్లనీ యనుకృతుల్గా దన్మయమ్మైన యు
ల్లాస మ్మందఱఁ జూచి తన్మఱచె నప్పా! యుద్ధవస్వామితాన్

నీ యశోనామసంకీర్తన రూప సంగీతమే వారి నిత్యకృత్యము. నీమాటయే మాట. నిన్ను గూర్చిన స్వప్నాలాపములు నిన్ననుసరించిన వేషములు భాషలు నీ చేష్టాభినయమునుంగా వ్రజసుందరు లందఱి యుల్లాసముం జూచి చూచి యుద్ధవుడు దన్ను దామఱచిపోయెను.

రాధాయా మే ప్రియతమ మిదం మత్ప్రియైవం బ్రవీతి
త్వం కిం మౌనం కలయసి సఖే మానినీ మత్ప్రియైవ,
ఇత్యాద్యేవ ప్రవదతి సఖి త్వత్ప్రియో నిర్జనే మా
మిత్థం వాదై రరమయ దయం త్వ త్ప్రియా ముత్పలాక్షీమ్. 9

ఇది మారాధకుఁ జాల యిష్టము సుమీ! ఇట్లాడు నట్లాడు, నే
మిది యూసాడవు రాధవోలె ననిన న్నేకాంతమం దల్లనన్
గదియంజేరి వచించు నమ్మ! చెలి నీ కాంతుం డటం చుద్ధవుం
డుదితామోద వినోదఁ జేసెను కరమ్ముల్లాసియై రాధికన్

ఇది మా రాధ కెంతో యిష్టమైన వస్తువు. ఆమె యిట్లను నట్లనును మిత్రమ! రాధవలె నీవును మౌనము పట్టితివాయేమి? పలుకవేమని యేకాంత మందు నీకాంతుడు నాదరిం జేరి నీమాటలే చెప్పునని యుద్ధవుడు రాధనుల్లాస పరచుటమూలమున తాను కృతార్థుడనైతినని యుల్లాసము చెందుచుండెను.

ఏష్యామి ద్రాగనుపగమనం కేవలం కార్యభారా
ద్విశ్లే షేఽపి స్మరణ దృఢతాసంభవా న్మాఽస్తు ఖేదః,
బ్రహ్మానందే మిలతి న చిరాత్ సంగమో వా వియోగ
స్తుల్యో వః స్యా దితి తవగిరా సోఽకరో న్నిర్వ్యథా స్తాః. 10

రానుంటిన్ త్వరలోనఁ, గార్యభరమై రాకుంటి నిందాక, నా
ధ్యానమ్మున్ దృఢ మౌను నన్నెడసి యేలా వేదన ల్మీకు? బ్ర
హ్మానంద మ్మొదవింతు, సంగమ వియోగాదుల్ సమ మ్మందులో
నౌనంచున్ భవదుక్తులం జలిపె దుఃఖాతీతలన్ వ్రేతలన్

త్వరలోనే రాగలను. కార్యభారముచే నిన్నాళ్లు రానేరనైతిని. నా వియోగ మందు మీకు నా అనుధ్యానము దృఢపడును.దృఢసమాధియోగము చేకూరునన్నమాట. ఏల పరితాపపడెదరు? మీకు బ్రహ్మానందము చేకూర్చెదను. కేవల బ్రహ్మస్వరూపుడను గావున నాతోడి సంగమ మనుగ్రహించుట మూలమున మీకు బ్రహ్మాత్మభావసిద్ధి యగునని భావము. అందు మీరు విలీనలయినతటి సంయోగ వియోగములు రెండును ఒక్కరూపగును. అనగా వియోగదశలోకూడ మీయందఱిలో నంతర్యామిరూపమున నున్నవాడనుగావున నాతోడి వియోగమును లేదు; క్రొత్తగావచ్చి మీలో చేరినవాడను గాను గావున సంయోగమును లేదన్నమాట అని నీ చెప్పిన జ్ఞానగంభీరమైన సందేశమందించి యా మందయానలను ఉద్ధవుడు సుప్రసన్నలం గావించెను.

ఏవం భక్తి స్సకలభువనే నేక్షితా న శ్రుతా వా
కిం శాస్త్రౌఘైః కిమిహ తపసా గోపికాభ్యో నమోఽస్తు,

**ఇత్యానందాకుల ముపగతం గోకులా దుద్ధవం తం**
**దృష్ట్వా హృష్టో గురుపురపతే పాహి మా మామయౌఘాత్.** **11**

**ఏ లోకానను గానరాదు వినరా దీ భక్తి యీరక్తి, శా**
**స్త్రాలేలా! తపమేల! గోపికలకున్ సాష్టాన్నమస్కారమం**
**చాలో గోకులముం భజించి పరమాహ్లాదాన రాఁజూచి యు**
**ద్వేలానందము పొంది తుద్ధవునెడన్ విష్ణూ! కటాక్షింపుమా!**

కృష్ణా! గోపికల యీభక్తియు రక్తియు మఱి యేలోకమందేని గానరాదు. శాస్త్రార్థములు తపస్సులు ఎందులకు? అవి లేని గోపికల భాగ్య మేమనవలె? ఇదిగో వారికి నమస్కారము. అని పరమాహ్లాదవిభవుడై ఉద్ధవుడు మరలి రాగా నిపుడు నేనే భక్తుడనను నహంకారము తొలగి నాకు నిజమైన మిత్రుడగు నధికార మీతనికి సిద్ధించినదని మురిసినాడవు. ఓ రాధాప్రియ! నన్ను కనికరింపుము.

# 77 వ దశకము

# కుబ్జానుగ్రహము-జరాసంధ నిగ్రహము ముచుకుందానుగ్రహము

**సైరంధ్ర్యా స్తదను చిరం స్మరాతురాయా**
**యాతోఽభూ స్సలలిత ముద్ధవేన సార్ధమ్,**
**ఆవాసం త్వదుపగమోత్సవం సదైవ**
**ధ్యాయంత్యాః ప్రతిదిన వాససజ్జికాయాః.** **1**

**ఊరక నీదురాకకొఱ కువ్విళులూరుచు బాసలెంచి శృం**
**గారము సేసికొంచుఁ జిరకాలముగా మరుబారిఁ జిక్కె న**
**వ్వారిజనేత్ర కుబ్జ యట వాసకసజ్జిక యామె శోభనా**
**గారము తల్పుతట్టితివిగా జతగా జతగాఁడు తోడరాన్**

నీకొఱకై వేడుకగొని నీరాక కువ్విళులూరుచు మాయింటికి వత్తునని నీవు బాసయిచ్చినది మొదలు నిన్నే తలంచుచు నీకేది ముచ్చట యగునోయని వేషభూషణములు తడవతడవ మార్చిమార్చి శృంగారము సేసికొనుచు కుబ్జ వాసక సజ్జిక నాయికయై యున్నతఱి (ముస్తాబుచేసికొని కాంతుని రాకకై యెదురుసూచు శృంగారనాయికకు వాసకసజ్జికయని పేరు) ఆమె శోభన గృహద్వారమునకు నీమిత్రుడు ఉద్ధవునితో నేగితివి.

ఉపగతే త్వయి పూర్ణమనోరథాం
ప్రమద సంభ్రమ కంప్రపయోధరామ్,
వివిధ మానన మాదధతీం ముదా
రహసి తాం రమయాంచకృషే సుఖమ్. 2

మురియుచు నిన్ను జూచి పరిపూర్ణ మనోరథయై కుచద్వయీ
భరము వడంక వాకిటను స్వాగతమిచ్చి సపర్యలిచ్చి సుం
దరి జగదేక సుందరు నెదన్ గదియింప, రమింపఁ జేసిత
త్తరి స్మరకేళులన్ బరమధన్యయనన్ సురహస్య భంగిమన్.

నీ వేతెంచితివన్న సంబరముచే సంభ్రమించి కుచభరముచే దూగుచు నెదురువచ్చి స్వాగతముపల్కి యర్ఘ్యపాద్యాదు లొసగిన యా కల్కిని యా సుందరిని జగదేకసుందరుడ వీ వేకాంతమునకుం దిగిచి వివిధ కేళీవిలాసములచే గరగించితివి.

పృష్టా పరం పునరసా వవృణో ద్వరాకీ
భూయ స్త్వయా సురతమేవ నిశాంతరేషు,
సాయుజ్య మస్త్వితి వదే ద్బుధ ఏవ కామం
సామీప్య మస్త్వనిశ మిత్యపి నాబ్రవీ త్కిమ్. 3

వరముం గోరె వరాకి కోరుమనగాఁ బల్మారు నిన్ రాత్రులన్
సురతానందము, పండితుండయిన నెచ్చో కోరు సాయుజ్య, మ
ద్దిర! సామీప్యమునేని నిన్ననిశ మర్థింపంగనే లేద యీ
శ్వరతంత్ర మ్మఖిలమ్ము నెవ్వఁడెఱుఁగున్ సర్వేశ! యాచిత్రమున్

నీవామెను వరము కోరుకొమ్మంటివి. ఆమె రాత్రులందు పలుమారు లిట్లే సురత మిమ్మని యర్థించెను. పండితుడయినవాడు నీసాయుజ్యమునో సామీప్యమునో కోరును. ఈమెయో వరాకి=అల్పురాలు అల్పమైన కామసుఖమర్థించినది. సాయుజ్యము(మోక్షము) నిర్విషయమైన యానందము దానిరుచి యెఱుగని అమాయకురాలు, పోనీ! నీ సామీప్య మడుగరాదా? అన్న అది యీవరకే నీయంతట నీవు తనను సమీపించి యనుగ్రహించియేయున్నావు. కావున కేవల కామపురుషార్థముగా రతిసుఖమిమ్మని వేడినది "మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనంచ" అనికదా గీతావాక్యము. భగవంతుడైన నావలననే జ్ఞాపకశక్తి ఎఱుక మఱపునుగల్గునంటివికదా! కుబ్జ కాయెఱుకగల్గకపోవుట ఈశ్వరుడైన నీయధీనమే. అని భావము. వి.వి: అనిశము=రాత్రియనక (పవలనక) కల్గు సాయుజ్య సామీప్యము లడుగవలసినది యడుగక రాత్రులందు రతిసుఖము వేడినదని తెలుగుయనువాదము నందించుక శబ్దచమత్కృతి.

**తతో భవాన్ దేవ నిశాసు కాసుచి**
**మృగీదృశం తాం నిభృతం వినోదయన్,**
**అదా దుపశ్లోక ఇతి శ్రుతం సుతం**
**స నారదా త్సాత్వతతంత్రవి ద్బభౌ.** 4

రేలన్ గుబ్జన్ సంగమ
హేలన్ మురిపించి కొడుకు నిచ్చితివి యశ
శ్శాలి నుపశ్లోకు; నతం
డాలించెన్ బాంచరాత్ర మన్నారదుచే.

కొన్నిరాత్రులు కుబ్జను సంగమక్రీడయం దనుగ్రహించి ఉపశ్లోకుడను నొక కుమారుని గూడ ప్రసాదించితివి. అతడు నారద మహర్షివలన పాంచరాత్రాగమము నభ్యసించెను.

**అక్రూరమందిర మితోఽథ బలోద్ధవాభ్యా**
**మభ్యర్చితో బహునుతో ముదితేన తేన,**
**ఏనం విసృజ్య విపినాగతపాండవేయ**
**వృత్తం వివేదిథ తథా ధృతరాష్ట్ర చేష్టామ్.** 5

**హలితో నుద్ధవుతోడ నీవు సని య య్యక్రూరు గేహమ్ము, మి**
**క్కిలి హర్షించి భజించి మించి యతఁడున్ గీర్తించినన్ మెచ్చి య**
**వ్వల వానిన్ మఱలించి పాండవ వనావాసాంత వృత్తాంత మా**
**తల నా యా ధృతరాష్ట్ర చేష్టితము నంతం గాంచి తంతర్మతిన్.**

అటనుండి బలరాముడును ఉద్ధవుడును తోడరాగా అక్రూరుని సదనమున కేగితివి. అతడానందపడి పూజించి నిన్ను నుతించెను. అందులకుమెచ్చి యాతనికి సెలవొసంగి ఆవల వనవాసము పూర్తియైవచ్చిన పాండవుల వృత్తాంతమును ధృతరాష్ట్రుని వర్తనమును అంతర్దృష్టితో గాంచితివి.

**విఘాతా జ్జామాతుః పరమ సుహృదో భోజనృపతే**
**ర్జరాసంధే రుంధ త్యనవధిరుషాంధేఽథ మథురామ్,**
**రథా ద్యై ర్ద్యోర్లబ్ధైః కతిపయబల స్త్వం బలయుత**
**స్త్రయోవింశత్యక్షౌహిణీ తదుపనీతం సమహృథాః. 6**

**అల్లున్ గంసు సుహృద్వరుం గెడపెనం చాలో జరాసంధుఁడ**
**య్యెల్లల్ ముట్టడిసేయఁగా మథుర, నీ వింద్రోపలబ్ధమ్ము తే**
**రుల్లాసమ్మున నెక్కి స్వల్పబల మోహో! పూని తూలించి నా**
**వల్లల్లన్ బరసైన్య మిర్వదియుమూఁ డక్షౌహిణుల్ దక్షతన్.**

జరాసంధుడు కంసుని యల్లుడు మిత్రుడును. జరాసంధుని కూతుండ్రు అస్తి ప్రాప్తి యనువారు. అల్లుడగు కంసుని నీవు చంపితివని జరాసంధుడు రోషాంధుడై మథురను ముట్టడించెను. నీవింద్రుడంపిన రథమెక్కి కొలదిసేనతో నేగి వాని యిర్వదిమూడక్షౌహిణుల సేనను సంహరించితివి.

**బద్ధం బలా దథ బలేన బలోత్తరం త్వం**
**భూయో బలోద్యమర సేన ముమోచి థైనమ్,**
**నిశ్శేష దిగ్జయ సమాహృత విశ్వసైన్యాత్**
**కోఽన్య స్తతో హి బలపౌరుషవాం స్తదానీమ్. 7**

**బలునకు బద్ధుఁడైన బలవద్బలు నాప్రబలోద్యమమ్ముపై**
**వలపున వాని వీడితివి పాపి జరాసుతు; విశ్వజైత్ర యా**

త్రల సమవాప్త పత్యబలదర్పితుఁ డెవ్వఁడు సాటి వానికన్?
బలమునఁ బౌరుషమ్మునను వానికి వాఁడె సముండు నెయ్యెడన్.

బలరాముచే బంధింపబడిన బలవంతుని, వాడింకను ప్రబలమైన సైన్యముం గూర్చికొనివచ్చును. అపుడందఱనొక్కసారి మట్టువెట్టవచ్చునని యెంచి జరాసంధునప్పటికి వదలివేసితివి. విశ్వమెల్ల జైత్రయాత్రలు చేసి బలదర్పితుడైన యవ్వాని కానాడు సాటియైన మగవాడు లేకుండెను.

భగ్న స్స లగ్నహృదయో౽పి నృపైః ప్రణున్నో
యుద్ధం త్వయా వ్యధిత షోడశకృత్వ ఏవమ్,
అక్షౌహిణీ శ్శివ శివాస్య జఘన్థ విష్ణో
సంభూయ సైకనవతిత్రిశతం తదానీమ్. 8

ఓడియు రాచవార లోకయూపొసగన్ హృదయమ్ము లగ్నమై
పోఁడిమి వాఁడు నిన్నెదిరిచెఁబో పదునాఱు పరాజయమ్ములై
వాఁడిఁ దనర్చుచున్ శివశివా! యటు చంపితి వాని సైన్యముల్
వాడక మూఁడువందలకు పై నటు తొంబదియొక్క లెక్కకున్.

నీచే నొకసారి యోడిపోయికూడ రాచవాండ్రు ప్రోత్సహింపగా మనసు నీమీద లగ్నముచేసి పదునాఱుసారులు దండెత్తెను. శివశివా! మూడువందల తొంబదియొక్క అక్షౌహిణుల లెక్కకువచ్చిన వాని సేనల నీవు నురుమాడితివి.

అష్టాదశే౽స్య సమరే సముపేయుషి త్వం
దృష్ట్వా పురో౽థ యవనం యవనత్రికోట్యా,
త్వష్ట్రా విధాప్య పుర మాశు పయోధిమధ్యే
తత్రా౽థ యోగబలతః స్వజనా ననైషీః. 9

అట నష్టాదశసంఖ్య యుద్ధమిఁక నౌనన్నప్పుడే నీదు ముం
దట ముక్కోటిబలంబుతో యవనుడాహా! రాగ నాద్వారకన్
దిట మొప్పంగను విశ్వకర్మవలనన్ నిర్మించి యంభోధి, క
చ్చట కేగించితి వెల్ల బంధుల నుదంచ ద్యోగశక్తిన్ హరీ!

వాడు పదునెన్మిదవసారి మూడుకోట్ల యవనసైన్యముతో యవనుడు తోడుగా నెత్తిరాగ, విశ్వకర్మవలన సముద్రములో ద్వారకానగర నిర్మాణము చేయించి నీయోగశక్తిచే నీ బంధువర్గమును అచ్చటికి బంపితివి.

పద్మ్యాం త్వం పద్మమాలీ చకిత ఇవ పురా న్నిర్గతో ధావమానో
మ్లేచ్ఛేశే నానుయాతో వధసుకృతవిహీనేన శైలే న్యలైషీః,
సుప్తే నాంఘ్ర్యాహతేన ద్రుతమథ ముచుకుందేన భస్మీకృతేఽస్మిన్
భూపాయాస్మై గుహాంతే సులలితవపుషా తస్థిషే భక్తిభాజే. 10

వనమాలాధర! పాదచారివయి పైపై భీతి నర్తించి ప
త్తనముం దాటియు పాఱిపోవుచును ద్వద్ధస్తమ్మునం జావ నో
చని మ్లేచ్ఛుం డటు వెంబడించి తరుమన్ శైలమ్మునన్ లీనతన్
గనగా! నమ్ముచుకుందు వాఁడు నటదాకన్ నిద్రలో మెళ్కువై

వనమాలధరించి నీవు పాదచారివై భయభ్రాంతుడైనట్లు పరుగెత్తి పట్టణముందాటి, మ్లేచ్ఛరాజుచే (యవనునిచేత) వెంబడించి తరుమబడి నీచేత జచ్చెడి పుణ్యమునకు నోచుకొనని వానిం దప్పించికొని యొక కొండలో లీనమైతివి. ఆపైని ముచుకుందుడు నిద్రబోవుచుండగా నా యవనుడు కాలితో నతనిం దన్నెను. దానికి కోపించి యాయన యా మ్లేచ్ఛుని భస్మముసేసెను. అవ్వల భక్తమణియైన యా ముచుకుందనృపతికి నీ చక్కని రూపమును దర్శింపజేసి యా గుహలో నుంటివి.

ఐక్ష్వాకోఽహం విరక్తోఽస్మ్యఖిలనృపసుఖే త్వత్ప్రసాదైకకాంక్షీ
హాదేవేతి స్తువంతం వరవితతిషు త న్నిస్పృహం వీక్ష్యహృష్యన్,
ముక్తే స్తుల్యాంచ భక్తిం ధుతసకలమలాం మోక్షమ ప్యాశు దత్వా
కార్యం హింసావిశుద్ధ్యై తప ఇతి చ తదా ప్రాత్థ లోకప్రతీత్యై. 11

ముని వానిన్ మఱి భస్మముం జలుప నా మ్రోలన్ గుహావీథి, నీ
వును భక్తాగ్రణియైన యాతనికి సొంపుల్ నింపు నీ మూర్తి చూ
పిన, నైక్ష్వాకుఁడ నే విరక్తుఁడను ద్వత్ప్రేమార్థి నీ సర్వ రా
జ నికాయమ్ము సుఖమ్ము కోరెదననన్ సంతోషివై నీవునున్,

**ముక్తికిం దుల్యమైన సద్భక్తి నిచ్చి**
**సర్వభయ మోక్షణమ్ము మోక్షమ్ము నిచ్చి**
**తపము హింసా విశుద్ధికిం దప్పదంటి**
**చేరి ముచుకుందునకు లోక శిక్షణకును.**

ఆవల నమ్ముచుకుందుడు నేనిక్ష్వాకువంశమువాడను రాజులందఱికి సుఖస్థానమైన రాజ్యమునెడల విరక్తిచెంది నీయనుగ్రహముకోరి యిటనున్నానని నిన్ను స్తుతించి యేవరమందు నాశలేకున్నవానింగని, ముక్తితో సమమైన భక్తిని బ్రసాదించి సర్వపాపములం దులిపినేయు మోక్షము ననుగ్రహించి, హింసచేసిన పాపముపోవుటకు తపస్సు చేయవలెనని లోకశిక్షణకొఱకు ముచుకుందునకు దెల్పితివి.

**తదను మథురాం గత్వా హత్వా చమూం యవనాహృతాం**
**మగధపతినా మార్గే సైన్యైః పురేవ నివారితః,**
**చరమ విజయం దర్పాయాస్తై ప్రదాయ పలాయితో**
**జలధినగరీం యాతో వాతాయేశ్వర! పాహి మామ్. 12**

**చని యటమీఁద నమ్మథురచాయల నయ్యవనేశు సేనలన్**
**దునిమి, నిరుద్ధుఁడై నడుమ దొట్టిన యమ్మగధేశు సేనచే**
**ననిఁ దుదిగెల్పు వాని మదమంతకు నంతకు నెక్కనిచ్చి, చ**
**య్యన పరువెత్తి తయ్యుదధి యందలి వీటికి; నన్ను బ్రోవుమా!**

అటుపై ద్వారకకేగుచు దారిలో మునుపటి వలె సేనలతో వచ్చి జరాసంధు డడ్డగింపగా నాయుద్ధమందు తుదివిజయము వానికిచ్చి వానికి నిండ మందమెక్కించుటకై పాఱిపోయి ప్రవర్షణమను కొండకొననెక్కి భూమికురికి జరాసంధుని కంటబడకుండ సముద్రమందున్న ద్వారకలో బ్రవేశించితివి. అట్టి స్వామివి నీవు నన్ను రక్షింపుము.

# 78 వ దశకము

# రుక్మిణీ కల్యాణయాత్ర

**త్రిదశవర్ధకి వర్ధిత కౌశలం త్రిదశదత్త సమస్తవిభూతిమత్,**
**జలధిమధ్యగతం త్వమభూషయో నవపురం వపురంచితరోచిషా. 1**

**నాకశిల్పి ప్రకల్పితానల్ప శిల్ప**
**కౌశలమ్ము, దిక్పాల సంకలిత భాగ్య**
**పేశలము, జలధి మధ్య సంవేశ మీవు**
**ద్వారక నలంకరించి తుదారమూర్తి!**

విశ్వకర్మ శిల్పనైపుణ్యమెల్ల రూపుకట్టినది. దిక్పాలురచే నీయబడిన సర్వసంపదలుగలది సముద్రమందున్నది అగు ద్వారకాపురమును నీ మనోహర మూర్తిచే నలంకరించితివి.

**దదుషి రేవతభూభృతి రేవతీం హలభృతే తనయాం విధిశాసనాత్,**
**మహిత ముత్సవఘోష మపూపుషః సముదితై ర్ముదితై స్సహ యాదవైః. 2**

**బ్రహ్మపంపున రేవతపతి కుమారి**
**రేవతి నొసంగ హలికి, సంప్రీతులైన**
**యాదవులఁగూడి పోషించి తట వివాహ**
**మహిత ముత్సవఘోష సమ్మర్ద మంత**

రేవతుడనురాజు రేవతియను కన్యను బ్రహ్మయానతిచే బలరామునకీయగా సంతోషముతోగూడిన యాదవులతో గొప్ప యుత్సవఘోషమును నింపితివి.

వి.వి : రేవతుడు రైవతింగొని సత్యలోకమేగి ఈమె నెవ్వరికిమ్మందువని బ్రహ్మ నడిగెను. ఆయన "నీ సమకాలికులైన రాజులిప్పుడులేరు. నీవు మరలి భూలోకమున కేగునప్పటికి రామకృష్ణు లవతరింపగలరు. అందు రామునకీ కన్య నిమ్ము" అని చెప్పెను.

**అథ విదర్భసుతాం ఖలు రుక్మిణీం ప్రణయినీం త్వయి దేవ సహోదరః,**
**స్వయ మదిత్సత చేదిమహీభుజే స్వతమసా తమసాధు ముపాశ్రయన్. 3**

**ఆ విదర్భాధిపతి కూతు రంచితాను**
**రాగ నీయెడ, రుక్మిణీరమణి, నన్న,**
**చేదిపతి కీయనెంచి యున్మాదియగుచు**
**నల్పుఁ దల్పాల్పుఁ డగు వానియందఁ జేరె.**

అటుపై విదర్భదేశాధిపతి భీష్మకునికుమార్తె రుక్మిణి నిన్నుగూర్చి విని మనసులో నిన్నె వరించినది. ఆమెను చేదిరాజగు శిశుపాలుని కీయవలెనని యన్నయగు రుక్మికి పిచ్చిపట్టినది. వాడందులకే వానియండ జేరెను.

**చిరధృతప్రణయా త్వయి బాలికా సపది కాంక్షిత భంగ సమాకులా,**
**తవ నివేదయితుం ద్విజ మాదిశత్ స్వకదనం కదనంగవినిర్మితమ్. 4**

బాల నీయెడ ననురాగలోల చాల
కాలముగ, కోర్కె సఫలమ్ముకాదొ యనుచు
కలఁగి బ్రాహ్మణు నంపె నిన్ దెలుపఁ నసమ
మసమకుసుమాస్త్ర వేదన నసహనయింప

ఆ బాల చిరకాలమునుండి నీయెడ ననురాగవతియై తనవాంఛ సఫలము కాదేమోయని కలతచెంది నీకు మన్మథుడు తనకు గల్పించిన బాధ నెఱింగింప నొక బ్రాహ్మణుని బంపెను.

**ద్విజసుతోఽపి చ తూర్ణ ముపాయయౌ తవ పురం హి దురాశదురాసదమ్,**
**ముద మవాప చ సాదరపూజిత స్స భవతా భవతాపహృతా స్వయమ్. 5**

విప్రబాలుఁడు వచ్చె వేవేగ నీ పు
రమ్మునకు దుష్టజనదుర్గమమ్మునకు న
పార ముదమందెఁ బ్రేమ సత్కారమంది
పరునిచేతను భవతాపహరుని చేత.

ఆ విప్రబాలకుడు దుష్టస్వభావులకు దుష్ప్రవేశమయిన మీ ద్వారకకు వచ్చి సంసారతాపహరుడు పరాత్పరుడునైన నీచేత సాదర సత్కారమంది సంతోషించి యిట్లుపలికెను.

**స చ భవంత మవోచత కుండినే నృపసుతా ఖలు రాజతి రుక్మిణీ,**
**త్వయి సముత్సుకయా నిజధీరతారహితయా హి తయా ప్రహితోఽస్మ్యహమ్. 6**

**కలదు రుక్మిణి యను రాచకన్య కుండి**
**నేశునందన నీకు సందేశ మిచ్చి**
**కలికి నీమీఁద నెంతేని వలపు గులికి**
**బాల యిటు పంపినది నన్ను బేల యగుచు.**

కుండినపురమునందు రుక్మిణియను రాచకన్నియ రాజిల్లుచున్నది. ఆమె నీయందు వేడుకగొన్నదై తనకు ధైర్యములేక నన్ను నీసన్నిధికి సందేశమిచ్చి పంపినది.

**తవ హృతాస్మి పురైవ గుణై రహం హరతి మాం కిల చేదినృపోఽధునా,**
**అయి కృపాలయ పాలయ మామితి ప్రజగదే జగదేకపతే తయా. 7**

**నందనందన! భువనసుందర హరించి**
**తీవు గుణముల నెపుడొ;చేదీశుఁ డిపుడు**
**నన్హరింపంగనుండె నన్గదిసి నీవు**
**పరమకృప కాటపట్టు చెఁబట్టవోయి!**

ఓ భువనసుందర! నీ కల్యాణగుణములచే నేనెప్పుడో హరింపబడి యుంటిని. ఇపుడు చేదిరాజు నన్ను హరింపనున్నాడు. ఓ విశ్వాధినాథ! నీవు కృపాలవాలమవు, భక్తపాలకుడవు, కావున నన్ను జేపట్టి పాలింపుము.

**అశరణాంయది మాం త్వ ముపేక్షసే సపది జీవిత మేవ జహా మ్యహమ్,**
**ఇతి గిరా సుతనో రతనో ద్భృశం సుహృదయం హృదయం తవ కాతరమ్. 8**

**ఈవు శరణమ్ము నన్నుపేక్షింతువేని**
**జీవిత మ్మొక్షణమ్మ త్యజించుననియె**
**ననుచు సదయమ్ము నీ హృదయమ్ము బెదరఁ**
**నూది పలికెను సద్హృదయుం డతండు.**

శరణులేకున్న నన్ను నీవుపేక్షింతువేని యిప్పుడప్రాణములం ద్యజింతును అని రుక్మిణీమణి సందేశమును వినిపించి నీసుహృద్వరుడైన విప్రబాలుడు నీ హృదయమును ప్రియవల్లభ ప్రాణాపాయమునకు చెదరి దయాపూర్ణమగునట్లు సేసెను.

**అకథయ స్త్వ మథైన మయే సఖే తదధికా మమ మన్మథవేదనా,**
**నృపసమక్ష ముపేత్య హరా మ్యహం తదయి తాం దయితా మసితేక్షణామ్. 9**

సదయుఁడై యంటి వీవు నమ్మదనవేద
నాతిశయ మంతకంటె నాకగ్గలమ్ము
రాజులందఱు సూడ నారాజముఖిని
ఇదిగొ గొనివత్తు నిపుడ హరింతునంచు

అపుడు మిత్రమ! ఆమెకంటె మిన్నగ నేను మదనవేదనకు గురియై యున్నాను. అందుచే నట కరుదెంచి నా మనఃకమలవాసినియైన యా కమలలోచనను రాజులెల్లరుం జూడ నిప్పుడ హరింతును- అని ప్రతిసందేశ మంపితివి.

**ప్రముదితేన చ తేన సమం తదా రథగతో లఘు కుండిన మేయివాన్,**
**గురుమరుత్పురనాయక మే భవాన్ వితనుతాం తనుతా మఖిలాపదామ్. 10**

అనిన నానందభరితుఁడౌ నతనితోడ
నపుడె రథయాత్రసేసితి వప్పురాన
కనిలపురనాథ అఖిలకల్యాణనిలయ!
పెండ్లికొడుకౌదు వింక మా వెత హరింపు.

అది విని యానందమునందిన యా విప్రనందనునితో రథమెక్కి కుండినపుర మేగితివి. ఓ అనిలపురనాయక! నీవు నాకష్టములెల్ల హరింపుము.

## 79వ దశకము

# రుక్మిణీ కల్యాణము

**బలసమేత బలానుగతో భవాన్ పుర మగాహత భీష్మకమానితః,**
**ద్విజసుతం త్వదుపాగమవాదినం ధృతరసా తరసా ప్రణనామ సా. 1**

శ్రీరమణీ మనోరమణ! సేనలతో బలరామమూర్తి దో
తేరగఁ దేరిపైఁ దరలి దివ్యరుచిన్ జనుదెంచి కుండిన
మ్మా రహి భీష్మ సత్కృతుల నందితివంచు వచింప నీ సమా
చారము శ్రోత్ర పర్వమయి చక్కగా రుక్మిణి మ్రొక్కె విప్రునిన్.

శ్రీవల్లభ! బలరాముడు సైన్యములతో తోడురాగా నరదమెక్కి కుండినపుర మేగుదెంచి భీష్మరాజువలన సత్కారమువడసి విడిది సేసియున్నావను వీనుల విందైన నీవార్త బ్రాహ్మణముఖమున విని రుక్మిణి యాయనకు నమస్కరించెను. సాక్షాదైశ్వర్యాధిదేవతగావున నమస్కారరూపముగ స్వరూపమైన యైశ్వర్యమును అనుగ్రహించె నన్నమాట. ఈ గ్రంథమునకెల్ల తలమానికమైన యీ కల్యాణ ఘట్టమునందాంధ్రీకరణము కథలోమాత్రము మూలాను సరణముగను కల్పనలో స్వతంత్రభావానుసరణముగను నడచినది.

భువనకాంత మవేక్ష్య భవద్వపు ర్నృపసుతస్య నిశమ్యచ చేష్టితమ్,
విపులఖేదజుషాం పురవాసినాం సరుదితై రుదితై రగమ న్నిశా. 2

ముందటఁ జూచి నీ భువన మోహన మందము పౌరులంద రా
నందము సెంది, రుక్మివలనం గలదౌష్ట్యము నిందసేసి యా
క్రందనముం బొనర్చి రటరాతిరి యెల్ల; మగండు గావుతన్
నందకుమారుఁ డీఁడు నృపనందన కంచు భజించి రీశ్వరున్

భువనమోహనమైన నీ సౌందర్య మెదుటజూచి రుక్మి చెల్లెలిని శిశుపాలుని కీయనున్న యా యాగడము నాడిపోయుచు పౌరు లారేయెల్ల పరితపించిరి.మఱియు నందకుమారు డీతడు మా రుక్మిణికనురూపుడు. ఇతడే యామెకు భర్తయగునట్లు సంఘటింపుమని దైవముం బ్రార్థించిరి.

తదను వందితు మిందుముఖీం శివాం విహిత మంగళ భూషణభాసురా,
నిరగమ ద్భవదర్పిత జీవితా స్వపురతః పురతః సుభటావృతా. 3

హంగొనరించి రత్నకనకాంబర హారమనోహరమ్ము పు
ణ్యాంగన లూతయై నడువ నంగజవైరి యనుంగు దేవి కు
త్తుంగకుచద్వయిన్ గొలిపె దోయిలి వ్రేళుల రత్నపుంగరాల్
ముంగరముత్తెపుం దళుకు ముంగలగా నెలనవ్వు దూఁకగన్

అటుమీద కులాచారముననుసరించి రాచకన్నియను స్వర్ణరత్నాభరణములచే మణిహారములచే నందముగ నలంకరించి వృద్ధసువాసినులు నడిపించు కొని రాగా దేవాలయమునకేగి యారుక్మిణి పార్వతిని అంజలిసేసి ప్రార్థించెను. ఇది మూలమందలితాత్పర్యము. తెలుగు అనువాదములో పెంపు ఇది. రుక్మిణీదేవి ఉన్నతస్తనకుంభములానుకొన దోయిలి కీలించెను. అనగా హృదయముతో ప్రార్థించినదని ధ్వని. అయ్యెడ నామె యద్దబాస ముత్యపుందలుకు ముందునకు దూకుచున్నవి.

**కులవధూభిరుపేత్య కుమారికా గిరిసుతాం పరిపూజ్య చ సాదరమ్,**
**ముహు రయాచత తత్పదపంకజే నిపతితా పతితాం తవ కేవలమ్. 4**

**మంగళదేవతం గొలిచి మాటికి మాయిలు వేల్పవమ్మని**
**న్నుం గొలుతుం గదమ్మ శివు నోముల పంటగదమ్మ నీవు న**
**న్నుంగరుణింపుమమ్మ! మదనుం బ్రతికించినకొమ్మ! నందు నిం**
**టం గల సొంపు మేలిమికడాని హొరంగున రత్న కాంతి న**
**ట్లుం గలుపం గదమ్మ నను లోఁగొని శ్రీగిరి కన్యకామణీ!**

సర్వమంగళను పూజించి మంగళదేవత యవతారమైన రుక్మిణి పలుమారులు అమ్మా! నీవు మా యిలవేల్పువుగదాయని నిన్నే సేవించుచున్నాను. శివుని పుణ్యముల పంటవు గావున నీయంతటి సౌభాగ్యము నాకనుగ్రహించుము. శివునికంటికెరయైన మన్మథుని పునరుజ్జీవితుంజేసినదానవు. అట్లుజ్జీవితుడైన మన్మథుడే కృష్ణువిషయములో నెనలేని మోహమును ఉజ్జీవింపజేయుచున్నాడు. కావున నందునింట పెరిగిన ఒకానొక సొంపు అనగా కృష్ణుడు అనెడి మేల్మి బంగారముతో రత్నకాంతిని అనగా నన్ను సమ్మేళనము సేయుముతల్లీ! ఓ గిరికన్య! అని రుక్మిణిప్రార్థించినది. మేల్మిబంగారునగలో రత్నముపొదివినట్లు (బంగారమునకు పరిమళమబ్బినట్లు) మీ యిద్దరిని సమ్మేళనపఱచి సనాతన దంపతులగు పార్వతీ పరమేశ్వరులగు మీసమ్మేళనమట్లు మా దాంపత్యము రాణించునట్లు అనుగ్రహింపుమని యామె హృదయము.

**సమవలోక కుతూహల సంకులే నృపకులే నిభృతంచ త్వయి స్థితే,**
**నృపసుతా నిరగా ద్గిరిజాలయాత్ సురుచిరం రుచిరంజితదిఙ్ముఖా. 5**

**భువనమోహనరూపరుచా తదా వివశితాఖిలరాజకదంబయా,**
**త్వమపి దేవ కటాక్షవిమోక్షణైః ప్రమదయా మదయాంచకృషే మనాక్ 6**

**అని నగరాజ కన్యకొలువై యుడురాజ నిభాస్య యాలయ**
**మ్మును దెరలన్ జనన్ లలన ముద్దుల నవ్వుల మించుటందెలన్**
**నినుచు ఝుణంఝుణన్ దళుకునించెడి యమ్మొలనూలి కింకిణీ**
**స్వనముల సొమ్మసిల్లె నృపసంఘము, నీ మనముల్లసిల్లగన్**

అట్లు నగరాజకన్యం గొలిచి ఉడురాజముఖి=చంద్రవదన రుక్మిణీదేవి యాలయము వెడలి చనుచుండ నామె చిఱునవ్వులు, ఆమె యందెల ఝణఝణ ధ్వని యామె యొడ్డాణమందలి రత్నాల చిఱుగంటల సవ్వడికి నృపసమాజము మూర్ఛపడెను. కృష్ణస్వామి! అపుడు నీ మనస్సుల్లసిల్లెను

**క్వను గమిష్యసి చంద్రముఖీతితాం సరసమేత్య కరేణ హరన్ క్షణాత్,**
**సమధిరోప్య రథం త్వ మపాహృథా భువి తతో వితతో నినదో ద్విషామ్. 7**

**అరదముడిగ్గి యిందుముఖి నల్లన సందిటఁజేర్చి చారుమం**
**థంగతిఁ దూఁగి చాగి, వదనమ్ము సెమర్పగ, నుత్తరీయపుం**
**జెరగటు తూలఁ గొప్పువిడి చిందుకొనం దలపూలు దివ్యసుం**
**దరి నతిసుందరుండ వరదమ్ము పయిం గయిసేసి తంతటన్**

కృష్ణా! నీవు రథము దిగి యా చంద్రవదనను మెల్లగ(ఆమె మెయితీగ ఒత్తకుండ) సందిటంబట్టి చక్కని మందగమనముతో తూగుచు ముందునకు సాగి (ఎదుటనున్న అరివర్గముంగని నదురుబెదురులేని ఒక అద్భుత ధీరత్వము యొక్క అనుభావమిది) పైనున్న పచ్చని పీతాంబరముకొన తూలుచుండగా (ఇది మంగళపదార్థమగు పసపుయొక్కస్ఫురణ గూర్చు ధ్వని) తురుమువీడి నీ తురుముకొన్న పువ్వులు జలజల రాలగా (ఇదియును కల్యాణలక్షణమైన పుష్ప వర్షమునకు సూచన) దివ్యసుందరి రుక్మిణిని (దివ్యశబ్దము ఇట నామె సాక్షాన్మహాలక్ష్మియని తెలుపుటకు) (దివ్య) సుందరుడవగునీవు (దీనిలో అన్యోన్యానురూప్యము ధ్వనించుచున్నది). నీ రథమందు అలంకరింపజేసితివి.

అధిష్ఠింపజేసితివి. సాక్షాన్మహాలక్ష్మి కావున ఆమె అధిష్ఠించుటవలన రథమునకొక అందము వచ్చినదని ధ్వని.

**రాజులు మూర్ఛ నొందగ, విరాగము నెందగఁ గొంద రందుఁ వి**
**భ్రాజిత మూర్తి యౌచు బలరాముఁడు సేరి సరాగ మాడ, ను**
**ద్వేజనమంద రుక్మి, సిరి వేమరు ముంగురు లల్ల త్రోచి నీ**
**రాజన మెత్తె నీకు నదిరా! దరహాసకటాక్షచంద్రికల్**

జగన్మోహినియైన యా జగజ్జనని విలాసములో దరహాసములో మతిపోయి రాజులు మూర్ఛపోయిరి. కొందరు మూర్ఛతేరి విరాగమునొందిరి. నిరాశవలన గలిగిన అరతియను ననుభావమిది. అంతట బలరామస్వామివారు మరదలివంక జూచి యించుక మెత్తగ సరాగమాడినారు. అదిచూచి రుక్మి ఉద్రేకమందెను. మగడు కొట్టినందుకు గాదు, సవతి దెప్పినందుకన్న సామెతగా బలరాముని పరిహాసముచే రుక్మి కెక్కడలేని యుద్వేగము జనించెనని భావము. సిరి=మహాలక్ష్మి రుక్మిణి, మాటిమాటికి నలకలను అంగుళీయక మణిప్రభ లెగయ నెగద్రోసికొనుచు, నందుచే స్పష్టముగ నభివ్యక్తమగుచున్న చిఱునవ్వులతో కటాక్ష వీక్షణములతో ప్రాణవల్లభుడైన నీకు నీరాజనమిచ్చెను. నడివీథిలో నింతమంది దృష్టికి గురియైన నీ సోయగమున కెక్కడి దిష్టి తగులునేమోయని కాబోలు సాక్షాన్మహాలక్ష్మి నీకు మందహాసకటాక్షరూపమున అచ్చపు పచ్చకప్పురపు నివాళి యెత్తెనని భావము. నీ శృంగారమున కింత మున్ను మురిసినది యిప్పుడు అద్భుత వీరరసముల కాలంబనమైన నీయందమునకు మిగుల తన్మయురాలయ్యె నన్నమాట.

**క్వను గతః పశుపాల ఇతి క్రుధా కృతరణా యదుభిశ్చ జితా నృపాః,**
**నతు భవా నుదచాల్యత తైరహో పిశునైః శ్వునైరివ కేసరీ.** 8

**తదను రుక్మిణి మాగత మాహవే వధముపేక్ష్య నిబధ్య విరూపయన్,**
**హృతమదం పరిముచ్య బలోక్తిభిః పురమయా రమయా సహకాంతయా.** 9

**అవల రుక్మియుఁ గలిసిరా నంగవించి**
**పోరి దొర లోడి రయ్యదువీరులకును**
**నీవు చెదరవు నీచాతినీచములకు**
**గ్రామసింహమ్ములకు సింహ మేమి బెదరు.**

అటుపైని అవమానితులైనట్లు దొరలుశిశుపాలుడు రుక్మిం గూర్చుకొని విజృంభించి పోరి యదువీరుల కోడి పోయిరి. అపుడు నీవు చెక్కుచెదర కట్లే యుంటివి. అవును. నీచాతినీచములయిన గ్రామసింహములకు (కుక్కలకు) సింహము బెదురునా? అర్థాంతరన్యాసాలంకారము. ఇట దొరలు అను వ్యంగ్యప్రయోగము వారియెడ పరిహాసముసూచించును.

**ఓరోరి! ఆలకాపరి ఒహో! నిలు చోరుఁడవీవు జారుఁడం**
**చూరక రాచవారు నిను నుల్లస మాడగ; సిగ్గు సెంది లో**
**నారసెఁ బెండ్లి కూతురవు నౌ పసు లీ నృపు లంచు గోపికా**
**జారుని నిన్ను నిక్క మెకసక్క మహో! నవనీతచోరుఁగాన్**

ఓరోరి! పసులకాపరి చక్కనిచుక్క నెత్తికొనిపోవుచున్నావు! నిలు నిలువుము! నీవు జారుడవు చోరుడవును. అని రాజులు నిన్ను బాణములం బొడువలేక మాటల నెత్తిపొడుచుట చూచి నీ ప్రియవల్లభ క్రొత్తపెండ్లికూతురు గదా! కొంచెము సిగ్గువడి యంతలో దెలిసి, ఈసున వీరన్నను నీ పరియాచక మక్షరాల నిజము-ఈరాజులు పశువులు. వీరి నిపుడు తోలెగదా ఇతడు పసుల కాపరియే. ఇక జారత్వముమాట. గోపికాజారుడన్నది ప్రసిద్ధమే. పెరుగుపాలు వెన్నదొంగిలిన మహానుభావుడు చోరుడే పోనిమ్మని జగన్మంగళ యాదూషణములన్నియు స్వామికి భూషణములని విమర్శించి గ్రహించెను.

**ఎంచక రుక్మి బావ యెదిరించిన ముండన మండనమ్ము గా**
**వించియు సున్న మద్దితివి; ఎట్లు లభించెనొ నీకు? వాదముల్**
**వెంచకు మత్తవారి యిలు విందును వీడె మొఱుంగ వింత, కా**
**కొంచెము రుక్మిణమ్మ తన కొంగునఁగట్టుక తెచ్చెనా! హరీ!**

నీ వైభవము గణించక నీబావమరది రుక్మి నిన్నెదిరించెను. అప్పుడాతనికి ముండనరూపమైన మండనము (అలంకారము చేసినావు అంతియకాదు. సున్నముకూడ అద్దితివి. ఆ బోడికి సున్నపుబొట్టు పెట్టినావు. (మీ అన్నయ్య బలరాముడు బంధువధ వద్దని చెప్పుటవలన రుక్మిని విరూపుంజేసి వదలితివి) మంగలి చేయవలసిన మంగళము నీవు చేయవలసి చేసితివి. సుఖహస్తముగ సుశీఘ్రముగ వాండ్రు చేయగలరు. ఆ చేత నీచేత నెట్లగును. ఇదిగాక

వారికిగల మెత్తని సాధనము నీకేది. వాడియైన ములికితోనో బల్లెముతోనో మఱిదేనితోనో రథముమీద గూర్చుండబెట్టి చెక్కియుందువు. అంతలో జాలి కలిగినదికాబోలు పుండ్లు త్వరగా మానుటకో సున్నపుబొట్లు బెట్టితివి. అంతయు బాగున్నదికాని స్వామీ! ఈ హాళాహళిలో నీకు సున్నమెక్కడ దొరికినది? అత్తవారింట విందారగించుట తాంబూలము నింతదాక యెఱుంగవే. ఆమె ముందే గ్రహించి కొంగున గట్టితెచ్చె గాబోలు కావచ్చు. రుక్మిణమ్మ హృదయము నీ హృదయ మొక్కటేగదా.

**అలరి చేఁతలన్నియును, నచ్చట మంత్రము తంత్ర మేది? క**
**య్యాలనఁగాదె నాందిముఖ, మద్దిర! విందట మందు, చాలు బు**
**క్కాలును బూలజల్లులును గా శరవర్షము, చిమ్ముకొన్నయా**
**కోలల తోడనే యెదురుకోల బళీ! తమపెండ్లి ముచ్చటల్.**

స్వామీ! ఎప్పుడో శిశువుగా నల్లరిసేసి అల్లరిపడితివి అనుకొన్న నిపుడీడువచ్చి చేసినదేమి? ఇది స్వయంవరము కాదు-గాదు గాంధర్వము-కాదు రాక్షసవివాహము. ఇందెద్దానను మంత్రము లేదు తంత్రములేదు. నాంది ముఖము కయ్యాలతోనే, విందులేదు మందేకాని-పెనగులాటలో తగిలినదెబ్బలకు చికిత్సేగాని మరిలేదన్నమాట. ఆపెండ్లిలో బుక్కాలు చల్లుకొనుట పూలజల్లులు తలంబ్రాలు మొదలయినవి యుండును. నీ పెండ్లిలో నదియెల్ల శరవర్షము బాణములవాన, ఇందు చిమ్ముకొన్న యా కోలలతోనే=బాణవిశేషములచేతనే ఎదురుకోల=ఎదురుసన్నాహము బాగున్నది ప్రభూ! నీ పెండ్లిముచ్చట చూడ ముచ్చటగా నున్నది.

**మంగళ మూర్తి తోడ గరిమన్ సుమనోరథమెక్కి యోజగ**
**న్మంగళ ద్వారకాపురము మార్గము వట్టితి వా రథాన నం**
**తం గని సిగ్గునం గనుఁగొన దలవాంచి కనుంగొనన్ సము**
**త్తుంగ పయోధరన్ నెనరు తోపఁగఁ బ్రోవల బుజ్జగించుచున్.**

మంగళ దేవతయైన రుక్మిణితో దిగ్విజయము చేసిన యెనలేని గౌరవముతోను=మంచిది సఫలమైనది అగు మనోరథాన=వేడుకతో, ఎపుడు ద్వారకలో వ్రాలి నందయశోదలకు కోడలింజూపి యుల్లాసపరతునో అని మొదలయిన ఉల్లాసముతోను సుమనో+రథాన=పుష్పరథముమీద

పుష్పకముమీద సాక్షాన్మహాలక్ష్మితో విష్ణువలె విహరించుట యిక్కడధ్వని- రథాన=జగన్మంగళమూర్తివి నీవు రుక్మిణి నిన్ను సిగ్గుచే తలవంచికొని గనుగొనన్ =కంటికొనతో వాల్చూపులతో (అపాంగములతో) కనుంగొనన్= చూడగానీవు సాక్షాల్లక్ష్మి కటాక్షమునకు పాత్రుడవై త్రోవలో నేకాంతస్థితి లభించినందున యాకుంభస్తనిని బుజ్జగించుచు ద్వారకాపురము దారి బట్టితివి. ఉత్తుంగపయోధర అను విశేషముచే ఆమెను కృష్ణుడు కౌగిలించి లాలించెనని ధ్వనించుచున్నది. ఈ లాలించుట, పరమాత్మ యొక్క అనుభవములు పూర్తిగా తెలియని ముగ్ధ కావున -అన్నకు జేసిన పరాభవము మొదలయినవి చూచి బెదరిపోయెనేమో యని-క్రొత్త పెండ్లికూతురగుటచే ప్రౌఢగాదని, బంధువులందర విడిచి యిప్పుడే వచ్చితినని `బెంగగొనునని-అన్నిటికన్న విప్రునిచే ప్రణయ సందేశమంపితినే రాచకన్నియలు లజ్జవిడిచి అట్లు చేయుట పాడిగాదని తా ననుకొనుచున్నాడేమోయని బిడియము జడుపు గొనుచున్నదేమో అని యిట్లు ఎన్నో యభిప్రాయములతో స్వామివారు త్రోవలోనే యామె ననునయించి లాలించి తన శృంగార రసానుభావముయొక్క పరమోన్నతస్థాయిని తొలిసారికూటమిలోనే ఆమెకు రుచి చూపి యామె నుల్లాసపరచినారని భావము.

**నవసమాగమ లజ్జితమానసాం**
**ప్రణయకౌతుక జృంభిత మన్మథామ్,**
**అరమయః ఖలు నాథ యథాసుఖం**
**రహసి తాం హసితాంశు లసన్ముఖీమ్. 10**

**కల్యశ్రీ నటు నీదుతోన త్రి జగత్కల్యాణమై రుక్మిణీ**
**కల్యాణమ్మది ద్వారకన్ జరిగెఁ జక్కన్ సర్వసౌభాగ్య సా**
**ఫల్యం జేయుచు నర్మగర్భిత వచో వ్యాసక్తి శృంగార సౌ**
**శీల్యమ్మొ నటులన్ రమించితి వటన్ శ్రీమన్మహాలక్ష్మితోన్**

పవిత్రమైనశోభతో ద్వారకయందు నీకును రుక్మిణీదేవికిని జక్కగా కల్యాణమహోత్సవము జరిగినది. -అవ్వల రుక్మిణీదేవి సర్వసౌభాగ్యము సఫలముంగావించి, నర్మగర్భములైన సాభిప్రాయములైన మధుర లలిత చాటూక్తులచే హాస్యములచే శృంగార పరమావధియోగ్యత వ్యక్తమౌనట్లు శ్రీమహావిష్ణువవైన నీవు శ్రీమహాలక్ష్మితో క్రీడించితివి.

వి.వి: ఇటు ద్వారక యనగా నవద్వారములు గల యీ శరీరమే. అందు రుక్మిణీ కృష్ణులనగా జీవాత్మ పరమాత్మలే. వారి అన్యోన్య సమైక్యమే అద్వైత పరమావధిరూపమైన బ్రహ్మానందానుభవము. అదే రమణము, ఇదే శ్రీమద్భాగవతము యొక్క హృదయము. పురాణములం దాయా ఉపాస్యదేవతల యొక్క దాంపత్య ప్రస్తావన కెల్లెడ నిదే రహస్యము ఇది గురుముఖైకవేద్యము.

**వివిధ నర్మభిరేవ మహర్నిశం ప్రమద మాకలయన్ పున రేకదా,**
**ఋజుమతేః కిల వక్రగిరా భవాన్ వరతనో రతనోదతిలోలతామ్. 11**

**తదధికైరథ లాలనకౌశలైః ప్రణయినీ మధిక సుఖయ న్నిమామ్,**
**అయి ముకుంద భవచ్చరితాని నః ప్రగదతాం గదతాన్తి మపాకురు. 12**

**అద్వయానంద హేల నుయ్యాల నూగి**
**యువిద ఋజుమతిగూడి వక్రోక్తులాడి**
**తవ్యయానంతభోగశయ్యాగ్ర శయన!**
**రుక్మిణీప్రియ నన్నట్లు బ్రోవుమయ్య!**

అవ్యయుడైన అనంత భోగి భోగతల్పమందు శయనించునో పద్మనాభ గురువాయూరుపురీ విహార శోభనదేవత! మీరిర్వురు అద్వైతానంద విలాసము నందుయ్యాలలూగి చతుర్దశ భువన మోహనులయినారు. అట్టి వైభవము నాకును చేకూర్చుట మూలమున రుక్మిణీరమణా! నన్ను రక్షింపుము.

# 80వ దశకము

# స్యమంతకోపాఖ్యానము

**సత్రాజిత స్త్వమథ లుబ్ధవ దర్కలబ్ధం**
**దివ్యం స్యమంతకమణిం భగవ న్నయాచీః,**
**తత్కారణం బహువిధం మమ భాతి నూనం**
**తస్యాత్మజాం త్వయి రతాం ఛలతో వివోఢుమ్. 1**

రవి మున్నిచ్చిన యా స్యమంతక మహారత్నమ్ము నర్థించినాఁ
డవు సత్రాజితు నొక్కలుబ్ధుఁడటు; గాఢ ప్రేమయౌతత్తనూ
భవఁజేపట్టఁదలంచి యీ నెపమునన్;ద్వద్దివ్య లీలానుభా
వవిశేషమ్ము లుదారహేతుకములై భాసించు నాబుద్ధికిన్.

సత్రాజిత్తు సూర్యునివలన వరముగా బడసిన స్యమంతకమణిని నీవు దురాశాపరుడట్లు యాచించితివి. ఆ అడుగుటలో నెన్నో కారణములు నాబుద్ధికి తట్టుచున్నవి. అవి జాంబవంతుని యనుగ్రహించుట, అతని కుమార్తెను జాంబవతిని గ్రహించుట, సత్యభామా స్వీకారము, సత్రాజిత్తు శతధన్వులవధ, అక్రూరునిపై-ప్రీతి నెఱపుట మొదలయినవి. ఈమిషతో సత్యభామను బెండ్లాడుట యిందులో ప్రధానము.

**అదత్తం తం తుభ్యం మణివర మనే నాల్పమనసా**
**ప్రసేన స్తద్భ్రాతా గళభువి వహన్ ప్రాప మృగయామ్,**
**అహన్నేనం సింహో మణిమహసి మాంసభ్రమవశాత్**
**కపీంద్ర స్తం హత్వా మణిమపి చ బాలాయ దదివాన్.** 2

ఈ ననె వాఁడు రత్న మతిహీనమతిన్, మణి వాని తమ్ముఁడున్
దానిని దాల్చి వేటకుఁజనన్ మృగరా జది మాంసమంచు మ
వ్వానిని జంపె, దాని నటుపై కపిరాజు వధించి యమ్మణిన్
మానితకేళి కందుక మొనర్చెఁదగన్ శిశు రత్నడోలికన్.

అల్పబుద్ధితో సత్రాజిత్తు నీ కామణి నీయననెను. వాని తమ్ముడారత్నముం ధరించి వేటకేగెను. సింహ మది మాంసపుముద్దయనుకొని వానిం జంపెను. జాంబవంతు డాసింహముం జంపి మణిని దెచ్చి తనకుమార్తె జాంబవతి ఉయ్యాలపై ఆటబంతిగా వ్రేలాడగట్టెను.

**శశంసుః సత్రాజి ద్గిరమనుజనా స్త్వాం మణిహారం**
**జనానాం పీయుషం భవతి గుణినాం దోషకణికా,**
**తత స్సర్వజ్ఞోపి స్వజనసహితో మార్గణపరః**
**ప్రసేనం తం దృష్ట్వా హరి మపి గతో భూః కపిగుహామ్.** 3

జను లాడంజని రీవ దొంగనని యాసత్రాజిదుక్తిన్; గుణా
గ్రణులం దప్పిద మింతయేని యమృతప్రాయమ్ము లోకాన,కీ
వును సర్వజ్ఞుఁడ వయ్యునున్ వెదుక నాప్తుల్ దోడుగా నేగి కా
నను గన్గొంటి ప్రసేను సింహ మటు పైనన్ జాంబవంతున్ గుహన్.

సత్రాజిత్తు నీవే యామణిని హరించియుందువని నీపై నిందమోపెను. ప్రజలా అపవాదును నమ్మి నిన్నాడ జొచ్చిరి. గుణవంతులయం దించుక అవగణము మచ్చ కనబడిన నది లోకమున కమృతప్రాయముగానుండును. అనగా గోరంతకొండంతచేసి చెప్పుకొని యుప్పొంగుచుందురు. అటుమీద నీవు సర్వజ్ఞుడవయ్యు ప్రాకృతపురుషుడట్లు నటించి స్వజనముతో వెదుకగా నేగి, పడియున్నప్రసేనుని సింహముంగని యాజాడపట్టి జాంబవంతుని గుహలోని కరిగితివి.

భవంత మవితర్క్యయ న్నతివయాః స్వయం జాంబవాన్
ముకుందశరణం హి మాం క ఇహ రోద్ధుమిత్యాలపన్,
విభో రఘుపతే హరే జయ జయే త్యలం ముష్టిభి
శ్చిరం తవ సమర్చనం వ్యధిత భక్తచూడామణిః. 4

ముదుసలి కోతి నీ నిజము పోల్పక నన్ను ముకుందభక్తు నె
య్యదనున నోర్చువాఁడెవఁడటంచు ప్రభూ! రఘునాథ! శ్రీహరీ
యిదె జయ మిమ్ము నాదుగతి యీవని గుప్పిటి పోటులన్ భవ
త్పదయుగ భక్తమౌళి సలుపన్ దొడఁగన్ భవదర్చన మ్మనిన్.

ముసలికోతి జాంబవంతుడు నీకు భక్తుడే అయినను నిన్ను గుర్తింప లేడయ్యెను మఱియు శ్రీరామచంద్ర! శ్రీహరి! అని జపముచేయుచు నాకీ తగవులాటలో జయమిమ్మని నిన్నెఱుగకయే నిన్ను ప్రార్థించి నీతో దలపడి గ్రుద్దులతో బూలతోవలె నిన్నర్చింపబూనెను. ద్వంద్వయుద్ధరూపమున ప్రదక్షిణములు చేసెను.

బుద్ధ్వాథ తేన దత్తా నవరమణీం వరమణించ పరిగృహ్ణన్,
అనుగృహ్ణ న్నము మాగా స్సపది చ సత్రాజితే మణిం ప్రాదాః. 5

**గణియించి తుదకు రమణీ**
**మణితో మణినీయ, భక్తమణి దేర్చి నృపా**
**గ్రణి సత్రాజితునకు నా**
**మణినిచ్చితి వఖిలదేవమణి వీవు హరీ!**

నీ గ్రుద్దులకు నొచ్చి నీవు పురాణపురుషుడవు హరివని తెలిసి అపరాధ క్షమార్పణముగా స్యమంతమణి కన్యామణియగు జాంబవతి నీయగా నీ భక్తశిరోమణియగునావృద్ధుని నలరించి నీ హస్తపద్మముచే నొడలెల్ల తాకి నీ గ్రుద్దులచే గల్గిన నొప్పిని హరించి యొప్పుగూర్చి వచ్చి యా రత్నమును సత్రాజిత్తున కిచ్చితివి. సకల దేవతాశిరోమణివిగదా నీవు.

**తదను సఖలు వ్రీడాలోలో విలోలవిలోచనాం**
**దుహితర మహో ధీమాన్ భామాం గిరైవ పరార్పితామ్,**
**అదిత మణినా తుభ్యం లభ్యం సమేత్య భవానపి**
**ప్రముదిత మనా స్తస్మై ప్రాదా న్మణిం గుహనాశయః. 6**

**ధీమహితుండు సిగ్గువడి తెచ్చి మణిన్, సువిశాలనేత్ర భా**
**మామణి నీకు నిచ్చె మును మాట మఱొక్కని కిచ్చికూడ, నీ**
**వీమణి యీనునట్టి ధన మీ లలనామణి చాలు మాకు నీ**
**దే మణియంచుచునున్ దిఱిగియిచ్చి తటన్ గహనాశయుండవై.**

బుద్ధిమంతుడు సత్రాజిత్తు సత్యభామను అలంకరించి తీసికొనివచ్చి లోగడ శతధన్వున కిత్తునని మాటయిచ్చికూడ (వాగ్దత్తయైన కన్యనుగూడ) స్యమంత మణితోగూడ నీకర్పించెను. నీవును లలనామణియు దినదినము మణి యీనెడి ఎనిమిది మణుగుల బంగారము మాకు చాలునని గంభీరాశయుడ వైన నీవు మణిని సత్రాజిత్తున కిచ్చివేసితివి.

**వ్రీలాకులాం రమయతి త్వయి సత్యభామాం**
**కౌంతేయదాహ కథయాథ కురూన్ ప్రయాతే,**
**హీ గాందినేయకృతవర్మగిరా నిపాత్య**
**సత్రాజితం శతధను ర్మణి మాజహార. 7**

ఆయెడ సిగ్గునన్ బెదరు నమ్ముదితన్ రసముగ్ధఁజేసి, కౌం
తేయులు లక్కయింటజను తీరు గ్రహించి యటేవు నేగినన్;
పాయక గాందినేయ కృతవర్మల మాట స్యమంతకమ్మున
న్యాయము నాక గ్రుచ్చిలె నహో! శతధన్వుఁడు కూల్చి తత్పతిన్.

అటుపై సిగ్గుపడుచు నల్లల్లన బెదురుచూపుల నిన్నుజూచు నమ్ముదితను సత్యభామను నమ్ముదితను జేసితివి. అక్కడ పాండవులు లక్కయిల్లు సొచ్చుట నంతర్దృష్టితో జూచి నీవట కేగగా శతధన్వుడు అక్రూరునియొక్కయు కృతవర్మ యొక్కయు దుర్బోధచే సత్రాజితుం జంపి యమ్మణిని గాజేసెను.

శోకాత్ కురూనుపగతా మవలోక్య కాంతాం
హత్వా ద్రుతం శతధనుం సమహర్షయ స్తామ్,
రత్నే సశంక ఇవ మైథిలగేహ మేత్య
రామో గదాం సమిశిక్షత ధార్తరాష్ట్రమ్. 8

పొక్కుచు సత్యభామకురుభూములకున్ జనుదేరనామెలో
నెక్కొను కుందువాయ, ఖలునిన్ శతధన్వుని గూల్చినాఁడ వీ
వక్కడ రత్నమున్నదని నట్టులు, రాముఁడు సూచి మైథిలున్
మక్కువతో గదాయుధసమర్థుని జేసెను గౌరవేశ్వరున్.

సత్యభామ పితృమరణము విని దుఃఖించి నీవున్న కురుదేశమునకు వచ్చి వాపోవ నామెశోకమువారించుటకు శతధన్వునియొద్దనే రత్నమున్నట్లు దానికొఱ కన్నట్లు వానింజంపి వాని వస్త్రములందుమణిని వెదకినట్లు నటించితివి. బలరాముడు "నీవు పురికేగి మణిని వెదకిపట్టుకొమ్ము" అని కృష్ణునికి దెలిపి మైథిలుకడకేగి సుయోధనునికి గదాయుద్ధము నేర్పెను.

అక్రూర ఏష భగవన్ భవదిచ్ఛయైవ
సత్రాజితః కుచరితస్య యుయోజ హింసామ్,
అక్రూరతో మణి మనాహృతవాన్ పునస్త్వం
తస్యైవభూతి ముపధాతు మితి బ్రువన్తి. 9

హరీ! సత్రాజితు జంపుమం చనుపునే యక్రూరునింబోలు స
చ్చరితుం, డంతయు నీ తలంపునఁగదా సాగున్; గృపామూర్తి వి
వరరే! కైకొనవైతి వమ్మణియు ము న్నక్రూరుచేఁ జిక్కుటి
వరయన్ నేర్చియు నా ప్రభక్తుని సమగ్రైశ్వర్యుఁ గావింపగన్.

ఓ హరీ! అక్రూరునివంటి సాధువు భక్తుడు సత్రాజిత్తును జంపుమని పంపునా? అదంతయు నీశ్వరుడవైన నీ సంకల్పముచే జరిగినది నీవు దయామూర్తివి మణి యక్రూరుని చే జిక్కినని యెఱింగియు నీవా భక్తుని సర్వైశ్వర్య సంపన్నుని జేయదలంచియే మణిని చేకొనవైతివి

భక్తస్త్వయి స్థిరతరః సహి గాందినేయ
స్తస్యైవ కాపథమితిః కథ మీశజాతా,
విజ్ఞానవాన్ ప్రశమవా సహ మిత్యుదీర్ణం
గర్వం ధ్రువం శమయితుం భవతా కృతైవ. 10

అయయో! నీయెడ భక్తిసుస్థిరుఁడయో! యక్రూరుఁడీలాటి దు
ర్ణయమేలా యొనరించె! శాంతుఁడనియున్ బ్రజ్ఞాని నే నంచునన్
స్మయమున్ విస్మయ మంకురించెనని తత్ స్వాంతమ్ములో దోస మ
వ్యయ! సంహారముసేయ నీవ యతనిన్ బట్టించినా వీగతిన్.

అక్కటా! అక్రూరు డీలాటి క్రౌర్యమేల చేసెను? అన్న శాంతుడను జ్ఞానిని అను గర్వము వానిలో నంకురించెనని నీవు కనిపెట్టి ఆదోషమును హరించుటకు నీవే వాని కీగతి పట్టించితివి.

యాతం భయేన కృతవర్మయుతం పునస్త
మాహూయ తద్వినిహితం చ మణిం ప్రకాశ్య,
తత్రైవ సువ్రతధరే వినిధాయ తుష్యన్
భామాకుచాంతరశయః పవనేశ పాయాః 11

వ్యాకులుఁడై భయానఁ గృతవర్మయుఁ దాను నొకటని పారినన్
జేకొని పిల్చి వానికడ నిస్తులరత్నము వెల్వరించి యం

**దే కడకుండనిచ్చి యది, యీవును దృప్తుడవైతి, సత్యభా**
**మాకుచవేదికాశయన! మారుత మందిర! ప్రోవరా మమున్.**

సత్రాజిత్తుం జంపిన శతధన్వుని గూల్చిన కృష్ణుడు తత్ప్రేరకులమైన నన్నును అక్రూరునింగూడ చంపక మానడను భయముతో కృతవర్మ పారిపోగా వానిని, అక్రూరుని దూతను బంపి రప్పించి శతధన్వు డక్రూరునికిచ్చిన యామణిని బలరామాది బంధువులకు జూపించి అది యక్రూరుదగ్గరనే యుండనిచ్చి కృతార్థుడవై సంతృప్తిచెందితివి. ఓ సత్యభామాకుచకుంభవిహారీ! హరీ! పవనపురచారీ! మమ్ము రక్షింపుము.

## 81వ దశకము

# సుభద్రావివాహము, కాళింద్యాది కల్యాణము, నరకాసుర వధ

**స్నిగ్ధాం ముగ్ధాం సతతమపి తాం లాలయన్ సత్యభామాం**
**యాతో భూయ స్సహ ఖలు తయా యాజ్ఞ సేనీ వివాహమ్,**
**పార్థప్రీత్యై పునరపి మనాగాస్థితో హస్తిపుర్యాం**
**శక్రప్రస్థం పురమపి విభో సంవిధాయాగతోభూః.** 1

**వలపుల్ గుల్కెడు సత్యభామఁ బ్రణయవ్యాసక్తి లాలించుచున్**
**కలికిం గూడుక ద్రౌపదీపరిణయానందమ్మునం దేలి,నీ**
**చెలి సంప్రీతికి హస్తినాపుర మటన్ సేవించి యేతెంచి తా**
**తల కట్టించి మహాద్భుతమ్మయిన యింద్రప్రస్థ మల్లలనన్.**

వగలుగుల్కు ముద్దరాలు సత్యభామను బ్రణయలీలలచే లాలించుచు నామెతో ద్రౌపదీకల్యాణమునకేగి అర్జునుని వేడుకకు హస్తినాపురము సని అవల విశ్వకర్మచే నిర్మాణము చేయించిన యింద్రప్రస్థమునకు వేంచేసితివి.

భద్రాం భద్రాం భవదవరజాం కౌరవేణార్థ్యమానాం
త్వద్వాచా తా మహృత కుహనా మస్కరీ శక్రసూనుః,
తత్ర క్రుద్ధం బల మనునయన్ ప్రత్యగాస్త్రేన సార్ధం
శక్రప్రస్థం ప్రియసఖ ముదే సత్యభామాసహాయః. 2

తన కిమ్మంచును గౌరవుం డడిగినన్ ద్వత్ప్రేరణన్ శక్రనం
దనుఁడేతెంచి హరించె మీ చెలియలిన్ భద్రన్ సుభద్రన్ దనం
తన మాయాయతివేషియై; కుపితునిన్ లాలించి మీయన్న నం
తన భామాసహితుండవై యరిగి తింద్రప్రస్థ మీవాపయిన్.

మీ చెల్లిలిని సుభద్రను తనకిమ్మని దుర్యోధనుడడిగినను, నీ ప్రేరణచే సన్యాసివేషియైవచ్చి అర్జును డామెను హరించెను. అయ్యెడ కుపితుడైన బలరాముని నీవనునయించి అర్జునునితో సత్యభామాసమేతుడవై ఇంద్రప్రస్థపురి కేగితివి.

తత్ర క్రీడ న్నపి చ యమునాకూలదృష్టాం గృహీత్వా
తాం కాలిందీం నగర మగమః ఖాండవప్రీణితాగ్నిః,
భ్రాతృత్రస్తాం ప్రణయవివశాం దేవ పైతృష్వసేయీం
రాజ్ఞాం మధ్యే సపది జహృషే మిత్రవిందా మవన్తీమ్. 3

అందుఁజరించుచుండి యమునాపగతీరమునందుఁ జూచి, కా
ళింది గ్రహించి, ఖాండవము లీలగ నగ్ని కొసంగి, మిత్రవిం
దం దగ మేనయత్తసుతఁ ద్వద్గచిత్త హరించినాఁడ వా
సుందరి యన్నకుం బెదరి చూడగ రాజకులమ్ము సూడగన్.

ఆ నగరమందు విహరించుచు యమునాతీరమందు గని, కాలిందిని, చేకొని, ఖాండవవనము నగ్ని ప్రీతిగా నాహుతియిచ్చి, నీయెడ మరులుకొన్నది, విందుడు అనువిందుడునను సోదరులకు జడియుచున్నదియు నగు మీమేనత్త కుమార్తెను మిత్రవిందను రాజసమాజమందు స్వయంవరములో నీవు హరించితివి.

సత్యాం గత్వా పునరుదవహో నగ్నజిన్నందనాం తాం
బధ్వా సప్తాపి చ వృషవరాన్ సప్తమూర్తి ర్నిమేషాత్,

భద్రాం నామ ప్రదదు రథ తే దేవ సంతర్దనాద్యా
స్తత్సోదర్యా వరద భవత స్సాపి పైతృష్వసేయీ. 4

అనువుగ సప్తమూర్తివయి యక్కడి యావృషభమ్ము లేడిటిన్
గని యరికట్టి నాగ్నజితిఁ గైకొనినాఁడవు సత్య, నా ప్రత
ర్దనముఖు లాత్మసోదరిని దారును నీకు నొసంగ నప్పు డొ
య్యన నట మేనయత్త తనయన్ గయికొంటివి భద్రనామకన్.

అటుపై నగ్నిజిత్తనురాజు రాజధానికిం జని ఒక్క నిమేషమున నందేడు వృషభముల నేడురూపములదాల్చి బంధించి నగ్నజిన్నందనను (నాగ్నజితిని) సత్యయను పేరిదాని గైకొంటివి. అవ్వల ప్రతర్దన సందర్దనాదులు తమ సోదరిని శ్రుతకీర్తి కూతురును భద్రయనుదానిని నీకిచ్చిరి. ఆమె కూడ మీకు మేనత్తకూతురే. అనగా వసుదేవుని సోదరికుమార్తె.

పార్థాద్యై రప్యకృతలవనం తోయమాత్రాభిలక్ష్యం
లక్ష్యం హిత్వా శఫర మవృథా లక్షణాం మద్రకన్యామ్,
అష్టావేవం తవ సమభవన్ వల్లభా స్తత్ర మధ్యే
శుశ్రోథ త్వంసురపతిగిరా భౌమదుశ్చేష్టితాని. 5

నరముఖ్యుల్ మునుపేయఁజాలని జలాంతర్బింబితమ్మౌచు గో
చరమై మింటనెసంగు మీనమును లక్ష్యమ్మేసి మీనాక్షి వ
హ్వారె! యా లక్షణ గొంటి వష్టమహిషీ వాల్లభ్య మిట్లొంది య
న్నరకుం గూర్చిన దుర్ణయంబులను విన్నావంత నయ్యింద్రుచే.

అర్జునాదులుకూడ కొట్టలేని దానిని అడుగున నీళ్ళలో జూచి ఆకాశమందు గొట్టవలసిన మీనమును గురిచేసి కొట్టి నీవు లక్షణయను మీనాక్షిం జేపట్టితివి. ఇట్లు అష్టమహిషులకు వల్లభుడయిన తరువాత నింద్రునివలన నరకుని దుర్ణయముల నాలించితివి.

స్మృతాయాతం పక్షిప్రవర మధిరూఢ స్త్వ మగమో
వహ న్నంకే భామా ముపవన మివారాతిభవనమ్,
విభిందన్ దుర్గాణి త్రుటిత పృతనా శోణిత రసైః
పురం తావత్ ప్రాగ్జ్యోతిష మకురుథా శ్శోణితపురమ్. 6

మది నూహించిన యంత వ్రాలిన గురత్మ ద్వాహనాగ్రమ్మునన్
ముదితం దాల్చి నిజాంకమం దుపవనమ్ముంబోలె నవ్విద్విష
త్పదముం జేరి యగల్చి దుర్గముల నాప్రాగ్జ్యోతిషమ్మెల్ల న
య్యదనన్ శోణపురమ్ము సేసితవి త్రుట్యత్సైన్య రక్తోద్ధతిన్.

నీ తలచినమాత్రనే వచ్చిన గరుడవాహనమెక్కి సత్యభామనంకభాగమున నిలుపుకొని శత్రునగరమును ఉద్యానవనమట్లు సొచ్చి దుర్గముల నుగ్గుచేసి పెక్కుసైన్యముల గూల్చి యారక్తముచే నరకుని రాజధానియగు ప్రాగ్జ్యోతిషమను నగరమును శోణ (రక్త) పురముం జేసితివి. ఎఱ్ఱని రంగుగలదానిం చేసితివని శ్లేష.

మురస్త్వాం పంచాస్యో జలధివనమధ్యా దుదపతత్
స చక్రే చక్రేణ ప్రదలితశిరా మంక్షు భవతా,
చతుర్దంతై ర్దంతావలపతిభి రింధానసమరం
రథాంగేన ఛిత్వా నరక మకరో స్తీర్ణనరకమ్. 7

మురుఁడన్ దైత్యుఁడు సింహమై కదిసి యంభోరాశిఁ బోరాడఁద
చ్ఛిరమున్ ద్రెంచిన చక్రధార, నటుపైఁ జెల్వొ చతుర్దంత సుం
దర దంతిప్రకరమ్ముతో నెదిరినన్ జక్రమ్ముచేఁ జెండి య
న్నరకుం జేసితి వీవు తీర్ణనరకున్ ధాత్రీనిజాపత్యమున్.

మురాసురుడు సింహరూపముంగొని సముద్రోదకము నుండి వెలువడెను. చక్రధారచే వానితల ద్రెంచితివి. ఆమీద నాల్గు దంతములుగల ఏన్గులు నాల్గింటితో నెదిరింపగా జక్రాయుధముచే నానరకుంగూల్చి నరకోత్తీర్ణునిం గావించితివి. నీచే జచ్చి యతడు సంసారదూరుండయ్యెనన్నమాట. అతడు నీవలన ధాత్రికి బుట్టినవాడు.

స్తుతో భూమ్యా రాజ్యం సపది భగదత్తే స్య తనయే
గజం చైకం దత్వా ప్రజిఘయిథ నాగా న్నిజపురీమ్,
ఖలే నాబద్ధానాం స్వగత మనసాం షోడశ పునః
సహస్రాణి స్త్రీణా మపిచ ధనరాశిం చ విపులమ్. 8

భూసతి వేడ నన్నరకు పుత్రకునిన్ భగదత్తు నేలికన్
జేసి గజమ్మొకం బొసఁగి నీపురిఁ జేర్చితి వెల్ల యేన్గులన్
రాసులు రాసులైన ధనరాశిని రక్కసు చేతఁ జిక్కి నీ
యాసను ప్రాణముల్ నిలుపు నంగనలన్ బదియాఱువేవురన్.

భూదేవి నిన్నర్థింపగా నరకుని కుమారుని భగదత్తుని రాజొనరించి ఒక యేన్గుమాత్రము వానికిచ్చి తక్కినయేన్గులను , వాడు శత్రులపై దండెత్తి కొనివచ్చిన అనంతధనరాసులను వానిచేజిక్కి కారాగారమందు కుములుచు ప్రాణావశిష్టలై యున్న పదునాఱువేలమంది సుందరులను నీ రాజధానికి ద్వారకకు జేర్చితివి.

భౌమాపాహృతకుండలం తదదితే ర్దాతుం ప్రయాతో దివం
శక్రాద్యై ర్మహితః సమం దయితయా ద్యుస్త్రీషు దత్తహ్రియా,
హృత్వా కల్పతరుం రుషాభిపతితం జిత్వేంద్ర మభ్యాగమ
స్తత్తు శ్రీమదదోష ఈదృశ ఇతి వ్యాఖ్యాతు మేవాకృథాః. 9

కొనె నరకాసురుం డదితి కుండలముల్ మును; వాని నామెకీ
యను జని, సత్యభామఁగని యప్సరసల్ వెఱసిగ్గుఁజెంద, నిం
ద్రుని వలన సపర్యఁగొనిదొంగిలి యచ్చటి పారిజాత, మె
త్తిన హరి నోంచి తాతని మదిం గల శ్రీమద మెల్ల డింపగన్.

నరకుడు మున్ను స్వర్గముపై దండెత్తి అదితికుండలములను ద్రెంచికొని వచ్చిన వాని దిరిగి యామెకిచ్చుట కచ్చటికేగితివి. నీతోనున్న సత్యభామ సోయగము సూచి యటనున్న యప్సరసలు సిగ్గువడిరి. ఇంద్రుడు నీకు స్వాగతసపర్య లిచ్చెను. ఆయన నందనవనములోనున్న పారిజాతమును దొంగచాటుగా బెల్లగించుకొని వచ్చుచు శ్రీహరివీవు హరిని=ఇంద్రునోడించి వాని ఐశ్వర్యమదమడగించితివి.

కల్పద్రుమం సత్యభామా భవనభువి సృజన్ ద్వ్యష్ట సాహస్ర యోషాః
స్వీకృత్య ప్రత్యగారం విహితబహువపు ర్లాలయన్ కేళిభేదైః,
ఆశ్చర్యా న్నారదాలోకిత వివిధగతి స్తత్ర తత్రాపి గేహే
భూయ స్సర్వాసు కుర్వన్ దశదశ తనయాన్ పాహి వాతాలయేశ. 10

ఆవల సత్యభామ వనమందున నాటి సురద్రుమమ్ము నా
నావిధ మూర్తివై విలసనమ్ముల నాపదియాఱువేలతో
నావిధి నారదుండు గని యబ్బుర మందగ నంద ఱందుఁగ
న్నావు పదేసిమంది ప్రియనందనులన్, గనవే నను గృపన్.

నీ తెచ్చిన కల్పద్రుమమును సత్యభామ పెరటిలో నాటితివి. మఱియు పదునాఱువేలమంది భామినులతో నన్నిరూపులై నీవు విహరించితివి. ఈ నీ విష్ణుమాయగని నారదమహర్షి యాశ్చర్యపడెను. వారందఱందును బదేశిమంది వంతున నందనుల గన్నాడవు. నన్ను దయతో గనుము.

## 82వ దశకము

# ఉషాపరిణయము, బాణాసుర యుద్ధము, నృగశాపమోక్షము

ప్రద్యుమ్నో రౌక్మిణేయ స్సఖలు తవ కలా శంబరేణాహృత స్తం
హత్వా రత్యా సహాప్తో నిజపుర మహర ద్రుక్మికన్యాంచ ధన్యామ్,
తత్పుత్రోథానిరుద్ధో గుణనిధి రవహ ద్రోచనాం రుక్మిపౌత్రీం
తత్రోద్వాహే గత స్త్వం న్యవధి ముసలినా రుక్మ్యపి ద్యూతవైరాత్. 1

భవదంశమ్మగు రుక్మిణీసుతుఁ డహో! ప్రద్యుమ్నుఁడా శంబరున్
భువిఁ్రాలించి రతిన్ గ్రహించి యటుపైఁ బుణ్యాత్మ నా రుక్మిక
న్య వెసన్ ముచ్చిలి తెచ్చె నాత్మపురికిన్ దత్పుత్రుఁ డుద్యద్గుణ
స్థవిరుం డయ్యనిరుద్ధుఁడున్ గొనియె నంతన్ రోచనాకన్యకన్

రుక్మికిన్ బౌత్రిగాన యారోచనా కు
మారి పెండ్లికి నీవునున్ జేర హలియు,

నచట జూదమ్ము వేడుక నలిగి రుక్మి
వ్రాల్చె గాళింగుదంతముల్ రాల్చె నంత. 2

ప్రద్యుమ్నుడు నీ యంశమున రుక్మిణియందుదయించినవాడు. అతడు శంబరాసురుంజంపి రతీదేవితో నిజపురమున కేతెంచి, మేనమామయగు రుక్మికూతురును రుక్మవతియనుదానిని (నీపోలికనే) హరించి నిజనగర మేతెంచెను. ప్రద్యుమ్నుని కుమారుడు గుణశాలి అనిరుద్ధుడు రుక్మియొక్క పౌత్రిని (కొడుకు కూతురును పరిణయమాడెను. ఆ వివాహమందే జూదమందు బలరాము డోడునట్లు గావించి తగవు రేపి నీవు బలరామునిచే రుక్మిని జంపించితివి. అపుడే బలరాముడు కాలింగుని దంతయు లూడగొట్టుటయు జరిగినది.

బాణస్య సా బలిసుతస్య సహస్రబాహో
ర్మాహేశ్వరస్య మహితా దుహితా కిలోషా,
త్వ త్పౌత్ర మేన మనిరుద్ధ మదృష్టపూర్వం
స్వప్నేనుభూయ భగవన్ విరహాతురాభూత్. 2

వీరశైవుఁడు బలికుమారుఁడు వేయి బాహులవాఁడు, దు
ర్వార విక్రముఁడైన బాణుఁడు; వాని కూతు రుషాఖ్య ము
న్నౌర! చూచి యెఱుంగ దైన మృగాక్షి యయ్యనిరుద్ధుఁగ
న్నారఁడాఁగలఁజూచి ము న్విరహార్తిఁ జాల తపింపఁగన్.

బలికుమారుడు శివభక్తుడునగు బాణునికుమార్తె ఉష. ఆమె యనిరుద్ధుని యందముంగూర్చి విన్నదేకాని చూచియెఱుంగదు. అయినను నామె కనిరుద్ధుని యెడల మోహ మధికమై విరహార్తిచే గృశించుచుండెను.

యోగి న్యతీవ కుశలా ఖలు చిత్రలేఖా
తస్యా స్సఖీ విలిఖతీ తరుణా నశేషాన్,
తత్రానిరుద్ధ ముషయా విదితం నిశాయా
మానేష్ట యోగబలతో భవతో నికేతాత్. 3

చిత్రయోగ విభూతి వైభవ చిత్రలేఖ తదీయ స
న్మిత్ర మెల్లర రాకుమారుల నేర్పునన్ లిఖియించి యా

చిత్రముల్ మఱి సూపి యయ్యుష చిత్తముంగని తెచ్చె నా
రాత్రి మాయిలుసొచ్చి యోగభరాన నయ్యనిరుద్ధునిన్.

యోగశక్తులుగలది చిత్రలేఖయను నామెచెలికత్తె పెక్కుమందిరాజుల చిత్తరువులు వ్రాసి ఉషాదేవికి జూపించుచుండెను. వానిలో ననిరుద్ధుని చిత్రమునెడ నామె మనసు లగ్నమగుటగని యోగశక్తిచే చిత్రలేఖ అనిరుద్ధుని ఉషాంతః పురమునకు గొనివచ్చెను.

కన్యాపురే దయితయా సుఖ మారమంతం
చైనం కథంచన బబంధుషి శర్వ బంధౌ,
శ్రీ నారదోక్త తదుదంత దురంతరోషై
స్త్వం తస్య శోణితపురం యదుభి ర్న్యరుంధాః. 4

అనిరుద్ధుం డటు సొచ్చి యంతిపురమం దా బాణకన్యాలలా
మ ననంగాగమలీలలన్ మనుపగా నాగాస్త్రబంధాన నా
తని బంధించె ననంగవైరిపరమాప్తస్వామి, యన్నారదో
క్తిని నీవుం జని శోణితాఖ్యపురముం గీలించి తస్త్రాగ్నులన్.

అనిరుద్ధుండట్లు అంతఃపురమందుండి బాణకన్యను మన్మథలీలలం దేల్పగా శివభక్తుడైనబాణు డాతనింబట్టి బంధించెను. నారదునివలన నీవార్త నాలించి బాణాగ్నులచే నాబాణుని రాజధానియగు శోణపురిని ముట్టడించితివి.

పురీపాల శ్శైలప్రియ దుహితృ నాథోస్య భగవాన్
సమం భూతవ్రాతై ర్యదుకుల మశంకం నిరురుధే,
మహాప్రాణో బాణో ఝటితి యుయుధానేన యుయుధే
గుహః ప్రద్యుమ్నేన త్వమపి పురహంత్రా జఘటిషే. 5

బంటై కావలికాయు శైలతనయా ప్రాణేశుఁ డవ్వీట, నా
వెంటన్ భూతగణమ్ముతో నెదిరిచెన్ వే బాణుఁడున్ రేగి, వె
న్నంటెంబో యుయుధానునిన్ గుహుఁడుమున్నాగించెఁబ్రద్యుమ్ను,ము
క్కంటి న్నీ వెదిరించినాఁడ వచటన్ గంజాక్ష! యుద్యద్ద్యుతిన్.

బాణునివాకిట నిలిచి శివుడు కావలిగాయుచుండును. ఆయన భూతగణ పరివారముతో నిన్నెదిరించెను. బాణుడు యుయుధానునిపై నెదురునడచెను. కుమారస్వామి ప్రద్యుమ్నుపై నేగెను. నీవు శివు నెదుర్కొంటివి.

**నిరుద్ధాశేషాస్త్రే ముముహుషి తవాస్త్రేణ గిరిశే**
**ద్రుతా భూతా భీతాః ప్రమథకులవీరాః ప్రమథితాః,**
**పరాస్కంద త్స్కందః కుసుమ శంబాణైశ్చ సచివ**
**స్స కుంభాండో భాండం నవమివ బలేనాసు బిభిదే. 6**

**సకలాస్త్రమ్ములు వమ్మువోయె భవదస్త్ర జ్యోతికిన్, రుద్రుఁడున్**
**వికలుండయ్యెను, భూతముల్ పరువిడెన్, భీతమ్ములై, కూలి బల్**
**వికృతిం బొందె గణమ్ము, లక్కుసుమధన్విం దాకి స్కందుండు డా**
**యక పారెన్, హరిచేతిలో విరిసెఁ గుంభాండుండు మృద్భాండమై.**

నీ యస్త్రజ్యోతిలో నెదిరియస్త్రములడగిపోయినవి. శివపరివారము భూతములు పారెను. ప్రమథగణము కూలెను. కుమారుడు మారు నెదిరించి పారిపోయెను. కుంభాండుడు బాణునిమంత్రి మృద్భాండమట్లు విరిసిపోయెను.

**చాపానాం పంచశత్యా ప్రసభ ముపగతే ఛిన్నచాపేఽథ బాణే**
**వ్యర్థే యాతే సమేతో జ్వరపతి రశనై రజ్వరి త్వ జ్జ్వరేణ,**
**జ్ఞానీ స్తుత్వాఽథ దత్వా తవ చరితజుషాం విజ్వరం సజ్వరోఽగాత్**
**ప్రాయోంతర్జ్ఞానవంతోఽపి చ బహుతమసా రౌద్రచేష్టాహి రౌద్రాః. 7**

**చాపము లైదువందలును జచ్చువడన్ జనె బాణుఁడంత సం**
**తాపితమై హరజ్వరము త్వజ్జ్వరమెత్త, నుతించి త్వత్కథా**
**వ్యాపృతులన్ వరమ్మిడి జ్వరాపగతిన్, మఱియేగె జ్ఞాన వి**
**ద్యాపతులయ్యుఁ దామసు లయారె! ప్రచండులు రుద్రపార్షదుల్.**

నీవు విసరిన యైదువందల బాణములచే బాణుడు చచ్చుపడెను. అంతట హరజ్వరము విష్ణుజ్వరముచే నుడికిపోయెను. నిన్ను స్తుతించి నీ కథాప్రసంగముచే శివజ్వరము హరించునని వరమొసంగి శివజ్వర మంతర్ధానమయ్యె. తఱచుగా రుద్రభక్తులు లోన జ్ఞానముండికూడ తమోగుణప్రాయులగుటచే రౌద్రచేష్టలు (క్రూరకార్యములు) చేయుచుందురు.

బాణాం నానాయుధో గ్రం పునరభిపతితం దర్పదోషా ద్వితన్వన్
నిర్ఘ్నా నాశేషదోషం సపది బుబుధుషా శంకరే ణోపగీతః,
తద్వాచా శిష్ట బాహు ద్వితయ ముభయతో నిర్భయం తత్ప్రియంతం
ముక్త్వా తద్దత్తమానో నిజపుర మగమ స్సానిరుద్ధ స్సహోషః. 8

నానా సాధనుఁడైన బాణు మదమంతం బాపి, యద్వైత సం
ధానుండై వినుతించు శంకరుల యానం బాహువుల్ రెండిటన్
గాన వచ్చియు నిర్వ్వరందు భయశంకన్ వీడు నాశైవు స
న్మాన మ్మంది యుషానిరుద్ధయుతుఁడై నర్తించి తా ద్వారకన్.

నానావిధాయుధసమృద్ధుడైన బాణుని మదమణిచి, గర్వదోషమువలన దొలుత నీపైకి నడచి, శంకరుడు తుదకు విష్ణువుం దాను నొక్కడే యనుతెలివి దెచ్చికొని నిన్ను కీర్తించెను. మఱియు నిన్నతడు కోరగా నీవు రెండుచేతులతో దర్శనమిచ్చితివి. అంతట బాణుడు మీరుభయులు నుభయులుగా రొక్కరేయని హరిహరాద్వైతసిద్ధిచే నభయస్థితినంది యతడు నీకు వియ్యంకుడుగా చేయు మర్యాద లందికొని ఉషానిరుద్ధులతో ద్వారకయందు ప్రవేశించితివి.

ముహు స్తావ చ్ఛక్రం వరుణ మజయో నందహరణే
యమం బాలానీతౌ దవదహనపానే ఽనిలసఖమ్,
విధిం వత్సస్తేయే గిరిశ మిహ భాణస్య సమరే
విభో విశ్వోత్కర్షీ తదయ మవతారో జయతి తే. 9

నందు హరింపగా వరుణు, నాకపతిన్ బలుమార్లు, విప్రున
న్నందును దెచ్చియీయ యము, నాడు దవాగ్నిని మ్రింగి యగ్ని, గో
బృందము దొంగిలింప విధి, నీశ్వరు బాణుని పోరఁ గెల్చి యీ
యందరమించె విశ్వమహిమాతిశయ మ్మవతార మివ్విధిన్.

నీవు నందుని హరించిన వరుణుని గెల్చితివి. ఇంద్రయాగ పారిజాతాపహరణ ఖాండవవనదహనాదులం దింద్రునోడించితివి. గురుపుత్రు దెచ్చుటలో యముని, దావాగ్ని నార్చుటలో నగ్నిని, గోవత్సాపహరణములో బ్రహ్మను, బాణాసురయుద్ధమందీశ్వరుని జయించితివి. అందుచేత స్వామీ! నీ యవతారము సర్వోత్కర్షమై యలరుచున్నది.

ద్విజరుశా కృకలాసవపుర్ధరం నృపసుతం త్రిదివాలయ మాపయన్,
నిజజనే ద్విజభక్తి మనుత్తమా ముపదిశన్ పవనేశ్వర పాహి మామ్. 10

భూసుర శాపముచే నృగుఁ
డూసురవెలియైనఁ ద్రిదివ మొందింపవె నీ
దాసులకున్ ద్విజ భక్త్యా-
భ్యాసము గావించి; నన్ను బాలింపు హరీ!

ఇచ్చినగోవును హరించినకతన బ్రాహ్మణశాపమునకు గురియై ఊసరవెల్లియై యున్న నృగమహారాజునకు స్వర్గానుగ్రహమిచ్చుటమూలమున నీవారికి బ్రాహ్మణభక్తి నుపదేశించితివి. అట్టి పావనపురాధీశ్వర! నన్ను రక్షింపుము.

## 83వ దశకము

# పౌండ్రక వధ, కాశీపురీ దహనము, ద్వివిద వధ, లక్షణాస్వయంవరము

రామేఽథ గోకులగతే ప్రమదాప్రసక్తే
హూతానుపేత యమునాదమనే మదాంధే,
స్వైరం సమారమతి సేవకవాదమూఢో
దూతం న్యయుంక్త తవ పౌండ్రకవాసుదేవః. 1

రాముఁడు గోకుల మ్మరిగి రక్తిమెయిన్ మధుపాన మత్తతన్
రామలఁగూడి య య్యమున రమ్మనరామిఁ బరాభవించి, స్వే
చ్ఛామతి నుండ సేవకు ప్రసక్తిని బౌండ్రక వాసుదేవుఁడీ
ర్ష్యా మలినాత్ముఁడై పనిచె నయ్యెడ నీకడ కొక్క దూతునిన్.

బలరాముడు గోకులమేగి గోపికలయందు రక్తిగొని మధుపానముచేసి మత్తుడై యొకనాడా యమునను రమ్మన రానందున నామెను బరాభవించి

విశృంఖులుడై చరింపగా, పౌండ్రకవాసుదేవుడు తననౌకరు చెప్పిన మాటంబట్టి నీపై నీర్ష్యగొని నీదగ్గరకు తనదూతనొక్కని రాయబారముంపెను.

నారాయణోహ మవతీర్ణ ఇహాఽస్మి
భూమౌ ధత్సేకిల త్వమపి మామకలక్షణాని,
ఉత్సృజ్యతాని శరణం వ్రజ మామితి త్వాం
దూతో జగాద సకలైర్హసితస్సభాయామ్. 2

ఈయవతార మెత్తితి వటే మఱి నావలె, నెవ్వఁడొక్కొ నా
రాయణుఁడై చరించెద వయారె మదీయములైన చిహ్నముల్
నీయెడఁ గానిపించు నవి నీవు త్యజించి ననున్ భజింప రా
రా యనెఁ బౌండ్రుడుం చనిన నందరు నవ్విరి తత్సభాసదుల్.

నేను నారాయణావతారమెత్తియున్నాను. నావలె నెవ్వడవు నీవును నారాయణుడనుపేర జరించుచున్నావు? నా చిహ్నములు అనగా శంఖచక్ర గదాదులు నీయందు గానిపించుచున్నవి. అవెల్ల త్యజించి నన్ను భజింపుము. ఇది వాడంపిన సందేశము యొక్క సారాంశము విని మెడమీద తలగల సభ్యులందఱు నవ్విరి.

దూతే థ యాతవతి యాదవసైనికస్త్వం
యాతోదదర్శిథ వపుఃకిల పౌండ్రకీయమ్,
తాపేన వక్షసి కృతాంక మనల్పమూల్య
శ్రీకౌస్తుభం మకరకుండలపీతచేలమ్. 3

చనియెను దూత నీవు యదుసైన్యముతోఁజని బౌండ్రకాఖ్యుమే
న్గనుగొని తప్తలోహమునఁగాల్చిన చిహ్నము, మూల్యమిచ్చి తా
గొనినవి కౌస్తుభమ్ము మణికుండలముల్ మఱిపీతచేలమున్
గనుగొనినాఁడ వయ్యసుర గైకొని నద్భుత వైష్ణవాకృతిన్.

దూత యామాట నీకందించెను. అందినదే తడవు నీవు యాదవసైన్యముతో నెత్తిచని, అభినవవాసుదేవుడు ఇనుముకాల్చి ఱొమ్మున వేసికొన్న చక్రాంకితమును, డబ్బిచ్చికొన్న కౌస్తుభమణికుండల పీతాంబరములను జూచితివి. అవి దాల్చి వాడు గైకొన్న విష్ణురూపమును గమనించితివి.

కాలాయసం నిజ సుదర్శన మస్యతో உస్య
కాలానలోత్కరకరేణ సుదర్శనేన,
శీర్షం చకర్తిథ మమర్దిథ చాస్య సేనాం
తన్మిత్రకాశిప శిరో உపి చకర్థ కాశ్యామ్. 4

ఉక్కునఁజెక్కి చక్రమదియున్ విసరెన్ మఱి వాని మూర్ధమున్
గ్రక్కునఁగాల వహ్ని వెలిగ్రక్కెడు నీదగు చక్రధార తా
నక్కడ గత్తిరించి మఱి యా ఖలుసేనల నుక్కడంచి య
మ్ముక్కడి మంత్రి కాశిపతి మూర్ధము త్రెంచెను కాశికాపురిన్.

ఉక్కుచెక్కి చేసికొన్న తన చక్రమును వాడు నీపైకి విసరెను. అంత నీ సుదర్శనచక్రధారచే వానితల కత్తిరించితివి. వాని సేనల నుక్కడించితివి వాని దుర్మంత్రి కాశిరాజు యొక్క తలత్రెంపి కాశీనగరమందు పడినట్లొనరించితివి.

జాడ్యేన బాలకగిరా உపి కిలాహమేవ
శ్రీవాసుదేవ ఇతి రూఢమతి శ్చిరం సః
సాయుజ్యమేవ భవదైక్యధియాగతో உభూత్
కోనామ కస్య సుకృతం కథమిత్యవేయాత్ 5

జ్ఞాన మ్మించుక లేక మందుఁడయి సాక్షాద్వాసుదేవుండ నా
హా నేనంచును బౌండ్రకుండు భవదీయైక్యానుభావంబు మా
త్రానన్ జేకొనియెన్ సమంచిత భవత్సాయుజ్య సంసిద్ధి లో
కానన్ జీవు లేమేమి నోచిరో యెఱుంగన్ శక్యమే యేరికన్

జాడ్యముచేత (బుద్ధిలేక) తెలివిసాలక నేనే వాసుదేవుడనని ఎగసిపడి చేసిన నీ సారూప్యభావనచేతనే నీ సాయుజ్యసిద్ధి నందెను. స్వామీ! లోక మందేజీవి యే పుణ్యము సేసికొన్నదో తెలియుట యెవరివశము?

కాశీశ్వరస్య తనయో உథ సుదక్షిణాఖ్య
శ్శర్వం ప్రపూజ్య భవతే విహితాభిచారః
కృత్యానలం కమపి బాణరణావభీతైర్భూతైః
కథంచన వృతై స్సమమభ్యముంచత్. 6

అవలఁ గాశిరాజు కొడుకైన సుదక్షిణుఁడుగ్రుఁ గొల్చి నీ
పై విహితాభిచారుఁడయి పంపెను బాణ రణావభీత భూ
తావళితోడఁ గూరిచి మహాభయదమ్మగు కృత్యవహ్ని తా
లావధికోన్నతిన్ జగములన్ని దహించెడిదాని నయ్యెడన్.

ఆ కాశిరాజుకొడుకు సుదక్షిణుడు ఉగ్రుని (శివుని) ఆరాధించి నీపై నభిచార ప్రక్రియ (చేతబడి) చేసి బాణునిరణమునందు బెదరిపారిపోయిన భూతముల తోడిచ్చి కృత్యయను శక్తిని నీపై ప్రయోగించి పంపెను. అది తాడిచెట్టంతయెత్తున నెగసి లోకములను దహించుచు నీపై వచ్చిపడెను.

తాలప్రమాణచరణా మఖిలం దహంతీం
కృత్యాం విలోక్య చకితైః కథితోఽపిపౌరైః,
ద్యూతోత్సవే కిమపి నో చలితో విభో త్వం
పార్శ్వస్థ మాశు విససర్జిథ కాలచక్రమ్. 7

కనుగొని పౌరులెల్ల భయకంపితులై యది వచ్చుటెల్లనున్
వినిచిన, జూదమాడుకొను వేడుకనుండి చలింప కీవునున్
విని విననట్ల పార్శ్వమున వెల్గెడు నీదగు కాలచక్రమున్
బనుపగ హస్తసంజ్ఞ నది పైకొనియెన్ బరమోత్కటద్యుతిన్.

ద్వారకాపురవాసులు దానిరాకను నీకెఱింగించిరి. అపుడు నీవు ద్యూతక్రీడలోనించుకయు గదలక విననట్లుండి నీ పజ్జనున్న కాలచక్రమును హస్తసంజ్ఞామాత్రమున లేపి పంపితివి. అది నిప్పులుగ్రక్కుచు విజృంభించెను.

అభ్యాపతత్యమితధామ్ని భవన్మహాస్త్రే
హాహేతి విద్రుతవతీఖలు ఘోరకృత్యా,
రోషాత్సుదక్షిణ మదక్షిణచేష్టితం తం
పుప్లోష చక్రమపి కాశిపురీ మదాంక్షీత్. 8

వెనుకొను నీదు నాయుధము వేడిమి కోర్వక ఘోరకృత్య హా!
యని పరువెత్తి నల్దెసల, కంత సుదక్షిణు నయ్యదక్షిణున్
గినుకను గాల్చె; కాశిపురి నీరొనరించె సుదర్శనంబు నీ
పనుపున రాగశాత్రవ విభంజనమై బుధరంజనమ్మునై.

అట్లెగసి వెంటబడి తరుము నీసుదర్శనమువేడిని తట్టుకొనలేక ఘోరకృత్య హా హా కారము సేయుచు నల్దెసల బారి అదక్షిణుడైన సుదక్షిణుని గాల్చివేసెను.

వి.వి: అభిచారమనుక్రియ బ్రహ్మణ్యుడుకాని వానియందుమాత్రమే ఫలించు నట్లుచెప్పి శివు డిచ్చియున్నందున, అమాట ధిక్కరించి దానిని బ్రహ్మణ్యులకెల్ల దేవుడైన కృష్ణునందు ప్రయోగించుటవలన నదక్షిణుడై పేరుమాత్రమునకు సుదక్షిణుడైన యా రాజునందు వాడుచేసిన కృత్యాప్రయోగమే వెనుదిరిగి వానిం దహింపజేసెనన్నమాట.

**స ఖలు ద్వివిదో రక్షోఘాతే కృతోపకృతిః పురా**
**తవ తు కలయా మృత్యుం ప్రాప్తుం తదా ఖలతాం గతః,**
**నరకసచివో దేశక్లేశం సృజ న్నగరాన్తికే**
**ఝటితి హలినా యుధ్య న్నద్ధా పపాత తలాహతః. 9**

**ద్వివిదుఁడు మున్ను వాఁడె కపివీరుఁడు రావణుతోడి పోర రా**
**ఘవులకు సాయమై, యిపుడు క్రౌర్యముపూనెను నీదుపాల మృ**
**త్యువు బడయంగ నన్నరకుతోడయి ద్వారక ప్రాంతమం దుప**
**ద్రవ మొనరించి కూలె బలరాముఁడనిన్ జెయిసాచి వ్రేయఁగన్.**

సుదక్షిణుని పూర్వవృత్తాంతమిది. రావణసంహారమందు శ్రీరామచంద్రుని పక్షముననున్న ద్వివిదుడను వానరుడై సాయపడినాడు ఈ యవతారమందు విష్ణుద్వేషియైనాడు. ఎందులకు? నీయంశయైన బలభద్రునిచేతిలో మృత్యువు నందుటకు, అందులకే వాడు నరకునికి మంత్రియయ్యెను. వాడు ద్వారకా ప్రాంతదేశోపద్రవము సేయుచు బలరాముడు సాచికొట్టగా మడిసెను.

**సాంబం కౌరవ్య పుత్రీహరణ నియమితం సాంత్వనార్థీ కురూణాం**
**యాత స్త ద్వాక్య రోషోద్ధత కరినగరే మోచయామాస రామః,**
**తే ఘాత్యాః పాండవేయై రితి యదుపృతనాం నాముచ స్త్వం తదానీం**
**తం త్వాం దుర్బోధలీలం పవనపురపతే తాపశాంత్యై నిషేవే. 10**

**కురువిభుకూతు లక్షణను గూడి హరించిన సాంబుఁగట్ట నా**
**దొర ననునీతుఁజేయఁజని ధూర్తులమాటల రోసమెక్కి యా**

**కరిపురి నొంచె రాముఁడు, స్వకమ్మగు సేన మరల్చి తీవు న**
**క్కురువధ పాండవాత్మజులకున్ మిగిలించి మరుత్పుర ప్రభూ!**

సుయోధనునికూతురగు లక్షణను సాంబుడు స్వయంవరమందు హరించెను. అప్పుడతనిని కౌరవులు కట్టివైచిరి. అది విని వారలతో వైరము వలదనుకొని వారిని అనునయింపనెంచి బలరాము డేగెను. వా రాతని నధిక్షేపించిరి. తూలనాడిరి. దాన రోషమెక్కి హస్తినగరమునెత్తి గుదియనేసి రాముడు సాంబుని విడిపించుకొనివచ్చెను. నీవు యాదవసైన్యమును మరలించుకొని ద్వారకకు వచ్చితివి. దానికి కారణము ఆ కౌరవులు పాండవులచేత సంహరింపవలసిన వారగుట. ఈ నీ లీలలు దురవగాహములు స్వామి! తాపశాంతి సేసి రక్షింపుము.

# 84వ దశకము

# సూర్యగ్రహణ యాత్ర

**క్వచి దథ తపనోపరాగకాలే పురి విదధ త్కృతవర్మ కామసూనూ,**
**యదుకుల మహిలావృత స్సుతీర్థం సముపగతో உసి శమంతపంచకాఖ్యమ్.**

**అనిరుద్ధుని గృతవర్మను**
**నునిచి పురీరక్ష సూర్యు నుపరాగమునం**
**జనినాఁడ వీవు యదుకుల**
**వనితలతో నాస్యమంతపంచకమునకున్.**

ఒకతఱి సూర్యగ్రహణమందు కృతవర్మను అనిరుద్ధుని ద్వారకారక్షణకు నియోగించి యాదవులతో స్యమంతపంచకమునకు గ్రహణస్నానాదులకై యేగితివి.

**బహుతర జనతా హితాయ తత్ర త్వమపి పున ర్వినిమజ్య తీర్థతోయమ్,**
**ద్విజగణపరిముక్త విత్తరాశి స్సమమిలథాః కురుపాండవాది మిత్రైః. 2**

పరమపవిత్రుఁడయ్యు బహుభక్తజనమ్ము ననుగ్రహింపగన్
దరిసి స్యమంతపంచకమునన్ దగు స్నానము లాచరించి భూ
సురుల కనేక దానములు సొంపుగ జేసి నిజాప్త మిత్రులన్
గురుకులముఖ్యులం గలిసికొంటివి పుణ్యుల బాండవేయులన్.

నీవు సహజముగా పరమపవిత్రుడవు. తీర్థభూతుడవు. నీస్నానముచే తీర్థమునకు తీర్థత్వము గల్గును. అందు స్నానముచేసిన జనులు పవిత్రులగుదురు. కావున నీవు సూర్యగ్రహణమందు స్యమంతపంచకమున స్నానాదులాచరించి బ్రాహ్మణులకు దానము లాచరించి కురుపాండవ బంధుమిత్రులను గలిసికొంటివి.

**తవ ఖలు దయితాజనై స్సమేతా ద్రుపదసుతా త్వయి గాఢభక్తి భారా,**
**తదుదిత భవదాహృతి ప్రకారై రతి మముదే సమ మన్య భామినీభిః. 3**

ద్రోవది భక్తురా లెనసి రుక్మిణిమున్నగు నీ ప్రియాజన
మ్మోవు హరించి తమ్ము వరియించిన శోభన మొక్కరొక్కరే
తీవిగ నుగ్గడింప గడింది ముదాన సుభద్రతోడ నా
లో విలసిల్లె నా వదెనలున్ మరదండ్ర సరాగ మేమనన్

నీపరమభక్తురాలు ద్రౌపది. నీ ప్రియపత్నులగు రుక్మిణి సత్యభామాదులు నీవు తమ్ము హరించి వరించిన యలనాటి పెండ్లిముచ్చట లొకరొక్కరే వర్ణింపగా సుభద్రతోగూడ యాలించి యెంతో సంతోషపడెను. అప్పుడా వదినగార్లు మరదండ్రు నొండొరులు సేసికొన్న యా పరియాచకముల ముచ్చట యేమని తెల్పుదును!

వి.వి.: రుక్మిణీ ప్రభృతులు శ్రీహరి తమ్ము హరించినాడన్నంతదాక సబబేకాని యాయనయే తమ్ము వరించినాడనుట అంత నిజముకాదు. రాచకన్నియలైకూడ వారే స్వామికి రాయబారములంపి ప్రణయలేఖలువ్రాసి దొంగతనములో నుపాయముగూడ చెప్పి రప్పించినారు. గుట్టువిడిచి సిగ్గుదలగి వారు చేసినపని యిది. అర్జునుని విషయములో సుభద్రకూడ యాకూటములో చేరినదే. అయినను నాచిన్నది ద్రౌపది నూత చేసికొని వదినగార్లను గేలిసేయుటకు సిద్ధపడినది. ఇట్లా వదినగార్లు మరదండ్రు ఏలినవారి నిమిత్తముగ నొండొరులు పరిహాసమాడుకొన్నముచ్చట ఆ ఆనందము అపురూపము. వర్ణన కందదని భావము.

**తదనుచ భగవన్ నిరీక్ష్య గోపా నతికుతుకా దుపగమ్య మానయిత్వా,**
**చిరతరవిరహాతురాంగరేఖాః పశుపవధూ స్సరసం త్వ మన్వయాసీః. 4**

**అట కరు దెంచు గోపకుల నందఱునుం దగ నాదరించి మి**
**క్కుటమగు నీ వియోగమునఁ గుంది కృశించిన యించుబోణులన్**
**దటుకునఁ గాంచి ముచ్చటలఁ దన్పుచుఁ జల్లని చూపులోన ను**
**త్కటమగు తన్మనోజపరితాపము వాపితి వో జగత్పతీ!**

కృష్ణా! నీవు జగత్పతివి. గ్రహణస్నాననిమిత్తముగా కురుక్షేత్రమున కేతెంచిన గోపకుల నాదరించి నీ చిరవియోగముచే కృశించిన గోపికలను లాలించి యలుక దీర్చి యానందపరచితివి.

**సపదిచ భవదీక్షితోత్సవేన ప్రముషితమానహృదాం నితంబినీనామ్,**
**అతిరసపరిముక్తకంచులీకే పరిచయహృద్యతరే కుచే న్యలైషీః. 5**

**ఒనరిన నీదుదర్శన మహోత్సవ మందఱి మానమున్ మన**
**మ్మును హరియింపగా వలపుపొంగున తైకలు విప్పికొన్న త**
**ద్ఘనకుచవేదికన్ సొలుపు గైకొని వ్రాలి పురానుభూతి మో**
**హనముగ లీనమైతివి మహాప్రభువై కొలువౌచు నచ్చటన్**

నీ దర్శనానందము గోపికల మానమును మనస్సును హరించినది ఒడలిపై వలువలుగూడ యెఱుంగని మైకమున తైకలు విప్పికొనియున్నవారి కుచవేదికలపై నీవువ్రాలి ఇంతకు ముందుగల పరిచయము చనువునుంబట్టికూడ మిక్కిలి హృద్యమైయున్న యచ్చోట లీనమైతివి.

వి.వి: భక్తహృదయము నీ హృదయమేకావున అభేదస్వరూపమైన బ్రహ్మానందాత్మక స్వరూపమున నీవు శేషించితివని తాత్పర్యము. భేదభావములేని యీ భూమికలోనికి గోపికలనుగూడ దింపితివి కావుననే క్షీరనీరన్యాయమయిన యీ విలీనస్థితి సాధ్యమయ్యెనని కవి హృదయము. సజాతీయ పదార్థద్వయసమ్మేళనమే లయమన్నమాట. ఆ రహస్యమే యీక్రింది శ్లోకమందు వ్యక్తమగుచున్నది.

**రిపుజనకలహైః పునః పున ర్మే సముపగతై రియతీ విలంబనాభూత్,**
**ఇతి కృతపరిరంభణే త్వయి ద్రా గతివివశా ఖలు రాధికా నిలిల్యే. 6**

**అల యెడనెడఁ గయ్యమ్ములు**
**కలుగుటఁ దడవయ్యె నీవు కలగుకు మన, జ**
**క్కిలిగిలిలోఁ గౌఁగిలి మే**
**న్మెలపుల లోలోన రాధ మిళితమ్మయ్యెన్.**

అక్కడ పరులతో తఱచుగ దారసిల్లిన యుద్ధములయొత్తిడిలో నారాక విలంబమైనది. చెలీ! తప్పుగా గొనకుమని చక్కిలిగిలియిడి బిగికౌగిలిలో నీవు దార్చినంత శ్రీరాధాదేవి ప్రణయకోప విరహతాపములు వాసి కేవల బ్రహ్మానంద చిన్మూర్తివైన నీలో విలీనమయ్యెను.

**అవగత విరహవ్యథా స్తదా తా రహసి విధాయ దదాథ తత్త్వబోధమ్,**
**పరమసుఖచిదాత్మకో హ మాత్మే త్యుదయతు వః స్ఫుటమేవ చేతసీతి. 7**

**విరహార్తిన్ గికురించి గోపికలకున్ వేడ్క రహస్యమ్ముగన్**
**బరమానంద చిదాత్మకమ్మయిన యంతర్యామి యౌ నాత్మ యం**
**దరకేనంచు స్ఫురించు గాత మనుచున్ దత్త్వావబోధమ్ము స**
**త్కరుణన్ జేసితి వోమరుత్పురగృహాంతర్జ్యోతి పద్మాపతీ!**

ఓ లక్ష్మీప్రియా! గోపికల విరహవ్యధను చుంబనాశ్లేషాదులచే హరించి, రహస్యమందు నేను పరమానందబోధస్వరూపుడను అందరియాత్మను. అంతర్యామిని కావున పరమార్థముగా నా యెడబాటన్నది లేదు. శోకమునులేదు. ఇది మీ మనస్సులందు స్పష్టపడుగాక అనగా నిశ్చయజ్ఞానమైన బుద్ధి నా అనుగ్రహముచే మీకు దీపించుగాక! అని కరుణాళుడవై జగద్గురువు గావున వారందరికిని తత్త్వోపదేశము ననుగ్రహించితివి. అనువాదములో విశేషము. గురువాయూరు దేవాలయములోన దీపించు నో జ్యోతీ! అనగా నీవారశూకమట్లు (నెవరిముల్లువలె) సుసూక్ష్మమై పీతా=పచ్చనిదై, అణూపమమైన యొక వెలుగు హృదయమున వెలుగుచున్నది దాని శిఖ(జ్వాల) యొక్కనడుమ పరమాత్మ ఉన్నాడు. ఆయనయే శివుడు. హరి అక్షరుడు పరముడు స్వరాట్టు అను పురుష సూక్తమంత్రార్థమైన ఆ వస్తువే గురువాయూరునందున్నది. అనగా గుహాస్థానము వాయుస్థానమునైన శరీరరూపమైన పురమందున్నదని అదే కృష్ణపరబ్రహ్మ రూపమైన పరతత్త్వమని మఱొకసారి జ్ఞాపకము చేయబడినది.

**సుఖరస పరిమిశ్రితో వియోగః కిమపి పరాభవ దుద్ధవోపదేశైః,**
**సమభవ దముతః పరంతు తాసాం పరమసుఖై క్యమయీ భవద్విచింతా. 8**

**ప్రమదలకున్ సుఖస్ఫురణ స్వల్పముగా మును పుద్ధవోపదే**
**శమున వియోగదుఃఖ మది స్వల్పమ, యిప్పటి నీ మహోపదే**
**శమున నఖండ మద్వయరసస్ఫురణమ్ము త్వదేకభావనా**
**విమలసమాధిలాభ మది వ్రేతల కబ్బె స్వరూపమై హరీ!**

ఇంతకు మున్ను గోపికలకు ఉద్ధవునిచే బంపిన ఉపదేశముచే నించుక సుఖము గల్గినది. దానితో మిశ్రమమంది విరహవ్యథ కొంచెమైనది. అది పరోక్ష వస్తుభావము. ఖండఖండము. ఇపుడు నీ సాక్షాదుపదేశముచే అపరోక్షవస్తు స్వరూపసంధానము అయినది. ఇది కేవలసచ్చిదానందాత్మ కాద్వైతస్ఫూర్తి అఖండము. ఇది వారికి కేవల స్వరూపమైనది.

**మునివరనివహై స్తవాథ పిత్రా దురిత శమాయ శుభాని పృచ్ఛ్యమానైః,**
**త్వయి సతి కిమిదం శుభాంతరై రిత్యుపహసితై రపి యాజిత స్తదాసౌ. 9**

**మును గని నారదాది మునిముఖ్యులఁ బాపశమార్థ మేమి శో**
**భనములు సేయనౌ ననఁగ వా రెలనవ్వులఁ బుండరీక లో**
**చనుని గుమారుగాఁ గనఁగ జాలిన పుణ్యముకంటెఁ బుణ్యమే**
**మనియు యజింపఁ జేసి రొక యజ్ఞము నవ్వసుదేవుచేఁ బ్రభూ!**

స్వామీ! మీతండ్రి వసుదేవుడు వ్యాస నారదాది మహర్షులను పాపనివారణకేమి యనుష్ఠింపవలెనని యడిగెను. వారు సాక్షాద్భగవంతుని పుత్రునిగా గనిన భాగ్యముకంటె మఱి శుభమేమున్నదనిరి. ఈయన దురితశమన ప్రార్థన మేమియని నవ్వుకొనియు, కానిమ్మని యాయనచే నొకయజ్ఞసంకల్పము సేయించిరి.

**సుమహతి యజనే వితాయమానే ప్రముదితమిత్రజనే సహైవ గోపాః,**
**యదుజన మహితా స్త్రిమాసమాత్రం భవదనుషంగ రసం పురేవ భేజుః.**

**సుమహితకల్ప మాక్రతువు సొంపుగ సాగుచునుండ నాప్తమి**
**త్రము లలరంగ గోపకులు త్వత్సహవాస రసానుభూతి పూ**

**ర్వమువలెఁ జూరలాడి రతిభక్తిని యాదవు లర్హ గౌరవ**
**మ్మమరచి నేడు రేపనుచు నాపగ నాగుచు మూఁడుమాసముల్.**

ఆ యజ్ఞకల్పము అత్యుత్తముగ (ప్రాయశ్చిత్తమనునది యవసరములేకుండ) సాగుచుండగా నీ మిత్రులు బంధువర్గము నందాదులతోగూడ గోపకులు నీ సహవాస రసానుభవమును జూరలాడి యాదవులచే నుచిత సత్కారములు వడసి వారు నేడు రేపని జరుపగా నీ సహవాసానందమును మునుపు వ్రేపల్లెలో వలెనే ఆస్వాదించిరి.

వి.వి: పుండరీకాక్ష నామస్మరణమాత్రముచే క్రియా దోషము హరించును. అట్టి నీవు సాక్షాత్సన్నిధిచేయగా నాయజ్ఞము ఉత్తమము గా కేమగునని తాత్పర్యము.

**వ్యపగమసమయే సమేత్య రాధాం దృఢ ముపగుహ్య నిరీక్ష్య వీతఖేదామ్,**
**ప్రముదిత హృదయః పురం ప్రయాతః పవన పురేశ్వర పాహి మాం గదేభ్యః. 11**

**అచ్చటినుండి యేగుసమయమ్మున రాధిక గూర్చి యక్కునన్**
**గ్రుచ్చి కవుంగలించి మదికుందు సమస్తము వాపి చారుహ**
**ర్షోచ్ఛ్రయుఁడౌచు ద్వారకకు నున్ముఖుఁడైతివి భక్తచిత్త పా**
**టచ్చర! మద్రుజాభరమడంపర శ్రీగురువాయు మందిరా!**

అచటి నుండి నీవు బయలుదేరు సమయమున రాధదరి కేగి గాఢముగ కౌగిలించుకొని యామె మనసులోని వగ పుడిపి భక్తానుగ్రహ నిమిత్తముగ నీకు సహజమైన బ్రహ్మానందస్థితి నంది ద్వారకా ప్రయాణోన్ముఖుడవైతివి. ఓ భక్త చిత్తమును హరించు గజదొంగా! శ్రీ గురువాయుమందిరావాసీ! నా ఆధివ్యాధి భారము హరింపుము.

# 85వ దశకము

# జరాసంధ వధ-రాజసూయము

**తతో మగధభూభృతా చిర నిరోధసంక్లేశితం**
**శతాష్టకయుతాయుత ద్వితయ మీశ భూమీభృతామ్,**

**అనాథశరణాయ తే కమపి పూరుషం ప్రాహిణో**
**దయాచత స మాగధక్షపణ మేవ కిం భూయసా** 1

అనుపమబాధలంది చెఱలందు జరాసుతు చేత, రాజుల
య్యెనిమిదివందలన్ బెరసి యిర్వదివేలగు సంఖ్య వారు ము
న్ననఘు ననాథనాథుఁడయినట్టి నినున్ శరణొంద నొక్కనిన్
బనిచి రతండు నమ్మగధనాథు వధింపను గోరె నిన్నటన్.

జరాసంధునిచేత గిరిగుహలో చెఱబట్టబడి ఇరువదివేల యెనిమిదివందల మందిరాజులు యనాథనాథుడవీవని విని వాని జంపుమని నీదగ్గర కొకదూతను రాయబార మంపిరి.

**యియాసు రభిమాగధం తదను నారదోరితా**
**ద్యుధిష్ఠిర మఖోద్యమా దుభయ కార్య పర్యాకులః**
**విరుద్ధ జయినో ఉద్ధ్వరా దుభయసిద్ధి రిత్యుద్ధవే,**
**శశంసుషి నిజైః స్సమం పురమియేథ యౌధిష్ఠిరీమ్.** 2

ఒక్కెడ నా జరాసుత వధోద్యమమున్ సురమౌని మాట నిం
కొక్కెడ నయ్యుధిష్ఠిరు క్రతూద్యమమున్ గదలింప నుద్ధవుం
డక్కడ రాజసూయ ముభయార్థ సమర్థక మంచుఁదెల్పగా
గ్రక్కునఁ బాండవేయుల పురమ్మున కేగితి వాప్తకోటితోన్.

నారదులవారు వచ్చి చెప్పినట్లు రాజసూయము చేయించుట మూలమున మేనత్త కుమారుని అనుగ్రహించుటకు సంకల్పించి జరాసంధుని నిగ్రహించుట మూలమున ఉభయకార్యసిద్ధియగునని యుద్ధవుడు తెల్పగా యుధిష్ఠిరుని పురమగు నింద్రప్రస్థమున కేగితివి.

**అశేష దయితాయుతే త్వయి సమాగతే ధర్మజో**
**విజిత్య సహజై ర్మహీం భవదపాంగ సంవర్ధితైః,**
**శ్రియం నిరుపమాం వహ న్నహహ భక్తదాసాయితం**
**భవంత మయి మాగధే ప్రహితవాన్ సభీమార్జునమ్.** 3

దేవులతోడ నీవు నరుదేర భవత్కరుణాకటాక్ష సం
భావితులైన తమ్ముల ప్రభావమునన్ మహిగెల్చి రాజ్య ల
క్ష్మీ విభవమ్ము ధర్మజుడు చేకొన నిన్ నిజభక్తకింకరున్
బావని నర్జునుం గొలిపి పంపెను మాగధు నుక్కడంపగాఁన్.

నీవు రుక్మిణిమొదలుగాగల అష్టమహిషులతో పదునాఱువేలమంది పత్నులతో రాగా నీకటాక్షపాత్రులయిన సోదరుల ప్రభావముచే రాజ్యలక్ష్మిని బడసి భక్తులకు దాసుడవగు నిన్ను భీముని అర్జునుని తోడిచ్చి జరాసంధుని మీదికి పంపెను.

గిరివ్రజపురం గతా స్త్రదను దేవ! యూయం త్రయో
యయాచ సమరోత్సవం ద్విజ మిషేణ తన్మాగధమ్,
అపూర్ణ సుకృతం త్వముం పవనజేన సంగ్రామయన్
నిరీక్ష్య సహ జిష్ణునా త్వమపి రాజయుద్ధాస్థితః. 4

ఏగి గిరివ్రజమ్ము పుర మీరలు ముగ్గురు బ్రాహ్మణాకృతిన్
మాగధు యుద్ధ బిక్షమును మంచిగ వేడితి; రీ వపూర్ణ పు
ణ్యాగతిగాన వానిపయి కంపి సమీరకుమారుఁ బార్థుతో
మూగిన రాజలోకములు పోరుకొనన్ గనినావు లీలగన్.

మీరు బ్రాహ్మణ రూపముల జరాసంధుని రాజధానియగు గిరివ్రజమను పురమున కేగి చూపరులకు వేడుకగ వానిని యుద్ధభిక్ష పెట్టుమని యర్థించిరి. నీవు నీదర్శనమాత్రమున వానికి ముక్తి కలుగనున్నను నీచేతిలో మడిసి సద్యోముక్తి నందుటకు తగిన పుణ్యము వానికింకను పూర్తికాలేదని తలంచి వానిపైకి భీమునిబంపి యచట నర్జునునితో దలపడి తక్కినరాజులు పోరాడుచుండగా మధ్యస్థుడట్లు నీవు చూచుచుంటివి.

అశాంత సమరోద్ధతం విటప పాటనా సంజ్ఞయా
నిపాత్య జరస స్సుతం పవనజేన నిష్పాటితమ్,
విముచ్య నృపతిం ముదా సమనుగృహ్యా భక్తి పరాం
దిదేశిథ గతస్పృహా నపిచ ధర్మగుప్త్యై భువః. 5

**అని కిసుమంత తగ్గని జరాత్మజా వృక్షము పెల్లగించు గు**
**ర్తున నని భీమునిచేతఁ బడఁద్రోచియు వాని చెఱన్ గృశించు నా**
**జనపతులన్ విముక్తులుగ సల్పి పరాఖ్య మఖండభక్తియున్**
**నినిచియు నిస్పృహాత్ములను నిల్పితి వేల్పడి ధర్మరక్షకున్.**

జరాసంధుడెంతకును యుద్ధమందు వెనుకాడకుండుటచూచి నీవా సమీపమందలి యొక చెట్టును పెల్లగించుట మూలమున సంజ్ఞచేయగా భీముడు గ్రహించి వానిని వెంటనే కూల్చెను. అటుపై వాని చెఱలోనున్న రాజులను విడిపించి వారికి పరమభక్తి తత్త్వము నుపదేశించి వారు మాకు రాజ్యము వలదన్నన ధర్మరక్షణకొఱకు వారిని వారి వారి రాజ్యములందు పునఃప్రతిష్ఠ సేసితివి.

**ప్రచక్రుషి యుధిష్ఠరే తదను రాజసూయాధ్వరం**
**ప్రసన్న భృతకీ భవ త్సకలరాజక వ్యాకులమ్,**
**త్వమ ప్యయి జగత్పతే ద్విజపదావనేజాదికం**
**చకర్థ కిము కథ్యతే నృపవరస్య భాగ్యోన్నతిః.** 6

**ఆవల రాజసూయ సుమహాధ్వరదీక్షితుఁడయ్యె ధర్మరా**
**జావసుధేశుమిత్రులు తదానతులే దొరలెల్ల, సర్వలో**
**కావనదక్షుఁడీవును ద్విజాంఘ్రుల క్షాళన మాచరించి త**
**త్పావనవారి మూర్ధమునఁ దాల్చితి వానృపుభాగ్య మేమనన్.**

అటుపై ధర్మరాజు రాజసూయాధ్వరమందు దీక్షితుడయ్యెను. ఆనాడు ప్రపంచమందలి రాజులెల్లరు నాతని పాదాక్రాంతులే అతని సామంతులే. అది నీచేసిన యనుగ్రహము. ఆ రాజసూయమందు అందఱన్ని కార్యములు నియోగించి లోకసంరక్షణ దక్షుడవు నీవు మాత్రము నిన్ను నీవే నియోగించుకొని యజ్ఞశాలద్వారమందు నిలిచి బ్రాహ్మణుల పాద ప్రక్షాళనముచేసి యాతీర్థము శిరమునందు దాల్చితివి. ఆ ధర్మరాజుపుణ్య మేమనవలెను?

**తత స్సవనకర్మణి ప్రవర మగ్ర్యపూజావిధిం**
**విచార్య సహదేవవాగనుగత స్స ధర్మాత్మజః,**
**వ్యధత్త భవతే ముదా సదసి విశ్వభూతాత్మనే**
**ముదా ససురమానుషం భువనమేవ తృప్తిం దధౌ.** 7

ఆయజనమ్మునం గలుగు నందఱిలోఁ దొలిపూజ కర్హుఁడీ
వే యని ధర్మరాజు గణియించి వడిన్ సహదేవుమాట హ
ర్షాయతిఁ బూజచేసె సకలాత్మకు నిన్ను సభాముఖాన నా
ప్యాయన మొందె దాన సకలామర మానుషమైనలోకముల్.

ఆ యాగసదస్సునందు ధర్మరాజు సహదేవుని మాట యూతగాగొని అగ్రపూజ నీకే యిచ్చెను. దానిచే విశ్వాత్మకుడవైన నీ వాప్యాయనమందుటవలన భూర్భువస్స్వరాది సర్వలోకములను అప్యాయితములైనవి. (తృప్తినందినవి.)

తత స్సపది చేదిపో ముని నృపేషు తిష్ఠ త్స్వహో
సభాజయతి కో జడః పశుపదుర్దురూటం వటుమ్,
ఇతి త్వయి సుదుర్వచోవితతి ముద్వమ న్నాసనా
దుదాపత దుదాయుధః సమపత న్నముం పాండవాః 8

ఎందఱొ రాజు లుండ మునులెందఱొ యుండగ నాలకాపరిన్
మందుని వట్టి నీచు వటు మందుఁడు తానిదె పెద్దసేసె నం
చందర రజ్జులాడుచు నుదాయుధుఁడై వడి లేచెఁ జేదిరా
జం దధమాధముండయిన యాఖలుపై జనిరంత పాండవుల్.

ఇంతమంది రాజులు ఇందఱు మునులుండగ నీ పసులకాపరికి ఈ మందునికి ఈ నీచునికి పెద్దచేసి పీటవేసి యర్చించుటాయని శిశుపాలు డాయుధ మెత్తి యెగసినాడు. తోడనే యా క్రూరునిపైకి పాండవు లెత్తిచనిరి.

నివార్య నిజపక్షగా నభిముఖస్య విద్వేషిణ
స్త్వ మేవ జహృషే శిరో దనుజదారిణా స్వారిణా,
జనుస్త్రితయ లబ్ధయా సతతచింతయా శుద్ధధీ
స్త్వయా స పరమేకతా మధృత యోగినాం దుర్లభామ్. 9

వారల నాపి నీవు శిశుపాలు నెదిర్చి యశేష విద్విష
ద్దారుణమైన చక్రమునఁ దచ్ఛిరమున్ దెగనేసినాఁడ వా
క్రూరుఁడు మూఁడు జన్మములఁగూడిన వైరసమాధి శుద్ధధీ
సారుఁడు యోగులున్ బడయఁ జాలని నీదగు నైక్యముం గనెన్.

పాండవులవారించి నీవు శిశుపాలునిపై సర్వశత్రుసంహారమైన చక్రమును విసరితివి. అది వాని శిరమును దెగవేసెను. వాడు హిరణ్యకశిపు రావణ శిశుపాలరూపమున మూడుజన్మములు నీయెడ పగ సాధించి నీతో నైక్యము సెందునట్లు మున్ను వరము వడసినకతన నీపై వైరమూలకమయిన సమాధిసిద్ధి నంది మహాయోగులకందని నీ సాయుజ్యమును బొందెను.

**తత స్సుమహితే త్వయా క్రతువరే నిరూఢే జనో**
**యయౌ జయతి ధర్మజో జయతి కృష్ణ ఇత్యాలపన్,**
**ఖలః స తు సుయోధనో ధుతమనా సపత్న శ్రియా**
**మయార్పిత సభాముఖే స్థలజలభ్రమా దభ్రమీత్.** **10**

**అనుపమ రాజసూయ సుమహాధ్వర మట్లు భవన్నిరూఢమై**
**చన, జనముల్ జయించుత నజాతరిపుండు జయించుఁ గృష్ణుఁడం**
**చని చని, రాసుయోధనుఁడు నాత్మఁ బరాభ్యుదయాభ్యసూయఁ చే**
**గనియెఁ బరాభవమ్ము మయకల్పితశిల్ప జలస్థలభ్రమన్.**

నీ యాధ్యక్ష్యమున నట్లు రాజసూయము సంపూర్ణముకాగా ప్రజలు అజాత శత్రుడు ధర్మరాజు సర్వోన్నతుడై యుండుగాక కృష్ణుడును జయించుగాక యని జయజయధ్వానము లొనరించుచు నిజస్థానముల కేగిరి. కలియంశమైన సుయోధనుడు మాత్రము పరులపెంపునెడ యసూయగలవాడుగావున తత్ఫలముగ మయనిర్మితమైన అద్భుత శిల్పకల్పనముగల సభాభావనములో నీళ్లో స్థలమో తెలియని భ్రమలోపడి యక్కడ పడిపోయి పరాభవము పాల్పడెను

**తదాహసిత సుస్థితం ద్రుపదనందనాభీమయో**
**రపాంగకలయా విభో కిమపి తావ దుజ్జృంభయన్,**
**ధరాభర నిరాకృతౌ సపది నామ బీజం పవన్**
**జనార్దన! మరుత్పురీనిలయ! పాహి మా మామయాత్.** **11**

**నవ్వెరి భీముఁడున్ ద్రుపదనందనయున్ ద్వదపాంగదీప్తి నా**
**నవ్వన నంకురార్పణ మొనర్చితి వద్భుత జృంభణమ్ముగా**
**నివ్వసుధాభర మ్ముడుపు టింతకు; మా రుజలెల్లఁ ద్రోచి మ**
**మ్మెవ్వలనన్ గటాక్షరుచి నేలు సమీర పురాధిపా! హరీ!**

వాని పాటు చూచి భీముడు ద్రౌపదియు నొండొరుల జూచి నవ్వుకొనిరి. స్వామీ! ఆ నవ్వులో భూభార నిర్వాపణరూపమయిన నీ యవతార ప్రయోజన మహోత్సవమునకు అంకురార్పణ గావించితివి. అనగా నవ్వు నాలుగు విధాల చేటు అన్నట్లు ఆ నవ్వునే కారణమొనరించి కౌరవవంశనిర్మూలనము, దుష్టశిక్షణ, శిష్టరక్షణములు, భూదేవియొక్క భారహరణము, అను నాల్గు ఘనకార్యములు చేసితివని భావము.స్వామీ! మా వ్యాధిబాధ లడంచి రక్షింపుము.

## 86వ దశకము

# సాల్వాదివధ-మహాభారత యుద్ధము

సాల్వో భైష్మీవివాహే యదుబల విజిత శ్చంద్రచూడా ద్విమానం
విందన్సౌభం సమాయీత్వయి వసతి కురూం స్త్వత్పురీ మభ్యభాంక్షీత్,
ప్రద్యుమ్నస్తం నిరుంధన్ నిఖిలయదుభటై ర్న్యగ్రహీ దుగ్రవీర్యం
తస్యామాత్యం ద్యుమంతం వ్యజనిచ సమర స్సప్తవింశత్యహాంతః. 1

మును శ్రీరుక్మిణి పెండ్లి యాదవ బలమ్ముల్ వంపగా, శంభుఁచే
గొని సాల్వుం డురు సౌంభకమ్మును గురుక్షోణిన్ భవత్ సుస్థితిన్
గని మీద్వారక ముట్టడించె; యదుసైన్యమ్మాని ప్రద్యుమ్నుఁడా
తని దన్మంత్రి ద్యుమంతుఁగట్టె; చనె యుద్ధమ్మి ర్వదేణ్ణాళ్ళటన్.

శ్రీ రుక్మిణీ వివాహమందు యాదవుల కోడిపోయిన సాల్వుడు శంకరు నారాధించి 'సౌంభకము' అను విమానము వడసెను. అతడు నీవు కురుదేశ మందున్నట్లు విని మీ ద్వారకానగరమును ముట్టడించెను. అపుడు ప్రద్యుమ్నుడు వానిమంత్రియగు ద్యుమంతుని బంధించెను. ఆ యుద్ధమిర్వదేడు రోజులు జరిగెను.

తావత్త్వం రామశాలీ త్వరితముపగతః ఖండిత ప్రాయసైన్యం
సౌభేశం తం న్యరుంధాః సచకిల గదయా శార్ఙ్గ మభ్రంశయత్త్వే,
మాయాతాతం వ్యహింసీ దపి తవ పురత స్తత్త్వయాపి క్షణార్థం
నాజ్ఞాయీ త్యాహురేకే తదిద మవమతం వ్యాసఏవ న్యషేధీత్. 2

హలితో సత్వర మీవు వచ్చి హతసేనానీకు నా సాల్వు వి
వ్వాలుఁ జేయన్, గదవైచి శార్ఙ్గమును విభ్రంశమ్ముఁ గావించె; ని
మ్ముల మాయావసుదేవుఁ జంపె నట నీముం దద్ది నీ కింతయున్
దెలియంబోదని యందుఁ రయ్యవమతిన్ జెండాడె నావ్యాసుఁడున్.

నీవు బలరామునితో వచ్చి వానిసేనలను జెండాడితివి. అతడు గదచేత నీ విల్లును జారిపోసెను. మఱియు నీముందు మాయచే వసుదేవునొక్కనిని గల్పించి సంహరించెను. వానిమాయ నీవెఱుంగవని కొందఱనిరి. కాని అది కాదని వ్యాసులు ఖండించిరి. శ్రీమద్భాగవతము స్కం. 10, అధ్యా. 77, శ్లో. 31. అజ్ఞులకు కలిగెడి శోకమోహములు స్నేహము నెక్కడ? అఖండజ్ఞానవిజ్ఞానైశ్వర్య సంపన్నుడగు హరి యెక్కడ? అని ఆయన శ్లోకతాత్పర్యము.

క్షిప్త్వా సౌభం గదాచూర్ణిత ముదకవిధౌ మంక్షు సాల్వోఽపి చక్రే
ణోత్కృత్తో దంతవక్త్రః ప్రసభ మభిపత న్నభ్యముంచ ద్గదాం తే,
కౌమోదక్యా హతోఽసావపి సుకృతనిధి శ్చైద్యవత్ ప్రాపదైక్యం
సర్వేషా మేష పూర్వం త్వయి ధృతమనసాం మోక్షణార్థోవతారః. 3

గదచేతఁ జూర్ణంబు గావించి సౌంభక
మ్మును విమానమ్మబ్ధి మునిచి నీవు
చక్రాయుధమ్ముచే సాల్వుఁ గూల్చితి; వంత
దంతవక్త్రుండు విక్రాంతి నెగసి
గద వైచె, దానిని గౌమోదకిం ద్రుంచి
తంతఁ బ్రాక్పుణ్య సమాప్తి నెనసి
వాఁడు చైద్యుఁడు వోలెఁ బడసె నీతో నైక్య
పరమలాభమ్ము నీభక్తునట్లు,
కామమున్ గ్రోధమాదిగాఁ గలుగు గుణ వి
కారములఁ గూడ నీయందుఁ గట్టి నెమ్మ
నంబు గట్టిన ముక్తి పట్టంబుగట్టు
దానికేకద యీ యవతార మభవ!

నీవు నీగదచే వాని సౌంభక విమానమును నుగ్గుచేసి సముద్రములో ముంచితివి. చక్రాయుధముతో సాల్వుంగూల్చితివి. అటుపై దంతవక్త్రుడు నీపై గదవిసరెను. నీవు కౌమోదకియను నీ గదచే వానిం దునిమితివి. శిశుపాలునివలె పుణ్యనిధియై నీతోడియైక్యమును బొందెను. నీయందు పగవగ (కామక్రోధాదులు) మొదలగు వికారములనుగూడ అర్పించి మనసు ధృడమొనరించినవారికి మోక్షసామ్రాజ్య పట్టాభిషేకము సేయుటకే శ్రీవారి అవతారము.

**త్వయ్యాయాతే௨థ జాతేకిల కురుసదసి ద్యూతకే సంయతాయాః**
**క్రందంత్యా యాజ్ఞసేన్యా స్సకరుణ మకృథా శ్చేలమాలామనంతామ్,**
**అన్నాంతప్రాప్త శర్వాంశజ మునిచకిత ద్రౌపదీచింతితో௨థ**
**ప్రాప్త శ్శాకాన్న మశ్న న్మునిగణ మకృథా స్తృప్తిమంతం వనాంతే. 4**

నీవట్లేగినమీఁద నక్కురుసభన్ గ్రీడించు ద్యూతాంతమం
దీవే దిక్కను ద్రోపదిన్ వలువ లెన్నేనిచ్చి రక్షించి, మున్
శైవాంశమ్మగు మౌనికిన్ జడిసి నిన్ ధ్యానింప నాసాధ్వి వేఁ
బ్రోవన్ శాకములారగించి ఋషులన్ మున్ దృప్తులన్ జేయవే.

అటు నీవు సనినతరువాత దుర్యోధనుసభలో నాడిన జూదమందు ద్రౌపది నిన్ను వేడ అక్షయవస్త్రదానము సేసి మానసంరక్షణము సేసితివి. అవల శివాంశమయిన దుర్వాసోముని రాగా నామె ననుగ్రహించుట కాతల్లివెట్టిన కూరాకుమెసవి అఖండాన్నదానముం గాంచితివి.

**యుద్ధోద్యోగే௨థ మంత్రే మిలతి సతి వృతః ఫల్గునేన త్వమేకః**
**కౌరవ్యే దత్తసైన్యః కరిపురమగమో దౌత్యకృత్పాండవార్థమ్,**
**భీష్మద్రోణాది మాన్యే తవ ఖలువచనే ధిక్కృతే కౌరవేణ**
**వ్యావృణ్వాన్ విశ్వరూపం మునిసదసి పురీం క్షోభయిత్వాగతోభూః. 5**

అనికిన్ నిశ్చయమై నినున్ నరుఁడు, సైన్యమ్మెల్ల రారాజు ని
మ్మన, నట్లేయని పాండవార్థముగ దౌత్యమ్మొని భీష్మాదు లౌ
నన నీమాటను, గాదనన్ నృపుఁడు విశ్వాకారమున్ జూపియున్
మునిగోష్ఠిన్ గలగించియక్కరిపురిన్, గోతెంచితీ వంతటన్,

యుద్ధము తప్పదని అర్జునుడు నిన్ను కోరగా దుర్యోధనుడు సైన్యములు కోరగా నట్లే యనుగ్రహించితివి. అటుపై కౌరవసభకు రాయబారమేగితివి. భీష్మాదులెంతన నీమాటను దుర్యోధనుడు గాదనెను. అపుడు మునులసభలో విశ్వరూపము ధరించి హస్తినాపురమును హడలంజేసి యేతెంచితివి.

**జిష్ణో స్త్వం కృష్ణ సూతః ఖలు సమరముఖే బంధుఘాతే దయాలుం**
**ఖిన్నం తం వీక్ష్య వీరం కిమిదమయి సఖే నిత్య ఏకో ఽయమాత్మా**
**కో వధ్యః కో ఽత్రహంతా తదిహ వధ భియం ప్రోజ్ఝ్య మయ్యర్పితాత్మా**
**ధర్మ్యం యుద్ధం చరేతి ప్రకృతి మనయథా దర్శయన్ విశ్వరూపమ్. 6**

**అని నప్పార్థుని తేరిసారథివియై యాత్మీయులన్ జంపలే**
**నని ఖిన్నుండగు నర్జునున్ దెలచి తప్పా! యాత్మ యేకంబ, చం**
**పను జంపంబడ నేఁడు లేఁడు, మది నాపైఁబెట్టి నిర్భీకుఁడై**
**యని ధర్మ్యమ్మొనరింపుమా యని విరాడాకారమున్ జూపుచున్.**

యుద్ధమందు పార్థ సారథివై బంధువులం జంపలేనన్న అర్జునునకు గీతోపదేశము ఆత్మ ఒక్కటీ చంపువాడు చంపబడునని యిద్దరు లేరు నాపైని మనసునిల్పి భయమువీడి స్వధర్మమైన సమరము గావింపుమని నీ విరాట్స్వరూపము నతనికి బ్రదర్శించితివి.

**భక్తోత్తం సేఽథ భీష్మే తవ ధరణిభరక్షేపకృత్యైకస క్తే**
**నిత్యం నిత్యం విభింద త్యవనిభృదయుతం ప్రాప్తసాదేచ పార్థే,**
**నిశ్శస్త్రత్వ ప్రతిజ్ఞాం విజహ దరివరం ధారయన్ క్రోధశాలీ**
**వాధావన్ ప్రాంజలిం తం నతశిరసమథో వీక్ష్యమోదా దపాగాః. 7**

**ధరణీభార మడంప దీక్షగొను నిన్ దర్శించి భీష్ముండు నా**
**దొరలన్ జంపగఁ బార్థు నొంప నిజభక్తుం బ్రోవఁ జక్రమ్ముతో**
**హరి! నీ వస్త్రము పట్టనన్ ప్రతిన వమ్మై రాగ, బీష్ముండు తా**
**శిరమున్ వంచి నుతింప వెన్దిరిగి తో శ్రీజాని హర్షించుచున్.**

భక్తశిరోమణి భీష్ముడు భూభారహరణమునకై వచ్చిన నారాయణునిగా నిను దర్శించెను. అర్జునుడు రాజులం జెండాడియాడి యలసినతటి ఆయుధము

పట్టనన్న నీ ప్రతిజ్ఞను నీవే వదలుకొని యెత్తివచ్చు నిన్ను భీష్ముడు శిరసువంచి నుతించినంత సంతసించి వెనుదిఱిగితివి.

యుద్ధే ద్రోణస్య హస్తిస్థిరరణ భగదత్తేరితం వైష్ణవాస్త్రం
వక్ష స్యాధత్త చక్రస్థగితరవిమహాః ప్రార్దయ త్సింధురాజమ్,
నాగా స్త్రే కర్ణముక్తే క్షితి మవనమయన్ కేవలం కృత్తమౌళిం
తత్రే తత్రాఽపి పార్థం కిమివ నహి భవాన్ పాండవానా మకార్షీత్ 8

కరిసేనన్ భగదత్తుఁ డెత్తివిసరంగా వైష్ణవాస్త్రమ్ము నీ
యురమందాగి, సుదర్శనాన రవిఁ జాటొందించి, యాసైంధవున్
బరిమార్పించి వసుంధరందిగిచి యాపై కర్ణునాగాస్త్ర మ
న్నరు మౌళిన్ దెగనేయఁ బ్రోచి తతనిన్ భక్తైకరక్షాచణా!

భగదత్తుడు గజసేనతో నెత్తివచ్చి వైష్ణవాస్త్రము విసరగా రొమ్మునం దాని నాపితివి. అవల నీచక్రముచే సూర్యునిగప్పి సైంధవుం జంపించి, కర్ణుడు నాగాస్త్రమేయగా భూమిని క్రిందికి ద్రించి అర్జును కిరీటము మాత్రము తెగిపోవునట్లు సేసి యాతని బ్రతికించితివి. స్వామీ! నీవెన్ని యాపదలనుండి పాండవుల గాపాడితివో చెప్పదరమా!

యుద్ధాదౌ తీర్థగామీ సఖలు హలధరో నైమిశక్షేత్ర మృచ్ఛన్
న ప్రత్యుత్థాయి సూతక్షయకృ దథ సుతం తత్పదే కల్పయిత్వా,
యజ్ఞఘ్నం పల్వలం పర్వణి పరిదలయన్ స్నాతతీర్థో రణాంతే
సంప్రాప్తో భీమదుర్యోధనరణ మశమం వీక్ష్య యాతః పురీం తే. 9

అనికిన్ మున్ హలి తీర్థసేవఁ జని తానా నైమిశమ్మందు సూ
తుని బ్రత్యుద్గతి సేయమిన్ దునిమి, పుత్రున్ నిల్పి బ్రహ్మాసన
మ్మున, యజ్ఞఘ్నుని పల్వలున్ దునుముచున్ మున్ బర్వపర్వమ్ములన్
ఘన తీర్థమ్ములఁ దోగి పోరు ముగియంగన్ భీమదుర్యోధనుల్
పెనగం జూచి గదారణ మ్మరిగె నవ్వీరుండు మీద్వారకన్.

యుద్ధమునకు ముందే బలరాముడు తీర్థయాత్రకేగి నైమిశారణ్యమందు తనకు ప్రత్యుత్థానము సేయలేదని సూతునింజంపి, మునులు కోరగా నతని

కుమారుని బ్రహ్మాసనమున నిల్పి యజ్ఞధ్వంసియగు పల్వలుడను రాక్షసుని పర్వసమయముల సంహరించి ఆయాతీర్థములందు స్నానముచేసి కురుపాండవ యుద్ధము ముగిసినతరువాత వచ్చి భీమదుర్యోధనుల నిర్విరామ గదా యుద్ధమును దిలకించి ద్వారకకు వెళ్ళెను.

**సంసుప్త ద్రౌపదేయ క్షపణ హతధియం ద్రౌణిమేత్య త్వదుక్త్యా**
**తన్ముక్తం బ్రహ్మ మస్త్రం సమహృత విజయో మౌళిరత్నంచ జహ్రే,**
**ఉచ్ఛిత్త్యై పాండవానాం పునరపి చ విశ త్యుత్తరాగర్భ మస్త్రే**
**రక్ష న్నంగుష్ఠమాత్రః కిల జఠర మగా శ్చక్రపాణి ర్విభో త్వమ్. 10**

**నిదురం జెందిన ద్రౌపదీ శిశువులన్ జెండాడఁగా ద్రౌణి ను**
**న్మదునిన్ డాసి నరుండు నీ పనుపునన్ బ్రహ్మాస్త్రము నిల్పి య**
**య్యదనన్ వాని శిరోమణిం గొనగ వాఁడా మీఁద నిష్పాండవ**
**మ్మది చేయంజన నుత్తరాజఠరమం దంగుష్ఠ మాత్రుండవై**
**సదయుండై శిశురక్ష సేసితివి నీచక్రాయుధమ్మొడ్డియున్.**

అశ్వత్థామ నిద్రపోవు ద్రౌపదిబిడ్డలను (ఉపపాండవులను) చంపగా నర్జునుడు వెనుదరిమి బ్రహ్మాస్త్రమేయగా నాపి యాతడు వాని శిరోమణిని లాగికొనెను. అటుపై ద్రౌణి నిష్పాండవమ్మొనరింప బ్రహ్మాస్త్రము విసరగా నుత్తరాగర్భమం దీవం గుష్ఠమాత్రుడవైయుండి చక్రమడ్డువెట్టి దయతో నాశిశువుం గాపాడితివి.

**ధర్మౌఘం ధర్మసూనో రభిదధ దఖిలం ఛందమృత్యు స్స భీష్మ**
**స్త్వాం పశ్యన్ భక్తి భూమ్నైవ హి సపది యయౌ నిష్కలబ్రహ్మభూయమ్.**
**సంయాజ్యాథాశ్వమేధై స్త్రిభి రతిమహితై ర్ధర్మజం పూర్ణకామం**
**సంప్రాప్తో ద్వారకాం త్వం పవనపురపతే పాహి మాం సర్వరోగాత్. 11**

**అనుశాసించి సుసూక్ష్మధర్మముల భీష్మాచార్యుఁ డయ్యెన్గు మ**
**న్మని నాధర్మజు, భక్తి పెంపున నినున్ గన్గొంచు స్వేచ్ఛాగతిన్**
**గనియెన్ నిష్కల మాత్మభావము, కనంగా నశ్వమేధత్రయ**
**మ్మును గావింపగఁ జేసి ధర్మజునిచేఁ బూర్ణార్థుఁగావించి మేల్**
**పొనరన్ ద్వారక కేగుదెంచి తటు నన్ బూర్ణార్థుఁ గావింపుమా!**

అవల నంపశయ్యనుండి భీష్ముడు ధర్మజునికి ధర్మసూక్ష్మముల నాదేశించి భక్తిసమృద్ధిచే నిన్ను దర్శించుచు స్వచ్ఛందమరణమందెను. ఆభక్తితోనే నిష్కల బ్రహ్మభావమందెను. ధర్మరాజుచే నశ్వమేధత్రయముగావింపజేసి పూర్ణాత్ము గావించి నీవును బూర్ణభావముతో ద్వారకాపురమునకు దయచేసితివి. ఓ గురువాయూరుపుర దైవమా! మమ్ము పాలింపుము.

# 87వ దశకము

# కుచేలానుగ్రహము

**కుచేలనామా భవత స్సతీర్థ్యతాం**
**గత స్స సాందీపని మందిరే ద్విజః**
**త్వదేకరాగేణ ధనాది నిస్పృహో**
**దినాని నిన్యే ప్రశమీ గృహాశ్రమీ. 1**

సరవిన్ నీకు సతీర్థ్యుఁడై కొలిచె నా సాందీపనిన్ విప్రుఁడ
బ్బురపున్ భక్తి వహించి నీయెడ, ధనమ్ముల్ భోగముల్ కోరఁడీ
శ్వరతంత్రమ్మఖిలమ్ముగా నరయుచున్ శాంతాత్ముఁడై యుండెఁదా
నరయన్ భక్తిఁగుచేలుఁడుత్తమము గార్హస్థ్యమ్ము చెల్లించుచున్

కుచేలుడను విప్రుడు నీ పరమభక్తుడు. అతడు నీతో సాందీపనిని గురువుగా గొలిచి విద్యాభ్యాసము సేసెను. ఐహికసుఖములు ధనములు కోరక సర్వమ్ము నీశ్వరాధీనమని తెలిసి శాంతుడై ఉత్తమగార్హస్థ్యము నిర్వహించుచుండెను.

**సమాన శీలా౽పి తదీయ వల్లభా తథైవ నో చిత్తజయం సమేయుషీ,**
**కదాచి దూచే బత వృత్తిలబ్ధయే రమాపతిః కింన సఖా నిషేవ్యతే. 2**

ఇంతయుఁదీసిపో దతని యింతి ప్రవర్తన వాని; కైన తత్
స్వాంతము వానియంతగ వశమ్మొనరించుకొనంగలేమి నా

**చెంతకు నేగి'వృత్తికయి శ్రీపతి నేల భజింపరాదు మీ**
**కెంతయుఁ గూర్చు నెచ్చెలిగదే హరి' యంచు వచించె జాలిగన్.**

ఆయన యిల్లాలు అన్నివిధముల నతనికిడైనదేయైనను నంతగ మనసు స్వాధీనము చేసికొనలేక భర్తనుగని శ్రీకృష్ణుని భజించి యేదైన జీవనమున కడిగితేరాదా! మీకు ప్రియమిత్రుడు గదా హరి యని జాలికలుగునట్లు పలికెను.

**ఇతీరితో ఉయం ప్రియయా క్షుధార్తయా జుగుప్సమానో ఉపి ధనే మదావహే,**
**తదా త్వదాలోకన కౌతుకా ద్యయౌ వహన్ పటాంతే పృథుకా నుపాయనమ్. 3**

**ప్రియసతి యాకటన్ సుడిసి బిడ్డలతల్లి యిటాడ దుర్మద**
**స్మయదము విత్తమంచు మది మాటి కసహ్యత నాటియైన న**
**వ్యయు నిను జూచు వేడ్క మది నగ్గలమై యొకచిన్నపాత నీ**
**కయి పృథుకమ్ములన్ ముడిచి యల్లనఁదెచ్చె నుపాయనమ్ముగన్.**

సంతానవతి ప్రియసతి యాకట నకనకంబడి యిట్లనుటగని ధనము మదమును గర్వమును బెంచునని మనసులో దానియెడ నేవగింపు దృఢమైనను అవ్యయమైన కేవల పరబ్రహ్మము నీవనెడి యుల్లాసమతిశయించి ఒక చిన్నపాతలో నటుకులు గట్టికొని నీకుపాయనముగా గొనివచ్చెను

**గతో ఉయ మాశ్చర్యమయీం భవత్పురీం గృహేషు శైబ్యాభవనం సమేయివాన్,**
**ప్రవిశ్య వైకుంఠమివాప నిర్వృతిం తవాతిసంభావనయా తు కిం పునః. 4**

**అరిగి కుచేలుఁ డందముల కందము వింతలకెల్ల వింత నీ**
**పురమటు సూచి శైబ్యగృహమున్ మఱి సొచ్చి వికుంఠసీమ న**
**ట్లరసి వచింపరాని పరమాద్భుత నిర్వృతి జొక్కె నంతమున్**
**హరువుగ నీవు సూపు పరమాదృతికి మఱి యేమనన్ వలెన్?**

కుచేలుడు మీ ద్వారకాపురసౌందర్యముం జూడనరిగి శైబ్యయింట నీవు వైకుంఠమందున్నట్లుండుట గాంచి యెనలేని యానందమందుటకు దోడు నీవచ్చట చేసిన మర్యాద ఆదరమునకు మైమఱచిపోయెను.

ప్రపూజితం తం ప్రియయా చ వీజితం కరే గృహిత్వా ఽకథయః పురాకృతమ్,
యదింధనార్థం గురుదారచోదితై రపర్తువర్షం తదమర్షి కాననే. 5

సరసనుజేరి నీవు విరిచామరముల్ గొని లచ్చి వీవ త
త్కరము కరమ్మునన్ మెలచి తారు చరించిన చిన్ననాటి బల్
చరితము లెన్ని మున్ సమిథలన్ గొనితే గురుపత్ని పంచినన్
బెరయు నకాలవర్షము వనిన్ సయిరించుట యెల్లఁ జెప్పినన్.

నీవు కుచేలుని సరస గూర్చుండి రుక్మిణి మీయిర్వురకు వింజామరవీవ గురుపత్ని సమిథలకు బంప పెనువాన గురిసి యడవిలో రేయెల్ల మీరుండుట మొదలగు మీ చిన్ననాటి ముచ్చటలు చెప్పికొనుచు మురిసితిరి.

త్రపాజుషో ఽ స్మాత్ పృథుకం బలాదథ
ప్రగృహ్య ముష్టౌ సకృదాశితే త్వయా,
కృతం కృతం నన్వియతేతి సంభ్రమా
ద్రమా కిలోపేత్య కరం రురోధ తే. 6

సిగ్గిలు నక్కుచేలు దరి చిక్కిన యయ్యడుకుల్ బలాత్కృతిన్
మ్రొగ్గి గొనంగ వెండియును బూనగఁ జాలిఁకఁ జాలునంచుఁ దా
నగ్గలికన్ జలించి జలజాలయ చయ్యనఁ జేరవచ్చి తా
దిగ్గన బట్టె నీకరము దీటుకొనన్ మణికంకణధ్వనుల్.

అటుపై నీకు కానుకతెచ్చిన యటుకులునీకు బెట్టుటకు సిగ్గుపడు మిత్రునుండి నీవే యాకర్షించి రెండుగుప్పిళ్లు లారగించి మూడవగుప్పిలి కైకొనబోవ మహాలక్ష్మి యవతారమైన రుక్మిణి కరకంకణములు మ్రోయ నీచేయి పట్టుకొని వారించెను.

భక్తేషు భక్తేన స మానిత స్త్వయా
పురీం వస న్నేకనిశాం మహాసుఖమ్,
బతాపరేద్యు ర్ద్రవిణం వినా యయౌ
విచిత్ర రూప స్తవ ఖల్వనుగ్రహః. 7

**అతఁడు భక్తులందుఁబరమాద్భుత భక్తుఁడవైన నీదు సం**
**ప్రీతికిఁ బాత్రమౌచు నొకరే యచటన్ సుఖముండి యేగె తా**
**నాతలిరోజునన్ నిజగృహానకు విత్తము మాటలేక, నీ**
**చేతి యనుగ్రహ స్ఫురణ చిత్రవిచిత్రముగాదె మాధవా!**

భక్తులకు బరమభక్తుడవు నీవు. అట్టి నీ ప్రీతికి దానుపాత్రమై యుప్పొంగుచు నొక్కరేయి నీతోనేయుండి మరునా డింటికి బయనమయ్యెను నీవేమియు నీయలేదని యనుకొననే లేదు. నీ యనుగ్రహవిధానమది. వింతలకెల్ల వింతయైనది గదా!

**యది హ్యయాచిష్య మదాస్య దచ్యుతో**
**వదామి భార్యాం కిమితి వ్రజ న్నసౌ,**
**త్వదుక్తి లీలాస్మిత మగ్నధీః పునః**
**క్రమా దపశ్యన్ మణిదీప్రమాలయమ్.** 8

**"అడిగితినేని వాఁడొసఁగి యప్పుడ యచ్యుతుఁడిచ్చువాఁడు; నా**
**పడతి కిటేగి యేమనెద భాగ్య" మటం చటులేగుచుండి నీ**
**నొడివిన మాటలున్ పనులునున్ జిఱునవ్వులు నెంచి లీనతన్**
**గడచి కనెన్ స్వకీయభవనమ్ము కనన్మణిదీపిత మ్మటన్.**

నోరుదెఱచి యడిగిన కృష్ణుడాక్షణమ యిచ్చెడివాడు. ఇంటికేగి నా యిల్లాలి కేమని చెప్పుదును? అని యనుకొనుచు నీపలికినపలుకులు నీచేసిన మర్యాదలు నీనవ్వులు దారిపొడుగున దలపోసికొని మురిసిపోవుచు వచ్చి తన కుటీరమొక బంగారుమేడయై రత్నభవనమై విలసిల్లుచుండ గనెను.

**కిం మార్గవిభ్రంశ ఇతి భ్రమన్ క్షణం**
**గృహం ప్రవిష్ట స్సదదర్శ వల్లభామ్,**
**సఖీపరీతాం మణిహేమభూషితాం**
**బుబోధచ త్వత్కరుణాం మహాద్భుతామ్.** 9

**ఏనిటు దారి తప్పితినొ యీతెఱ వేమని యట్టులిట్టులై**
**పూని గృహమ్ముఁ జొచ్చి మునుమున్న కనెన్ దనప్రాణవల్లభన్**

**మానిత హేమరత్నమయ మంజులభూషణ భూషితాంగిఁ బా**
**దానత నద్భుతాద్భుత మయారె! యెఱింగె భవత్కృపారుచిన్.**

దారి తప్పితినా! ఈ దారి మా యింటికేనా! ఈ ఇల్లు మాదేనా! అని తబ్బిబ్బుపడుచునే యిల్లు సొచ్చి తన ప్రాణప్రియను గాంచెను. ఆమె మణిమయ స్వర్ణభూషణ భూషితయై పాదముల వ్రాలి స్వాగతమీయం జూచి లక్ష్మీమనోహరు డగు నీకృపామాధుర్యము రుచి గ్రహించెను.

**స రత్నశాలాసు వసన్నపి స్వయం సమున్నమద్భక్తిభరో ఽమృతం యయౌ,**
**త్వమేవ మాపూరిత భక్తవాంఛితో మరుత్పురాధీశ హరస్వ మే గదాన్. 10**

**ఆవిధి నూత్న రత్నభవనాళి వసించుచునున్ సమున్నమ**
**త్పావన భక్తియోగమున భవ్యుఁడతం డమృతత్వ మందె నీ**
**వీవిధ భక్తవాంఛితము లెల్లను నింతు వనుగ్రహింపు నన్**
**శ్రీవర! శ్రీకుచేల సఖ! శ్రీ గురువాయుపురాధినాయకా!**

అట్లు నూతనరత్నసౌధమందు నిజపత్నితో సంతానముతో వసించి అనుపమ భక్తి యోగమున నిన్ను భజించుచు నమృతత్వ సిద్ధి నందెను. స్వామి! ఏలిన వారిని కోరకయే భక్తులకు సకలశ్రేయస్సులను బ్రసాదించు మహానుభావుడవు ఓ కుచేల సఖా! శ్రీగురువాయూరుపుర నివాస! నాయెడ బ్రసన్నుడవు గమ్ము.

## 88వ దశకము

# అర్జునానుగ్రహము (సంతాన గోపాలము)

**ప్రాగేవాచార్య పుత్రాహృతి నిశమనయా స్వీయషట్సూను వీక్షాం**
**కాంక్షంత్యా మాతు రుక్త్యా సుతలభువి బలిం ప్రాప్య తేనార్చిత స్త్వమ్,**
**ధాతుశ్శాపా ద్ధిరణ్యాన్వితకశిపుభవాన్ శౌరిజాన్ కంసభగ్నా**
**నానీయైనాన్ ప్రదర్శ్య స్వపద మనయథాః పూర్వపుత్రా న్మరీచేః. 1**

కొని గురుపుత్రుఁ దెచ్చితని కోరగ దేవకి యేగి యా బలిన్
గని సుతలాన బ్రహ్మవచనానను దైత్యపతిం గణించి తం
డ్రినగ నిటన్ జనించిన మరీచి కుమారుల వాసుదేవులన్
జననికిఁజూపి యన్నలవెసన్ నిజధామముఁ జేర్చి తన్నలన్.

ఇంతకుమున్ను యమలోకమునుండి గురుపుత్రుని దెచ్చి యర్పించితివన్న వార్త దేవకి విని బలరామ కృష్ణులు మీరు అవతార పురుషులని తెలిసి యింతకు మున్ను గతించిన తన యార్వురు బిడ్డలను గొని వచ్చి చూపుడని కోరినది. మీరు సుతలమున కేగి బలి చక్రవర్తివలన సత్కరింపబడి స్తుతింపబడితిరి. మున్ను మరీచికి జన్మించి స్మర ఉద్గీథ పరిష్వంగ పతంగ క్షుద్ర భృ ఘృణి నామముల బరగి బ్రహ్మ తన కుమార్తెయగు వాగ్దేవిని సంగమించెనని పరిహసించి-యాయన శాపముచే-నసురులై హిరణ్యకశిపునికి జన్మించిరి. వారే వసుదేవునికి జనించి కంసునిచే సంహరింపబడిరి. వారిని యోగమాయచే గొని వచ్చి మీ అమ్మ దేవకికి జూపి యానందపరచి వారిని తిరిగి నీ స్థానమగు స్వర్గము నందించితివి.

శ్రుతదేవ ఇతి శ్రుతం ద్విజేంద్రం బహులాశ్వం నృపతించ భక్తిపూర్ణమ్
యుగపత్త్వ మనుగ్రహీతుకామో మిథిలాం ప్రాపిథ తాపసై స్సమేతః. 2

శ్రుతదేవుండని విశ్రుతుండయిన పారున్ భక్తి సారున్ ధరా
పతిమౌళిన్ బహుళాశ్వ నొక్కమొగి సంభావించి పాలింపగాఁ
గుతుకంబుంగొని మౌనిలోకపరిషత్కోటీరులం గూడి యం
చితమోదమ్మున నేగి తామిథిలకున్ శ్రీమానినీవల్లభా!

శ్రుతదేవుడన బ్రసిద్ధినందిన భక్తుడగు మైథిలుడయిన విప్రుని బహులాశ్వ డనురాజును ఒక్కతీరున గౌరవించి పాలించుటకు మునిశ్రేష్ఠులతో మిథిల కేగితివి.

గచ్ఛన్ ద్విమూర్తి రుభయో ర్యుగపన్నికేత
మేకేన భూరివిభవై ర్విహితోపచారః
అన్యేన తద్దినభృతైశ్చ ఫలోదనాద్యై
స్తుల్యం ప్రసేదిథ దదాథ చ ముక్తి మాభ్యామ్. 3

**ఇరుతెఱఁగైన మూర్తులు వహించి యటిద్దరియిండ్ల కేగి నే**
**దొరనని యందొకం డిడిన తోరపు రాజమహోపచారముల్**
**గురిఁగొని యన్యుఁ డాదినము కూరిచికొన్న ఫలోదనమ్ములున్**
**సరిగ గ్రహించి మెచ్చి యిరువాయల ముక్తులఁజేసి తిద్దఱన్.**

అక్కడ రెండు రూపములూని యిద్దరి యిండ్లకేగి ఒకరియింట నేను రాజునని రాజమర్యాదలు వడసి, ఇంకొక యింట నాతడు తన యాకలి దీరుటకు ఆనాడు కూర్చుకొన్న పండ్లు మంచినీళ్ళు ఇచ్చిన స్వీకరించి యిద్దఱి నొకేతీరున ముక్తులను జేసితివి. భక్తిచే నిచ్చిన ఆకు పువ్వు పండు నీరును పంచభక్ష్య పరమాన్నములును నీ కొక్కటేయని భావము.

**భూయో౽థ ద్వారవత్యాం ద్విజతనయమృతిం తత్ప్రలాపానపి త్వం**
**కో వా దైవం నిరుంధ్యా దితి కిల కథయన్ విశ్వవోఢా౽ప్యసోఢాః,**
**జిష్ణోర్గర్వం వినేతుం త్వయి మనుజధియా కుంఠితాం చాస్య బుద్ధిం**
**తత్త్వారూఢాం విధాతుం పరమతమపద ప్రేక్షణే నేతి మన్యే. 4**

**వెనుకన్ ద్వారవతిన్ ద్విజార్భకమృతిన్ విశ్వంభరుండయ్యు వా**
**రనుమాటల్ భరియించి తెవ్వనివశమ్మౌ దైవమున్ నిల్ప నం**
**చని గర్వాన నరుండు నిన్ నరుఁడవౌదం చెంచ వైకుంఠ ద**
**ర్శనభాగ్యమ్మిడి తత్త్వబోధ మొనఁగూరన్ జేసి తంచెంచెదన్.**

మునుపు ద్వారకలో నొక విప్రబాలుకుడు పోగా విశ్వమెల్ల భరించువాడవు గావున లోకులాడు మాటల భరించి, దైవగతి నాప నెవరి శక్యమని చేతగాని వాడట్ల ఊరకొంటివి. అవ్వల అర్జునుడు తనలో కృష్ణుడు మానవమాత్రుడే నేను ఘనుడనని పదనుదప్పిన యాతని మనస్సునకు తత్త్వ నిర్ణయమవగాహన యగుటకే యాతనికి వైకుంఠదర్శన భాగ్యమనుగ్రహించితివని నాకు తోచుచున్నది.

**నష్టా అష్టాస్య పుత్రాః పున రపి తవ తూపేక్షయా కష్టవాదః**
**స్పష్టో జాతో జనానా. మథ తదవసరే ద్వారకా మాప పార్థః,**
**మైత్ర్యా తత్రోషితో౽సా నవమసుతమృతౌ విప్రవర్య ప్రరోదం**
**శ్రుత్వా చక్రే ప్రతిజ్ఞా మనుపహృతసుత స్సన్నివేశ్యే కృశానుమ్. 5**

ఎనమం డ్రా ద్విజుబిడ్డలట్ల చనిపో నింతేనియున్ శ్రద్ధగై
కొనవంచున్ జనులాడఁ పార్థుఁడట నీకుంగూర్చు చుట్టంపుచూ
పునరాగా నవమంపుబాలునకు విప్రుండేద్వగాఁ జూచి నీ
తనయుం దెచ్చెదఁ దేనిచో ననల మంతన్ జొత్తునం చాతఁడున్.

బ్రాహ్మణుని సంతాన మెనమండ్రు చనిపోగా, నీ వించుకయేని శ్రద్ధ సేయుటలేదని లోకులాడుకొనగా, అర్జునుడు చుట్టపుచూపుగా నదేసమయానకురాగా, బ్రాహ్మణుడెనమండ్రు శిశువులం గోల్పోయి తొమ్మిదవ పుత్రునికై శోకించుచుండగా, అర్జునుడు నీ కుమారునినే దెచ్చెదఁ దేనిచో నగ్ని ప్రవేశము సేయుదుననియె

మానీ స త్వా మపృష్ట్వా ద్విజనిలయగతో బాణజాలై ర్మహాస్త్రై
రుంధానః సూతిగేహం పునరపి సహసా దృష్టనష్టే కుమారే
యామ్యా మైంద్రీం తథాన్యా స్సురవరనగరీ ర్విద్యయాసాద్య సద్యో
మో ఘోద్యోగః పతిష్యన్ హుతభుజి భవతా సస్మితం వారితో௨భూత్. 6

కని నీతోనన చెప్పకేగియు నహంకారాన దివ్యాస్త్రపం
క్తి నిరోధించి యరిష్ట, మాశిశు వటే కిడొంద నయ్యామ్య ప
త్తనమేకాక దిగీశపట్టణములంతం జూచి, వ్యర్థుండునై
యనలంబున్ జొరఁబోవ నాపితివి నీ వప్పార్థునిన్ నవ్వుచున్.

అవ్వల నర్జునుడు శరణన్న వారి రక్షించువాడ నన్న గర్వముచే నీతో జెప్పకయే దివ్యాస్త్ర పంజర మొనరించి పురిటిల్లును. అంతలో శిశువు పుట్టుట గిట్టుటయు నైనంతయోగశక్తిచే యమపురి కేగి చూచి దిక్పాలుర నగరములు గాలించి కానక అగ్ని ప్రవేశము గావింపబోగా నీవు తటాలున నవ్వుచు వచ్చి యాతనిం వారించితివి

వి.వి: పౌరుషమునకు దైవబల మవసరము లేదనుకొంటివి గదా ఇప్పు డేమైనదను విషయము తెలుపుటకు నవ్వితివని భావము

పార్థం తేన ప్రతీచీం దిశ మతిజవినా స్యందనే నాభియాతో
లోకాలోకం వ్యతీత స్తిమిరభయ మథో చక్రధామ్నా నిరుంధన్,

చక్రాంశుక్లిష్ట దృష్టిం స్థితమథ విజయం పశ్య పశ్యేతి వారాం
పారే త్వం ప్రాదదర్శః కిమపిహి తపసాం దూరదూరం పదంతే. 7

అటుపై నర్జునితో రథానఁజని లోకాలోకపర్యంత ము
త్కటచక్రద్యుతిఁ జీఁకటుల్ చిదిమి తత్కాంతిన్ గనుల్గానరా
నటులౌ నన్నునుఁ జూడుచూడుమని పారావారతీరమ్మునం
దటు చూపించితి వెల్ల చీఁకటుల మీఁదై వెల్గు నీధామమున్.

అటుపై నర్జునునితో లోకాలోక పర్యంతము రథము పై నేగి రథకాంతిచే చీకటుల వారించి యా వెలుగులో కన్నులు మిఱుమిట్లు గొని కానరానట్లైనంతట నదిగో చూడుమని సముద్రమవ్వలిదరిని బెంజీకటి కవ్వల వెలుంగు నీవైకుంఠ ధామముం జూపితివి.

తత్రాసీనం భుజంగాధిపశయనతలే దివ్యభూషాయుధాద్యై
రావీతం పీతచేలం ప్రతినవజలదశ్యామలం శ్రీమదంగమ్,
మూర్తీనా మీశితారం పరమిహ తిసృణా మేక మర్థం శ్రుతీనాం
త్వామేవ త్వం పరాత్మన్ ప్రియసఖసహితో నేమిథ క్షేమ రూపమ్. 8

అలరి భుజంగభోగశయనాగ్రమునన్ మణిభూషణాయుధ
మ్ములఁ గయిసేసి పీతపటముం గటిఁజుట్టి సకాలవారిదో
జ్జ్వలరుచి మూఁడుమూర్తులకు పైదొరయై శ్రుతిలక్షితార్థమై
నెలకొను క్షేమమూర్తి నిను నీవ నుతించితి వాప్తమిత్రుతో.

అక్కడ భోగి భోగతల్పమున రత్నభూషణములు దివ్యాయుధములు నలంకరించుకొని పీతాంబరముందాల్చి తొలకరి మేఘమట్లు శోభించు మేని కాంతితో ముమ్మూర్తులకు మీది ప్రభువువై వేదలక్షితమైన వస్తువవైయున్న నిన్నే నీవు నీ మిత్రునితో నమస్కరించితివి.

యువాం మామేవ ద్వావధిక వివృతాంతర్హిత తయా
విభిన్నౌ సంద్రష్టుం స్వయ మహ మహార్షం ద్విజసుతాన్,
నయేతం ద్రాగేతా నితి ఖలు వితీర్ణాన్ పున రమూన్
ద్విజాయాదా యాదాః ప్రణుతమహిమా పాండుజనుషా. 9

ఏనొక్కండ వివర్తమై యిరువురై యీరీతి భిన్నస్వరూ
పానం గోచరమౌ మిముం గనుగొనన్ వాంఛించి యీబాలురన్
నేనే దొంగిలినాఁడ వీరె కొనిపొండి యంచుఁ బార్థస్తుతుం
డైనీవందఱఁదెచ్చి బ్రాహ్మణున కాహా! యిచ్చి తుద్యత్ప్రభన్.

మఱియు నేనొక్కడనే వివర్తమంది యీ రీతి రెండై భిన్న రూపముల గనిపించు మిమ్ము చూడవలెనని యీ విప్రబాలుర నేనే హరించితిని. ఇదుగో! వీరిం గొని యేగుడని పల్కి పార్థుని స్తుతినందుకొని వచ్చి యీ బాలుని బ్రాహ్మణుల కొసంగితివి.

వి.వి: కృష్ణావతారము శుద్ధసత్త్వోపాధికము. అందుచే నందీశ్వరత్వము స్పష్టముగా గోచరించినది. అర్జునుడు ఉపాధ్యంతర్హిత చైతన్యమూర్తి. కావున జీవత్వము అతని యందు గనిపించును. ఇట్లు జీవేశ్వరులుగా వివర్తమందిన మిమ్ము ఏకరూపమున చూపించుటకే బ్రాహ్మణ బాలురను హరించుట జరిగినది. ఇది దేవరహస్యము.

ఏవం నానావిహారై ర్జగదభిరమయన్ వృష్ణివంశం ప్రపుష్ణ
న్నీజానో యజ్ఞభేదై రతుల విహృతిభిః ప్రీణయ న్నేణనేత్రాః,
భూభారక్షేపదంభాత్ పదకమలజుషాం మోక్షణాయావతీర్ణః
పూర్ణం బ్రహ్మైవ సాక్షా ద్యదుషు మనుజతారూషిత స్త్వం వ్యలాసీః. 10

నానాలీలల నంగనామణుల నానాలోకముల్ దేల్చి యెం
తేనిన్ బుష్టమొనర్చి వృష్టికుల మెన్నో యజ్ఞముల్ సేసి భా
రానం గ్రుంగెడిభూమి నెత్తుమిషగా రక్షించి భక్తాళి బ్ర
హ్మానందమ్ము స్వరూపమై మసలినా వాహా యదు శ్రేణిలోన్.

ఓ శ్రీవల్లభా! నీ విట్లు నీ వివిధలీలలచే లోకముల నానందపరచి వృష్టికులమునకు పెంపుగూర్చి యెన్నోయజ్ఞములుసేసి గోపికలు ప్రియమంద వర్తించి భూభారముడుపుటయనుపనిపెట్టుకొని భక్తులను ముక్తులను గావింప పూర్ణ బ్రహ్మానందమూర్తి వైన నీవు మానవునట్లు నటించి యాదవులతో నాడుకొన్నావు

ప్రాయేణ ద్వారవత్యా మవృతదయి తదా నారద స్త్వ ద్రసార్ద్ర
స్తస్మాల్లేభే కదాచి త్ఖలు సుకృతనిధి స్త్వత్పితా తత్త్వబోధమ్,

భక్తానా మగ్రయాయీ స చ ఖలుమతిమా నుద్ధవ స్త్వత్త ఏవ
ప్రాప్తో విజ్ఞానసారం సకిల జనహితాయాధునాస్తే బదర్యామ్. 11

ఎపు డాద్వారక వచ్చి పోవును సురర్షీంద్రుండు త్వద్భక్తి భా
వపరీతుం; డతనింభజించి వసుదేవస్వామి పుణ్యాత్ముఁడా
త్మ పరిజ్ఞానముఁ బొందె; నుద్ధవుఁడు భక్తస్వామి ధీశాలి నీ
కృప విజ్ఞానమునేర్చి యాబదరిలో నీనాడునున్ వర్తిలున్.

భక్తులకెల్ల మొదటివాడు నారదస్వామి ద్వారకకు రాకపోకలు చేయుచుండును. ఆయనను సేవించి వసుదేవుడు ఆత్మజ్ఞానముంబడసెను. ఉద్ధవుడు భక్తాగ్రణ్యుడు బుద్ధిశాలి నీ కృపచే విజ్ఞానఖనియై యా బదరికాశ్రమమం దీనాడు నున్నాడు.

సోఽయం కృష్ణావతారో జయతి తవ విభో యత్ర సౌహార్దభీతి
స్నేహద్వేషానురాగప్రభృతిభి రతులై రశ్రమై ర్యోగభేదైః,
ఆర్తిం తీర్త్వా సమస్తా మమృతపద మగు స్సర్వత స్సర్వలోకా
స్స త్వం విశ్వార్తిశాంత్యై పవనపురపతే భక్తిపూర్త్యైచ భూయాః. 12

పగ యనురాగముం భయము బాంధవమున్ జెలికార మాదిగా
నగణితయోగభేదముల నశ్రమమే భవదుఃఖ మీగి ఏం
దగు నమృతత్వసిద్ధిగని రందరు నీదవతార మన్నిఁటన్
సొగసగు భక్తిపూర్తిమది నూల్కొలుపంగదె భక్తరక్షకా!

ఈ యవతారమందు పగ పగ భయము బాంధవ్యము చెలికారము మొదలయిన మనోవికారము లెన్నిగలవో అన్నియు నీ యెడల నిలిపి దానిచే దృఢ సమాధి యోగమంది అందఱు శ్రమలేకయే సంసార దుఃఖము (ఆధి భౌతిక-ఆధి దైవిక అధ్యాత్మిక రూప తాపత్రయమును) బాసి అమృతసిద్ధిగనిరి, అన్ని యవతారములలోనివి అత్యున్నతము. ఆవున నీ కృష్ణా! గురువాయు పురాధి నాయక! ఆర్తియెల్ల శాంతించుటకు భక్తి పరిపూర్ణతకు మాకు దిక్కగుము.

వి.వి: పరమాత్మయందు భావము నిలిపినవారు: భీతిచే కంసుడు, ప్రీతిచే యాదవులు, ద్వేషముచే శిశుపాలాదులు, అనురాగముచే గోపికలు.

# 89వ దశకము

# వృకాసురవధ-విష్ణుపారమ్యము

రమాజానే జానే యదిహ తవభక్తేషు విభవో
న సంపద్యసద్య స్తదిహ మదకృత్త్వా దశమినామ్,
ప్రశాంతిం కృత్త్వైవ ప్రదిశసి తతః కామ మఖిలం
ప్రశాంతేషు క్షిప్రం న ఖలు భవదీయే చ్యుతికథా. 1

కమలాజాని! భవజ్జనమ్ములకు సాక్షాత్పుణ్యభోగమ్ము వే
గమ యందీయ వశాంతులందు మదముం గల్పించు నంచెంచి, మున్
శమముం గూర్తువు సుప్రశాంతులకు నో సద్య ఫలమ్మిత్తు వే
క్రమమందైనను నీదు భక్తులకు భంగం బుండఁబో దీశ్వరా!

ఓ లక్ష్మీపతీ! నీవారికి నీవు వెనువెంటనే పుణ్యఫలభోగానుభవ మందీయవు. అట్లిచ్చిన వారు గర్వించి చెడుదురని నీభావము. మున్ముందు శమము (అంతరింద్రియ నిగ్రహమును) శాంతిని అనుగ్రహించి అమీద నా శమనంపన్నులకు (శాంతులకు) సద్యఃఫలమను గ్రహింతువు. ఏ తీరున జూచినను నీ భక్తులేలాటి భంగము నందరు. ఎన్నటికిం జెడరు.

సద్యఃప్రసాదరుషితా న్విధిశంకరాదీన్
కేచి ద్విభో నిజగుణానుగుణం భజంతః,
భ్రష్టా భవంతి బత కష్ట మదీర్ఘ దృష్ట్యా
స్పష్టం వృకాసుర ఉదాహరణం కిలాస్మిన్. 2

అక్షణమే యనుగ్రహము నాగ్రహమున్ ఫలియించు బ్రహ్మ ఫా
లాక్షుని మున్నుగా నిజ గుణానుగుణమ్ముగఁ గొల్చుచుండి పు
ణ్యక్షయమౌ నెడన్ బతనమందుదు రెందఱో దూరదృష్టి లేః
కీక్షితి నా వృకాసురుఁడె యిందు నిదర్శన మెల్ల భంగులన్.

బ్రహ్మ రుద్రాది దేవతలు సద్యఃప్రసన్నులు సద్యఃకోపనులును తమతమ వాసనలంబట్టి వారిని భజించినవారు వెనువెంటనే వారియనుగ్రహము వడసియు అశాంతులై వారి నిగ్రహమునకు గురియై భ్రష్టులగుచుందురు. దూరదృష్టి లేనందున చిరకాలము విష్ణుసేవనము చేయుట కలసులైనకతననే అన్యదేవతల నాశ్రయింతు రన్నమాట. ఇందులకు వృకాసురుడు స్పష్టమైన ఉదాహరణము.

రాగీ స పురుషోవశ్యం ఫలం ప్రేప్స్యతి శంకరాత్
తతః ఫలం సలభతే తతస్తం విస్మరిష్యతి.

రాగవశుడైనవాడు శంకరుని గొలిచి ఫలము పొందగోరును. ఆయనవలన ఫలము వడసి ఆవల నాయనను మఱచిపోవును అని చెప్పబడినది.

శకునిజ స్సతు నారద మేకదా త్వరితతోష మపృచ్ఛ దధీశ్వరమ్,
స చ దిదేశ గిరీశ ముపాసితుం నతు భవంత మబంధు మసాధుషు. 3

త్వరిత ప్రసన్నుఁడగు నీ
శ్వరుఁ డెవఁడన వాఁడు, "హరుని భజియింపు మనెన్"
సురముని నిను బేర్కొనఁడా
సురవృత్తుల పాలి కీవు చుట్టము గామిన్.

శకునియొక్క కుమారుడు వృకాసురుడు త్వరితముగ బ్రసన్నుడు (అశుతోషుడు) అగు ఈశ్వరుడెవడనియడుగగా నారదమహర్షి హరుడనిచెప్పెను. అసురప్రవృత్తి గల అసాధువులకు బంధువవు కానందున నీ మాట సెప్పెడయ్యె.

తప స్తప్త్వా ఘోరం స ఖలు కుపిత స్సప్తమదినే
శిర శ్ఛిత్వా సద్యః పురహరముపస్థాప్య పురతః,
అతిక్షుద్రం రౌద్రం శిరసి కరదానేన నిధనం
జగన్నాథా ద్వవ్రే భవతి విముఖానాం క్వ శుభధీః. 4

చని ఘోరమ్ము తపమ్ము సేసి కినుకన్ సప్తాహ పర్యంత, మం
తన ఖండించి శిరమ్ము రుద్రు నెదుటన్ రావించి వాఁడేని నె
త్తిని జే వెట్టునొ వాఁడు సావ వరమున్ దీవ్రమ్ము నీచమ్ముఁ గో
రెను స్వామిన్, శుభబుద్ధి యెట్లొదవు తండ్రీ! త్వద్విరుద్ధాత్ములన్.

వృకుడేగి తపస్సు చేసి ఏడవరోజుననే ఈశ్వరుడు ప్రసన్నుడు కాలేదని క్రోధమెత్తి తల నరికికొని రుద్రు నెదుటకు రప్పించి కొనెను. మఱియు తానెవని నెత్తిని జేయిపెట్టునో వాడు చావవలెనను నతి నీచము క్రూరము నైన వరము నా జగన్నాథు నర్థించెను. స్వామీ! నీకు విముఖులైన వారికి మంచి బుద్ధి యెట్లు లభించును?

**మోక్తారం బంధముక్తో హరిణపతి రివ ప్రాద్రవ త్సోఽథ రుద్రం**
**దైత్యా ద్భీత్యా స్మ దేవో దిశిదిశి వలతే పృష్ఠతో దత్తదృష్టిః**
**తూష్ణీకే సర్వలోకే తవ పద మధిరోక్ష్యన్త ముద్వీక్ష్య శర్వం**
**దూరాదే వాగ్రత స్త్వం పటువటువపుషా తస్థిషే దానవాయ.** 5

బందము విప్పినట్టి జనుపైఁ జను మేటి మృగమ్ముపోలె బా
లేందు కిరీటి వెన్దఱిమె; నీ దెస కా దెస కాతఁడేగ నే
మందు జగమ్ము కిక్కురన; దప్పుడు నీ దెస వచ్చు శూలి నం
దందన చూచి యొక్క వటువై వృకుముందట నిల్వ నీవునున్.

బంధము వదలించినవానిపైనే దూకు జంతువట్లు ఆ దుష్టుడు రుద్రుని పైకి దూకెను. పాపమాయన ఇట్టటు పరువులెత్తెను లోకమాయవస్థ చూచి కిక్కురుమనలేదు. ఇక గతి గానక నీ వైకుంఠమునకు వచ్చు శూలింగని నీవు బ్రహ్మచారి వేషమున వృకాసురుని ముందు నిలిచితివి

**భద్రం తే శాకునేయ భ్రమసి కి మధునా త్వం పిశాచస్య వాచా**
**సందేహ శ్చే న్మదుక్తౌ తవ కిము న కరో ష్యంగుళీ మంగ మౌళౌ,**
**ఇత్థం త్వద్వాక్యమూఢ శ్శిరసి కృతకర స్సోపత చ్ఛిన్నపాతం**
**భ్రంశో హ్యేవం పరోపాసితు రపిచ గతిః శూలినోఽపి త్వమేవ.** 6

భ్రమపడి తా పిశాచమను పల్కున, భద్రము శౌనకేయ; హ
స్తము మఱి నీదినీవ తలఁ దాల్పుము చూచెదు నాదుమాట స
త్యమ యన వాఁడునున్ దెలివితప్పి యటుల్ వొనరించి కూలెఁ ద్వ
ద్విముఖుల పాటు లిట్టి, ఏటు దిక్కగుచుందువు శూలిపాలికిన్.

ఓ శాకునేయ! పిశాచముమాట విని భయమునకు లోనైతివి. మంచిది. ఏది నీ చేయి నీనెత్తిన బెట్టుకొనుము. నామాట నిజమెఱింగెదవు. అని నీవు

పల్కగా వాడు తెలివి సెడి యట్లొనరించి మొదలితో గూలినచెట్టువలె కూలిపోయెను. శ్రీహరీ! నీ యెడ విముఖులయిన వారిగతి యిట్టిది. నీవు శంకరునికి గూడ దిక్కైనవాడవు.

భృగుం కిల సరస్వతీ నికటవాసిన స్తాపసా
స్త్రిమూర్తిషు సమాదిశ న్నధిక సత్త్వతాం వేదితుమ్,
అయం పున రనాదరా దుదితరుద్ధరోషే విధౌ
హరేఽపి చ జిహింసిషౌ గిరిజయా ధృతే త్వా మగాత్. 7

భృగుని సరస్వతీనదిదరిన్ వసియించు మునుల్ త్రిమూర్తు లం
దగణిత సత్త్వుఁడెవ్వఁడని; రాతఁడువోయి తృణీకరింపగా
నెగసియు శాంతి చెందె విధి; యీశ్వరుఁ గౌగిటఁ జేర్ప రోషియై
యగజ వచింప శాంతిగనె నాతఁడు నమ్ముని వచ్చె ని న్గనన్.

సరస్వతీ తీరమందు వసించు మునీశ్వరులు భృగుమహర్షిని త్రిమూర్తులం దెవ్వడు విశేషశక్తిమంతుడని యడిగిరి. అతడది యెఱుంగవలెనని బ్రహ్మదరికేగి యాయనను తృణీకరింపగా విధి (బ్రహ్మ) వచ్చిన కోపమాపుకొని యూరకుండెను. రుద్రునిదరికేగి యాతనిని కౌగిలింపబోగా నాయనకోపించి గౌరి వారింపగా శాంతినందెను.

సుప్తం రమాంకభువి పంకజలోచనం త్వాం
విప్రే వినిఘ్నతి పదేన ముదోత్థిత స్త్వమ్,
సర్వం క్షమస్వ మునివర్య భవేత్ త్సదా మే
త్వత్పాదచిహ్న మిహ భూషణ మిత్యవాదీః. 8

అంత రమాంకపాళి నయనాబ్జము లల్లన మోడ్చియున్న ని
న్నంతనఁ గాలఁదన్నె ముని; హర్ష భరమ్మున నీవులేచి త
ప్పింతయు సైపుమో మునికులేశ! భవత్పద చిహ్నమిద్ది నా
కెంతయు నింపుసొంపు నొనరించు నురమ్మున నంటి వుబ్బుచున్.

అటుపై భృగుమహర్షి శ్రీమహాలక్ష్మి యొడిలో నిదిరించుచున్న నిన్ను కాలితో దన్నెను. నీవానందపడుచులేచి ఓ మునివర్య! నాతప్పు సైరింపుము.

నీ యీ తన్నిన పాదముయొక్క గుర్తు నా వక్షఃస్థలమం దలంకారమై యుండుగాక! యని యుప్పొంగుచు బల్కెను.

నిశ్చిత్య తేచ సుదృఢం త్వయి బద్ధభావా
స్సారస్వతా మునివరా దధిరే విమోక్షమ్
త్వా మేవ మచ్యుత పున శ్చ్యుతిదోషహీనం
సత్త్వోచ్చయైకతను మేవ వయం భజామః. 9

ఈ విధి నిశ్చయించిరి మునీశులు నిన్ను నశేష దేవతో
జ్జీవన వర్ధమాన ఫలసేవధి; నీపయి భావమూని సం
భావితులైరి మోక్షమున, భవ్యు మనశ్చ్యుతి దోషహీనునిన్
గేవల సత్త్వమూర్తిని గణింతుము నిన్ భవముం దరింపగన్.

ఈ విధముగా మునీశ్వరులు పరిశీలించి నిన్ను సర్వదేవతాగ్రేసరుని పరతత్త్వముగా నిశ్చయించి నీయందు భావము నిలిపి మోక్షముంజూరగొనిరి. చ్యుతిదోషములేని (అచ్యుతుని) కేవలసత్త్వమూర్తివి నిన్ను సేవించి మేము ధరించెదము.

జగత్సృష్ట్యాదౌ త్వాం నిగమనివహై ర్వందిభి రివ
స్తుతం విష్ణో సచ్చి త్పరమరస నిర్ద్వైత వపుషమ్,
పరాత్మానం భూమన్ పశుపవనితాభాగ్యనివహం
పరీతాపశ్రాంత్యై పవనపురవాసిన్ పరిభజే. 10

ముందట సృష్టికిన్ నిగమ పుంజము వందిజనమ్ము వోలె నీ
యందము సన్నుతించెనట, నద్వయునిన్ బరమాత్ము సచ్చిదా
నంద రసప్రపూర్ణు నిను నమ్మి భజించెద గోపభామినీ
బృందము భాగ్యపుంజ మగు విష్ణువు నుత్కటతాపశాంతికై.

జగత్సృష్టికి ముందు నిగమములు వందిజనమట్లు (భట్టులట్లు) నిన్ను సచ్చిదానంద పరమాద్వైత మూర్తినిగా బొగడినవి. అస్తుతి శ్రుతిగీతలు అనుపేర శ్రీమద్భాగవతమందు ప్రసిద్ధము. ఓపూర్ణబ్రహ్మమూర్తీ గోపికా భాగ్యసర్వస్వమైన నిన్ను విష్ణుని ఓ గురుపవనవాసీ! నా పరితాపశాంతికై భజించెదను.

# 90వ దశకము

# ఆగమాది పరమతాత్పర్యము

**వృకభృగుముని మోహిన్యంబరీషాదివృత్తే**
**ష్వయి తవ హి మహత్త్వం సర్వశర్వాదిజైత్రమ్,**
**స్థితమిహ పరమాత్మన్ నిష్కలార్వాగభిన్నం**
**కిమపి యదవభాతం తద్ధి రూపం తవైవ. 1**

**భృగు వృక మోహినీ ప్రముఖ వృత్తము లందును, నంబరీషు నం**
**దగపడు నీ మహత్త్వము శివాదుల యందరికంటె నున్నతిన్**
**నెగడును; ఎందునున్ సకల నిష్కలరూప మఖండ మాత్మ స**
**ర్వగము సమగ్ర మౌచు నవభాతము నీదియ యా స్వరూపమున్.**

భృగుచరిత్ర వృకాసురసంహారకథ విష్ణుమాయయైన మోహిని అవతారమున అంబరీష చరిత్రలో శివునికంటె నీ మహత్త్వమెక్కువగా గనిపించును. ఇంద్రయాగ నందహరణ బాలానయన వత్సాపహరణ ఘట్టములలో వరుసగా ఇంద్ర వరుణ యమ అగ్ని బ్రహ్మాదిదేవతలను నీవు మించినట్లున్నది. నిష్కలమైన బ్రహ్మమందు కేవలసగుణులైన బ్రహ్మవిష్ణుశివాదులందు నేక రూపమైభాసించు రూపమే విష్ణుడవగు నీ రూపముకావున త్రిమూర్తులందఱిలో నీయందే ప్రభావ విశేషము గోచరించును. శ్రేయాంసి తత్రఖలు సత్వతనోర్నృణాంస్యుః.

సత్వాత్మకుడైన విష్ణువువలననే మానవులకు సర్వశ్రేయస్సులు కలుగును. అని భాగవతము స్కం 1 అధ్యా 2 శ్లో 23.

**మూర్తిత్రయేశ్వర సదాశివపంచకం యత్**
**ప్రాహుః పరాత్మవపు రేవ సదాశివో ఽస్మిన్,**
**తత్రేశ్వరస్తు స వికుంఠపద స్త్వమేవ**
**త్రిత్వం పున ర్భజసి సత్యపదే త్రిభాగే. 2**

**ఎందును బ్రహ్మ విష్ణు గిరిశేశ సదాశివమూర్తి పంచక**
**మ్మందుఁ బరాత్మమూర్తి శివుఁడందు, రతండె వికుంఠవాసి నీ**

**వందురు కొంద; రీవ త్రివిధాకృతి నొంది త్రిధా విభాగమై**
**యందము గుల్క సత్యపద మందు వసింతువు మూఁడు మూర్తులై.**

శైవులు బ్రహ్మ విష్ణు శివ ఈశ్వర సదాశివమూర్తి భేదముచే నైదురూపులయినవాడు ఒక్కశివుడే యందురు. వారి పక్షములో సదాశివశబ్ద వాచ్యుడగు పురుషుడే యీపక్షమందు పంచాత్మకుడైన విష్ణువని పరమాత్మ యాయనయే యని శ్రీమద్భాగవతమందు చెప్పబడినది. 'విష్ణుం పంచాత్మకం వందే' అని. అందువలన వైకుంఠవాసియైన ఈశ్వరశబ్దవాచ్యుడవు నీవే. బ్రహ్మ విష్ణు శివ లోకములను విభాగములుగల స్థానములను సత్యలోకమునందున్న బ్రహ్మ విష్ణు శివులయందలి త్రిమూర్తిత్వమును, సత్యలోకమునందున్న బ్రహ్మ విష్ణు శివ లోకములయందలి త్రిమూర్తిత్వమును నీ వొక్కడవే పొందుచున్నావన్నమాట. హరివంశమందు అట్లే కలదు.

అహం త్వం సర్వగో దేవ! త్వమేవాహంజనార్దన!
ఆవయోరంతరం నాస్తి శబ్దైరర్థైగత్పతే ||

ఇది శివవాక్యము. నేనే సర్వాంతర్యామివైన నీవు. నీవే నేను నామముచే గాని అర్థముచేగాని మనకు భేదము లేనే లేదు.

**తత్రాఽపి సాత్త్విక తనుం తవ విష్ణు మాహు**
**ర్ధాతా తు సత్త్వవిరలో రజసైవ పూర్ణః**
**సత్త్వోత్కటత్వ మపి చాస్తి తమోవికార**
**చేష్టాదికంచ తవ శంకరనామ్ని మూర్తౌ.** 3

**అందును శుద్ధసత్త్వమయుఁ డందురు విష్ణువు. సత్త్వలేశతం**
**బొంది రజః ప్రపూర్తి యగు మూర్తియె బ్రహ్మ, తమోవికారచే**
**ష్టం దగి సత్త్వవృద్ధిగన శంకరుఁడందురు; మూడుమూర్తులం**
**దందుఁ జరించుచుండి యొకఁ డౌదువు నీవ పరాత్మవై హరీ!**

నీ సత్త్వమూర్తి విష్ణువు సత్త్వగుణముతక్కువ రజోగుణమెక్కువగానున్న నీరజోమూర్తి బ్రహ్మ. తమోగుణవికారము బాహ్యముగను. సత్త్వములోనముగల నీమూర్తి శంకరుడు. ఇట్లు త్రిమూర్త్యాత్మకమైన పరతత్త్వము విష్ణువవైననీవే.

తం చ త్రిమూర్త్యతిగతం పరపూరుషం త్వాం
శర్వాత్మ నాపి ఖలు సర్వమయత్వహేతోః,
శంసం త్యుపాసనవిధౌ తదపి స్వతస్తు
త్వద్రూప మిత్యతిదృఢం బహు నః ప్రమాణమ్. 4

ఆవిధి మూఁడు మూర్తులకు నవ్వలనౌచు, నజాండమందు లో
నై వెలియైన యప్పరముఁడౌ నిను శంకరుఁడం డ్రుపాసకుల్
తావకమూర్తియే యదియుఁ దథ్యమటంటకునున్ దృఢమ్ము లె
న్నో విధముల్ ప్రమాణము లహో! కనిపించును నాకు నీశ్వరా!

ఈ విధముగా త్రిమూర్త్యతీతుడై బ్రహ్మాండమందు లోపలవెలుపలనిండి యున్న తత్త్వము శంకరుడందురు కొందరు ఉపాసకులు. అది కూడ నీవేయనుటకు దృఢమైన ప్రమాణములు మాకు చాలగలవు. శ్రుతిప్రమాణము పురుషసూక్తము. 'క్వే దృగ్విధా విగణితా' ఇత్యాదులు పురాణములు ప్రమాణములు.

శ్రీ శంకరోఽపి భగవాన్ సకలేషు తావ
త్త్వామేవ మానయతి యో నహి పక్షపాతీ,
త్వన్నిష్ఠమేవ స హి నామసహస్రకాది
వ్యాఖ్యా ద్భవత్ స్తుతిపరశ్చ గతిం గతోఽంతే. 5

శ్రీ మచ్ఛంకర దేశికేంద్ర భగవచ్ఛ్రీపాదులున్ సర్వదా
నీ మేలౌ మహిమమ్ము పేర్కొని రహో! నిష్పక్షపాతమ్ముగాన్
దామున్ విష్ణు సహస్రనామములకున్ వ్యాఖ్యానముల్ సేసి యు
ద్దామ మ్మవ్వలనే గడించిరి భవద్భవ్య స్తుతిన్ మోక్షమున్.

శ్రీ ఆదిశంకర భగవత్పాదులు విష్ణు సహస్రనామ భాష్యాదులందు నిన్నే పరతత్త్వముగా పేర్కొనిరి. వారికి పక్షపాతములేదు. అట్టి అనుసంధానముతోనే వారు మోక్షమందిరి.

మూర్తిత్రయాతిగ మువాచ చ మంత్రశాస్త్ర
స్యాదౌ కలాయసుషమం సకలేశ్వరం త్వాం,

ధ్యానం చ నిష్కల మసౌ ప్రణవే ఖలూక్త్వా
త్వామేవ తత్ర సకలం నిజగాద నాస్యమ్. 6

మృదుల కలాయ పేశల శరీరుని నిన్ సకలేశ్వరుండుగా
మొదలనె మంత్రశాస్త్రము త్రిమూర్తుల మీఁదటి మూర్తిగాఁ గడున్
విదితమొనర్చె, ధ్యానమున నిష్కలమున్ బ్రణవమ్ముఁ జెప్పి, య
య్యదియును నిన్నె యెన్నె సకలాత్మునిగా, మఱి సెప్ప దన్యులన్.

నిన్ను మూర్తిత్రయాతీతునిగ, కలాయకుసుమ పేశల శరీరునిగ మంత్రశాస్త్రము తొలుతనే పేర్కొన్నది. ఆ ప్రణవధ్యానమున నిష్కలజ్ఞానమున విషయమయిన వాడవు నీవేయని అగమము (మంత్రశాస్త్రము) చెప్పినది. మఱి శివాదులను జెప్పలేదు.

సమస్తసారే చ పురాణసంగ్రహే
విసంశయం త్వన్మహిమైవ వర్ణ్యతే,
త్రిమూర్తియుక్సత్యపద త్రిభాగతః
పరం పదం తే కథితం న శూలినః. 7

సందియమింత లే దఖిలసారమునందుఁ బురాణ సంగ్రహ
మ్మందునఁ బేర్కొనంబడియె నంతట నీదు ప్రభావ విస్తర
మ్మందుఁ ద్రిమూర్తులన్ మసల నింపగు సత్యపదాన లోకముల్
గ్రిందట నీ వికుంఠ మది మీఁదట, శూలిది కాదనంబడున్.

సర్వపురాణసంగ్రహమందు త్రిమూర్తులతోనున్న సత్యలోకమందలి వారి వారిలోకములకంటె నవ్వల బ్రహ్మాండ కటాహము వెలుపల విష్ణులోకమున నీవైకుంఠమువ్వదని తెలుపబడినది.

యద్బ్రాహ్మకల్ప ఇహ భాగవతద్వితీయ
స్కంధోదితం వపు రనావృత మీశ ధాత్రే,
తస్యైవ నామ హరిశర్వముఖం జగాద
శ్రీమాధవ స్సివపరోఽపి పురాణసారే. 8

క్రమతన్ భాగవతమ్ము రెండవదియౌ స్కంధమ్మునన్ బ్రాహ్మక
ల్పమునన్ బ్రహ్మ యనావృత మ్మయిన రూపమ్మొండు గన్గొన్నచం
దము వర్ణించుఁ బురాణసారమనుదానన్ శంభు విష్ణ్వాది నా
మములన్ దానినెచెప్పె మాధవుఁడునున్ భక్తుం డుమాజానికిన్.

శ్రీమద్భాగవత ద్వితీయస్కంధమందు బ్రహ్మకల్పమందు భగవంతుడు చూపిన నిరావరణమైన నీ రూపమొకటి చూచెనని దానినే శంభు విష్ణు ప్రభృతినామములు తెలుపునని శివపారమ్య మొప్పిన శ్రీమాధవ విద్యారణ్యులే పురాణసారమందు జెప్పియున్నారు.

యే స్వప్రకృత్యనుగుణా గిరిశం భజంతే
తేశాం ఫలం హి దృఢయైవ తదీయభక్త్యా,
వ్యాసో హి తేన కృతవా నధికారిహేతోః
స్కాందాదికేషు తవ హానివచోఽర్థవాదైః. 9

ప్రాక్తన జన్మవాసన స్వభావముగా శివుఁగొల్తు రెవ్వ, రా
భక్తి పటిష్ఠమౌ కొలది వారికిఁదత్ఫల సిద్ధిగల్గుఁ; బ్రా
గ్వ్యక్తినిగన్న తత్తదధికారుల బట్టియు స్కాందముఖ్య సా
రోక్తుల నర్థవాదముల న్యూనత సెప్పిరి నీకు వ్యాసులున్.

జీవులు పూర్వజన్మవాసననుబట్టి యేర్పడిన స్వభావముచే భక్తిగొని శివునారాధింతురు. ఆ భక్తి దార్ఢ్యముం బట్టియే వారికి ఫలము సిద్ధించును. అందుచేతనే వ్యాసులు అధికార భేదముం బట్టి శివుని కుత్కర్ష చెప్పి నీకు న్యూనతను స్కాందాది పురాణములందు చెప్పిరి. అవి మహేశ్వర సేవయందు రుచి పుట్టించుటకు (ప్రరోచనార్థము) చెప్పినవి అర్థవాదములనబడును.

భూతార్థకీర్తి రనువాద విరుద్ధవాదౌ
త్రేధాఽర్థవాదగతయః ఖలు రోచనార్థాః,
స్కాందాదికేషు బహవోఽత్ర విరుద్ధవాదా
స్త్వత్తామసత్వ పరిభూత్యుపశిక్షణాద్యాః. 10

పొలుచుఁ బ్రరోచనార్థముగ మూఁడు తెఱంగుల నర్థవాదముల్
దలప యథాస్థితార్థ కథన మనువాద విరుద్ధవాదముల్;
గలవు విరుద్ధవాదములు స్కాందము మున్నగువానఁ దామసా
కలితభవద్వశీకరణ గర్హణముల్ మొదలైన వట్టివే.

అర్థవాదములు మూడువిధములు 1. భూతార్థవాదము. అనగా ఇతర ప్రమాణములకు విరుద్ధమైన విషయము చెప్పుట. 2. అనువాదము=ఒకరు చెప్పినది అనువదించుట. అవిరుద్ధ గుణారోపము. 3. విరుద్ధవాదము (ప్రమాణంతర విరుద్ధమయిన మాట) స్కాందాదులలో విష్ణువు తామసుడని, విష్ణువు శివునికి లొంగిపోయెనని చెప్పినమాట లీకోవకు చెందినవి.

యత్ కించిద ప్యవిదుషాపి విభో మయోక్తం
తన్మంత్రశాస్త్రవచనా ద్యభిదృష్ట మేవ,
వ్యాసో క్తిసారమయ భాగవతోపగీత
క్లేశాన్ విధూయ కురు భక్తిభరం పరాత్మన్. 11

పండితుఁడేనుగా, నయినఁ బల్కితిఁ గొంచెము మంత్రశాస్త్రమం
దుండిన మాట సూచినదియున్ విలినట్టిది; వ్యాస వాక్సుధా
పిండిత సార భూత రస విశ్రుత భాగవతోపగీత! ది
ఙ్మండిత కీర్తి! క్లేశముల మానిచి భక్తిపరుం బొనర్పవే!

నేను పండితుడను గాకున్నను మంత్ర శాస్త్రాదులందు చూచినట్టి విన్నట్టి మాట చెప్పితిని. వ్యాస వాగమృత సారభూతమై కృతార్థతను గల్గించు శ్రీ మద్భాగవతముచే గొనియాడబడిన ఓ కృష్ణపరమాత్మా! నాక్లేశములు మాన్చి నన్ను భక్తి సంపన్నుం గావింపుము.

# 91వ దశకము
# భక్తి వైభవము

శ్రీకృష్ణ త్వత్పదోపాసన మభయతమం బద్ధమిథ్యార్థదృష్టే
ర్మర్త్య స్యార్తస్య మన్యే వ్యపసరతి భయం యేన సర్వాత్మనైవ,

యత్త్వావత్ త్వ త్ప్రణీతా నిహ భజనవిధీ నాస్థితో మోహమార్గే
ధావ న్నప్యావృతాక్షః స్థలతి న కుహచి ద్దేవదేవాఖిలాత్మన్. 1

శ్రీకృష్ణా! భవదంఘ్య్రుపాసన మహా సిద్ధౌషధ మ్మర్త్య మి
థ్యాకార్యైకదృశున్ భయమ్మఖిలమున్ దాటించు, నీ
వాకొన్నట్టి యనేక భక్తివిధులన్ వర్తించువాఁ డంధతన్
వీకన్ సంసృతి నెన్ని పర్వులిడినన్ విభ్రంశ మందం డెటన్.

అవతారిక:- ఇంతవరకు ప్రవృత్తిలక్షణమైన భగవల్లీలావిశేషము వర్ణింపబడినది. ఇపుడు నివృత్తిలక్షణము వర్ణితమగుచున్నది. శ్రీకృష్ణా! మిధ్యాభూతములైన దేహాదులందు నేను నాదియను అభిమానముగొన్న జనన మరణ ధర్మియైన మర్త్యునికి అమృతప్రాయమైన సిద్ధౌషధము నీ చరణారవింద సముపాసనము. అది అభయప్రదము. దానిని మించినది మఱిలేదు. భగవంతుడవైన నీవు (భగవద్గీతలో) చెప్పిన భాగవతధర్మములను సత్సంగ ద్వారమున క్రమముగ ననుసరించినవాడు మోహమార్గమును అనగా అజ్ఞానద్వారములైన రహదారులు బజారులు గణికాగృహములు లౌకిక సభారంగములు మొదలైన యశాంతిస్థానములందు పరుగులిడుచు క్రమముగ నల్లల్లన దాటిదాటి, తీవ్రమైన భగవదనుష్ఠానములోబడి ఆవృత్తచక్షుష్కుడై బాహ్యదృష్టిగాక చూపు (ఆత్మవంక) వెనుదిరిగినవాడై "శ్రుతిస్మృతులు రెండును రెండు కండ్లు, అందొకటి లేనివాడు ఏకాక్షి, రెండును లేనివాడు అంధుడు" అని చెప్పినట్లు వేదశాస్త్రరూపనేత్ర ద్వయమునొంది యెక్కడను తడబడడు. భగవదనుష్ఠానమందు పొరబడి ప్రత్యవాయమునకు లోనుగాడని భావము.

భూమన్ కాయేన వాచా ముహు రపి మనసా త్వద్బల ప్రేరితాత్మా
యద్య త్కుర్వే సమస్తం తదిహ పరతరే త్వయ్యసా వర్పయామి,
జాత్యా పీహ శ్వపాక స్త్వయి నిహితమనఃకర్మవాగింద్రియార్థ
ప్రాణో విశ్వం పునీతే న తు విముఖమనా స్త్వత్పదా ద్విప్రవర్యః 2

శ్వపచుండైనను వాఙ్మన స్తనువులన్ ద్వత్ప్రేరితాత్ముండు నీ
కృప నే చేయు సమస్త మర్పితము తండ్రీ! నీదె సర్వస్వ మం
చెపుడున్ భావనముం బొనర్చు జగ మీవే ప్రాణమైయుండి; య
ట్లుపయోగింపఁడు త్వత్పరాఙ్ముఖుఁడు విప్రోత్తంసుఁడే యయ్యునన్.

ఓ పూర్ణస్వరూపా! త్రికరణములచేతను అంతర్యామియొక్క బలముచే వాసనారూపమైనదానిచే ప్రేరితుడనై కేవల విహితకర్మమేకాదు స్వభావానుసారియైన లౌకికకర్మముగూడ పరమేశ్వరుడవైన కృష్ణునకు నీకు సమర్పించుచున్నాను. అని భావించి చేసినవాడు జాతిచే శ్వపచుండైనను అశేష విశ్వమును పావనము చేయును. తన్నుదాను పవిత్రుని జేసికొనును. నీ చరణనలిన విముఖుండైనవాడు విప్రోత్తముడేయైనను వాడు ఇతరుని దన్నునుగూడ పరిశుద్ధుం జేయజాలడు.

**భీతిర్నామ ద్వితీయా ద్భవతి నను మనః కల్పితం చ ద్వితీయం**
**తేనై క్యాభ్యాసశీలో హృదయ మిహ యథాశక్తి బుధ్యా నిరుంధ్యామ్,**
**మాయావిద్ధే తు తస్మిన్ పునరపి న తథా భాతి మాయాధినాథం**
**తం త్వాం భక్త్యా మహత్యా సతత మనుభజ న్నీశ భీతిం విజహ్యామ్. 3**

**భయమౌ రెండవదాన, రెండవదియున్ స్వాంతమ్మునం గల్పిత**
**మ్మ, యథాశక్తి సమైక్యభావ మది యభ్యాసమ్ము గావించి య**
**వ్యయబుద్ధిన్ హృదయమ్ము నిల్పవలె; మాయావిద్ధమై యాత్మ ని**
**ర్భయతం బొందదు, మాయకున్ దొరను నిన్ భావింతుఁ దత్సిద్ధికై**

నేను నాదియని రెండవవస్తుభావనచే భయముతప్పదు రెండవవస్తువు మనఃకల్పితము. అనగా ఆరోపితము. ఏకత్వభావనను అభ్యసించుచు, నిశ్చయాత్మకమైన అంతఃకరణవృత్తిచేత (బుద్ధిచేత) హృదయమును ధ్యానలక్ష్యమందు నిల్పవలెను. హృదయము మాయావశమై నిలువబడదు అందుచే మాయ కధినాథుడవైన నిన్ను అనపాయినియైన భక్తిచే (ప్రేమలక్షణముచే) భజించి సంసారభయమెల్లను బాసెదను

**భక్తే రుత్పత్తివృద్ధీ తవ చరణజుషాం సంగమేనైవ పుంసా**
**మాసాద్యే పుణ్యభాజాం శ్రియ ఇవ జగతి శ్రీమతాం సంగమేన,**
**తత్సంగో దేవభూయాన్ మమ ఖలు సతతం తన్ముఖా దున్మిషద్భి**
**స్త్వన్మాహాత్మ్యప్రకారై ర్భవతి చ సుదృఢా భక్తి రుద్ధూతపాపా. 4**

**హరి! భవదీయ దివ్యపద మంటిన సాధుల సంగమమ్మునన్**
**సిరిగలవారి సంగతిని శ్రీ లటు, భక్తి జనించి పెంపగున్;**

నిరతము నట్టి సాధువుల నెయ్యము నా కగుఁగాక తన్ముఖ
స్ఫురిత భవత్కథన్ దురితముల్ దొలఁగున్; దృఢమౌత భక్తియున్.

కలిమిగలవారి చెలిమిచే కలిమి పెంపొందినట్లు నీదివ్యచరణ సేవారతులైన సుమతుల సంగముచేతనే భక్తిజనించి పెంపొందును. అట్టి భక్తిశ్రీమంతులగు సాధువులతో నాకు స్నేహము గుదురుగాక. వారి ముఖమున చేకూరిన నీ మధుర కథాప్రసంగములచే ననగా శ్రవణకీర్తనస్మరణ మనన నిదిధ్యాసరూపమైన భక్తి మార్గములచే శ్రీకృష్ణుడగు నీయందు చీకటిం దొలగించు సూర్యునట్లు పాపములం దొలగించు భక్తి నాయందుదయించుగాక!

శ్రేయోమార్గేషు భక్తా వధికబహుమతి ర్జన్మకర్మాణి భూయో
గాయన్ క్షేమాణి నామాన్యపి తదుభయతః ప్రద్రుతం ప్రద్రుతాత్మా,
ఉద్యద్ధాసః కదాచిత్ కుహచిదపి రుదన్ క్వాఽపి గర్జన్ ప్రగాయ
న్నున్మాదీవ ప్రనృత్యన్నయి కురు కరుణాం లోకబాహ్య శ్చరేయమ్. 5

శ్రేయామార్గములందు భక్తియ కడున్ శ్రేష్ఠమ్ము; క్షేమమ్ములౌ
నా యా నీదగు జన్మ కర్మములు నా యా నామముల్ పాడుచున్
డాయున్ హాసమొనర్చు నేడ్చు నొకటన్ నర్తించు నున్మత్తుఁడ
ట్లైయాడున్ మనసున్ ద్రవించి, యటు నేనౌదున్ గృపన్ జూడుమీ

పురుషార్థసాధనమార్గములలో భక్తి గొప్పది. అందు గుదురుకొని నీపుణ్య కథలను నామములను గీర్తించుచు మనసు ద్రవించినవాడు నవ్వును, ఏడ్చును, గర్జించును, గొంతెత్తి పాడును, ఆడును. దయ్యము పట్టినవానివలె పిచ్చియెత్తిన వానివలె ద్రవద్హృదయుడై యేమేమో సేయును, ప్రభూ! నేను గూడ యట్లౌనట్లు కనికరింపుము.

భూతా న్యేతాని భూతాత్మకమపి సకలం పక్షిమత్స్యా న్మృగాదీన్
మర్త్యాన్ మిత్రాణి శత్రూనపి యమితమతి స్త్వన్మయా న్యానమాని,
త్వత్సేవాయాం హి సిద్ధ్యే న్మమ తవ కృపయా భక్తిదార్ఢ్యం విరాగ
స్త్వత్తత్వ స్యావబోధో ఽపిచ భువనపతే యత్నవిభేదం వినైవ. 6

భూతములెల్ల భూతమయముల్ మృగపక్షులు శత్రుమిత్రులున్
జేతము నిగ్రహించుకొని నీవనుకొందును; నీదు సేవచే

**నాతతభక్తి దార్ఢ్యము, త్వదంచిత తత్త్వ సుబోధమున్, జగ**
**త్త్రాతవు నీ కృపన్ బటువిరాగము గల్గుత మా కయత్నతన్.**

పంచభూతములు భూతవికారమయిన ప్రపంచము జంతువులు పక్షులు శత్రులు మిత్రులు సర్వము నీవేయని మనోనిగ్రహముచే భావించుచు నన్నిటికి నమస్కరింతును. నీ సేవలో నాకు నీదయచే దృఢభక్తినిష్ఠ విరాగము నీ తత్త్వావబోధయు మఱియొక ప్రయత్నమక్కఱలేకుండ గలుగుగాక! నీకృపాలాభమునకు మాత్రమే ప్రయత్నమవసరమన్నమాట

**నో ముహ్యన్ క్షుత్తృడాద్యై ర్భవసరణిభవై స్త్వన్నిలీనాశయత్వా**
**చ్చింతాసాతత్యశాలీ నిమిషలవమపి త్వత్పదా దప్రకంపః,**
**ఇష్టానిష్టేషు తుష్టివ్యసన విరహితో మాయికత్వావబోధా**
**జ్జ్యోత్స్నాభి స్త్వన్న ఖేందో రధికశిశిరితే నాత్మనా సంచరేయమ్.** 7

**లీన మ్మౌట మనమ్ము నీయెడ భవక్లేశమ్ము క్షుత్తృష్ణ నెం**
**తైనన్ మూర్ఛిల, కేకధార యగు సద్ధ్యానాప్తిచే ఱెప్పపా**
**టైనన్ నీ చరణమ్ములం గదల, కిష్టానిష్ట సంప్రాప్తి యం**
**దానందింపక క్రుంగిపో కెదియు మాయాకల్పితమ్మన్న బో**
**ధానన్ నీనఖచంద్ర చంద్రికల డెందమ్మద్భుతానంద సం**
**ధాన శ్రీశిశిరమ్మునై తిరిగెద సర్వత్ర స్వేచ్ఛాగతిన్.**

నీయందు మనసు లీనమైనందున అనాది సంసార సంభవములైన ఆకలి దప్పులకు మూర్ఛిలక ఎడతెగని ధ్యానసిద్ధిలో నిమిషమాత్రమేని చెదరక సుఖములకు పొంగక దుఃఖములకు క్రుంగక సర్వము మాయాకల్పితమని యనుసంధానించుచు నీ చరణ నఖచంద్రికలచే చలువనొందిన డెందముతో స్వేచ్ఛాసంచారి నయ్యెదను.

**భూతే ష్వేషు త్వదైక్యస్మృతిసమధిగతో నాధికారో ఽధునా చే**
**త్త్వత్ప్రేమ త్వత్కమైత్రీ జడమతిషు కృపా ద్విట్సు భూయా దుపేక్షా,**
**అర్చాయాం వా సమర్చాకుతుక మురుతర శ్రద్ధయా వర్ధతాం మే**
**త్వ త్సంసేవీ తథా ఽపి ద్రుత ముపలభతే భక్తలోకోత్తమత్వమ్.** 8

**హరి! యీభూతవితాన మన్నిటఁ ద్వదీయాంతర్బహిర్భావమే**
**నరయంగా నధికారిగానొ యిపు; డట్లైనన్ భవద్భక్తి, నీ**
**పరివారమ్మున మైత్రి, దీనులయెడన్ వాత్సల్యమున్, శత్రు లం**
**దరుదౌ సైరణ, నీ సమర్చనమునం దత్యంతమున్ శ్రద్ధ యా**
**దర భావమ్మును బెంపుసేయుము ప్రభూ! త్వత్సేవకుండైనచోఁ**
**ద్వరగా నందు నశేష భక్తజనమూర్ధన్య స్థితిన్ మాధవా!**

శ్రీ నారాయణ! పిపీలికాది బ్రహ్మపర్యంతమైన భూతజాలమందు అచ్యుతైశ్వర్యుడవు నీశ్వరుడవునైన నీవు జీవరూపమున నున్నావని గ్రహించుట యను భావముతో నీయందు ప్రేమ నీభక్తులయందు మైత్రి మందమతులందు కృప శత్రువులయందు ఉపేక్ష నీ యర్చనమందు (ప్రతిమాది పూజయందు) వేడుక ఈశ్వర గురు శాస్త్ర విషయమైన శ్రద్ధ విశ్వాసము నాకు బెంపొందునట్లు సేయుము. మందాధికారినైకూడ అవిధముగా నాచరించి యీజన్మమందే యీడేరి భక్తజనశిరోమణికాగలను. అందుచే నా యనధికారత్వముకూడ భక్తిచే నుత్తమస్థితి నందునని భావము.

**ఆవృత్య త్వ త్స్వరూపం క్షితిజలమరుదాద్యాత్మనా విక్షిపంతీ**
**జీవాన్ భూయిష్ఠ కర్మావలి వివశగతీన్ దుఃఖజాలే క్షిపంతీ,**
**త్వన్మాయా మాఽభిభూ న్మా మయి భువనపతే కల్పతే త్వత్ప్రశాంత్యై**
**తత్పాదే భక్తిరే వేత్యవద దయి విభో సిద్ధయోగీ ప్రబుద్ధః. 9**

**క్షితి ముఖ్యాఖిల భూతరూపమున విక్షేపించి నీ మాయ యా**
**వృతముం జేయు భవ త్స్వరూపమును, జీవిన్ కర్మమార్గాన బల్**
**వెతన్‌బెట్టుఁ; నను గప్పకుండుతఁ దదావేశమ్ము, వారింపగా**
**గతి నీ భక్తియ యంచుఁ బల్కెఁగని సాక్షాత్సిద్ధ యోగీంద్రుఁడై.**

నీ మాయ భూమ్యాది పంచీకృత భూతపంచకము ప్రపంచవిక్షేపము గల్పించి ఆవరణశక్తిచే నీ బ్రహ్మస్వరూపమును గప్పివేయును. జీవులను కామ్య నిషిద్ధాది కర్మభేదములచే దానగలుగు దృష్టాదృష్ట వాసనలచే నస్వతంత్రము లయిన నీచానీచతులకు నికృష్టశ్రేష్ఠజన్మములకీడ్చి దుఃఖ జాలమందు బడవేయును. ఆ మాయ నీ యధీనమందుండునది కావున నీ దాసుడను గావున అది నాబుద్ధి నాక్రమించి నీ స్మరణను దొలగింప

కుండుగాక! కేవలత్వరూపమైన శాంతికి నీ పాదభక్తి యొక్కటే సాధనమని సిద్ధయోగులలో నొకప్రబుద్ధుడు (జాతృజ్ఞేయ జ్ఞానరూప త్రిపుటిలేనివాడు) పల్కెను. "తన్మాయయాతో బుధ ఆభజేత్తం భక్త్యైకయేశమ్" అని (శ్రీ మద్భాగవతము స్కం. 11 అధ్యా. 2 శ్లో.37) విదేహాధిపతికి సిద్ధయోగి పల్కిన మాట.

**దుఃఖా న్యాలోక్య జంతు ష్వల ముదిత వివేకో ఉహ మాచార్యవర్యా**
**ల్లబ్ధ్వా త్వద్రూపతత్త్వం గుణచరితకథాద్యుద్భవద్భక్తిభూమా,**
**మాయా మేనాం తరిత్వా పరమసుఖమయే త్వత్పదే మోదితాహే**
**తస్యాయం పూర్వరంగః పవనపురపతే నాశయాశేషరోగాన్.** 10

నానా జీవున్ దుఃఖముల దెలిసి, జ్ఞాన మ్మంది యాచార్యలా
భోనన్, నీ దయగాంచి, త్వద్గుణ కథా ప్రాదుర్భవ ద్భక్తి యో
గాన, మాయఁదరించి, సర్వసుఖ సాకల్యమ్ము నీ పాదమం
దానందింతును; పూర్వరంగముగ దేవా! యార్తి వారింపుమా.

జీవులందు దుఃఖములను జూచి ఆచార్యకృపచే జ్ఞానమువడసి పుత్రమిత్రాదులు దుఃఖకారణములను నెఱుకనంది, స్వర్గమందైననింతేయని తెలిసి నీ స్వరూపతత్త్వము గ్రహించి నీ కల్యాణగుణమనాకీర్తనములచే భక్తి సమృద్ధి గాంచి యీ నా అనుభవమునందున్న రాగద్వేషాధికారణమైన మాయం దరించి నిరతిశయసుఖస్వరూపమైన నీ పాదమునందు అనగా పాదశబ్దలక్షితమైన జ్ఞానమందు ఆనందభరితుడ నయ్యెదను. అందులకు పూర్వరంగముగ ఓ గురుపవనపతీ! నా అశేషరోగములను వారింపుము.

## 92వ దశకము

# కర్మమిశ్రభక్తిస్వరూపము

**వేదై స్సర్వాణి కర్మా ణ్యఫలపరతయా వర్ణితానీతి బుధ్వా**
**తాని త్వ య్యర్పితాన్యేవ హి సమనుచర న్యాని నైష్కర్మ్యమీశ**

మాభూ ద్వైదై ర్నిషిద్ధే కుహచిదపి మనః కర్మ వాచాం ప్రవృత్తి
ర్దుర్వర్జ్యంచే దవాప్తం తదపిఖలు భవ త్యర్పయే చిత్ప్రకాశే. 1

శ్రుతులన్ గర్మఫలాభి సంధి యెచటన్ రూపింపలే దన్న స
న్మతి నీ కర్పణమంచు నా సకలమున్ నైష్కర్మ్యముం గాంతు, నా
శ్రుతి గాదన్న పనిన్ బ్రవృత్తియె ప్రభూ! శూన్యమ్మగుంగాక, యం
దతిచార మ్మనివార్యమే నదియు నీ కర్పింతుఁ జిజ్యోతికిన్

వేదములు విధివాక్యములచే జోతిష్టోమాదికర్మములను ఫల సాధనములనుగా విధింపలేదు. నైష్కర్మ్యమునుద్దేశించియే చెప్పినవి. అగుచో నక్కడక్కడ ఫలశ్రుతి కనిపించుచున్నదే యనిన నది ప్రరోచనార్థమేకాని వేరుగాదు. తల్లి బాలునిచే మందు త్రావించుటకు బెల్లమో పంచదారయో చూపి మురిపించును. మందున కది ఫలముగాదు. రోగనివృత్తియే ఫలము. అట్లే అవాంతర ఫలములనుజూపి ఆసపెట్టి ప్రవృత్తిమార్గమున కున్ముఖుని చేయుటద్వారా నివృత్తిని (నైష్కర్మ్యమును) అందించుటయే వేదముయొక్క పరమ తాత్పర్యము. వేదము పరోక్షవాదమగుటచే తత్తాత్పర్యము సులభముగా తెలియదుగావున నేచేయుపనియెల్ల పరమేశ్వరుడవగు నీకర్పణముగావించి నైష్కర్మ్యరూపమున జ్ఞానమును బొందెదను. వేదములచే దదనుయాయులయిన స్మృతులచే విధింపబడిన కర్మయందుదప్ప మఱి యితరమందు నాత్రి కరణములు ప్రవర్తింపకుండుగాక! నిషిద్ధకర్మను (వికర్మ) వర్జించుటకు అనువైన పరిస్థితి లేకపోయినచో నదికూడ కేవల చిత్ప్రకాశమైన నీయందు మంత్రపురస్సరముగా నర్పణము సేసెదను. నిషిద్ధానిషిద్ధ భేదము లేకుండ సర్వపదార్థములను భస్మము చేయు సర్వభక్షకుడగు నగ్నివలె నీవు కేవల జ్ఞానాగ్నిస్వరూపుడవుగావున నా అపచారములను దహింపగలవని భావము.

యస్త్వన్యః కర్మయోగ స్తవ భజనమయ స్తత్ర చాభీష్టమూర్తిం
హృద్యాం సత్త్వైకరూపాం దృషది హృది మృది క్వాఽపివా భావయిత్వా
పుష్పై ర్గంధై ర్నివేద్యై రపిచ విరచితై శ్శక్తితో భక్తిపూతై
ర్నిత్యం వర్యాం సపర్యాం విదధ దయి విభో త్వత్ప్రసాదం భజేయమ్. 2

నీసేవాఖ్యము కర్మయోగమున నెందే రాతిలో మన్నులో
నీ సౌందర్యము సాత్త్వికమ్ము నెదనేనిన్ బూని భావించి యా

యా సంభారము గంధ పుష్పఫల భక్ష్యాదుల్ సమర్పించి భ
క్త్యా సక్తుల్ గొని గొల్చి నీదగు ప్రసాదాస్వాదముం గాంచెదన్.

వైదికకర్మమందేకాక నా అధికారమునుబట్టి తాంత్రికమైన కర్మయగు నీ పూజాదికమందు నీ నారాయణవాసుదేవాది శుద్ధ సాత్వికమూర్తులలో నా కభీష్టమైన యేదో యొక రూపమును మన్ను రాయి మొదలగువానియందు లేదా హృదయమందు గల్పించుకొని భావించి గంధ పుష్ప ఫల నైవేద్యాదులచే నిత్యము భక్తిశ్రద్ధలతో యథాశక్తి పూజించి నీ ప్రసాదమును (అనుగ్రహమును) బడసెదను.

వి.వి: "పుంసి జాయాలయః పూజా" పురుషశబ్దవాచ్యుడగు నీశ్వరునియందు, జాయాలయః=జాయ (శక్తి) యొక్క లయము అనగా జీవశరీరారంభ కార్యకారణాత్మకమైన ప్రకృతిని లీనమొనర్చుట పూజయనబడును. అట్టి పూజావిధానముచే భగవదనుగ్రహము భక్తిసహకృతమయిన నైష్కర్మ్యరూపమున వెంటనే సిద్ధించునని తాత్పర్యము.

స్త్రీ శూద్రా స్త్వ త్కథాది శ్రవణ విరహితా ఆసతాం తే దయార్హ
స్త్వత్పాదాసన్నయాతాన్ ద్విజకులజనుషో హంత శోచా మ్యశాంతాన్,
వృత్త్యర్థం చే యజంతో బహు కథిత మపి త్వా మనాకర్ణయంతో
దృప్తా విద్యాభిజాత్యైః కిము న విదధతే తాదృశం మా కృథా మామ్. 3

భవదీయాద్భుత సత్కథల్ వినకయున్ సచ్ఛూద్రులున్ స్త్రీలు సా
ధువు లం గొల్చి భవ త్పదమ్ములకు నెంతో దగ్గరైనారు; మే
ల్చవు లౌ నీ కథ లీగి జీవికకు యజ్ఞా ల్సేసి విద్యాభి జా
త్యవిశేషమ్ముల మత్తులై దిరుగు బ్రాహ్మణ్య మ్మశాంతస్థితి
దవులన్ జూచి తపింతుఁ జేర్పకుము నన్ దైవమ్మ! ఆ మందలోన్

నీ నామసంకీర్తన స్మరణ కథాశ్రవణాదులు చేయుట తెలియని స్త్రీ శూద్రాదులు కూడ పెద్దల సేవించి నీ యనుగ్రహమునకు పాత్రులయ్యేదరు. అట్టివారికి హితవుచెప్పుటయు సులభము. వేదశాస్త్రాదులద్వారా మీపదములకు చేరువయయ్యు నశాంతులైన (విషయలోలులైన) ద్విజులం గూర్చియే నే నెంతో వాపోవుచున్నాను. వారు వృత్తికొఱకు మాత్రమే యజనయాజనాది షట్కర్మల జేయుచు, విద్యా, ధన, అభిజాత్యములను

మూడింటిచే మదించి, వేదాదులచే నుద్ఘోషింపబడిన ని న్నాలింపక, ఆలించినను అశ్రద్ధచేసి అభిచార సజ్జన నిందాదులను చేయుచుందురు. స్వామి! నన్నాగుంపులో చేర్చకుము.

పాపో ఽయం కృష్ణ రామే త్యభిలపతి నిజం గూహితుం దుశ్చరిత్రం
నిర్లజ్జ స్యాస్య వాచా బహుతరకథనీయాని మే విఘ్నితాని,
భ్రాతా మే వంధ్యశీలో భజతి కిల సదా విష్ణు మిత్థం బుధాం స్తే
నిందం త్యుచ్చై ర్హసంతి త్వయి నిహితమతీం స్తాదృశం మా కృథా మామ్. 4

తన దౌరాత్మ్యము గప్పిపుచ్చుకొనఁ బెద్దన్నయ్య రామా! హరీ!
అని రేయింబవలార్చు గంతులిడు సిగ్గా యెగ్గ! యాఘోషలోఁ
బను లెల్లన్ జెడె మాకుఁ బొమ్మని భవద్భక్తాళి నిందించి కె
వ్వున నవ్వం దెగఁగ్రొవ్వి దుర్జనము నన్ బో నీకు మా గుంపులోన్

వీడు పరమపాపి తన పాపములను కప్పుకొనుటకే "రామ" "కృష్ణ" యని ఊరక ఘోషించును. ఈగోలలో మాకార్యక్రమములు చెడిపోవుచున్నవి. ఈపెద్దన్నయ్య "విష్ణువు" అని చేయు గొడ్డుమోతు అరపులవలన వానికి లాభములేదు, నాకును లాభములేదు, అని నీ భక్తులను జూచి మూర్ఖులు పరిహసించి నిందింతురు. కృష్ణా! నన్నట్టివానిని గావింపకుము.

శ్వేతచ్ఛాయం కృతే త్వాం మునివరవపుషం ప్రీణయంతే తపోభి
స్త్రేతాయాం స్రుక్స్రువాద్యంకిత మరుణతనుం యజ్ఞరూపం యజన్తే
సేవంతే తంత్రమార్గై ర్విలసదరిగదం ద్వాపరే శ్యామలాంగం
నీలం సంకీర్తనాద్యై రిహ కలిసమయే మానుషా స్త్వాం భజంతే. 5

సో ఽయం కాలేయకాలో జయతి మురరిపో యత్ర సంకీర్తనాద్యై
ర్నిర్యత్నై రేవమార్గై రఖిలద! న చిరా త్త్వత్ప్రసాదం భజంతే,
జాతా స్త్రేతాకృతాదా వపిహి కిల కలౌ సంభవం కామయంతే
దైవా త్తత్రైవ జాతాన్ విషయ విషరసై ర్మా విభో వంచ యాస్మాన్. 6

మునివరాకృతి శ్వేతమూర్తి నర్చింతురు
కృతయుగమ్మునఁ దపోరీతి నెనసి
స్రుక్స్రువాదులఁగడున్ శోభిల్లు యజ్ఞరూ
పునిగఁ త్రేతాయుగమ్మున యజింతు

శ్యామలాంగుని శంఖచక్రాదిధరు ద్వాప
రమ్మునఁ దంత్ర మార్గమునఁ గొల్తు
సంకీర్తనాదులన్ జలదవినీలునిన్
గలి నరుల్ గొల్తు; రెక్కడను గలియ
యన్నిటన్ మేలు; కలియుగ మ్మం దయత్న
భవ్య సంకీర్తనాదులఁ ద్వత్ప్రసాద
లబ్ధియగుచుండు నెం దనాలస్యముగ ము
కుంద! హరి! రామ! కృష్ణ! గోవింద యనిన

కృతయుగాదులఁ బుట్టి ముక్తికిని బోని
జనము గోరుదు రిక్కలిన్ జనన మంద;
దైవిక మ్మిందు నాదు నుద్భవము; నన్ను
విషయ విషమూర్ఛనన్ మోసపెట్టకయ్య!

కృతయుగమువారు నిన్ను చతుర్భుజునిగ, శ్వేతమూర్తిగ, బ్రహ్మచారిగ, తపోయోగముచే నుపాసింతురు. త్రేతాయుగజనులు నిన్ను స్రుక్స్రువాదులు పూనిన యజ్ఞమూర్తిగ భావించి వైదికకర్మయోగముచే యజింతురు ద్వాపరమందు శంఖ చక్ర గదాదులు ధరించి శ్యామలమూర్తివైయున్న నిన్ను తంత్రమార్గములచే (ఆగమోక్త విధానమున) పూజింతురు. కలిలో కృష్ణమూర్తిగ (నీలవర్ణునిగ) నిన్ను సంకీర్తనాదులచే సేవింతురు. ఈ కలికాలము పై యుగము లన్నిటికంటె గొప్పది. ఆయా యుగములవారు తాము సులభముగ తరించుట కిందు జనింపవలెనని కోరుకొనుచుందురు. ఈ యుగమందు నీ నామసంకీర్తనాదులచే నీ యనుగ్రహము వెనువెంటనే సిద్ధించును ఇట్టి కలికాలమందు దైవికముగ నాకు జన్మము లభించినది కావున నన్ను విషయానందములచే మురిపించి, స్వామీ! నన్ను మోసము చేయకుము.

**భక్తా స్తావత్కలౌ స్యు ర్ద్రమిలభువి తతో భూరిశ స్తత్రచోచ్చైః**
**కావేరీం తామ్రపర్ణీ మనుకిల ఘృతమాలాంచ పుణ్యాం ప్రతీచీమ్**
**హా మామ ప్యేతదంతర్భవ మపిచ విభో కించిదంచ ద్రసం త్వ**
**య్యాశాపాశై ర్నిబధ్య భ్రమయ న భగవన్ పూరయ త్వన్నిషేవామ్. 7**

కననౌ నీ ద్రవిడావనిన్ బరమభక్తశ్రేణి కావేరి ప్రో
లను నీనాడును దామ్రపర్ణి కృతమాలన్ బుణ్య మాపశ్చిమా
నను; నేనిచ్చటఁబుట్టి నిన్ వలచితిన్; నన్నింక నాశాగుణ
మ్మున బంధించి భ్రమింపఁజేయకు ప్రభూ! పూరింపు నీ సేవలన్.

ఈ కలిలో భక్తాగ్రేసరులు మహానుభావులెందఱో ఉదయించిరి. అందులో కూడ ద్రమిళ (ద్రవిడ) దేశమందు కావేరి తామ్రవర్ణీ కృతమాలాది తీరములందు జన్మించినవారు పరమోత్తములు. ఈ కోవలో చేరి నీయెడల నించుక భక్తిరస భావితుడనైన నన్ను ఆశాపాశములచే బంధించి సంసారమం దట్టిటు భ్రమింప జేయకుము. నీ సేవాభాగ్యమును నాకు బూరింపుము.

దృష్ట్వా ధర్మద్రుహం తం కలి మపకరుణం ప్రాఙ్మహీక్షి త్పరీక్షి
ద్ధంతుం వ్యాకృష్టఖడ్గోఽపి న వినిహతవాన్ సారవేదీ గుణాంశాత్,
త్వ త్సేవా ద్యాశు సిద్ధ్యే దసదిహ నతథా త్వత్పరే చైష భీరు
ర్యత్తు ప్రాగేవ రోగాదిభి రపహరతే తత్ర హా శిక్ష యైనమ్. 8

అవలోకించి పరీక్షితుండు కలి దుష్టాత్ముండుగాఁ జంపఁబో
యివెసన్ మానె గుణ మ్మొకింత గని, నిన్నేమాత్రమేఁ నొంపక
వ్యవధానమ్మ ఫలించుఁ బాపమటుగా దౌటన్ వ్యథల్ గూర్చి సా
ధువులన్ నిన్గొలువంగనీఁడు కలి యా దుష్టాత్ము దండింపవే.

పరీక్షిన్మహారాజు ధర్మవిద్రోహియు దయాశూన్యుడునైన కలింజూచి కత్తిదూసియు, సారజ్ఞుడు కావున, వానిలోని గుణము కనిపెట్టి సంహరింపడాయెను. నీ అర్చన కీర్తనాదులు కలిలో నీ జన్మమందే ఫలించును, అనగా భక్తిమూలమున ముక్తి చేకూర్చును. పాపమో యీకలికాలమం దట్లు ఫలమీయదు. నీ భక్తుడన్న కలికి భయమెక్కువ. నీ యెడ విముఖులైన వారియెడల వీని ప్రభావము నిరంకుశము. అందువలననే నీ సేవకు పూనుకొనుటకు ముందే రోగాదులచే నీ కలిపురుషుడు సాధువులను పీడించి నీ కొలువు సేయనీయడు. ఇప్పుడు నా యనారోగ్యావస్థ యదే కావున, యీ దుష్టుని దండించి నీ సేవాభాగ్యము నా కనుగ్రహించినచో కలి తనంతటతానే దూరముగ తొలగిపోవును.

**గంగా గీతా చ గాయత్ర్యపి చ తులసికా గోపికాచందనం త**
**త్సాలగ్రామాదిపూజా పరపురుష! తథైకాదశీ నామవర్ణాః**
**ఏతా న్యష్టా ప్యయత్నా న్యయి కలిసమయే త్వత్ప్రసాద ప్రవృద్ధ్యా**
**క్షిప్రం ముక్తిప్రదానీ త్యభిదధు రృషయ స్తేషు మాం సజ్జయేథాః. 9**

**"లలి గంగానది గీతయుం దులసి సాలగ్రామ ముఖ్యార్చన**
**మ్ములు నేకాదశి గోపిచందనము శంభో! రామ! కృష్ణ? యనం**
**గల నామాక్షర పుణ్యకీర్తన మయత్న మ్మిచ్చు నమ్ముక్తి యి**
**క్కలిలో నీదయ నించి" నా ఋషుల వాక్య మ్మందు నన్ నిల్పవే.**

గంగ, గీత, గాయత్రి, తులసి, సాలగ్రామార్చనము, ఏకాదశి, గోపీచందనము, నీ నామవర్ణములు అను నీయెనిమిది పుణ్యపదార్థములచే ననాయాసముగ నీ యనుగ్రహము లభించి ముక్తిని కరతలామలక మొనరించును అని ఋషులు స్మృతులందు పేర్కొనిరి. అట్టి పుణ్యసామగ్రియం దాదరము నాకు గూర్పుము.

**దేవర్షీణాం పితౄణామపి న పున ర్ఋణీ కింకరో వా స భూమన్**
**యో ఽసౌ సర్వాత్మనా త్వాం శరణ ముపగత స్సర్వకృత్యాని హిత్వా,**
**తస్యోత్పన్నం వికర్మా ప్యఖిల మపనుద స్యేవ చిత్తస్థిత స్త్వం**
**తం మే పాపోత్థతాపాన్ పవనపురపతే రుంధి భక్తిం ప్రణీయాః. 10**

**మును దేవర్షిపితౄణ మీఁగికొని సంపూర్ణాత్ముఁ బూర్ణాత్మ భా**
**వన నిన్నే శరణొంది కర్మమును సర్వమ్మీఁగి యున్నంత, త**
**న్మనమందుండి నిషిద్ధకర్మము నడంపంజాలె దీవట్లు నా**
**యనుతాప మ్మడగించి పావన పురేశా! భక్తిఁ బోషింపుమా!**

ఋణత్రయము తీర్చి, అనగా యజ్ఞములు చేసి దేవఋణమును, అధ్యయనముచేసి ఋషి ఋణమును, పుత్రునింబడసి పితౄణమును తీర్చి, ఋణమునకు కింకరుడుకాక, నీకు కింకరుడై, తాను చేసిన కర్మమును గాక నిన్ను శరణమని నమ్మియున్నచో, అట్టివాని చిత్తమునందు నీవు నెలకొని వాని వికర్మను (నిషిద్ధ కర్మను) నశింపజేయుదువు. కావున నా పాపరూపమైన రోగతాపములను వారించి నీయం దేకాంతభక్తి పెంపొందింపుము.

# 93వ దశకము

# బహుగురులాభము

బంధు స్నేహం విజహ్యాం తవ హి కరుణయా త్వయ్యుపావేశితాత్మా
సర్వం త్యక్త్వా చరేయం సకల మపి జగ ద్వీక్ష్య మాయావిలాసమ్,
నానాత్వా ద్భ్రాంతిజన్యా త్సతి ఖలు గుణదోషావబోధే విధిర్వా
వ్యాసేధో వా కథం తౌ త్వయి నిహితమతే ర్వీతవైషమ్యబుద్ధేః. 1

బందుగులందు మోహ మెడఁబాసెద నీ కృప బుద్ధినిల్పి నీ
యం, దెదలించి మాయ కృత మంతయు నంచు జరింతు హాయి; నీ
యందునఁ జొచ్చి నిర్విషయ మైన మనంబును మంచిచెడ్డలన్
జెందవు భ్రాంతి నౌ విధి నిషేధములున్ మఱి భేదవృత్తియున్

పుత్ర మిత్ర కళత్రాది బంధువులందు మాయాకల్పితమైన మోహమును, నీదయచే నీపై మనసు నిలిపి త్యజించెదను. మఱియు నీ జగత్తు నీమాయచే కల్పితమని తెలిసికొని విధినిషేధాత్మకమైన సర్వకర్మమును త్యజించి స్వేచ్ఛాసంచారి నయ్యెదను. భ్రాంతివలన అనగా నేను మనుష్యుడను అను దేహాభిమానముచే నానాత్వమును అనగా వర్ణాశ్రమాది భేదము తన్నిమిత్తమైన గుణదోషములు విధినిషేధములు పొడసూపుచుండును. నిత్యనైమిత్తిక కర్మ సత్త్వశోభకమగుటచే గుణము, హింసాదికము దోషము. పాపక్షయసాధన మగుటచే కృచ్ఛ్ర చాంద్రాయణాదికము గుణము. అనుగుణభేదము నీయందు బుద్ధి నిలిపినవాని కుండును. అట్లే సర్వము బ్రహ్మమే అను నిశ్చయబుద్ధి ద్వారా వైషమ్యదూరుడైనవానికి విధినిషేధప్రసక్తియు ఉండదు. అట్టి స్థాయిలో నేనుస్వేచ్ఛా విహారము సేయుదునుగాక. విధినిషేధాతీతుడైనవాడు జ్ఞానమిశ్రమమైన భక్తికధికారియని తాత్పర్యము.

క్షుత్తృష్ణాలోపమాత్రే సతతకృతధియో జన్తవ స్సం త్యనన్తా
స్తేభ్యో విజ్ఞానవత్త్వాత్ పురుష ఇహ వర స్తజ్జని ర్దుర్లభైవ,
తత్రాప్యాత్మా ఽఽత్మనః స్యా త్సుహృదపి చ రిపు ర్య స్త్వయి న్యస్తచేతా
స్తాపోచ్ఛిత్తే రుపాయం స్మరతి సహి సుహృ త్స్వాత్మవైరీతతో ఽన్యః. 2

ఆకలి దప్పి దీర్చు కొను నంత యెఱింగెడు జంతుకోటి యెం
తో కల దన్నిటం బురుషుఁడున్నతుఁడౌ నెఱుకన్ సుదుర్లభ
మ్మై కనిపించు జన్మమిది యచ్యుతుపై మతిఁదాప మార్గుఁదా
నే కద మిత్రుఁడుం దనకు నెందును శత్రువుఁదాన; లే రొరుల్.

ఆకలి దప్పికలను తృణజలాదులచే వారించుకొను జంతువులు ఎన్నో కలవు. అందు విజ్ఞానసంపద అనగా ఆత్మదర్శన సామర్థ్యము కలవాడగుటచే మనుష్యుడు ఉత్తముడగును. అట్టి మనుష్యజన్మ దుర్లభము అందుకూడ ఆత్మయే మిత్రము, ఆత్మయే శత్రువును. నీయందు మనసుంచిన పుణ్యుడు తాపశాంతికి అనగా మోక్షమునకు సాధన మన్వేషించును అట్టివాడు తనకు తానే బంధువగును. కానివాడు తనకుతానే శత్రువు. (ఆత్మద్రోహి) అగును

త్వత్కారుణ్యే ప్రవృత్తే క ఇవ నహి గురు ర్లోకవృత్తే ఽపి భూమన్
సర్వాక్రాంతా ఽపి భూమి ర్నహి చలతి తత స్సత్ క్షమాం శిక్షయేయమ్,
గృహ్ణీయా మీశ తత్తద్విషయపరిచయే ఽప్యప్రసక్తిం సమీరా
ద్వ్యాప్తత్వం చాత్మనో మే గగనగురువశా ద్భాతు నిర్లేపతా చ. 3

నీ కృప యున్న లోకమున నిక్కముగా గురువేదికాదు; భా
రాకులయయ్యు భూమి కదలందదు దానన యోర్మి నేర్చెదన్;
జేకొనెదన్ సమీరమునఁ జిక్కియుఁ జిక్కమి లోకవాసనన్;
ఆకసమందు నెల్లెడల వ్యాప్తియు నంటమి నేర్తు నీశ్వరా!

ఆత్మయే ఆత్మకు బంధువు గరువు అన్నచో అజ్ఞాననాశమునకు హేతువుగ గురువు అవసరమని శాస్త్రములు చెప్పుచుండగా, తనకు తానే గురువు బంధువు అనుటయెట్లు పొసగును? అని యాశంకించి చరాచరప్రపంచమందు పృథివ్యాధి సర్వభూతములు గురువులే అనియు, వానివలన, నేర్చుకొనదగినది చాల గలదనియు కవి యీక్రింది శ్లోకమునందు స్పష్టము చేయుచున్నాడు. స్వామీ! నీ కరుణ లభించినయెడల కేవల మాత్మయేకాదు.లోకమందు పృథివ్యాది పదార్థము లన్నియు గురురూపములై భాసించును. లోకము నడవడియందుకూడ సర్వభూతముల బరువు వహించియు భూమి చలింపని కతన అందుండి క్షమాగుణము నేర్చికొందును. నానావాసనలను కొనివచ్చు

నదయ్యు వాయువు వాసనాదూషితముకాదు. అందుండి విషయములం దసంగము నలవరచు కొందును. ఆకాశమునుండి సర్వవ్యాపకత్వమును నిర్లేపత్వమును అభ్యసింతును. ఆకాశము ఘటాది పరిచ్ఛిన్నమయ్యు సర్వవ్యాప్తము. అట్లే మేఘాదివ్యాప్తమయ్యు వాని కంటనిది. ఆ విధముగా శరీర పరిచ్ఛిన్నమయ్యు సర్వ శరీర బహిరంతర్వ్యాప్తము, శరీరస్థమయ్యు శరీరస్పర్శలేనిదియునగు ఆత్మ నేనను భావమును బడసెదనని భావము.

**స్వచ్ఛ స్స్యాం పాపనో౽హం మధుర ఉదకవ ద్వహ్నివ న్మాస్మ గృహ్ణం**
**సర్వాన్నీనో౽పి దోషం తరుషు తమివ మాం సర్వభూతే ష్వవేయాం,**
**పుష్టి ర్నష్టిః కలానాం శశిన ఇవ తనో ర్నాత్మనో౽స్తీతి విద్యాం**
**తోయాదివ్యస్తమార్తాండవదపిచ తను ష్వేకతాం త్వత్ప్రసాదాత్.** 4

**అమలుఁడ నయ్యెదన్ మధురుఁడయ్యెద నీరటు; లగ్నివోలె భూ**
**తము లఖిలంబునందుఁ గనెదన్ నను, బుష్టియు నష్టి గల్గు దే**
**హమునకు నెందు నిందు కళకట్టుల; నాత్మకులేద; సూర్యబిం**
**బము జలమందుఁ బోలెఁ దనుపాళిని జిత్కళ యొక్కటైన చం**
**దము గనుగొందు నీదగు నుదార కృపారస లబ్ధి నచ్యుతా!**

ఉదకమట్లు నిర్మలుడను, దర్శనమాత్రముచే పాపశోధనము చేయగల పవిత్రుడను, మధురుడను (మధురభాషియు) నయ్యెదను. సర్వభక్షకుడగు అగ్నివలె ఏ దోషమును లేనివాడ నయ్యెదను. మఱియు తరుకాష్ఠములయందున్న అగ్నిని తత్సారూప్యమున హ్రస్వ దీర్ఘ సూక్ష్మాదిరూపమున చూచినట్లు సురనరాది సర్వభూతశరీరముల యందు నాయా ఉపాధివశమున నాయా పోలికల నందినవానినిగా నిన్ను గమనింతును. చంద్రుని కళలకు వృద్ధిహ్రాసములవలె జన్మ అస్తిత్వ పరిణామ వృద్ధిక్షయ విలాశరూప షడ్భావవికారములు శరీరమునకు గాని ఆత్మకు లేవని గుర్తింతును. ఒక్క సూర్యుడు ఘటోదకాదులందు అనేకుడై కనిపించినట్లు సర్వశరీరములందు ఆత్మ భేదప్రతీతి నందుచున్నదనియు నీ యనుగ్రహముచే లక్షించెదను.

**స్నేహా ద్వ్యాధాస్తపుత్రప్రణయమృతకపోతాయితో మాస్మభూవం**
**ప్రాప్తం ప్రాశ్నన్ సహేయ క్షుధ మపి శయువ త్సిందువ త్స్యా మగాధః,**

**మా భూవం యోషిదాదౌ శిఖిని శలభవ ద్భృంగవ త్సారభాగీ**
**భూయాసం కింతు తద్వ ద్ధనచయనవశా న్మాఽహ మీశ ప్రణేశమ్.** 5

**బోయ వధింపఁ బిల్లలకు బొక్కెడు పావుర మట్టు లేద్వ, మో**
**హాయతి నోర్తు నయ్యజగరాకృతి నాకలిఁ బ్రాప్త భుక్తిచేఁ;**
**దోయధియ ట్లగాధమతిఁ దోఁచెద, సారములాని తుమ్మెద**
**ట్లాయది రేయిఁ బద్మమున య ట్లతిసంచయినై నశింపనున్.**

బోయవాడు పిల్లలను చంపగా ఆడపావురము వలపైవ్రాలి యేడువగా, మగపావురము పుత్ర కళత్ర దుఃఖమును చూచి పైవ్రాలి తానును వలలో జిక్కుకొనును. ఆ పావురమును గురువుగా భావించి నేను పుత్ర కళత్ర వ్యామోహమునకు వశమై చావకుండెదనుగాక. అజగరమునుజూచి ప్రాప్తించిన దనుభవించి అప్రాప్తమైనదానికై యేడువక ఆకలిని నిగ్రహింతునుగాక. దీనిచే ప్రారబ్ధకర్మఫల మవశ్యభోగ్యమై సుఖదుఃఖప్రాప్తిపరిహారముల చేయునుగావున వానికై ప్రయాసపాటు వృథాకాలక్షేప మన్నమాట. సముద్రమట్లు గంభీరుడనై తొణకకుండెదగాక, అగ్నిపై మిడుతవలె స్త్రీ మొదలైన భోగ్యవస్తువులపై పడి నశింపకుండెదగాక. తుమ్మెద పూలలో సారమానినట్లు సర్వశాస్త్రములందలి సారమైన శ్రీమన్నారాయణ చరణ నళిన స్మరణరూప మాధుర్య మందెదగాక, మఱియు నాతుమ్మెద తేనెపై వలపుచే నొకే పద్మమునందు వ్రాలియుండి సూర్యాస్తమయమందు ముడిచికొనిన ఆ పద్మమందే బంధమందినట్లు ధనార్జనాదులయందలి అభినివేశముచే నేనొక్కయెడ చిక్కికొని నాశమందకుందునుగాక.

**మా బధ్యాసం తరుణ్యా గజ ఇవ వశయా నార్జయేయం ధనౌఘం**
**హర్తా న్యస్తం హి మాధ్వీహర ఇవ మృగవ న్మా ముహం గ్రామ్యగీతైః,**
**నాత్యాసజ్జేయ భోజ్యే ఝష ఇవ బడిశే పింగళావ న్నిరాశః**
**సుప్యాం భర్తవ్యయోగాత్ కురర ఇవ విభో సామిషో ఽన్యైర్న హన్యై.** 6

**తరుణీ మోహమునన్ గజమ్మువలె గోఁతంగూలఁ, జెంచట్లుగన్**
**పెఱలన్ తేపి హరింప, గ్రామ్యజన సంగీతమ్ములం జిక్కనున్**
**హరిణమ్మట్లు, నిరాశఁ బింగళయు నట్లై నిద్రవోదున్, పరుల్**
**పోరి గొన్నన్ మఱి సావ నక్కురరినై పూర్ణామిషాపేక్షచేన్.**

అడయేనుగు వెంటబడిన మదపుటేనుగువలె గోతిలో బడకుందునుగాక. తేనెపట్టు తీపి తేనె నొడిచికొను వానిం జూచి త్యాగభోగములు లేని ధనము కూడబెట్టకుందును గాక. గ్రామ్యగీతములచే అనగా ఏలపాటలచే వలలోబడు జంతువువలె తుచ్ఛసంగీతముల మోహమున బడకుందునుగాక. ఎఱకు లోబడి గాలమునకు చిక్కిన చేపవలె మధురభోజ్యములకు మురియకుండుదుగాక. పింగళ అను వేశ్య రొక్కముకొఱకు ఆశించి తక్కువ యిచ్చెడి జారులను తొలుత కాదని యెక్కువ యిచ్చువాని కొఱకు దురాశచే రేయెల్ల చూచి తుదకు విసిగి వేసారి, ఛీ! తుచ్ఛధన మెందులకని విరసత చెంది, సుఖముగా నిద్దుర పోయినది. దానివలె నిరాశచెంది విషయనిరాసము చేసి సుఖింతునుగాక. పిల్లలకు పెట్టవలెనని తాను తినక మాంసమును ముక్కున గరచికొని వచ్చు కురరి యను పక్షిని యితరపక్షులు పొడిచి చంపి మాంసమును హరించినవి. అట్టి కురరి యట్లు ధనాదులను పుత్రులకొఱకని దాచి బలవంతుల చేజిక్కి చావకుండెదకాక! కురరి=ఆడులకిముకిపిట్ట లేక పెన్నైడ పులుగు.

వర్తేయ త్యక్తమాన స్సుఖమతిశిశువ న్నిస్సహాయ శ్చరేయం
కన్యాయా ఏకశేషో వలయఇవ విభో వర్జితాన్యోన్యఘోషః,
త్వచ్చిత్తో నావబుధ్యే పర మిషుకృ దివ క్ష్మాభృదాయనఘోషం
గేహే ష్వన్యప్రణీతే ష్వహి రివ నివసా న్యుందురో ర్మందిరేషు 7

మనెదన్ దొట్టియనున్న బిడ్డ పగిదిన్ మానావమానమ్ములం
చనకుండన్, సతిచేతి యొంటి కడియ మ్మట్లుందు నన్యోన్య ఘ
ర్షణ శబ్దమ్ము తొలంగి, యొండెఱుఁగ నిచ్చల్ రా జూరా భేరి మ్రో
సిన నేనిన్ శరలక్ష్య వేధివలె నిన్ జింతింతు; నే కొంప నో
మునుము న్నెల్కలు త్రవ్వుకన్నమునఁ బామున్ బోలి వర్తించెదన్

శిశువువలె మానవమానాది ద్వంద్వత్యాగమొనరించి సుఖముండెదగాక. బాలిక ముంజేతి యొంటికడియము అన్యోన్యసంఘర్షణ ఘోషము లేకుండునట్లు శాస్త్రవాదవివాదముల రొదలో బడక యేకాకినై సుఖింతునుగాక. లక్ష్యముపై చూపు నిలిపి విలుకాడు రాజుయొక్క ఊరేగింపు భేర్యాదిశబ్దములను విననట్లు నీయందేకాగ్రత చెందిన మనసుచే మఱియొకటియెఱుగని దృఢసమాధిలో నుందునుగాక. ఎలుకలు త్రవ్విన కలుగులలో పామువలె ఒరులు నిర్మించుకొన్న యిండ్లలో వసించి కాలక్షేపము చేయుదునుగాక. అనగా గృహారామక్షేత్రాద్యతి సంచయేచ్ఛకు లోనుగాకుండెదగాక.

త్వయ్యేవ త్వత్కృతం త్వం క్షపయసి జగదిత్యూర్ణనాభాత్ ప్రతీయాం
త్వచ్చింతా త్వత్స్వరూపం కురుత ఇతి దృఢం శిక్షయే పేశకారాత్
విడ్భస్మాత్మా చ దేహో భవతి గురువరో యో వివేకం విరక్తిం
ధత్తే సంచింత్యమానో మమతు బహురుజాపీడితో ఽయం విశేషాత్. 8

నీలోనీవ సృజించి యీ జగములన్ లీనంబు గావించు టే
నాలోకించెద నూర్ణనాభియెడ; నీ ధ్యానాన సారూప్యమా
టాలోకించెదఁ గీటమే భ్రమరమౌ టందున్, శరీరమ్ము నే
నాలోకింతు నశుద్ధ భస్మమయమై యాచార్యకమ్మౌట,వి
ద్యాలాభమ్ము విరక్తి గూర్చుట; మదీయ మ్మందునున్ రుగ్ణమై.

సాలీడు వలె ఈశ్వరుడగు నీవు జగత్తుసృజించి, అందు నీవే ప్రవేశించి నీవే లయింపజేయుదు వని గ్రహించెదను. అనగా నిమిత్తోపాదాన కారణములు నీవే యని గుర్తించెదను. భ్రమరము ఒకానొకకీటమును తెచ్చిగూడుకట్టి అందుంచగా ఆ పురుగు భయముచే నా భ్రమరమును ధ్యానించి దానితో సారూప్యమును పొందును. అట్లు నీ నిరంతర ధ్యానసమాధిచే నీ సారూప్యము నందెదనుగాక.అన్నిటికంటె మూత్రపురీషాది నిలయమైన యీ తుచ్ఛశరీరము విశేషించి రోగ పీడితమైన నా శరీరము వివేకమునకు విరక్తికి హేతువై సర్వోత్తమ గురుస్థానము నలంకరించుచున్నది.

హే హే మే దేహమోహం త్యజ పవనపురాధీశ యత్ ప్రేమహేతో
ర్గేహే విత్తే కలత్రాదిషు చ వివశితా స్త్వత్పదం విస్మరంతి,
సో ఽయం వహ్నే శ్శునో వా పరమిహ పరత స్సాంప్రతంచాక్షికర్ణ
త్వగ్జిహ్వాద్యా వికర్ష న్త్యవశ మత ఇతః కో ఽపి న త్వత్పదాబ్జే. 9

అరరే! వాయుపురీశ! దేహమున మోహ మ్మెల్ల ఖండింపుమా
తరుణీ బాంధవ పుత్రమిత్ర వశులై త్వత్పాదమున్ విస్మరిం
తురు దానన్ దుద కగ్గిపాలొ తనువెందున్ గుక్కపాలో యగున్
త్వరచే నట్టిటు లాగు నింద్రియము లందన్నీనీవు నీ పాదమున్.

ఓ పవనపుర నాథా! గృహక్షేత్ర విత్తాదులందు వివశుడనై నీచరణమును మఱచిపోవుటకు హేతువైన యీ దేహమందలి వ్యామోహమును తొలగింపుము.

ఇది అగ్నికో కుక్కకో చివరకు ఆహారము కావలసియున్నది. కన్ను చెవి చర్మము నాలుక మొదలగునవి దీని నిట్టట్టు లాగుచున్నవి. కాని నీ పాదారవిందమును చేర్చునది వీనిలో నొక్కటియు లేదు.

**దుర్వారో దేహమోహో యది పున రధునా తర్హి నిశ్శేషరోగాన్**
**హృత్వా భక్తిం ద్రఢిష్ఠాం కురు తవ పదపంకేరుహే పంకజాక్ష,**
**నూనం నానాభవాంతే సమధిగతమముం ముక్తిదం విప్రదేహం**
**క్షుద్రే హా హన్త మా మా క్షిప విషయరసే పాహి మాం మారుతేశ. 10**

**మేనన్ మోహ మవార్య మే నిపుడసామీ! రోగముల్ నాపి యెం**
**తేనిన్ భక్తి భవత్పదాబ్జమున నా కీవయ్య! యెట్లెట్లొ యా**
**నానా యోనుల దాటి విప్రతనువొందం గంటి మోక్షార్థ, మిం**
**దైనం బ్రోవుము త్రోయకే విషయ తుచ్ఛానందమం దీశ్వరా!**

దేహమందలి మోహ మిప్పటలో వారింపరానిదగునేని అశేష రోగములను అనగా వాతాది బాహ్యవ్యాధులను రాగద్వేషాది అంతర్వ్యాధులను హరించి నీ చరణకమలమందు మిగుల దృఢమైన భక్తి నొదవింపుము. అన్ని జన్మములు గడచి గడించికొన్న ముక్తిప్రదమైన యీ విప్రశరీరమును క్షుద్రమైన విషయానందమందు విసరక నన్ను గాచింపుము.

## 94వ దశకము

# తత్త్వజ్ఞానోదయము

**శుద్ధా నిష్కామధర్మైః ప్రవరగురుగిరా త్వత్స్వరూపం పరం తే**
**శుద్ధం దేహేంద్రియాదివ్యపగత మఖిలవ్యాప్త మావేదయంతే,**
**నానాత్వ స్థౌల్య కార్శ్యాది తు గుణజవపుస్సంగతో ఽధ్యాసితం తే**
**వహ్నే ర్దారుప్రభేదే ష్వివ మహదణుతా దీప్తతా శాంతతాది. 1**

**అమలుల్ గాంతు రకామకర్మముల దేహాదివ్యపేతమ్ము శు**
**ద్ధము నీ రూపము సద్గురూక్తుల, బహుత్వ స్థౌల్య కార్శ్యాది స**
**ర్వము నధ్యస్తము నీయెడన్ సగుణ రూపమ్మందు; దీప్తత్వ సం**
**శమ ముఖ్యేంధన ధర్మ మగ్ని యెడలన్ సంభావిత మ్మైనటుల్.**

నిష్కామముగ స్వధర్మమాచరించినవారు చిత్తశుద్ధిగలవారై రాగద్వేషాది దోషములువాసి శమదమాది సాధనచతుష్టయసంపన్నులై వేదవేదార్థసంపన్నుడు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు నైన గురువుయొక్క ఉపదేశమంది నీ పరమార్థ స్వరూపమును నిష్కల బ్రహ్మభావమును దేహేంద్రియాదులు తద్ధర్మములైన నానాత్వ స్థౌల్యకార్శ్యాదులు సగుణమైన నీరూపమందు దారువులందున్న యగ్నియందు దారుగతమైన చిన్న పెద్ద అను లక్షణములు మండుట రగుల్కొనుట ఆరిపోవుట అను ధర్మములువలె అగ్నివలె కల్పింపబడినవి కట్టెయు నగ్నియు వేరని యెఱుంగనందున కట్టెయొక్క ధర్మ మగ్నియందువలె, జ్ఞానము లేనందును (ఔపాధిక) శరీరధర్మములగు జరామరణాదు లాత్మయందు బ్రతీతము లగుచుండును కాని పరమార్థముచే నవి నిరుపాధికమగు నాత్మ యందు లేవని తాత్పర్యము

**ఆచార్యాఖ్యాధర స్థారణి సమనుమిలచ్ఛిష్యరూపోత్తరార**
**ణ్యావేధోద్భాసితేన స్ఫుటతరపరిబోధాగ్నినా దహ్యమానే,**
**కర్మాలీవాసనా తత్కృత తనుభువనభ్రాంతి కాంతారపూరే**
**దాహ్యాభావేన విద్యాశిఖిని చ విరితే త్వన్మయీ ఖ ల్వవస్థా. 2**

**ఆచార్యుం డను క్రింది యయ్యరణి శిష్యాఖ్యమ్మున య్యుత్తరం**
**బై చర్చాత్మక మంథనమ్ము జరుగన్ వ్యక్తమ్ము బోధాగ్ని బి**
**ట్టేచన్ గర్మ వితానవాసనలతో నీలోక దేహాత్మ కో**
**త్కాచారణ్యము దగ్ధమౌ మిగుల; కందున్ దివ్యబోధాగ్ని తా**
**నై చర్లాడగఁ ద్వన్మయస్థితి యొకం డావిష్కృతమ్మౌనటన్.**

ఆచార్యుడధరారణి, శిష్యుడుత్తరారణి (అరణియనగా అగ్నిని మథించుట కేర్పరుపబడిన జమ్మికఱ్ఱ) ఉపనయన సంస్కారరూపమున నయ్యిద్దరకు సమావేశము విధివిహితము. అందు మథనరూప పరస్పర చర్చ వలన భాసించు జ్ఞానరూపమైన యగ్నిచే కర్మవాసన దానివలన కలిగిన దేహ

గేహ భ్రాంతి రూపమయిన యడవి దహింపబడి, మఱి దహింపవలసిన పదార్థము లేనందున నా జ్ఞానాగ్నికూడ ఉపశమించి (కార్యాకారణముల కంతరముపోయి) కేవల శాంతి త్వన్మయమయినస్థితి అనగా బ్రహ్మాకారవృత్తి సిద్ధించును. అనగా చిదానందరూపుడగునన్నమాట.

ఏవం త్వత్ప్రాప్తితో ఽన్యో నహిఖలు నికిలక్లేశహానే రుపాయో
నైకాంతాత్యంతికాస్తే కృషివ దగదషాడ్గుణ్యషట్కర్మయోగాః,
దుర్వైకల్యై రకల్యా అపి నిగమపథా స్తత్ఫలాన్యప్యవాప్తా
మత్తా స్త్వాం విస్మరంతః ప్రసజతి పతనే యాం త్యనంతా న్విషాదాన్. 3

భవ దాప్తిన్ మఱిమించి క్లేశహరణో పాయమ్ము లే దున్ననున్
వ్యవసాయమ్మటు షడ్గుణమ్ము లవలన్ షట్కర్మముల్ ముక్తిక
య్యవి యేకాంతములేని గావుమఱి కావాత్యంతికమ్ముల్ మఖా
దివిధిన్ గర్మఁతులాని భోగము చవిన్ జేకొంద్రు భ్రష్టస్థితిన్

ఔషధములు ఆయుర్వేదము చెప్పిన ఆరోగ్యోపాయములు షాడ్గుణ్యము అనగా సంధి విగ్రహము మొదలైన దండనీతి అర్థార్జనోపాయములు అధ్యయనాది షట్కర్మలు వేదోక్తములైన యోగములు అనునవి నిఖిలదుఃఖనివృత్తి చేయజాలవు. అవి దుంఖమిశ్రసుఖహేతువులు. దుఃఖమును పునరావృత్తిని వారింపజాలవు. వేదమార్గములు దుర్వైకల్యములచేత అనగా ద్రవ్య కర్మ కాలకర్తృ దోషరూపములైన వైగుణ్యములచేత అకల్యములు=అనగా అనుష్ఠాన శక్యములు కావు. కావున నవి యేకాంతాత్యంతోపాయములుకావు. మఱియు వాని నెట్లో యాచరించి వానివలని ఫలములను పొందినవారుకూడ మత్తులైనందున వనాదులయందు స్వర్లోకవిలాసినులతో క్రీడించి కర్మక్షయము కాగానే యధఃపతనమునకు దుఃఖితులగుచుందురు.

త్వల్లోకా దన్యలోకః క్వను భయరహితో యత్ పరార్థద్వయాంతే
త్వద్భీత స్సత్యలోకేపి న సుఖవసతిః పద్మభూః పద్మనాభ!,
ఏవంభావే త్వధర్మార్జితబహుతమసాం కా కథా నారకాణాం
తం మే త్వం ఛింది బంధం వరద కృపణబంధో కృపాపూరసింధో. 4

నీలోకానకు మించి నిర్భయగతిన్ నేఁ గాన పద్మోద్భవుం
డాలో రెండు పరార్థముల్ గడచి లో నాందోళనం జెందెడిన్

**కాలాత్ముండగు నీకు నైజడిసి, దుఃఖగ్రస్తులం గూర్చి యిం**
**కేలా పల్కుట దీనబంధుడవు తండ్రీ! బంధముల్ ద్రెంపవే.**

నీవైంకుఠలోకముకంటె వేఱుగ సత్యలోకాదులేవియు నభయస్థానములు కావు. కారణ మేమన ద్విపదార్థపరిమితిగల సత్యలోకమందుండెడి బ్రహ్మకూడ కాలస్వరూపివి ఈశ్వరుడవు నగు నీవలన జడియుచుండునే గాని వినాశభయ రహితుడై యుండలేడు.

వి.వి: ఇట రాజీవోద్భవుడను విశేషణము బ్రహ్మకు ఉత్పత్తి వినాశములను సూచించును. విద్యచేత కర్మచేత ఐశ్వర్యము గడించిన బ్రహ్మకే దుఃఖము యొక్క అత్యంతిక నివృత్తిలేనపుడు, అధర్మార్జితమైన పాపముచే నరకమున గూలెడి సంసారులకు క్లేశనాశనము ఎక్కడిమాట? కావున ఓ కృష్ణస్వామి! దీనబంధువు కృపాసింధువవు కావున శరీరాదులందు నాకుగల అహం మమాభిమానరూప బంధమును ద్రెంపుము.

**యాథార్థ్యా త్త్వన్మయస్యైవ హి మమ న విభో వస్తుతో బంధమోక్షా**
**మాయావిద్యాతనుభ్యాం తవ తు విరచితౌ స్వప్నబోధోపమౌ తౌ,**
**బద్ధే జీవద్విముక్తిం గతపతి చ భిదా తావతీ తావదేకో**
**భుఙ్క్తే దేహద్రుమస్థో విషయఫలరసం నాఽపరో నిర్వ్యథాత్మా. 5**

**ఈ వేనొటను బంధమోక్షములు లేనే లేవు నిక్కంబు వి**
**ద్యావిద్యాకృత స్వప్న బోధ సదృశ మ్మా భేద మయ్యాత్మ దా**
**జీవాఖ్యన్ తనుశాఖిఁ గర్మఫలమున్ నిత్యమ్ము భక్షించెడిన్**
**జీవన్ముక్తుఁడొ స్వస్థుఁడై తినఁడు కించి త్తైన నానందియై.**

పరమార్థముచే ఈశ్వరుడవగు నీవే అయియున్ననాకు బంధమోక్షములు లేనేలేవు. అవిద్యచేత బంధము, విద్యచేతనే మోక్షము. అవి నిద్ర మెళకువ వంటివి. అనగా స్వప్నమందు చూచిన శరీరముచేత బంధము మెళకువరాగానే తన్మోక్షము ఎట్లో అట్లే అజ్ఞానదశలో దేహబంధము, జ్ఞానదశలో మోక్షము. కల వలె బంధముకూడ మాయామయమయ్యు దుఃఖహేతు వగుచున్నది. గనుక జ్ఞానముచేత ఆబంధచ్ఛేదము కోరవలసినదగుచున్నది. బద్ధునకు జీవన్ముక్తునకు గల భేద మేమనగా దేహమనెడి వృక్షమునందు జీవుడను పేర వసించి విషయ రసఫలము ననుభవించును. జీవన్ముక్తుడు ఉపాధియందుండియు విషయరస ఫలమును అనుభవింపడు. అనుభవింప

కున్నను "రసోవై సః" అని యుపనిషత్తు చెప్పినట్లు జ్ఞానశక్తిచే దాను సర్వరసస్వరూపుడగుటవలన నెట్టివ్యధను పొందడు.

జీవన్ముక్తత్వ మేవంవిధ మితి వచసా కిం ఫలం దూరదూరే
తన్నామాశుద్ధబుద్ధే ర్నచ ఖలు మనస శ్శోధనం భక్తితో ఽన్యత్,
తన్మే విష్ణో కృషిష్ఠా స్త్వయి కృతసకలప్రార్పణం భక్తిభారం
యేన స్యాం మంక్షు కించి ద్గురువచనమిల త్త్వత్ప్రబోధ స్త్వదాత్మా. 6

జీవన్ముక్త దశన్ స్తుతింప నగునే చిత్తమ్ము శుద్ధమ్ముగా
కే వెంటన్ లభియింపదాస్థితి మన స్సె కాదు సర్వస్వమున్
నీవై యర్పణసేయు భక్తి నిడుమా! ఇంచించు కాచార్యవా
చోవైశద్యము తోడుసేసి యెఱుకన్ శోభింతు నీవై ప్రభూ!

జీవన్ముక్తస్థితి యిట్టిదని వేదనాసౌందర్యజ్ఞానముచే వర్ణించిన మాత్రమున నందునదిగాదు. చిత్తశుద్ధిలేనివానికి ఆస్థితి కడుదూరము. కావున భక్తికంటె చిత్తశోధనోపాయము మఱిలేదు. తీర్థస్నానాదిలఘూపాయములచే అతి శీఘ్రముగ అప్రయత్నముగ భక్తి సిద్ధించును. కావున నో విష్ణూ! త్రికరణసాధ్యమైన నా సర్వ క్రియాకలాపమును మంత్ర పురస్సరముగ నీకు మసర్పణము చేయుట రూపమైన భక్తి సమృద్ధిని నాయందొనరింపుము. దానిచే నించుక గురువచనము తోడుచేసికొని శీఘ్రముగ నీ ప్రబోధము-అనగా బ్రహ్మజ్ఞానము పడసి నీవే నేనయ్యెదను అనగా ముక్తుడ నయ్యెదను.

శబ్దబ్రహ్మణ్యపీహ ప్రయతితమనస స్త్వాం న జానంతి కేచిత్
కష్టం వంధ్యశ్రమా స్తే చిరతర మిహ గాం బిభ్రతే నిష్ప్రసూతిమ్,
యస్యాం విశ్వాభిరామాః సకలమలహరా దివ్యలీలావతారాః
సచ్చిత్సాంద్రం చ రూపం తవ న నిగదితం తాం న వాచం భ్రియాసమ్. 7

పరమ బ్రహ్మ మెఱుంగలేరు నిను శబ్దబ్రహ్మ పారీణులౌ
దురువో చూల్గొననట్టి గోవుబడి యెంతో కష్టపాటొందుచుం
దురు; సచ్చిద్ఘనమైన నీ సొబగునున్ దోసమ్ము లం దూల్చు సుం
దరలీలన్ వినరాని యాపలుకు మ్రోతల్ మోతలోల్లన్ బ్రభూ!

శబ్దబ్రహ్మమందు పరినిష్ఠితమనస్కులయ్యు అనగా మీమాంసాది ఉపాంగములచే నుపబృంహితమైన సాంగవేదమందు పరిశ్రమించినవారుగూడ వేదమునకు ప్రధాన ప్రతిపాద్యమైన నిన్ను పరబ్రహ్మము నెఱుంగనేరరు. ఉపాసన మొదలే లేదు. అక్కటా వృథా శ్రమకు లోనై నిష్ప్రసూతిం=భక్తి జ్ఞాన ఫలోత్పాదనము లేని. గాం=వాక్కును. జల్పవితండరూపమును భరింతురు. శ్లేష-నిష్ప్రసూతిం=ఈననిది గొడ్డుమోతు అయిన. గాం=గోవును పోషించినట్లు - అని ఉపమానము. నేను విశ్వమనోభిరామములు సకల మలనివర్తకములు దివ్యములు, అనగా శుద్ధసత్త్వమయములు నైన శ్రీరామ కృష్ణాద్యవతారములు గాని. సచ్చిదానంద సాంద్రమైన పరబ్రహ్మరూపముగాని యెందువర్ణింపబడలేదో అట్టి (సగుణ నిర్గుణమైన ఈశ్వరతత్త్వమును తెలుపని) మాటను వహింపను. అనగా పలుకనే పలుకను.

**యో యావాన్ యాదృశో వా త్వమితి కిమపి నైవావగచ్ఛామి భూమ**
**న్నేవం చానన్యభావ స్త్వదనుభజన మేవాద్రియే చైద్యవైరిన్,**
**త్వల్లింగానాం త్వదంఘ్రిప్రియజనసదసాం దర్శనస్పర్శనాది**
**ర్భూయా న్మే త్వత్ప్రపూజానతినుతిగుణకర్మానుకీర్త్యాదరోఽపి. 8**

**నిను నే నెంతటి వాఁడ వో యెవఁడవో నీ తీర దేమో యెఱుం**
**గను; అట్లైన ననన్యభావమున నాకాంక్షింతు నీ సేవలన్**
**గన నీ మూర్తులఁ గొల్వ; నీ చరణభక్త శ్రేణిదర్శింపనున్**
**విన నీదౌనుతులన్ నతిన్ గొలువునన్ వేడ్కౌత నా కెప్పుడున్.**

నీవెవరవో ఎంతవాడవో, ఎట్టి మహిమ గలవాడవో, ఏ పోలికవాడవో, నే నించుకయు నెఱుగను. ఓ పరిపూర్ణస్వరూపా! ఈశ్వరా! ఇట్లయ్యును అనన్యభావుడనై నీ సేవయం దుబలాటపడుచున్నాను. ఓ శిశుపాలవైరీ! నీవు గోపాలబాలకుడ వని మాత్రము వింటిని కావున నీ ప్రతిమలకు నీ భక్త సమాజములకు దర్శనస్పర్శన నమస్కారాది రూపమైన సర్వోపచారయుక్తమై పూజ స్తుతియందు సత్త్వాది గుణములచే నీవు చేసిన సృష్ట్యాది విలాసముల సంకీర్తనము ననువానియందును శ్రద్ధ ఆదరము నాకు కలుగుగాక!

**యద్యల్లభ్యేత తత్త త్తవ సముపహృతం దేవ దాసోఽస్మి తే హం**
**త్వద్గేహోన్మార్జనాద్యం భవతు మమ ముహుః కర్మ నిర్మాయ మేవ,**

సూర్యాగ్ని బ్రాహ్మణాత్మాదిషు లసితచతుర్బాహు మారాధయే త్వాం
త్వత్ప్రేమార్ద్రత్వరూపో మమ సతత మభిష్యందతాం భక్తియోగః. 9

ఏమే మబ్బిన నీక యర్పితము తండ్రీ! నీకె దాసుండ న
య్యా! మీ యాలయ మార్జనాదులు మదీయాశ్రాంతకర్తవ్యముల్
సోమర్కాగ్ని ధరామరాదులను విష్ణున్ నిన్ను దర్శింతు;త్వ
త్ప్రేమార్ద్రత్వము భక్తియోగ మది నా హృద్వీథి జాలెత్తుతన్.

నాకేది లభించిన నది నీకు సమర్పితము. నీకు దాసుడను. నీ ఆలయ సమ్మార్జన సేచన పుష్పోపహారాది సకల క్రియాకలాపము దంభరహితమై నాయందు ఏర్పడుగాక! సూర్య అగ్ని గో బ్రాహ్మణాదులందు చతుర్భుజుడైన నిన్ను భావించి ఆరాధించెదను. నీయెడల ప్రేమచే హృదయము ద్రవించుట రూపమైన భక్తియోగము నాలో జాలెత్తునుగాక!

ం తే దాన హోమ వ్రత నియమ తప స్సాంఖ్యయోగై ర్దురాపం
త్వత్సంగేనైవ గోప్యః కిల సుకృతితమాః ప్రాపు రానందసాంద్రమ్,
భక్తే ష్వన్యేషు భూయస్స్వపి బహుమనుషే భక్తి మేవ త్వ మాసాం
తన్మే త్వద్భక్తి మేవం ద్రఢయ హర గదాన్ కృష్ణ వాతాలయేశ. 10

జపహోమవ్రతదాన సాంఖ్య సుతపః స్వాధ్యాయ యోగమ్ములం
దపరి ప్రాప్యము త్వత్సమైక్యము త్వదీయాఖండ భక్తిప్రభా
వ పరీతల్ గదె వ్రేత లందరి భవద్బ్రహ్మాత్మభావమ్ము నీ
కృప నాభక్తి దృఢమ్ము సేసి సకలార్తిం బాపు కృష్ణప్రభూ!

దాన హోమ వ్రత నియమ తప స్సాంఖ్యయోగములచే లభింపని నీతోడి యైక్యము నీతో కలసి మెలసి తిరిగి గోపికలు పరమపుణ్యవతులు పొందిరి. అది కేవలానందస్వరూపము. ఉద్ధవాది భక్తులు మహానుభావు లెందఱోఉండగా నీ యమాయికలగు గోపికలభక్తినే నీవు మెచ్చితివి. ఓ వాతాలయేశ్వరా! కృష్ణా! నీయెడ ప్రేమలక్షణమైన ఆ భక్తిని నాయందు దృఢము సేయుము. నా వ్యాధిని హరింపుము.

# 95వ దశకము

# భగవద్ధ్యానవిధానము

ఆ గౌ హైరణ్యగర్భీం తను మవికలజీవాత్మికా మాస్థిత స్త్వం
జీ ుత్వం ప్రాప్య మాయాగుణగణఖచితో వర్తసే విశ్వయోనే,
త త్రోద్వృద్ధేన సత్త్వేన తు గుణయుగళం భక్తిభావం గతేన
ఛి త్వా సత్త్వంచ హిత్వా పునరనుపహితో వర్తితాహే త్వమేవ. 1

ఈవు సమష్టిజీవ తను వేర్పడ నొంది హిరణ్య గర్భుడై
జీవుడనం గుణత్రయము జెంది వసించుచు సత్త్వమాత్రమౌ
కేవలభక్తిచేత నణగించి రజస్సు తమస్సు సత్త్వమా
పై వదలించి పోల్చెదవు బ్రహ్మమనంగ ననావృతస్థితిన్.

బ్రహ్మప్రళయముచివర నీవు సృష్టి సేయగోరి సూక్ష్మశరీర సమష్టిరూపమైన హిరణ్యగర్భశరీరమును పొందితివి. అనగా హిరణ్యగర్భశరీరాభిమానివైతివని భావము. నీ విరాట్స్వరూప శరీరమైన ప్రపంచమునకు నీవు కారణభూతుడవు కావున తద్వ్యష్టిరూపమైన జీవత్వమును పొందితివి. అనగా మాయాగుణముల యొక్కయు తత్కార్యములైన మహదహంకార భూతేంద్రియ ప్రాణపంచక స్వరూపములైన తత్త్వముల యొక్కయు సంఘాతము స్వరూపముగాగల శరీరము చేత సంబద్ధుడవై శరీరాభిమానివి (సంసారివి) అగుచుందువు. ఇట్టి సంసారియైన జీవునికి రజస్తమోవృద్ధియందు సంసారము నివృత్తముకాదు. ఆ మాయాగుణములలో సత్త్వముయొక్క అభివృద్ధి పెంపొందినపుడు భక్తి యనిపించుకొనును. దానిచేత రజస్తమః కార్యభూతమైన (మాయామయమైన) శరీరాదికమును ఛేదించి జ్ఞానము జనింపజేసి కృతార్థమైన సత్త్వరూప సాధవమును కూడ త్యజించి కార్యకారణముల కభేద మేర్పడుటవలన అనుపహితమైన అనగా నిరావరణమైన పరిపూర్ణ బ్రహ్మమ వగుదువు. అట్టి నీతోడి యైక్యమును నేననుభవింతును అనగా నీవే నేనై వర్తింతునని భావము.

సత్త్వోన్మేషా త్కదాచిత్ఖలు విషయరసే దోషబోధే உపి భూమన్
భూయో உప్యేషు ప్రవృత్తి స్సతమసి రజసి ప్రోద్ధతే దుర్నివారా,

చిత్తం తావ ద్గుణాశ్చ గ్రథిత మిహ మిథ స్తాని సర్వాణి రోద్ధుం
తుర్యే త్వయ్యేకభక్తి శ్శరణమితి భవాన్ హంసరూపీ న్యగాదీత్. 2

అమరిన సత్త్వవృద్ధి విషయమ్ములనెడన్ విషబుద్ధిగల్గినన్
తమము రజస్సు రేగి యెడఁదం గొను లంకెఁబ్రవృత్తి వోదు ని
క్కముగను వాసనాక్షయముగావలెనన్నను సాధనమ్ము దై
వమవగు సాక్షి నీ యెడన భక్తియ యంటివి హంసరూపివై

సత్త్వగుణాభివృద్ధి యైనపుడు విషయరసమందు దోషదృష్టి యేర్పడును. అయినను వానియెడల అప్పుడుగూడ ప్రవృత్తి అనివార్యము. కారణమేమన రజస్తమోగుణములయొక్క ప్రాబల్యము అప్పుడు నుండుటయే గుణములు విషయములు మనస్సు పరస్పరసంబద్ధము లైనంతవరకును ఈ ప్రవృత్తి పోదు. అనుబద్ధము లగుట యనగా రాగద్వేషాదులవలన చిత్తము విషయము లందు ప్రవేశించుట. దానిచే అనుభూతములైన విషయములు వాసనారూపమున చిత్తమున ప్రవేశించును. ఈ పరస్పరమైన లంకెను త్రెంచుటకు అవస్థాత్రయా తీతుడవై సాక్షివై యున్న యీశ్వరుడవగు నీయందు భక్తియను దొక్కటియే శరణ్యము. ఈ విషయమును హంసస్వరూపుడవై (పరమహంస పరివ్రాట్టునై) నీవు బ్రహ్మయెదుట సనకాది ఋషులకు ఉపదేశించితివి. పాలను నీటిని వివేకించునది హంస. అట్లు ఆత్మను అనాత్మను వివేకించువారికి పరమహంస యను బిరుదు అన్వర్థము.

సంతి శ్రేయాంసి భూయాం స్యపి రుచిభిదయా కర్మిణాం నిర్మితాని
క్షుద్రానందాశ్చ సాంతా బహువిధగతయః కృష్ణ తేఒభ్యో భవేయుః
త్వం చాచఖ్యాథ సఖ్యే నను మహితతమాం శ్రేయసాం భక్తి మేకాం
త్వద్భక్త్యానందతుల్యః ఖలు విషయజుషాం సమ్మదః కేనవా స్యాత్. 3

కానన్వచ్చును గర్మనిష్ఠుల కనేక శ్రేయముల్, దాన క్షు
ద్రానందమ్ము ల నేకముల్ గతు లయో! సాంతంబులౌ వారి, కి
ట్లే నీ మిత్రున కానతిచ్చితివి సామీ! భక్తి మేలంచు, భ
క్త్యానంద మ్మది యెట్టులౌ విషయ భోగాసక్తులౌవారికిన్?

కర్మఠులకు రాగాది గుణములనుబట్టి కర్మాధికారమే యేర్పడినది. అందుచే అభిరుచినిబట్టి యధికారభేదమును, దానివలన సాధనభేదమును గమనించి బృహస్పతి వ్యాస పతంజలి ప్రముఖులైన యాచార్యులు శ్రేయోమార్గము లనేకములు నిర్మించిరి. వానివలన స్వర్గాదిరూప గతు లనేక ఫలములు గలుగగలవు. కాని అవన్నియు దుఃఖమిశ్రితములు స్వల్పసుఖములు సాంతములు (అనిత్యములు) క్షుద్రానందప్రదములు. నీవునీమిత్రుడగు నుద్ధవునికి శ్రేయస్సాధనము లన్నిటిలో భక్తియొక్కటే తిరుగులేని పూజనీయమైన సాధనమని చెప్పితివి. విషయలోలురైనవారికి నీభక్తిచేత గలుగు నానందముతో సమానమైన సుఖము మఱెందును కలుగదు.

త్వద్భక్త్యా తుష్టబుద్ధే స్సుఖ మిహ చరతో విచ్యుతాశస్య చాశాః
సర్వాస్స్యుః సౌఖ్యమయ్యః సలిలకుహరగస్యేవ తోయైకమయ్యః,
సో ఽయం ఖల్వింద్రలోకం కమలజభవనం యోగసిద్ధీశ్చ హృద్యాః
నాకాంక్ష త్యేత దాస్తాం స్వయ మనుపతితే మోక్షసౌఖ్యే ఽ ప్యనీహః. 4

నానాశాచ్యుతి భక్తిఁ దృప్తిఁ దిరుగన్ నానాశలున్ సౌఖ్య రూ
పానన్ దోపగ వాశ్చరంబులకు సర్వమ్మమ్మయమ్మట్టు, లా
హా! నాకమ్మును బ్రహ్మలోకమును హృద్యమ్మైన యోగైశ్వర
మ్మే నాసింపఁడదుండనీ, వలచి రానీ ముక్తి యాశింపఁడున్.

నీ భక్తిచే సంతృప్తుడై ఆశలనెల్ల వీడి సుఖముగ స్వేచ్ఛాసంచారియై యుండువానికి సర్వాశలు (సర్వదిక్కులు) సుఖమయము లగును. అనగా అతడనుభవించు విషయములెల్ల సుఖాత్మకములగునని భావము. ఒక పెద్ద మడుగులో చొచ్చినవానికి అనగా అందున్న చేపలు మొదలైనవానికి అన్నిదిశలును జలమయములై తోచినట్లు, నీ భక్త్యానందములో మునిగినభక్తున కెటువోయి చూచినను సుఖమయమే యగునని భావము. అట్టి నీ భక్తుడు ఇంద్రలోకమును బ్రహ్మలోకమును మనోహరములైన యోగసిద్ధులను ఉపాసనాఫలభూతములైన పరకాయప్రవేశ అణిమాద్యష్టైశ్వర్య దూరశ్రవణదర్శనాదులను గోరడు. అవి స్వయముగ తనను వరించినను వానిందగుల్కొనడు. మోక్షసుఖమందు కూడ నిరాగ్రహుడు (కోరికలేనివాడు) అగును.

తద్భక్తో బాధ్యమానోఽపి చ విషయరసై రింద్రియాశాంతిహేతో
ర్భక్త్యైవాక్రమ్యమాణైః పునరపిఖలు దుర్బలై ర్నాభిజయ్యః
సప్తార్చి ర్దీపితార్చి ర్దహతి కిల యథా భూరిదారుప్రపంచం
త్వద్భక్త్యోఘే తథైవ ప్రదహతి దురితం దుర్మదః క్వేంద్రియాణామ్. 5

నీభక్తుం డవశీకృతేంద్రియుఁడునై నీభక్తి పై చేయిగా
నే భోగమ్ములకున్ వశంవదుఁడు గానేకాఁడు పాపమ్ములన్
నీ భక్త్యోఘము వహ్ని కట్టెలటులన్ దీపించి కాల్పంగ నిం
కేభంగిన్ బొడసూపు రూపుసెడి పోవే యింద్రియౌద్ధత్యముల్.

నీ భక్తుడు ఇంద్రియవశ్యము లేనందున విషయానందములచే నాకర్షింపబడియు వానికిలొంగడు. కారణము భక్తి బలమై అవి దుర్బలము లగుటయే. లెస్సగ రగుల్కొనిన యగ్ని దారుసంచయమును దహింపగలదు. ఆ విధముగా భక్తితేజః ప్రవాహము పాపమును దహింపజేయగా, యింద్రియములపొగరు మఱియెక్కడిది? భక్తి కెదురీదుశక్తి యింద్రియములకు లేనందున భక్తిచే పాపములు సమూలము గూలిపోవునని భావము.

చిత్తార్ద్రీభావ ముచ్చై ర్వపుషిచ పులకం హర్షబాష్పంచ హిత్వా
చిత్తం శుధ్యేత్ కథం వా కిము బహుతపసా విద్యయా వీతభక్తేః,
త్వద్గాథాస్వాద సిద్ధాంజన సతత మరీమృజ్యమానోఽయ మాత్మా
చక్షుర్వ త్తత్త్వసూక్ష్మం భజతి న తు తథాభ్యస్తయా తర్కకోట్యా. 6

ఆనందాశ్రువులున్ ద్రవద్హృదయ రోమాంచాదులున్ లేక చి
త్తానన్ శుద్ధి యెటౌఁ దపస్సులును విద్యాబుద్ధులున్ భక్తి లే
దేనిన్ వ్యర్థము; త్వ త్కథాంజన మరీమృష్టంబయై యీ మనం
బానున్ గన్నటు తత్త్వసూక్ష్మ మటు కాదభ్యస్తతర్కాదులన్.

చిత్తమునందు తడి, మేన పులకలు, కన్నులం దానంద బాష్పములు, లేక చిత్తము శుద్ధ మెట్లగును? ఉగ్రతపస్సు సమగ్రవిద్యలు భక్తిలేని వానికి వ్యర్థములు, నీకథాగాన శ్రవణ మననాదిరూపమైన రుచియొక్క అనుభవముచే సిద్ధాంజనముచే విమలమైన కన్నువలె మనస్సు తత్త్వసూక్ష్మమును అనగా

పరతత్త్వమును గాంచును. చిరకాల మలవాటు పడిన తర్కకోటిచే (యుక్తిసమూహముచే) నట్లుకాంచలేదు. భక్తియొక్క అవాంతరవ్యాపారమే జ్ఞానము కావున దానికొఱకు ప్రత్యేక ప్రయాస పాటు వ్యర్థమనియు భావము.

**ధ్యానం తే శిలయేయం సమతనుసుఖబద్ధాసనో నాసికాగ్ర**
**న్యస్తాక్షః పూరకాద్యై ర్జితపవనపథ శ్చిత్తపద్మం త్వవాంచమ్**
**ఊర్ధ్వాగ్రం భావయిత్వా రవి విధు శిఖిన స్సంవిచిం త్యోపరిష్టా**
**త్తత్రస్థం భావయే త్వాం సజలజలధరశ్యామలం కోమలాంగమ్.** 7

**మొనసి సుఖాసనమ్మునను ముక్కుకొనన్ నెఱి చూపునిల్పి లో**
**ననిలము పూర కాది విధినారసి శోధనచేసి చిత్తమన్**
**వనజము క్రింది కాడ మఱిపైనిగ నెంచి రవీందువహ్ను ల**
**క్కొనఁదలపోసి నిన్ దలతుఁగోమలు నవ్యపయోదనీలునిన్**

ఇంతవఱకు భక్తిసాధనముగా చిత్తశుద్ధి దెలిపి, పరిశుద్ధమైన చిత్తము ధ్యానయోగ్యమని యిప్పుడు చెప్పుచున్నారు. శరీరము తల మెడ సమరేఖలో నుంచి, తనకు సుఖమైన యాసన మలవఱచుకొని, నాసికాగ్రమున చూపునిలిపి, పూరక రేచక కుంభక రూప ప్రాణాయామ భేదములచే వాయుపథమును (వాయు సంచలనమార్గమైన నాడీవివరమును) కఫాదిదోష రహితముగ శోధించుకొని, హృదయకమలము నధోముఖముగను నూర్ధ్వనాళముగ భావించి, దాని దుద్దునందు క్రమముగ ఉత్తరోత్తరముగ (మీదమీదగ నున్నట్లు) రవి చంద్రాగ్నులను ధ్యానించి యామీద వహ్నిమధ్యమున సజలజలధర శ్యామలమూర్తిగను కోమలాంగునిగ నిన్ను భావించెదను.

**ఆనీలశ్లక్ష్ణకేశం జ్వలితమకరసత్కుండలం మందహాస**
**స్యందార్ద్రం కౌస్తుభశ్రీపరిగతవనమాలోరుహారాభిరామమ్,**
**శ్రీవత్సాంకం సుబాహుం మృదులసదుదరం కాంచనచ్ఛాయచేలం**
**చారుస్నిగ్ధోరు మంభోరుహలలితపదం భావయేఽ హం భవంతమ్.** 8

**అలినీలాలక కేశపాశుని, మణివ్యాలోల నక్రాంక కుం**
**డలు,మంద స్మిత సుందరాననను, నఖండ స్ఫూర్తి మత్కౌస్తుభో**

జ్వాలు, దీవ్యద్వనమాలికాభరణు, శ్రీవత్సాంకు, బీతాంబరున్,
విలసత్ స్నిగ్ధమృదూరుపాదజలదున్ విష్ణున్ దలంతు న్నినున్

తుమ్మెదలట్లు నలుపుగొని నిగనిగలాడు నెఱికురులు, తళతళలాడు మకర కుండలములు మెఱయు మధుర మందహాసము కౌస్తుభమణి పరికలిత వనమాలా సముదారగారాభిరామము, శ్రీవత్సాంకము, దీర్ఘబాహుపరిలసితము, మృదులోదరము, కాంచనచేలము, స్నిగ్ధోరులసితము, అరుణ కమల రమణీయ చరణమునై భాసించు నీ రూపమును ధ్యానింతును.

సర్వాంగే ష్వంగ రంగత్కుతుక మితి ముహు ర్ధారయ న్నీశ చిత్తం
తత్రా ప్యేకత్ర యుంజే వదన సరసిజే సుందరే మందహాసే,
తత్రాలీనం తు చేతః పరమసుఖచిదద్వై తరూపే వితన్వ
న్నన్యన్నో చింతయేయం ముహురితి సముపారూఢయోగో భవేయమ్. 9

మనసుం గూర్చి సమగ్రమూర్తి నటుపై మందస్మితమ్మొప్పు మో
మున నయ్యొక్కెడ నిల్పి లీనత గనన్ బూనింతు సచ్చిత్సుఖ
ప్రణుతాద్వైత పదార్థమం దనుగత బ్రహ్మాత్మభావాన నే
ర్పున నన్య మ్మెది యెంచకుండెద సమా రూఢాత్మయోగస్థితిన్.

మనసును వేడుకగొన నీసర్వాంగములందు నిలువరించుచు నందులో మొదట చిఱునవ్వుగులుకు నీ ముఖకమలమందు నిలువబెట్టెదను. అది అక్కడ నిలుకడ నందెనేని యామీద కేవల సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మమందనుసంధింతును. అపుడు చిత్తమేకాగ్రతనంది సంకల్ప వికల్పము లాగిపోయినంతనే మరి యేచింతనలేమిని కేవల బ్రహ్మానుసంధాన మందారూఢస్థితినందుకొందును.

ఇత్థం త్వ ద్ధ్యానయోగే సతి పునరణిమా ద్యష్టసంసిద్ధయ స్తా
దూరశ్రుత్యాదఽయో పి హ్యహమహమికయా సంపతేయు ర్మురారే,
త్వ త్సంప్రాప్తౌ విలంబావహ మఖిల మిదం నాద్రియే కామయే ఽహం
త్వామే వానందపూర్ణం పవనపురపతే పాహి మాం సర్వతాపాత్. 10

ఇటు నీ ధ్యానసమాధిసిద్ధి యగునే నేమేమటంచు దమం
తట నయ్యోగ విభూతు లెల్ల వలచున్ ద్వత్ప్రాప్తి కభ్యంతర

**మ్మటులౌ నా; కవి కోరఁగీ గోరెదను బ్రహ్మానంద సంపూర్ణు నిన్**
**బటుతాప మ్మెడఁబాపి యేలర ననున్ వాతాలయాధీశ్వరా!**

ఇట్టి ధ్యానయోగసిద్ధి నందినవెంటనే సత్త్వగుణాతిశయమువలన నేర్పడు అణిమాదిసిద్ధులు (అష్టైశ్వర్యములు) వానితోబాటు దూరశ్రవణ దూరదర్శన త్రికాల జ్ఞానాది క్షుద్రశక్తులు తమంత వలచును. అట్లు వలచినను వానిం గైకొనక బ్రహ్మానందపూర్ణుని నిన్నే కోరెదను. స్వామీ! అణిమాద్యైశ్వర్య మోహములో నన్ను బడనీక రక్షింపుము.

# 96వ దశకము

# భగవద్విభూతి

## కర్మజ్ఞాన భక్తి మార్గాధికారులు-చిత్తోపశమప్రార్థన

త్వం హి బ్రహ్మైవ సాక్షాత్ పర మురుమహిమ న్నక్షరాణా మకార
స్తారో మంత్రేషు రాజ్ఞాం మను రపి మునిషు త్వం భృగు ర్నారదోఽపి,
ప్రహ్లాదో దానవానాం పశుషు చ సురభిః పక్షిణాం వైనతేయో
నాగానా మ స్యనంతః సురసరిదపి చ స్రోతసాం విశ్వమూర్తే. 1

ఒనరన్ బ్రహ్మ మకార మక్షరములం, దోంకారమున్ మంత్ర భా
వన, మౌనీంద్రుల నారదుండు భృగుడున్, బ్రహ్లాదుఁడా దైత్యులన్
మనువున్ రాజులఁ బక్షులన్ గరుడుఁడుంగా గంగనా నేఱులం
దున, స్వర్ధేనువ పౌదువున్ బసి, ననంతుండౌదు వన్నాగులన్.

ఇంతకుమున్ను జెప్పిన ధ్యానయోగము సిద్ధించుటకు విశ్వమూర్తియైన ఈశ్వరు నుపాసించుట కనువుగ భగవద్విభూతి యీ దశకమందు వర్ణింపబడు చున్నది. ఓ విశ్వేశ్వర! నీవు పరబ్రహ్మము అక్షరములం దకారము, మంత్రములం దోంకారము, రాజులందు మనువు, మునులలో నారదుడు, భృగువును,

దానవులలో బ్రహ్లాదుడు, పక్షులందు గరుడుడును, పశువులందు కామధేనువు, సర్పములం దనంతుడు, నదులలో గంగయు నీవే.

బ్రహ్మణ్యానాం బలి స్త్వం క్రతుషు చ జపయజ్ఞోఽపి వీరేషు పార్థో
భక్తానా ముద్ధవ స్త్వం బల మసి బలినాం ధామ తేజస్వినాం త్వమ్,
నాస్త్యంత స్త్వద్విభూతే ర్వికసదతిశయం వస్తు సర్వం త్వమేవ
త్వం జీవ స్త్వం ప్రధానం యదిహ భవదృతే తన్న కించి త్ర్పపంచే. 2

బలి బ్రహ్మణ్యుల, యజ్ఞకోటి జపమున్, బార్థుండు వీరాగ్ర్యులన్,
బలమౌ దా బలవంతులందు, వెలుఁగై భాసింతు తేజస్వులం
దల భక్తావళి నుద్ధవుం డవును, లే దన్యమ్ము నీకంటె నె
వ్వలనన్, జీవుఁడునున్ బ్రధానమును సర్వమ్మీవ విశ్వమ్ము నన్.

బ్రాహ్మజ్ఞానులలో బలివి, యజ్ఞములలో జపము, వీరులలో అర్జునుడు బలశాలురలో బలము, తేజస్సంపన్నులలో తేజస్సు, భక్తులలో ఉద్ధవుడును నీవు. అనంతవిభూతివగు నీకంటె మఱియొకటి లేనేలేదు. జీవుడు ప్రధానము (ప్రకృతి) సర్వ ప్రపంచము నీవే.

ధర్మం వర్ణాశ్రమాణాం శ్రుతిపథ విహితం త్వత్పరత్వేన భక్త్యా
కుర్వంతోఽంతర్విరాగే వికసతి శనకై స్సంత్యజంతో లభంతే,
సత్తాస్ఫూర్తి ప్రియత్వాత్మక మఖిల పదార్థేషు భిన్నే ష్వభిన్నం
నిర్మూలం విశ్వమూలం పరమ మహమితి త్వద్విబోధం విశుద్ధమ్. 3

శ్రుతి పేర్కొన్న స్వధర్మము న్నెఱపి యాశున్ భక్తి నిన్నెంచి య
చ్యుత మద్దాన విరక్తిఁ ద్యాగధనులై శోధించి సచ్చిత్సుఖై
కత భిన్నార్థములం దభేదతనువై కార్యానుమేయ స్వభా
వత దీపించుటఁ గాంతు రచ్చము భవద్బ్రహ్మాత్మక జ్ఞానమున్.

మానవుడు వర్ణాశ్రమ విహిత ధర్మమును వేదోక్తమైనదానిని భక్తితో నీకు సమర్పణముగా జేయుచు నున్నంతట విరాగ ముదయించును. దానిచే మెల్లగా త్యాగియై పరమహంసయై అచ్చమైన (విషయాకారశూన్యమైన) "అస్తి భాతి ప్రియం" ఉనికి జ్ఞానము ఆనందము లక్షణముగా గల నీ స్వరూపము

నందును. నీ స్వరూపముయొక్క తటస్థ లక్షణము జగజ్జన్మాదికారణత్వము. కావున నీచే సృష్టింపబడిన యా యా భిన్నవస్తువులందు (కార్యములందు) కారణరూపముగా నొక్కడైయుండి తనకు మఱియొక కారణము లేనికతన నిత్యమునై యున్న పునరావృత్తిరహిత బ్రహ్మత్వసిద్ధి నందునన్నమాట.

జ్ఞానం కర్మాపి భక్తి స్త్రితయ మిహ భవత్ప్రాపకం తత్ర తావ
న్నిర్విణ్ణానా మశేషే విషయ ఇహ భవేత్ జ్ఞానయోగేఽధికారః,
సక్తానాం కర్మయోగ స్త్వయి హి వినిహితో యే తు నాత్యంత సక్తా
నా ప్యత్యంతం విరక్తా స్త్వయి చ ధృతరసా భక్తియోగో హ్యమీషామ్. 4

జ్ఞానమ్మున్ మఱి కర్మభక్తులు భవత్సంప్రాప్తికిన్ మూలముల్;
జ్ఞానమ్మం దధికారు లెందు విషయేచ్ఛాశూన్యు; లాసక్తులై
రో నిన్నర్పిన కర్మయోగమున కర్హుల్, నాతి సంసక్తులా
హా! నాత్యంత విరక్తు లర్హులు భవద్వ్యాసక్తు లాభక్తికిన్.

జ్ఞానము కర్మ భక్తి అనునవి నిన్ను బొందుటకు సాధనములు. అందు జ్ఞానమున కధికారులు నిర్వేదమునందినవారు. అనగా ఇహాముత్ర ఫలభోగములు కోరనివారు. స్వర్గాదిభోగాసక్తులు కర్మాధికారులు. అత్యంత విరాగులు అత్యంతరాగము లేనివారు-మధ్యములు నీయందు అనగా నీ కథాశ్రవణాదులందు వేడుకగలవారు. భక్తిభూమిక కధికారులు.

జ్ఞానం త్వద్భక్త తాం వా లఘు సుకృతవశా న్మర్త్యలోకే లభంతే
తస్మా త్తత్రైవ జన్మ స్పృహయతి భగవన్ నాకగో నారకోవా
ఆవిష్టం మాంతు దైవా ద్భవజలనిధిపోతాయితే మర్త్యదేహే
త్వం కృత్వా కర్ణధారం గురు మనుగుణవాతాయిత స్తారయేథాః. 5

అనువౌ జ్ఞానము భక్తి యే నిల ననాయాసాన, నర్థింతు రిం
దున స్వర్గస్థులు నారకుల్జననమున్, దుఃఖాబ్ధిపోతమ్ము నా
కెనసెన్ జన్మము దైవిక మ్మిచట, నీవే వాటమౌగాలి యై
నను నావన్ గురు నావికున్ జలిపి కృష్ణా! యొడ్డు బట్టింపవే.

జ్ఞానము భక్తియు భూలోకమందు సులభముగా పుణ్యఫలమై ఫలించును. అందుచేత దేవతలు నరకవాసులు కూడ భూలోకమందు జన్మింపవలెనని

కోరుచుందురు. నాకు దైవికముగా నిక్కడ మానవజన్మ వచ్చినది. కావున నీవు అనుకూల వాయువవై వీచి గురువును చుక్కాని కాచువానినిగా నొనరించి యీ సంసారసముద్రములో నూగిపోవుచున్న నౌకనయియున్న నన్నొక యొడ్డునకు (మోక్షమునకు) జేర్పుము.

**అవ్యక్తం మార్గయంత శ్శ్రుతిభిరపి నయైః కేవలజ్ఞానలుబ్ధాః**
**క్లిశ్యంతే ఽతీవ సిద్ధిం బహుతరజనుషా మంత ఏ వాప్నువంతి,**
**దూరస్థః కర్మయోగో ఽపిచ పరమఫలే నన్వయం భక్తియోగ**
**స్త్వామూలాదేవ హృద్య స్త్వరిత మయి భవత్ప్రాపకో వర్ధతాం మే. 6**

**అరయన్ గేవల బోధలుబ్ధులు శ్రుతి వ్యాసక్తి న్యాయోక్తులన్**
**బరమ క్లేశత నెన్నొ జన్మములకున్ గన్గొందు రవ్యక్తమున్**
**పరతంత్ర మ్మిట కర్మమేనియును; ఆస్వాద్యమ్ము ఆమూలమున్**
**హరి! త్వత్ప్రాపకమైన భక్తి యది నా కంతంతఁ బెంపొందుతన్.**

కేవల జ్ఞానలుబ్ధులు ఉపనిషత్తులచే న్యాయమీమాంసాదిశాస్త్రయుక్తులచే అవ్యక్తబ్రహ్మమును వెదకుచు మిగుల క్లేశపడి అనేక జన్మముల కీడేరుదురు. ఇక కర్మయోగ మన్ననో పరమపురుషార్థమునకు చాల దూరమందున్నది. అనగా కాలాంతరమందు ఫలించును. పితృలోక సత్యలోకాదులచే మిక్కిలి యెడమైన దన్నమాట. ఆమూల మధురమైయున్నది భక్తియోగమొక్కటే. భగవంతుడవగు భవత్ప్రాప్తికి నాకు సాధనము గావున అది నాలో నభివృద్ధి నందునుగాక.

**జ్ఞానాయైవాతియత్నం ముని రపవదతే బ్రహ్మతత్వంతు శృణ్వన్**
**గాఢం త్వత్పాద భక్తిం శరణమయతి యస్తస్య ముక్తిః కరాగ్రే,**
**త్వద్ధ్యానే ఽపీహ తుల్యా పున రసుకరతా చిత్త చాంచల్యహేతో**
**రభ్యాసా దాశు శక్యం తదపి వశయితుం త్వత్కృపాచారుతాభ్యామ్. 7**

**జ్ఞానార్థమ్మతియత్నమున్ వలదనెన్ వ్యాసర్షి వేదాంత వా**
**క్యానం బ్రహ్మము వించు భక్తి గొలువన్ నీ పాదముల్ ముక్తి హ**
**స్తానం జిక్కును,చిత్త మట్టిటు సనన్ ధ్యాన మ్మసాధ్యమ్ము, స్వా**
**ధీ నమ్మౌ నది నీ కృపాప్తిని భవ ద్దేదీప్యమౌ నాకృతిన్.**

వేదవ్యాసులవారు జ్ఞానము కొఱకు బహుయత్నమును అనేక గ్రంథాభ్యాస రూపమైన కృషిని పురాణాదులందు వారించినారు. బ్రహ్మతత్త్వ సిద్ధాంతసారమును మాత్ర మాలించుచు నీ పాదభక్తిని గాఢముగ నమ్మేనేని ముక్తి కరతలామలకము. అనగా జీవించియుండియే ముక్తుడగును. (జీవన్ముక్తుడగును) ధ్యానము కూడ చిత్తచాంచల్యముచే నంత సుకరము కాదు కాని అది నీ దివ్యసుందరమూర్తిని లక్షించి విడువక అభ్యసించిన యెడల శక్యముగాగలదు.

నిర్విణ్ణః కర్మమార్గే ఖలు విషమతమే త్వత్కథాదౌ చ గాఢం
జాతశ్రద్ధోఽపి కామా నయి భువనపతే నైవ శక్నోమి హాతుమ్,
తద్భూయో నిశ్చయేన త్వయి విహితమనా దోషబుధ్యా భజం స్తాన్
పుష్ణీయాం భక్తి మేవ త్వయి హృదయగతే మంక్షు నక్ష్యంతి సంగాః. 8

అతి విషమమ్ము కర్మపథ మందు విరక్తివహించి త్వత్కథా
రతి గొనియేని కోరికల రక్తి తలంగక వానితోడి సం
గతి విషమంచు లోఁదెలిసి గట్టిగ నీ చరణారవింద సం
స్మృతి దృఢభక్తినిష్ఠ చరియింతును సక్తి దొలంగి యెందునున్.

కర్మమార్గము బహువిషమము, కష్టతరమైనది. దానివలన గల్గు స్వర్గాది భోగములందు విరక్తుడై నీ కథలయందు రక్తుడై కూడ పుత్రమిత్రకళత్రాదులను వీడలేకయే యుండును. స్వామి! నేను మనస్సున గట్టిగా నిన్నుజేర్చి ఆయా విషయములను దోషబుద్ధితోనే యనుభవించుచు భక్తిని పెంపొందించుకొనెదను. హృదయంగమమూర్తివి నీవు హృదయమందున్నచో విషయముల కక్కడ తావు దొరకదు. వానంతటఁ యవే మఱొకదారి చూచుకొనును.

కశ్చి త్క్లేశార్జితార్థక్షయవిమలమతి ర్నుద్యమానో జనౌఘైః
ప్రాగేవం ప్రాహ విప్రోన ఖలు మమ జనాః కాలకర్మగ్రహా వా,
చేతో మే దుఃఖహేతు స్తదిహ గుణగణం భావయేత్ సర్వకారీ
త్యుక్త్వా శాంతో గత స్త్వాం మమ చ కురు విభో తాదృశం చిత్తశాంతిమ్. 9

మును విప్రుం డొకరుండు స్వార్జితధనమ్ముల్ వోయి వైరాగ్యముల్
గని లో దుర్జనపీడలం దెలివిరాగాఁ గాల కర్మ గ్రహా

ది నికాయమ్ము నుగాద్రు గాదితర మాధిం గూర్చు నాచిత్తమే
యని శాంతిన్ నినుగొల్చి పొందెనట నాకా శాంతి నీయంగదే.

నానాశ్రమలు పడి యార్జించిన ధనము చోరాదివశమైపోగా నేడ్చి తుదకు విరక్తిజెంది యిలువిడిపోవుచుగూడ పీడనొంది, నా పీడకు కారణ మీ జన్మమా! కాదు కాదు. ఇదియు నేను నొక్కటే పదార్థము. కాలమా కాదు. అది ఈశ్వర రూపము. ఆ యీశ్వరుడు నేను నొక్కటే కావున నన్ను నేను బాధపెట్టుకొనుట యుండదు గదా! పోనిమ్ము కర్మ మందునా? అది యచేతనము. అచేతనమైన దేహమునకు చేతనమైన ఆత్మకు నడుమ క్రియాతంత్ర మెట్లు? గ్రహములా? కాదు. జన్మసమయముంబట్టి ద్వాదశాష్టమాది రాసులయందున్న గ్రహముల వలన జన్మము (పుట్టుక) గల దేహమునకే పీడగాని ఆత్మకది సంఘటింపదు. ఇదేమియు గాదు. ఆత్మగా (నేనుగాక అభిమానితమగు చేతమే (చిత్తమే) దుఃఖహేతువు. అది ఆత్మయందు కర్తృత్వ భోక్తృత్వాదులను ఆరోపించినదై సుర నర నారక శరీర భోగ్య భోగస్థానాది సర్వము చేయుచున్నది. అని నిశ్చయించి శాంతుడై నిన్ను బొందెను (ముక్తుడయ్యెను) నాకును అట్టి చిత్తశాంతి దయసేయుము.

"పరస్య సంసృతి శ్చిత్త్వా దచిత్త్వా న్మనసోఽపి న
మనోఽభిమానిన శ్చిత్త్వా దచిత్త్వాచ్చ పరస్య సా॥"

కేవల చిత్తు కనుక పరమాత్మకు సంసారము లేదు. అచిత్తు (జడము) కనుక మనస్సునకును లేదు. మనోభిమానియైన పరమాత్మ అనగా జీవుడు చిత్తు-అచిత్తు కనుక ఆ సంసారము జీవునది మాత్రమే అని సిద్ధాంతము.

ఐలః ప్రాగుర్వశీం ప్రత్యతివివశమనాః సేవమాన శ్చిరం తాం
గాఢం నిర్విద్య భూయో యువతి సుఖమిదం క్షుద్రమే వేతి గాయన్,
త్వద్భక్తిం ప్రాప్య పూర్ణ స్సుఖతర మచరత్త్వదుద్ధూతసంగం
భక్తోత్తంసం క్రియా మాం పవనపురపతే హంత మే రుంధి రోగాన్. 10

ఐలుం డూర్వశిజూచి మున్ వివశుడై యాసక్తి బెక్కేడు లా
పై లక్షించి విరక్తిలీ దుచ్ఛసుఖమున్ వర్జించి, నీ భక్తి దా
నాలంబించి సుఖాన నుండెనట, నాయం బెల్లనునన్ ద్రోచి భ
క్తాళిన్ మౌళి నొనర్చు వాయుపరదేవా! తూల్చు నా బాధలన్.

మున్ను ఐలుడు (పురూరవుడు) తన్ను వలచివచ్చిన యూర్వశియెడ వివశుడై పెక్కేండ్లు వర్తించి ప్రతిజ్ఞాభంగము చేసినాడని లేచిపోయినదానికై యజ్ఞములుచేసి తిరిగి రప్పించికొని యనుభవించి, చిట్టచివరకు ఏ భక్తివడసి సుఖముగా (శాంతుడై) యుండెను. ఓ గురుపవనపురనాథ! నా రోగములు విదళించి నన్ను భక్తోత్తంసుం గావింపుము.

# 97వ దశకము

# ఉత్తమభక్తిప్రార్థన, మార్కండేయోపాఖ్యానము పరమేశ్వర ప్రసాదము

త్రైగుణ్యా ద్భిన్నరూపం భవతి హి బువనే హీనమధ్యోత్తమం యత్
జ్ఞానం శ్రద్ధా చ క ర్తా వసతి రపి సుఖం కర్మచాహారభేదాః,
త్వత్క్షేత్ర త్వన్నిషేవాది తు యదిహ పున స్త్వత్పరం తత్తు సర్వం
ప్రాహు ర్నైర్గుణ్యనిష్ఠం తదను భజనతో మంక్షు సిద్ధో భవేయమ్. 1

జ్ఞాన శ్రద్ధలు కర్తయున్ వసతియున్ సౌఖ్యమ్ము నాహార క
ర్మానీక మ్మది భిన్నరూపమగుఁ ద్రైగుణ్యమ్మునన్ హీన మ
ధ్యానూనమ్ముగఁ ద్వత్పరమ్ము భవదీయ క్షేత్రసేవాదిక
మ్మౌనా నిర్గుణనిష్ఠ యట్టి పని సిద్ధాత్ముండ నే నయ్యెదన్.

ఈలోకమందు జ్ఞానాదులు త్రిగుణమలంబట్టి ఉత్తమ మద్యమాధమభేదము గల్గియుండును. అందు సర్వభూతములందును ఆత్మయొక్కటి యను జ్ఞాన ముత్తమము. భిన్నము అనునది రాజసము. బాలోన్మత్తాదులందలి తెలివి తామసము. శ్రద్ధ ఆధ్యాత్మిక విషయము ధర్మవిషయము అధర్మవిషయమునుంగా కర్త వైరాగ్యము-రాగము అజ్ఞాన నిమిత్తముగా, వసతి (నివాసము) వనము గ్రామము ద్యూతాదిగృహముగా, కర్మము ఈశ్వరార్పితము కామ్యము నిషిద్ధము ననురీతిని, సుఖము ఆత్మానందము విషయసుఖము నిద్రాది సుఖముగ, ఆహారము శుచి సాత్త్విక రాజస తామసరూపముగను మూడు రకములయి యుండును. నీక్షేత్రములను నిన్ను సేవించుట మొదలగు నిన్ను గూర్చిచేసిన

సేవయెల్ల నిర్గుణ నిష్ఠమని పెద్దలందురు. ఆవిధమైన భగవత్సేవచే వెంటనే సిద్ధుడను (ముక్తుడను) అయ్యెదను.

**త్వయ్యేవ న్యస్త చిత్త స్సుఖ మయి విచరన్ సర్వచేష్టా స్త్వదర్థం**
**త్వద్భక్త్యై సేవ్యమానా నపి చరితచరా నాశ్రయన్ పుణ్యదేశాన్,**
**దస్యౌ విప్రే మృగాదిష్వపి చ సమమతి ర్ముచ్యమానావమాన**
**స్పర్ధాసూయాదిదోష స్సతత మఖిలభూతేషు సంపూజయే త్వామ్. 2**

**మనమున్ నిన్నునె చేర్చి, యెల్ల పనులన్ బాటించి నీకై, భవ**
**జ్జనముల్ వర్తిలు పుణ్యదేశముల హర్షస్ఫూర్తి వర్తించుచున్,**
**గని దొంగన్ దొర విప్రు జంతు వొక రేఖన్, వీడి వైర మ్మసూ**
**యను, మాన మ్మవమానముం దలఁగి, ని న్నర్చింతు భూతమ్ములన్.**

నీయందు మనస్సునిల్పి నీకు సమర్పణముగా కర్మము లాచరించి నీ భక్తులు చరించు క్షేత్రములం దానందముతో వర్తించుచు దొంగ దొర విప్రుడు జంతువును నొకరీతి భావించుచు వైరము అసూయ మానము అవమానము వీడి నిన్ను సర్వభూతములందంతర్యామివై యున్నావని యెఱింగి యారాధింతుము.

**త్వద్భావో యావదేషు స్ఫురతి న విశదం తావ దేవం హ్యుపాస్తిం**
**కుర్వ న్నైకాత్మ్యబోధే ఝటితి వికసతి త్వన్మయేఽహం చరేయమ్**
**త్వద్ధర్మస్యాఽస్య తావత్ కిమపి నభగవన్ ప్రస్తుతస్య ప్రణాశ**
**స్తస్మాత్ సర్వాత్మనైవ ప్రదిశ మమ విభో భక్తి మార్గం మనోజ్ఞమ్. 3**

**నీవై యీ సకలమ్ము దోఁచువరకున్ నిన్గొల్చి, యా యైక్యతా**
**భావోన్మేష మదైన వెంటనె భవద్భావుండనై యుండెదన్;**
**నీవెంటన్ మొదలైన ధర్మమున కెందే నాశమే లేదు నీ**
**పై వాల్లభ్యము భక్తి యోగమిది దేవా! యిమ్ము నా కెవ్విధిన్.**

సర్వభూతాంతర్యామివై యున్నావని దృఢముగా దోచువరకు నిన్ను సేవించి నీ యేకత్వ స్ఫురణ అయినవెంటనే నీవే నేనయి యుండెదను. భగవద్విషయమైన (భాగవతమైన) ఈ ధర్మమున కెన్నటికిని నాశములేదు.

మొదటి నుండి చివరదాక యది వైకల్యమందదు. కావున అనుష్ఠానాది సౌలభ్యముగల నీపై ప్రేమరూపమైన భక్తియోగమునే నా కనుగ్రహింపుము.

**తం చైనం భక్తియోగం ద్రఢయితు మయి మె సాధ్య మారోగ్య మాయు**
**ర్దిష్ట్యా తత్రాపి సేవ్యం తవ చరణ మహో భేషజాయేవ దుగ్ధమ్,**
**మార్కండేయో హి పూర్వం గణక నిగదిత ద్వాదశాబ్దాయు రుచ్చై**
**స్సేవిత్వా వత్సరం త్వాం తవ భటనివహై ర్ద్రావయామాస మృత్యుమ్. 4**

**ఆరోగ్యమ్మును నాయువున్ వలయునయ్యా! భక్తి దార్ఢ్యార్థ, మం**
**దారాధ్యమ్ము భవత్పదంబ యగు పా లట్లౌషధార్థంబు; దు**
**ర్వార మ్మల్పమటన్న యాయువున మార్కండేయుఁ డర్చించి ని**
**న్నౌరా! నీ భటకోటిచేఁ దరిమెఁగాదా! మృత్యు వబ్దమ్మునన్.**

ఆ భక్తియోగము దృఢపడుటకే ఆయుర్దాయము ఆరోగ్యము కూడ కావలసియున్నవి ఆ యోగమందు ఔషధసేవనమం దనుపానముగా పాలువలె నీ చరణారవింద మారాధ్యము గావలయును సాధ్యమేకాక యీసాధనముకూడ సుఖరూపమయినందున నేను కృతార్థుడ నయ్యెదను మార్కండేయుడు తొలుత జ్యోతిషికులు పండ్రెండేండ్లాయుర్దాయమని చెప్పినను ఒక్కయేడు తీవ్రభక్తిచే నిన్నర్చించి తనపైకి వచ్చిన మృత్యువును నీ భటులచే బారగొట్టించెను గదా!

## ద్వాదశస్కంధ కథారంభము

**మార్కండేయ శ్చిరాయు స్స ఖలు పునరపి త్వత్పరః పుష్పభద్రా**
**తీరే నిన్యే తపస్య న్నతుల సుఖరతి ష్షట్తు మన్వంతరాణి,**
**దేవేంద్ర స్సప్తమస్తం సురయువతి మరు న్మన్మథై ర్మోహయిష్యన్**
**యోగోష్మ ప్లుష్యమాణై ర్నతు పున రశక త్త్వజ్జనం నిర్జయే త్కః? 5**

**ఆరంభించెఁ దపమ్ము త్వత్పరుఁడతం డా పుష్పభద్రానదీ**
**తీరానన్, పరసౌఖ్యమొందె మనువుల్ దీరంగ నం దార్గురున్,**
**స్వారాజ్యేశుఁడు మోహపెట్ట నతనిన్, స్వర్వాసినీ ముఖ్య సం**
**భారమ్మున్ దహియించె యోగశిఖి, నెవ్వండోర్చు నీవారలన్!**

మార్కండేయుడు దీర్ఘాయుష్మంతుడు. ఆయన నీయందు తాత్పర్యముగొని హిమాలయము నుత్తరదిశ పుష్పభద్రానదీతీరమందు తపస్సు చేయనారంభించెను. అక్కడనే చిత్రశిలయను రాయి భద్రవటమను మఱ్ఱియు గలవు. ఆయన తపస్సులో ఆర్గురు మనువులు గడచిరి, అనగా డెబ్బది యొక్క మహాయుగములు ఆఱు క్రమించెనన్నమాట. ఆరవ ఇంద్రుడు ఈయన తన స్థానమాక్రమించునని జడిసి అప్సరసలను మలయవాయువును వసంతుని దోడిచ్చి మన్మథునంపెను. ఆయన యోగాగ్నిచే వారందఱిని దహించెను స్వామీ! నీ భక్తుల నెవ్వడోడింపగలడు? దేవేంద్రుడంత వాడు పొరబాటు పడెనుగదా?

**ప్రీత్యా నారాయణాఖ్య స్త్వ మథ నరసఖః ప్రాప్తవా నస్య పార్శ్వం**
**తుష్ట్యా తోష్టూయమాన స్సతు వివిధవరై ర్లోభితో నానుమేనే,**
**ద్రష్టుం మాయాం త్వదీయాం కిల పున రవృణో ద్భక్తితృప్తాంతరాత్మా**
**మాయాదుఃఖానభిజ్ఞ స్తదపి మృగయతే నూన మాశ్చర్యహేతోః. 6**

**అట నారాయణుఁడీవు మున్నరసఖుండై వచ్చి తా చెంత; కు**
**త్కట తుష్టిన్ వినుతించి నీ వరములన్ గాంక్షింప కాతండు, నీ**
**పటుమాయన్ గనఁ గోరె భక్తి సుఖియై; భావింతు మాయావృతో**
**త్కట దుఃఖ మ్మెఱుఁగండు కావలయు నంతన్ గోరె నాశ్చర్యమై.**

మార్కండేయునెడ ప్రీతినొంది నీవు నరునితో నాచోటి కేతెంచితివి ఆయన నిన్ను పెక్కుతీరుల స్తుతించి వరములేమి కావలెయునని నీచే ప్రలోభితుడయ్యు నిన్నేమియుం గాక్షింపడయ్యెను. నీయెడ భక్తియొక్కటియున్న జాలునని తృప్తి నందెను. కాని నీ మాయను జూపింపుమని యర్థించెను. శ్రీహరీ! దుఃఖదాత్రి యగు మాయ నెవ్వరు కోరుదురు? ఆ జన్మము మాయచేగలుగు దుఃఖము చవి చూడనివాడగుటచే దానియెడ వింతపడి కాబోలు నదికూడ ఎట్లుండునో చూడవలెననుకొన్నాడని తోచుచున్నది.

**యాతే త్వయ్యాశు వాతాకులజలదగలత్తోయపూర్ణాతిఘూర్ణత్**
**సప్తార్ణోరాశిమగ్నే జగతి స తు జలే సంభ్రమన్ వర్షకోటీః,**
**దీనః ప్రైక్షిష్ట దూరే వటదలశయనం కంచి దాశ్చర్యబాలం**
**త్వామేవ శ్యామలాంగం పదనసరసిజన్యస్త పాదాంగుళీకమ్. 7**

నీ వేగన్ జలిగాలి వీచి కురిసెన్ నీరంధ్ర గర్జా ఘన
ప్రావృణ్మేఘము లేదు వార్ధు లొకటై వర్తింప వర్షాయుతం;
బా వీథిన్ గనె దీనుఁడై వటదళవ్యాలోలు నాస్యాబ్జ హే
లా విన్యస్త పదాంగుళీకు నొక లీలాబాలు నిన్ శ్యామలున్.

నారాయణుడవీవు బదరికాశ్రమమునకేగగా పెనుగాలివీచి సప్తసముద్రము లొకటియగునట్లు పదివేలేండ్లేకధారగా వర్షము గురిసెను. అపుడు లోకములెల్ల సాగరమున మునిగినవి. మార్కండేయుడు కోట్లసంవత్సరము లామున్నీట తిరుగులాడి దైన్యమొంది మఱ్ఱియాకుపై దూగుచు కాలి బొట్టనవ్రేలు నోట నిడికొని కుడుచుచున్న శ్యామలమూర్తిని లీలాబాలుని నిన్ను జూచెను.

దృష్ట్వా త్వాం హృష్టరోమా త్వరిత ముపగతః స్ప్రష్టుకామో మునీంద్రః
శ్వాసేనాంతర్నివిష్టః పున రిహ సకలం దృష్టవాన్ విశ్వపౌఘమ్
భూయో౽పి శ్వాసవాతై ర్బహిరనుపతితో వీక్షిత స్త్వత్కటాక్షై
ర్మోదా దాశ్లేష్టుకామ స్త్వయి పిహితతనౌ స్వాశ్రయే ప్రాగ్వదాసీత్. 8

కని నిన్ మై పులకింప నేగి దరికిన్, గాంక్షించి మాటాడ బా
లుని శ్వాసానిలకోటిలో మునిఁగి, యా లోనన్ గనెన్ లోకముల్,
గనె నట్లే వెలియ ద్వత్కటాక్షములకున్ గమ్యుండునై పొంగుచున్
నిను దాఁ గౌగిటఁ జేర్పఁబోయి కనకేనిన్, నిల్చె మున్నట్లుగన్.

కని మేను పులకింప దరికేగి యేదో పల్కరింపబోయి యా పాపని యూర్పులలో జొరబారి యాలోన నఖిల భువనములను జూచెను అయూర్పులలో వెలికివచ్చి యట్లే చూచెను. అపుడు నీ కటాక్షము లాయనపై ప్రసరించెను. అద్దాన నీవానందభరితుడవై కౌగలింపబోగా నాయన తన మూర్తిని సంక్షేపించి కొనెను. అంతర్ధానమయ్యెనన్నమాట. మార్కండేయుడు మరలి పుష్పభద్రాతీరమందలి తన యాశ్రమమున నుండెను. మాయ దర్శింప శక్యముగానిది కావున మాయాకార్యమగు వటపత్రశయనరూపముననది నీచేజూపబడినదని భావము.

గౌర్యా సార్ధం తదాగ్రే పురభి దథ గత స్త్వత్ప్రియప్రేక్షణార్థీ
సిద్ధానే వాస్య దత్త్వా స్వయ మయ మజరామృత్యుతాదీన్ గతో౽భూత్,

ఏవం త్వత్సేవయైవ స్మరరిపురపి స ప్రీయతే యేన తస్మా
న్మూర్తిత్రయ్యాత్మక స్త్వం నను సకలనియంతేతి సువ్యక్తమాసీః. 9

గౌరింగూడి తదగ్రమందు వెలసెన్ గౌరీశుఁడున్ ద్వత్కృపా
శ్రీరమ్యుం గని యిచ్చె సిద్ధి యజరామృత్యుత్వ ముఖ్యస్థితిన్;
ఆ రీతిన్ స్మరవైరి ప్రీతుఁడగు నీదౌసేవ, మూర్తిత్రయా
కారుం డీవ నియంత వెల్లరకు, వ్యక్తం బిద్ది యిప్పట్టునన్.

గౌరీపతి గౌరితో నావెంటనే నీ భక్తుని మార్కండేయు దర్శింప నెదుట సాక్షాత్కరించెను. మఱి అజరామరత్వము నంతకుముందే సిద్ధమైన దానినిచ్చెను. నిను సేవించుటచే శివుడును ప్రీతుడయ్యెను నీవు మూర్తిత్రయ స్వరూపుడవు సర్వ నియంతవు సర్వేశ్వరుడవనుమాట దీనిచే దృఢమగుచున్నది.

త్ర్యంశేఽస్మిన్ సత్యలోకే విధి హరి పురభి న్మందిరా ణ్యూర్ధ్వ మూర్ధ్వం
తేభ్యోప్యూర్ధ్వం తు మాయావికృతి విరహితో భాతి వైకుంఠలోకః
తత్ర త్వం కారణాంభ స్యపి పశుపకులే శుద్ధసత్త్వైకరూపీ
సచ్చిద్బ్రహ్మాద్వయాత్మా పవనపురపతే పాహిమాం సర్వరోగాత్. 10

త్ర్యవతారమ్మగు సత్యలోకమున నిట్లా బ్రహ్మ విష్ణ్వీశలో
క విభాగ మ్మొకదానిపై నొకటిగాఁ గన్పట్టు; నా మీఁద నీ
వవభాసింతువు గోకులమ్మునను సత్త్వస్ఫూర్తి వైకుంఠమం
దు విశుద్ధంబగు బ్రహ్మభావమున నన్ గోవింద! ప్రోవంగదే.

సత్యలోకము బ్రహ్మ విష్ణు శివలోకములు మూడును తనలో నిమిడించి కొన్నది అవి యొకదానిపై నొకటిగానున్నవి. అందు వరుసగ బ్రహ్మ విష్ణు శివులుండు మందిరము లున్నవన్నమాట. ఆ యన్నిటిమీద బ్రహ్మాండమునకు వెలుపల మాయావికృతులు మహదహంకారాదులు షోడశవికారములు లేని శుద్ధ సత్త్వమయమైన వైకుంఠమున్నది. అక్కడ కారణోదకము అనబడు అవరణోదకమందును పశుపాలకుల కులమందు నందునింటను శుద్ధ సత్త్వమాత్రమూర్తివై అవరణ లేనందున కేవల సచ్చిదానందబ్రహ్మమై సచ్చిదానందమయ శరీరివై యున్నావు. అందుచే నెల్లరోగములనుండి నన్ను విడివడిజేయుము.

# 98వ దశకము

# నిష్కల బ్రహ్మోపాసనము

**యస్మిన్నేతద్విభాతం యత ఇద మభవ ద్యేనచేదం య ఏత**
**ద్యోఽస్మా దుత్తీర్ణరూపః ఖలు సకల మిదం భాసితం యస్య భాసా,**
**యో వాచాం దూరదూరే పునరపి మనసాం యస్య దేవా మునీంద్రా**
**నో విద్యు స్తత్త్వరూపం కిము పున రపరే కృష్ణ తస్మై నమస్తే. 1**

**ఎందు జనించుఁబెంపు గను నెందులయించు జగమ్ము లెందు సం**
**క్రందన ముఖ్యులున్ సురలుగాని మహామునులేని సత్త్వ మ**
**య్యందము మాటలన్ మనసుచేతను నందగలేని బ్రహ్మ మా**
**నందము నీదు మూర్తికి వినమ్రుఁడనై తలవాంచి మ్రొక్కెదన్.**

పరమాత్మయొక్క నిష్కల బ్రహ్మరూపమును లోగడ నిరూపించి, ఆ రూపమున నీదశకముమందు స్వామిని కవి స్తుతించుచున్నాడు. ఓ కృష్ణా! సచ్చిదానంద స్వరూపుడైన నీకు నమస్కారము. నమస్కారమెందులకు? స్తుతి చాలదా? యనిన దానికి సమాధానము: దేవతలు మునులు సర్వాత్మకమైన పరతత్త్వమును బ్రహ్మ స్వరూపమును తెలియజాలరు. అట్టియెడ నదిమాకు పూర్తిగా దుర్జేయము. లౌకికవైదిక రూపమైన వాక్కులకును మనస్సునకును అందదు. కారణమేమనగా ఏ వస్తువు యొక్క (చిచ్ఛక్తియొక్క) వెలుగుచే నీ సకలజగత్తు భాసించుచున్నదో దేనియం దీజగత్తున్నదో, నిమిత్తోపాదాన కారణమైన దేనినుండి యీ జగత్తు ఆవిర్భవించుచున్నదో, దేన లయించు చున్నదో, అదియే యీశ్వరస్వరూపము, అది జగద్వికార ప్రసక్తిలేక అవిద్యాకల్పితమైన యీ జగత్తుకంటె విలక్షణమైనది. ఆ నీభగవత్తత్త్వము స్తుతి కందునదిగాదు. కావున నీకిదే నమస్కారము.

**జన్మాథోకర్మ నామ స్ఫుటమిహ గుణదోషాధికం వా న యస్మిన్**
**లోకానామూతయే యః స్వయమనుభజతే తాని మాయానుసారీ,**
**బిభ్రచ్ఛక్తీ రరూపోఽపి చ బహుతర రూపోఽవభాత్యద్భుతాత్మా**
**తస్మై కైవల్యధామ్నే పరరసపరిపూర్ణాయ విష్ణో నమస్తే. 2**

పరమార్థమ్మున జన్మ కర్మ గుణ సంపర్కమ్ములేకున్న నే
పరమేశుం డవి మాయచే జగములన్ బాలింప సేవించు, బె
క్కురకా ల్వేయును వేసముల్ వివిధశక్తు ల్బూని, పూర్ణ మ్మఖం
డరస మ్మట్టి భవత్స్వరూపమునకుం దండ్రీ! నమస్కారముల్

భగవత్తత్త్వమందు జన్మము అనగా కృష్ణాద్యవతారములు, కర్మ మనగా కంససంహారాదులు, తన్నిమిత్తములైన గుణదోషములు, పుత్రమిత్రాది భావములు నీకు పరమార్థముగా లేవు. అయినను లోకానుగ్రహముకొఱకు మాయానుసారివై నీకు నీవు (స్వాధీనమాయుడవు కనుక) అంగీకరించుచున్నావు. అరూపుడవయ్యు వివిధ శక్తులను, విద్య అవిద్య జ్ఞానము ఐశ్వర్యము మొదలగు మహిమలను, స్థావరజంగమాత్మక సుర నర పశుపక్ష్యాది రూపములను, పూని వ్యక్తమగు చున్నావు. ఇట్లు ఆశ్చర్యరూపుడవై కైవల్య (మోక్ష) నిధానమై ఆనందరస పరిపూర్ణుడవైయున్న నీకు నమస్కారము.

నో తిర్యంచం న మర్త్యం నచ సుర మసురం నస్త్రియం నో పుమాంసం
న ద్రవ్యం కర్మ జాతిం గుణమపి సదసద్వాపి తే రూప మాహుః,
శిష్టం యత్స్యా న్నిషేధే సతి నిగమశతై ర్లక్షణావృత్తిత స్తత్
కృచ్ఛ్రేణావేద్యమానం పరమసుఖమయం భాతి తస్మై నమస్తే. 3

కాదది పక్షియుం బశువు కాదు సురా సుర మర్త్య మింతియున్
కాదది పుం నపుంసకము కాదొక జాతి గుణమ్ము ద్రవ్యముం
గాదది సత్తసత్తునిది కా దది కాదన వేదరాశి యా
మీదను లక్షణన్ మిగులు మేల్సుఖ మయ్యది నీకు మ్రొక్కెదన్

నీవు యథార్థముగ బరబ్రహ్మస్వరూపుడవు. పశుపక్ష్యాధికము మానవము దైవము రాక్షసము స్త్రీపుం నపుంసకము ద్రవ్యము (విషయము) కర్మ (కర్మేంద్రియములు) జాతి (బ్రాహ్మణత్వాదికము) గుణము జ్ఞానేంద్రియములు సత్తు (అంతఃకరణము) అసత్తు (అవ్యక్తము) మొదలైన వేదియును నీవు కావు. అనగా అపరిచ్ఛిన్నుడవు జడభిన్నమైన చైతన్యమునైయున్నావు. వేదము "ఇది కాదు ఇది కాదు" అని నిషేధింపగా శేషించిన పదార్థము నీవైయున్నావు. అనగా ఉపనిషత్తులు వాచ్యవాచకసంబంధములేని లక్షణావృత్తిచే ప్రతిపాదించు కేవల పరమసుఖస్వరూపమైన వస్తువవై ప్రకాశించుచున్నావు. అట్టికేవల

చిత్ప్రకాశమునకు అహంబ్రహ్మ ఽస్మీతి మహావాక్యమునకు కర్మరూపమున విషయము కాక స్వరూపవస్తువై యున్నావు. అట్టి నీకు నమస్కారము.

**మాయాయాం బింబిత స్త్వం సృజతి మహదహంకార తన్మాత్రభేదై**
**ర్భూతగ్రామేంద్రియాద్యై రపి సకలజగత్స్వప్న సంకల్పకల్పమ్,**
**భూయ స్సంహృత్య సర్వం కమఠ ఇవ పదా న్యాత్మనా కాలశక్త్యా**
**గంభీరే జాయమానే తమసి వితిమిరో భాసి తస్మై నమస్తే.** 4

ఘనమాయన్ బ్రతిబింబమై మహదహంకారాది సంఘాతమున్
గొని స్వప్నాత్మక సృష్టి సేసి లయమున్ రూపింతు వా కాల శ
క్తిని దాఁబేలు నిజాంగముల్ ముడుచురీతిన్ గేవల మ్మై తమ
మ్మున నాపై నతమస్కుఁడై వెలిగె దా పూర్ణాత్మునిన్ మ్రొక్కెదన్.

నీకంటె భిన్నమైయున్న మాయయందు చిచ్ఛక్తిచే మహత్తత్త్వముచే రాజస తామస సాత్త్వికాహంకారములచే శబ్దస్పర్శరూపరసగంధములచే భూతములచే యేకాదశేంద్రియములచే ప్రాణములచే సకలజగత్తులను స్వప్నసంకల్పము వంటిదగు వానిని సృజించుచున్నావు. స్వప్నసంకల్ప మెట్లు వచ్చుచు పోవుచుండువో ప్రపంచము కూడ అట్టిదే. అనగా మిథ్య అని తాత్పర్యము. అవ్వల తాబేలు తన యవయవములను ముడుచుకొనినట్లు కాలశక్తిచే నీవీ సర్వమును నుపసంహరించుకొని గాఢమైన చీకటి అనగా సుషుప్తియేర్పడగా నందు తమోఽతీతుడవై ప్రకాశింతువు. అట్టి కేవల స్వయంజ్యోతిస్వరూపుడవైన నీకు నమస్కారము.

వి.వి: ఇక్కడ సుషుప్తియనగా సర్వసంహారము. అప్పుడు సకల జగత్కారణమైన అజ్ఞానము (తమస్సు లయింపదు అట్లది లయించునేని జగత్తు యొక్క పునరావిర్భావ మసంభవమగును మఱియు "నేను సుఖముగా నిద్రపోయితిని. ఏమియు నెఱుగను" అను స్ఫురణ మెలకువలో కలుగుట కవకాశముండదు. అట్టి స్థితిలో నిత్యుడు అనస్తమితప్రకాశుడు అజ్ఞానసాక్షియునై ఆత్మవస్తువు భాసించును. దృశ్యములేనందున దృశ్యసాపేక్షముగ నేర్పడిన ద్రష్టృత్వము కూడ ఆత్మయందు భాసింపదని భావము.

**శబ్ద బ్రహ్మేతి కర్మే త్యణురితి భగవన్ కాల ఇత్యాలపంతి**
**త్వామేకం విశ్వహేతుం సకలమయతయా సర్వథా కల్ప్యమానమ్,**

**వేదాంతై ర్యత్తు గీతం పురుషపర చిదాత్మాభిధం తత్తు తత్త్వం**
**ప్రేక్షామాత్రేణ మూలప్రకృతి వికృతికృత్ కృష్ణ తస్మై నమస్తే.** 5

**ఒకనిన్ నిన్ సకలాత్మ సర్వగతులం దూహింపనౌవాని స**
**ర్వకృతిన్ గాలము కర్మ మయ్యణువు శబ్ద బ్రహ్మమం చందు; రూ**
**రక మూల ప్రకృతిన్ వికారముల నారంభింతు వీ చూపులో**
**నకలంక మ్మగు తత్త్వమీ వదియ కృష్ణా! నీకు నాయానతుల్.**

ఏకైకమైన నిన్ను కొందరు జగత్కారణమైన శబ్దబ్రహ్మమునుగా కర్మనుగ (జీవుల అదృష్టమునుగ) పరమాణువునుగ బిలుతురు. అన్ని పేరులకు అభిధేయము (అర్థము) నీవే. నీవు సర్వాత్మకుడవు. శబ్దబ్రహ్మాదిరూపమున నిన్నునీవే కల్పించుకొనువాడవు నగుటవలన నిది సంభవమగుచున్నది. పరమార్థముచే వేదాంతములు పరమపురుషునిగ చిదాత్మకునిగ సర్వానుస్యూతునిగ ప్రేక్షామాత్రముచే అనగా మాయాప్రేరణ మాత్రముచే మూలప్రకృతియొక్క కార్యమైన జగత్తునుజేయు కేవలునిగ నిన్నుకీర్తించుచున్నవి. అట్టి నీకు నమస్కారము.

**సత్త్వేనాసత్తయా వా న చ ఖలు సదసత్త్వేన నిర్వాచ్యరూపా**
**ధత్తే యాసా వవిద్యా గుణఫణిమతివ ద్విశ్వదృశ్యావభాసమ్,**
**విద్యాత్త్వం సైవ యాతా శ్రుతివచనలవై ర్యత్కృపాస్యందలాభే**
**సంసారారణ్య సద్య స్త్రుటన పరశుతామేతి తస్మై నమస్తే.** 6

**అనరా దున్నది లేదు ఉన్నదియు లేదంచున్ మహామాయ దృ**
**శ్య నికాయమ్మును జూపు నెవ్వని కృపాస్యం దాన వేదోక్తిచే**
**ననువౌ విద్య భవాటవిన్ పరశువై యామూలముం ద్రుంచు సొం**
**పును నిన్ గేవలుఁగేవలమ్మగు కృపన్ పూర్ణాత్మునిన్ మ్రొక్కెదన్**

అవిద్య ఉన్నదియు లేనిదియు ఉండిలేనిదియు ననుటగూడ శక్యముగానిది (నిర్వచింపరానిది) అట్టి యవిద్య రజ్జువునందు సర్పభ్రాంతినివలె అశేష దృశ్యాత్మకమైన జగత్తును భాసింపజేయుచున్నది. అనగా సంసారదుఃఖ నిలయమైన శరీరాద్యహం మమాభిమానాదికమును కల్పించుచున్నది.అట్టి అవిద్య యీశ్వరకృపా ప్రవాహలాభముచేత వేదాంతవాక్యలేశములచేత (అనగా శ్రవణ మాత్రముచేత) విద్యాస్వరూపమును పొంది కేవలజ్ఞానరూపమై

సంసారారణ్యమును సమూలము ఖండించునట్టి పరశురూపమగును. అట్టి కృపానిలయమైన జగద్గురుమూర్తివగు నీకు నమస్కారము.

**భూషాసు స్వర్ణవద్వా జగతి ఘటశరావాదికే మృత్తికావ**
**త్తత్వే సంచింత్యమానే స్ఫురతి తదధునా ప్యద్వితీయం వపుస్తే,**
**స్వప్నద్రష్టుః ప్రబోధే తిమిరలయవిధౌ జీర్ణరజ్జోశ్చ యద్వ**
**ద్విద్యాలాభే తథైవ స్ఫుట మపి వికసేత్ కృష్ణ తస్మై నమస్తే. 7**

**నగలన్ స్వర్ణమటుల్ ఘటాదివికృతిన్ మన్నట్లు నీరూప మ**
**చ్చుగ దృశ్యమ్ములఁదోచు మేల్కొలివి; రజ్జు స్ఫూర్తి చీఁకట్లు పో**
**వగ నై నట్టులు మెళ్కువన్ కలవలెన్ బాయుం బ్రతీత్యాత్మక**
**మ్మగు నజ్ఞానము; జ్ఞాన రూపమగు నీ యామూర్తికిన్ మ్రొక్కెదన్**

భూషణములలో బంగారము వలె, ఘటాదులందు మృత్తికవలె, ఆ నీ జగత్కారణమైన అద్వితీయపరబ్రహ్మస్వరూపము తత్త్వవిమర్శమునందు స్థితికాలమందు కూడ జగద్రూప విషయమందు స్ఫురించుచున్నది

వి.వి: బ్రహ్మము ఉపాదానకారణము తత్కార్యము జగత్తు కార్యకారణముల కభేద మను శాస్త్రము ననుసంధానము సేయుటవలన నిదంతయు బ్రహ్మమేయను స్ఫురణ కలుగుచున్నదని భావము స్వ కలనుండి నిద్ర నుండి మేల్కొనినవానికి స్వప్న నిరాసమైనట్లు దృశ్యాత్మక జగత్స్ఫురణ పోయి యథార్థము తోచినట్లు చీకటి తొలగి సర్పభ్రాంతి పోయి జీర్ణరజ్జుస్ఫురణ కలిగినట్లు విద్యాలాభమొదవి నీ పరమార్థస్వరూపప్రతీతియగును. అట్లు వికసించు నీజ్ఞానమూర్తికి నమస్కారము

**యద్భీత్యోదేతి సూర్యో దహతి చ దహనో వాతి వాయు స్తథా న్యే**
**యద్భీతాః పద్మజాద్యాః పున రుచిత బలీ నాహర న్తే ఽను కాలమ్,**
**యే నై వారోపితాః ప్రా జ్నిజ పదమపి తే చ్యావితారశ్చ పశ్చాత్**
**తస్మై విశ్వం నియంత్రే వయమపి భవతే కృష్ణ! కుర్మః ప్రణామమ్ 8**

**ఇనుఁడుదయించునో జడిసి యేనికి వహ్నిదహించు గాలి వీ**
**వను జను బ్రహ్మముఖ్య సురవర్గము వేళకుఁబూజ లిచ్చు తీ**

ఎని నిలుపొంది స్వస్థపదవిన్, బదభంగముఁ గాంతురేనిచే
తన జగదేక శాసకుని దాదృశు నిన్ను నమస్కరించెదన్

ఎవనికి జడిసి సూర్యుడుదయించునో, అగ్నివెలుగునో వాయువు వీచునో, బ్రహ్మాదులు సమయము తప్పకుండ ఎవని కుపహారములను (పూజలను) యధాధికారముగా నర్పింతురో వారెవనిచే తొలుత సత్యలోకాదిస్థానములందు ప్రతిష్ఠింపబడి తరువాత తొలగింపబడుచుందురో అట్టి విశ్వనియామకుడవగు సర్వేశ్వరునకు నీకు మేమును నమస్కరించుచున్నాము.

త్రైలోక్యం భావయన్తం త్రి గుణమయమిదం త్ర్యక్షర స్యైక వాచ్యం
త్రీశానా మైక్యరూపం త్రిభిరపి నిగమైర్గీ యమానస్వరూపమ్!,
త్రిస్రో ఽవస్థా విదంతం త్రియుగ జనిజుషం త్రిక్రమక్రాంతవిశ్వం
త్రైకాల్యే భేదహీనం త్రిభిరహ మనిశం యోగభేదై ర్భజే త్వామ్. 9

త్రిగుణములన్ ద్రిలోకములు దీరిచి త్ర్యక్షరమై త్రయీస్తుత
మ్మగుచుఁ ద్రిమూర్తులై త్రిపదమాని జగత్త్రయ మాక్రమించి యొ
ప్పుగని త్రికాలముల్ త్రియుగముం జనియించి త్ర్యవస్థమైన ని
న్నగణితమూర్తి గొల్తును మహాప్రభు! యోగపథత్రయమ్ముచేన్

త్రిగుణమయుని త్రైలోక్య భావమని త్ర్యక్షరమైన ప్రణవమునకు ప్రధానార్థమైనవానిని త్రిమూర్తి స్వరూపుని వేదత్రయజేగీయమాన స్వరూపుని అవస్థాత్రయ సాక్షిని యుగత్రయావతారమూర్తిని పాదత్రయాక్రాంత విశ్వస్వరూపుని త్రికాలాబాధ్యుని అద్వితీయుని జాయతే అస్తీత్యాది షడ్భావవికారదూరుని నిన్ను నే ననిశము కర్మజ్ఞాన భక్తిస్వరూపయోగ త్రయముచే సేవింతును.

సత్యం శుద్ధం విబుద్ధం జయతి తవ వపుర్ని త్య ముక్తం నిరీహం
నిర్ద్వంద్వం నిర్వికారం నిఖిలగుణగణ వ్యంజనాధారభూతమ్,
నిర్మూలం నిర్మలంత న్నిరవధి మహిమోల్లాసి నిర్లీన మంత
ర్నిస్సంగానాం మునీనాం నిరుపమ పరమానందసాంద్రప్రకాశమ్. 10

జయమందున్ బరమార్థ సత్యము ప్రతిష్ఠావంత మద్వంద్వ మ
వ్యయ మత్యున్నత మత్సమంచిత గుణ మ్మత్యద్భుత ప్రాభవ

మ్మయి నిస్సంగ హృదైక సంగమది నిత్యానంద సాంద్ర ప్రభా
శ్రయ నిర్మోహ నిరీహ మంద మదియారా! నీది నిర్మాలమున్

నీ స్వరూపము సర్వోన్నతమై జయించుచున్నది. అది పరమార్థ సత్యము (లేనిదానికి ఉనికి కల్పించునది.) నిత్యబుద్ధము (స్వప్రకాశసిద్ధ మన్న మాట) నిత్యముక్తము నిరీహము (కర్తృత్వ భోక్తృత్వాది రహితము) నిర్ద్వంద్వము నిర్వికారము (పరిణామాది వికార రహితము) క్షమ సత్యము దయ ఐశ్వర్యము మొదలైన గుణముల యొక్క స్ఫూర్తి కాధారభూతము, నిష్కారణము నిర్మలము, రాగాదిదోషరహితము, నిరవధిమహిమము. కాలదేశాద్యపరిచ్ఛిన్న వైభవము నిస్సంగులైనమునుల యంతరంగసమాధియందు సుప్రతిష్ఠితము నిరుపమ పరమానంద సాంద్రప్రకాశమునై నీరూపము భాసించుచున్నది.

దుర్వారం ద్వాదశారం త్రిశతపరిమిలత్ షష్టి పర్వాభివీతం
సంభ్రామ్యత్ క్రూరవేగం క్షణమను జగ దాచ్ఛిద్య సంధావమానమ్,
చక్రం తే కాలరూపం వ్యథయతు న తు మాం త్వత్పదైకావలంబం
విష్ణో! కారుణ్య సింధో! పవనపురపతే! పాహి సర్వామయౌఘాత్. 11

పరషష్ట్యుత్తర తచ్ఛతత్రయసుపర్వ ద్వాదశారమ్ము దు
ర్భరవేగ మ్మది కాలరూపమగు చక్రమ్మా గ్రసించున్ జరా
చరలోకమ్ములఁ ద్వత్పదాబ్జరతి నన్ సాదింపదౌ గాత శ్రీ
కరుణావారిధి! యేలవే గురుపురోత్సంగాగ్ర కేలీరథీ!

మఱియు నో విష్ణూ! అనివార్యము ద్వాదశారము (12 మాసములను ఆకులు గలది) మూడు వందలయరువదిదినములనెడి అంచులు కలది. జగత్తును కానరాకుండ లయింపజేయుటకు అనుక్షణము నిర్విరామముగ తిరుగు నీ కాలరూపమైనచక్రము నిన్ను శరణుజొచ్చిన నన్ను బాధింపకుండుగాక! కరుణాసింధూ! జగద్బంధూ! గురుపవనపురనాథా! సర్వరోగములనుండి నన్ను రక్షింపుము.

# 99వ దశకము

# భగవన్మహిమ

విష్ణోర్వీర్యాణి కోవా కథయతు ధరణేః కశ్చ రేణూ న్మిమీతే
యస్యైవాంఘ్రిత్రయేణ త్రిజగదభిమతం మోదతే పూర్ణసంపత్
యో ఽసౌ విశ్వాని ధత్తే ప్రియమిహపరమం ధామ త స్యాభియాయాం
తద్భక్తా యత్ర మాద్య న్త్యమృతరసమరందస్యయత్ర ప్రవాహః. 1

అవనీరేణువు లేఁడు లెక్కయిడు? నట్లావిష్ణు వీర్యమ్ములున్
భువనమ్ముల్ దనుపొందు నిండు సిరి నే పూర్ణాత్ము నేకైక పా
ద విభూతిన్ ధరియించు నేఁడు జగముల్ దా యోగసంపత్తిఁ ద
ద్భవన మ్మొగెద భక్తగమ్య మమృతోద్యన్మాకరందస్రుతిన్

ఏ విష్ణువుయొక్క పాదత్రయముచే ముల్లోకములు కొలువబడినవో, ఏ విష్ణువు తన యోగైశ్వర్యముచేత నశేషలోకములను ధరించుచున్నాడో, అట్టి పరమేశ్వరునియొక్క మహిమల నెవ్వడు గణింపగలడు? భూమియొక్క రేణువులను లెక్కపెట్టుటవలె నది దుర్లభము. విష్ణుభక్తులు మైమఱపు చెందెడి అమృతరస మకరందప్రవాహ మేవైకుంఠమందు జాలెత్తునో అట్టివిష్ణుప్రియమైన వైకుంఠమును నేను పొందుదునుగాక.

ఆద్యా యాశేషకర్త్రే ప్రతినిమిషనవీనాయ భర్త్రే విభూతే
ర్భక్తాత్మా విష్ణవే యః ప్రదిశతి హవిరాదీని యజ్ఞార్చనాదౌ,
కృష్ణాద్యం జన్మ యోవా మహదిహ మహతో వర్ణయేత్ సో ఽయమేవ
ప్రీతః పూర్ణో యశోభిస్త్వరితమభిసరేత్ ప్రాప్య మంతే పదంతే. 2

లలి తొలివానిఁ గర్త సకలానకు నిత్యవినూతనున్ రమా
నిలయుని భక్తమూర్తిని గణించి హవిఃప్రముఖమ్ము యజ్ఞ పూ
జలనిడి నీ చరిత్రలు వెసన్ వినుతించి మహత్తరమ్ము, లిం
పొలయఁగఁ బూర్ణకీర్తి తుది నొందు హుటాహుటి నీదు స్థానమున్

ఎవడు ఆద్యుడు, సర్వకారణము, ప్రతినిమిషము నూతనమై తోచువాడు సర్వవిభూతులకు (ఐశ్వర్యములకు) అధీశ్వరుడైనవాడు, భక్తులకు ఆత్మస్వరూపుడైన వాడును నైన యే విష్ణువునకు యజ్ఞములందు అర్చనలయందు హవిర్భాగాదుల నిచ్చునో, ఎవడు మహానుభావుడైన విష్ణువుయొక్క పరమ పూజ్యములైన కృష్ణాద్యవతారకథలను నాకర్ణించునో అట్టి భక్తు డీలోకమం దభీష్టసుఖము లనుభవించి పరిపూర్ణకీర్తిశాలియై తుదకు వెంటనే (జన్మాంతర విలంబము లేకుండ) ఆ పరమాత్మస్థానమును వైకుంఠమును పొందును భక్తుడు కానివాని కది యసాధ్యము

హేస్తోతారః కవీంద్రాస్తమిహఖలు యథా చేతయధ్వే తథైవ
వ్యక్తం వేదస్యసారం ప్రణువత జననోపాత్తలీలాకథాభిః,
జానంత శ్చాస్య నామా న్యఖిల సుఖకరాణీతి సంకీర్తయధ్వం
హేవిష్ణో కీర్తనాద్యైస్త వఖలు మహత సత్త్వబోధం భజేయమ్. 3

కవిరాజుల్! స్తుతిపాఠకుల్! తెలియుఁడీ గంభీర వేదార్థ సా
ర విశేషమ్ములు పాడుఁడీశు నవతారవ్యక్త లీలా కథా
స్తవముల్, విష్ణు ననంత నామము లనంత శ్రీ నిధానమ్ము; లే
నవి విష్ణూ! వినుతించి పొందెదఁ ద్వదీయాఖండ విజ్ఞానముఁ

ఓ స్తుతి పాఠకులారా! కవులారా! మీకు తెలిసినంతవఱకు వేదము[...] స్పష్టపడెడి పరమసారభూతమైన విష్ణుతత్త్వము నవతారాదివిలాసకథల[...] స్తుతింపుడు ఆపైని తెలిసి పరమార్థజ్ఞానసంపన్నులై యా విష్ణువుయొక్క సకల సుఖకారణములైన (మోక్షప్రదములైన) నామములను కీర్తింపుడు నేనును అట్టి భగవన్నామ సంకీర్తనము చేత తత్త్వజ్ఞానము వడసెదను

విష్ణోః కర్మాణి సంపశ్యత మనసి సదా యైస్స ధర్మా నబధ్నాద్
యా నీంద్రస్యైషభృత్యః ప్రియసఖి ఇవ చ వ్యాతనోత్ క్షేమకారీ,
వీక్షన్తే యోగసిద్ధాః పరపద మనిశం యస్య సమ్యక్ప్రకాశం
విప్రేంద్రా జాగరూకాః కృతబహునుతయో యశ్య నిర్భాసయంతే. 4

మనమం దెప్పుడు విష్ణుదివ్యచరితన్ భావింపుఁ డేలీలలన్
మును ధర్మమ్ము ప్రతిష్ఠసేసె హరి యింద్రున్ క్షేమసంపన్నుఁ జే

సెను భృత్యుండయి యాప్తమిత్రుఁడయి, మున్ సిద్ధుల్ మహాయోగులే
యనఘ స్థానము జాగరూకులయి బ్రహ్మణ్యు ల్నిరూపించిరో.

దుష్టనిగ్రహ జ్ఞానోద్ధరణ లోకసంగ్రహణరూపకర్మములచేత నభ్యుదయ నిశ్శ్రేయసాదుల నాయా యధికారములకు సమకూర్చెడి ఆవిష్ణువుయొక్క లీలలను మనసునందు భావింపుడు. ఆ పరమాత్మ తాను నియోగించిన ఇంద్రునకు ప్రియస్నేహితునివలె వర్తించి తానే త్రిలోకరక్షణమును నిర్వహించి క్షేమము చేయుచున్నాడు. యోగసిద్ధులు కేవల ప్రకాశస్వరూపమైన స్వామియొక్క పరమపదమును (మాయాసంబంధము లేనిదానిని) దర్శించుచున్నారు. ఉత్తమ బ్రాహ్మణులు జాగరూకులై (తాత్పర్యముకలిగి) సగుణ నిర్గుణ భేదముచే స్తుతించుచు నా పరమపదమునే వెల్లడించుచున్నారు.

**నోజాతో జాయమానోఽపిచ సమధిగత స్త్వన్మహిమ్నో ఽవసానం**
**దేవ! శ్రేయాంసి విద్వాన్ ప్రతిముహురపితే నామ శంసామి విష్ణో,**
**తం త్వాం సంస్తౌమి నానావిధ నుతివచనై రస్యలోకత్రయస్యా-**
**ప్యూర్ధ్వం విభ్రాజమానే విరచితవసతిం తత్ర వైకుంఠలోకే.** 5

ఎవఁడే బుట్టినవాఁడు పుట్టఁగలవా డిందాక నీదౌ ప్రభా
వ విశేషమ్ము నెఱుంగఁ డింతయని; యప్పాఁ నాకు శ్రేయస్కర
మ్మగునంచున్ భవదీయ నామములచే యశ్రాంతమున్ బాడెదన్,
భువనాతీతమునౌ వికుంఠపదవిన్ బొల్పొందు ని న్నెన్నెదన్.

దేవా! పుట్టినవాడు పుట్టగలవాడు నీ మహిమయొక్క యవధిని యింత వరకు తెలిసికొనినవాడులేడు. కావున శ్రేయోమార్గమెఱిగి నేననిశము నీ నామకీర్తనము జేసెదను. నీ చరిత్రములను స్తుతించెదను. ఈ త్రిభువనములకు మీదనున్న వైకుంఠలోకమందు వసించు నిన్నే సగుణమూర్తిగ (నిర్గుణతత్త్వమును మనసందుకోలేదు గనుక) ఆరాధించెదను.

**ఆప స్సృష్ట్యాదిజన్యాః ప్రథమ మయి విభో గర్భదేశే దధు స్త్వాం**
**యత్ర త్వయ్యేవ జీవా జలశయన! హరే ! సంగతా ఐక్య మాపన్,**
**తస్యాజస్య ప్రభో తే వినిహితమభవత్ పద్మమేకం హి నాభౌ**
**దిక్పత్రం యత్కిలాహుః కనకధరణిభృత్కర్ణికం లోకరూపమ్** 6

ఆపమ్ముల్ దొలిసృష్టి మోచినవి ని న్నాత్మీయగర్భమ్మునం,
దాపై నో జలశాయి! నీ యెడన యైక్య మ్మొందె జీవాళి, దే
వా! పద్మ మ్మజ! నీదు బొడ్డున నభివ్యక్తమ్మునయ్యెన్ జగ
ద్రూపమ్మై కనకాద్రికర్ణికమునై రూపింప దిక్పత్రమై.

సృష్టికి మొదట ఆపస్సులు పుట్టినవి. అవి తమ గర్భమందు నిన్ను ధరించినవి. నీయందు జీవుడైక్యము నొందినాడు. ఏ కార్ణవజలశాయివైన నారాయణుని యందు బ్రహ్మాది సకల జీవులు నిదురించినవి. అట్టి నీయొక్క నాభినుండి యొక పద్మము పొడసూపినది. అది సర్వ భువన స్వరూపము. దానిరేకులు సర్వ దిక్కులు. దాని దుద్దు బంగారుకొండ మహామేరువు. అనగా శ్రీమహావిష్ణువే కమలభవుడై నాభికమలముచేత భువనము పుట్టించెనని యర్థము.

హేలోకా విష్ణు రే తద్భువన మజనయ త్తన్న జానీథ యూయం
యుష్మాకం హ్యంతరస్థం కిమపి తదపరం విద్యతే విష్ణురూపమ్,
నీహార ప్రఖ్య మాయాపరివృతమనసో మోహితా నామ రూపైః
ప్రాణప్రీత్యైకతృప్తా శ్చరథ మఖపరా హంత నేచ్ఛా ముకుందే. 7

ఈ విశ్వ మ్మెదుట న్నటింప నకటా! యిద్దానికిన్ గర్త యా
శ్రీవిష్ణుం దలపోయ రంతయు నదే చిద్రూప మమ్మాయ దా
జీవుం గ్రమ్మును నామరూపవశులై ఛీ! మేనిపైఁ దీపి య
జ్ఞావేశాన ముకుందుఁగొల్వ రిటు స్వేచ్ఛావర్తన మ్మర్హమే!

ఓ జనులారా! ఈకనిపించుజగత్తును జనింపజేసిన విష్ణువును మీరేల యెరుంగరు? మఱియు మీలో నీ విష్ణువు కంటే మఱియొక విష్ణురూపము సంసారధర్మ విశిష్టమై యున్నది.అదియును మీరెఱుంగరు మంచువలె మాయ మనసును కప్పగా నామరూపములచే మోహితులై (శరీరాదులం దహం మమాభిమానము కలవారై) ప్రాణభూతములైన యింద్రియముల ప్రీతియే ప్రధానముగ తృప్తులై స్వర్గాదిసుఖేచ్ఛచే యజ్ఞరూపకామ్య.కర్మపరులై చరించుచున్నారు. అక్కటా! మోక్షదాతయైన విష్ణువునెడ యిచ్ఛయే మీకులేదు.

మూర్ధ్నా మక్ష్ణాం పదానాం వహసిఖలు సహస్రాణి సంపూర్య విశ్వం
తత్ప్రోత్క్రమ్యా పి తిష్ఠన్ పరిమిత వివరే భాసి చిత్తాంతరేఽపి,
భూతం భవ్యం చ సర్వం పరపురుష భవాన్ కించ దేహేంద్రియాది-
ష్వావిష్టో పృద్గతత్వా దమృతసుఖరసం చానుభుంక్ష్వే త్వమేవ. 8

వేవేల్ పాదములు దలల్ గనులుగా విశ్వాకృతి నిండి నీ
వీవిశ్వాన కతీతుఁడై దహర మం దించించుకో తావునం
దావాసింతువు భూతభవ్యము లనంతా! నీవ దేహేంద్రియా
ద్యావిష్టుండయి యానె దీవిషయ మంతర్వృత్తి నానందివై

ఓ పరమపురుషా! విరాట్ఛరీరాభిమానివై వేవేలు శిరస్సులు కన్నులు పాదములు వహించియున్నావు. బ్రహ్మాండమెల్ల నిండి అది దాటియును సూక్ష్మమైన హృదయాకాశమందు గూడ భాసించుచున్నావు. భూతభవ్యమెల్ల నీవే దేహేంద్రియాదులందు సమావిష్టుడవై సర్వవిషయ రసముల ననుభవించుచున్నావు. మఱియు నట్టి నీవే హృదయమందుండి అమృతసుఖాస్వాదము (పరమానందరసమును) ననుభవించుచున్నావు.

యత్తు త్రైలోక్యరూపం దధదపి చ తతో నిర్గతానన్త శుద్ధ
జ్ఞానాత్మా వర్తసే త్వం తవ ఖలు మహిమా సోఽపితావాన్ కిమన్యత్,
స్తోక స్తే భాగ ఏవాఖిలభువనతయా దృశ్యతే త్ర్యంశకల్పం
భూయిష్ఠం సాంద్రమోదాత్మక ముపరి తతో భాతి తస్మై నమస్తే. 9

ఈ విశ్వాకృతికూడ నీమహిమకా కేమున్న ద య్యేకపా
దావిర్భూతి; త్రిపాద్విభూతి యది దీవ్యద్ జ్ఞానరూపమ్ము సం
భావింపంబడు కేవలామృతము నవ్యక్తమ్ము; ఆదివ్య బో
ధావిర్భావసుఖప్రభావ మపరిచ్ఛిన్నాకృతిన్ మ్రొక్కెదన్

ఓ యనంతా! త్రిభువనస్వరూపమును ధరించియు నందెడలి శుద్ధజ్ఞాన స్వరూపుడవుగ గూడ నున్నావు. నీ యొకభాగ మఖిలభువనములుగ దృశ్యమగు చున్నది. మఱి నీ మూడుభాగములు సాంద్రానంద స్వరూపమై యటుమీద మిక్కిలి వెలుగుచున్నవి. అట్లు అపరిచ్ఛిన్నమూర్తివగు నీకు నమస్కారము.

అవ్యక్తం తే స్వరూపం దురధిగమతమం తత్తు శుద్ధైకసత్త్వం
వ్యక్తం చా ప్యేతదేవ స్ఫుట మమృతరసాంభోధికల్లోలతుల్యమ్
సర్వోత్కృష్ట మభీష్టం తదిహ గుణరసేనైవ చిత్తం హరంతీం
మూర్తిం తే సంశ్రయేఽహం పవనపురపతే పాహిమాం కృష్ణ! రోగాత్. 10

అది యవ్యక్తము నీదురూప మధిగమ్యమ్మింతలోఁ గాదు; ఇ
య్యదియో వ్యక్తము శుద్ధసత్త్వ మమృతోద్యద్వార్ధి కల్లోల సం
సద ముత్కృష్ట మభీష్ట మంచితగుణ స్వాదుత్వధీ మోహన
మ్మది నీమూర్తిని గొల్తుఁ బావనపురాధీశా! ననున్ బ్రోవుమా!

ఇంతవఱకు సగుణ నిర్గుణ భేదముచే భగవంతుననుసంధించి యీ భక్త మహాకవి యందుగూడ దా ననధికారిగా ననుకొని యభీష్టమైనమూర్తి నుద్దేశించి ఈ శ్లోకము చెప్పుచున్నాడు. కృష్ణా! అవ్యక్తమైన బ్రహ్మస్వరూపము అందునది కాదు శుద్ధసత్త్వమైన వ్యక్తస్వరూపము మా తెలివి కందునది. అది యమృత సాగరమునందలి కెరటముతో తుల్యము. కావున నీ భక్తవాత్సల్యాది గుణరసాస్వాదముచే చిత్తమును హరించెడి నీ మనోహరమైన యీ మూర్తినే ధ్యానాదుల కొఱకు ఆశ్రయించుచున్నాను. ఓ గురుపవన పురనాథా! సంసారరూపమైన వ్యాధి నుండి నన్ను కాపాడుము

# 100వ దశకము

# భగవత్సాక్షాత్కారము

అగ్రే పశ్యామి తేజో నిబిడతరకలాయావలీ లోభనీయం
పీయూషాప్లావితోఽహం తదను తదుదరే దివ్యకైశోరవేషమ్,
తారుణ్యారంభరమ్యం పరమసుఖరసాస్వాదరోమాంచితాంగై
రావీతం నారదాద్యై ర్విలసదుపనిష త్సుందరీమండలైశ్చ. 1

కనుచున్నా నదిగో కలాయ సుమరేఖా కోమలమ్మైన వె
ల్గును బీయూషరసాప్లుతుండనయి యాలో దివ్య కైశోర మూ

ర్తిని శ్రీనారదముఖ్యు లయ్యుపనిష త్ప్రీ సుందరీబృందముల్
వినుత బ్రహ్మసుఖానుభూతిఁ బులక ల్నిండారు నెమ్మేనులన్
దనుచుట్టున్ గొలువన్ జెలంగు నుదయత్తారుణ్య లావణ్యునిన్.

అవతారిక=ఇంతవఱకు భగవదవతార చరిత్ర స్మరణ కీర్తనాది లక్షణములచే పరిపుష్టి నొందిన ప్రేమలక్షణమైన భక్తియొక్క పరిపాకముచే హృదయాకాశమం దవతరించి స్పష్టముగ నిరవుకొన్న పరమాత్మయొక్క యవయవ వేషవిశేషాది పరిలసితమైన భగవద్రూపము నెట్టయెదుట జూచినది చూచినట్లు కవి ఈ దశకమందు వర్ణించుచున్నాడు.

దట్టమైన యిరుగుడు చాయవలె నిగనిగలాడు నీలమైన రంగుచే మనోహర మైన తేజస్సు నిదిగో యెట్టయెదుట జూచుచున్నాను. అటుపై యమృత రసాప్లావితుడనై యా వెలుగులోలోన పదునాఱేండ్లవయస్సు గల దివ్య కైశోరవేషమును అనగా పరమసాత్త్వికమైన రూపమును అపుడపుడే యంకురించుచున్న యౌవనముగలదానిని, బ్రహ్మానంద రసాస్వాదముచే నెమ్మేనులు పులకరింప నారద సనకసనందనాది మునిమండలముచేతను నుపనిషత్సుందరీ బృందము చేతను పరివారితమైయున్న యాకారమును దర్శించుచున్నాను. వి.వి. శ్రీకృష్ణుడు పరబ్రహ్మము. గోపికలు తత్ప్రతి పాదకములైన యుపనిషత్తులు. శ్రీనారదాదు లుపదేశకులు, ఇచట ద్రష్ట యధికారి.

నీలాభం కుంచితాగ్రం ఘన మమలతరం సంయతం చారుభంగ్యా
రత్నోత్తంసాభిరామం వలయిత ముదయచ్చంద్రకైః పింఛజాలైః
మందారస్రఙ్నివీతం తవ పృథుకబరీభార మాలోకయేఽహం
స్నిగ్ధశ్వేతోర్ధ్వపుండ్రా మపి చ సులలితాం ఫాలబాలేందువీథీమ్. 2

ఘననీలప్రభ నుంగరాల్దిఱిగి చక్కన్ జిక్కువో దువ్వి నిం
చిన యక్కొండెసిగన్ గిరీట మొరపై చెల్వొందు పింఛెమ్ముఁ జె
ర్విన మందారముపూలమాల కబరిన్ శ్రీఫాల బాలేందు వీ
థిని దర్శించెద నిల్వునామముసిరిన్ దీపించు నీయందమున్

నిగనిగలాడు నలుపు గలిగి యగ్రభాగ మించుక వ్రాలి యొత్తుకొని స్వచ్ఛమై చక్కగ సరిదిద్దబడి చక్కని కన్నులచే నింపుగొలుపు నెమలిపింఛెముచే

నావృతమైయున్న రత్నకిరీటముచేత మనోహరమై, యాపైని మందారమాల రాణింప నొప్పు గులుకు పృథులమైన నీజుట్టుముడిని దర్శించుచున్నాను. మఱియు మెఱయుచున్న తెల్లని యూర్ధ్వ పుండ్రముచే నందము గులుకు బాలచంద్రునియట్లు మెఱయు నీఫాలవీధిని దర్శించుచున్నాను.

హృద్యం పూర్ణానుకంపార్ణవ మృదులహరీ చంచలభ్రూ విలాసై
రానీలస్నిగ్ధపక్ష్మావలి పరిలసితం నేత్రయుగ్మం విభో! తే,
సాంద్రచ్ఛాయం విశాలారుణకమలదళాకార మాముగ్ధతారం
కారుణ్యాలోకలీలాశిశిరితభువనం క్షిప్యతాం మ య్యనాథే. 3

కరుణాపూర్ణ సుధార్ణ వోచ్ఛల దభంగ భ్రూలతాభంగ సుం
దర మానీల సుపక్ష్మచారువగు నేత్రద్వంద్వ మాముగ్ధతా
ర రుచిస్మేర ముదార వారిజదళా రమ్యమ్ము సారింపు ని
ర్భరకారుణ్యరసాతిశీతలితవిశ్వమ్మా యనాథాత్ముపై.

కృపయను సాగరమందులేచిన చిరుకెరటమువలె నొఱపునింపు కనుబొమల తీరుచే హృద్యమై యంతట నలముకొను నలుపుచే నిగనిగలాడు రెప్పలచే విలసించు నీకనుదోయిని, విశాలమైన యెఱ్ఱదామరఱేకుల బోలి చక్కని కనుపాపలతోగూడి నిండు తళుకులను జిమ్ముచు కరుణావలోకన విలాసములచే భువనముల నెల్ల జల్లబఱచు నీ చూపులను అనాథుడనగు నాపై విసరుము.

ఉత్తుంగోల్లాసినాసం హరిమణిముకురప్రోల్లసద్గండపాళీ
వ్యాలోలత్కర్ణపాశాంచితమకరమణీకుండలద్వంద్వదీప్రమ్,
ఉన్మీల ద్దంతపంక్తి స్ఫుర దరుణతర చ్ఛాయ బింబాధరాంతః
ప్రీతిప్రస్యంది మందస్మిత మధురతరం వక్త్ర ముద్భాసతాం మే. 4

ఉల్లాసోన్నతనాసమై హరిమణిప్రోల్లాస గండస్థలో
ద్యల్లాస్య శ్రుతిపాశసంగి మకరోద్యత్కుండలాదీప్రమై
వెల్ల ద్దంతరుచిన్ నవారుణవిభా స్ఫీతాధరాంతః కృపా
కల్లోలస్మిత శీతలాననము నా కన్దోయి రంజిల్లుతన్

ఎత్తుగ విలసించు ముక్కుతీరు గలిగి యింద్రనీలమణిదర్పణములట్లు మెఱయు చెక్కిళ్ళపై నూగుచు కొలుకులం దూగు మణిమయ మకరకుండల

యుగముచే మెఱయుచు పలువరుస యించించుక వెలికి ప్రభలుచిమ్మ మిగుల లేతకెంపుచిగురు జిగినించు నధరబింబముమీద ప్రీతిచేచిందు మందస్మితముచే మిగుల చలువగొలుపు నీ నెమ్మోము నాకు స్ఫురించుగాక!

**బాహు ద్వంద్వేన రత్నోజ్జ్వలవలయభృతా శోణపాణిప్రవాలే**
**నోపాత్తాం వేణునాలీం ప్రసృతనఖమయూఖాంగులీసంగశారామ్,**
**కృత్వా వక్త్రారవిందే సుమధుర వికస ద్రాగ ముద్భావ్యమానై**
**శ్శబ్ద బ్రహ్మామృతైః స్త్వం శిశిరితభువనై స్సించ మే కర్ణవీథీమ్. 5**

**వలితోద్యన్నవరత్న దివ్యవలయ వ్యాలోల బాహుద్వయిన్**
**గలితా తామ్ర కరప్రవాళముఖ రింఖత్తన్నఖజ్యోతులన్**
**విలసత్స్వాంగుళిసంగశారమగు క్రోవిన్ మోవి నానించి, శీ**
**తలితాశేష జగత్కదంబగు శబ్దబ్రహ్మపీయూష ధా**
**రల నస్మచ్ఛ్రుతి వీథులం దడుపరా రాధామనోమోహనా!**

రత్నాల దండకడియములూని యెఱ్ఱని లేజిగురాకువంటి యఱచేతి నఖకాంతులుచిమ్ము మృదులములైన వ్రేళ్ళ నానించుచు చేకొని నీ వేణునాళమును ముఖవదనారవిందమందుంచి మధురాతిమధురముగ మ్రోయురాగవిశేషములచే సర్వభువనములను జల్లబఱచు శబ్దబ్రహ్మామృత పూరములచే నా కర్ణవీథిని తడువుము.

**ఉత్సర్పత్కౌస్తుభశ్రీతతిభి రరుణితం కోమలం కంఠదేశం**
**వక్షః శ్రీవత్సరమ్యం తరళతరసముద్దీప్రహారప్రతానమ్,**
**నానావర్ణప్రసూనావలి కిసలయినీం వన్యమాలాం విలోల**
**ల్లోలంబాం లంబమానా మురసి తవ తథా భావయే రత్నమాలామ్. 6**

**చెలువౌ కౌస్తుభరత్నరాగ ముఖుకన్ శ్రీనించు కంఠమ్ము, రం**
**జిలు శ్రీవత్స మురమ్మునన్ దరళిత శ్రీహారముల్ వానిచా**
**యల నానారుచి పుష్పపల్లవ కదంబాలంబ రోలంబ స**
**ల్లలిత మ్మువ్వనమాల నీదు మణిమాలన్ గృష్ణ! భావించెదన్.**

మీది కెగజిమ్ము కౌస్తుభపదకమణికాంతులచే విలసిల్లు మృదులమైన నీ కంఠమును శ్రీవత్స చిహ్నసుందరమై తరళతర ముక్తామణిహారములు

తూగు నీ వక్షఃస్థలమును ముసురుకొను తుమ్మెదలతో నానావర్ణ కుసుమ ప్రవాలములచే గదంబరూపమున గ్రుచ్చబడి పాదములదాక వ్రేలాడు నీవనమాలను నీ రత్నాల మాలలను భావించెదను.

**అంగే పంచాంగరాగై రతిశయవికసత్సౌరభాకృష్టలోకం**
**లీనానేక త్రిలోకీవితతి మపి కృశాం బిభ్రతం మధ్యవల్లీమ్,**
**శక్రాశ్మన్య స్తతప్తోజ్జ్వలకనకనిభం పీతచేలం దధానం**
**ధ్యాయామో దీప్తిరశ్మి స్ఫుటమణిరశనా కింకిణీ మండితం త్వామ్. 7**

**నానాలోకము లంగరాగ విసర న్నవ్యప్రభా సౌరభ**
**శ్రీ నాకర్షణ సేయుచున్ జగము కుక్షిం దాల్చియుంగూడ యెం**
**తేనిన్ జిక్కిన మధ్యవల్లియునునై యింద్రాశ్మ జాంబూనదం**
**బో నావర్తిలు పీతచేల మొరపౌ నొయ్యారి ధ్యానింతు నా**
**లీనశ్రీ రశనా లల న్మణిగణ క్లింకింకిణీనిక్వణున్.**

హరిచందన గోరోచనాది పంచవిధములైన యంగరాగములచే (కలపములచే) పరిమళముల నించుచు ముల్లోకములు తనలో లీనముచేసికొనియు నిక్కలి చిక్కి యెలదీగవలె దూగు నీ నెన్నడుమును, ఇంద్రనీలమణిపై పొదివిన జాంబూనదమట్లు అనగా పుటముబెట్టిన మేలిమి బంగారము సొంపున మెఱయు పీతాంబరముధరించి తళుకు లెగజిమ్ముచు మణి కింకిణీ నిక్వణములనించు మొలనూలి శోభతో నొయ్యారము గొలుపు నీ శృంగారమును ధ్యానించెదను

**ఊరూ చారూ తవోరూ ఘనమసృణరుచౌ చిత్తచోరౌ రమాయాః**
**విశ్వక్షోభం విశంక్య ధ్రువ మనిశ ముభౌ పీతచేలావృతాంగౌ,**
**ఆనమ్రాణాం పురస్తాన్న్యసనభృతసమస్తార్థపాళీసముద్గ**
**చ్ఛాయం జానుద్వయం చ క్రమపృథులమనోజ్ఞే చ జంఘే నిషేవే. 8**

**పరశోభాయుతిఁ జారు లూరువు లహో! పద్మామనః పశ్యతో**
**హరముల్ లోకము క్షోభపెట్టునని కాదా పీత చేలావృతిన్**
**బొరసెన్; నమ్రములకున్ బదార్థముల మున్ముందుంచు మేల్రత్నపుం**
**బరణుల్ జానువు లెంచెదన్, గ్రమపృథుత్వ శ్రీకముల్ జంఘలున్**

మిగుల నునుపై నిగనిగలాడుచు నొత్తుగలిగి జగన్మంగళమగు మహాలక్ష్మి మనసును దొంగిలించుచు వెలివఱచిన విశ్వమునకు క్షోభమును అనగా పారవశ్యమును కలిగించునన్న శంకచేకాబోలు ననిశము పీతాంబరముచే యావరింపబడియున్న నీ చక్కని యూరువులను, నీయెడ వినతులైన వారికి అభీష్టములైన సర్వార్థములను లోనుంచి యెదుటపెట్టిన బరణి లట్లు (సంపుటములట్లు) చక్కని శోభ గొలుపుచుండు నీజానుయుగమును క్రిందనుండి పైకి క్రమముగ పుష్టిజెంది దృష్టిని హరించు నీ జంఘాద్వయమును (రెండు పిక్కలను) సేవించెదను.

మంజీరం మంజునాదైరివ పదభజనం శ్రేయ ఇత్యాలపంతం
పాదాగ్రం భ్రాంతి మజ్జ త్ప్రణతజన మనోమంద రోద్ధార కూర్మమ్,
ఉత్తుం గాతామ్ర రాజ న్నఖరహిమకర జ్యోత్స్నయా చాశ్రితానాం
సంతాపధ్వాంతహంత్రీం తతి మనుకలయే మంగళా మంగుళీనామ్. 9

గురుమంజు శ్రుతులన్, బదాగ్రభజనన్ గొండాడు మంజీరమున్
బరమభ్రాంతి నిమజ్జ దానత జన ప్రవ్యక్తధీమంద రో
ద్ధరణ ప్రౌఢము కూర్మమూర్తి ప్రపద, మ్మాతామ్ర రోచిర్నఖ
స్ఫురితేందు ప్రభ నాశ్రితా ర్తితమమున్ బోకార్చు కల్యాణ సం
భరిత మ్మాకలిత మ్మొనర్తును భవత్పాదాంగుళీ సంతతిన్.

మనోహర నాదముచే నీ పదభజనము శ్రేయస్కరమని పలుకుచున్నవా యనునట్లు సవ్వడి నించు మంజీరములు (అందెలు)ను, భ్రాంతిలో మునుగు భక్తజనుల మనస్సనెడి మందరపర్వతము నుద్ధరించెడి కూర్మమై సొగసు నింపు మీగాలు (పాదాగ్రము) ను, ఎత్తుగలిగి యంతట నెఱుపునించు గోళ్ళనెడి వెన్నెలచే నాశ్రితులయొక్క సంతాపమనెడి చీకటిని చిదిమెడి మంగళకరమైన నీ యంగుళు యొక్క సమూహమును, మనసునందు సంభావించుచున్నాను.

యోగీంద్రాణాం త్వదంగే ష్వధికసుమధురం ముక్తిభాజాం నివాసో
భక్తానాం కామవర్ష ద్యుతరుకిసలయం నాథ! తే పాదమూలమ్,
నిత్యం చిత్తస్థితం మే పవనపురపతే! కృష్ణ! కారుణ్యసింధో!
హృత్వా నిశ్శేష తాపాన్ ప్రదిశతు పరమానందసందోహలక్ష్మీమ్. 10

నిరతిన్ యోగులకుం ద్వదంగతతి నెంతేఁ దియ్యనై ముక్తిమం
దిరమై భక్తుల కోర్కులన్ గురియుచో నీ పాదమూలమ్ము స్వ
స్తరుపాళిన్ జిగురౌచుఁ గృష్ణ! వెతయంతన్‌బాపి నాభావ మం
దరుణజ్యోతి స్ఫురించి కూరుచుత బ్రహ్మానందరాజ్యేందిరన్.

నీ యవయవములలో నెల్ల నధికమధురమై యోగులకు ప్రధాన ధ్యాన లక్ష్యమై ముక్తులకు నివాసమై భక్తుల కభీష్టముల వర్షించు కల్పతరువు చిగురాకై యున్న నీ పాదమూలము నిత్యము నా చిత్తమందు నిలిచి యశేష తాపములను హరించి పరమానంద సందోహలక్ష్మి ననుగ్రహించుగాక.

అజ్ఞాత్వా తే మహత్త్వం యదిహ నిగదితం విశ్వనాథ! క్షమేథాః
స్తోత్రం చైత త్సహస్రోత్తర మధికతరం త్వత్ప్రసాదాయ భూయాత్,
ద్వేధా నారాయణీయం శ్రుతిషుచ జనుషా స్తుత్యతావర్ణనేన
స్ఫీతం లీలావతారై రిద మిహ కురుతా మాయురారోగ్యసౌఖ్యమ్. 11

అరయన్నేరకేదేనిఁ బల్కితినొ విశ్వాధ్యక్ష సైరింపు త్వ
త్పర మీ వాక్కు సహస్రపద్యకృతి శ్రౌతస్ఫూర్తి స్తుత్యస్తుతిన్
బరమమ్మై యవతార దివ్యచరితన్ నారాయణీయ మ్మనన్
నిరతిన్ గూర్చుత మా కనామయసుఖోన్మేషమ్ము దీర్ఘాయువున్.

నీ మహిమ దెలియక ఓ విశ్వనాథా! ఏమేని పల్కితినో దానిని క్షమింపుము. వేయి శ్లోకములకు మించిన ఈ స్తోత్రము నీ ప్రసాదమునకు పాత్రమగుగాక. వేదవిధిచే స్తోత్రార్హములగు "నారాయణలీలావతార" ముల వర్ణనమగుట చేతను "నారాయణకవి" విరచితమగుటచేతనుగూడ రెండు విధముల నిండుదనము నొందిన యీగ్రంథము "నారాయణీయ" మనుపేర పఠించు వారికిని వినువారికిని ఆయురారోగ్యములను సౌఖ్యమును ఆత్మానందమును అనగా మోక్షమును ప్రసాదించుగాక!

యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్

తత్సర్వం క్షమ్యతాం దేవ! నారాయణ! నమోఽస్తుతే.

**ఇతి శ్రీః శ్రీః శ్రీః**